॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ ద్వితీయోఽధ్యాయః - సాంఖ్యయోగః

## (రెండవ అధ్యాయము - సాంఖ్యయోగము)

భగవద్గీతను **మోక్షశాస్త్రం** అంటారు. ఏదైనా సమస్య ఉంటే, బాహ్యప్రపంచాన్ని మార్చమని కృష్ణపరమాత్మ చెప్పడు. మన హృదయదౌర్బల్యాన్ని ఎలా పోగొట్టుకోవాలో, ఎలా బంధవిముక్తులమవ్వాలో నేర్పిస్తాడు. అంటే మనను అంతర్గతంగా దృఢపరుస్తాడు.

అర్జునుడు తన హృదయదౌర్బల్యాన్ని గుర్తిస్తాడు; ఆధ్యాత్మిక సాధన కోరుతాడు; తరువాత కృష్ణపరమాత్మను శరణు వేడుతాడు; కృష్ణపరమాత్మ ఆత్మబోధ చేస్తాడు. ఇదీ భగవద్గీత నేపథ్యం.

భగవద్గీత రెండవ అధ్యాయం తలమానికమైన అధ్యాయం. ఎందుకంటే అది భగవద్గీత మొత్తానికే ఒక విహంగవీక్షణం. అందువల్ల సాంఖ్యయోగం పేరున్న ఈ అధ్యాయాన్ని గీతాసారంగా పేర్కొనవచ్చు. ఇందులో నాలుగు భాగాలు ఉన్నాయి. అవి – **అర్జునుని శరణాగతి, జ్ఞానయోగం, కర్మయోగం, స్థితప్రజ్ఞుని లక్షణాలు**.

1. **అర్జునుని శరణాగతి – శ్లోకాలు 1–11.** ఆధ్యాత్మిక జ్ఞానం పొందాలంటే సాధకుడు నాలుగు దశలు దాటాలి – సంసారదుఃఖం, కార్పణ్య అవస్థ, శరణాగతి, ఆత్మబోధ. అర్జునుడు కూడా ఈ నాలుగు దశలూ అనుభవిస్తాడు.

**ఎ).** మొదటి దశ అయిన సంసారదుఃఖాన్ని మొదటి అధ్యాయంలో చూస్తాము. సంసారదుఃఖాన్ని మూడు ముక్కల్లో అభివర్ణించింది గీత. అవి రాగం, శోకం, మోహం. ఒక వస్తువుమీద బంధం రాగం. రాగవస్తువు జారిపోతుందనే భయం శోకం. రాగశోకాలవల్ల ఏర్పడేది మోహం. దానివల్ల సరియైన నిర్ణయం తీసుకోలేరు. క్షత్రియధర్మం పాటించి యుద్ధం చేయాలా, తనవారిని చంపుకుని పాపం పొందాలా – ఇదీ అర్జునుని సమస్య. దీనిని **సంసారదుఃఖం** అంటారు. ఇది మొదటి దశ.

**బి).** తను సరియైన నిర్ణయం తీసుకోలేకపోతున్నాడు. ఆ నిస్సహాయస్థితినే వేదాంతం **కార్పణ్య అవస్థ** అంటున్నది.

**సి).** తను నిస్సహాయస్థితిలో ఉన్నానని గ్రహించి కృష్ణపరమాత్మను వేడుకుంటాడు. నీకు నేను శిష్యుణ్ణి అయ్యాను, నువ్వే నాకు **ఏది శ్రేయస్సో అది చెప్పు** అంటాడు. ఇది **శరణాగతి**.

**డి).** మొదటి అధ్యాయంలో అర్జునుడు మొదటిదశ పూర్తిచేసి, నిస్సహాయస్థితిలో గాండీవం జారవిడిచి, చతికిలబడ్డాడు. తక్కిన రెండు దశలూ దాటాకే, అతని సమస్యకు పరిష్కారం చూపాలి, కృష్ణపరమాత్మ. ఈ రెండవ అధ్యాయంలో అతను తక్కిన రెండు దశలూ దాటాక, **ఆత్మబోధ** మొదలుపెడతాడు.

గీతాశాస్త్రం నిర్వచనం – సంసారనివారణ ఔషధం భవరోగభేషజం.

2. **జ్ఞానయోగం** – బ్రహ్మజ్ఞాన ప్రాప్తి, జ్ఞాననిష్ఠ
3. **కర్మయోగం** – జ్ఞానయోగ్యతా ప్రాప్తి
4. **స్థితప్రజ్ఞుని లక్షణాలు** – పూర్ణత్వం, సమత్వం

శరణాగతిలో మొదటి దశ సంసారమనే భవరోగాన్ని గుర్తించటమని చూశాము. సంసారమంటే రాగ, శోక, మోహాలని కూడా చూశాము. కాని వచ్చిన చిక్కేమిటంటే, సమస్యను గుర్తించాక కూడా, ఆ సమస్యను మనమే పరిష్కరించుకోవటానికి చూస్తాము. కాని సరిగా చేయలేము. సమస్య మనలోనే ఉంది అని గ్రహించకుండా బాహ్యప్రపంచాన్ని నిందిస్తాము. అందువల్ల దాన్ని మార్చటానికి ప్రయత్నిస్తాము. ఒక పేదవాడు తన సమస్యకు కారణం తన పేదరికం అనుకుంటాడు; ఒక బ్రహ్మచారి తన సమస్యకు కారణం తను బ్రహ్మచారిగా ఉండటం అనుకుంటాడు; ఒక గృహస్థు తన సమస్యకు కారణం తనకు పిల్లలు లేకపోవటం అనుకుంటాడు. అందువల్ల ప్రతివారు, సమస్య బాహ్యంగా ఉందనుకుని, అక్కడ పరిష్కారం వెతకటానికి ప్రయత్నిస్తారు.

ఒకవ్యక్తి ఒకసారి బస్సులో ప్రయాణిస్తుంటే అతనికి 'ష్‌ష్' అంటూ చప్పుడు వినిపించిందట. బస్సు టైరులో గాలి పోతున్న చప్పుడులా ఉంది అది. తన ప్రక్క ప్రయాణీకుణ్ణి అడిగాడు, 'విన్నావా ఆ చప్పుడు?' అతను, 'ఏ శబ్దమూ లేదే!' అన్నాడు. ఎవరిని అడిగినా, మాకేం వినపడటం లేదన్నారు. ఇలా లాభం లేదని సరాసరి బస్సు డ్రైవరు దగ్గరికే వెళ్ళి హడావుడి చేశాడు. అతని గొడవ పడలేక, డ్రైవరు కిందికి దిగి చూస్తే టైరు నిక్షేపంలా ఉంది. చివరికి అతను ఊరు చేరుకున్నాక, డాక్టరు దగ్గరికి వెళ్ళి పరీక్ష చేయించుకుంటే, ఆ శబ్దం తనలోంచే వస్తోందనీ, తన చెవులే సరిగ్గా పనిచేయటం లేదనీ అర్థమయింది. అతను ఆ శబ్దం బాహ్యంగా వస్తోంది అనుకున్నంతసేపూ అవస్థ పడ్డాడు. ఎప్పుడైతే అనుమానం వచ్చి పరీక్ష చేయించుకోవాలనుకున్నాడో, అప్పుడే డాక్టరు దగ్గరికి వెళ్ళాడు.

అలాగే సంసారం చేసే శబ్దాలైన రాగద్వేషాలు, కామక్రోధాలు, మనలోంచి వచ్చే శబ్దాలే. అవి మనలోంచి వచ్చేవేనని అర్థం కానంతవరకూ బాహ్యప్రపంచాన్ని సరిదిద్దటానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంటాము. ఎంత మార్పు చేసినా, సమస్య తీరదు. నిజానికి బాల్యంనుంచి మార్చటానికి ప్రయత్నిస్తూనే ఉన్నాము. మనం తెలివైన వారమైతే, ఒక్కక్షణం ఆగి, ఇన్ని మార్పులు చేస్తున్నా సమస్య ఎందుకు తీరటం లేదు అని ప్రశ్నించుకోవాలి.

కొంతమందికి మంచి ఉద్యోగం ఉంటుంది, ఆరోగ్యం బాగుంటుంది, అందమైన భార్య ఉంటుంది, అయినా ఏదో వెలితి ఉన్నట్టే భావిస్తారు. కొంతమంది పెళ్ళి అయితే ఆనందంగా ఉంటామనుకుంటారు, కాని పరిస్థితిలో ఏమీ మార్పు ఉండదు.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన।** – ముండకమ్ 1.2.12

తెలివైన వ్యక్తి, ప్రపంచాన్ని పరీక్షించి, సమస్యలు బాహ్యంగా లేవు, తనలోనే ఉన్నాయని గ్రహించాలి. ఇది మొదటిదశ. దానికి తనవల్ల పరిష్కారం దొరకదు అని గ్రహించడం రెండవ దశ. మూడవదశలో శరణాగతి వేడాలి. నాలుగవ దశలో గీతాబోధ వస్తుంది. ఈ దశలు దాటిన వ్యక్తే గీతను ఆకళింపు చేసుకోగలడు. ఈ విషయాన్నే వ్యాసాచార్యులవారు మహాభారత యుద్ధసన్నివేశం ద్వారా పరోక్షంగా చూపించదలచుకున్నారు.

**ఏ) సంసార దుఃఖం –** మొదటి అధ్యాయంలో అర్జునుడు మొదటిదశను మాత్రమే అనుభవించాడని చూశాము. అంటే అతను తన సమస్య ఏమిటో తెలుసుకున్నాడు. అతనికి రాగం, శోకం, మోహం అనే దోషాలు ఉన్నాయి. సమస్యను తెలుసుకున్నాడు కాని ఇంకా నిస్సహాయస్థితికి రాలేదు. తనే ఆ సమస్యను పరిష్కరించుకోగలననుకున్నాడు. అతను అనుకున్న పరిష్కారం – గాండీవం వదిలేసి యుద్ధభూమినుంచి వెనుతిరిగిపోవాలని. కాని అతని మనస్సు అతని క్షత్రియధర్మాన్ని వీడకూడదని హెచ్చరిస్తున్నది. అతను ధర్మపోరాటం చేయాలి. ఆ విధంగా, నెమ్మదిగా అర్జునుడు తప్పు నిర్ణయంనుంచి సందేహంలో పడ్డాడు.

తప్పు నిర్ణయంనుంచి సందేహంలో పడటమే పెద్ద ఉన్నతి. ఎందుకంటే సందేహం వచ్చినప్పుడు, ఆ సందేహాన్ని తీర్చుకోవటానికి ఎవరి సహాయమైనా కోరతారు. ఏ విషయంలోనైనా మన ప్రయాణం ఇలాగే ఉంటుంది. **తప్పు నిర్ణయం, సందేహం, జ్ఞానం.** దీన్ని **విపర్యయం, సంశయం, జ్ఞానం** అంటారు. విపర్యయం తమోగుణప్రధానం, సంశయం రజోగుణప్రధానం, జ్ఞానం సత్త్వగుణప్రధానం. తమస్సునుంచి రజో గుణానికి, రజోగుణంనుంచి సత్త్వగుణానికి ప్రయాణం సాగుతుంది. రెండవ అధ్యాయం మొదట్లో ఈ ప్రగతిని చూస్తాము.

ఈ నేపథ్యంతో మొదటి శ్లోకంలోకి అడుగుపెడదాము.

**సంజయ ఉవాచ**

శ్లో. 1 **తం తథా కృపయావిష్టమ్ అశ్రుపూర్ణాకులేక్షణమ్ ।**
**విషీదంతమిదం వాక్యమ్ ఉవాచ మధుసూదనః ॥**
తమ్, తథా, కృపయా, ఆవిష్టమ్, అశ్రుపూర్ణాకులేక్షణమ్,
విషీదంతమ్, ఇదమ్, వాక్యమ్, ఉవాచ, మధుసూదనః ॥

| | | | |
|---|---|---|---|
| తథా | = ఆ విధముగా | విషీదంతమ్ | = శోకించుచున్నవాడు అయిన |
| కృపయా | = (ఇక్కడ) రాగంతో | తమ్ | = ఆ అర్జునుని గూర్చి |
| ఆవిష్టమ్ | = నిండినవాడు | మధుసూదనః | = శ్రీకృష్ణుడు |
| అశ్రుపూర్ణాకు | = అశ్రుపూర్ణములై, వ్యాకులపాటుతో | ఇదమ్ వాక్యమ్ | = ఈ వాక్యమును |
| లేక్షణమ్ | గూడిన నేత్రములు గలవాడు | ఉవాచ | = పలికెను |

**తథా కృపయా ఆవిష్టమ్ అశ్రు – పూర్ణ – ఆకుల – ఈక్షణమ్ ।**
**విషీదంతం తం మధుసూదనః ఇదం వాక్యమ్ ఉవాచ ॥**

తా: సంజయుడు పలికెను – ఆ విధముగా రాగంతో ఆవేశించబడి, కళ్ళనిండా నీళ్ళుగలవాడై దుఃఖముతో పరితపిస్తున్న ఆ అర్జునుని ఉద్దేశించి శ్రీకృష్ణుడు (మధుకైటభులను వధించినవాడు) ఈ మాటను పలికెను.

1. **అర్జునుని శరణాగతి – శ్లోకాలు 1–11.** మొదటి అధ్యాయం చివర్లో అర్జునుడు చాలా మాటలు మాట్లాడాక, శోకంలో మునిగిపోయి, తన ధనుర్బాణాలను త్యజించి, రథంలో చతికిలబడ్డాడని చూశాము. అర్జునుడు ఇంక మాట్లాడే పరిస్థితిలో లేడు. ఇంకా కృష్ణపరమాత్మ సహాయం కోరలేదు కాబట్టి, కృష్ణపరమాత్మ కూడా నోరు విప్పలేదు. అందువల్ల సంజయుడు ఈ పరిస్థితిని వివరిస్తూ మాట్లాడుతున్నాడు. అర్జునుడు మాట్లాడీ మాట్లాడీ మూగపోయాడు. కృష్ణపరమాత్మ ఇంకా రంగంలోకి దిగలేదు. అందువల్ల సంజయుడు చెప్పాల్సి వచ్చింది.

**తం తథా కృపయావిష్టమ్** – సంసార దుఃఖంలో మునిగిపోయివున్న అర్జునుని విషాదాన్ని గమనించాడు కృష్ణపరమాత్మ. అర్జునుడు సంసారికి ప్రతీక. సంసారి లక్షణం ఏమిటి? **కృపయావిష్టమ్ –** కృప అంటే రాగం. ఈ సందర్భంలో కృపను జాలి లేదా దయగా తీసుకోకూడదు.

జాలి జ్ఞానియొక్క మంచి గుణం; రాగం అజ్ఞానియొక్క చెడు లక్షణం. ఇక్కడ అర్జునుడు అజ్ఞాని, పైగా తన బలహీనతను చూస్తున్నాము మనము. అందువల్ల కృప అంటే దయ అనకూడదు. ఆవిష్టమ్ – ఆ బలహీనతకు లోనయ్యాడు అర్జునుడు.

దయాగుణం ఉన్న వ్యక్తి యజమాని, రాగం ఉన్న వ్యక్తి బానిస. అందువల్ల అర్జునుడు తనకున్నరాగానికి బానిస అయ్యాడు.

**అశ్రుపూర్ణాకులేక్షణమ్** – అతని నేత్రాలు అశ్రువులతో నిండివున్నాయి. అందువల్ల సరిగ్గా చూడలేకపోతున్నాడు. కృపయావిష్టమ్ రాగాన్ని సూచిస్తే, అశ్రుపూర్ణాకులేక్షణమ్ శోకాన్ని సూచిస్తుంది.

**విషీదంతం** – బాధపడుతున్నాడు. అర్జునుడు మాట్లాడే పరిస్థితిలో లేడు, ఇప్పుడు బోధ చేసినా వినే పరిస్థితిలోనూ లేడు. కాని ఈ నిశ్శబ్దాన్ని ఛేదించాలి. అందువల్ల కృష్ణపరమాత్మ ఏం చేశాడు?

**మధుసూదనః ఇదం వాక్యమ్ ఉవాచ** – కృష్ణపరమాత్మ ఈ క్రింది మాటలు చెప్పాడు. ఏమని?

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 2 **కుతస్త్వాకశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।**
**అనార్యజుష్టమస్వర్గ్యమ్ అకీర్తికరమర్జున ॥**
కుతః, త్వా, కశ్మలమ్, ఇదమ్, విషమే, సముపస్థితమ్,
అనార్యజుష్టమ్, అస్వర్గ్యమ్, అకీర్తికరమ్, అర్జున ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున | = ఓ అర్జునా! | త్వా, కుతః | = నీకు ఎక్కడనుంచి |
| విషమే | = తగని సమయములో | సముపస్థితమ్ | = వచ్చి పడినది? |
| ఇదమ్ కశ్మలమ్ | = ఇటువంటి మోహము | (యతః) | = ఎందుకంటే, ఇది |

| | | | |
|---|---|---|---|
| అనార్యజుష్టమ్ = | శ్రేష్ఠులచే ఆచరింపబడునది కాదు | అస్వర్గ్యమ్ | = స్వర్గమును ఇచ్చునది కాదు |
| | | అకీర్తికరమ్ | = కీర్తిని కలిగించునది కాదు |

**హే అర్జున! అనార్య-జుష్టమ్-అస్వర్గ్యమ్-అకీర్తికరమ్**
**ఇదం కశ్మలం విషమే త్వా కుతః సముపస్థితమ్॥**

తా: శ్రీకృష్ణభగవానుడిట్లు పలికెను – ఓ అర్జునా! నీకు ఈ కలవరపాటు తగని సమయములో ఎక్కడనుంచి (ఎందువలన) వచ్చి పడినది? (ధర్మయుద్ధమునుండి విరమించుట అనే) ఈ మాలిన్యమును శ్రేష్ఠపురుషులు స్వీకరించరు. ఇది స్వర్గప్రాప్తికి విరోధి, అపకీర్తిని కలిగించునది.

ఈ శ్లోకంలోనూ, తరువాత వచ్చే శ్లోకంలోనూ కృష్ణపరమాత్మ అర్జునుణ్ణి తీవ్రంగా విమర్శిస్తున్నాడు. మామూలు పరిస్థితుల్లో అయితే కృష్ణపరమాత్మ కూడా అలా తీవ్రంగా దండించడు, అర్జునుడు కూడా సహించలేడు. కాని ఈ విపత్కరపరిస్థితిలో అర్జునుడు లేచి నిల్చుని యుద్ధం చేయాలి. గుఱ్ఱాలను కొట్టి రథం ముందుకు నడిపే రథసారథిలా, అర్జునుణ్ణి మాటలతో కొడుతున్నాడు.

**కుతః ఇదం కశ్మలం సముపస్థితమ్** – ఎక్కడనుంచి ఇటువంటి కల్మషం వచ్చింది నీకు? ఇక్కడ కృష్ణపరమాత్మ శారీరక అశుద్ధం గురించి మాట్లాడటం లేదు; మానసిక కల్మషం గురించి మాట్లాడుతున్నాడు.

అర్జునుడు ధైర్యానికి పెట్టింది పేరు. విరాటపర్వంలో ఉత్తరకుమారుడు బెదిరిపోయినప్పుడు, ఉత్తరకుమారునికి ధైర్యం చెప్పటమే కాకుండా, వీరాధివీరులైన భీష్మద్రోణాదులతో ఒంటరిగా యుద్ధం చేసి, గెలుపొందిన ఖ్యాతి పొందాడు. అందువల్ల కౌరవులతో యుద్ధం చేయటం అతనికి కొత్త కాదు. కర్ణుడితో యుద్ధమూ కొత్త కాదు. ఆ మాటకొస్తే సాక్షాత్తూ పరమశివునితోనే యుద్ధం చేసి, శివుని మెప్పు పొందటమే కాక, ఆయననుంచి ప్రత్యేకమైన అస్త్రాన్ని పొందాడు.

అటువంటి అర్జునుడు శోకించటమా? పోనీ అలా అడవిలో శోకించాడంటే అర్థం ఉంది కాని, యుద్ధభూమిలో కూర్చుని బాధపడితే ఎలా?

**విషమే (సముపస్థితమ్)** – విషమపరిస్థితిలో అంటే తగని సమయంలో. ఇప్పుడు శోకించే సమయమూ కాదు; ఇది శోకించే ప్రదేశమూ కాదు. అటువంటి నిస్సహాయస్థితి గొప్పవారికి రాకూడదు. ఎటువంటి గొప్పవారికి?

**అనార్యజుష్టమ్** – ఆర్యపురుషులకు ఇది తగదు. ఆర్యులంటే మనం చరిత్రలో నేర్చుకునే ఆర్యులు, ద్రవిడులు కారు.

**కర్తవ్యమ్ ఆచరన్ కర్మ అకర్తవ్యమ్ అనాచరన్ ।**
**తిష్ఠతి ప్రాకృతాచారే సః వః ఆర్య ఇతి స్మృతః ॥**

ఆర్యుడంటే ఎవరో ఈ శ్లోకం నిర్వచిస్తున్నది. ఆర్యుడంటే అతని ప్రవర్తనను సూచించేది.

**కర్తవ్యమ్ ఆచరన్ కర్మ** – తను చేయాల్సిన కర్మను, సణగకుండా, గొణగకుండా చేసే వ్యక్తి. ఆ కర్మ ఆనందాన్నిచ్చినా, దుఃఖాన్ని కలుగచేసినా పట్టించుకోడు. అతని ఇష్టాయిష్టాలకు చోటు లేదక్కడ.

**అకర్తవ్యమ్ అనాచరన్** – ఏది చేయకూడదో అది చేయడు. అది అతనికి ఎంత యిష్టమైనా సరే, ఎంత నచ్చినా సరే.

**తిష్ఠతి ప్రాకృతాచారే** – ఆచారానికి తగ్గ జీవనాన్ని నడిపేవాడు.

**సః వః ఆర్య ఇతి స్మృతః** – అటువంటి సాంప్రదాయజీవనాన్ని, అటువంటి ధర్మాచరణ చేసే వ్యక్తిని ఆర్యుడు అంటారు.

అందువల్ల అర్జునుడు క్షత్రియుడుగా తన ధర్మమేమిటో దానిని పాటించాలి. అది తప్పించుకోవాలని చూస్తే అది అనార్యజుష్టమ్ అవుతుంది. అంతేకాదు,

**అస్వర్గ్యమ్** – నువ్వు ధర్మాన్ని పాటించలేకపోతే, పుణ్యం రాదు. అందువల్ల స్వర్గానికి కూడా వెళ్ళలేవు. అధార్మిక కర్మ పాపాన్నే ఇస్తుంది.

**అకీర్తికరమ్ అర్జున** – మరణించాక స్వర్గలోకానికి వెళ్ళలేవు సరికదా, నీకు బ్రతికివుండగా చెడ్డపేరు వస్తుంది. నీకు పుణ్యం రాదు, నీ కీర్తిప్రతిష్ఠలు పోతాయి. ఇటువంటి ప్రతికూల ఆలోచన నీకెలా వచ్చింది?

శ్లో. 3 **క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।**
**క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥**
క్లైబ్యమ్, మా, స్మ, గమః, పార్థ, న, ఏతత్, త్వయి, ఉపపద్యతే,
క్షుద్రమ్, హృదయదౌర్బల్యమ్, త్యక్త్వా, ఉత్తిష్ఠ, పరంతప ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ అర్జునా! | పరంతప | = ఓ పరంతపా! |
| క్లైబ్యమ్ | = నపుంసకత్వమును (పిరికితనమును) | క్షుద్రమ్ | = తుచ్ఛమైన |
| | | హృదయ దౌర్బల్యమ్ | = హృదయదౌర్బల్యమును |
| మా, స్మ, గమః | = పొందవద్దు | త్యక్త్వా | = త్యజించి |
| త్వయి | = నీయందు (నీకు) | ఉత్తిష్ఠ | = లెమ్ము (యుద్ధమునకై నడుము బిగింపుము) |
| ఏతత్ | = ఇది (ఈ పిరికితనము) | | |
| న, ఉపపద్యతే | = కలుగరాదు (తగదు) | | |

**హే పార్థ! క్లైబ్యం మా స్మ గమః। ఏతత్ త్వయి న ఉపపద్యతే ।**
**హే పరంతప! క్షుద్రం–హృదయ దౌర్బల్యం త్యక్త్వా ఉత్తిష్ఠ ॥**

తా: ఓ కుంతీపుత్రా! పిరికితనమును పొందకుము. నీయందు ఈ పౌరుషము లేకపోవుటము తగదు. శత్రువులను తపింపజేసే ఓ అర్జునా! హృదయమునందలి నీచమైన బలహీనతను విడిచిపెట్టి లేచి నిలబడుము.

**పార్థా** – పార్థా అంటే పృథయొక్క పుత్రుడా. పృథ కుంతికి ఇంకొక పేరు. కౌంతేయలాగానే పార్థా కూడా.

**క్లైబ్యం మా స్మ గమః** – పిరికితనానికి లోను కావద్దు. క్లీబ అంటే మనస్సుయొక్క బలహీనత. క్లైబ్యం అంటే వీరోచితమైన నిర్ణయాలు తీసుకోలేకపోవటం. క్లిష్టపరిస్థితి ఎదురైనప్పుడు భయపడిపోవటం. అలాంటి బలహీనతకు లోనుగాకు. ఎందుకు?

**ఏతత్ త్వయి న ఉపపద్యతే** – నీకు అది సరిపోదు.

వేరే ఎవరైనా పిరికితనం చూపించినా అర్థముంది కాని, అది అర్జునునికి తగదు. ఎవరికైనా భయం వేస్తే అర్జునుని పది నామాలు తలుచుకుంటే ధైర్యం వస్తుంది అంటారు. అర్జునా, ఫల్గుణా, పార్థా, కిరీటి అంటూ అర్జునుని పేరు జపిస్తేనే ఎటువంటి భయం వేసే పరిస్థితిలో కూడా ధైర్యం వస్తుంది. అలాంటి అర్జునుడు భయపడటంలో అర్థం ఉందా? అతను సాక్షాత్తూ పరమశివునితోనే యుద్ధం చేశాడు. అందువల్ల ఏం చేయాలి?

**క్షుద్రం హృదయ దౌర్బల్యం తక్త్వా** – ఈ హృదయ దౌర్బల్యాన్ని పారద్రోలు. అది ఎలాంటిది? తుచ్ఛమైనది. అది నీకు అవమానకరం. దాన్ని వదిలేయి.

**ఉత్తిష్ఠ** – ముందు నువ్వు లేచి నిల్చో. నీ విల్లంబులు పట్టుకోవటానికి, ముందు నువ్వు నిలబడగలగాలి. ఈ విధంగా అర్జునుణ్ణి చెర్నాకోలుతో కొట్టినట్టుగా కొడుతున్నాడు. అతను ఎటువంటి వాడు?

**పరంతప** – శత్రువులను నాశనం చేసేవాడు. అటువంటి నువ్వు లే, లేచి యుద్ధానికి నడుం బిగించు అంటున్నాడు.

ఇక్కడ మీరు జాగ్రత్తగా గమనిస్తే, కృష్ణపరమాత్మ ఏమీ బోధ చేయలేదు, గీత నేర్పలేదు. జ్ఞానయోగం గురించి కాని, కర్మయోగం గురించి కాని చెప్పలేదు. కేవలం అర్జునునిలో ఉద్రేకం నింపటానికి బలమైన పదాలు వాడాడు అంతే. ఎందుకు బోధ చేయలేదు? దానికి రెండు కారణాలున్నాయి. మొదటిది అర్జునుడు ఇంకా పూర్తిగా కృష్ణపరమాత్మను శరణు వేడలేదు. రెండవది అర్జునుడు వినటానికి సిద్ధంగా లేడు. ఎదుటివ్యక్తి వినే పరిస్థితిలో లేనప్పుడు, ఏదైనా సలహా యిచ్చి లాభం లేదు.

**వాచ్యం శ్రద్ధా సమేధస్య పృచ్ఛతస్య విశేషతః ।**
**శ్రద్ధా హీనస్య తు ప్రోక్తమ్ అరణ్యరుదితోపమః ॥**

మీ మాటకు విలువ యిచ్చేవారికే సలహా ఇవ్వాలి. అది కూడా వారు అడిగితేనే ఇస్తే మంచిది. ఎదుటి వారు అడగకుండానో, వారికి మీ మాటమీద విలువ లేకపోతేనో, వారికి సలహా ఇవ్వకండి. అలా ఒకవేళ యిస్తే అది అరణ్యరోదనం అవుతుంది. ఈ ముఖ్యమైన పాఠం కృష్ణపరమాత్మనుంచి నేర్చుకోవాలి. ఆయన సర్వజ్ఞుడు. తలుచుకుంటే అర్జునునికి క్షణంలో బోధించగలడు, కాని బోధించలేదు. ఎందుకు? అర్జునుడు తన బోధను అందుకునే పరిస్థితిలో లేడని ఆయనకు తెలుసు.

కాని మన నిజజీవితంలో మనం సలహా ఇవ్వకుండా ఉండలేము. ఎవరో వచ్చి నేను ముంబై వెళుతున్నాను అనగానే, మనం ఇప్పుడు ముంబై వెళ్ళవద్దు అంటాము. అతను మనను సలహా అడగటానికి రాలేదు,

విషయం చెప్పటానికి వచ్చాడు. కాని మనమేం చేస్తున్నాం? అడగకుండా సలహా ఇచ్చి, అనవసరంగా అతనికి మనమీద ఉన్న గౌరవాన్ని పోగొట్టుకుంటున్నాము.

అర్జునుడు మొదటి అధ్యాయంలో చాలానే మాట్లాడాడు. వరద గోదావరిలా ఆవేశంతో ఉప్పొంగిపోయాడు. ఇప్పుడు నిశ్శబ్దంగా ఉన్నా, అది తాత్కాలికమే అని కృష్ణపరమాత్మ గ్రహించాడు. అంటే అది తుఫాను ముందు ప్రశాంతతగా తోచింది. ఆ పరిస్థితిలో గీత బోధిస్తే మళ్ళీ అర్జునుడు అనేక మాటలు మాట్లాడతాడు. అందువల్ల అర్జునుడు ఇంకా మాట్లాడతాడా, అతని ఆవేశం సద్దుమణిగిందా అని పరీక్షించటానికి కృష్ణపరమాత్మ రెండు మాటలు వేశాడు.

ఈ పరిస్థితి స్వామీజీ తరచూ ఎదుర్కొంటుంటారు. కొంతమంది వారి కష్టసుఖాలను స్వామీజీతో కలబోసుకోవటానికి వస్తారు. ఇరవై ఐదు సంవత్సరాల వైవాహికజీవితంలో వారు పడ్డ కష్టాల వెల్లువ అనంతంగా సాగిపోతుంది. మధ్యలో ఒక్కక్షణం ఆగుతారు. స్వామీజీ ఏదైనా చెప్పటానికి నోరు తెరవగానే, మళ్ళీ ఇంకో ప్రవాహం దూసుకువస్తుంది. ఒక్కోసారి, అంతా వారే మాట్లాడేసి, మీ సలహాకు ధన్యవాదాలు స్వామీ అని చెప్పి వెళ్ళిపోతారు. నిజానికి స్వామీజీ నోరు కూడా తెరిచి ఉండరు; అందువల్ల మనం ఇతరులకు వారి బాధను వ్యక్తపరచుకోవటానికి అవకాశం ఇవ్వాలి.

కృష్ణపరమాత్మకు ఈ మనస్థత్వం బాగానే తెలుసు. అందువల్లనే రెండు కొరడా దెబ్బలలాంటి మాటలు ఝళిపించి వదిలాడు. మళ్ళీ అర్జునుడు ఆవేశంగా అంతా మాట్లాడాక, అప్పుడు శరణు వేడుతాడు. అప్పుడు కూడా ముందు కృష్ణపరమాత్మ ఒక్కక్షణం మౌనంగానే ఉంటాడు. ఎందుకు? మళ్ళీ ఏమైనా అర్జునుడు చెబుతాడేమో చూద్దామని, అర్జునుని మనస్సు వినటానికి సిద్ధంగా ఉందో లేదో చూద్దామని!

నిజజీవితంలో కూడా చూడండి, మీరు ఏదో చెబుతూ పోతుంటారు. కాని ఎదుటి మనిషికి దానిమీద శ్రద్ధ ఉండదు. కావాలంటే ఈ చిన్న పరీక్ష చేసి చూడండి. మీ ప్రయాణం గురించో, ఏదో సంఘటన గురించో చెబుతూ, చెబుతూ మధ్యలో కాసేపు పక్కగదిలోకి వెళ్ళిరండి. మీరు వెనక్కి వచ్చాక మీరు చెబుతున్న విషయాన్ని పూర్తి చేయమని ఎవరూ అడగరు! అలా అడగనప్పుడు మీరు చెప్పినా అది అరణ్యరోదనమే!

అందువల్ల అర్జునుడు వినటానికి సిద్ధంగా ఉన్నాడో లేదో తెలుసుకోవటానికి కృష్ణపరమాత్మ మాటల తూటాలు విసిరి చూశాడు. ఆయన ఊహించినట్టుగానే మళ్ళీ అర్జునునిలో వెల్లువ పొంగిపొరలుతుంది.

**అర్జున ఉవాచ**

శ్లో. 4 **కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।**

**ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన ॥**

కథమ్, భీష్మమ్, అహమ్, సంఖ్యే, ద్రోణమ్, చ, మధుసూదన,

ఇషుభిః, ప్రతియోత్స్యామి, పూజార్హౌ, అరిసూదన ॥

| | | | |
|---|---|---|---|
| మధుసూదన | = ఓ మధుసూదనా! | ద్రోణమ్ | = ద్రోణాచార్యుని |
| అహమ్ | = నేను | ప్రతియోత్స్యామి | = ఎదుర్కొని పోరాడగలను? |
| సంఖ్యే | = రణమందు | (యతః) | = ఎందుకంటే |
| కథమ్ | = ఏ విధముగా | అరిసూదన | = ఓ శత్రుసంహారకా! |
| ఇషుభిః | = బాణములతో | (తౌ) | = వారిద్దరు |
| భీష్మమ్ | = భీష్మపితామహుని | పూజార్హౌ | = (నాకు) పూజనీయులు |
| చ | = ఇంకా | | |

**హే మధుసూదన అహం భీష్మం ద్రోణం చ సంఖ్యే ఇషుభిః కథం ప్రతియోత్స్యామి?**
**హే అరిసూదన! (ఏతౌ) పూజా – అర్హౌ ॥**

తా: అర్జునుడిట్లు పలికెను – ఓ శ్రీకృష్ణా! నేను యుద్ధములో భీష్ముని, ద్రోణుని యెదుర్కొని బాణములతో కొట్టి ఏ విధముగా యుద్ధము చేయగలను? (చేయలేను). శత్రువులను సంహరించు ఓ శ్రీకృష్ణా! వారిద్దరు నాకు పూజనీయులు (శత్రువులు కారు).

మళ్ళీ అదే పాట పాడతాడు అర్జునుడు.

**కథమ్ అహం భీష్మం ద్రోణం చ ప్రతియోత్స్యామి** – నేను భీష్మ పితామహునితోనూ, ద్రోణాచార్యులతోనూ ఎలా యుద్ధం చేయను?

**పూజార్హౌ** – వారు నాకు పూజనీయులు.

**ఇషుభిః** – అలాంటి వారిమీద బాణాలు ఎలా వెయ్యగలను?

**మధుసూదన** – ఓ అరిసూదనా! నువ్వు అనేకమంది రాక్షసులను సంహరించావు. మధు అనే రాక్షసుణ్ణి సంహరించావు. అదేమీ కష్టం కాదు. నేను ఇక్కడ యుద్ధం చేయాల్సింది రాక్షసులతో కాదు; నాకు పూజ్యనీయులైన భీష్మద్రోణాదులతో. అది నావల్ల కాదు.

శ్లో. 5 **గురూనహత్వా హి మహానుభావాన్ శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహ లోకే ।**
**హత్వార్థకామాంస్తు గురూనిహైవ భుంజీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్ ॥**
గురూన్, అహత్వా, హి, మహానుభావాన్, శ్రేయః, భోక్తుమ్, భైక్ష్యమ్, అపి, ఇహ, లోకే, హత్వా, అర్థకామాన్, తు, గురూన్, ఇహ, ఏవ, భుంజీయ, భోగాన్, రుధిరప్రదిగ్ధాన్ ॥

| | | | |
|---|---|---|---|
| మహానుభావాన్ | = మహానుభావులైన | భోక్తుమ్ | = తినుటకు (తినుట) |
| గురూన్ | = గురువులను | శ్రేయః | = శ్రేయస్కరము (అని భావింతును) |
| అహత్వా | = చంపక | | |
| ఇహ లోకే | = (నేను) ఈ లోకమందు | హి | = ఎందుకంటే |
| భైక్ష్యమ్ అపి | = బిచ్చమెత్తుకొనియైననూ | గురూన్ | = గురుజనులను |

| | | | |
|---|---|---|---|
| హత్వా (అపి) | = చంపి అయినా | అర్థకామాన్ | = అర్థకామరూపములైన |
| ఇహ | = ఈ లోకమందు | భోగాన్, ఏవ, తు | = భోగములనే |
| రుధిరప్రదిగ్ధాన్ | = రక్తసిక్తమైన | భుంజీయ | = అనుభవింపవలసియుండును గదా! |

**హి మహానుభావాన్ గురూన్ అహత్వా, ఇహ లోకే భైక్షం భోక్తుమ్ అపి శ్రేయః ।**
**గురూన్ హత్వా తు ఇహ ఏవ రుధిర-ప్రదిగ్ధాన్ అర్థకామాన్ భోగాన్ భుంజీయ ॥**

తా: ఎందుకంటే, గొప్ప ప్రభావశాలురైన గురువులను హింసించకుండా, దానికి బదులుగా ఈ లోకమందు బిచ్చమెత్తుకొనియైననూ బ్రతుకుటయే మేలు. కాని, గురువులను హింసించి ఈ లోకమందు అనుభవించే సంపదలు, భోగములు రక్తముతో తడిసినవి మాత్రమే.

ఇప్పుడు భీష్మద్రోణాదులకోసం తనకున్న ఇంకో మార్గం గురించి అర్జునుడు ఆలోచిస్తున్నాడు. ఒకవేళ అతను ఈ యుద్ధం చేయకపోయినట్లయితే, అతని పరిస్థితి ఎలా ఉంటుంది? దుర్యోధనుడు వారిని ఈ రాజ్యంలో ఉండనివ్వడు. ఐదు ఊళ్ళు కాదు కదా, సూదిమొన మోపేటంత స్థానం కూడా ఇవ్వనన్నాడు. అప్పుడు పాండవులు అడవిలోకి వెళ్ళి సన్న్యాసాశ్రమమో, వానప్రస్థాశ్రమమో స్వీకరించాలి. ఎందుకు? గృహస్థు భిక్షమెత్తుకుని జీవించకూడదు. తక్కిన ముగ్గురూ అంటే బ్రహ్మచారి, సన్న్యాసి, వానప్రస్థాశ్రమంలోని తపస్వీ గృహస్థును భిక్షమడగాలి. గృహస్థు వీరు ముగ్గురికీ భిక్ష వెయ్యాలి.

అందువల్ల గృహస్థు ఒకవేళ భిక్షమెత్తుకుని జీవిస్తే, అది పాపకర్మ అవుతుంది. అతనికి **ప్రత్యవాయదోషం** అంటుతుంది. చేయవలసిన కర్మ చేయకపోతే కలిగే పాపాన్ని **ప్రత్యవాయదోషం** అంటారు. కాని అర్జునుని లెక్క ప్రకారం భీష్మద్రోణాదులను చంపినా కూడా పాపమే కలుగుతుంది. రెండు పనులూ పాపాలను కలుగజేస్తే, వాటిల్లో ఏది తక్కువ పాపాన్ని కలుగజేస్తుందో చూడాలి.

నిజానికి మన జీవితంలో కూడా ఇలాంటి క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటుంటాము. మంచి, చెడుల మధ్యలో ఏది ఎన్నుకోవాలి అంటే సమస్య లేదు, కాని రెండు చెడు నిర్ణయాల మధ్య ఎన్నుకోవాల్సి వస్తేనే సమస్య. ఇప్పుడు అర్జునుడు ఆ సమస్యతో సతమతమవుతున్నాడు. గురు హత్యా పాపమా, భిక్ష తీసుకునే పాపమా. భిక్ష తీసుకునే పాపమే నయమనుకుంటున్నాడు అర్జునుడు. ముందుకు పోతే నుయ్యి, వెనక్కు పోతే గొయ్యిలాగా ఉంది అతని పరిస్థితి.

**శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహ లోకే** – భిక్షమెత్తుకుని జీవించినా నాకు శ్రేయస్కరమే! ఒక ఇంట్లో అడిగితే అది భిక్ష; అనేక ఇళ్ళలో అడిగితే అది భైక్ష్యం. అది దేనికన్నా శ్రేయస్కరం?

**మహానుభావాన్ గురూనహత్వా** – గురువులను చంపటం కన్నా! ఆ గురువులు ఎలాంటివారు? మహానుభావులు. గురుహత్య మహాపాపం. అంతేకాదు;

**హత్వార్థకామాంస్తు గురూనిహైవ** – ఒకవేళ యుద్ధం చేసి, ఆ యుద్ధంలో గురువులను చంపామనుకో! అప్పుడేమవుతుంది?

**భుంజీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్** – భోగాలను అనుభవిస్తాం. రాజ్యాన్ని తిరిగి సంపాదిస్తాము నిజమే! కాని ఆ భోగాలను నిజంగా అనుభవించగలమా? ఆ భోగాలు రక్తసిక్తములైనవి.

అంటే అర్జునుడు రాజ్యభోగాలు అనుభవించినా, వాటి వెనక భీష్మద్రోణాదులు చిందించిన రక్తమే గుర్తుకు వస్తుంది.

అర్జునుడు ఇంకా తన తప్పుడు నిర్ణయాన్ని పట్టుకు ప్రాకులాడుతున్నాడు. ఇంకా తన నిర్ణయం తప్పేమోననే సందేహంలోకి రాలేదు.

అర్జునుడు ఇంకా ధర్మాధర్మ అవివేకంలో ఉన్నాడు. సంసారం అంటే రాగం, శోకం, మోహం అని చూశాము. బాహ్యవస్తువులుమీద మానసికంగా ఆధారపడటం రాగానికి; మనం ఇష్టపడ్డ వస్తువులు, మనుష్యులు పోతారేమోననే నిరంతర ఆందోళన శోకానికి దారితీస్తాయి. రాగశోకాలతో కూడిన మనసు ధర్మాధర్మవిచక్షణను కోల్పోవటం మోహం. అర్జునుడు ఆ మోహంలో పడి సరైన నిర్ణయం తీసుకోలేకపోతున్నాడు.

అర్జునుడు ఒకవేళ భైక్ష్యచర్యం ఎన్నుకుంటే, అర్జునుడు రెండు పాపాలు చేసినవాడు అవుతాడు. ఒకటేమో స్వధర్మాన్ని పరిత్యజించటం, రెండోదేమో పరధర్మాన్ని పరిగ్రహించటం. క్షత్రియుడు అయి ఉండి, యుద్ధం చేయకపోవటం స్వధర్మాన్ని పరిత్యజించటం. దీన్ని ప్రత్యవాయదోషం అంటారని చూశాము. గృహస్థు అయి ఉండి భిక్షాటన చేసి జీవిస్తాననటం పరధర్మాన్ని పరిగ్రహించటం.

అర్జునుడు ఇప్పుడు రెండవ దశకు వచ్చాడు. అది నిస్సహాయస్థితి. దీన్నే కార్పణ్య అవస్థ అంటారని చూశాము. కాని అతను ఇంకా శరణు వేడలేదు. అంటే మూడవదశకు రాలేదు. అందువల్ల కృష్ణపరమాత్మ కూడా నిస్సహాయంగానే చూస్తున్నాడు. **నేను తేల్చుకోలేకుండా ఉన్నాను. నేను అయోమయంలో పడ్డాను. నాకు దారి చూపు** అని అర్జునుడు అంటే అప్పుడు అర్జునుని దశ తిరుగుతుంది. అలా అర్జునుని దశ తిప్పి, గీతాశాస్త్రం రావటానికి కీలకమైన శ్లోకం ఇప్పుడు రాబోతున్నది. అది చూద్దాము.

శ్లో. 6 **న చైతద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ యది వా నో జయేయుః ।**
**యానేవ హత్వా న జిజీవిషామః తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥**
న, చ, ఏతత్, విద్మః, కతరత్, నః, గరీయః, యత్, వా, జయేమ, యది, వా, నః, జయేయుః, యాన్, ఏవ, హత్వా, న, జిజీవిషామః, తే, అవస్థితాః, ప్రముఖే, ధార్తరాష్ట్రాః ॥

| | | | |
|---|---|---|---|
| ఏతత్ చ | = ఇది కూడా | యత్, వా | = ఇంకా (తెలియకున్నది) |
| న, విద్మః | = తెలియకున్నది | జయేమ | = వారిని మనము జయించెదమా? |
| నః | = మనకు | యది, వా | = లేక |
| కతరత్ | = రెండింటిలో ఏది (యుద్ధము చేయుట, చేయకుండుట) | నః | = మనలను |
| | | జయేయుః | = వారు జయింతురా? |
| గరీయః | = శ్రేష్ఠము | యాన్ హత్వా | = ఎవరిని చంపి (మేము) |

| | | | |
|---|---|---|---|
| న, జిజీవిషామః | = జీవించగోరమో | ప్రముఖే | = (మన) ఎదురుగా |
| తే ఏవ | = వారే (ఆ ఆత్మీయులే) | అవస్థితాః | = నిలిచియున్నారు |
| ధార్తరాష్ట్రాః | = ధార్తరాష్ట్రులు | | |

**నః కతరత్ గరీయః? యత్ వా (వయం) జయేమ, యది వా (తే) నః జయేయుః ఏతత్ చ న విద్మః ।**
**యాన్ హత్వా న జిజీవిషామః, తే ఏవ ధార్తరాష్ట్రాః ప్రముఖే అవస్థితాః ॥**

తా: ఏది (భిక్షాటనమా, లేక యుద్ధమా?) మాకు హితమో (గొప్పదియో) తెలియకున్నది. మేము విజయమును పొందెదమా? లేక వారు మమ్ములను జయించెదరా? (తెలియకున్నది). ఎవరిని సంహరించి మేము జీవించగోరమో, ఆ ధృతరాష్ట్రపుత్రులు ఎదురుగా నిలిచియున్నారు.

**బి) కార్పణ్య అవస్థ – ధార్తరాష్ట్రాః ప్రముఖే తేఽవస్థితాః** – నేను పెద్ద అయోమయంలో ఉన్నాను. నాముందు నిలిచింది నాకు ఆత్మీయులైన ధృతరాష్ట్రుని పుత్రులే. వారిని చంపాలని లేదు నాకు. ఎందుకు?

**యాన్ ఏవ హత్వా న జిజీవిషామః** – వారిని చంపితే, జీవించటానికి కూడా ఇష్టపడను. మనకు అది గొప్ప విజయమే కావచ్చు, కాని మనం విజయగర్వంతో తులతూగలేము. అంతేకాదు, ఇంకో సమస్య కూడా ఉంది. ఏమిటది?

**యద్వా జయేమ యది వా నో జయేయుః** – ఇది ధర్మయుద్ధమే అయినా, యుద్ధంలో మనం వారిని జయిస్తామో, లేక వారు మనను జయిస్తారో తెలియదు.

అలాగని యుద్ధం వదిలేసి, అడవిలోకి వెళ్ళిపోతే, అప్పుడూ నిశ్చింతగా ఉండలేను. నా స్వధర్మాన్ని పరిత్యజించడమనే అపరాధభావం కృంగదీస్తుంది. నేను ఈ సమస్యలో ఎంతగా మునిగిపోయానంటే, తెలివిగా ఆలోచించలేక పోతున్నాను. నాకు నీ సహాయం కావాలి అనిపిస్తున్నది.

**న చైతద్విద్మః** – ఏం చేయాలో నాకు తెలియటం లేదు అన్నాడు. కృష్ణపరమాత్మ ఈ మాటకోసమే ఎదురు చూస్తున్నాడు. ఏమిటి తెలియటం లేదు?

**కతరన్నో గరీయో** – ఈ రెండు మార్గాల్లో ఏది శ్రేష్ఠమో తెలియటం లేదు. ఏమిటా మార్గాలు? యుద్ధం చేయటమా, మానటమా? యుద్ధం చేస్తే స్వధర్మం పాటించినట్టు ఉంటుంది కాని గెలిస్తే గురువధకు దారి తీసినట్టు అవుతుంది. యుద్ధం చేయటం మానేస్తే, తన బంధుమిత్రులను చంపుకోనవసరం లేదు కాని, తన స్వధర్మాన్ని నిర్వర్తించనివాడు అవుతాడు. అందువల్ల ఎటుచూసినా మంచీ ఉంది, చెడూ ఉంది. అందువల్ల ఎటూ తేల్చుకోలేకపోతున్నాను అన్నాడు.

ఈ విధంగా తన నిస్సహాయస్థితిని తెలియజేసి, తరువాత వచ్చే శ్లోకాల్లో శరణుజొచ్చుతాడు.

శ్లో. 7 **కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।**
**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥**
కార్పణ్యదోషోపహతస్వభావః, పృచ్ఛామి, త్వామ్, ధర్మసమ్మూఢచేతాః,
యత్, శ్రేయః, స్యాత్, నిశ్చితమ్, బ్రూహి, తత్, మే,
శిష్యః, తే, అహమ్, శాధి, మామ్, త్వామ్, ప్రపన్నమ్ ॥

| | | | |
|---|---|---|---|
| కార్పణ్యదోషోప హతస్వభావః | = నిస్సహాయత లేదా అయోమయం దోషమునకులోనైన స్వభావము కలిగినవాడనై | తత్ | = దానిని |
| | | మే | = నాకు |
| | | బ్రూహి | = చెప్పుము |
| ధర్మ | = ధర్మవిషయమున | అహమ్ | = నేను |
| సమ్మూఢచేతాః | = మూఢచిత్తుడనై | తే | = నీకు |
| త్వామ్ | = నిన్ను | శిష్యః | = శిష్యుడను |
| పృచ్ఛామి | = అడుగుచున్నాను | త్వామ్ | = నిన్ను |
| యత్ | = ఏ (సాధన) | ప్రపన్నమ్ | = శరణు పొందినవాడను |
| నిశ్చితమ్ | = నిశ్చయముగా | మామ్ | = (కనుక) నన్ను (నాకు) |
| శ్రేయః, స్యాత్ | = శ్రేయస్కరమో ? | శాధి | = ఆదేశించుము |

**కార్పణ్య-దోష-ఉపహత-స్వభావః ధర్మ-సమ్మూఢ-చేతాః అహం త్వాం పృచ్ఛామి।**
**యత్ నిశ్చితం శ్రేయః స్యాత్, తత్ మే బ్రూహి। అహం తే శిష్యః। త్వాం ప్రపన్నం మాం శాధి॥**

తా: దైన్యమనే కాలుష్యముచే దూషితమైన స్వభావముగల నా మనస్సు ధర్మము విషయములో వ్యామోహమును చెందియున్నది. నేను నిన్ను అడుగుతున్నాను. ఏది నిశ్చితముగా శ్రేయస్కరమో దానిని నాకు చెప్పుము. నీకు నేను శిష్యుడను. నిన్ను శరణుజొచ్చిన నన్ను ఆదేశించుము.

**సి) శరణాగతి –**అర్జునుడు **నచైతద్విద్మః** అంటే అది చాలలేదు కృష్ణపరమాత్మకు. అతను ఇంకా స్పష్టంగా ఇప్పుడు అడిగినట్టుగా అడిగేవరకూ ఆగాడు. అజ్ఞానం ఉండటం తప్పుకాదు. మనం పుట్టటమే అజ్ఞానంతో పుట్టాము. ఆ అజ్ఞానం అన్నిటికీ వర్తిస్తుంది, ఆత్మ అజ్ఞానంతో సహా. అందువల్ల అజ్ఞానం కలిగి ఉండటం పాపం కాదు. కాని ఆ అజ్ఞానాన్ని పెంచి, పోషించటం పాపం. అజ్ఞానాన్ని ఒప్పుకోవటం గొప్ప. అర్జునుడు ఇక్కడ నిజాయితీగా తన నిస్సహాయస్థితిని ఒప్పుకున్నాడు.

**కార్పణ్యదోషోపహతస్వభావః** – స్వభావం అంటే నా అంతఃకరణం. ఇక్కడ బుద్ధి అని తీసుకోవచ్చు. నా బుద్ధి ఉపహత – అంటే పనిచేయటం లేదు. బుద్ధి యొక్క పని ఏమిటి? వివేకం చూపించటం. రెండు వస్తువుల మధ్య ఉన్న మంచిచెడులను బేరీజు వెయ్యటం. సరిగ్గా ధర్మాధర్మ విచక్షణ చేయాల్సిన సమయంలో అర్జునుని బుద్ధి పని చేయటం లేదు. ఎందుకు? అది మోహం అనే మేఘంతో కప్పబడింది. నేను సరిగ్గా ఆలోచించలేక పోతున్నాను. ఎందువల్ల?

**కార్పణ్యదోషః** – కార్పణ్యం అంటే నిస్సహాయస్థితి, అయోమయం. ఏ విషయంలో అయోమయం?

**ధర్మసమ్మూఢచేతాః** – ధర్మం గురించి అయోమయం. ధర్మం అంటే అధర్మం కూడా వస్తుంది. ఏది ధర్మం, ఏది అధర్మమో తెలియటం లేదు. ధర్మశాస్త్రం న హింస్యాత్ సర్వభూతాని అంటుంది. ఎవరినీ మనోవాక్కాయ కర్మల ద్వారా హింసించకూడదు అంటుంది.

**అహింసా పరమో ధర్మః**

దాని ప్రకారం ఎవరినీ చంపకూడదు. ఇక్కడ ఉన్నవారు నావారు, మహానుభావులు, నా గురువులు. అందువల్ల వారిని చంపకూడదు.

అందువల్ల బుద్ధి ఒకవైపు నా వారిని చంపవద్దు అంటున్నది. కాని మరోవైపు దుర్యోధనాదులు అధర్మానికి మారుపేరు, దురదృష్టవశాత్తూ భీష్మద్రోణాదులు అధర్మం వైపు నిలిచారు కాబట్టి వారితో యుద్ధం చేసి తీరాలి అంటున్నది. అందువల్ల ధర్మం గురించి నేను అయోమయంలో పడ్డాను.

**అహం పృచ్ఛామి** – నోరు తెరచి అడుగుతున్నాను. నాకు చెప్పు.

**నా పృష్టః కస్యచిత్ బ్రూయాత్ న చాన్యాయేన పృచ్ఛతః ।**
**జానన్నపి హి మేధావే జడవల్లోక అచరేత్ మనుమ్ ॥**

ఎదుటివ్యక్తి సలహా కోరందే, అది కూడా మనస్ఫూర్తిగా కోరందే, తెలివైన వ్యక్తి సలహా ఇవ్వకూడదు. కాని ఆ ఎదుటివ్యక్తి మన పుత్రుడే అయితే. అతను కోరేదాకా ఆగగలమా? అతను సలహా అడగడు, కాని మనకు ఇవ్వాలనిపిస్తుంది. అప్పుడు అతనికి కొన్ని సూచనలు పంపి చూడాలి. అతను వినే ఉద్దేశ్యంలో ఉంటే సరే సరి. మనం సూచనలు పంపినా వినే ఉద్దేశ్యం లేకపోతే దేవునిమీద భారం వెయ్యటం తప్ప ఏమీ చేయలేము. ఓ దేవా, నా పుత్రునికి మంచి బుద్ధి ఇయ్యి అని ప్రార్థన చేసుకోవాలి. ఇక్కడ అర్జునుడు నోరు తెరచి అడిగేదాకా, కృష్ణపరమాత్మ చెప్పదలుచుకోలేదు. ఇప్పుడు అర్జునుడు నోరు తెరచి అడిగాడు. నాకు చెప్పు అన్నాడు. ఏం చెప్పాలి?

**యత్ మే శ్రేయః స్యాత్** – నాకు ఏది శ్రేయస్కరమో దానిని చెప్పు. నేను ఏది మంచో, ఏది చెడో తేల్చుకోలేక పోతున్నాను.

**నిశ్చితం (శ్రేయః)** – అది కూడా నాకు నిజంగా ఏది మంచిదో అది చెప్పు. అంతేకాదు; నా మనస్సు విప్పి చెబుతున్నాను.

**అహం తే శిష్యః** – నేను నీకు శిష్యుణ్ణి. ఇంక యజమానిని కాను. శిష్యుడు అంటే శిక్షణ పొందే యోగ్యత ఉన్నవాడు అని అర్థం. అంటే గురువు చెప్పేదాన్ని అందుకునేందుకు సిద్ధంగా ఉన్నవాడు.

ఈ శ్లోకం ఉపోద్ఘాత శ్లోకాల్లో చాలా ముఖ్యమైన శ్లోకం. మొదటి అధ్యాయం మర్చిపోయినా ఫర్వాలేదు, రెండవ అధ్యాయం ఆరవ శ్లోకం దాకా మర్చిపోయినా ఫర్వాలేదు కాని ఈ శ్లోకాన్ని మాత్రం మర్చిపోకూడదు. ఇందులో వీరుడైన అర్జునుడు శిష్యుడుగా మారాడు. **అహం** తే **శిష్యః** అన్నాడు.

శిష్యుని అర్హతను నిర్ణయించేది ఏది? ఏ విధమైన అభిప్రాయమూ ముందే ఏర్పరచుకోకుండా, ఎదుటి వ్యక్తి చెప్పేది అందుకునేందుకు సిద్ధంగా ఉండాలి. నేను ఇప్పటికే 20సార్లు గీత చదివేశాను. ఈ స్వామి చెప్పింది సరిగ్గా ఉందో లేదో పరీక్షిద్దాము అనుకోకూడదు. గురువుకు పరీక్ష పెట్టే దృక్పథం ఉంటే గురువు చెప్పింది అందుకోలేరు. గీతా బోధకు వెళ్ళినప్పుడు చెప్పులు బయట విప్పినప్పుడు, మీరు ముందే ఏర్పరచుకున్న భావాలు, అభిప్రాయాలను కూడా బయట విప్పి వెళ్ళండి. గురువు తప్పు చెబుతున్నాడా, ఒప్పు చెబుతున్నాడా అని బేరీజు వెయ్యకుండా, ఏం చెబుతున్నాడో శ్రద్ధగా వినండి. దీన్ని ఇంగ్లీషులో 'ఓపెన్ మైండ్' అంటారు. 'నాకంతా తెలుసు,' అనుకుని శాస్త్రాధ్యయనం చేయకూడదు.

అంతా విన్నాక మీ ఇష్టం. కాని శ్రవణం చేసేటప్పుడు మాత్రం ఈ ఓపెన్‌మైండ్ ఉండితీరాలి. కర్మవల్ల మోక్షం వస్తుంది. భక్తివల్ల మోక్షం వస్తుంది అని ముందే నిర్ణయించేసుకోకూడదు. గురువు చెప్పేది శ్రద్ధగా వినాలి. ఈ 'ఓపెన్ మైండెడ్‌నెస్'ను శిష్యత్వం లేదా శిక్షాయోగ్యత్వం అంటారు.

**శాధి మాం త్వాం ప్రపన్నమ్** – నేను శరణాగతుడను, నాకు ఉపదేశం చేయి అంటున్నాడు. ఓపెన్‌మైండ్ ఉంది అని శిష్యుడు గురువుకు ఎలా చూపగలడు? నమస్కారం చేయటం ద్వారా. మనస్సులో ఉన్న స్నేహభావాన్ని కరచాలనంతో చూపినట్టుగా, గురువును శరణాగతి వేడినప్పుడు పాదాభివందనం చేస్తారు. దీన్ని ప్రపత్తి అంటారు. ప్రపత్తి అంటే శరణాగతి. ఇది మూడవదశ.

మొదటి రెండు దశలు – సంసారదుఃఖం, కార్పణ్య అవస్థ అంటే సమస్యను తెలుసుకోవటం; నిస్సహాయతను తెలుసుకోవటం. ఈ రెండు దశలూ దాటాక శరణాగతి మూడవ దశ. అర్జునుడు అదే చేస్తున్నాడు. అందులోనూ సాక్షాత్తూ కృష్ణపరమాత్మను శరణు వేడుతున్నాడు. కృష్ణుడు ఎవరు?

**ప్రపన్నపారిజాతాయ తోత్రవేత్రైక పాణయే ।**

**జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః ॥** – ధ్యానశ్లోకం

అర్జునుడు అలా శరణు వేడితే, కృష్ణపరమాత్మ గురువు అవుతాడు. ఆ విధంగా అర్జునుడు తాను శిష్యునిగా మారి, కృషుణ్ణి జగద్గురువుగా, గీతాచార్యునిగా మారుస్తాడు. పార్థసారథి, జగద్గురువు కృష్ణపరమాత్మ అవుతాడు. ఆ మార్పు, శ్లోకంలో నాలుగవ పాదంలో జరగనున్నది.

శిష్యుడు అవగానే సరిపోదు. శిష్యుడు అనేక కారణాలవల్ల అవవచ్చు. మంత్రోపదేశం చేయించుకోవటానికి అవవచ్చు. ఒకవేళ అదే అయితే, గురువు ఏదో ఒక మంత్రం ఉపదేశించి పంపిస్తాడు. కాని ఒక విషయం గుర్తుంచుకోండి – మంత్రోపదేశంవల్ల సమస్య పరిష్కారం అవదు; మంత్రోపదేశంవల్ల అజ్ఞానం తొలగదు. మంత్రోపదేశంవల్ల చిత్తశుద్ధి కలుగుతుంది; మనస్సు అలజడి చెందినప్పుడు, తాత్కాలికంగా ఉపశమనం చెందుతుంది.

ఇక్కడ అర్జునునికి కావాల్సింది బోధ. ఏది మంచో, ఏది చెడో విడమర్చి చెప్పాలి. అందువల్ల అర్జునుడు **శాధి** పదం వాడాడు. **శాధి** అంటే నాకు జ్ఞానం ప్రసాదించు; నా అజ్ఞానాన్ని తొలగించు అని అర్థం.

ఒకవేళ కృష్ణపరమాత్మ అతని అజ్ఞానం తొలగించకుండా, అప్పటికి సరిపోయే తాత్కాలిక పరిష్కారం చూపిస్తే ఏమవుతుంది? మళ్ళీ ఇంకో సమస్య వచ్చినప్పుడు, అర్జునుడు మళ్ళీ కృష్ణపరమాత్మ దగ్గరికి పరిగెత్తాల్సి ఉంటుంది. సలహా ఇవ్వటానికి, బోధ చేయటానికి మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి? సలహా ఇస్తే ఆ వ్యక్తిని నామీదే ఆధారపడేలాగా చేస్తున్నాను. అతను సమస్య వచ్చినప్పుడల్లా, నా దగ్గరకు పరుగెత్తుకు రావాల్సి ఉంటుంది. ఆ ఆధార పడటం ఎంతగా ఉంటుందంటే, చివరికి కాఫీ తాగాలా, టీ తాగాలా అని కూడా అడిగే దశకు వస్తుంది. అందువల్ల సలహా ఇస్తే, సమస్య తాత్కాలికంగా పరిష్కారమవుతుంది కాని, నేను అతన్ని నామీద ఆధారపడేలాగా చేస్తున్నాను. అందువల్ల నిజంగా నేను అతని మంచి కోరేవాడినే అయితే, అతనికి సలహా ఇవ్వకూడదు; అతను స్వయంగా ఎలా నిర్ణయం తీసుకోవాలో నేర్పించాలి. అప్పుడు రేపు అతనికి వేరే సమస్య వచ్చి, నేను అందుబాటులో లేకపోయినా, అతనే స్వయంగా నిర్ణయం తీసుకోగలుగుతాడు.

సలహా ఒక వ్యక్తిని ఆధారపడేలాగా చేస్తే, బోధ ఒక వ్యక్తిని స్వతంత్రునిగా చేస్తుంది. ఈ విషయంగా చైనా దేశపు సామెత ఒకటుంది: ఒక బీదవానికి నువ్వొక చేపను ఇస్తే, ఆరోజు సమస్యను తీర్చినవాడివి అవుతావు; అదే ఆ బీదవానికి చేపలు పట్టటం నేర్పిస్తే అతని సమస్యను శాశ్వతంగా పరిష్కరించినవాడివి అవుతావు. ఇప్పుడు కృష్ణపరమాత్మ శాశ్వతమైన పరిష్కారాన్ని చూపించటానికి, అర్జునుడు అవకాశం ఇస్తున్నాడు.

శ్లో. 8 **న హి ప్రపశ్యామి మమాపనుద్యాత్ యచ్ఛోకముచ్ఛోషణమింద్రియాణామ్ ।**
**అవాప్య భూమావసపత్నమృద్ధం రాజ్యం సురాణామపి చాధిపత్యమ్ ॥**
న, హి, ప్రపశ్యామి, మమ, అపనుద్యాత్, యత్, శోకమ్, ఉచ్ఛోషణమ్, ఇంద్రియాణామ్, అవాప్య, భూమౌ, అసపత్నమ్, ఋద్ధమ్, రాజ్యమ్, సురాణామ్, అపి, చ ఆధిపత్యమ్ ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఎందుకంటే | యత్ | = ఏదైతే |
| భూమౌ | = భూమియందు | మమ | = నాయొక్క |
| అసపత్నమ్ | = నిష్కంటకమైన | ఇంద్రియాణామ్ | = ఇంద్రియములను |
| ఋద్ధమ్ | = ధనధాన్యసంపన్నమైన | ఉచ్ఛోషణమ్ | = శుష్కింపజేయునట్టి |
| రాజ్యమ్ చ | = రాజ్యమును | శోకమ్ | = శోకమును |
| సురాణామ్ | = దేవతలయొక్క | అపనుద్యాత్ | = దూరము చేయగలదో |
| ఆధిపత్యమ్ | = ఆధిపత్యమును | (తత్) | = దానిని (ఆ ఉపాయమును) |
| అవాప్య, అపి | = పొందియు | న, ప్రపశ్యామి | = చూడకున్నాను |

**హి భూమౌ అసపత్నమ్ ఋద్ధం రాజ్యమ్ అవాప్య, సురాణాం చ అపి ఆధిపత్యమ్ ।**
**యత్ మమ ఇన్ద్రియాణామ్ ఉచ్ఛోషణం శోకమ్ అపనుద్యాత్ న ప్రపశ్యామి ॥**

తా: ఎందుకంటే, ఇంద్రియములను శుష్కింపజేయు శోకమును పోగొట్టే ఉపాయమేదియో తెలియకున్నది. భూలోకమందు శత్రుబాధ లేని సమృద్ధమైన రాజ్యమును గాని, లేదా దేవేంద్ర పదవిని గాని పొందినా ఈ శోకము తొలగిపోదు. (అని నా అభిప్రాయము).

ఇందులో అర్జునుడు, తన దుఃఖం ఎంత తీవ్రంగా ఉందంటే, దానికి మామూలు పరిష్కారాలు సరిపోవు అంటున్నాడు. వ్యావహారిక పరిష్కారాలు ఎన్నో ఉండవచ్చు, కాని అవి ఆంతర్గత దుఃఖాన్ని కూకటివేళ్ళతో పెకళించలేవు.

**యచ్ఛోకముచ్ఛోషణమింద్రియాణామ్** – ఈ శోకం నా ఇంద్రియాలను దహించి వేస్తోంది.

**సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।**

**వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥** – 1.29

అది నా జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియాలను బలహీనపర్చటమే కాక, నా బుద్ధిని కూడా మందగించి పోయేలా చేస్తోంది. దీన్నించి తప్పించుకునే మార్గం కనబడటం లేదు.

**మమ న అపనుద్యాత్** – నాకు దీన్నుంచి పారిపోయే మార్గం కనబడటం లేదు. ఒకవేళ ఇప్పుడు తప్పించుకున్నా, మళ్ళీ నన్ను ఈ శోకం పట్టుకునేటట్టు ఉంది.

**అవాప్య భూమావసపత్నమృద్ధం రాజ్యం** – ఒకవేళ నేను యుద్ధం చేయటానికి నిశ్చయించుకుంటే యుద్ధం చేసి గెలిచి, అందర్నీ చంపి, నేను రాజ్యాన్ని పొంది, చక్రవర్తిని అవవచ్చు కూడా. అది ఎటువంటి రాజ్యం అవుతుంది? అసపత్నమ్ ఋద్ధం రాజ్యం. అంటే సిరిసంపదలతో కూడిన తిరుగులేని రాజ్యాధికారం అవుతుంది.

అంటే అర్జునుడు ఐశ్వర్యం దుఃఖాన్ని పారద్రోలలేదు అంటున్నాడు. ఎవరో చెప్పినట్టుగా డబ్బుతో మంచాన్ని కొనుక్కోగలరు కాని నిద్రను పొందలేరు; డబ్బుతో ఇంటిని కొనుక్కోగలరు కాని ఆప్యాయతను పొందలేరు; డబ్బుతో మనుష్యులను కొనుక్కోగలరు కాని స్నేహితులను సమకూర్చుకోలేరు. అందువల్ల ఐశ్వర్యం దుఃఖాన్ని తీర్చలేదు.

**సురాణామపి చాధిపత్యమ్** – నేను దేవాధిదేవుడైన ఇంద్రుణ్ణి అయినా నా సమస్య పరిష్కరింపబడదు.

దీన్నిబట్టి సంసారం సమస్య, లౌకిక సంపదలవల్ల తీరదు అని తెలుస్తున్నది. ఇదీ ఈ శ్లోకం సారాంశం. దీనికి ఆధారం ముండక మంత్రం –

**పరీక్ష్యలోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్య కృతఃకృతేన ।**

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ ॥** – ముండకమ్ 1.2.12

లౌకిక విజయాలవల్ల మానవ సమస్య తీరదు అని అందరూ గ్రహించాలి. అది గ్రహించి ఆధ్యాత్మిక లక్ష్యం వైపు దృష్టి మళ్ళించాలి. ఆధ్యాత్మిక లక్ష్యం పొందాలంటే గురువు దగ్గరకు వెళ్ళాలి. ఈ వివేకం కొంత మందికి ఇరవై సంవత్సరాలకే వస్తే కొంతమందికి తొంభయ్యో పడిలో పడ్డాక రావచ్చు. కొంతమందికి మరణశయ్యమీద ఉన్నా ఈ గ్రహింపు రాదు. తరువాత వారు వచ్చే జన్మలోనో, మరికొన్ని జన్మలు పొందాకో గ్రహిస్తారు.

అర్జునుడు నాకు దిక్కుతోచటం లేదు, నాకు బోధించు అని శరణు వేడాడు. ఇప్పుడు చెప్పాల్సిందంతా చెప్పి అర్జునుడు నిశ్శబ్దం అయ్యాడు. కృష్ణపరమాత్మ ఇంకా బోధ మొదలుపెట్టలేదు. అందువల్ల సంజయుడు రంగంలోకి దిగుతాడు.

**సంజయ ఉవాచ**

శ్లో. 9 **ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతప ।**
**న యోత్స్య ఇతి గోవిందముక్త్వా తూష్ణీం బభూవ హ ॥**
ఏవమ్, ఉక్త్వా, హృషీకేశమ్, గుడాకేశః, పరంతప,
న, యోత్స్యే, ఇతి, గోవిందమ్, ఉక్త్వా, తూష్ణీమ్, బభూవ, హ ॥

| | | | |
|---|---|---|---|
| పరంతప | = ఓ రాజా! (ఓ ధృతరాష్ట్రా!) | న, యోత్స్యే | = 'యుద్ధము చేయను' |
| గుడాకేశః | = అర్జునుడు | ఇతి | = అని |
| హృషీకేశమ్ | = అంతర్యామియైన శ్రీకృష్ణుని (తో) | హ | = స్పష్టముగా |
| ఏవమ్, ఉక్త్వా | = ఈ విధముగా పలికి | ఉక్త్వా | = పలికి |
| గోవిందమ్ | = గోవిందుని ఉద్దేశించి | తూష్ణీం బభూవ | = మౌనము వహించెను |

**పరంతప గుడాకేశః హృషీకేశమ్ ఏవమ్ ఉక్త్వా**
**'న యోత్స్యే' ఇతి గోవిందమ్ ఉక్త్వా తూష్ణీం బభూవ హ ॥**

తా: సంజయుడిట్లు పలికెను– శత్రువులను తపింపజేసే ఓ ధృతరాష్ట్ర మహారాజా! నిద్ర (సోమరితనము)ను జయించిన అర్జునుడు సర్వాంతర్యామియగు శ్రీకృష్ణుని ఉద్దేశించి ఈ విధముగా పలికెను. నేను యుద్ధము చేయను అని అతడు గోవిందునితో పలికి మిన్నకుండెను.

**గుడాకేశః ఏవమ్ ఉక్త్వా** – ఈ విధంగా, ఈ మాటలు చెప్పి అర్జునుడు కృష్ణపరమాత్మను శరణు వేడాడు. నేను నీ శిష్యుణ్ణి అని చెప్పుకున్నాడు. గీతాశాస్త్రం ఆవిర్భావానికి పునాది పడింది. అర్జునుడు గుడాకేశుడు. అంటే గీతాబోధ వినటానికి అర్హత ఉన్నవాడు అని సంజయుడు పరోక్షంగా సూచిస్తున్నాడు. గుడాక అంటే నిద్ర. నిద్ర తమోగుణాన్ని సూచిస్తుంది. గుడాకేశుడు అంటే తమోగుణాన్ని జయించినవాడు. అంటే సత్త్వగుణ ప్రధానుడు.

సత్త్వగుణ ప్రధానుడు అంటే సాధన చతుష్టయ సంపన్నుడు. నిజానికి ఏ విద్య నేర్చుకోవాలన్నా కూడా ఈ సత్త్వగుణం ఉండాలి. రజోగుణం ఉంటే మనస్సు కుదురుగా ఉండదు. పరుగులు తీస్తూనే ఉంటుంది. గురువు చెప్పేది శ్రద్ధగా వినలేదు. తమోగుణం ఉంటే మనస్సు నిద్రలోకి జారుకుంటూ ఉంటుంది. అందువల్ల వీటిల్లో ఏది ఉన్నా లాభం లేదు. సత్త్వగుణం ఉంటేనే కుదురుగా, శ్రద్ధగా వింటాడు.

**హృషీకేశమ్** – ఇది కృష్ణపరమాత్మ వర్ణన. ఆయన ఇంద్రియాలకు, మనస్సుకు అధిపతి. అంటే ఆయనకు అర్జునుని మానసిక పరిస్థితి తెలుసు. అందువల్ల అర్జునుని సమస్య ఎలా తీర్చాలో కూడా తెలుసు.

**న యోత్స్య ఇతి గోవిందముక్త్వా** – నేను ఈ యుద్ధం చేయను అని అర్జునుడు అన్నాడు అని సంజయుడు చెబుతున్నాడు.

అర్జునుడు చెప్పిన సారాంశం ఒకసారి గుర్తుకు తెచ్చుకుంటే, యుద్ధం చేయటం ధర్మమో, అధర్మమో నాకు తెలియటం లేదు. నాకు యుద్ధం చేయాలనీ లేదు, అలాగని యుద్ధంనుంచి పారిపోవాలనీ లేదు. ఎందుకంటే అలా పారిపోవటం ధర్మమో, అధర్మమో తెలియదు. అందువల్ల నేను ఈ రెండింటిలో ఏదీ చేయను, నీనుంచి బోధ విని, అప్పుడు నిర్ణయం తీసుకుంటాను అన్నాడు. దానికి సమాధానంగా కృష్ణపరమాత్మ తక్కిన అధ్యాయాలు చెబుతాడు. అంతా చెప్పాక 18వ అధ్యాయం చివర్లో కృష్ణపరమాత్మ అడుగుతాడు –

**కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా ।**
**కచ్చిదజ్ఞానసమ్మోహః ప్రణష్టస్తే ధనంజయ ॥** – 18.72

ఓ పార్థా, నువ్వు గీతాశాస్త్రాన్ని ఏకాగ్రతతో విన్నావా? ఓ ధనంజయా, అజ్ఞానంవల్ల పుట్టిన నీ మోహం పూర్తిగా నశించిందా అని అడుగుతాడు. అదృష్టవశాత్తు అర్జునుడు అంటాడు –

**నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత ।**
**స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ ॥** – 18.73

ఓ అచ్యుతా! నీ కృపవల్ల నా మోహం పూర్తిగా తొలగింది, స్మృతిని పొందాను. సంశయరహితుణ్ణి అయ్యాను అంటాడు.

కాని ప్రస్తుతం ఏం చేయాలో తేల్చుకోలేని స్థితిలో ఉన్నాను, అందుకని నువ్వు చెప్పు అంటున్నాడు. కృష్ణపరమాత్మకు ఇంకోపేరు గోవిందుడు. గోవిందుడు పదానికి అనేక అర్థాలున్నాయి. ఒక అర్థం జగద్రక్షకుడు. గాం విందతి గోవిందః. ఇంకో అర్థం ధర్మశాస్త్రంలో వచ్చే అర్థం.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥** – 4.8

సత్పురుషులను రక్షించటానికి, దుష్టులను శిక్షించటానికి, ధర్మాన్ని సుస్థిరపరచటానికి అవతారం ఎత్తుతాను అని కృష్ణుడు చెప్పాడు. అది ధర్మశాస్త్ర అర్థం. వేదాంతపరంగా ఇంకో అర్థం, గో అంటే ఉపనిషత్తులు, విందః అంటే ఉపనిషత్తుల ద్వారానే తెలుసుకోబడేవాడు. అంటే భగవంతుని అసలు స్వరూపాన్ని ఇంకే మార్గం ద్వారా తెలుసుకోలేము. అటువంటి భగవంతుణ్ణి శరణు వేడాడు.

**ఉక్త్వా బభూవ తూష్ణీమ్** – ఇలా చెప్పి మౌనం వహించాడు.

శ్లో. 10 **తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత ।**
**సేనయోరుభయోర్మధ్యే విషీదంతమిదం వచః ॥**
తమ్, ఉవాచ, హృషీకేశః, ప్రహసన్, ఇవ, భారత,
సేనయోః, ఉభయోః, మధ్యే, విషీదంతమ్, ఇదమ్, వచః ॥

| | | | |
|---|---|---|---|
| భారత | = ఓ ధృతరాష్ట్రా! | తమ్ | = అతనిని (ఆ అర్జునునితో) |
| హృషీకేశః | = అంతర్యామియైన శ్రీకృష్ణ భగవానుడు | ప్రహసన్, ఇవ | = మందహాసముతో |
| | | ఇదమ్ | = ఈ |
| ఉభయోః సేనయోః | = ఉభయసేనల | వచః | = వచనమును (మాటలను) |
| మధ్యే | = మధ్యభాగమున | ఉవాచ | = పలికెను |
| విషీదంతమ్ | = శోకముతో పరితపించుచున్న | | |

**హే భారత! ఉభయోః సేనయోః మధ్యే విషీదంతం తం (అర్జునం)**
**హృషీకేశః ప్రహసన్ ఇవ ఇదం వచః ఉవాచ॥**

తా: భరతవంశీయుడవగు ఓ ధృతరాష్ట్ర మహారాజా! రెండు సేనల మధ్యయందు ఖేదమును పొందుచున్న ఆ అర్జునుని ఉద్దేశించి సర్వాంతర్యామియగు శ్రీకృష్ణుడు, నవ్వుతున్నాడా అన్నట్లుగా, ఈ మాటను పలికెను.

సంజయుడు కొనసాగిస్తున్నాడు.

**భారత** – ఓ భరత వంశోద్భవా! అంటే ఓ ధృతరాష్ట్రా!

**హృషీకేశః తమ్ ఉవాచ** – కృష్ణపరమాత్మ బోధ చేయటానికి అంగీకరించి, అర్జునునికి బోధ చేశాడు. **విషీదంతమిదం వచః** – శోకంతో పరితపిస్తున్న అర్జునుడికి. ఏం చెప్పాడు?

**ఇదం వచః** – ఈ గీతాశాస్త్రాన్ని బోధించాడు. వచః అంటే మొత్తం గీతాశాస్త్రం 2.11 శ్లోకంతో మొదలయ్యి 18.66 వరకూ కొనసాగుతుంది. 18వ అధ్యాయంలో 78 శ్లోకాలు ఉన్నాయి కాని 66వ శ్లోకంతో గీతాబోధ ముగిసిపోతుంది. దాని తరువాత శ్లోకాలు ఉపసంహారం శ్లోకాలు. ఈ శ్లోకాలు చెప్పినప్పుడు కృష్ణపరమాత్మ పార్థసారథి కాకుండా, అర్జునునికి గురువు అయ్యాడు. అంతేకాదు, అర్జునుని ద్వారా జగద్గురువే అయ్యాడు. **కృష్ణం వందే జగద్గురుమ్.** ఎక్కడ బోధించాడు?

**సేనయోరుభయోర్మధ్యే** – రెండు సైన్యాల మధ్య. రెండు సైన్యాల మధ్య ఉండి, 18 అధ్యాయాలు ఎలా బోధించాడు, అంతవరకూ దుర్యోధనాదులు ఖాళీగా కూర్చున్నారా అంటూ ప్రశ్నలు అడగకూడదు. అంతసేపు కృష్ణపరమాత్మ బోధించాడా, లేక వ్యాసాచార్యులు దాన్ని పెద్దదిగా, విశదీకరించి చెప్పారా అనే విశేషాలు తెలియవు మనకు.

మనం తెలుసుకోవాల్సింది ఒకటే. అర్జునుడు తన సమస్యను తెలుసుకున్నాడు. కృష్ణపరమాత్మను శరణు వేడాడు. మనం కూడా మన సమస్యను తెలుసుకుని, గురువును శరణు వేడితే, మనకు కూడా పరిష్కారం దొరుకుతుంది. చెరకుగడను పిప్పి చేసి, దాని రసం తీసుకుని, చెరకుగడను ఎలాగైతే పారేస్తామో, అలా మొదటి అధ్యాయం తీసుకుని, దాన్ని పిప్పి చేసి, దాని రసం గ్రహించి, దాని విషయం మర్చిపోవాలి. దాని సారం ముందే చూసినట్టుగా నాలుగు దశలు. సమస్యను తెలుసుకోవాలి, నిస్సహాయతను తెలుసుకోవాలి, శరణు వేడాలి, విద్య నేర్చుకుని ముక్తి పొందాలి. ఆ సారం పొందాక, మహాభారతయుద్ధం క్రీ.పూ. 3103లో జరిగిందా, లేదా 5000లో జరిగిందా అని తర్జనభర్జనలు పడకూడదు. అది వదిలేసి, అసలు బోధ ఇప్పుడు మొదలవుతుంది. దానిలోకి అడుగుపెడదాము.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 11 **అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥**

అశోచ్యాన్, అన్వశోచః, త్వమ్, ప్రజ్ఞావాదాన్, చ, భాషసే,
గతాసూన్, అగతాసూన్, చ, న, అనుశోచంతి, పండితాః ॥

| | | | |
|---|---|---|---|
| త్వమ్ | = నీవు | గతాసూన్ | = ప్రాణములు పోయినవారిని గూర్చియు |
| అశోచ్యాన్ | = శోకింపదగనివారిని గూర్చి | చ | = ఇంకా |
| అన్వశోచః | = శోకించుచున్నావు | అగతాసూన్ | = ప్రాణములు పోనివారిని గూర్చియు |
| చ | = ఇంకా | పండితాః | = పండితులు |
| ప్రజ్ఞావాదాన్ | = ప్రజ్ఞావంతులవలె | న, అనుశోచంతి | = శోకింపరు |
| భాషసే | = పలుకుచున్నావు (కాని) | | |

**త్వమ్ అశోచ్యాన్ అన్వశోచః। ప్రజ్ఞావాదాన్ చ భాషసే ।**
**పండితాః గతాసూన్ అగతాసూన్ చ న అనుశోచంతి ॥**

తా: శోకింపదగని వారిని గురించి నీవు శోకిస్తున్నావు. పైగా, ప్రజ్ఞావంతులు పలికే పలుకులను పలుకుచున్నావు. పండితులు ప్రాణము పోయినవారిని గురించి, ప్రాణము పోనివారి గురించి కూడా శోకించరు.

**డి) ఆత్మబోధ–** ఇది చాలా ముఖ్యమైన శ్లోకం. ఎందుకంటే, ఈ శ్లోకంలో మొత్తం గీతాసారం అంతా వచ్చేస్తుంది. ఎవరైనా గీతాసారం ఏమిటి అని అడిగితే, మీరు ఈ శ్లోకం గురించి చెప్పవచ్చు. ఏమిటా సారం? ఆత్మ అజ్ఞానం మన సమస్యలకు కారణం; ఆత్మజ్ఞానమే వాటికి పరిష్కారం. ఆత్మ అజ్ఞానం సంసారకారణం; ఆత్మజ్ఞానం మోక్షకారణం. మోక్షం అంటే సంసారంనుంచి స్వేచ్ఛ పొందటం. ఈ ముఖ్యమైన వాక్యాన్నే మొత్తం గీతాశాస్త్రంలో విశదీకరించబోతున్నాడు కృష్ణపరమాత్మ.

**శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయామ్ ...**

బ్రహ్మవిద్య లేదా ఆత్మవిద్య. అది గీతాశాస్త్రం సారం. ఉపనిషత్సారమే గీత. గీతలో అనేక అంశాలు చర్చించబడ్డాయి. కర్మ, ఉపాసన, జపం, పూజ, ధ్యానంలాంటివి ఎన్నో చర్చించబడ్డా, అవన్నీ ముఖ్య అంశమైన ఆత్మవిద్యకు సహకారిక అంశాలే.

ఈ సారాన్ని కృష్ణపరమాత్మ ఎలా అందజేశాడు? చాలా అద్భుతంగా! రెండవ పాదంలో ఆఖరిభాగం చూడండి –

**పండితాః నానుశోచంతి** – పండితులు అంటే జ్ఞానులు. ఏ విషయంలో జ్ఞానులు? ఏదో విషయంలో కాదు; అక్షరాలా ఆత్మజ్ఞానం విషయంలో జ్ఞానులు. అందువల్ల పండితుడు అంటే ఆత్మజ్ఞాని. అటువంటి ఆత్మజ్ఞానులు అసలు శోకించరు. అంటే దానర్థం ఏమిటి? దీన్నించి ఒక ఉపసిద్ధాంతం గ్రహించవచ్చు. పండితులు శోకించరు, కాని అర్జునుడు అతిగా శోకిస్తున్నాడు. అంటే అర్జునుడు జ్ఞాని కాదు అని చెప్పకనే చెప్పినట్టవుతుంది. అర్జునుని మొహంమీద కొట్టినట్టు చెప్పకుండా, పరోక్షంగా సూచిస్తున్నాడు, 'ఓ అర్జునా, నువ్వు అజ్ఞానివి.'

అంతేకాదు, అర్జునుని ద్వారా మొత్తం మానవాళికి చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ఏమని? మీరు శోకిస్తున్నారా? అయితే మీరు అజ్ఞానులు అని – ఇది అర్థం చేసుకోవటానికి ఇందాక చూసినట్టుగా ఓపెన్‌మైండ్ ఉండాలి. ఎవరైనా నా మనస్సు ప్రశాంతంగా లేదు, నేను డీలాపడ్డాను, నాకు దుఃఖంగా ఉంది అని అంటే వారి సమస్య ఆత్మ అజ్ఞానం. దాని పరిష్కారం ఆత్మజ్ఞానం పొందటమే.

అదృష్టవశాత్తూ అజ్ఞానం బాక్టీరియాలాంటిది, వైరస్ కాదు. వైరస్‌కు మందులేదు. జలుబుమీద జోక్ ఉంది: జలుబుకు మందు వేసుకుంటే ఒక వారంలో తగ్గుతుంది; మందు వేసుకోకపోతే ఏడురోజులు పడుతుంది. కాని బాక్టీరియాకు మందు ఉంది; అజ్ఞానానికి కూడా మందు ఉంది. అది కూడా ఒకటే మందు ఉంది. అది **జ్ఞానం**.

ఒక గదిలో చీకటి ఉంటే, అది ఎలా తొలగుతుంది? దానికి ఎన్ని పరిష్కారాలు ఉన్నాయి? ఒకటే మార్గం ఉంది. ఆ గదిలో లైటు వేయటమే. అలాగే అజ్ఞానం విషయంలో కూడా ఒకటే మార్గం – **జ్ఞానాత్ ఏవ తు కైవల్యమ్**.

కర్మ మోక్షాన్నిస్తుందా అని ఎవరైనా అడిగితే, మీరు తిరిగి ప్రశ్నించాలి, కర్మ అజ్ఞానాన్ని తొలగించగలదా? కర్మ చేస్తే అజ్ఞానం తొలగుతుంది అనుకుంటే, ఇన్ని స్కూళ్ళు, కాలేజీలు అవసరం లేదు మనకు. ఒకరోజు ఒక పని చేస్తే, కెమిస్ట్రీ అజ్ఞానం తొలగిపోతుంది; ఇంకోరోజు ఇంకో పని చేస్తే బోటనీ అజ్ఞానం తొలగిపోతుంది. అలా జరుగుతుందా? లేదు! అందువల్ల కర్మ అజ్ఞానాన్ని తొలగించలేదు; ధ్యానం అజ్ఞానాన్ని తొలగించలేదు; జపం అజ్ఞానాన్ని తొలగించలేదు; ఆత్మజ్ఞానం పొందటం ఒకటే మార్గం.

అందువల్లనే, ఆ విషయాన్ని కృష్ణపరమాత్మ మొదటి శ్లోకంలోనే నొక్కివక్కాణిస్తున్నాడు. **పండితాః న అనుశోచంతి.** అందువల్ల అర్జునా నువ్వు పండితుడివి అవ్వు. ఏ విషయంలోనూ పండితులు అంటే జ్ఞానులు దుఃఖించరు.

**గతాసూన్ అగతాసూన్ చ** – వారు జీవించి ఉన్నవారికోసం బాధపడరు; మరణించినవారికోసం బాధ పడరు. మనం దుఃఖించేది ఈ రెండు విషయాలకోసమే. జీవించి ఉన్నవారికోసమో, మరణించినవారికోసమో బాధపడతాము. మనుష్యులకోసమే కాదు, వస్తువుల గురించి కూడా అలాగే బాధపడతాము. అంటే అయిపోయినవాటి గురించో, రాబోయేవాటి గురించో బాధపడతాము. ఈ రెండు విషయాల్లో జాగ్రత్త పడితే, ఇంక బాధపడే అంశం ఇంకేమీ లేదు.

అందువల్ల కృష్ణపరమాత్మ ఈ రెండింటి గురించీ చెబుతున్నాడు. గతాసూన్ అంటే గడచిపోయినవి అంటే గతం; అగతాసూన్ అంటే గడిచిపోనివి అంటే వర్తమానం లేదా భవిష్యత్తు గురించి; న అనుశోచంతి – దుఃఖించరు. నువ్వేం చేస్తున్నావు అర్జునా?

**అశోచ్యాన్ అన్వశోచః త్వమ్** – శోకింపదగని వారికోసం శోకిస్తున్నావు. అశోచ్య అంటే వారిమీద జాలి గాని, దుఃఖం కాని చూపించే అర్హత లేనివారు. దుర్యోధనాదులు నీ జాలికి అర్హులు కారు. వారు అధార్మిక మనుష్యులు. అంతేకాదు,

**ప్రజ్ఞావాదాంశ్చ భాషసే** – నువ్వు తెలివైనవాడిలా మాట్లాడుతున్నావు. నిన్ను నువ్వు తెలివైనవాడిగా భావించుకుని కులక్షయం గురించి, కులధర్మం గురించి, వర్ణసంకరం గురించీ మాట్లాడావు. నిన్ను నువ్వే ఖండించుకుంటున్నావు. అందువల్ల నీకు జ్ఞానం కావాలి.

**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః**

### 2.జ్ఞానయోగం – శ్లోకాలు 12–38 విశ్లేషణ

ముందు శ్లోకంలో గీతాసారం చెప్పాడని చూశాము. ఇక్కడనుంచి దాన్ని విశదీకరిస్తున్నాడు. కృష్ణపరమాత్మ అంతిమలక్ష్యం ఏమిటి? అర్జునుడు యుద్ధం చేసేలా చేయాలి. ఎందుకంటే, అది అతని తక్షణ సమస్య. జీవిత సమస్య అయిన సంసారాన్ని పరిష్కరించాలి కాని, తక్షణ సమస్య కూడా పరిష్కరించాలి. యుద్ధం చేయాలో, వద్దో కూడా కృష్ణపరమాత్మే చెప్పాలి.

వీటికి దయానందస్వామి రెండు పదాలు వాడతారు – తక్షణ సమస్య, ప్రాథమిక సమస్య. అర్జునునికి ఇప్పుడు తక్షణ సమస్య ఉంది. ఏమిటది? **యుద్ధం చేయాలా, వద్దా**? ఇది తక్షణ సమస్య. ఎందుకంటే ఈ సమస్య ఎప్పుడూ ఉండదు. అంతకుముందు ఎన్నో యుద్ధాలు చేశాడు కాని, అంతకు ముందెన్నడూ ఈ సమస్యను ఎదుర్కోలేదు. అంతేకాదు, ఈ సమస్య సార్వజనీన సమస్య కూడా కాదు. మనం ఎవరితోనూ యుద్ధం చేయాల్సిన అవసరం లేదు. అది క్షత్రియుని సమస్య.

కాని ఈ తక్షణ సమస్య ఇంకో లోతైన సమస్యను పైకి తెచ్చింది. ఏమిటది? రాగం, శోకం, మోహం – ఈ రాగశోకమోహాలు తాత్కాలిక సమస్యలు కావు. అవి శాశ్వత సమస్యలు; అంతేకాదు సార్వజనీన సమస్యలు కూడా.

అంటే ఇప్పుడు అర్జునునికి రెండు సమస్యలు ఉన్నాయి. తక్షణ సమస్య, ప్రాథమిక సమస్య. కృష్ణపరమాత్మ రెండూ పరిష్కరించాలి. దానికి కృష్ణపరమాత్మ మూడు కోణాల్లోంచి పరిష్కారం చూపిస్తున్నాడు. అవి ఆధ్యాత్మిక దృష్టి, ధార్మికదృష్టి, లౌకికదృష్టి.

అంటే ఇది మూడు స్థాయిలున్న వాదన. ఏ స్థాయినుంచి చూసినా, పరిష్కారమార్గం ఒకటే అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటా పరిష్కారం? అర్జునుడు యుద్ధం చేయక తప్పదు.

ఈ మూడింటిలో గీతలో ముఖ్యమైన వాదన ఏమిటి? వేదాంతపరమైన వాదన, ప్రాథమిక వాదన. దాని తరువాత స్థాయి ధర్మపరమైన వాదనది. ఆఖరిస్థాయి లౌకికపరమైన వాదనది. ఎందుకు వేదాంతపరమైన వాదనకు ప్రాముఖ్యత నిస్తున్నాడు కృష్ణపరమాత్మ? ఎందుకంటే, అర్జునునికి ధర్మసూక్ష్మాలు తెలియకపోలేదు. అతను సాక్షాత్తూ ధర్మపుత్రునికి సోదరుడు; అంతేకాదు తనే ధర్మశాస్త్రాన్ని ఔపోసన పట్టాడు; కృష్ణపరమాత్మకు ఇష్టసఖుడు. అందువల్ల అతని ప్రాథమిక సమస్య ధర్మం తెలియకపోవటం కాదు. అతని ప్రాథమిక సమస్య ఆత్మ అజ్ఞానం. దానికి వేదాంతజ్ఞానమే సరియైన మార్గం.

12 నుంచి 25 శ్లోకాల వరకూ జ్ఞానబోధ చేస్తాడు కృష్ణపరమాత్మ. ఆత్మవిద్య అంటే ఆత్మతత్త్వం గురించి చెబుతాడు. అందులో అర్జునుడు, భీష్ముడు, ద్రోణుడు, కృష్ణపరమాత్మల స్వరూపం ఏమిటో విశదీకరిస్తాడు. తరువాత ఒకస్థాయి కిందకి దిగివచ్చి, ధర్మపరంగా చెబుతాడు. అలా చూసినా వీరిని చంపటం హింసకాదు; అహింసలోకే వస్తుంది; అది నేరస్థునికి ఉరిశిక్ష విధించటంలాంటిది. అదీ ధర్మం కాదనుకుంటే, ఇంకో అడుగు దిగివస్తాడు. పేరు, ప్రఖ్యాతులు నిలుపుకోవటంకోసమైనా అర్జునుడు యుద్ధం చేసితీరాలి. ఇవీ మూడు కోణాలు.

**ఎ). ఆధ్యాత్మిక దృష్టి పరంగా శ్లోకాలు 12-25** – వేదాంతపరంగా చూసేటప్పుడు, ఆత్మ గురించిన ప్రాథమిక విషయాలు కొన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. ఇవి తత్త్వబోధలో చూస్తాము (అది వేదాంతంలో ప్రాథమిక శాస్త్రం).

**ఆత్మా కః? స్థూలసూక్ష్మకారణశరీరాత్ వ్యతిరిక్తః । పఞ్చకోశాతీతః సన్। అవస్థాత్రయ సాక్షీ। సచ్చిదానన్ద స్వరూపః సన్। యస్తిష్ఠతి స ఆత్మా ॥**

ఆత్మ అంటే ఏమిటి? స్థూల సూక్ష్మ కారణ శరీరాలకు భిన్నమైనది, పంచకోశాలకు అతీతమైనది, అవస్థాత్రయ సాక్షి, సచ్చిదానంద స్వరూపంగా ఏది ఉందో అది ఆత్మ.

అంటే ప్రతివ్యక్తిలో ఒక చైతన్యం ఉంటుంది. దాన్ని 'చిత్' అంటారు. దాని స్వభావమేమిటి?

చైతన్యం శరీరం ఉన్నా లేకపోయినా ఉంటుంది అని చూశాము. శరీరం ఉంటే వ్యక్తచైతన్యం, లేకపోతే అవ్యక్త చైతన్యం అవుతుంది. ఇలా నిత్యమూ ఉండే చైతన్యాన్ని ఆత్మ అంటారు. శరీరాన్ని అనాత్మ అంటారు. శరీరం అంటే మనస్సు కూడా వస్తుంది. బాడీ మైండ్ సెన్స్ కాంప్లెక్స్ అంటారు – అంటే కార్యకరణసంఘాతం. ఆత్మ ఈ శరీరానికి భిన్నంగా ఉంటుంది. దీన్నిబట్టి ప్రతివ్యక్తీ కూడా ఆత్మ, అనాత్మల మేలుకలయిక అని అర్థమవుతున్నది. మీరు ఎవరినైనా చూస్తే, రెండు విషయాలు చూస్తున్నట్టు. అవి ఆత్మ, అనాత్మ.

దీనికి చేయి-కాంతి ఉదాహరణ చూద్దాము.

దీన్ని మూడు దశల్లో అర్థం చేసుకోవాలి. మీరు చేతిని చూపించి ఇక్కడేముంది అని అడిగితే -

1. చేయి ఉంది
2. చేయి + కాంతి ఉంది
3. అన్నింటినీ ప్రకాశింపజేసే కాంతి ఉంది

అని దశలవారీగా నేర్చుకుంటాము. ముందు చేతిని మాత్రమే చూస్తే, మూడవ దశలో చేతిని ప్రకాశింపజేసే కాంతిని చూస్తాము. ఈ విడదీయటం భౌతికంగా చేయము. చేతిని కోసుకోము. కాని అది బుద్ధిలో కలిగే మార్పు.

ఇప్పుడు ఈ దృష్టాంతాన్ని ఆత్మ, అనాత్మలకు అన్వయించి చూద్దాము. నేను ఎవరు అని అడిగితే -

1. నేను శరీరాన్ని
2. నేను శరీరం + చైతన్యాన్ని
3. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని

అని దశలవారీగా నేర్చుకుంటాము. ముందు నేను శరీరాన్ని మాత్రమే అనుకుంటాము. తరువాత నేను ఆత్మ, అనాత్మల మేలుకలయికను అని తెలుసుకుంటాము. రెండింటిని విడదీసి చూడగలిగాక, నేను ఆత్మనా, అనాత్మనా? నేను ఆత్మను అని అర్థం చేసుకోవాలి.

నేను శరీరం అనుకుంటే నాకు చావు, పుట్టుకలు ఉన్నాయి. నేను ఆత్మను అని అర్థం చేసుకుంటే నేను శాశ్వతం. నేను శరీరం అనుకుంటే వృద్ధాప్యం, మరణం తప్పదు. ఇవి వద్దనుకుంటే, నా ఉన్నతస్థాయి అయిన ఆత్మకు నేను ఎదగాలి. నేను ఆత్మను అని అర్థం చేసుకున్నాక, నేను నా శరీరాన్ని ద్వేషించకూడదు, అలాగని మమకారమూ పెంచుకోకూడదు. నా శరీరం ద్వారా నేను వ్యవహారం నడుపుతున్నాను. శరీరం పడిపోయినా, నేను శాశ్వతంగా ఉంటాను. ఆ విధంగా అశాశ్వతత్త్వంనుంచి శాశ్వతత్త్వానికి నా దృష్టిని మరలుస్తాను.

**అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతం గమయ**

**మృత్యోర్మా అమృతం గమయ** అంటే మరణంనుంచి శాశ్వతత్త్వానికి వెళతామని కాదు. మరణానికి లోనయ్యే శరీర అభిమానంనుంచి శాశ్వతమైన ఆత్మ నేను అని తెలుసుకుంటాము. శరీరం శాశ్వతం అవలేదు; ఆత్మ శాశ్వతం అవవలిసిన పని లేదు, ఎందుకంటే ఎప్పటికీ అది శాశ్వతం. అయితే ఏది శాశ్వతం అవుతోంది? మన దృష్టి అశాశ్వతమైన శరీరంనుంచి శాశ్వతమైన ఆత్మకు మారుతున్నది. దీన్ని ఆధ్యాత్మిక సాధన అంటారు.

ఇలా అనాత్మనుంచి ఆత్మ వైపుకు మనదృష్టిని మరల్చటానికి శాస్త్రం అనేక మార్గాలను సూచిస్తుంది. అందులో ఒక పద్ధతి **దృగ్దృశ్య వివేకమ్**. దృక్ అంటే చూసే నేను. దృశ్యం అంటే చూడబడే వస్తువు. ఆ చూసే నేను ఎవరో విడమర్చి చెప్పేది వివేకం.

మనలో చూసే అంశాలు మూడు ఉన్నాయి –

| | |
|---|---|
| బాహ్యప్రపంచం దృశ్యం 1, కన్ను దృక్ | – దృక్ 1 |
| కన్ను దృశ్యం 2, మనస్సు దృక్ | – దృక్ 2 |
| మనస్సు దృశ్యం 3, సాక్షి దృక్ | – దృక్ 3 |

కన్ను, మనస్సు సాపేక్షిక దృక్కులయితే, సాక్షి ఆత్యంతిక దృక్. అంటే కన్ను జాగ్రత్‌లో పనిచేస్తుంది కాని స్వప్నంలో, సుషుప్తిలో పనిచెయ్యదు. మనస్సు జాగ్రత్‌లో, స్వప్నంలో పనిచేస్తుంది కాని సుషుప్తిలో పడుకుంటుంది. అందువల్ల ఇవి సాపేక్షిక దృక్కులు. కన్ను అంటే అన్ని ఇంద్రియాలనూ తీసుకోవాలి. సాక్షి అంటే సాక్షిచైతన్యం. అది మూడు అవస్థలలోనూ పనిచేస్తుంది. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూస్తుంది. అందువల్ల అది ఆత్యంతికం. అదే ఆత్మ. అది నిత్యచైతన్యం. దీన్నిబట్టి మనకు అర్థమైనది ఏమిటి? మనం ఆబ్జెక్టుగా (అంటే వస్తువుగా) చూడగలిగినదేదీ సబ్జెక్టు అయిన నేను కాదు. ఆబ్జెక్టు అయిన ప్రతిదానికీ రాకపోకలు ఉంటాయి అంటే చావు, పుట్టుకలు ఉంటాయి. వస్తుప్రధాన అనాత్మ ద్వారా నేను చేతన ఆత్మను అని తెలుసుకోవాలి. అంటే నేను స్కూటర్‌ను వాడతాను కాని, నేను స్కూటర్‌ను కాను అని తెలుసుకోవాలి.

ఇటువంటి ఆత్మ గురించి కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. ఈ శ్లోకాల్లో ఆత్మ లక్షణాలు కొన్నింటిని వెలిబుచ్చుతున్నాడు. అవి ఆత్మ **నిత్యం, సత్యం, సర్వవ్యాపకం, అప్రమేయం, అకర్తా అభోక్తా, నిర్వికారం.**

**ఎ) ఆత్మ నిత్యం** – ఆత్మ నిత్యం. వ్యక్తరూపంలో ఉన్నా, ఉండకపోయినా ఆత్మ నిత్యం. చేయి, కాంతి ఉదాహరణ తీసుకుంటే, అక్కడ చేయి ఉంటే, కాంతి ఉన్నట్టు తెలుస్తుంది. చేయి లేకపోతే తెలియదు. అంత మాత్రాన కాంతి లేనట్టు కాదు. అలా ఆత్మ నిత్యం.

**బి) ఆత్మ సత్యం –** ఆత్మకు స్వాభావికమైన ఉనికి ఉంది. అలా అది సత్యం.

**సి) ఆత్మ సర్వవ్యాపకం** – ఆత్మ సర్వవ్యాపకం. చేతిని తీసుకుంటే దానికి సరిహద్దులు ఉన్నాయి. కాని దాన్ని ప్రకాశింపజేసే కాంతికి సరిహద్దులు లేవు. అది చేతి సరిహద్దులని దాటి ఉంది. అలా ఆత్మ శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు. శరీరం బయట కూడా ఉంది. అలా ఆత్మ సర్వగతం, సర్వవ్యాపకం.

**డి) ఆత్మ అప్రమేయం** – ఆత్మ ఎన్నటికీ అనుభవించబడే వస్తువు కాదు.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియెన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియెన్స్‌డ్**

**ఎప్పటికీ అనుభవించే నేను అది, ఎన్నటికీ అనుభవించబడే వస్తువును కాను**

ఉదాహరణకు కెమెరా విషయమే తీసుకోండి. ఒక ఫోటో చూస్తే అందులో కెమెరా ఉండదు. ఫోటోలో కెమెరా ఉండకపోయినా, కెమెరా ఉందా లేదా అని దానికి ఋజువుకోసం చూస్తామా? చూడము! ఎందుకంటే కెమెరా లేకుండా ఫోటో రాలేదు. అలాగే నన్ను నేను అనుభవించలేను కాని, అన్ని అనుభవాలలోనూ నేను ఉన్నాను. అలా ఆత్మ అప్రమేయం.

**ఇ) ఆత్మ అకర్తా అభోక్తా** – ఆత్మ పని చేయదు కాబట్టి అకర్తా; పని చేయకపోతే అనుభవించే ఫలం ఉండదు కాబట్టి అభోక్తా. నేను చేయితో ఏదో ముట్టుకుంటాను. ఆ చేతికి మట్టి అంటుకుంటుంది. అప్పుడేమయింది? ముట్టుకోవటం చేతిని కర్త చేసింది, మట్టి అంటుకోవటం చేతిని భోక్త చేసింది. కాని అదే చేతిమీద ప్రసరించే కాంతి దేన్నీ ముట్టుకోనూలేదు, దానికి మట్టి అంటనూ లేదు. ఆ విధంగా కాంతి అకర్తా, అభోక్తా. అలా ఆత్మ కూడా అకర్తా, అభోక్తా.

**ఎఫ్) ఆత్మ నిర్వికారం** – ఆత్మకు మార్పు లేదు. కాంతి సమక్షంలో చేయి కదిలినా, కాంతి కదలదు. ఇక్కడ చేయిగా, అక్కడ పుస్తకంగా, ఇంకోచోట బల్లగా ప్రకాశింపబడుతుంది. కాని కాంతి మార్పు చెందదు. కాంతి అంటే ట్యూబ్‌లైటు కాంతి తీసుకోకూడదు. సహజసిద్ధంగా ప్రకాశించే కాంతి. అలాగే ఆత్మకు మార్పులేదు.

**ఆత్మ నిత్యం, సత్యం, సర్వవ్యాపకం, అప్రమేయం, అకర్తా అభోక్తా, నిర్వికారం.**

ఈ సారాంశాన్ని 12 నుంచి 25 శ్లోకాల్లో చూస్తాము. నిజానికి గీత అత్యంత కష్టమైన బోధతో మొదలవుతున్నది. కాని ఎవరికైనా అది కష్టమనిపిస్తే, కృష్ణపరమాత్మ ఒక మెట్టు కిందికి దిగివచ్చి ధార్మికదృష్టితో చెబుతున్నాడు. కాని ఈ ఆత్మ విద్యను ముందుముందు అధ్యాయాల్లో పదేపదే బోధిస్తాడు.

ఈ విద్య ద్వారా కృష్ణపరమాత్మ అందిస్తున్న సారం ఏమిటి? భీష్మద్రోణులకు ఆత్మపరంగా చావు లేదు. అందువల్ల వారి మరణం గురించి అర్జునుడు బాధపడనవసరం లేదు. పైపెచ్చు అర్జునుడు ఎవరు? ఆత్మే. ఆత్మగా అతను అకర్తా. అతను ఎవరినీ చంపలేదు.

చంపేదెవరు? చంపబడేది ఎవరు?

అర్జునుడు చంపటం లేదు; భీష్మద్రోణులు చంపబడటం లేదు. **సర్వమ్ ఆత్మమయం జగత్.** చైతన్య స్వరూపమైన ఆత్మ అకర్తా, అభోక్తా అని చూశాము. అందువల్ల ఒకరు చంపటం, ఇంకొకరు చంపబడటం అంటూ ఉండదు. మన దృష్టిని శరీరం స్థాయినుంచి ఆత్మస్థాయికి మార్చాలి.

ఉదాహరణకు కుండ–మట్టి విషయం తీసుకోండి. కుండను కుండగా చూస్తే, దానికొక తయారైన రోజు ఉంటుంది, నాశనమయ్యే రోజు ఉంటుంది. కాని కుండను కుండగా కాక, మట్టిగా చూస్తే, మట్టి కుండ కాకముందూ ఉంది (మట్టి ఆకారంలాగా); కుండ ఉన్నప్పుడూ ఉంది (కుండ ఆకారంలాగా), కుండ పగిలిపోయినా ఉంటుంది (మళ్ళీ మట్టిగా). అలాగే అల–సముద్రం గురించి కూడా చెప్పవచ్చు. అల ఒక సమయంలో పుడుతుంది, ఒక సమయంలో మరణిస్తుంది; కాని అలను నీరుగా తీసుకుంటే నీరు అల పుట్టక ముందూ ఉంది, అలలోనూ ఉంది, అల సమసిపోయాకా ఉంది. ఇది ఆధ్యాత్మిక దృష్టి. దీన్ని అర్థం చేసుకోవటానికి చాలా సూక్ష్మదృష్టి ఉండాలి. ఆత్మ తప్ప వ్యక్తులు లేరు. ఆత్మే అప్పుడూ ఉంది, ఇప్పుడూ ఉంది, ఎప్పుడూ ఉంటుంది. ఆత్మ మూడు కాలాల్లోనూ ఉంటుంది. **త్రికాలేపి తిష్ఠతి.**

కాని ఈ వాదనను సరిగ్గా అర్థం చేసుకోకపోతే పెద్ద ప్రమాదం ఉంది. ప్రతి నేరస్థుడూ ఎవరినో ఒకరిని చంపేసి, చంపేదెవరు, చంపబడేది ఎవరు అని వాదించే ప్రమాదం ఉంది.

**బి) ధార్మిక దృష్టి పరంగా శ్లోకాలు 31 – 33** – కృష్ణపరమాత్మ ధార్మిక దృష్టితో కూడా చెబుతున్నాడు. మామూలుగా అయితే చంపటం హింస, పాపం. కాని ఇక్కడ ఎందుకు చంపుతున్నాడు? **ధర్మసంస్థాపనార్థం!** ఇది ఒక న్యాయమూర్తి ఉరిశిక్ష విధించటంలాంటిది. న్యాయమూర్తి అయ్యో నేను అతనిని చంపుతున్నానే అనుకోకూడదు. అతను ధర్మాన్ని నిలబెట్టటంకోసం, ధర్మం తప్పినవాణ్ణి శిక్షిస్తున్నాడు.

ఆత్మను నమ్మినా, నమ్మకపోయినా అర్జునుడు యుద్ధం చేయటం ధర్మబద్ధమా, ధర్మవిరుద్ధమా అని ఆలోచిస్తే అది ధర్మబద్ధమే అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఒక క్షత్రియుని ధర్మం యుద్ధం చేయటం. ధర్మం నిలబెట్టటం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టి అయినా యుద్ధం చేయాలి. అందువల్ల ధర్మపరంగా చూసినా అర్జునుడు యుద్ధం చేసితీరాలి. అది పాపం కాదు.

**సి) లౌకిక దృష్టి పరంగా శ్లోకాలు 34– 38** – కృష్ణపరమాత్మ ఇంకొక మెట్టు దిగి వస్తున్నాడు. నువ్వు ఆత్మను నమ్మకపోవచ్చు, ధర్మాధర్మాలను నమ్మకపోవచ్చు, పుణ్యపాపాలను నమ్మకపోవచ్చు. సరే వాటిని పక్కనపెట్టు. నీకున్న పేరు ప్రతిష్ఠల గురించి ఆలోచించు. సంఘంలో నీకున్న మర్యాదను గురించి ఆలోచించు. లౌకికపరంగా చూసినా నువ్వు యుద్ధం చేసితీరాలి, లేకపోతే నీకు చెడ్డ పేరు వస్తుంది.

ఈ మూడు కోణాల్లోంచి కృష్ణపరమాత్మ చెప్పాడు. ఇప్పుడు 12 నుంచి 25 వరకూ ఆధ్యాత్మిక దృష్టితో చెప్పాడని చూశాము. అందులోని ముఖ్యాంశాలు మళ్ళీ చూస్తే –

ఆత్మ శరీరంలో ఒక భాగం కానీ, లక్షణం కానీ, దాన్నుంచి ఉత్పత్తి అయిన వస్తువు కానీ కాదు. ఆత్మ శరీరం అంతటా వ్యాపించి దాన్ని ప్రకాశింపజేస్తుంది. శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు కాని శరీరం లేకపోతే అవ్యక్తంగా ఉంటుంది. అంటే ఆత్మ నిత్యం. ఆత్మ అకర్తా, అభోక్తా. కర్మ చేయాలంటే, కదలిక ఉండాలి. కదలిక ఉండాలంటే పరిమితి ఉండాలి. ఆత్మకు పరిమితి లేదు కాబట్టి అది అకర్తా. కర్తే కర్మఫలం అనుభవించాలి. ఆత్మ కర్త కాదు కాబట్టి భోక్త కూడా కాలేదు. మీరు తింటే ఇంకొకరికి ఆకలి తీరదు. మీరు చేసిన పనికి ఫలితం మీరే అనుభవిస్తారు. **కర్తా ఏవ భోక్తా భవతి.**

కర్తా ఏవ భోక్తా భవతి చాలా ముఖ్యమైన సూత్రం. ఇది కర్మఫలానికి నిదర్శనం. అందువల్ల మనం అనుభవిస్తున్న ఫలాలకు ఎవరినో నిందించి లాభం లేదు. మనం అనుభవిస్తున్న కర్మఫలం వారి ద్వారా వస్తోంది అంతే.

ఆత్మ నిర్వికారం. శరీరానికి షడ్వికారాలు ఉంటాయి. అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి. కృష్ణపరమాత్మ వీటిని నాలుగు దశల్లో వర్ణిస్తాడు – కౌమారం, యౌవనం, వృద్ధాప్యం, దేహాంతరప్రాప్తి. ఆత్మకు ఈ మార్పులు లేవు. అది నిర్వికారం.

ఆత్మ అప్రమేయం. ఆత్మ చూడబడే ఆబ్జెక్టు కాదు, చూసే సబ్జెక్టు. కళ్ళు అన్నిటినీ చూస్తాయి కాని తమను తాము చూసుకోలేవు; ఈ వేలితో అన్నిటినీ ముట్టుకోగలను కాని, ఈ వేలుని ముట్టుకోలేను. నా ఫోనుతో

అందరికీ ఫోను చేయగలను కాని, నాకు నేను చేసుకోలేను. సబ్జెక్టు ఆబ్జెక్టు కాలేదు; చూసే వ్యక్తి చూడబడదు; అనుభవించే వ్యక్తి అనుభవించబడలేదు.

ఎవర్ ది ఎక్స్‌పీరియెన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియెన్స్‌డ్. ఇదీ 12-25ల సారాంశం.

శ్లో. 12 **న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।**
**న చైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్ ॥**
న, తు, ఏవ, అహమ్, జాతు, న, ఆసమ్, న, త్వమ్, న, ఇమే, జనాధిపాః,
న, చ, ఏవ, న, భవిష్యామః, సర్వే, వయమ్, అతః, పరమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అహమ్ | = | నేను | జనాధిపాః | = | రాజులు |
| జాతు | = | ఒకప్పుడు | న (ఆసన్) | = | లేరనునదియును లేదు |
| న, ఆసమ్ | = | లేను-అనునది | చ | = | ఇంకా |
| న, తు, ఏవ | = | లేనేలేదు | అతః, పరమ్ | = | ఇకమీదట |
| త్వమ్ | = | నీవు | వయమ్, సర్వే | = | మనమందరము |
| న (ఆసీః) | = | లేవు-అనునది లేదు | న, భవిష్యామః | = | లేకపోవుట అనునది |
| ఇమే | = | ఈ | న, ఏవ | = | లేనే లేదు |

**అహం జాతు న ఆసం (ఇతి) న తు ఏవ, త్వం (జాతు న ఆసీః ఇతి) న,**
**ఇమే జనాధిపాః (జాతు న ఆసన్ ఇతి) న, అతః పరం చ వయం సర్వే న భవిష్యామః (ఇతి) న ఏవ॥**

తా: ఏ కాలమునందైననూ నేను లేను-అనునది లేదు. ఏ కాలమునందైననూ నీవు లేవు-అనునది లేదు. ఏ కాలమునందైననూ ఈ మహారాజులు లేరనునదియును లేదు. (గతములో అందరూ ఉండిరి). మనమందరము ఈ దేహములు పడిపోయిన తరువాత ఉండబోము అనేది కూడా లేనే లేదు. (భవిష్యత్తులో అందరు ఉండెదరు).

**ఎ) ఆత్మ నిత్యం-** 12వ శ్లోకంలో కృష్ణపరమాత్మ ఆత్మ నిత్యం అని చెప్పదలుచుకున్నాడు. ఆత్మ నిత్యం అని తేలిగ్గా చెప్పి ఉండవచ్చు. కాని దాన్ని చుట్టూ తిరిగి చెబుతున్నాడు. కృష్ణపరమాత్మ చిలిపితనానికి పెట్టింది పేరు. ఆ చిలిపితనాన్ని తన బోధలో కూడా వదులుకోలేదు. అందువల్ల ఆత్మ గతంలోనూ ఉంది, ఇప్పుడూ ఉంది, భవిష్యత్తులోనూ ఉంటుంది అని చెబుతున్నాడు.

**త్రికాలేపి తిష్ఠతి** - పోనీ అదైనా ప్రత్యక్షంగా చెబుతున్నాడా అంటే ఇక్కడ కూడా చిలిపితనం చూపిస్తున్నాడు.

ఆత్మ లేదు అని చెప్పలేవు అంటున్నాడు. ఆత్మ ఉంది అనకుండా, డబుల్ నెగటివ్ వాడుతున్నాడు. ఆత్మ గతంలో లేదు అనలేవు; ఆత్మ ఇప్పుడు లేదు అనలేవు; ఆత్మ భవిష్యత్తులో ఉండదు అనలేవు అంటున్నాడు.

**అహం న ఆసమ్** - అహం అంటే ఆత్మనైన నేను. ఆత్మనైన నేను గతంలో లేను; **(ఇతి న)** - అని అనలేవు. రెండు 'న'లు ఉన్నాయి. న అహం; న ఆసమ్. అంటే నేను గతంలో ఉన్నాను.

**న త్వమ్** – నువ్వు గతంలో లేవు అనటం కూడా నిజం కాదు. అంటే నువ్వు కూడా గతంలో ఉన్నావు.

**న ఇమే జనాధిపాః** – ఈ రాజులు కూడా గతంలో లేరు అనటం నిజం కాదు. అంటే రాజులు గతంలో ఉన్నారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఆత్మ గతంలో ఉంది. భవిష్యత్తు మాటేమిటి?

**న చైవ న భవిష్యామః** – మనం భవిష్యత్తులో ఉండము; **(ఇతి న)** – ఇది కూడా నిజం కాదు. మళ్ళీ డబుల్ నెగటివ్ – మనం భవిష్యత్తులో ఉండము అనేది నిజం కాదు అంటే మనం భవిష్యత్తులో ఉంటాము.

కృష్ణపరమాత్మ ఇప్పటి విషయం గురించి మాట్లాడటం లేదు. ఎందుకు? నువ్వు ఉన్నావా అని అడిగితే, మా ఆవిడని అడిగి చెబుతాను అనరు కదా ఎవరూ? అందువల్ల మనం ఇప్పుడు ఉన్నామా లేదా అనే శంకే లేదు. అందువల్ల కృష్ణపరమాత్మ ఇప్పటిది వదిలేసి, మనకు అనుమానం ఉన్న భూత, భవిష్యత్తు కాలాల గురించే చెబుతున్నాడు. అందువల్ల దీని సారాంశం ఏమిటి? ఆత్మ నిత్యం.

కాని ఎవరైనా నా పుట్టుక ముందు విషయం నేను మాట్లాడలేను అంటే ఇంతకు ముందు ఆత్మ గురించి నేర్చుకున్న విషయం గుర్తుకు తెచ్చుకోవాలి. శరీరం లేకపోయినా ఆత్మ ఉంటుంది కాని, శరీరం లేదు కాబట్టి వ్యవహారం నడుపలేదు. ఫోనులో మాట్లాడుతుండగా, మధ్యలో మాటలు వినిపించకపోతే ఏమంటారు? ఫోను డెడ్ అయింది అంటారు. నేను డెడ్ అయ్యాను అనరు. అలాగే ఒక వ్యక్తి మరణిస్తే, ఏది మరణించింది? అతని శరీరం మరణించింది. ఈ శరీరం ప్రస్తుత ఫోను నంబరు. ఫోనుకు ఈ నంబరు పోతే కొత్త నంబరుకు అప్లై చేస్తారు. అలాగే ఈ శరీరమనే ఫోను నంబరు పోతే, ఇంకో కొత్త శరీరం దొరికేదాకా ఆత్మ ఉంటూనే ఉంటుంది.

**సర్వే వయమతః పరమ్** – మనమందరం కూడా ఇకముందు కూడా ఉంటాము.

శ్లో. 13 **దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।**
**తథా దేహాంతరప్రాప్తిః ధీరస్తత్ర న ముహ్యతి ॥**
దేహినః, అస్మిన్, యథా, దేహే, కౌమారమ్, యౌవనమ్, జరా,
తథా, దేహాంతరప్రాప్తిః, ధీరః, తత్ర, న, ముహ్యతి ॥

| | | | |
|---|---|---|---|
| యథా | = ఎలాగైతే | తథా | = అలాగే |
| దేహినః | = జీవాత్మకు | దేహాంతరప్రాప్తిః | = ఇంకొక దేహము ప్రాప్తించుటయు (కల్గును) |
| అస్మిన్, దేహే | = ఈ దేహమందు | | |
| కౌమారమ్ | = కౌమారము (బాల్యము) | తత్ర | = ఆ విషయమున |
| యౌవనము | = యౌవనము | ధీరః | = ధీరుడైనవాడు |
| జరా | = ముసలితనము (కలవో) | న, ముహ్యతి | = మోహమును పొందదు |

**దేహినః అస్మిన్ దేహే యథా కౌమారం యౌవనం జరా।**
**తథా దేహాంతర ప్రాప్తిః। తత్ర ధీరః న ముహ్యతి ॥**

తా: దేహాభిమానముగల జీవునకు ఈ దేహమందు ఏ విధముగానైతే బాల్యము, యౌవనము, వృద్ధాప్యము కలుగుచున్నవో, అదే విధముగా మరియొక దేహము సంప్రాప్తమగును. వివేకవంతుడు మోహమును పొందడు.

నేను శాశ్వతం అయితే, చావు పుట్టుకలు ఏమిటి? కృష్ణపరమాత్మ చావు పుట్టుకలను శరీరాన్ని మార్చటంగా అభివర్ణిస్తున్నాడు. బట్టలు జీర్ణించుకుపోతే ఎలా వేరే బట్టలు మార్చుకుంటామో, అలా ఈ శరీరం జీర్ణించుకుపోతే, వేరే శరీరాన్ని తీసుకుంటాము. శరీరం ఎలా జీర్ణించుకుపోతుందో ఇందులో వర్ణిస్తున్నాడు.

**అస్మిన్ దేహే** – ఈ శరీరంలో నాలుగు దశల అనుభవాలు ఉన్నాయి. అందులో కౌమారం, యౌవనం, వృద్ధాప్యం వస్తాయి. శరీరంలో ఈ మార్పులు అవుతున్నప్పుడు, నేను మారతానా? నా పేరు మారుతుందా?

నేను బాల్యం(కౌమారం)లో ఆ స్కూల్లో చదివాను, యౌవనంలో అలా చేశాను అంటూ చెబుతాము. శరీరం మారుతున్నా, మారకుండా ఉన్నది నేను, నేను, నేను. సైన్సు ప్రకారం మన శరీరంలో ఉన్న కణాలన్నీ మారతాయి. శరీరం పూర్తిగా మారుతుంది. జుట్టు తెల్లబడుతుంది, లేదా పూర్తిగా రాలిపోతుంది. దంతాలు రాలిపోతాయి. ఒక్కొక్క అంగమూ చెడిపోతుంది. కొన్ని సందర్భాలలో కిడ్నీ మార్పిడికి కూడా గురవుతుంది. కాని ఇన్ని మార్పులు జరుగుతున్నా, ఇదంతా అవుతున్నది ఎవరికి? నాకు.

దీన్నే మరి కొంచెం సాగదీయమంటున్నాడు కృష్ణపరమాత్మ. అన్ని మార్పులూ అయ్యాక, మొత్తం శరీరాన్ని మార్చమంటున్నాడు.

**తథా దేహాంతర ప్రాప్తిః** – జీర్ణించుకుపోయిన పాత వస్త్రాన్ని మార్చినట్టుగా, మీరు జీర్ణించుకుపోయిన శరీరాన్ని కూడా ఇంకొక శరీరంతో మార్చారు. అందువల్ల ఆనందంగా ఉండాలి. మీరేమీ పోగొట్టుకోలేదు. **పాత ఇంటిని పడగొట్టి కొత్త ఇంటిని కట్టినట్టు అన్నమాట.** ఆకాశంలో ఏమీ మార్పు లేదు. గోడలు ఇటునుంచి అటు కదిలాయి అంతే. అలాగే చైతన్యం ఆకాశం (స్పేస్) లాంటిది; దానికి శరీరమనే గోడలు వస్తూ ఉంటాయి; శరీరమనే గోడలు పోతూ ఉంటాయి. దేహాంతర ప్రాప్తి అంటే ఇంకో శరీరాన్ని పొందటం. ఇది నాలుగవ దశ.

**ధీరస్తత్ర న ముహ్యతి** – ధీర అంటే ధీరుడు కాదు వేదాంతంలో. ధీర అంటే వివేకి. నిత్యానిత్యవస్తువివేకం చేసిన వ్యక్తి. న ముహ్యతి అంటే ఈ విషయంలో మోహం పొందడు. అర్జునా ఈ యుద్ధంలో భీష్మశరీరం పోయినా, భీష్మ ఆత్మ పోదు; అలాగే ద్రోణశరీరం పోయినా, ద్రోణ ఆత్మ పోదు. అందువల్ల ఎవరికోసం నువ్వు దుఃఖిస్తున్నావు?

శ్లో. 14 **మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః ।**
**ఆగమాపాయినోఽనిత్యాః తాంస్తితిక్షస్వ భారత ॥**
మాత్రాస్పర్శాః, తు, కౌంతేయ, శీతోష్ణసుఖదుఃఖదాః,
ఆగమాపాయినః, అనిత్యాః, తాన్, తితిక్షస్వ, భారత ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ | = ఓ కుంతీపుత్రా! | అనిత్యాః | = అనిత్యములు |
| శీతోష్ణసుఖ | = శీతోష్ణములను, సుఖదుఃఖములను | భారత | = (కాబట్టి) భారతా! (అర్జునా!) |
| దుఃఖదాః | కల్గించునవియైన | తాన్ | = వాటియందు |
| మాత్రాస్పర్శాః, తు | = విషయేంద్రియ సంయోగములయితే | తితిక్షస్వ | = సహనము చూపుము |
| ఆగమాపాయినః | = ఉత్పత్తి వినాశశీలములు (ఇంకా) | | |

**హే కౌంతేయ! మాత్రా-స్పర్శాః తు శీత-ఉష్ణ-సుఖ-దుఃఖ-దాః**
**ఆగమ అపాయినః, అనిత్యాః। హే భారత! తాన్ తితిక్షస్వ ॥**

తా: భరతవంశీయుడగు ఓ అర్జునా! ఇంద్రియములకు విషయములతో సంయోగము చెందితే చల్లదనము-వేడి, సుఖము, దుఃఖములను కలుగచేయును. సంయోగములు వచ్చి పోయేవి, నిత్యములు కావు. కాబట్టి వాటియందు సహనము చూపుము.

**అనాత్మ అనిత్యం -** ఆత్మ నిత్యత్వస్వరూపాన్ని ఎలాగైతే అర్థం చేసుకుని, స్వీకరిస్తామో అలాగే అనాత్మ అనిత్యత్వ స్వరూపాన్ని కూడా అర్థం చేసుకుని, స్వీకరించాలని కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. మన తెలివితేటలు ఒక వస్తువుయొక్క స్వరూపాన్ని స్వీకరించటంలో వెల్లడి అవుతాయి. ఎందుకు ఒక వస్తువుయొక్క స్వరూపాన్ని స్వీకరించాలి? ఎందుకంటే ఒక వస్తువుయొక్క స్వరూపాన్ని ఎన్నడూ మార్చలేము. ఒక వ్యక్తికి ఉల్లిపాయ వాసన నచ్చలేదు. దాన్ని పోగొట్టటానికి శతవిధాల ప్రయత్నించాడు.

**కర్పూరధూళీ రచితాలవాలః కస్తూరికా కుంకుమ లిప్తదేహః ।**
**సువర్ణకుంభైః పరిషిచ్యమానః నిజం గుణం ముంచతి నో ఫలాండుః ॥**

అతను ఫలాండు అంటే ఉల్లిపాయ వాసనను మారుద్దాం అనుకున్నాడుట. అతను కర్పూరంతో ఒక ముద్ద చేసి దాని మధ్యలో ఉల్లిపాయను పెట్టాడుట. ఆ ఉల్లిపాయమీద కస్తూరీ పరిమళాలు అంటే శక్తివంతమైన వాసన ద్రవ్యాలను చల్లాడుట. మళ్ళీ అత్తరు నీటితో దానికి రుద్రాభిషేకం చేసినట్టుగా, అభిషేకం చేశాడుట. మూడు గంటల తరువాత, వాటి మధ్యనుంచి ఉల్లిపాయ తీసుకుని, ముక్కు దగ్గర పెట్టుకుంటే, ఏముంది? ఉల్లిపాయ వాసనే వచ్చింది. అలా, ఒక వస్తువుయొక్క స్వరూపాన్ని ఎన్నటికీ మార్చలేము.

ఒక వస్తువుయొక్క స్వరూపాన్ని మార్చలేమని ఎందుకు అంటున్నాము? దానికి జవాబు చాలా తేలిక. దేన్నైతే మార్చలేమో దాన్నే స్వరూపం అంటారు. ఎందుకు మార్చలేము అనకండి. మార్చలేని దాన్నే స్వరూపం అంటారు. అందువల్ల తెలివైనవ్యక్తి ఒక వస్తువుయొక్క స్వరూపాన్ని మార్చటానికి ప్రయత్నించకుండా, దానిమీద తనకున్న దృక్పథాన్ని మార్చుకుంటాడు. మన దృక్పథాన్ని ఎలా మార్చుకోవాలి? దృక్పథాన్ని మార్చటాన్ని **స్వీకరించటం** అంటారు. ఒక వస్తువుయొక్క స్వరూపాన్ని స్వీకరించాలి. ఇది ఉపాసన. అంటే నేనీ మంత్రాన్ని రోజుకొకసారైనా జపించాలి. ఎంతవరకు? నాకు స్వీకరించే మనస్తత్వం సహజంగా అయ్యేవరకూ.

ఎందుకు స్వీకరించాలి? ఎందుకంటే, మనకున్న సమస్యల్లో అధికశాతం మనం ఒక వస్తువుయొక్క స్వరూపాన్ని స్వీకరించటం లేదు కాబట్టి వస్తున్నాయి. ఎండాకాలం రాగానే, అమ్మో ఎండ దంచేస్తోంది అంటాము. అలా అనేసరికి ఇంకా వేడిగా అనిపిస్తుంది. దాని బదులు సూర్యుని గొప్పతనాన్ని స్వీకరించటం నేర్చుకోండి. భగవంతుని సృష్టి ఎంత అద్భుతం! కొన్ని కోట్ల మైళ్ళ దూరంనుంచి ప్రాణశక్తిని ప్రసాదించే శక్తిని సృష్టించాడు. ఆ శక్తి అన్ని కోట్ల మైళ్ళ దూరంలో ఉండి కూడా, రోజూ భూమి మొత్తాన్ని ప్రకాశింపజేస్తున్నది. అంత కాంతి మనం ఏర్పాటు చేయాలంటే ఎంత విద్యుచ్ఛక్తి కావాలి? అందువల్ల సూర్యరశ్మిని మెచ్చుకోండి.

చెమట పోస్తుంటే, దాన్నీ ఒక అద్భుతంగా స్వీకరించండి! దేవుని సృష్టిలోని అద్భుతాలను చూసి మురిసిపోండి. అంటే సూర్యుని కిరణాలను చూసి భయపడకుండా, మెచ్చుకోండి. చెమట పడితే తిట్టుకోకుండా, ఆనందించండి. అలా మీ ప్రవర్తనను మార్చుకోండి. ఈ స్వీకరించే స్వభావాన్ని నెమ్మదిగా అన్నిటిమీద ప్రసరించండి. ముందు జడవస్తువులతో మొదలుపెట్టి, తర్వాత చేతనవస్తువులకు రండి. అందరికన్నా మనుష్యులను, వారి స్వభావాలను భరించటం కష్టం. కాని దాన్ని స్వీకరించటం నేర్చుకోవాలి. దుఃఖం నిర్వచనం ఏమిటి? **నిజాలను ఒప్పుకోకపోవటం.** **మాత్రా స్పర్శాస్తు కౌంతేయ** – మాత్రా అంటే ఇంద్రియాలు. మా అంటే తెలుసుకోవటం, అనుభవించటం; త్రా అంటే కరణం లేదా పరికరం. మాత్రా అంటే అనుభవం పొందటానికి వాడే కరణం. **నియతి అభిః ఇతి మాత్రా**– ఏమిటా కరణాలు? పంచజ్ఞానేంద్రియాలు. స్పర్శ అంటే విషయవస్తువులు. **స్పృశంతే ఇతి స్పర్శః.** అందువల్ల ఇంద్రియాలు ఉన్నాయి, విషయవస్తువులు ఉన్నాయి. మీకు ఇష్టం ఉన్నా లేకపోయినా కూడా ఇంద్రియాలు, విషయవస్తువులతో జతగూడతాయి. కన్ను అంటే మీకు ఇష్టం లేకపోతే, ఆ వస్తువును చూడకుండా కన్ను మూసుకోవచ్చు. కాని చెవిని మూసుకోలేరు. మీరు వద్దనుకున్నా కూడా, కొన్ని కామెంట్లు మీ చెవిన పడుతూ ఉంటాయి.

కొంతమంది శబ్దాలు వినకూడదని, ఎక్కడో కొండ గుహల్లో ఏకాంతంగా ధ్యానం చేద్దామని వెళతారు. కాని అక్కడ ఉండే శబ్దాలు అక్కడ ఉంటాయి. దోమలు స్వైరవిహారం చేస్తాయి. ఏవో పురుగులు శబ్దాలు చేస్తుంటాయి. అందుకని సమస్యనుంచి ఎక్కడికీ పారిపోలేరు. ఏమిటి చక్కటి పరిష్కారం? పరిస్థితులకు దూరంగా పారిపోకుండా, పరిస్థితులతో జీవించటం నేర్చుకోండి. అలా పారిపోతే మీ నిరోధకశక్తి, మీ బలం తగ్గిపోతాయి. దాని బదులుగా మీరు సమస్యను ఎదుర్కొంటే, మీ నిరోధకశక్తి పెరుగుతుంది. అలా మీలో రోగ నిరోధకశక్తి పెరగటానికే కలరా ఇంజెక్షన్, టైఫాయిడ్ ఇంజెక్షన్లు ఇస్తారు. పరిస్థితిని ఎదుర్కొంటేనే మీ మనస్సును దృఢపరచుకోగలరు. పరిస్థితులు ఏమి ఇస్తాయి?

**శీతోష్ణసుఖదుఃఖదాః** – అవి వేడి–చల్లదనం, సుఖం–దుఃఖం ఇస్తాయి. అంటే అవి ద్వంద్వప్రవృత్తులు ఉన్నవి. జీవితమంతా ఇలాంటి ద్వంద్వాలతో గడపాలి. అవి రెండూ చెట్టాపట్టాలు వేసుకుని వస్తాయి. మానం వస్తే, అవమానం వస్తుంది. సంయోగం కలిగితే, దాని వెన్నంటి వియోగం వస్తుంది. ఏదైనా పెరిగితే, అది తరుగుతుంది కూడా. పెరుగుట తరుగుట కొరకే అంటారు పెద్దలు. లాభం వస్తే, నష్టం కూడా వస్తుంది. జీవితంలో ఎత్తుపల్లాలు వస్తూనే ఉంటాయి. అది అనాత్మ లక్షణం.

**ఆగమాపాయినః అనిత్యాః** – ఆగమాపాయి అంటే వాటికి రాకపోకలు ఉన్నాయి. అందుకని అవి వస్తే ఆహ్వానించండి, వెళ్ళిపోతే వాటిని నివారించకండి.

కొన్ని వస్తువులను మనసారా ఆహ్వానించటానికి సిద్ధంగా ఉంటాము, కాని అవి వచ్చినట్టే వచ్చి వెళ్ళిపోతాయి. కొన్ని వస్తువులు శాశ్వతంగా వెళ్ళిపోవాలి అనుకుంటాము కాని అవి మళ్ళీమళ్ళీ వస్తూనే ఉంటాయి. అనిత్యాః అంటే అవన్నీ అశాశ్వతం.

ముందు శ్లోకంలో నిత్య ఆత్మ గురించి మాట్లాడితే, ఈ శ్లోకంలో అనిత్య అనాత్మ గురించి మాట్లాడుతున్నాడు కృష్ణపరమాత్మ. రెండింటినీ స్వీకరించాలి. శాశ్వతమైన శరీరాన్ని ఆశించలేరు. ఒకానొక సమయంలో **కాయకల్పం** అనే ఒక మందు గురించి మాట్లాడేవారు. దాన్ని తయారు చేయటం చాలా కష్టం. దాన్ని వందసార్లు ముద్దగా చేసి, నీటిలో ముంచి, ఎండబెట్టి మళ్ళీ చేయాలి. అలా కష్టపడి మందు తయారుచేస్తే, అది శరీరాన్ని శాశ్వతంగా చేస్తుందని నమ్మకం. అది పని చేస్తుందా, లేదా చెప్పండి! చాలా తేలిక. అది తయారుచేసినవారు ఇప్పుడు లేరు. ఒకవేళ ఆ మందు నిజంగా పని చేసేటట్టయితే, దాన్ని ముందు ఎవరు వాడి ఉండేవారు? ఖచ్చితంగా దాన్ని కనుగొన్న వ్యక్తులే! వారు శాశ్వతంగా ఉండి ఉండాలి. కాని లేరే! అందువల్ల అలాంటి మందులేం పని చేయవు.

అమెరికాలో కొంతమంది శవాన్ని వెంటనే ఖననం చేయటానికి ఇష్టపడరని ఒక గాలివార్త. ఎందుకు? ఒక కొత్త ఇంజక్షనుని ఎవరైనా కనుక్కుంటే, చనిపోయిన వ్యక్తి లేచి కూర్చుంటాడని ఆశ. దానికోసం లక్షల కొద్దీ డాలర్లను ఖర్చు చేస్తున్నారుట.

అలాంటి వృథా ప్రయాసలేమీ పడకండి. మీ డబ్బును, కాలాన్ని, శక్తిని అనవసరంగా ఖర్చు పెట్టకండి అన్న ఉద్దేశంతో చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. శరీరం పంచభూతాలతో చేయబడింది. అది మళ్ళీ వెళ్ళి పంచభూతాలలో కలవాలి. కలిస్తేనే మంచిది కూడా! మనం తరువాత వచ్చే తరానికి చోటు ఇవ్వాలి. మనం మరణించకుండా అలాగే ఉంటే, కొన్ని శతాబ్దాల తరువాత భూమి పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి! ఇతను పన్నెండవ శతాబ్దానికి చెందినవాడు; ఇతను పదమూడవ శతాబ్దానికి చెందినవాడు అని పరిచయాలు చేసుకోవాల్సి ఉంటుంది.

అందువల్ల అనాత్మ అశాశ్వతం; అనాత్మ అశాశ్వతంగా ఉండి తీరాలి. నిజాన్ని మార్చటానికి ప్రయత్నించకండి. మరి దేన్ని మార్చాలి? మీ దృక్పథాన్ని మార్చాలి. ఏమిటా మార్పు? అనాత్మ ఎప్పుడో ఒకప్పుడు వెళ్ళి తీరాలి. ఈ సత్యం ఒక్క శరీరానికే వర్తించదు, సృష్టిలో ఉన్న ప్రతి ఒక్కదానికీ వర్తిస్తుంది. ఒక అనుభవం వస్తుంది, అది వెళ్ళితీరాలి.

**తాంస్తితిక్షస్వ భారత** – అంతర్గత శక్తిని పెంపొందించుకో అర్జునా. శారీరక శక్తిని, మానసిక శక్తిని – రెండింటినీ పెంచుకోవాలి. శారీరక శక్తికన్నా, మానసిక శక్తి ఇంకా దృఢంగా ఉండాలి. మనకు కలిగిన నష్టాన్ని భరించే శక్తి ఉండాలి. ఒకవేళ ఆ మానసిక స్థైర్యం లేకపోతే ఏం చేయాలి? భగవంతుణ్ణి, ప్రకృతి సూత్రాలను మార్చమని కోరలేము. అలా ఒక్కొక్కరూ వారికి తగ్గట్టుగా కోరుతూపోతే, భగవంతుడు అయోమయంలో

పడతాడు. ప్రకృతి సూత్రాలను మార్చమని కోరకూడదు, వాటిని భరించే తితిక్షను ఇమ్మని కోరాలి. తితిక్ష అంటే సహనశక్తి. వచ్చిపోయే వాటిని భరించే సహనశక్తిని ఇమ్మని కోరాలి.

సహనశక్తి చూపటమంటే, త్వరగా కోపం తెచ్చుకోకూడదు; త్వరగా తీవ్రంగా స్పందించకూడదు; త్వరగా చిరాకు పడకూడదు; త్వరగా ఎదుటివ్యక్తిని శిక్షించకూడదు. సహనం లేకపోతే, చాలా త్వరగా చిరాకు వస్తుంది; చిరాకు కోపంలోకి దింపుతుంది; కోపం హింసకు దారితీస్తుంది. అంటే సహనం లేకపోవటమే అన్ని సమస్యలకూ మూలకారణమని అర్థమవుతున్నది.

ఇలాంటి పరిస్థితిని ఇంటా, బయటా చూస్తూనే ఉంటాము. పిల్లలను పిలవగానే పలకకపోతే చిర్రుబుర్రులు ఆడతాము. రోడ్డుమీద ఎర్రలైటు పడితే ఆగే ఓపిక లేదు. ఒకవేళ ఆగినా, పచ్చలైటు పడగానే, ముందుగా ఆగిన వ్యక్తి ఏ కారణంవల్లనన్నా వెంటనే బయలుదేరకపోతే, వెనక ఆగిన కార్లన్నీ హెూరుమంటూ హారన్లు మ్రోగించేస్తాయి.

అందువల్ల తితిక్ష చాలా ముఖ్యం. తితిక్ష లేనిదే ఆత్మజ్ఞానం పొందలేము. మోక్షం కూడా పొందలేము అంటున్నాడు కృష్ణపరమాత్మ. కొంతమందికి ఆత్మజ్ఞానం కావాలి కాని, దానిని నేర్చుకునే ఓపిక లేదు. ఏదైనా క్రాష్‌కోర్సు ఉందా అని అడుగుతారు. క్లాసులకి వెళ్ళి, తీరిగ్గా నేర్చుకునే ఓపిక లేదు. స్వామీజీ ఇంటికి వెళ్ళి, ఆయన తమ తల తెరిచి, అందులో చిటికెడు ఆత్మజ్ఞానం పోస్తే, బయటకు హ్యాపీగా వెళ్ళిపోవాలి. అలా ఉంటుంది వారి హడావుడి. ఆత్మజ్ఞానానికి ఓపిక లేదు.

ఆ మాటకొస్తే పూర్వం శిష్యులు గురువుతో ఉండి, గురువుకు సేవలు చేసి, పశువులను కాపలా కాసి, కట్టెపుల్లలు తెచ్చి, గురువుకు కృప కలిగితే, విద్య నేర్చుకునేవారు. అలా నేను సేవ చేయను అని అలిగి వెళ్ళిపోతే నష్టపోయేదెవరు? శిష్యుడే! అందువల్లనే ఏదైనా విద్యను లోతుగా అధ్యయనం చేయాలంటే తితిక్ష చాలా అవసరం.

శ్లో. 15 **యం హి న వ్యథయంత్యేతే పురుషం పురుషర్షభ ।**
**సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే ॥**
యమ్, హి, న, వ్యథయంతి, ఏతే, పురుషమ్, పురుషర్షభ,
సమదుఃఖసుఖమ్, ధీరమ్, సః, అమృతత్వాయ, కల్పతే ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఎందుకంటే | ఏతే | = ఇవి (విషయేంద్రియ సంయోగములు) |
| పురుషర్షభ | = ఓ పురుషశ్రేష్ఠా! | న, వ్యథయంతి | = విచలితుని చేయవో |
| సమదుఃఖసుఖమ్ | = సుఖదుఃఖములను సమానముగా చూచే | సః | = అతడు |
| యమ్, ధీరం పురుషమ్ | = ఏ ధీరుడైన పురుషుని | అమృతత్వాయ | = మోక్షముకోసం |
| | | కల్పతే | = యోగ్యుడగును |

**హే పురుష–ఋషభ! హి యం సమ–దుఃఖ–సుఖం ధీరం పురుషమ్ ఏతే న వ్యథయంతి ।**
**సః అమృతత్వాయ కల్పతే ॥**

తా: పురుషులలో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! ఎందుకంటే ఈ శీతోష్ణాదులచేత విచలితుడు కాని వ్యక్తి ఇంకా సుఖదుఃఖములందు సముడైన వివేకి మోక్షమునకు యోగ్యుడు అగును.

**ధీరం పురుషమ్** – ఎవరికైతే వివేకం ఉంటుందో అతడు ధీరుడు. ధీరుడు అంటే ధైర్యవంతుడు కాదు అని చూశాము. ఉపనిషత్తుల్లో ఈ పదం పదేపదే వస్తుంది. అతనికి వివేకం ఉంటుంది. వివేకాన్ని అద్భుతంగా వివరించారెవరో –

**ఓ దేవా, మార్చగలిగిన వాటిని మార్చే శక్తిని నాకు ప్రసాదించు;**
**ఓ దేవా, మార్చలేని వాటిని స్వీకరించే శక్తిని నాకు ప్రసాదించు;**
**ఓ దేవా, మార్చగలిగినవేవో, మార్చలేనివి ఏవో తెలుసుకోగలిగే విజ్ఞతను నాకు ప్రసాదించు.**

కాని మనమేం చేస్తాము? మార్చగలిగిన వాటిని గుడ్డిగా స్వీకరిస్తాము. మార్చలేని వాటిని మార్చటానికి ప్రయత్నిస్తాము. అందువల్ల వేటిని మార్చగలమో, వేటిని మార్చలేమో తెలుసుకోగలిగే విజ్ఞత చాలా అవసరం. మార్చలేని నిజం ఏమిటి? జగత్తుయొక్క మారే స్వరూపాన్ని మార్చలేము. అందువల్ల ధీరుడు ఎవరంటే దేన్ని స్వీకరించాలో, దేన్ని స్వీకరించకూడదో తెలిసిన వివేకవంతుడు. దానివల్ల అతను పొందే లాభం ఏమిటి?

**ఏతే న వ్యథయంతి** – ఏతే అంటే మాత్రాస్పర్శః. అంటే మారుతున్న జగత్తు అతన్ని బాధపెట్టదు. మారుతున్న జగత్తు అంటే మారే శరీరం, ఇంద్రియాలు, మనస్సు, విషయవస్తువులు అతన్ని బాధపెట్టవు. ఎందుకు? ఒక అందమైన గులాబీపువ్వు వికసించినప్పుడు, దాని అందాన్ని ఆస్వాదిస్తాడు. వేదాంతం పేరు చెప్పి దాని అందాన్ని చూడడు అనుకోకూడదు. అది వికసిస్తే మెచ్చుకుంటాడు. అది వాడిపోతే, దాన్నీ స్వీకరిస్తాడు. గులాబీ వాడిపోయిందని వాపోడు. ఎందుకు? పూచిన పువ్వు వాడిపోక తప్పదనే సత్యం అతనికి తెలుసు కాబట్టి.

**సమదుఃఖసుఖమ్** – ఏ సంఘటన అయినా సరే వస్తే దానికి స్వాగతం పలుకుతాడు కాని వెళ్ళిపోతే దాన్ని ఆపడు. అంటే దుఃఖాన్ని, సుఖాన్ని సమంగా తీసుకుంటాడు. అందువల్ల న వ్యథయంతి – వాటి గురించి బాధపడడు. అటువంటి వ్యక్తే వేదాంతాన్ని అభ్యసించగలడు. కలత చెందిన మనస్సు ఏకాగ్రత చూపలేదు. అది ఫిర్యాదు చేస్తూనే ఉంటుంది. ఫిర్యాదు చేసే మనస్సు, చిరాకు పడే మనస్సు తనను తాను తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.

**సః** – ధీరుడైన వ్యక్తికి, తనలో షాక్ అబ్సార్బర్స్ ఉంటాయి. మీ కారు వెళ్ళే రోడ్డు గతుకుల రోడ్డుగా ఉంటే మీకు రెండు మార్గాలు ఉన్నాయి. మీరు వెళ్ళే రోడ్డు బాగుచేసుకుంటూ వెళ్ళటం, లేదా మీ కారుకు షాక్ అబ్సార్బర్లు పెట్టుకోవటం. ఈ రెండింటిలో ఏది తేలికైనదో చెప్పండి. రోడ్డును మీరు ఇవాళ బాగుచేసినా, రేపు పాడవదని నమ్మకం లేదు. పైగా ఎన్ని రోడ్లని బాగుచేస్తారు?

అలాగే మీ చుట్టూ ఉన్నవారిని ఎంతమందిని బాగుచేస్తారు? మీ పక్కింటివ్యక్తిని మార్చగలరా? ఆటో డ్రైవర్ని మార్చగలరా? వారి స్వభావాన్ని, వారి ప్రవర్తనను మార్చలేరు కాని ఒక పని చెయ్యగలరు. మీకు మీ మనస్సులో ఒక షాక్ అబ్సార్బర్‌ని పెట్టుకోగలరు. దానివల్ల మనస్సు స్పందించకుండా ఉండదు కాని, అది భరించగలిగే స్థాయిలోనే ఉంటుంది. **మనస్సు అస్సలు స్పందించకుండా ఉండదు అనటం లేదు మనము.** కాని స్పందించినా, మీకు వచ్చే కోపంయొక్క తీవ్రత తక్కువగా ఉంటుంది. కోపంగా ఉండే సమయం కూడా తగ్గుతుంది.

**ఉత్తమే తు క్షణం కోపో, మధ్యమే ఘటికా ద్వయమ్। అధమే స్యాత్ అహోరాత్రం, పాపిష్టే మరణాంతకః॥**

ఉత్తమ పురుషునికి కూడా కోపం వస్తుంది కాని అది క్షణం మాత్రమే ఉంటుంది. మధ్యమ పురుషునికి కోపం షుమారుగా గంట, గంటన్నర సేపు ఉంటుంది. అధముని కోపం ఒక రోజంతా అంటే ఆ రాత్రీ పగలు ఉంటుంది. పాపిష్టివాని కోపం మాత్రం అతను జీవించి ఉన్నన్నాళ్ళూ ఉంటుంది. పైగా ఆ విషయం అతను గర్వంగా చెప్పుకుంటాడు.

అందువల్ల తితిక్ష అంటే అసలు కోపం రాదనికాదు; తితిక్ష అంటే తన కోపాన్ని తను అదుపులో పెట్టుకోగలిగినవాడు. అతనే వేదాంతాన్ని నేర్చుకోగలడు. అందువల్ల సః – అతనే; **కల్పతే** – అర్హుడు. దేనికి? **అమృతత్వాయ** – అమృతత్వం అంటే మోక్షం లేదా ఆత్మజ్ఞానం. అతనే ఆత్మజ్ఞానం పొందటానికి అర్హుడు.

శ్లో. 16 **నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।**
**ఉభయోరపి దృష్టోఽ_ంతః త్వనయోస్తత్త్వదర్శిభిః ॥**
న, అసతః, విద్యతే, భావః, న, అభావః, విద్యతే, సతః,
ఉభయోః, అపి, దృష్టః, అంతః, తు అనయోః, తత్త్వదర్శిభిః ॥

| | | | |
|---|---|---|---|
| అసతః | = అసద్వస్తువునకు (మిథ్యా వస్తువుకు) | అనయోః ఉభయోః | = ఈ రెండింటి |
| భావః | = ఉనికి | అపి | యొక్క |
| న విద్యతే | = లేదు | అంతః | = తత్త్వము |
| తు | = అయితే | తత్త్వదర్శిభిః | = తత్త్వజ్ఞానులచేత |
| సతః | = సద్వస్తువునకు (ఉన్నదానికి) | దృష్టః | = చూడబడినది |
| అభావః | = లేమి (లేకుండుట) | | (తెలిసికొనబడినది) |
| న, విద్యతే | = లేదు | | |

**అసతః భావః న విద్యతే సతః అభావః న విద్యతే ।**
**తత్త్వదర్శిభిః తు ఉభయోః అపి అనయోః అన్తః దృష్టః ॥**

తా: మిథ్యా వస్తువుకు ఉనికి లేదు. సత్యవస్తువుకు లేకుండుట లేదు. ఆత్మతత్త్వము తెలిసినవారు ఈ రెండింటియొక్క స్వరూపమును సాక్షాత్కరించుకున్నవారు.

**బి) ఆత్మ సత్యం –** ఇంతకు ముందు శ్లోకాల్లో **ఆత్మ నిత్యం** అని చూశాము. ఇప్పుడు ఆత్మ సత్యం, అనాత్మ మిథ్య అని నిరూపిస్తాడు. ఇది చాలా ముఖ్యమైన, చాలా లోతైన శ్లోకం. చాలా సాంకేతిక పదాలు ఉన్న శ్లోకం. అందువల్ల ముందు ఈ శ్లోకం అర్థాన్ని చూసి తరువాత దానిలో ఉన్న పదాలను చూద్దాము.

**స్వాభావిక ధర్మం, ఆగంతుక ధర్మం** – ప్రతివస్తువుకూ రెండు ధర్మాలు ఉంటాయి. అవి స్వాభావిక ధర్మం, ఆగంతుక ధర్మం. స్వాభావిక ధర్మం అంటే ఆ వస్తువుకు స్వతహాగా ఉన్న ధర్మం. దాని అసలు స్వరూపం అన్నమాట. ఆగంతుక ధర్మం అంటే ఎక్కడ్నుంచో అరువు తెచ్చుకున్న ధర్మం. స్వరూప ధర్మం ఎప్పుడూ ఉంటుంది కాని అరువు తెచ్చుకున్నది ఎల్లకాలం ఉండదు.

### స్వాభావిక ధర్మం శాశ్వతం, ఆగంతుక ధర్మం అశాశ్వతం

దీనికొక ఉదాహరణ చూద్దాము. మీరు ఒక గిన్నెలో నీరు పోసి దాన్ని స్టౌమీద పెట్టి, స్టౌ వెలిగించారు. మండుతున్న అగ్నివల్ల కొంచెంసేపటికి గిన్నె వేడెక్కి, నీరు కూడా మసలుతుంది. ఆ మసలుతున్న నీటిలో బంగాళాదుంపను వేశారు. కాసేపటికి అది కూడా వేడెక్కుతుంది. ఇప్పుడు బంగాళాదుంప వేడిగా ఉన్నది కాని, అది దాని స్వాభావిక లక్షణంవల్ల కాదు. అది మసలుతున్న నీటిలో ఉండటంవల్ల నీటివేడిని తీసుకుంది. నీరు స్వతహాగా వేడిగా ఉంటుందా? లేదు. అది వేడిని, వేడెక్కుతున్న గిన్నెనుంచి తీసుకుంది. గిన్నెకు స్వతహాగా వేడి ఉందా? లేదు. అది కూడా మండుతున్న అగ్నిమీద పెట్టబట్టి వేడెక్కింది. అగ్నికి స్వతహాగా వేడి ఉందా? ఇక్కడ లేదనకూడదు. అగ్నితత్త్వమే వేడి. అది దాని స్వభావం.

అగ్నికి వేడి దాని స్వాభావిక ధర్మం; కాని గిన్నెకు, నీటికి, బంగాళాదుంపకూ వేడి ఆగంతుక ధర్మం అయింది. అంటే అవి ఒక దాన్నుంచి ఒకటి వేడిని అరువు తెచ్చుకున్నాయి. గిన్నెలో వేడి ఆగంతుకం; నీటిలో వేడి ఆగంతుకం. బంగాళాదుంపలో వేడి ఆగంతుకం. కాఫీకి స్వతహాగా వేడిగా ఉండే లక్షణముంటే ఫ్లాస్కు అవసరం లేదు.

దీన్నిబట్టి మనం ఒక ప్రకృతి సూత్రాన్ని అర్థం చేసుకోవాలి. ఏదైతే ఆగంతుక లక్షణమో అది అరువు తెచ్చుకున్న లక్షణమని ముందే చూశాము. ఇప్పుడు అరువు తెచ్చుకున్నదేదీ శాశ్వతం కాదని తెలుసుకోవాలి. కొత్తగా వచ్చినదేదీ నిలవదు. నాశనానికి గురి అవుతుంది. **ఆగమాస్యాత్ అపాయి** వచ్చేది, వెళ్ళిపోతుంది. వేడెక్కిన బంగాళాదుంప, వేడినీటిలో ఉన్నంతసేపే వేడిగా ఉంటుంది. బయటకు తీస్తే చల్లారిపోతుంది. గిన్నె స్టౌమీదనుంచి తీయండి, అదీ చల్లారిపోతుంది. అగ్నిని ఇక్కడినుంచి మంచు కురిసే చోటికి తీసుకువెళ్ళండి. అక్కడ కూడా అగ్ని వేడిగానే ఉంటుంది. వాతావరణం తక్కువ టెంపరేచర్‌కి వెళ్ళినా అగ్ని వేడిగానే ఉంటుంది. ఎందుకు? అది అగ్నితత్త్వం కాబట్టి. అగ్ని స్వాభావిక ధర్మం వేడిగా ఉండటం. దీనివల్ల మనం నేర్చుకున్న ప్రకృతిసూత్రం ఏమిటి?

### స్వాభావిక ధర్మః న ఆగచ్ఛతి న గచ్ఛతి

ఏదైతే స్వాభావికమో దానికి రాకపోకలు లేవు; ఏదైతే ఆగంతుకమో దానికి రాకపోకలు ఉన్నాయి.

**అనాత్మ మిథ్య –** ఇప్పుడు జగత్తులో ఏదైనా నాశనమయ్యే వస్తువును తీసుకుందాము. నాశనమయ్యే వస్తువుకు ఉనికి కొన్నాళ్ళే ఉంటుంది. ఏదైతే కొన్నాళ్ళే ఉంటుందో దాన్ని అశాశ్వతమైన వస్తువు అంటారు. శరీరాన్ని అశాశ్వతం అని ఎందుకు అంటారంటే, అది పుట్టుకకు, చావుకు మధ్య కాలంలో మాత్రమే ఉంటుంది. ఈ శరీరానికి ఉనికి, అది పుట్టకముందు లేదు, మరణించాక ఉండదు. ఏ అశాశ్వతమైన వస్తువైనా సరే, కొన్నాళ్ళే ఉంటుంది. కొన్నాళ్ళే అంటే దాని తయారీ రోజునుంచి, అది ముగిసే రోజు దాకానే ఉంటుంది. అంటే ఇప్పుడొక ప్రకృతిసూత్రం నేర్చుకుంటున్నాము. ఏమిటది?

**అనిత్యమైన వస్తువులన్నింటికీ ఉనికి కొన్నాళ్ళే ఉంటుంది. దాని ముందూ, తరువాతా ఉండదు.**

ఇప్పుడు ఈ సూత్రాన్ని ఉపయోగించి చూద్దాము. అశాశ్వతమైన వస్తువుల ఉనికి ఆగంతుకమా, స్వాభావికమా? స్వాభావికమైతే అగ్ని ఎప్పుడూ వేడిగా ఉన్నట్టుగా, వాటికి ఉనికి ఎప్పుడూ ఉండాలి. అవి కొన్నాళ్ళే ఉంటాయన్న విషయమే వాటి ఉనికి స్వాభావికం కాదు, ఆగంతుకం అని చెతున్నది. దీన్నిబట్టి తెలిసిన విషయమేమిటి?

**అనిత్యమైన వస్తువులకు స్వతంత్రంగా ఉనికి లేదు.**

వాటి ఉనికి తెచ్చిపెట్టుకున్నది. మేకప్ వేస్తే ఆ అందం ఎంతసేపు ఉంటుంది? మేకప్ ఉన్నంతవరకే ఉంటుంది. మేకప్ పోయిన మరుక్షణం తెచ్చిపెట్టుకున్న అందం మటుమాయమవుతుంది. సహజసౌందర్యం శాశ్వతంగా ఉంటుంది. ప్రకృతి ఒడిలో పెరిగిన శకుంతల అందం సహజసౌందర్యం! మురికినీటిలో ఉన్నా కూడా, సహజసౌందర్యంతో మెరిసిపోతుంది కలువపువ్వు. అశాశ్వతమైన వస్తువులకు సహజంగా ఉనికి లేదు, అరువు తెచ్చుకున్న ఉనికి ఉంది అని చూశాము. దాన్ని మిథ్య అంటారు. అరువు తెచ్చుకున్న ఉనికిని ఆగంతుకం అంటారు. స్వతంత్రంగా ఉన్న ఉనికిని స్వాభావికం అంటారు.

**స్వాభావికమైన ఉనికి ఉన్నది సత్యం; ఆగంతుకమైన ఉనికి ఉన్నది మిథ్య.**

దీన్ని కుండ–మట్టి ఉదాహరణతో చూద్దాము. మట్టినుంచి కుండ వచ్చింది. కుండకు ఒక ఉనికి ఏర్పడింది. కొన్నిరోజులు ఉంది. తరువాత కుండ పగిలిపోయింది. అంటే కుండ ఉనికిని కోల్పోయింది. కుండ లేదు అంటాము. అంటే కుండ ఉనికి అశాశ్వతమైంది. కొన్నాళ్ళే ఉంది. అశాశ్వతమైన కుండకు స్వతంత్రంగా ఉనికి లేదు. అరువు తెచ్చుకుంది. ఎక్కడనుంచి? మట్టినుంచి. అరువు తెచ్చుకున్న ఉనికిని **ఆగంతుకం** అంటారని చూశాము. ఆగంతుకమైన ఉనికి **మిథ్య** అని కూడా చూశాము.

ఇప్పుడు మట్టి విషయం చూద్దాము. మట్టి కుండ ఏర్పడక ముందూ ఉంది; కుండ ఉన్నప్పుడు కుండలోనూ ఉంది; కుండ పగిలిపోయాకా ఉంది. అంటే మట్టికి రాకపోకలు లేవు. అది శాశ్వతం. దాని ఉనికి కుండనుంచి వచ్చిందా? దాని ఉనికి స్వతంత్రమైనది. కుండకు ఉనికి మట్టినుంచి వచ్చింది కాని, మట్టికి ఉనికి కుండనుంచి రాలేదు. స్వతంత్రంగా ఉనికి ఉంటే దాన్ని **స్వాభావికం** అంటారని చూశాము. స్వాభావికమైన ఉనికి **సత్యం** అని కూడా చూశాము.

**మట్టి సత్యం, కుండ మిథ్య.**

ఇదే వేదాంతం. వేదాంతబోధ అయిపోయింది. వేదాంతం అంటే ఈ సత్యం, మిథ్యలను అర్థం చేసుకోవటంలోనే ఉంది. పూజ్య స్వామీజీ చెబుతూ ఉంటారు – ఎవరో వేదాంతం ఎన్ని సంవత్సరాలో నేర్చుకున్నాక, స్వామీజీ దగ్గరికి వచ్చి చెబుతారట, "స్వామీజీ, నాకు వేదాంతం అంతా బాగా అర్థమయింది, రెండు విషయాలు తప్ప. సత్యం, మిథ్య మాత్రం అర్థం కాలేదు." వేదాంతం అంతా సత్యం, మిథ్యల గురించే చెబుతుంది. సృష్టి అంతా ఆత్మ, అనాత్మల మేలుకలయిక.

**ఆత్మ సత్యం, అనాత్మ మిథ్య.**

**ఓం తత్సత్.** వేదాంతం అయిపోయింది. టన్నుల కొద్దీ పుస్తకాలు చదివినా, అన్నీ చెప్పేది ఈ విషయమే– ఆత్మ సత్యం, అనాత్మ మిథ్య. ఈ నేపథ్యంతో శ్లోకాన్ని చూద్దాము.

**అసతః భావః న విద్యతే** – భావః అంటే స్వాభావికమైన ఉనికి. అంటే సహజమైన ఉనికి; న విద్యతే – లేదు. సహజమైన ఉనికి లేదు. దేనికి? అసతః – అనిత్యమైనదానికి లేదా మిథ్యా వస్తువుకు సహజమైన ఉనికి లేదు. మన ఉదాహరణ తీసుకుంటే కుండకు స్వాభావికమైన ఉనికి లేదు. అలాగే –

**సతః అభావః న విద్యతే** – అభావః అంటే ఉనికి లేకపోవటం లేదా నాశనం. ఉనికి లేకపోవటం; న విద్యతే– లేదు. దేనికి? సతః – సత్యమైన దానికి, సహజమైన ఉనికి ఉన్నదానికి. స్వాభావికమైనదానికి ఉనికి లేకపోవటం లేదు అంటే స్వాభావికమైన ఉనికి ఉంది. మన ఉదాహరణ తీసుకుంటే మట్టికి స్వాభావికమైన ఉనికి ఉంది; కుండ పుట్టకముందు, పగిలిపోయాక కూడా దానికి ఉనికి ఉంది కాబట్టి.

అందువల్ల నిత్యవస్తువుకు ఉనికి లేకపోవటం లేదు, అనిత్య వస్తువుకు సహజమైన ఉనికి లేదు. దానికి అసహజమైన ఉనికి ఉంది.

**తత్త్వదర్శిభిః దృష్టః** – తత్త్వదర్శి అంటే జ్ఞాని. జ్ఞాని ఒక్కడే దీన్ని స్పష్టంగా అర్థం చేసుకుని నిస్సందేహంగా స్వీకరించగలడు.

**అంతః** – అంతః అంటే వాస్తవ స్వరూపాన్ని. దేనివి?

**అనయోః ఉభయోః అపి** – సత్యం, మిథ్యా వస్తువుల రెండింటివీ. జ్ఞాని మాత్రమే ఈ సత్యం, మిథ్యలయొక్క వాస్తవ స్వరూపాలను అర్థం చేసుకోగలడు. మట్టి సత్యం, కుండ మిథ్య; ఆత్మ సత్యం, అనాత్మ మిథ్య అని అర్థం చేసుకోగలడు.

కుండతో వ్యవహారం నడుపుతున్నా అది మిథ్య అని తెలుసు; అది ఏ క్షణంలోనైనా పగిలిపోవచ్చుననీ తెలుసు. అందువల్లనే ఏవైనా గాజు వస్తువులను ప్యాక్ చేసి పంపిస్తున్నప్పుడు వాటి బయట గాజు వస్తువు, జాగ్రత్తగా పట్టుకోండి అని రాసి ఉంటుంది. మన శరీరం కూడా అలాంటి గాజువస్తువే. మనస్సు ఇంకా

సున్నితం. ఏ క్షణంలోనైనా విరిగిపోవచ్చు. అందుకే చూడండి, ఎవరైనా మనను బాధపెడితే నా మనస్సు విరిగిపోయింది అంటాము.

మీకు సున్నితమైన మనస్సు ఉంటే, మీవాళ్ళు అర్థం చేసుకుంటారేమో కాని, బాహ్యప్రపంచం ఎందుకు మీతో సున్నితంగా ప్రవర్తిస్తుంది? అది మిమ్మల్ని విమర్శించవచ్చు, తిట్టవచ్చు, మెచ్చుకోవచ్చు, మీమీద పుకార్లు పుట్టించవచ్చు. ఇవన్నీ మీ మనస్సును కలత చెందిస్తాయి. అందువల్ల అనాత్మ స్వరూపం గురించి అర్థం చేసుకోండి. అనాత్మ మార్పు చెందితే, బాధ పడకండి. మీ మనస్సు మారినట్టే తక్కినవారి మనస్సు కూడా మారుతుంది. ఒకప్పుడు మిమ్మల్ని ఎంతో ఇష్టపడ్డవారే, ఇప్పుడు మిమ్మల్ని బాధించవచ్చు. అలా రెండింటి స్వభావం తెలుసుకున్నవాడు జ్ఞాని. దీన్ని **గ్రంథగ్రంథి శ్లోకం** అంటారు. అందువల్ల చాలా ముఖ్యమైన శ్లోకం.

శ్లో. 17 **అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ ।**
**వినాశమవ్యయస్యాస్య న కశ్చిత్ కర్తుమర్హతి ॥**
అవినాశి, తు, తత్, విద్ధి, యేన, సర్వమ్, ఇదమ్, తతమ్,
వినాశమ్, అవ్యయస్య, అస్య, న, కశ్చిత్, కర్తుమ్, అర్హతి ॥

| | | | |
|---|---|---|---|
| అవినాశి | = నాశరహితమైన | అస్య అవ్యయస్య | = శాశ్వతమైన దానియొక్క (ఆత్మయొక్క) |
| తత్, విద్ధి | = దానిని తెలిసికొనుము | వినాశమ్ | = వినాశనమును |
| యేన, తు | = దేనివల్లనైతే | కర్తుమ్ | = చేయుటకు |
| ఇదమ్, సర్వమ్ | = ఈ జగత్తంతయు (దృశ్యవర్గము) | కశ్చిత్ | = ఎవ్వడును |
| తతమ్ | = వ్యాప్తమైయున్నదో | న, అర్హతి | = సమర్థుడు కాడు |

**విద్ధి, యేన సర్వమిదం తతమ్, తత్ తు అవినాశి ।**
**వినాశమ్ అవ్యయస్య అస్య న కశ్చిత్ కర్తుమ్ అర్హతి ॥**

తా: ఏ సత్ చే ఈ సర్వము వ్యాప్తమైయున్నదో అది వినాశనము లేనిదని తెలిసికొనుము. వికారములు లేని ఈ సత్‌నకు ఎవ్వడైననూ వినాశనమును కలిగించలేడు.

ఈ శ్లోకంలో ఒక భాగం **ఆత్మ నిత్యం** అనే అంశాన్ని మళ్ళీ సూచిస్తున్నది. కాకపోతే ఈసారి కృష్ణపరమాత్మ వేరే పదం వాడుతున్నాడు.

**తత్ అవినాశి** – ఆత్మ నిత్యం అనకుండా **తత్ అవినాశి** అంటున్నాడు. వినాశి అంటే నాశనమయ్యేది. అవినాశి అంటే నాశనం కానిది. కుండ–మట్టి తీసుకుంటే, కుండ అనాత్మ, మట్టి ఆత్మ. కుండ నాశనమవుతుంది కాని మట్టి కుండ లేకపోయినా ఉంటుంది. అలాగే అనాత్మ నాశనమవవచ్చు, అవుతుంది కూడా, కాని ఆత్మ అవినాశి.

**విద్ధి** – విద్ధి అంటే ఓ అర్జునా, ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకో. ఈ విషయాన్ని జీర్ణించుకో.

**అస్య కశ్చిత్ వినాశం కర్తుమ్ న అర్హతి** – ఎవరూ ఈ ఆత్మను నాశనం చేయలేరు. భగవంతుడు కూడా నాశనం చేయలేడు. అణుబాంబులు కూడా నాశనం చేయలేవు. భీష్మద్రోణులు ఎవరు? ఆత్మ! కాబట్టి ఆత్మకు నాశనం లేదు. ఇంతవరకూ ముందు శ్లోకంలో చెప్పిన అంశాన్నే మళ్ళీ చెప్పాడు. ఇప్పుడు ఆత్మయొక్క ఇంకొక లక్షణాన్ని చెబుతున్నాడు.

**సి) ఆత్మ సర్వవ్యాపకం – యేన సర్వమ్ ఇదం తతమ్** – తతమ్ అంటే వ్యాప్తం. **ఆత్మ సర్వవ్యాపకం.** ఆత్మ నిత్యమే కాదు, ఆత్మ సర్వవ్యాపకం కూడా. ఆకాశం లాగా ఆత్మ సర్వవ్యాపకం. ఆత్మ సర్వవ్యాపకమయితే ఎన్ని ఆత్మలు ఉంటాయి? ఒక్కటే ఉండాలి. ఒక్కటే ఆకాశం ఉన్నట్టుగా, ఒక్కటే ఆత్మ ఉంది – నీలో, నాలో, చీమలో, చెట్టులో, భగవంతునిలో కూడా. శరీరాలు అనేకం కాని ఆత్మ ఒక్కటే. అనేక ఇళ్ళు ఉన్నా, ఆ ఇళ్ళలో అనేక గదులున్నా కూడా, ఆకాశం ఒక్కటే. అనాత్మలు అనేకం, ఆత్మ ఏకం.

అందువల్లనే భగవంతుడు అందరి హృదయాలలో ఉన్నాడు అంటారు. ఏ రూపంలో? ఆత్మగా అన్ని రూపాలలో. అందువల్లనే, మన సాంప్రదాయంలో తోటిమనిషికి నమస్కారం పెడతాము. ఆ నమస్కారం ఎదుటనున్న వ్యక్తికి కాదు, అతనిలో ఉన్న ఆత్మకు. ఈశ్వరస్వరూపానికి ఈ నమస్కారం. శరీరాలు వేరు కాని ఆత్మ ఒక్కటే. మొదట్లో మనకు ఆత్మ అర్థం కాకపోవచ్చు, అందువల్ల భగవంతుడు అనే పదం వేస్తాము. అందువల్ల జగత్తుమీద ఆధారపడవద్దు, భగవంతునిమీద ఆధారపడండి అంటాము. తరువాత, జ్ఞానమార్గానికి వచ్చాక, ఆ భగవంతుడు ఎక్కడో లేడు, ఆ భగవంతుడు **ఆత్మ** అని చెబుతుంది శాస్త్రం. మోక్షం అంటే ఆత్మమీద ఆధారపడటం. ఆ విధంగా జగత్తుమీద ఆధారపడే దశనుంచి, భగవంతునిమీద ఆధారపడే దశకు వచ్చి, ఆత్మమీద ఆధారపడే దశకు రావాలి.

బంధం అంటే అనాత్మమీద ఆధారపడటం. కాని ఇక్కడ ఒక విషయం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. అనాత్మ మీద ఆధారపడకూడదు అంటే అనాత్మను ద్వేషించమని చెప్పటం లేదు. అనాత్మమీద బంధం పెంచుకోవటం ఎలా సమస్యను సృష్టిస్తుందో, దాన్ని ద్వేషించటం కూడా సమస్యను సృష్టిస్తుంది. ప్రపంచాన్ని కార్డుబోర్డుతో చేసిన కుర్చీతో పోలుస్తారు. ఆ కార్డుబోర్డు కుర్చీ అందంగా ఉంటుంది, అద్భుతంగా ఉంటుంది కాని దానిమీద కూర్చోలేము. అందువల్ల దాన్ని షోకేసులోంచి విసిరివేయనవసరం లేదు. దాన్ని అందంగా అలంకరించి పెట్టుకోవచ్చు కాని దానిమీద కూర్చోవాలని చూడకూడదు. అలాగే ప్రపంచం కూడా. ప్రపంచంలో నానాత్వం ఉంది, అందం ఉంది కాని శాశ్వతత్వం లేదు. శాశ్వతత్వం కావాలంటే ఆత్మమీద ఆధారపడాలి. అందువల్లనే ఆత్మ సత్యం, అనాత్మ మిథ్య.

ఆత్మ నిత్యం అంటే దానికి కాలపరిమితి లేదు; ఆత్మ సర్వవ్యాపకం అంటే దానికి దేశపరిమితి లేదు. సర్వవ్యాపకమైన దానికి రూపం ఉండదు. ఒక వస్తువుకు రూపం ఉంది అంటే దానికి సరిహద్దులు ఉంటాయి. ఒక హాలు ఏ ఆకారంలో ఉందో తెలుసుకోవాలంటే, దాని సరిహద్దులు చూస్తాము. కాని ఆత్మకు ఆకాశంలా ఆకారం లేదు. ఈ విషయం సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఎందుకంటే, అందరిలోనూ ఆత్మ ఉంటే, నాకెందుకు కనబడటంలేదు అంటారు కొందరు. కాని ఆత్మను చూడలేము. శరీరానికి ఆకారం ఉంది కాబట్టి శరీరాన్ని

చూడగలము కాని ఆకారం లేని ఆత్మను చూడలేము. ఆకాశాన్ని చూడలేకపోయినా, ఆకాశం ఉందని ఎలా ఒప్పుకుంటామో, అలా ఆత్మను చూడలేకపోయినా ఆత్మ ఉందని తెలుస్తోంది.

శరీరం నశిస్తే, ఆత్మ ఏమవుతుంది? ఈ హాలును పగలగొడితే, ఇందులో ఉన్న ఆకాశం ఏమవుతుంది? ఆకాశం నాశనమవదు, కాకపోతే హాలు లేదు కాబట్టి ఆకాశాన్ని వాడలేము. హాలనే హద్దు ఉండటంవల్ల ఆకాశాన్ని వినియోగించుకోగలుగుతున్నాము. అదే సూత్రం ఆత్మకూ వర్తిస్తుంది. ఆత్మ శరీరమనే మాధ్యమం ద్వారా వ్యవహారాన్ని నడుపుతుంది. శరీరం పడిపోయాక కూడా ఆత్మ ఉంటుంది, కాని వ్యవహారం నడుపలేదు. అందువల్ల కృష్ణపరమాత్మ అస్య వినాశం కర్తుం న అర్హతి అన్నాడు. అంటే శరీరం నాశనమయినా కూడా ఎవరూ ఆత్మను నాశనం చేయలేరు.

శ్లో. 18 **అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః ।**
**అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత ॥**
అంతవంతః, ఇమే, దేహాః, నిత్యస్య, ఉక్తాః, శరీరిణః,
అనాశినః, అప్రమేయస్య, తస్మాత్, యుధ్యస్వ, భారత ॥

| | | | |
|---|---|---|---|
| భారత | = ఓ అర్జునా! | ఇమే, దేహాః | = ఈ దేహములన్ని |
| అనాశినః | = నాశరహితమైనది | అంతవంతః | = నశించునవి అని |
| అప్రమేయస్య | = అప్రమేయ (అనిర్వచనీయ) మైనది | ఉక్తాః | = చెప్పబడినవి |
| | | తస్మాత్ | = అందువల్ల |
| నిత్యస్య | = శాశ్వతమైనది అయిన | యుధ్యస్వ | = యుద్ధము చేయుము |
| శరీరిణః | = జీవాత్మయొక్క | | |

**అనాశినః అప్రమేయస్య నిత్యస్య శరీరిణః**
**ఇమే దేహాః అంతవంతః ఉక్తాః। హే భారత! తస్మాత్ యుద్ధ్యస్వ।।**

తా: భరతవంశీయుడవగు అర్జునా! నిత్యము, వినాశము లేనిది అగు ఆత్మ ప్రత్యక్షాదిప్రమాణములకు గోచరము కాదు. దేహముగల ఆత్మయొక్క ఈ దేహములు అంతము గలవని చెప్పబడినవి. కావున, యుద్ధము చేయుము.

**నిత్యస్య శరీరిణః అనాశినః –** ముందు చెప్పిన ముఖ్యభావాన్నే మళ్ళీ చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ఆత్మ నిత్యం, ఆత్మ అవినాశి. దాన్ని ఎవరూ, ఏ విధంగానూ నాశనం చేయలేరు. శరీరిణః అంటే శరీరంతో దగ్గరగా ఉంది. శరీరి అంటే శరీరంలో ఉన్నది.

ఆత్మ శరీరి. కాని ఇక్కడ జాగ్రత్తగా చూడాలి. అంతకుముందు కృష్ణపరమాత్మ ఏమన్నాడు? ఆత్మ సర్వవ్యాపకం అన్నాడు. ఇక్కడేమో శరీరంలో ఉంది అంటున్నాడు. అంటే శరీరంలో **కూడా** ఉంది అని అర్థం చేసుకోవాలి. అంతటా ఉన్న ఆకాశం, గదిలో కూడా ఉన్నట్టుగా అంతటా ఉన్న ఆత్మ శరీరంలో కూడా ఉంది. గదిలో

ఆకాశాన్ని గదిలోని ఆకాశం అన్నట్టుగా, శరీరంలోని ఆత్మను శరీరి అంటాము. ఇది ఆత్మ స్వరూపం. అనాత్మ విషయం ఏమిటి?

**ఇమే దేహా అంతవంతః** – ఈ శరీరాలన్నీ నశించేవే. అంతః అంటే మరణం. అందువల్లనే యమధర్మరాజును అంతకః అంటారు. అంత అంటే మరణం; అంతవంత అంటే నశించేవి. అవి అశాశ్వతం. అందువల్ల ఆత్మగా నేను నిత్యం; శరీరంగా నేను అనిత్యం. తెలివైన పని ఏమిటంటే ఆత్మను ఆత్మగా, అనాత్మను అనాత్మగా స్వీకరించటం. అనాత్మ అయిన శరీరంయొక్క మరణం గురించి బాధపడకూడదు; శరీర ధర్మం రాలిపోవటం– అది భీష్మ శరీరం కావచ్చు; ద్రోణుని శరీరం కావచ్చు, కర్ణుని శరీరం కావచ్చు, తల్లి కుంతి శరీరం కావచ్చు; ఆఖరికి కృష్ణపరమాత్మ శరీరం కూడా కావచ్చు. అందువల్లనే కృష్ణపరమాత్మకు జన్మదిన వేడుకలు చేస్తారు. ఆయన అవతారం ముగించిన రోజును మరణం అనకుండా, స్వర్గారోహణం అంటారు. పదం ఏదైనా శరీరానికి రాకపోకలు ఉంటాయి. అందువల్ల, అర్జునా, ఈ నిజాన్ని నువ్వు స్వీకరించక తప్పదు. ఈ విషయాలన్నీ ఇంతకుముందే చెప్పాడు; ఇప్పుడు ఆత్మయొక్క లక్షణం ఇంకొకటి ప్రవేశపెడుతున్నాడు.

**డి) ఆత్మ అప్రమేయం – అప్రమేయః** – ఆత్మ అప్రమేయం. ప్రమేయం అంటే ఆబ్జెక్టు, అంటే దాని గురించి జ్ఞానం పొందాల్సిన వస్తువు. అప్రమేయం అంటే ఆత్మ ఆబ్జెక్టు కాదు. అందువల్ల ఆత్మను ఎన్నడూ తెలుసుకోలేము. ఆత్మను ఎన్నడూ తెలుసుకోలేము అంటే ఆత్మకు ఉనికి లేదా? **ఆత్మకు ఉనికి ఉంది.** ఉనికి ఉండీ, నేను తెలుసుకోలేని వస్తువెలా అవుతుంది?

దానికి ఉదాహరణ ఫోటో! ఒక ఫోటోలో మనుష్యులు ఉంటారు, కుర్చీలు ఉంటాయి, వస్తువులు ఉంటాయి, కాని ఒకరు మాత్రం కనపడరు. అతను ఉన్నాడు కాని ఫోటోలో లేదు. ఈ ఫోటోలో పదిమంది ఉంటే అక్కడ పదకొండుమంది ఉన్నట్టు అర్థం. అదెలా? ఆ పదకొండవ వ్యక్తి ఫోటో తీసిన **ఫోటోగ్రాఫర్**. ఇప్పటి టెక్నాలజీ ప్రకారం ఆటోమేటిక్ ఫోటో తీశాం అంటారేమో! అప్పుడు కూడా ఫోటోలో లేని వస్తువు ఒకటి ఉంది. ఏమిటది? **కెమెరా!** కెమెరా ఉందా లేదా అని సందేహం అవసరం లేదు. ఫోటో ఉండటమే కెమెరాకి నిదర్శనం. అలాగే ఆత్మ ఉందా లేదా అనే సందేహం అవసరం లేదు. మీకు జరిగే అనుభవాలే ఆత్మ ఉనికికి నిదర్శనం. అందువల్లనే ఆత్మను అప్రమేయం అన్నారు.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియెన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియెన్స్‌డ్**
**అనుభవించే నువ్వే ఎప్పటికీ అది, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

ఆత్మ ఎప్పటికీ దృక్, ఎన్నటికీ దృశ్యం కాదు. ఆత్మ ఎప్పటికీ సబ్జెక్టు, ఎన్నటికీ ఆబ్జెక్టు కాదు. దీనికి ఎప్పుడూ చూసే ఉదాహరణ కళ్ళు. మీ కళ్ళతో మీరు ప్రపంచాన్నంతా చూస్తారు కాని, మీ కళ్ళను మీరు సాక్షాత్తుగా చూసుకోలేరు. అలాగే ఆత్మవల్ల అన్నీ చూస్తారు కాని ఆత్మను చూడలేరు. అది అప్రమేయం.

**తస్మాద్యుధ్యస్వ భారత** – అందువల్ల, ఓ అర్జునా, నువ్వు యుద్ధం చేయి. నువ్వు భీష్ముణ్ణి కాని, ద్రోణాచార్యుణ్ణి కాని, ఎవరిని కాని చంపటం లేదు.

శ్లో. 19 **య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్ ।**
**ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥**
యః, ఏనమ్, వేత్తి, హంతారమ్, యః, చ, ఏనమ్, మన్యతే, హతమ్,
ఉభౌ, తౌ, న, విజానీతః, న, అయమ్, హంతి, న, హన్యతే ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవరైతే | మన్యతే | = భావించునో |
| ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) | తౌ, ఉభౌ | = ఆ, ఉభయులును |
| హంతారమ్ | = చంపునట్టి దానినిగా | న, విజానీతః | = తెలిసికొనినవారు (జ్ఞానులు) కారు |
| వేత్తి | = భావించునో | అయమ్ | = ఇది (ఈ ఆత్మ వాస్తవముగా) |
| చ | = అలాగే | న, హంతి | = (ఎవ్వరినీ) చంపదు |
| యః | = ఎవరైతే | న, హన్యతే | = (ఎవ్వరిచేతను) చంపబడదు |
| ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) | | |
| హతమ్ | = చంపబడుదానినిగా | | |

**యః ఏనం హంతారం వేత్తి। యః చ ఏనం హతం మన్యతే**
**తౌ ఉభౌ న విజానీతః, అయం న హంతి న హన్యతే ॥**

తా: ఎవరైతే ఈ ఆత్మను సంహరించుదానినిగా తెలుసుకొనునో, ఇంకా ఎవరైతే ఈ ఆత్మను సంహరించబడే దానినిగా భావించునో, వారిద్దరు సరిగా తెలిసినవారు కారు. ఈ ఆత్మ సంహరించుట లేదు, సంహరించబడుట లేదు.

**ఇ)ఆత్మ అకర్తా అభోక్తా –** ఇంకో ముఖ్యమైన శ్లోకం. ఆత్మ వర్ణనే కొనసాగుతోంది. **ఆత్మ** అకర్తా, అభోక్తా. అకర్తా అంటే కర్మ చెయ్యదు; అభోక్తా అంటే కర్మఫలాన్ని అనుభవించదు. అంటే ఆకాశంలాగా ఏ వ్యవహారమూ నడపదు. ఆకాశంలో (స్పేస్) కూర్చుంటాము మనము. కాని ఆకాశం గురువూ కాదు, వినే శిష్యులూ కాదు. శిష్యులు వాడే కలమూ, పుస్తకమూ కూడా కాదు. అది ఏ కార్యక్రమంలోనూ పాలుపంచుకోదు కాని, ఆకాశం లేకుండా ఏ వ్యవహారమూ కొనసాగదు. **ఆకాశవత్.**

ఇంకొక ఉదాహరణ కాంతి. సూర్యకాంతి సమక్షంలో అనేక వ్యవహారాలు కొనసాగుతాయి. ఒక వస్తువును ఒకరు అమ్ముతారు, ఇంకొకరు కొంటారు. కాంతి అమ్మే వ్యక్తి కాదు, కొనే వ్యక్తి కాదు, అమ్మబడుతున్న వస్తువు కాదు, అమ్మటానికి వాడిన ధనం కాదు. కాంతి ఏ వ్యవహారమూ నడపనప్పుడు కాంతి ఎందుకు, అనవసరం అని కాంతిని తీసేద్దామా? కాంతి లేకపోతే వ్యవహారం నడపలేరు. **ప్రకాశవత్.**

మరొక ఉదాహరణ సినిమా తెర. తెరమీద నటీనటులను చూస్తాము, యుద్ధం జరుగుతుంది, సంగీత నృత్యాలు అవుతాయి, వాన కురుస్తుంది. ఏం జరిగినా తెర అందులో పాలుపంచుకోదు. తెర ప్రమేయం లేనప్పుడు, తెరను తీసేద్దామా? తెరను తీసేస్తే సినిమా నడవలేదు. అలాగే ఆత్మ ఏ వ్యవహారంలోనూ పాలు

పంచుకోదు. అందువల్ల ఆత్మ అకర్తా, అభోక్తా. ఈ భావనను కృష్ణపరమాత్మ ఇంకో పద్ధతిలో చెబుతున్నాడు. అంటే చుట్టూ తిరిగి చెబుతున్నాడు. ఆత్మ అకర్తా అని చెప్పాలనుకుంటున్నాడు. అంటే ఏమిటి? ఆత్మ ఏ పనీ చేయదు. ఏ పనీ అంటే ఏమిటి? ఆత్మ ఎవరినీ చంపదు. అలాగే ఆత్మ అభోక్తా అంటే, ఆత్మను ఎవరూ చంపలేరు. అంటే ఆత్మ ఎవరినీ చంపలేదు; ఆత్మను ఎవరూ చంపలేరు. ఈ భావనను చెప్పాలనుకుంటున్నాడు కృష్ణపరమాత్మ. కాని దాన్ని తనదైన శైలిలో వర్ణిస్తున్నాడు. ఆత్మ చంపుతుంది, ఆత్మ చంపబడుతుంది అని ఎవరైనా అంటే వారు పొరపాటు పడుతున్నారు. ఆత్మ చంపేది కాదు, చంపబడేది కాదు.

**య ఏనం వేత్తి హంతారమ్** – ఎవరైనా ఆత్మ చంపుతుంది అనుకుంటే, అంటే ఆత్మ కర్తా అనుకుంటే;

**యశ్చైనం హతమ్ మన్యతే** – ఎవరైనా ఆత్మ చంపబడుతుంది అనుకుంటే, అంటే ఆత్మ భోక్తా అనుకుంటే దాని అర్థం ఏమిటి?

**ఉభౌ తౌ న విజానీతః** – ఇద్దరికీ సత్యం తెలియదు. ఇద్దరూ పొరపాటు పడుతున్నారు. ఇద్దరూ తప్పు అయితే, ఏది నిజం?

**నాయం హంతి న హన్యతే** – అయమ్ ఆత్మా న హంతి – ఆత్మ ఎవరినీ చంపదు. నిజానికి ఆత్మ ఎవరినీ చంపదు అనేకన్నా, ఎవరినీ చంపలేదు అనాలి. ఆకాశం దేనినైనా నాశనం చేయగలదా? లేదు. పంచభూతాల్లో తక్కిన నాలుగూ అంటే వాయువు, అగ్ని, నీరు, పృథివీ నాశనం చేస్తాయి కాని, ఆకాశం చేయదు. అయం అంటే ఆత్మ. అదే విధంగా ఆత్మ ఎవరినీ చంపదు, చంపలేదు.

న హన్యతే – చంపబడలేదు కూడా.

ఈ అకర్తా, అభోక్తా విషయం చాలా ముఖ్యమైనది. గీతలో చెప్పబడిన ఎన్నో అంశాలకు ఆధారం ఈ శ్లోకం. ఆత్మ అకర్తా, అభోక్తా అంటే ఆత్మ కర్మ చేయదు, అందువల్ల కర్మవల్ల వచ్చే కర్మఫలాన్ని అనుభవించదు. **కర్మాపి నాస్తి, కర్మఫలమ్ అపి నాస్తి.** అందువల్ల పుణ్యపాపాలు అంటవు. సంచితకర్మ, ఆగామికర్మ, ప్రారబ్ధకర్మలు అంటవు ఆత్మకు. అందువల్ల సుఖదుఃఖాలు అంటవు. సుఖదుఃఖాలు కర్మఫలం. పుణ్యకర్మఫలం సుఖం అయితే, పాపకర్మఫలం దుఃఖం. ఆత్మకు కర్మఫలం అంటదు కాబట్టి సుఖదుఃఖాలకు అతీతం. ఆత్మకు పునర్జన్మ కూడా లేదు. ఆత్మకు పుట్టుక ఉంటే కదా, మరణం, పునర్జన్మలు ఉండేవి.

మరి అయితే మనం కర్మలు, యజ్ఞాలు, శ్రాద్ధకర్మలు, తర్పణాల గురించి ఎందుకు మాట్లాడుతున్నాము? అవన్నీ సూక్ష్మశరీరానికి చెందుతాయి. సూక్ష్మశరీరమే ఒక లోకంనుంచి ఇంకో లోకానికి ప్రయాణిస్తుంది. సూక్ష్మశరీరానికి పునర్జన్మ ఉంది. అందువల్ల శ్రాద్ధకర్మలు చేయాలి, తర్పణాలు వదలాలి. జ్ఞానికి ప్రయాణం లేదు, పునర్జన్మ లేదు. అతనికి శ్రాద్ధకర్మలు లేవు. జ్ఞానికి సమారాధన చేస్తాము. ఆరోజు ఆ మహాత్ముణ్ణి తలుచుకుంటాము, ఆయన దీవెనలు కోరుతాము. అందువల్ల ఆత్మకు పునర్జన్మ లేదు. ఈ ఉపసిద్ధాంతాలన్నిటినీ కృష్ణపరమాత్మ తరువాత చెబుతాడు.

శ్లో. 20 **న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥**
న, జాయతే, మ్రియతే, వా, కదాచిత్, న, అయమ్, భూత్వా, భవితా, వా, న, భూయః,
అజః, నిత్యః, శాశ్వతః, అయమ్, పురాణః, న, హన్యతే, హన్యమానే, శరీరే ॥

| | | | |
|---|---|---|---|
| అయమ్ | = ఇది (ఈ ఆత్మ) | అయమ్ | = ఇది (ఈ ఆత్మ) |
| కదాచిత్ | = ఏ కాలమునందైనను | అజః | = జన్మలేనిది |
| న, జాయతే | = పుట్టదు | నిత్యః | = నిత్యమైనది |
| వా | = ఇంకా | శాశ్వతః | = శాశ్వతమైనది |
| న, మ్రియతే | = మరణింపదు | పురాణః | = సనాతనమైనది |
| వా | = అలాగే | శరీరే | = శరీరము |
| భూత్వా, | = ఉత్పన్నమై, అస్తిత్వమును | హన్యమానే | = చంపబడుచున్నను |
| భూయః భవితా, న | పొందునదియు కాదు | న, హన్యతే | = (ఇది) చంపబడదు |

**అయం కదాచిత్ న జాయతే న వా మ్రియతే, (అయం)భూత్వా భూయః అభవితా వా న ।**
**అయమ్ అజః నిత్యః శాశ్వతః పురాణః, శరీరే హన్యమానే న హన్యతే ॥**

తా: ఈ ఆత్మ ఏ కాలమునందైననూ పుట్టుట లేదు. మరణించుట లేదు. ఈ ఆత్మ ఒకప్పుడు ఉండి మరల భవిష్యత్తులో ఉండబోదు అనేది లేదు. పుట్టుక లేనిది, నిత్యము, శాశ్వతము, సనాతనము అగు లక్షణమీ విధముగా ఉంది. శరీరము చంపబడుచున్నను ఆత్మ చంపబడుట లేదు.

**ఎఫ్) ఆత్మ నిర్వికారం–** ఇది ఇంకో ముఖ్యమైన శ్లోకం. వీటిలో వేదాంతబోధ వస్తుంది. ఇవన్నీ ఉపనిషత్తుల సారం. అందువల్ల ఈ శ్లోకంయొక్క ఛందస్సు కూడా మారింది. ఆత్మ నిర్వికారం. వికారం అంటే మార్పు; నిర్వికారం అంటే మార్పు లేనిది.

శరీరానికి షడ్వికారాలు, అంటే ఆరు మార్పులు, ఉన్నాయని తత్త్వబోధలో చూస్తాము. అవి అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి. అస్తి అంటే తల్లిగర్భంలో ఉండటం; జాయతే–పుట్టటం; వర్ధతే–ఎదగటం; విపరిణమతే–మార్పు చెందటం; అపక్షీయతే–కృశించి పోవటం; వినశ్యతి–మరణించటం. సుమారు ఇరవై సంవత్సరాల వరకు మనం ఎదుగుతూ వస్తాము కాని, 20–50 వరకూ జీవితం సరళరేఖలా సాగిపోతుంది. అంటే పెద్దగా మార్పు ఉండదు. తరువాత సుమారు 50 నుంచి కృశించిపోతాము. మొదట పరుగులు తీసిన మనం పెద్దవయస్సులో లేచి కూర్చోవటమే బ్రహ్మప్రళయం అవుతుంది. చివరికి మరణిస్తాము. ఈ ఆరు మార్పులూ శరీరానికి ఉంటాయి కాని ఆత్మకు కాదు. ఇదీ ఈ శ్లోకంయొక్క సారాంశం. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**న జాయతే** – ఆత్మకు పుట్టుక లేదు. పుట్టుక సూక్ష్మశరీరానికి ఉంది కాని ఆత్మకు లేదు.

**(న) మ్రియతే** – ఇక్కడ కూడా న కలుపుకోవాలి. న మ్రియతే అవుతుంది. ఆత్మకు మరణం లేదు. ఎప్పుడు?

**కదాచిత్** – ఎన్నడూ లేదు. ఎందుకు?

**అయం న భూత్వా** – ఎందుకంటే అది ఒక సమయంలో పుట్టలేదు. దానికి పుట్టుక లేదు.

**న భవితా** – అది ఒక సమయంలో మరణించదు. ఆత్మకు పుట్టుక లేనప్పుడు, మరణం కూడా లేదు. ఒక ఆరంభం లేదు, ఒక ముగింపు లేదు.

**అజః** – ఆత్మకు పుట్టుక లేదు; **నిత్యః** – ఆత్మకు మరణం లేదు.

**శాశ్వతః** – కృశించిపోదు. న అంటే నశించదు. అంటే **అపక్షీయ రహితః; పురాణః** – ఎదగదు. వృద్ధి రహితః.

ఇంతవరకూ నాలుగు వికారాలు లేవు అని వచ్చాయి. అవి – జన్మరహితః, వృద్ధిరహితః, అపక్షీయరహితః, వినాశరహితః. అంతేకాదు

**న హన్యతే హన్యమానే శరీరే** – శరీరం మరణించినా, ఆత్మ మరణించదు. శరీరానికి ఒక మంచి ఆకారం తేవాలని, ఆ ఆకారాన్ని అలాగే నిలబెట్టుకోవాలనీ చాలా తపన పడతాము. కాని ఆత్మకు ఆకారమూ లేదు, అది నశించే ప్రసక్తి లేదు. అంటే ఆత్మకు విపరిణామం కూడా లేదు. దానికి పరిణామాలు లేవు. అందువల్ల ఆత్మను నిర్వికారం అంటారు.

తమాషా ఏమిటంటే, ఆత్మ శరీరంతో అత్యంత సన్నిహితంగా ఉన్నా కూడా, శరీరానికి షడ్వికారాలు ఏర్పడినా, ఆత్మను అవి అంటవు. ఉదాహరణకు కాంతి మన శరీరంతో సన్నిహితంగా ఉన్నా కూడా, శరీరానికి ఏం జరిగినా, దాన్ని అంటిపెట్టుకుని ఉన్న కాంతికి ఏమీ అవదు.

ఇంతవరకూ ఆత్మ లక్షణాలు ఆరు చూశాము. అవి – **ఆత్మ నిత్యం, సత్యం, సర్వవ్యాపకం, అప్రమేయం, అకర్తా అభోక్తా, నిర్వికారం.** తరువాత వచ్చే శ్లోకాలు ఈ లక్షణాలనే ఇంకో రూపంలో వివరిస్తాయి.

శ్లో. 21 **వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్ ।**
**కథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కమ్ ॥**
వేద, అవినాశినమ్, నిత్యమ్, యః, ఏనమ్, అజమ్, అవ్యయమ్,
కథమ్, సః, పురుషః, పార్థ, కమ్, ఘాతయతి, హంతి, కమ్ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ | = ఓ అర్జునా! | సః | = అతడు (ఆ పురుషుడు) |
| యః, పురుషః | = ఏ పురుషుడు | కథమ్ | = ఏ విధముగా |
| ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) | కమ్ | = ఎవరిని |
| అవినాశినమ్ | = నాశరహితమైన దానినిగా | ఘాతయతి | = చంపించును |
| నిత్యమ్ | = నిత్యమైన దానినిగా | (కథమ్) | = (ఏ విధముగా) |
| అజమ్ | = జన్మలేని దానినిగా | కమ్ | = ఎవరిని |
| అవ్యయమ్ | = మార్పులేని దానినిగా | హంతి | = చంపును? |
| వేద | = తెలిసికొనునో | | |

**హే పార్థ! య ఏనమ్ అవినాశినం నిత్యమ్ అజమ్ అవ్యయం వేద।**
**సః పురుషః కథం కం ఘాతయతి, కం హంతి?**

తా: ఓ కుంతీపుత్రా! అర్జునా! వినాశము లేనిది, నిత్యము, పుట్టుక లేనిది, క్షీణించనిది అగు ఈ ఆత్మను ఎవరైతే తెలుసుకొనునో, అటువంటి వ్యక్తి ఏ విధముగా ఎవరిని చంపును? చంపించును?

**వేద** – వేద అంటే తెలుసుకోవాలి. సాధకుడు ముఖ్యంగా ఆత్మ గురించి తెలుసుకోవాలి. ఇక్కడ వేద అంటే నాలుగు వేదాలు కాదు. అక్కడ వేదం పదం నామవాచకం – వేదాలను చెబుతుంది. కాని ఇక్కడ వేద అంటే క్రియాపదం. అంటే తెలుసుకోవాలి. ఏం తెలుసుకోవాలి. ఆత్మను తెలుసుకోవాలి. ఎటువంటి ఆత్మను తెలుసుకోవాలి?

**అవినాశినం నిత్యమ్ అజమ్ అవ్యయమ్** – అవినాశినం అంటే నాశనం లేనిది. అందువల్ల అది నిత్యం లేదా శాశ్వతం. అజం అంటే జన్మ లేనిది; అవ్యయం అంటే వృద్ధాప్యం లేనిది. ఇటువంటి ఆత్మ గురించి తెలుసుకోవాలి.

ఈ నేర్చుకోవటం రెండు దశల్లో జరుగుతుంది.

**ఎ).** ఆత్మను, శరీరాన్ని విడదీసి చూడటం నేర్చుకోవాలి. ఆత్మ శరీరంలో ఒక భాగం అనుకుంటాము కాని ఆత్మ స్వతంత్రం. కాంతి ఉదాహరణ చూస్తే కాంతి చేతిమీద ఉంది; చేయి అంతా వ్యాపించి ఉంది; కాని కాంతి చేతికి భిన్నంగా ఉంది. చేయి లేకపోయినా కాంతి ఉంది. అదే విధంగా ఆత్మ శరీరంలో ఉంది; శరీరం అంతా వ్యాపించి ఉంది; కాని ఆత్మ శరీరానికి భిన్నంగా ఉంది. శరీరపతనానంతరం కూడా ఆత్మ ఉంటుంది.

**బి).** ఆత్మను, శరీరాన్ని విడదీశాక, ఈ రెండింటిలో నేనెవరో తెలుసుకోవాలి. వేదాంతానికి రాకముందు, 'నేను' శరీరం అనుకుంటాము. పైగా నిస్సందేహంగా అనుకుంటాము. నాశనమయ్యే శరీరంతో మమేకం చెందుతాము. అందువల్ల, ఇప్పుడు దేహ అభిమానాన్ని వదులుకుని, నేను ఆత్మను అని అర్థం చేసుకోవాలి. ఇది చాలా కష్టమైన పని. అర్థం చేసుకోవటం కొంచెం తేలికే కాని, అందులో నిలబడగలగటం చాలా కష్టం. దానికి నిదిధ్యాసనం చేయాలి. సముద్రంలో ఐస్‌బర్గ్ చూడటానికి భిన్నంగా ఉన్నా, అది కూడా నీరే. నీటిలోంచి పుట్టింది, నీటిలో తేలుతున్నది, ఎప్పుడో నీటిలోనే లయమయిపోతుంది. అలాగే, మనకు శరీరమనే ఐస్‌బర్గ్ ఉంది. అది కూడా ఎప్పుడో పంచభూతాల్లో లయమయిపోతుంది. **పంచభూతేభ్యః జాతం, పంచభూతేభ్యః విలీయతే.**

కాని నేను ఆత్మను, శరీరంలో ఉన్నాను, శరీరం నాశనమయినా కూడా ఉంటాను. ఈ భావనలో నిలబడటాన్ని నిదిధ్యాసనం అంటారు. పాంచభౌతికశరీరం నేను అనుకునే దశనుంచి, చైతన్య ఆత్మను నేను అని అర్థం చేసుకునే దశకు రావాలి. నేను మారుతున్న అనాత్మను కాను, మారని ఆత్మను. జడశరీరాన్ని కాను, చేతన ఆత్మను. ఈ శిక్షణను నిదిధ్యాసనం అంటారు. ఈ నిదిధ్యాసనం చేస్తే ఈ మార్పు సహజంగా, అనుకోకుండా జరుగుతుంది. నేను శరీరాన్ని అనుకోవటం ఇప్పుడెంత సహజమో, నేను ఆత్మను అని అర్థం చేసుకోవటం అప్పుడంత సహజం. దీన్ని **వేద** అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ జీర్ణించుకున్న జ్ఞానం ఉండాలి. ఎందుకు?

ఈ జ్ఞానాన్ని జీర్ణించుకోకముందు ఆత్మ కర్తా, భోక్తా అంటాను. కాని ఎప్పుడైతే ఈ జ్ఞానాన్ని జీర్ణించుకుంటానో అప్పుడే నేను అకర్తా, అభోక్తా అంటాను. ఆత్మకు వాడిన లక్షణాలన్నీ నాకు వాడతాను. ఇంతకుముందు ఆత్మకు వాడిన లక్షణాలేమిటి? ఆత్మ నిత్యం, సత్యం, సర్వవ్యాపకం, అప్రమేయం, అకర్తా, అభోక్తా, నిర్వికారం. ఇప్పుడీ లక్షణాలకు ఆత్మపదం తీసేసి నేను పదం వాడతాను. అంటే నేను నిత్యం, సత్యం, సర్వవ్యాపకం, అప్రమేయం, అకర్తా అభోక్తా, నిర్వికారం.

**పార్థ సః పురుషః కథమ్** – ఓ అర్జునా, అటువంటి వ్యక్తి ఏ కర్మనైనా ఎలా చేస్తాడు? అటువంటి వ్యక్తి అంటే ఎటువంటి వ్యక్తి? నేను ఆత్మను అని అర్థం చేసుకున్న వ్యక్తి. అటువంటి జ్ఞాని అకర్తా అవుతాడు.

కర్మ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి ప్రత్యక్ష కర్మ, ఇంకొకటి పరోక్ష కర్మ. ప్రత్యక్ష కర్మ అంటే నేను స్వయంగా చేసేది, పరోక్ష కర్మ అంటే ఇంకొకరిచేత నేను చేయించేది. రెండింటికీ కర్మఫలం ఉంటుంది. ఒక వ్యక్తి ఏదైనా దొంగిలిస్తే, అది నేరం. అదే వ్యక్తి తను దొంగిలించకుండా, వేరే ఎవరినైనా ఆ పనికి నియమించినా కూడా అది నేరమే! అందువల్ల ఆత్మ కర్త కాదు అని చెప్పటానికి కృష్ణపరమాత్మ ఈ రెండు అంశాలనూ చెబుతున్నాడు. **కర్త** అంటే ప్రత్యక్షంగా చేసేవాడు; **కారయిత** అంటే చేయించేవాడు. పనిమనిషి పని చేస్తుంటే, మీరు పని చేయరు కాని దగ్గరుండి పని చేయిస్తారు. అప్పుడు మీరు **కర్త కాదు, కారయిత**. ఆత్మ కూడా కర్త కాదు, కారయిత కాదు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**కం హంతి** – అటువంటి ఆత్మ ఎవరినన్నా ఎలా చంపగలదు?

**కం ఘాతయతి** – ఎవరినన్నా ఎలా చంపించగలదు? ఇక్కడ క్రియాపదానికి చంపటం తీసుకున్నాడు కృష్ణపరమాత్మ. ఇది యుద్ధభూమి కాబట్టి ఈ పదం సరిగ్గా సరిపోతుంది. చంపటం పదాన్ని అక్షరాలా తీసుకోకుండా, అన్ని క్రియాపదాలకూ వర్తింపజేసుకోవచ్చు. అందువల్ల, జ్ఞాని అకర్తా. అకర్తా కాబట్టి పుణ్యపాపాలు ఉండవు; పుణ్యపాపాలు ఉండవు కాబట్టి సుఖదుఃఖాలు ఉండవు; సుఖదుఃఖాలు ఉండవు కాబట్టి పునర్జన్మ ఉండదు. అతను బ్రతికి ఉండగా జీవన్ముక్తుడు, మరణించాక విదేహముక్తుడు అవుతాడు. ఇవి అకర్తాయొక్క పరిణామాలు.

శ్లో. 22 **వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ ॥**

వాసాంసి, జీర్ణాని, యథా, విహాయ, నవాని, గృహ్ణాతి, నరః, అపరాణి,
తథా, శరీరాణి, విహాయ, జీర్ణాని, అన్యాని, సంయాతి, నవాని, దేహీ ॥

| | | | |
|---|---|---|---|
| యథా | = ఏ విధముగా | నవాని | = నూతనములైన వానిని (కొత్త వస్త్రములను) |
| నరః | = మానవుడు | గృహ్ణాతి | = గ్రహించునో |
| జీర్ణాని | = చిరిగిన (పాత) | తథా | = అదే విధముగా |
| వాసాంసి | = వస్త్రములను | దేహీ | = జీవాత్మ |
| విహాయ | = త్యజించి | జీర్ణాని | = పాత |
| అపరాణి | = ఇతరములైన | | |

| | | | |
|---|---|---|---|
| శరీరాణి | = శరీరములను | నవాని | = కొత్త శరీరములను |
| విహాయ | = వీడి | సంయాతి | = పొందును |
| అన్యాని | = ఇతరములైన | | |

**యథా నరః జీర్ణాని వాసాంసి విహాయ, అపరాణి నవాని గృహ్ణాతి,**

**తథా దేహీ జీర్ణాని శరీరాణి విహాయ అన్యాని నవాని సంయాతి॥**

తా: ఏ విధముగానైతే మానవుడు చిరిగిన వస్త్రములను విడిచిపెట్టి మరొక కొత్త వస్త్రమును ధరించునో, అదేవిధముగా దేహము గల ఆత్మ శిథిలమైన దేహములను విడిచిపెట్టి మరో కొత్తవాటిని స్వీకరించును.

ఇక్కడ కృష్ణపరమాత్మ పునర్జన్మ గురించీ, మరణం గురించీ బోధిస్తున్నాడు. మనం వేసుకున్న వస్త్రాలను మార్చటంలాంటిదే మరణం, పునర్జన్మ కూడా అంటున్నాడు. వస్త్రాలు మన శరీరానికి తొడిగినవి. వస్త్రాలు వేసుకోకముందూ మనం ఉన్నాము; మన శరీరంమీద వస్త్రాలు ఉన్నప్పుడూ మనం ఉన్నాము; ఆ వస్త్రాలను తీసేశాక కూడా మనం ఉన్నాము. అందువల్ల మార్పు దేనికి వచ్చింది? మనం పైన వేసుకున్న వస్త్రాలు మారుతున్నాయి, కాని మనం మారటం లేదు. వస్త్రాలు మార్చినప్పుడల్లా నేను మారిపోయాను అనటం లేదు మనం.

ఇదే సూత్రం ఆత్మకు వర్తిస్తుంది. ఆత్మ, ఈ శరీరమనే వస్త్రాలు ధరించి వ్యవహారం నడపటానికి వస్తుంది. ఈ శరీరమనే వస్త్రాలు శిథిలమైపోతే, ఈ శరీరాన్ని వదిలి, ఇంకో కొత్త శరీరాన్ని తీసుకుంటుంది. అదే అర్థం ఇక్కడ.

**నరః జీర్ణాని వాసాంసి విహాయ** – జీర్ణమైన వస్త్రాలను ఒక వ్యక్తి త్యజించి; ఏం చేస్తాడు? బయటకు వస్త్రాలు లేకుండా వెళ్ళలేడు కాబట్టి,

**నవాని అపరాణి గృహ్ణాతి** – ఇంకో కొత్త వస్త్రాలను ధరిస్తాడు. ఎవరూ చూడకుండా, లోపలికి వెళ్ళి మార్చుకుని వస్తాడు. అదే విధంగా,

**తథా దేహీ జీర్ణాని శరీరాణి విహాయ** – జీవాత్మ, జీర్ణమైన ఈ శరీరాన్ని వదిలి;

**అన్యాని సంయాతి** – భగవంతుని గ్రీన్‌రూములోకి వెళుతుంది. అక్కడ అనేక వస్త్రాలు ఉంటాయి. బీరువా నిండా మనుష్య శరీరం, జంతు శరీరం, వాటిలో రకాలు ఉంటాయి. వాటిలో ఒక శరీరాన్ని కర్మానుసారం ధరించి మళ్ళీ వ్యవహారం నడపటానికి ప్రపంచంలో అడుగుపెడుతుంది. ఎప్పుడైతే కొత్త వ్యవహారాలు మొదలు పెడుతుందో, మళ్ళీ ఈ వృత్తం కొనసాగుతుంది. సుఖదుఃఖాలు, పుణ్యపాపాలు, పునరపి జననం, పునరపి మరణం. ఇదీ సారాంశం.

ఈ సందర్భంలో తత్త్వబోధలో చూసిన ప్రాథమిక అంశాలు కొన్ని చూడాలి. ఒక వ్యక్తిలో ఐదు అంశాలు ఉంటాయి. అవి స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం, ప్రతిబింబచైతన్యం, బింబచైతన్యం. ఒక వ్యక్తి మరణించినప్పుడు, అతని స్థూలశరీరాన్ని దహనం చేస్తారు లేదా పాతిపెడతారు. అంటే స్థూలశరీరం రాలిపోతుంది.

చివరి అంశం అయిన బింబచైతన్యం సర్వవ్యాపకం. అది శరీరం రాలినా ఉంటుంది. అది సర్వవ్యాపకం కాబట్టి దానికి ప్రయాణం లేదు. చైతన్యంయొక్క లక్షణాలలో ఐదవ లక్షణం ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి.

బింబచైతన్యం శరీరం రాలిపోయినా ఉంటుంది, కాని దాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి అది ఉన్నట్టు తెలియదు.

ఇప్పుడు మూడు అంశాలు మిగిలాయి. సూక్ష్మశరీరం, కారణశరీరం, ప్రతిబింబచైతన్యం. సూక్ష్మశరీరంలో 19 అంగాలు ఉంటాయి. అవి పంచ జ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, చత్వారి అంతఃకరణం. అంతఃకరణం అంటే మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం. మనస్సు స్వతహాగా జడమయినా కూడా దానికి ప్రతిబింబించే శక్తి ఉంది. అది ప్రతిబింబ మాధ్యమంలా పనిచేసి బింబచైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది. దీన్ని ప్రతిబింబ చైతన్యం లేదా చిదాభాస అంటారు. బింబచైతన్యాన్ని చిత్ లేదా చైతన్యం అంటారు. సూక్ష్మశరీరాన్ని అప్పుడప్పుడూ మనస్సుగా వ్యవహరిస్తారు.

ఇప్పుడు మన ప్రశ్నకు వస్తే, ఒక వ్యక్తి మరణించినప్పుడు, ఏది ప్రయాణిస్తుంది? ముందే చూసినట్టుగా, స్థూలశరీరం పడిపోతుంది; బింబ చైతన్యం సర్వవ్యాపకం కాబట్టి దానికి ప్రయాణం లేదు. ఇంక మిగిలినవి మూడు – సూక్ష్మశరీరం, కారణశరీరం, ప్రతిబింబచైతన్యం. ఈ మూడింటినీ కలిపి **జీవాత్మ** అంటారు. అంటే జీవాత్మ ప్రయాణిస్తుంది. అంటే మనస్సుతో కూడిన చిదాభాస ప్రయాణం చేస్తుంది. ఎక్కడికి ప్రయాణం చేస్తుంది? దీనికి కర్మసిద్ధాంతం చూడాలి. ఒక్కముక్కలో చెప్పాలంటే మన పునర్జన్మ ఏమిటో, ఈశ్వరుడు తనకు తోచినట్టుగా నిర్ణయించడు. ముందు చూసిన వివరణలో ఆత్మ కొత్త వస్త్రాలను ధరిస్తుంది అన్నాము. అంటే ఆత్మ తనకు తోచిన వస్త్రాలను తనంతట తాను వేసుకోలేదు. అయితే ఏది నిర్ణయిస్తుంది?

మనం చేసుకున్న కర్మ నిర్ణయిస్తుంది. మనకున్న సంచితకర్మలు, ఆగామికర్మలనుబట్టి ఈశ్వరుడు కొత్త శరీరాన్ని ఇస్తాడు. పుణ్యం చేసుకుంటే పుణ్యలోకం, పాపం చేసుకుంటే పాపలోకం, రెండూ సమానంగా చేసుకుంటే మనుష్యలోకంలో పుడతాము.

**పుణ్యేన పుణ్యం లోకం నయతి**
**పాపేన పాపముభాభ్యామేవ మనుష్యలోకమ్** – ప్రశ్న 3.7

మనం మనుష్యులుగా పుట్టాము కాబట్టి మనం పుణ్యపాపాలను సమానంగా చేశామన్నమాట. ఇంతకీ సూక్ష్మశరీరం చిదాభాసతో పాటు ప్రయాణిస్తుంది కాని సర్వవ్యాపకమైన ఆత్మకు ప్రయాణం లేదు. ఇక్కడ మనం సూక్ష్మశరీరాన్ని చూడటం లేదు, సర్వవ్యాపకమైన ఆత్మను చూస్తున్నాము. ఆత్మకు శరీరమనే తొడుగులు వచ్చి పోతున్నా ఆత్మ నిత్యం, శాశ్వతం.

ఒక చిన్న ఇంటిని పడగొట్టి, దాని స్థానంలో ఇంకో మూడంతస్తుల మేడ కడితే, అందులో ఉన్న ఆకాశం ఏమయింది? అది ఎక్కడికీ ప్రయాణం చేయదు. అక్కడే ఉంటుంది. అలాగే మనుష్యశరీరం పోయినా ఆత్మ

ఉంటుంది; గాడిద శరీరం వచ్చినా ఆత్మ ఉంటుంది. అలా కొత్త శరీరాలు వచ్చినా, పోయినా, ఆత్మ అలాగే ఉంటుంది. అందువల్ల ఆత్మకు పునర్జన్మ లేదు, పునర్మరణం లేదు.

శ్లో. 23 **నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ।**
**న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ॥**
న, ఏనమ్, ఛిందంతి, శస్త్రాణి, న, ఏనమ్, దహతి, పావకః,
న, చ, ఏనమ్, క్లేదయంతి, ఆపః, న, శోషయతి, మారుతః ॥

| | | | |
|---|---|---|---|
| ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) | ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) |
| శస్త్రాణి | = శస్త్రములు | ఆపః | = నీరు |
| న, ఛిందంతి | = ఛేదింపజాలవు | న, క్లేదయంతి | = తడుపజాలదు |
| ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) | చ | = ఇంకా |
| పావకః | = అగ్ని | మారుతః | = గాలి |
| న, దహతి | = దహింపజాలదు | న, శోషయతి | = ఎండిపోవునట్లు చేయజాలదు |

**ఏనం శస్త్రాణి న ఛిందంతి, ఏనం పావకః న దహతి ।**
**ఏనమ్ ఆపః న క్లేదయంతి (ఏనమ్) చ మారుతః న శోషయతి ॥**

తా: ఈ ఆత్మను ఆయుధములు ఛేదించలేవు. ఈ ఆత్మను అగ్ని కాల్చలేదు. ఈ ఆత్మను జలములైననూ తడుపలేవు. గాలి ఎండిపోవునట్లు చేయజాలదు.

ఆత్మ శరీరంతో సన్నిహితంగా ఉన్నా, శరీరం నాశనమయినా కూడా ఆత్మ నాశనమవదు. శరీరం ఏ విధంగా నాశనమవగలదు? పంచభూతాలలో ఆకాశం తప్ప తక్కిన నాలుగూ శరీరాన్ని బాధించగలవు. కత్తి, శస్త్రంలాంటివి పృథివీతో తయారు చేయబడతాయి. అవి శరీరాన్ని కోయగలవు; నీరు శరీరాన్ని ముంచివేయ గలదు; అగ్ని శరీరాన్ని దహించగలదు; గాలి శరీరంలోని నీటిని ఆరిపోయేటట్టు చేయగలదు. కాని ఈ నాలుగు భూతాలూ ఆత్మనేమీ చేయలేవు.

**శస్త్రాణి ఏనం న ఛిందంతి** – ఈ ఆత్మను శస్త్రాలు ఛేదింపజాలవు. శస్త్రాలు పృథివీ భూతం.

**పావకః ఏనం న దహతి** – అగ్ని ఆత్మను దహించలేదు.

**ఆపః ఏనం న క్లేదయంతి** – నీరు ఆత్మను తడుపలేదు.

**మారుతః న శోషయతి** – గాలి ఆత్మను ఆరిపోయేటట్టు చేయలేదు. ఆ విధంగా శరీరం అవస్థలకు లోనయినా కూడా, ఆత్మకు ఏమీ కాదు. ముందు చెప్పిన ఆత్మ లక్షణాలకు ఈ శ్లోకాలు వివరణలు.

శ్లో. 24 **అచ్ఛేద్యోఽ యమదాహ్యోఽ యమ్ అక్లేద్యోఽ శోష్య ఏవ చ ।**
**నిత్యః సర్వగతః స్థాణుః అచలోఽ యం సనాతనః ॥**
అచ్ఛేద్యః, అయమ్, అదాహ్యః, అయమ్, అక్లేద్యః, అశోష్యః, ఏవ, చ,
నిత్యః, సర్వగతః, స్థాణుః, అచలః, అయమ్, సనాతనః ॥

| | | | |
|---|---|---|---|
| అయమ్ | = ఇది (ఈ ఆత్మ) | అశోష్యః | = ఎండగొట్టుటకు సాధ్యపడనిది |
| అచ్ఛేద్యః | = ఛేదించుటకు సాధ్యము కానిది | అయమ్ | = ఇది (ఈ ఆత్మ) |
| అయమ్ | = ఇది | నిత్యః | = నిత్యమైనది |
| అదాహ్యః | = దహింప వీలుకానిది | సర్వగతః | = సర్వవ్యాపి |
| అక్లేద్యః | = తడుపుటకు శక్యము కానిది | అచలః | = చలింపనిది |
| చ | = ఇంకా | స్థాణుః | = స్థిరముగా ఉండునది |
| ఏవ | = నిస్సందేహముగా | సనాతనః | = సనాతనమైనది |

**అయమ్ అచ్ఛేద్యః అదాహ్యః అయమ్ అక్లేద్యః, (అయమ్) అశోష్య ఏవ చ ।**
**అయం నిత్యః సర్వగతః స్థాణుః అచలః సనాతనః ॥**

తా: ఈ ఆత్మ ఛేదించుటకు శక్యము కానిది. ఈ ఆత్మ దహించ శక్యము కానిది, తడుప శక్యము కానిది. ఎండగొట్టుటకు కూడా శక్యము కానిది. ఈ ఆత్మ నిత్యము, సర్వవ్యాపకము, స్థిరమైనది, చలనము లేనిది, అనాదియైనది.

ఈ శ్లోకంలోని మొదటిపాదం అంతకుముందు చెప్పిన అంశాలను మళ్ళీ చెబుతుంది.

**అచ్ఛేద్యః** – శస్త్రాలు ఆత్మను ఛేదింపజాలవు.

**అదాహ్యః** – అగ్ని ఆత్మను దహించలేదు.

**అక్లేద్యః** – నీరు ఆత్మను తడుపలేదు.

**అశోష్యః** – గాలి ఆత్మను ఆరిపోయేటట్టు చేయలేదు. అందువల్ల ఆత్మస్వరూపం ఏమిటి?

**నిత్యః** – నిత్యం. అంటే మనం నిత్యం. మనం కొత్తగా శాశ్వతత్వం తెచ్చుకోనవసరం లేదు. శాశ్వతత్వం మన స్వరూపం. ప్రతివారికీ ఈ భూమ్మీద శాశ్వతంగా నిలిచిపోవాలని ఉంటుంది. సశరీరంగా శాశ్వతంగా ఉండలేరు కాబట్టి, వారి పేరు చిరస్మరణీయంగా ఉండటానికి వారు శాయశక్తులా ప్రయత్నిస్తారు. అందువల్ల తమ మనవళ్ళకు వారిపేరు పెట్టాలని చూస్తారు; లేదా వారి ఫోటోలను కలకాలం ఉంచాలని కోరుకుంటారు; లేదా ఏదైనా సంస్థకు వారి పేరు నిలిచిపోయేలా దానధర్మాలు చేస్తారు.

శరీరం నాశనమయినా కూడా, ఆత్మకు మరణం లేదు. అంటే మనకు మరణం లేదు. ఒకవేళ మనకు ఆనందంగా ఉంటే, అయ్యో నేను ఆనందంగా ఉన్నాను అని ఫిర్యాదు చేస్తామా? నేను ఎందుకింత ఆనందంగా

ఉన్నానో నాకు తెలియటం లేదు, అందుకని బెంగగా ఉంది అంటామా? అదేమిటో తెలియదు; నేను పొద్దున ఆనందంగా ఉన్నాను, మధ్యాహ్నం ఆనందంగా ఉన్నాను; రాత్రి కూడా ఆనందంగా ఉన్నాను. నాకేమయింది అని వాపోతామా? లేదు. ఎందుకు? అది మన సహజస్వభావం. అందువల్లనే కొంచెం కష్టం వచ్చినా, దాన్ని తలుచుకుని, పదేపదే బాధపడతాము. దీన్నిబట్టి మనకు అర్థమయిన ప్రకృతిసూత్రం ఏమిటి? ఏదైతే అసహజమో, దాన్ని వ్యతిరేకిస్తాము.

మన శరీరంలోకి కూడా ఏదైనా కొత్తగా ప్రవేశిస్తే, దాన్ని పారద్రోలటానికి ప్రయత్నిస్తుంది శరీరం. కంటిలో నలుసు పడితే, కన్నీటి రూపంలో దాన్ని పారద్రోలుతుంది. ఏదైనా ముక్కులో దూరితే, తుమ్ములు వస్తాయి. ఏదైనా పడనిది కడుపులోకి వెళితే, వాంతుల ద్వారానో, విరోచనాల ద్వారానో బయటకు వస్తుంది. అందువల్ల కిడ్నీ మార్పిడిలాంటివి చేయటానికి ప్రత్యేకంగా చికిత్స చేయాల్సి ఉంటుంది. కాని తమాషా ఏమిటంటే తల్లి గర్భం దాలిస్తే, శరీరం సహకరిస్తుంది. ఆ గర్భస్థశిశువును పారద్రోలటానికి ప్రయత్నించదు. స్త్రీకి గర్భం రావటం సహజం. అది చిన్న ప్రకృతిసూత్రం అని చూశాము కదా! సహజమైన దాన్ని స్వీకరిస్తాము, అసహజమైన దాన్ని నిరాకరిస్తాము. మరణాన్ని అందరమూ నిరాకరిస్తాము. ఇంకొక్క రోజైనా ఎక్కువ జీవించాలనుకుంటాము. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే, మరణం నా స్వస్వరూపం కాదు, నిత్యత్వం నా స్వస్వరూపం. నేను శాశ్వతంగా ఉంటాను. నాకు కాలపరిమితి లేదు.

**సర్వగతః** – నేను శాశ్వతమే కాదు, సర్వవ్యాపకం కూడా. అంటే దేశపరిమితి లేదు. నాకు కాలపరిమితి, దేశపరిమితి లేదు. అందువల్ల,

**స్థాణుః** – మార్పులేదు. నాకు కాలపరిమితి లేదు కాబట్టి, కాలం తెచ్చే మార్పులు నాకు లేవు. నిజానికి ఈ సృష్టిలో ప్రతి ఒక్కదానికీ మార్పులు తెచ్చేది కాలమే. పాపాయిగా ఉంటే ముద్దొచ్చే మనం, వయస్సు పెరిగే కొద్దీ అందాన్ని కోల్పోతాము. రంగు తగ్గుతాము, జుట్టు తెల్లబడుతుంది, లేదా రాలిపోతుంది. నేను నిత్యం అయితే, కాలం నన్నేమీ చెయ్యలేదు, అందువల్ల నేను స్థాణువును. స్థాణువు అంటే ఎప్పుడూ ఒక్కలాగే ఉండటం. **సర్వతః తిష్ఠతి ఇతి స్థాణుః.** శివుని సహస్రనామాల్లో ఒక నామం స్థాణునాథా.

**అచలః** – కాలపరిమితి లేదు కాబట్టి నాకు మార్పులేదు; దేశపరిమితి లేదు కాబట్టి నాకు చలనం లేదు. పరిమితి ఉన్న జీవే ఒకచోటునుంచి ఇంకొక చోటుకి కదలగలదు. ఆత్మకు ప్రయాణం లేదు. మనం ఒకచోటి నుంచి ఇంకొకచోటికి వెళుతున్నాము కదా, చలనం లేదు అంటారేమిటి అంటే, చలనంలేని నేను ఎవరో తెలుసుకోవాలి. శరీరపరంగా నేను అనిత్యం, అస్థాణువు, చలనం మొదలైనవి వస్తాయి. కాని ఆత్మగా నేను వీటికి భిన్నంగా ఉన్నాను.

**సనాతనః** – ఎప్పటికీ తాజాగా ఉంటుంది. అందువల్లనే హిందూధర్మాన్ని సనాతనధర్మం అంటారు. మన గ్రంథాలలో రెండే ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. ఒకటి ధర్మం, ఇంకొకటి బ్రహ్మ. వేదపూర్వభాగం ధర్మం గురించి వర్ణిస్తే, వేద ఉత్తరభాగం బ్రహ్మ గురించి బోధ చేస్తుంది. ధర్మం గురించిన భాగాన్ని కర్మకాండ అనీ, బ్రహ్మ గురించిన భాగాన్ని వేదాంతం (జ్ఞానకాండ) అనీ అంటారు.

రెండూ నిత్యం. సర్వకాల సర్వావస్థలయందూ ధర్మసూత్రాలు వర్తిస్తాయి. అహింస ముఖ్యమైన ధర్మసూత్రం. ఏమిటా సూత్రం? నన్నెవరైనా ఏదైనా అంటే; నాకు ఎవరైనా చెడు చేస్తే, నేను బాధపడతాను కాబట్టి నేను ఎవరినీ ఏమీ అనకూడదు; నేను ఎవరికీ చెడు చేయకూడదు. అలాగే అందరూ నాతో సత్యం పలకాలనుకుంటాను. అందువల్ల నేను కూడా సత్యమే పలకాలి. సత్యం, అహింసలను ధర్మాలనీ, వాటిని సనాతనం అనీ అంటారు.

బ్రహ్మ గురించి ఏమిటి? శంకరాచార్యులవారి సమయంలో బ్రహ్మ చిన్నగా ఉండి, ఇప్పుడు పెద్దదయిందా? లేదే? బ్రహ్మలోనూ మార్పులేదు; ధర్మంలోనూ మార్పులేదు. అందువల్ల హిందూమతాన్ని సనాతనధర్మం అంటారు. ఈ ధర్మం జీవితంలో పాటించాల్సిన, మార్పులేని విలువలను బోధిస్తుంది; ఈ సృష్టిలో ఉన్న, మార్పులేని సత్యాలను బోధిస్తుంది.

అందువల్ల సనాతనం ఎప్పటికీ తాజాగా ఉంటుంది. అందువల్లనే ఇప్పటికీ గీత నేర్చుకుంటున్నాము. కాని ఫిజిక్స్, కెమిస్ట్రీలు అలాకాదు. మనం నేర్చుకున్నప్పటికీ, ఇప్పటికీ చాలా మార్పులు వచ్చాయి; సిద్ధాంతాలు మారాయి. మందులు కూడా మారిపోతున్నాయి. అందువల్ల వేదం సనాతనం.

శ్లో. 25 **అవ్యక్తోఽయమచింత్యోఽయమ్ అవికార్యోఽయముచ్యతే ।**
**తస్మాదేవం విదిత్వైనం నానుశోచితుమర్హసి ॥**

అవ్యక్తః, అయమ్, అచింత్యః, అయమ్, అవికార్యః, అయమ్, ఉచ్యతే,
తస్మాత్, ఏవమ్, విదిత్వా, ఏనమ్, న, అనుశోచితుమ్, అర్హసి ॥

అయమ్ = ఇది (ఈ ఆత్మ)
అవ్యక్తః = వ్యక్తము కానిది (ఇంద్రియ గోచరము కానిది)
అయమ్ = ఇది (ఈ ఆత్మ)
అచింత్యః = మనస్సుకు అందనిది
అయమ్ = ఇది (ఈ ఆత్మ)
అవికార్యః = మార్పులేనిది
ఉచ్యతే = (అని) చెప్పబడుచున్నది
తస్మాత్ = అందువలన ఓ అర్జునా!
ఏనమ్ = దీనిని (ఈ ఆత్మను)
ఏవమ్ = ఈ రీతిగా (ఇంతవరకు తెలుపబడినట్లుగా)
విదిత్వా = తెలుసుకొని
అనుశోచితుమ్ = శోకించుటకు
న, అర్హసి = అర్హుడవు కావు (నీవు శోకించుట ఉచితము కాదు)

**అయమ్ అవ్యక్తః అచింత్యః అవికార్యః ఉచ్యతే ।**
**తస్మాత్ ఏనమ్ ఏవం విదిత్వా (త్వం) అనుశోచితుం న అర్హసి ॥**

తా: ఈ ఆత్మ ఇంద్రియగోచరముకానిది, ఈ ఆత్మ మనసుకు అందనిది, ఈ ఆత్మ మార్పు లేనిది అని చెప్పబడుచున్నది. కావున, ఈ ఆత్మను నీవీ విధముగా తెలుసుకొనుము. నీవు శోకింప తగవు.

ఈ శ్లోకంతో ఆత్మస్వరూప వర్ణనను ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల ముందు శ్లోకాల్లో చెప్పిన భావాలను మళ్ళీ చెబుతున్నాడు.

**అవ్యక్తః అయమ్** – అవ్యక్తం అంటే ఇంద్రియాలకు అందనిది. ఇంద్రియ అగోచరం. ఐదు ఇంద్రియాలు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే అనుభవించగలవు. కాని ఆత్మ ఏమిటి?

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం**
**తథాఽరసం నిత్యమగన్ధ వచ్చయత్।** – కఠ 1.3.15

ఆత్మ శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలకు అందదు. ఈ ఐదు లక్షణాలు పంచభూతాలకు చెందినవి. ఆత్మ వస్తువు కాదు కాబట్టి, పంచభూతాలతో చెయ్యబడలేదు కాబట్టి ఆత్మను చూడలేము. అందువల్ల ఆత్మ అవ్యక్తం.

**అచింత్యః** – ఆత్మను నేను చూడలేకపోతే, ఆత్మ గురించి ఆలోచించలేను కూడా. అనుమాన ప్రమాణం కూడా ప్రత్యక్ష ప్రమాణంమీద ఆధారపడి ఉంటుంది. అనుమానప్రమాణం అంటే తర్కం. అంటే మనస్సుకు కూడా అందదు.

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః।** – కేన 1.3

ఆత్మ గురించి ఆలోచించలేము. ఎందుకంటే ఆత్మ మనస్సుకు కూడా అందదు. అయితే ఆత్మ ఏమిటి? ఆత్మ ఎన్నటికీ ఆబ్జెక్టు కాదు, ఎప్పటికీ సబ్జెక్టు.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియెన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియెన్స్‌డ్**
**ఎప్పటికీ అనుభవించే నేను అది, ఎన్నటికీ అనుభవించబడే వస్తువును కాను**

**అవికార్యః** – వికారాలు లేనిది. ఈ లక్షణాలన్నీ ముందు చూసినవే. ఆత్మకు శరీరానికుండే షడ్వికారాలు లేవు.
**అవ్యక్తం + అచింత్యం = అప్రమేయం.** అప్రమేయం పదాన్ని ముందు చూశాము.

అందువల్ల కృష్ణపరమాత్మ ముగిస్తున్నాడు. ఆత్మ గురించి తెలుసుకున్నాడు అర్జునుడు. ఏమని? భీష్ముడు ఆత్మ, ద్రోణాచార్యుడు ఆత్మ, అర్జునుడు ఆత్మ. ఆత్మను తను చంపలేదు. అందువల్ల తను దుఃఖించనవసరం లేదు.

**తస్మాత్ ఏవం విదిత్వా** – ఆత్మ గురించి స్పష్టంగా తెలుసుకున్నాక అంటే ఆత్మ చంపదు, చంపబడదు. ఏం చేయాలి?

**శోచితుం న అర్హసి** – నువ్వు దీనికోసం శోకింపకూడదు. ఎవరి మరణానికీ దుఃఖించకూడదు. దుఃఖించినంత మాత్రాన మరణించిన శరీరం తిరిగిరాదు; శాశ్వతమైన ఆత్మ మరణించదు. ఇవి సత్యాలు. సత్యాన్ని సత్యంగా తెలుసుకో! దాని గురించి శోకించి లాభం లేదు.

ఇప్పుడు కృష్ణపరమాత్మ మొట్టమొదట చెప్పిన శ్లోకానికి వెళ్ళాలి.

**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః** – పండితులైనవారు శోకించరు. ఈ విషయాన్ని నువ్వు అర్థం చేసుకుంటే, నువ్వు కూడా పండితుడివే. అలాంటప్పుడు, ఇంక దుఃఖం దేనికి? దుఃఖించటం వెర్రితనం, అజ్ఞానం, మోహం.

శ్లో. 26 **అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।**
**తథాపి త్వం మహాబాహో నైవం శోచితుమర్హసి ॥**
అథ, చ, ఏనమ్, నిత్యజాతమ్, నిత్యమ్, వా, మన్యసే, మృతమ్,
తథాపి, త్వమ్, మహాబాహో, న, ఏవమ్, శోచితుమ్, అర్హసి ॥

| | | | |
|---|---|---|---|
| మహాబాహో | = ఓ మహాబాహూ! | మృతమ్ | = మరణించునట్టిది |
| అథ, చ | = కాని ఒకవేళ | మన్యసే | = (అని) భావించినచో |
| త్వమ్ | = నీవు | తథాపి | = అవిధముగా కూడా |
| ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) | ఏవమ్ | = ఈ మాదిరిగా |
| నిత్యజాతమ్ | = సర్వదా జన్మించునట్టిది | శోచితుమ్ | = శోకించుటకు |
| వా | = అలాగే | న, అర్హసి | = అర్హుడవు కావు (శోకించుట తగదు) |
| నిత్యమ్ | = సతతము | | |

**అథ చ ఏనం నిత్యజాతం నిత్యం వా మృతం మన్యసే, ।**
**తథా అపి హే మహాబాహో! (త్వమ్) ఏవం శోచితుం న అర్హసి॥**

తా: గొప్ప బాహువులు (భుజబలము) గల ఓ అర్జునా! ఒకవేళ ఈ ఆత్మను నీవు ఎల్లవేళలా పుట్టేదానినిగా, ఎల్లవేళలా మరణించేదానినిగా తలచినా కూడా నీవు ఈ విధముగా శోకించుటకు తగవు.

26వ శ్లోకంనుంచి కృష్ణపరమాత్మ ఊహాజనితమైన వాదన చేస్తున్నాడు. ఒకవేళ అర్జునుడు వేదాంతబోధను అంగీకరించకపోతే, ఇలా ఆలోచించమంటున్నాడు. ఎందుకు? వేదాంతం ఎన్నడూ తన బోధను ఎదుటి వ్యక్తి మీద బలవంతంగా రుద్దదు. గురువు తనకు తెలిసిన విషయాన్ని శిష్యునితో పంచుకుంటాడు. శిష్యుడు అది అర్థం చేసుకుని, నమ్ముతాడు. ఒకవేళ అర్జునుడు ఆత్మ ఉంది అని నమ్మకపోతే, ఏం చేయాలో చెబుతున్నాడు. ఆత్మ అప్రమేయం అని వేదాంతం చెబుతుంది.

ఆత్మ గురించి భిన్నదార్శనికులు అనేక రకాలుగా అర్థం చేసుకుంటారు. బౌద్ధమతంలో ఆత్మ ఉంది అంటారు కాని, ఆత్మ నిత్యం కాదు అంటారు. నిత్యజాతం నిత్యం మృతమ్ అంటారు. దాన్ని క్షణిక విజ్ఞానవాదం అంటారు. ఆత్మ పుడుతుంది, మరణిస్తుంది అంటారు వారు.

చార్వాక సిద్ధాంతులు మనస్సు లేదు, బుద్ధి లేదు, ఆత్మ కూడా లేదు అంటారు. వారి సిద్ధాంతం ప్రకారం శరీరమే ఆత్మ. ఆత్మ అంటే నేను. నేను అంటే శరీరం. శరీరం కాకుండా వేరే ఏదీ లేదు అంటారు. అందువల్ల వారి దృష్టిలో మరణం తరువాత ఏమీలేదు; ప్రయాణించే మనస్సు లేదు; స్వర్గలోక, నరక లోకాలు లేవు. కర్మ, శ్రాద్ధం, పూర్వజన్మ, ఉత్తరజన్మలు ఏమీలేవు. ఆత్మ అంటే శరీరం.

ఇప్పుడు అర్జునుడు బౌద్ధమతస్థులలాగా ఆత్మ క్షణికం అనుకున్నా, చార్వాకులలాగా ఆత్మ శరీరం అనుకున్నా, అర్జునుడు తన కర్తవ్యం నిర్వహించక తప్పదు. ఎందుకు? దానికి కృష్ణపరమాత్మ కారణం చెబుతున్నాడు. దీన్ని **అభ్యుపేత్య వాదన** అంటారు. అంటే ఒక ఊహాజనిత వాదన అని చూశాము.

**అథ చ** – ఒకవేళ నువ్వు ఆత్మ గురించి ఈ విధంగా అనుకుంటే;

**ఏనం నిత్యజాతం** – అది నిత్యం పుడుతూ ఉంటుంది;

**నిత్యం వా మృతమ్** – నిత్యం మరణిస్తూ ఉంటుంది అని

**మన్యసే** – నువ్వు భావించినా కూడా!

వేదాంతం ప్రకారం ఆత్మకు చావు, పుట్టుకలు లేవు; కాని వేదాంతాన్ని నమ్మకుండా నాకు చావు, పుట్టుకలు ఉన్నాయి అనుకుంటే కూడా,

**తథాపి త్వం మహాబాహో నైవం శోచితుమర్హసి** – ఓ అర్జునా, అలా కూడా నువ్వు దీనికోసం శోకించకూడదు. ఎందుకు శోకించకూడదు? కృష్ణపరమాత్మే తరువాత వచ్చే శ్లోకంలో వివరించబోతున్నాడు.

శ్లో. 27 **జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ ।**
**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి ॥**
జాతస్య, హి, ధ్రువః, మృత్యుః, ధ్రువమ్, జన్మ, మృతస్య, చ,
తస్మాత్, అపరిహార్యే, అర్థే, న, త్వమ్, శోచితుమ్, అర్హసి ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఎందుకంటే | ధ్రువమ్ | = తప్పదు |
| జాతస్య | = పుట్టినవానికి | తస్మాత్ | = కావున |
| మృత్యుః | = మరణము | అపరిహార్యే | = తప్పింప శక్యముకాని |
| ధ్రువః | = నిశ్చయము (తప్పదు) | అర్థే | = విషయమున |
| చ | = ఇంకా | త్వమ్ | = నీవు |
| మృతస్య | = మరణించినవానికి | శోచితుమ్ | = శోకించుటకు |
| జన్మ | = పుట్టుక | న, అర్హసి | = అర్హుడవు కావు (శోకింపతగదు). |

**హి జాతస్య మృత్యుః ధ్రువః, మృతస్య చ జన్మ ధ్రువమ్ ।**
**తస్మాత్ అపరిహార్యే అర్థే త్వం శోచితుం న అర్హసి ॥**

తా: ఎందుకంటే పుట్టినవానికి మరణము తప్పదు. మరణించినవానికి కూడా పుట్టుక తప్పదు. కావున, తప్పింప శక్యముకాని ఈ (జన్మమృత్యువుల) విషయమునందు నీవు శోకింపతగదు.

ఈ శ్లోకం చాలా ముఖ్యమైన శ్లోకం. ఎందుకంటే ఇందులో కృష్ణపరమాత్మ అక్షరసత్యం చెబుతున్నాడు. జీవితంలో తప్పించుకోలేని, జరిగితీరే సత్యాన్ని చెబుతున్నాడు. జీవితంలో వేదాంతం నేర్చుకోకపోయినా, ఆత్మ ఉందని నమ్మకపోయినా, ప్రకృతి నియమాల గురించి కొంత కామన్‌సెన్స్ ఉంటే చాలు. ఏమిటా కామన్‌సెన్స్?

పుట్టిన ప్రతిదీ మరణించక తప్పదు. **పుట్టుట గిట్టుట కొరకే** అంటారు పెద్దలు. అందువల్ల మరణం తరువాత ప్రయాణించే మనస్సు ఉందని నమ్మకపోయినా, మరణం తరువాత ఆత్మ శాశ్వతంగా ఉంటుంది అని కూడా నమ్మకపోయినా, నేను శరీరాన్ని అని నమ్మినా, శరీరధర్మం ఏమిటో తెలుసుకోవాలి. శరీరానికి ఒక పుట్టినరోజు ఉంది. ఏ పని చేయాలన్నా, ఎక్కడికి వెళ్ళినా పుట్టినతేదీ అడుగుతారు. **జాతస్య హి ధ్రువో మృత్యుః** – పుట్టిన ప్రతిదీ మరణించక తప్పదు. కళ్ళు మూసుకుంటే సత్యం మారిపోదు. మీరు కళ్ళు మూసుకున్నంత మాత్రాన మీ ఎదురుగా ఉన్న ప్రపంచం చీకటిగా మారిపోదు. పుట్టినది మరణించక తప్పదు అనే సత్యాన్ని మూడు ప్రమాణాల ద్వారా నిరూపిస్తారు.

**ఎ). ప్రత్యక్ష ప్రమాణం** – పొద్దున్న లేచినప్పటినుంచి ఏ వార్తాపత్రికను తిరగేసినా, వీరు చనిపోయారు, వారు చనిపోయారనే చావు వార్తలనే మోసుకొస్తుంది అది. వారి శరీరం దేనితో చేయబడిందో, దానితోనే మీ తల్లిదండ్రుల శరీరాలు, మీ భార్యాపిల్లల శరీరాలు, ఆఖరికి మీ శరీరం కూడా చేయబడ్డాయి. అన్నీ పంచభూతాలతో చెయ్యబడ్డాయి. తక్కిన పాంచభౌతిక శరీరాలు మరణిస్తుంటే మీదీ, మీ వారిదీ కూడా ఎప్పుడో అప్పుడు మరణించక తప్పదు. ఇది ప్రత్యక్షప్రమాణం.

**బి). అనుమాన ప్రమాణం** – దేనికి ఆరంభం ఉందో, దానికి అంతం ఉందని అనుమాన ప్రమాణం చెబుతుంది.

**యత్ కృతకం తత్ అనిత్యం కృతకత్వాత్ ఘటవత్**

ఉత్పత్తి చెందిన ప్రతిదీ నశించక తప్పదు. దానికి కుండ ఉదాహరణ. ఇది అనుమాన ప్రమాణం.

**సి). శ్రుతి ప్రమాణం** – కర్మనుంచి పుట్టినదేనికైనా ముగింపు ఉంటుంది.

**తత్ యథా ఇహ కర్మచిత్ లోకః క్షీయతే ఏవమ్ ఏవ**

**అమృతః పుణ్యచిత్ లోకః అపి క్షీయతే**

శరీరం కర్మవల్ల ఏర్పడింది. కర్మ నూనెలాంటిది. ఎప్పుడైతే కర్మ అనే నూనె అయిపోతుందో, అప్పుడే శరీరం అనే దీపం కొండెక్కుతుంది. కర్మవల్ల ఏర్పడిన ఈ శరీరం మీకు గుర్తున్నా, లేకపోయినా, మీకు గుర్తుంచుకోవాలని ఉన్నా లేకపోయినా, కర్మక్షయమవగానే, శరీరం రాలిపోతుంది. అందువల్ల పుట్టిన శరీరం మరణించక తప్పదు.

మనకు ఈ సూత్రాన్ని నమ్మటానికేమీ అభ్యంతరం లేదు, కాకపోతే దీన్ని మనకూ, మన ఆత్మీయులకూ మాత్రం మనం అన్వయించటానికి ఇష్టపడము. ఎవరైనా మరణిస్తే, పెద్ద వేదాంతులలాగా మాట్లాడతాము. పుట్టినవారు మరణించక తప్పదు అంటాము. అదే మన దగ్గరివారికి వచ్చేసరికి ఏమయింది ఈ సూత్రం? ఒక సూత్రాన్ని అన్వయించటమంటే మన జీవితానికి అన్వయించుకోవటం. మన జీవితానికి అన్వయించుకోకపోతే అది ఎందుకూ పనికిరాని జ్ఞానం అవుతుంది. అందువల్ల ఈ విషయాన్ని కృష్ణపరమాత్మ నొక్కివక్కాణిస్తున్నాడు.

**జాతస్య హి ధ్రువో మృత్యుః** – ధ్రువం అంటే ఖచ్చితంగా. పుట్టినవారికి మరణం తప్పదు. రాక్షసుల కథలు ఏవన్నా తీసుకోండి. హిరణ్యకశిపుడు, రావణకుంభకర్ణులు ఎవరి కథ విన్నా వారు తీవ్రమైన తపస్సు చేసి బ్రహ్మనో, శివుడినో ప్రత్యక్షం చేసుకునేవారు. వారందరూ అడిగినది ఒకటే వరం. నాకు మృత్యువు లేకుండా

చేయి అని. భగవంతుడు అది సాధ్యం కాదు, వేరే ఏదైనా కోరుకో అనేవాడు. ఇంక వారు హిరణ్యాక్ష వరాలు కోరేవారు. నన్ను పగలు చంపకూడదు, రాత్రి చంపకూడదు; ఆయుధాలతో చంపకూడదు వగైరా. వారి కోరికల్లోని లొసుగులు పట్టుకుని, నరసింహావతారమో, రామావతారమో ఎత్తి వారిని తుదముట్టించాడు భగవంతుడు. ఈ కథలవల్ల అర్థమయింది ఏమిటి? మరణాన్ని ఎవరూ తప్పించుకోలేరు.

చివరికి అవతారాల కథలు తీసుకున్నా రాముడు, కృష్ణుడు పుట్టినరోజులు ఉన్నాయి. వారు తనువు చాలించిన రోజులు ఉన్నాయి. కాకపోతే అవతారాలకు మరణం అనము, **స్వర్గారోహణం** అంటాము. సన్యాసికి కూడా మరణం అనము, సమాధి అంటాము. పదం ఏది వేసినా, సత్యం ఒప్పుకోక తప్పదు. శరీరం ఏర్పడితే అది పోక తప్పదు. అందువల్ల జాతస్య హి ధ్రువో మృత్యుః.

**ధ్రువం జన్మ మృతస్య చ** – నాణానికి రెండవ వైపు ఇది. జీవునికి మరణం ముగింపు కాదు. ఇది ఒక్క హిందూ మతంలోనే చూస్తాము. తక్కిన మతాల్లో పునర్జన్మ ప్రసక్తి లేదు. మరణం తరువాత ఆ జీవి శాశ్వతంగా స్వర్గానికో, శాశ్వతంగా నరకానికో వెళతాడు అంటారు.

కాని హిందూమతంలో మరణం శాశ్వత ముగింపు కాదు. ఈ జీవికి పునర్జన్మ ఉంటుంది. దేహాంతర ప్రాప్తి నాలుగవ దశగా చూశాము. అందువల్ల ఒక జీవి ఉరిశిక్షను పొందినా, ఆ జీవికి పాపం కొంతమేరకు క్షయమవుతుంది. వచ్చే జన్మలో మెరుగ్గా పుట్టవచ్చు. అందువల్ల మరణించాక ప్రతివ్యక్తీ పుట్టక తప్పదు. దీన్ని పునరపి జననం, పునరపి మరణం వృత్తం అంటారు.

అందువల్ల మనం జీవితంలో నేర్చుకోవాల్సిన మొట్టమొదటి పాఠం ఏమిటి? స్థూలశరీరం ఉన్న జీవికి చావు, పుట్టుకలు తప్పవు. ఎప్పుడైతే ఈ సత్యాన్ని గ్రహిస్తామో, అప్పుడే దీనిని తప్పించుకోవటానికి ప్రయత్నించము. తప్పించుకోవటానికి ప్రయత్నిస్తే దుఃఖం తప్పదు.

**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి** – చాలా చాలా ముఖ్యమైన వాక్యం. అపరిహార్యేఽర్థే – అంటే తప్పించుకోలేని పరిస్థితి. పరిష్కారం లేని పరిస్థితి. మనకు ఎన్నుకునే అవకాశం లేని పరిస్థితి. అంటే మనం ఎంత ప్రయత్నం చేసినా, ఫ్రీవిల్ (పురుషబుద్ధి)ని ఉపయోగించినా, మన జ్ఞానం అంతా రంగరించి పోసినా, ఆ భగవంతుని కృపకోసం ఎన్ని ప్రార్థనలు చేసినా, కొన్ని పరిస్థితులను ఎన్నటికీ మార్చలేము. అన్ని పరిస్థితులనూ మార్చలేము అనటం లేదు, కాని కొన్ని పరిస్థితులను మనం మార్చలేము. అలా మార్చలేని పరిస్థితుల్లో ఏం చేయాలి? సర్వస్య శరణాగతి చూపాలి.

**నీకు మార్చే శక్తి లేని పరిస్థితులను నువ్వు స్వీకరించు** – ఇది గీత బోధించే ముఖ్యమైన సత్యాల్లో ఒకటి. **యాక్సెప్ట్ అండ్ ఎకామడేట్ (Accept and Accommodate)** అంటారు దీన్ని. స్వీకరించాలి అంటే సణుగుతూ, గొణుగుతూ, ఏడుస్తూ, తక్కినవారిని ఏడిపిస్తూ కాదు. చిరునవ్వుతో స్వీకరించాలి; పరిపక్వత చెందిన మనస్సుతో స్వీకరించాలి; ఫిర్యాదు చెయ్యకుండా స్వీకరించాలి; ప్రపంచంమీద ద్వేషం పెంచుకోకుండా, విసుగు చూపించకుండా స్వీకరించాలి. అలా స్వీకరించలేకపోతే అందరిమీదా కోపం వస్తుంది. ఆఖరికి భగవంతుణ్ణి కూడా వదలము. ఆయనను కూడా ద్వేషిస్తాము.

అంతా విని, నాకు ఇటువంటి పరిస్థితిని స్వీకరించాలనే ఉంది కాని, స్వీకరించలేకపోతున్నాను, ఏం చేయాలి అంటారు కొందరు. దానికి ఒకటే మార్గం ఉంది – మీరు స్వీకరించినా, స్వీకరించకపోయినా, పరిస్థితి ఏమీ మారదు. అందువల్ల మీరు స్వీకరించటానికి సిద్ధంగా లేకపోతే, మీ మనస్సును సిద్ధం చేసుకోండి. ఈ విషయాన్ని మీ మనస్సులోకి జీర్ణించుకునేటంతవరకూ దానిమీద ధ్యానం చెయ్యండి. అంతేకాదు, ఈ సత్యాన్ని జీర్ణించుకునే శక్తిని నాకు ఇవ్వమని భగవంతుణ్ణి వేడుకోండి. భగవంతుడు ఎవరో కాదు, మీ ఉన్నత శక్తి, మీ పరాప్రకృతి. భగవంతునికి ప్రార్థన చేయటం ద్వారా మీ అంతర్గత శక్తిని మేలుకొల్పిన వారవుతారు. అందువల్ల జ్ఞానంతో, శరణాగతితో మీ మనస్సును దృఢపరుచుకుని, మీకు ఎన్నుకునే అవకాశంలేని పరిస్థితులను ఎదుర్కొనే మనోధైర్యం పెంపొందించుకోండి.

మన జీవితాన్ని సరిగ్గా విశ్లేషిస్తే మన జీవితంలో మనం ఎన్నుకునే పరిస్థితులకన్నా (Choiceful situations) మనం ఎన్నుకోలేని పరిస్థితులే (Choiceless situations) ఎక్కువ ఉంటాయి. జరిగిపోయిన గతం ఎన్నుకోలేని పరిస్థితి. నేను చేసిన పొరపాట్లను సరిదిద్దుకోలేను. నా పుట్టుక, నేను పుట్టినతేదీ, పుట్టిన ఊరు, నా చదువు, నా కుటుంబం, నా భార్య, నా పిల్లలు – వేటినీ నేను మార్చలేను. నా తల్లిదండ్రులు ఇద్దరూనో, ఏ ఒక్కరో నా చిన్నప్పుడే మరణించి ఉండవచ్చు. ఇద్దరూ ఉన్నా, నేను ఏ హాస్టల్లోనో, వారి ప్రేమకు దూరంగా పెరిగి ఉండవచ్చు. వారు నన్ను ప్రేమగా చూసినా, చూడకపోయినా; వారిలో వారు దెబ్బలాడుకుంటున్నా కూడా నా మనస్సు బెదిరి ఉండవచ్చు. ఇవన్నీ జరిగిపోయిన అంశాలు. వీటిలో ఏ ఒక్కదాన్నీ నేను మార్చలేను. నేను గతాన్ని ఉన్నదున్నట్లుగా స్వీకరించాలి. వీటివల్ల నా మనస్సు దెబ్బతిని ఉంటుంది. ఆ దెబ్బతిన్న మనస్సును కొంతమేరకన్నా సరిచేసుకోవటానికి నేను ప్రయత్నించగలను కాని, సంఘటనలను మార్చలేను. అందువల్ల నా జీవితంలో ఒకవంతు పోయింది. భూత, భవిష్యత్, వర్తమానకాలాలను మూడుగా చూస్తే మూడింటిలో ఒకవంతు పోయింది. అంటే 3 లోంచి 1/3 పోయింది.

మరి వర్తమానం సంగతేమిటి? వర్తమానం కూడా మీ చేతిలో లేదు. వర్తమానం కూడా జరుగుతున్నది. మీరు ఈ పుస్తకం చదువుతున్నారు. ఈ సత్యాన్ని మార్చలేరు, ఎందుకంటే ఇప్పటికే జరుగుతున్న విషయం అది. ఇంకా ముందు పుటలు చదువుతారా లేదా అన్నది మీ ఇష్టం. కాని ఇప్పుడు, ఇది చదువుతున్నారు. ఇది మార్చలేని అంశం. అందువల్ల వర్తమానం కూడా మన చేతిలో లేదు. అంటే 2/3 పోయింది. మన పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడండి. ఉన్న మూడుభాగాల్లో రెండు పోయాయి.

ఇంక మిగిలిందేమిటి? భవిష్యత్తు. భవిష్యత్తులో ఎన్ని విషయాలలో మనకు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది? చాలా తక్కువ విషయాల్లో! మనకు వయస్సు తరుగుతోందని మనకు అనిపించినా, మనకు ఇష్టమున్నా లేకపోయినా వృద్ధాప్యం, మరణం, విడిపోవటం జరిగిపోతూనే ఉంటాయి. వాతావరణాన్ని కాని, మనుష్యులను కాని మనం మార్చలేము. అందువల్ల భవిష్యత్తులో అనేక అంశాలమీద మనకు నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. అంటే **గతం మన చేతిలో లేదు, వర్తమానం మన చేతిలో లేదు, భవిష్యత్తులో అధికశాతం మన చేతిలో లేదు.** మరి ఏది మన చేతిలో ఉంది? భవిష్యత్తులోని కొంతభాగంలో ఉంది.

రాత్రి తినాలా, వద్దా అనేది మన చేతిలో ఉంది. అందులోనూ మనకు ఏంపెడితే అది తినాలి. అది మన చేతిలో లేదు కాని కొన్ని విషయాలలో అంటే తినాలా, వద్దా, తింటే ఎంత తినాలి అనే విషయాలలో మనం నిర్ణయించుకోవచ్చు. అందువల్ల ఛాయిస్ ఉన్న సందర్భాలు చాలా తక్కువ ఉంటాయి. ఛాయిస్ లేని సందర్భాలు ఎక్కువ ఉంటాయి. అందువల్ల మనం జీవితంలో నేర్చుకోవాల్సిన మొట్టమొదటి పాఠం ఛాయిస్ లేని సందర్భాలను నిండు మనస్సుతో స్వీకరించటం.

కొన్ని సందర్భాలను మనం మార్చగలము. భగవంతుడు మనకు ఫ్రీవిల్ ఇచ్చాడు. కొన్ని సందర్భాలలో మన తలరాతను కూడా మార్చగలము. పురాణాలలో సావిత్రి కథ, మార్కండేయుని కథలు దీనికి ఉదాహరణలు. మన తలరాతను మార్చగలమా? ఈ ప్రశ్న తరచూ ఉదయిస్తూ ఉంటుంది. దీనికి జవాబు చెప్పేముందు, ఇంకో ప్రశ్నకు జవాబు చూడాల్సి ఉంది. మీరు ఒక డాక్టరు దగ్గరకు వెళ్ళి, 'నాకు కొంత అనారోగ్యం వచ్చింది, నాకు నయమవుతుందా లేదా?' అని అడిగారనుకోండి, డాక్టరు వెంటనే, 'నిక్షేపంలా నయమవుతుంది,' అని హామీ ఇస్తాడా? ఇవ్వడు. 'ముందు మీ అనారోగ్యం ఏమిటో చెప్పండి? అప్పుడు చెబుతాను,' అంటాడు. మీ అనారోగ్య లక్షణాలు విన్నాక, దానికి తగ్గట్టుగా జవాబు చెపుతాడు. కొన్ని రోగాలు తీవ్రరూపం దాల్చవు. వాటికి చిన్న ఆపరేషను చేస్తే జీవితాంతం ఇంక ఆనందంగా ఉండవచ్చు. మరికొన్ని రోగాలు తీసుకుంటే, వాటికి వైద్యం లేదు, కాని జీవితాంతం మందులు వేసుకుంటూ, కొన్ని ఆహారనియమాలు పాటిస్తూ ఉంటే, అవి ఏమీ హాని చేయవు. కొన్ని ముదురు రోగాలు ఉంటాయి. వాటిని నయం చేసే దశ దాటిపోతుంది. అప్పుడు డాక్టరు చేతులెత్తేస్తాడు. దానికి వైద్యం లేదు, నువ్వు ఆరునెలలు, ఎనిమిది నెలల కన్నా ఎక్కువ బ్రతకవు. ఆ సమయంలో దైవప్రార్థన చేసుకో అంటాడు. అంటే రోగతీవ్రతనుబట్టి దానికి పూర్తి చికిత్స ఉంది, కొంత వైద్యం ఉంది, అసలు వైద్యం లేదు.

ఇదే సూత్రం మన తలరాతకు కూడా వర్తిస్తుంది. కొన్ని సందర్భాలలో ప్రాయశ్చిత్త కర్మలు, ప్రార్థనలను చేయటం ద్వారా మన తలరాతను మార్చగలం; కొన్ని సందర్భాలలో తలరాతను మార్చలేము కాని కొంత మేరకు తగ్గించుకోగలము; కొన్ని సందర్భాలలో ఏమీ చేయలేము. కాకపోతే, వచ్చిన చిక్కేమిటంటే మన తలరాత ఏ స్థాయిలో ఉందో మనకు తెలియదు. అందువల్ల దానికి పరిష్కారం ఉందనుకుని, తదనుగుణంగా ప్రవర్తించాలి. ఒకవేళ పరిష్కారం ఉన్నా కూడా, అది రాత్రికి రాత్రి కుదరదు. ఒక తలనొప్పి లేదా కడుపునొప్పిలాంటిది తగ్గటానికే మూడునుంచి ఆరు నెలలు పట్టవచ్చు. అంతవరకూ పరిస్థితి మన చేతిలో లేదు. అందువల్ల మందు వేసుకుంటూ ఉండాలి. అది నయమయ్యేవరకూ దాన్ని చిరునవ్వుతో స్వీకరించాలి. అందువల్ల జీవితంలో పాటించాల్సిన ముఖ్యమైన దృక్పథం మన చేతిలో లేని సమస్యను చిరునవ్వుతో స్వీకరించటం.

అందువల్ల కృష్ణపరమాత్మ చెబుతున్నాడు: అపరిహార్యేఽర్థే – నీ చేతిలో లేని పరిస్థితుల విషయంలో, అంటే సత్యం విషయంలో; త్వం శోచితుం న అర్హసి – నీకు శోకించే అర్హత లేదు. ఛాయిస్ ఉందా, అక్కడ కర్మ చేయి; ఛాయిస్ లేదా, దాన్ని స్వీకరించు. అందువల్ల, నీ జీవితం కర్తా, భోక్తల సమ్మేళనం.

నువ్వు దుఃఖించటానికి ఆస్కారం ఏది? నువ్వు కర్తగా ఏదైనా చేస్తావు, లేదా భోక్తగా ఏదైనా స్వీకరిస్తావు. అయితే కర్త లేదా భోక్త. నా భర్తతో నాకు సమస్య, అతను బొత్తిగా మారటం లేదు అంటారు కొందరు. ఆ భర్తను పిలిచి మంచి చెపితే అతను ఏమంటాడు? నా భార్యతో సమస్య, ఆమె బొత్తిగా మారటం లేదు అని అతను అంటాడు. అందువల్ల వారికి ఏం చెప్పగలము? ఇద్దరికీ ఒకరిని ఒకరు స్వీకరించటం నేర్చుకోండి అని తప్ప ఏమీ చెప్పలేము. యాక్సెప్ట్ అండ్ ఎకామడేట్ (Accept and Accommodate). ఇది ఒక్కటే మార్గం. **న త్వం శోచితుమ్ అర్హసి.**

శ్లో. 28 **అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।**
**అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥**
అవ్యక్తాదీని, భూతాని, వ్యక్తమధ్యాని, భారత,
అవ్యక్తనిధనాని, ఏవ, తత్ర, కా, పరిదేవనా ॥

భారత = ఓ భారతా! (ఓ అర్జునా!)
భూతాని = ప్రాణులన్ని
అవ్యక్తాదీని = పుట్టుటకు ముందు అవ్యక్తములు
అవ్యక్తనిధనాని, ఏవ = మరణించిన పిమ్మట గూడ అవ్యక్తములే
వ్యక్తమధ్యాని = జననమరణముల మధ్యకాలములో మాత్రమే ప్రకటితములు (ఇంద్రియ గోచరములు)
తత్ర = ఇటువంటి స్థితియందు
కా, పరిదేవనా = శోకించుట ఎందుకు?

**హే భారత! భూతాని అవ్యక్త–ఆదీని వ్యక్త–మధ్యాని అవ్యక్త–నిధనాని ఏవ, తత్ర పరిదేవనా కా?**

తా: భరతవంశీయుడవగు ఓ అర్జునా! ప్రాణులు జన్మకు ముందు ఎలా ఉన్నారో తెలియదు. వాటి మధ్యభాగము ఈ జన్మ కనబడుచున్నది. మరణము తరువాత అవి ఏమగునో తెలియనే తెలియదు. వాటి విషయమై శోకించుట ఎందుకు?

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ చావు, పుట్టుకల వైనం వివరిస్తున్నాడు. చావు, పుట్టుకల తీరుతెన్నులు అర్థమయితే, మనమీద వాటి ప్రభావం బాగా తగ్గుతుంది. నిజానికి అజ్ఞానంవల్ల చాలా సమస్యలు ఏర్పడతాయి. ఎవరో అన్నారు, 'అజ్ఞానం అనే చీకటిగదిలో నెగెటివ్‌లు డెవలప్ అవుతాయి.' అది అక్షరాలా నిజం! మన మనస్సు తమస్సుతో అంటే చీకటితో నిండి ఉంది. ఆ చీకటిలో రాగద్వేషాలు, కామక్రోధాలు, లోభమోహాలు పెరుగుతున్నాయి. అందువల్ల అర్జునా, జననమరణాల వృత్తం గురించి తెలుసుకో. అప్పుడు నీ భయం పోతుంది లేదా కనీసం తక్కువవుతుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

జనన మరణాలు అంటే ఏమిటి? నిజానికి, జగత్తులో ఏదీ కొత్తగా పుట్టదు, ఏదీ నాశనమవదు. విజ్ఞానశాస్త్రం ప్రకారం కూడా ఏదీ కొత్తగా పుట్టదు, ఏదీ కొత్తగా నాశనమవదు. భగవంతుడు కూడా ఏమీ కొత్తగా సృష్టించడు. భగవంతుడు సర్వశక్తివంతుడు కదా అనవచ్చు. సర్వశక్తివంతుడు అంటే సాధ్యమైన ప్రతిదీ చెయ్యగలిగిన సమర్థవంతుడు అని అర్థం. ద్రవ్యాన్ని కొత్తగా సృష్టించలేరు.

మరి అయితే జనన, మరణాలు అంటే ఏమిటి? ఒక రూపంనుంచి ఇంకొక రూపానికి మారటం. ఒక కోణంలో చూస్తే పుట్టుక, ఇంకొక కోణంలో చూస్తే చావు. రేపు అనేరోజు పుడితే, ఇవాళ అనేరోజు మరణిస్తుంది. నీరు ఆవిరి అయితే, నీరు మరణించింది, ఆవిరి పుట్టింది. అంటే ఒక రూపంనుంచి ఇంకో రూపానికి మారుతున్నది. శరీరం పుట్టకముందు అవ్యక్తంలో ఉంది, పుట్టాక వ్యక్తంలోకి వచ్చింది.

**భూతాని అవ్యక్తాదీని** – ప్రాణులన్నీ పుట్టుటకు ముందు అవ్యక్తంగా ఉన్నాయి. ప్రాణులన్నీ సృష్టికి ముందు కూడా ఉన్నాయి. కాని అవ్యక్తరూపంలో ఉన్నాయి. విజ్ఞానశాస్త్రంలో శక్తిరూపంలో ఉన్నాయి అంటే వేదాంతశాస్త్రంలో ప్రకృతిరూపంలో ఉన్నాయి అంటారు. ప్రకృతినే మాయ అనీ, శక్తి అనీ, అవ్యక్తం అనీ అంటారు.

**వ్యక్తమధ్యాని భారత** – ఓ అర్జునా, కాలక్రమేణా అవి వ్యక్తమవుతాయి. అంటే సకల ప్రాణులలాగా జన్మ పొందాయి. అలా పుట్టినవి కొన్ని సంవత్సరాలు ఉంటాయి. దాని తరువాత?

**అవ్యక్తనిధనాన్యేవ** – మళ్ళీ అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయి అంటే మరణిస్తాయి. అందువల్ల అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి రావటం జన్మ . వ్యక్తంలోంచి అవ్యక్తంలోకి వెళ్ళిపోవటం మరణం. రెండు భిన్ననామాలు వాడుతున్నాము కాని ఉన్నది ఒకటే వస్తువు. భూతాని అంటే సమస్త ప్రాణులు. అంటే అవి ముందు అవ్యక్తంగా ఉండి, మధ్యలో వ్యక్తమయి, మళ్ళీ అవ్యక్తంలోకి వెళ్ళిపోతున్నాయి. మనం పుట్టక ముందు మనమేమిటో మనకు తెలియదు! మనం మరణించాక ఏమవుతామో తెలియదు! రెండు పెద్ద తెలియని విషయాల మధ్య, ఒక తెలిసిన ఉనికి, తాత్కాలికంగా ఉంది. ఈ ఉనికిని జీవితం అంటున్నారు.

**తత్ర కా పరిదేవనా** – అందువల్ల వాటి గురించి పరితపించి ఏమిటి లాభం? అంటే వాటి గురించి పరితపించుట నిష్ప్రయోజనం.

శ్లో. 29 **ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్ ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః ।**
**ఆశ్చర్య వచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥**
ఆశ్చర్యవత్, పశ్యతి, కశ్చిత్, ఏనమ్, ఆశ్చర్యవత్, వదతి, తథా, ఏవ, చ, అన్యః,
ఆశ్చర్యవత్, చ, ఏనమ్, అన్యః, శృణోతి, శ్రుత్వా, అపి, ఏనమ్, వేద, న, చ, ఏవ, కశ్చిత్ ॥

| | | | |
|---|---|---|---|
| కశ్చిత్ | = ఎవరో ఒక మహాపురుషుడు | అన్యః | = మరియొక మహాపురుషుడు |
| ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) | ఆశ్చర్యవత్ | = (దీని తత్త్వమును) ఆశ్చర్యకరముగా |
| ఆశ్చర్యవత్ | = ఆశ్చర్యమైనదానినిగా | వదతి | = చెప్పును (వర్ణించును) |
| పశ్యతి | = చూచును | చ | = అలాగే |
| చ | = ఇంకా | అనః | = మరియొకరు (యోగ్యుడైనవాడే) |
| తథా, ఏవ | = అలాగే | ఏనమ్ | = దీనిని (ఈ ఆత్మను) |

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆశ్చర్యవత్ | = | ఆశ్చర్యముగా | శ్రుత్వా, అపి | = | విన్నప్పటికిని |
| శృణోతి | = | వినును | ఏనమ్ | = | దీనిని (ఆత్మను) |
| చ | = | ఇంకా | న, ఏవ, వేద | = | తెలిసికొనజాలడు |
| కశ్చిత్ | = | ఇంకొకరు | | | |

**కశ్చిత్ ఏనమ్ ఆశ్చర్యవత్ పశ్యతి। తథా ఏవ చ అన్యః ఏనమ్ ఆశ్చర్యవత్ వదతి।**
**ఆశ్చర్యవత్ అన్యః చ ఏనం శృణోతి। శ్రుత్వాపి చ కశ్చిత్ ఏవ న వేద॥**

తా: ఒకరు ఈ ఆత్మను ఆశ్చర్యమైనదానిగా భావించుచున్నాడు. మరియొకరు ఈ ఆత్మను ఆశ్చర్యంగా వర్ణిస్తున్నాడు. ఇంకొకరు ఈ ఆత్మను గురించి ఆశ్చర్యంగా వింటున్నాడు. ఇంకొకరు ఈ ఆత్మను గురించి వినికూడా ఏమాత్రము తెలియకున్నాడు.

12వ శ్లోకంనుంచి ఇప్పటివరకూ ఆత్మ స్వరూపాన్ని వివరించాడు కృష్ణపరమాత్మ. ఆత్మ అంటే ఏమిటో, అనాత్మ అంటే ఏమిటో, ఆత్మ అనాత్మలను ఎలా విడదీయాలో చెప్పాడు. అనాత్మ అంటే కార్యకరణసంఘాతమైన మనశ్శరీరాలు. ఆత్మ అనాత్మలు ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్నాయి. వాటిని బుద్ధితో విడదీయాలి. నేను అనాత్మ కాదు, ఆత్మను. అనాత్మ మిథ్య; నేను ఈ మిథ్యా అనాత్మకు భిన్నంగా ఉన్నాను అని తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం. దీన్ని జ్ఞానయోగం అంటారు లేదా సాంఖ్యయోగం అంటారు. అందువల్లనే ఈ అధ్యాయానికి **సాంఖ్యయోగం** అని పేరు.

ఈ చర్చను 29, 30 శ్లోకాలలో ముగించబోతున్నాడు కృష్ణపరమాత్మ. అర్జునుని విషాదాన్ని పారద్రోలటానికి ఆత్మజ్ఞానబోధను మొదలుపెట్టాడు కృష్ణపరమాత్మ. ఎందుకు? వేదాంతం ప్రకారం ఆత్మజ్ఞానం ఒకటే దుఃఖాన్ని శాశ్వతంగా పోగొట్టగలదు. వేరే ఏ పద్ధతిని ఉపయోగించినా, అది దుఃఖాన్ని తాత్కాలికంగా తగ్గించగలదు. అది కూడా కొంతమేరకే తగ్గించగలదు. కాని ఆత్మజ్ఞానం పొందితే ఆత్యంతిక దుఃఖనివృత్తి కలుగుతుంది. అందువల్ల కృష్ణపరమాత్మ ఆత్మజ్ఞానాన్ని శోకనివృత్తికి వాడాడు.

ఈ శ్లోకంలో ఈ జ్ఞానంయొక్క గొప్పతనం గురించి వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఆత్మజ్ఞాన మహిమ, ఆత్మజ్ఞాన విభూతి లేదా ఆత్మజ్ఞాన మహాత్మ్యం ఏమిటి? ఎన్నో మహిమలు ఉన్నాయి కాని ఇక్కడ కృష్ణపరమాత్మ దీన్ని అత్యంత ఆశ్చర్యకరమైన విషయంగా వర్ణిస్తున్నాడు. ఎందుకు ఆశ్చర్యంగా వర్ణిస్తున్నాడు?

**ఎ).** తెలిసో తెలియకో, ప్రతి ఒక్కరూ జీవితంలో కొన్ని ప్రాథమిక లక్ష్యాలకోసం పాటుపడతారు. చూడటానికి ఆ లక్ష్యాలు భిన్నంగా ఉండవచ్చు, కాని వాటి ఉద్దేశ్యం ఒకటే. పూర్ణత్వంకోసం పాటుపడతారు. పూర్ణత్వం డబ్బువల్ల వస్తుందని ఒకరనుకుంటే, లౌకికజ్ఞానంవల్ల వస్తుందని ఇంకొకరు, ఉద్యోగంవల్ల వస్తుందని మరొకరు అనుకుంటారు, అంతే తేడా.

**బి).** అందరూ కోరుకునే ఇంకొక లక్ష్యం భద్రత. డబ్బు లేకపోతే ఒక రకమైన అభద్రతా భావన; డబ్బు ఉంటే ఇంకొక రకమైన అభద్రతా భావన. దేనికి అభద్రతా భావన అన్నది మారుతుంది కాని అభద్రతా భావన మాత్రం మారదు.

**సి).** అందరూ కోరుకునే మరొక లక్ష్యం ఆనందం.

ఆ విధంగా అందరూ కోరుకునే లక్ష్యాలు – పూర్ణత్వం, భద్రత, ఆనందం. వేదాంతం ప్రకారం ఈ మూడు లక్ష్యాలనూ ఒక పదంతో సూచించవచ్చు. అది ఆత్మ లేదా బ్రహ్మ. నిజానికి ఆత్మ అంటే పూర్ణత్వం; ఆత్మ అంటే భద్రత; ఆత్మ అంటే ఆనందం. అందువల్ల ఎవరైనా తెలిసో తెలియకో వెతికేది ఏమిటి అంటే ఆత్మనే. కాని నువ్వు ఆత్మను వెతుకుతున్నావా అంటే అతను లేదు, అనవచ్చు. కాని పూర్ణత్వాన్ని వెతుకుతున్నావా అంటే అవునంటాడు. అప్పుడు మనం చెబుతాము – నువ్వు వెతికే పూర్ణత్వం, భద్రత, ఆనందం వేరే ఏవో కాదు అది ఆత్మ అని. అందరూ వెతికేది ఏమిటి? **ఆత్మనే.**

ఆ వెతకటంలో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటి? అందరూ వెతికే ఆత్మ ఎక్కడో లేదు. అది వెతుకుతున్న వ్యక్తి స్వరూపమే. ఆత్మ వెతకబడుతున్న ఆబ్జెక్టు కాదు; వెతుకుతున్న నేనే ఆత్మను. ఆత్మ అంటే అర్థం నేను. ఆత్మజ్ఞానం అంటే నా గురించిన జ్ఞానం. అందులో గొప్ప ఆశ్చర్యకరమైన విషయం ఏమిటి? ప్రతి ఒక్కరు తమకు తెలియకుండానే, తమ గురించే వెతుకుతున్నారు.

తమ గురించే వెతుకుతున్నామని తెలియక, ప్రపంచం అంతటా వెతుకుతారు. అనేక వ్యాపారాలు చేస్తారు; అనేక విషయాలు నేర్చుకుంటారు; అనేక విజయాలు సాధిస్తారు; కాని ఈ తాపత్రయం అంతా తమను గురించి తెలుసుకోవటానికే అని తెలియక చేస్తారు. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే శాంతి, భద్రత, ఆనందం బాహ్యవస్తువుల్లో ఉందనుకుని వెంపర్లాడుతారు కాని తామే శాంతి, భద్రత, ఆనందాలకు ప్రతిరూపమని తెలుసుకోరు.

దీనికి ఈ ఉదాహరణ చెబుతారు ఎప్పుడూ. ఒకసారి ఒక ధనవంతుడు రైలులో దూరప్రయాణం చేస్తున్నాడు. అతని దగ్గర బోలెడు ధనం ఉంది. రోజూ దాన్ని తీసి, లెక్క పెట్టుకుని, మళ్ళీ దాచేసేవాడు. అతనితో పాటు ఒక గజదొంగ కూడా ప్రయాణం చేస్తున్నాడు. వారి సుదీర్ఘప్రయాణం ముగిసేలోపు ఎలాగైనా ఆ డబ్బుని కాజేయాలని దొంగ ఆలోచన. ప్రతిరాత్రీ, ఆ ధనవంతుడు నిద్రపోయాక, అతని జేబుల్లో, అతని దిండు క్రింద, అతని పెట్టెలో, అంతా వెతికేవాడు కాని ఎక్కడా డబ్బు దొరికేది కాదు. మళ్ళీ మర్నాడు పొద్దున్నే చూస్తే, ఆ ధనవంతుడు తీరిగ్గా తన డబ్బు లెక్క పెట్టుకునేవాడు. ఇదెక్కడి చోద్యం? ఈ దొంగగారికి ఎంతకీ విషయం కొరుకుడు పడలేదు. అలా మూడురోజులు జరిగింది.

నాలుగవరోజు, ఇంక ఉండబట్టలేక ముఖాముఖి ఆ ధనవంతుణ్ణే అడిగేశాడు. 'అంత గజదొంగనైన నాకే మీ డబ్బు దొరకలేదు. ఎక్కడ దాచేవారో దయచేసి చెప్పండి,' అన్నాడు. ధనవంతుడు నవ్వి, 'నువ్వు ఎన్నటికీ వెతకనిచోట పెట్టాను,' అన్నాడు. ఏమిటా చోటు? దొంగ దిండు క్రింద. 'ప్రతిరోజూ రాత్రి నువ్వు బాత్రూమ్‌కి వెళ్ళినప్పుడు నీ దిండు క్రింద పెట్టేవాణ్ణి, పొద్దున్న నువ్వు లేచి మళ్ళీ అటు వెళ్ళినప్పుడు తీసేసుకునేవాణ్ణి,' అన్నాడు. ఈ కథ వింటే నవ్వొస్తుంది కాని, మనం నిజానికి చేస్తున్నది అదే. పుట్టినప్పటినుంచి, ఒక్కసారి కూడా మనమే శాంతి, భద్రత, ఆనందాలకు నెలవు అని కొంచెం కూడా తెలుసుకోలేకపోయాము. మనకు అసలు ఆ ఊహే రాలేదు.

**బాలస్తావత్క్రీడాసక్తః, తరుణస్తావత్తరుణీసక్తః।**
**వృద్ధస్తావచ్చిన్తాసక్తః, పరమే బ్రహ్మణి కో౽పి న సక్తః॥** భజగోవిందమ్ 7

బాలుడిగా ఉండగా ఆనందం బొమ్మల్లో, ఆటల్లో ఉందనుకున్నాము. యౌవనంలో స్త్రీలో ఉందనుకున్నాము. వృద్ధాప్యంలో చింతలతో గడుపుతున్నాము. వస్తువుల వెంట, ధనం వెంట, మనుష్యుల వెంట పరుగులు తీశాము కానీ, మన గురించి ఒక్కసారి కూడా ఆలోచించలేదు. అందువల్ల, ఆత్మ గొప్ప రహస్యం అయి కూర్చుంది.

ఎందుకు గొప్ప రహస్యం? ఎందుకంటే ఎన్నడూ నేనే ఆత్మస్వరూపాన్ని, నేనే ఆనందస్వరూపాన్ని అనుకోము కాబట్టి. ఆత్మ గురించి చెప్పినా అది బాహ్యప్రపంచంలో ఒక వస్తువు అనుకుంటాము. ఆత్మ నిత్యం, శాశ్వతం, సర్వవ్యాపకం అన్నా కూడా అటువంటి వస్తువు ఏమై ఉంటుంది అనుకుంటాము. లేదా ధ్యానంలో కూర్చుని ఈ ఆత్మసాక్షాత్కారంకోసం ఎదురుచూస్తాము. ఆత్మ గురించి అంతా స్పష్టంగా విన్నా కూడా, ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు వస్తుందో అని ఎదురుచూస్తారు చాలామంది.

ఆత్మ బాహ్యంగా వచ్చే వస్తువు కాదు, ఆత్మ ధ్యానం చేసే వస్తువు కాదు; ధ్యానం చేసే నేను అని అర్థం చేసుకోవాలి. ఎందుకు అలా ఎదురుచూస్తాము? అది మన అలవాటు. లౌకికవిద్యను డైకాటమీ సిస్టమ్ అంటారు. అందులో ఆబ్జెక్టు గురించి నేర్చుకుంటాము. మన విద్యాభ్యాసం అంతా ఈ ఆబ్జెక్టుపరంగా సాగుతుంది. దీన్ని శాస్త్రంలో పరోక్షజ్ఞానం అంటారు. అలా పరోక్షజ్ఞానం అలవాటయి, ఆత్మ కూడా ధ్యానంలో సాక్షాత్కారం అవాలి అనుకుంటారు. దయానందస్వామీజీ అంటారు, 'ధ్యానంలో ఏవైనా శబ్దాలు వినిపించాయి అంటే, నీ పేగులు అరుస్తున్నాయేమో, భోజనం చేసి ధ్యానం చెయ్యి.' కొంతమందికి ఒక జ్యోతి కనబడుతుంది; కొంతమందికి ఏవో శబ్దాలు వినిపిస్తాయి; కొంతమందికి ఏవో ఆకారాలు కనిపిస్తాయి. మనం ఆ అనుభూతులను కొట్టివేయటం లేదు; కాని అది ఆత్మ సాక్షాత్కారంగా భావించవద్దు అంటున్నాము. ఆత్మ అనుభవంలోకి వచ్చేది కాదు. ఆత్మవల్లే అన్నీ అనుభవించ గలుగుతున్నాము. పైగా ఆత్మ నిత్యం. ఆత్మ అనుభవంలోకి వచ్చిందంటే, అది ఎప్పుడో పోతుంది. ఆత్మ ఆగమాపాయి కాదు అంటే వచ్చిపోయేది కాదు.

ఇంకొక సూత్రం ఏమిటి? అనుభవంలోకి వచ్చేది ఏదైనా ఆబ్జెక్టు. అలా అనుభవంలోకి వచ్చే ప్రతిదాన్నీ ఆబ్జెక్టుగా కొట్టివేస్తే, మిగిలేది ఏమిటి? **శూన్యం!** శూన్యం అని అనుకుంటాము. కాని శూన్యం కాదు. శూన్యం ఉంది అని చూసేది ఒకటి ఉంది. అది ఆత్మ. ఇది గురువు కష్టపడి శిష్యుని మేధస్సులోకి చొప్పించాలి.

ఆత్మ ఆనందస్వరూపం అంటే ఆ ఆనందం కోసం అంతటా వెతుకుతాను. గురువు బాహ్యంగా దొరికే వస్తువు కాదు, వెతికే నువ్వే ఆనందస్వరూపుడివి అంటాడు. అందువల్ల ఆత్మ లేదా బ్రహ్మ అంటే వేదాంతం చూపించే కొత్త వస్తువు కాదు. ఆత్మ అంటే నాయొక్క కొత్త హోదా! వేదాంతానికి రాకముందు నాకు భద్రత లేదు, శాంతి లేదు, ఆనందం లేదు అనుకున్నాను – కాని వేదాంతం నాకొక కొత్త హోదాను ఆపాదిస్తున్నది. నేను భద్రత ఉన్న, శాంతి ఉన్న, ఆనందం ఉన్న జీవిని. దీనికి శాస్త్రం ఎప్పుడూ చెప్పే ఉదాహరణ కర్ణదృష్టాంతం. కర్ణుడు కూడా కుంతీపుత్రుడని, కాని అది కురుక్షేత్రయుద్ధం వచ్చేదాకా అతనికి తెలియదని మనకు తెలుసు.

కుంతీపుత్రులు ఐదుగురే అని అతనూ అనుకున్నాడు. ఒక శుభముహూర్తాన, కుంతి పిలిచి నాకు ఐదుగురు కాదు, ఆరుగురు పుత్రులు ఉన్నారు అని చెబుతుంది. వెంటనే ఆరవ పుత్రుణ్ణి నేనా అనే అనుమానమే అతనికి రాదు. ఎందుకు? అతను తాను సూతపుత్రుణ్ణి అనే గట్టి అపోహలో ఉన్నాడు. అందువల్ల ఎవరా ఆరవ పుత్రుడు అని కుతూహలంగా చూస్తాడు. ఎలా ఉంటాడు, రూపురేఖలు ఏమిటి, ఎంత వయస్సు ఉంటుంది లాంటి ఆలోచనలు చెలరేగుతాయి. నువ్వు అతన్ని కలిశావు అని చెప్పగలదా, నువ్వు అతన్ని కలవలేదు అని చెప్పగలదా? రెండూ చెప్పలేదు. కర్ణుడితో నువ్వు నా ఆరవ పుత్రుణ్ణి కలిశావు అనీ చెప్పలేదు, కలవలేదు అనీ చెప్పలేదు. ఎందుకు? ఆరవ పుత్రుడు కర్ణుడే కాబట్టి, అతన్ని తాను కలవలేదు.

అందువల్ల కుంతి ఏమని చెప్పాలి? నువ్వు చూడాలని కోరుకుంటున్న ఆ ఆరవ పుత్రుడివి నువ్వే అని చెప్పాలి. **తత్ త్వమ్ అసి.** కుంతి ఆమాట చెప్పగానే, కర్ణుడు కొత్త వ్యక్తిని గురించి తెలుసుకుంటాడా? లేదు. అది పాత కర్ణుడి గురించే. కాకపోతే అతను కొత్తగా తెలుసుకున్నది ఏమిటి? తనకు తెలిసిన తన గురించి, తనకు తెలియని ఒక కొత్త హోదాను తెలుసుకుంటాడు. నిజం చెప్పాలంటే, అది కొత్త హోదా కూడా కాదు. పాత హోదానే, కాకపోతే ఇన్నాళ్ళు బయటకు రాకుండా, రహస్యంగా ఉండిపోయింది. అది తెలియగానే అతని ముందుకు కొత్తగా ఏదైనా వచ్చివాలిందా? ఏమీ రాలేదు. ఎందుకు? అది అతని గురించే కాబట్టి.

ఆ జ్ఞానం అత్యంత రహస్యజ్ఞానం. నేను కుంతీపుత్రుణ్ణి, నేను సూతపుత్రుణ్ణి కాను. ఇన్నాళ్ళూ కర్ణుణ్ణి క్రుంగదీస్తున్న విషయం అదే. అతను క్షత్రియుడు కాదనే అవమానభారం. అతనిలో చిన్నప్పటినుంచి క్షత్రియ రక్తమే ఉంది. కాని అతను క్షత్రియుడు కాదనుకుని అర్జునుడు నువ్వు క్షత్రియుడవు కాదు కాబట్టి నీతో యుద్ధం చేయనన్నాడు; ద్రౌపది కూడా అతన్ని కించపరిచింది. అలాంటిది కుంతి అతను తన పుత్రుడని చెప్పటంవల్ల 'నేను క్షత్రియుణ్ణి కాను,' అనే అపోహ తొలిగి, 'నేను క్షత్రియుణ్ణి,' అనే జ్ఞానం కలిగింది. శారీరకంగా ఏమైనా మార్పు వచ్చిందా? లేదు! ఏమైనా వింత అనుభవం కలిగిందా? లేదు. సత్యం గురించి ఒక చిన్న నిశ్శబ్దమైన గుర్తింపు.

కాని ఇదే విషయం టీవీలో చూపిస్తే రకరకాల హడావుడులు చేస్తారు. కుంతి ఆ విషయం చెప్పగానే, కర్ణుడి గుండె గట్టిగా కొట్టుకుంటున్నట్టు శబ్దాలతో హోరెత్తించేస్తారు. దాని తర్వాత పదేపదే కుంతి, కర్ణుల మొహాలని దగ్గర్నుంచీ, దూరంనుంచీ, ఇటుపక్కనుంచీ, అటుపక్కనుంచీ జూమ్ చేసి మరీ చూపిస్తారు. కాని ఇదంతా మనస్సులో నిశ్శబ్దంగా జరిగే విషయం అంతే.

అలాగే అహం బ్రహ్మ అస్మి అనేది కూడా మనస్సులో నిశ్శబ్దంగా జరిగే ఒక చిన్న మార్పు. ఇన్నాళ్ళూ నేను ఏమి అనుకున్నాను? నాకు భద్రత లేదు అనుకున్నాను. నేనే భద్రతామూర్తిని అని తెలుసుకున్నాను. నేను పరిచ్ఛిన్నుణ్ణి అనుకున్నాను; నేను పూర్ణుణ్ణి అని అర్థం చేసుకున్నాను. కర్ణుడు ఈ విషయం తెలియకముందు తాను సూతపుత్రుడు అనుకున్నాడు. తెలిశాక, ఒకవేళ అర్జునుడు నువ్వు క్షత్రియుడవు కాదు అన్నా కర్ణుడు తాను క్షత్రియుడనని గర్వంగా చెప్పగలడు. ఆత్మ విషయంలో కూడా అంతే. ఆత్మజ్ఞానం అంత గొప్పది ఎందుకయిందంటే, ఇన్నాళ్ళూ నేను దేనికోసం వెతుకుతున్నానో, అదే నేను! ఈ నేపథ్యంతో శ్లోకాన్ని చూద్దాము.

**కశ్చిత్ ఏనమ్ ఆశ్చర్యవత్ పశ్యతి** – ఒక విద్యార్థి ఆత్మతత్త్వాన్ని ఆశ్చర్యకరమైనదానిగా చూస్తాడు. ఇన్నాళ్ళూ ఎలా తెలుసుకోలేక పోయాను అనే ఆశ్చర్యం వేస్తుంది. జీవితంలో అనేక సూచనలు అందుతున్నా, వాటిని అందుకోలేక పోయాము. మనం బాల్యంలో ఉండి, చదువుకుంటున్న రోజుల్లో ఏమనుకునేవాళ్ళం? అబ్బ, ఈ పెద్దవారు ఎంచక్కా చదువుకోనవసరం లేదు, హాయిగా ఆఫీసుకి వెళ్ళి ఇష్టం వచ్చినట్టు గడిపేసి, బోలెడు డబ్బు సంపాదించుకు వస్తారు. అదికాక ఇంటికి వచ్చాక, అసలు చదవనవసరం లేదు. తనివితీరా టీవీ చూసుకోవచ్చు. వారికి పరీక్షలు లేవు, మార్కుల గొడవలేదు, బెంగలు లేవు అనుకునేవాళ్ళం. ఇప్పుడు పెద్దయి, ఆ స్థాయికి మనం చేరుకుంటే, అప్పుడనుకున్నట్టుగా హాయిగా ఉంటామా? లేదు. అబ్బ బాల్యం ఎంత బాగుంది, ఆ రోజులే వేరు. బాధ్యతలు లేవు, బెంగలు లేవు. చీకూచింతా లేకుండా గడిపేశాము అనుకుంటాము. పోనీ ఇప్పుడైనా ఆత్మవిద్యకు ప్రయత్నిస్తామా? ఉహు!

ఇప్పుడు చాలా పనులున్నాయి. బాధ్యతలున్నాయి. రిటైరయ్యాక వేదాంతమే వేదాంతం అనుకుంటాము. కాని అప్పుడూ ఏమార్పు ఉండదు. ఉద్యోగంలో ఉండగా కనీసం వారానికి మూడురోజులు వేదాంతబోధలకు వెళితే ఇప్పుడు ఒకరోజు కూడా వెళ్ళే తీరికలేదు. ఎందుకు? ఉద్యోగంలో ఉండగా పనులు ఎవరో ఒకరు చేసి పెట్టేవారు. ఇప్పుడు అన్నీ మనమే చేసుకోవాలి; పిల్లలా రెక్కలొచ్చి దూరదేశాలకు ఎగిరి వెళ్ళిపోయారు. క్షణం తీరిక లేదు.

దీని సారాంశం ఏమిటి? శాంతి, భద్రత, ఆనందాలకోసం సరైనచోట వెతికే ప్రయత్నాన్ని అంతకంతకూ దూరం చేసుకుంటున్నాము. అది అంతకంతకూ దూరమవుతుంటేనైనా మనకు కొంచెం కూడా అనుమానం రావటం లేదు. నేను సరైన మార్గంలోనే ప్రయత్నిస్తున్నానా అనే ఆత్మ విమర్శ చేసుకోవటం లేదు. ఎందుకంటే, ఒకవేళ మనం సరైన మార్గంలో ప్రయత్నం చేస్తే 20 సంవత్సరాల తరువాత, లేదూ 40 సంవత్సరాల తరువాత, అదీకాదూ 60 సంవత్సరాల తరువాతనైనా శాంతిభద్రతలు కలగాలి కదా! అవి అంతకంతకూ దూరమవుతున్నాయంటే ఏమిటి అర్థం? మనం సరైన దిశలో ప్రయత్నించటం లేదు.

మాయయొక్క గొప్పతనం అది! అది మనను నిరంతరం వెతికేలాగా చేస్తుంది! ఒక్కక్షణం కూడా మన వెంపర్లాటలను మానము. ఏదో కాస్త పుణ్యం చేసుకుంటే, వేదాంతంలోకి వస్తాము. వేదాంతంలో కనుగొంటాము. అప్పుడు కలిగే ఆనందానికి అవధులు లేవు. నాలోనే ఆనందం ఉందని తెలియక అరవైఏళ్ళు వృథా చేసుకున్నానా అని ఆశ్చర్యపోతాము.

ఒక బ్రాహ్మణుడు మహామఖం కొలనులో స్నానం చేస్తుండగా, అతని ఉంగరం అందులో జారి పడిపోయింది. అది పండుగరోజు, ఆ కొలను యాత్రికులతో క్రిక్కిరిసి ఉంది. అతను ఉంగరం వెతకాలి, ఎలా? అందువల్ల అతనేం చేశాడు? పక్కనే ఇంకో కొలను ఖాళీగా ఉండటం చూసి అక్కడ వెతకటం మొదలుపెట్టాడు. ఎవరో చూసి, 'ఏం చేస్తున్నావు?' అన్నాడు. 'నా ఉంగరం పోయింది, వెతుకుతున్నాను,' అన్నాడు. పాపం అతను కూడా తోడుగా వెతకటం మొదలుపెట్టాడు. వీరిని చూసి ఒకరొకరూ వచ్చి వెతుకుతున్నారు. అలా చాలామంది అయ్యారు. చివరికి ఇంకొక అతను వచ్చాడు. 'ఏం వెతుకుతున్నారు?' అన్నాడు. విషయం చెప్పారు. 'ఎక్కడ

పోయింది?' అన్నాడు. 'ఆ కొలనులో పోయింది,' అన్నాడు. అతను గట్టిగా నవ్వి, 'వెర్రివాడా, మరి అయితే ఇక్కడెందుకు వెతుకుతున్నావు?' అన్నాడు. 'అక్కడ చీకటిగా ఉంది, పైగా చాలామంది ఉన్నారు,' అన్నాడు అమాయకంగా! ఏమన్నా అర్థముందా? ఒకచోట పోగొట్టుకుని, ఇంకొకచోట వెతికితే ఏమిటి లాభం?

కాని మనం చేస్తున్నదేమీ దానికి భిన్నంగా లేదు. అందరూ కలిసి వేరే కొలనులో వెతికినట్టుగా, మనమందరం బాహ్యప్రపంచంలో శాంతి, భద్రతలకోసం వెతుకుతున్నాము. అవి అక్కడ ఉంటే కదా, దొరకటానికి? వెతకాల్సినచోట వెతికి, అది దొరికితే ఆనందం కలగదా? అందుకే **కశ్చిత్ ఏనమ్ ఆశ్చర్యవత్ పశ్యతి**.

**ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః** – ఇంకొక మహాత్ముడు దీని తత్త్వాన్ని ఆశ్చర్యకరంగా వర్ణిస్తాడు.

**ఆశ్చర్య వచ్చైనమన్యః శృణోతి** – వేరొక పురుషుడు దీనిని ఆశ్చర్యకరమైన విషయంగా వింటాడు.

ఆత్మజ్ఞాన విషయంలో, ప్రతీదీ ఆశ్చర్యకరమైన విషయమే. ఈ భావాన్ని కృష్ణపరమాత్మ కఠోపనిషత్తు లోంచి గ్రహించాడు.

**శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః** – కఠ 1.2.7

ఈ ఆత్మ గురించి బోధించే గురువు ఒక ఆశ్చర్యం; దాన్ని అందుకునే శిష్యుడు ఇంకొక ఆశ్చర్యం. అన్ని ఆశ్చర్యాల్లోకీ గొప్ప ఆశ్చర్యం కొన్ని సంవత్సరాలు ఈ విద్యను నేర్చుకున్నా కూడా కొంతమందికి అర్థం కాదు; అది ఇంకా ఆశ్చర్యం! వేరే ఎవరి గురించో, వేరే విషయం గురించో చెపితే అర్థం కాకపోతే అందులో కొంత అర్థం ఉంది. కాని శాస్త్రం నా గురించే చెప్పినా నాకర్థం కాకపోవటం ఆశ్చర్యం కాక మరేమిటి? అందువల్ల దీన్ని రహస్యవిద్య అన్నారు. అందరికీ బోధించినా కూడా, అర్థం కాకపోవటంవల్ల రహస్యంగానే మిగిలిపోతుంది.

అందువల్ల గురువు ఒక ఆశ్చర్యం; శిష్యుడొక ఆశ్చర్యం; ఆత్మను అర్థం చేసుకోని వ్యక్తి మరీ ఆశ్చర్యం!

**శ్రుత్వాప్యేనం** – ఎన్నో సంవత్సరాలు విన్న తరువాత కూడా,

**కశ్చిత్ నైవ వేద** – కొంతమంది అసలు అర్థం చేసుకోలేరు. ఎందుకు అర్థం చేసుకోలేరు? వారికి ప్రతిదాన్నీ ఆబ్జెక్టుగా చూడటం అలవాటు. అందువల్ల ఆత్మను కూడా ఆబ్జెక్టుగా చూడాలి; ఆబ్జెక్టుగా అనుభవించాలి అనుకుంటారు. ఆత్మకోసం బయట కాని, తన లోపల కాని వెతుకుతారు. ఆత్మ బయటా లేదు, లోపలా లేదు. అంటే ఆత్మ లేనట్టా? ఆ వెతుకుతున్న నేనే ఆత్మను. నన్నూ, ఆత్మనూ కలిపే విభక్తి లేదు. ఆత్మ **లోపల** ఉంది. ఆత్మ బయట **ఉంది** అనే పదాలు రావు. ఆత్మ **నేనే**. ఈ విషయం అర్థమయ్యేదాకా, ఆత్మ చిక్కు విడని సమస్యలాగే ఉండిపోతుంది. ఎప్పుడైతే ఆ చిక్కు విడుతుందో, అప్పుడే అది తేలి అర్థం చేసుకునే అంశం అవుతుంది.

శ్లో. 30 **దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత ।**
**తస్మాత్ సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి ॥**
దేహీ, నిత్యమ్, అవధ్యః, అయమ్, దేహే, సర్వస్య, భారత,
తస్మాత్, సర్వాణి, భూతాని, న, త్వమ్, శోచితుమ్, అర్హసి ॥

| | | | |
|---|---|---|---|
| భారత | = ఓ అర్జునా! | సర్వాణి | = సమస్తములైన |
| అయమ్, దేహీ | = ఈ ఆత్మ | భూతాని | = ప్రాణులను గూర్చి (ఏ ప్రాణి కోసం) అయినను |
| సర్వస్య | = ప్రతిప్రాణియొక్క | | |
| దేహే | = దేహమందు | త్వమ్ | = నీవు |
| నిత్యమ్ | = ఎల్లప్పుడును | శోచితుమ్ | = శోకించుటకు |
| అవధ్యః | = వధించశక్యము కానిది | న, అర్హసి | = అర్హుడవు కావు (శోకింపదగదు) |
| తస్మాత్ | = కావున | | |

**హే భారత! సర్వస్య దేహే అయం దేహీ నిత్యమ్ అవధ్యః,**
**తస్మాత్ త్వం సర్వాణి భూతాని శోచితుం న అర్హసి ॥**

తా: భరతవంశీయుడవగు ఓ అర్జునా! సకల ప్రాణుల దేహమందుగల ఈ ఆత్మ ఏ కాలమందైననూ వధించశక్యము కానిది. కావున, సకలప్రాణుల గురించి నీవు శోకింపదగదు.

ఈ ఆత్మజ్ఞానంయొక్క గొప్పతనాన్ని స్తుతించాక, కృష్ణపరమాత్మ ఈ శ్లోకంతో ఈ అంశాన్ని ముగిస్తున్నాడు. ఇంతవరకూ తను చేసిన బోధయొక్క సారాంశాన్ని చెబుతున్నాడు. ఈ బోధలో రెండు ముఖ్యమైన అంశాలను చెప్పాడు. అవి – శరీరం అనిత్యం, ఆత్మ నిత్యం.

ఎ). **శరీరం అనిత్యం** – మనం అనేక విషయాలను అధిగమించగలమేమో కానీ, మూడు విషయాలను మనం తప్పించుకోలేము. అవి వృద్ధాప్యం, అనారోగ్యం, మృత్యువు. కొంతమేరకు వృద్ధాప్యాన్ని, అనారోగ్యాన్ని కూడా తప్పించుకోగలమేమో కాని మృత్యువును అస్సలు తప్పించుకోలేము. మనం ఈ భూమ్మీద పుడితే, ఈ నగ్నసత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. అత్యంత దురదృష్టకరమైన విషయమేమిటంటే, మృత్యుదేవత ఎప్పుడు కబళిస్తుందో తెలియదు.

పరీక్షిత్తు మహారాజు ఏడురోజుల్లో నువ్వు మరణిస్తావన్న శాపం పొందితే ఆయన దుఃఖించాడు అని కొంతమంది అనుకున్నారు కాని నిజానికి ఆయన సంతోషించాడు. ఎందుకు? ఏడురోజులు ఖచ్చితంగా జీవిస్తాను అని తెలుసుకున్నాడు. తక్కినవారికి అలాకాదు, ఎప్పుడు మృత్యువు బారిన పడతారో తెలియదు. అందువల్ల మృత్యువును మనసారా ఆహ్వానించటం మొదటిపాఠం.

బి). **ఆత్మ నిత్యం** – ఈ అనిత్య శరీరం వెనుక, నిత్యమైన నేను ఉన్నాను. కనబడే శరీరం అసలు నేను కాదు; అసలు నేను ఈ దేహానికి వెనుక ఉన్నాను. నన్ను దేహీ అంటారు.

**దేహం అనిత్యం దేహీ నిత్యం** – ఈ సూత్రం భీష్మద్రోణాచార్యులకు కూడా వర్తిస్తుంది. ఎప్పుడైతే అర్జునుడు వారి మరణానికి మానసికంగా సంసిద్ధుడు అవుతాడో, అప్పుడే వారి మరణం అతనిని బాధించదు. మనం మానవమాత్రులం; చావును దగ్గరనుంచి చూస్తే, అదీ మన ఆత్మీయుల చావును దగ్గరనుంచి చూస్తే మనం కలత చెందటం అత్యంత సహజం.

వేదాంతం నేర్చుకున్నంత మాత్రాన ఈ దుఃఖాన్ని పూర్తిగా పారద్రోలదు కాని, చాలామటుకు మరణాన్ని స్వీకరించి, భరించగలిగే గుండెధైర్యాన్ని ఇస్తుంది. ఒకవేళ మనస్సును కొన్నాళ్ళు బాధించినా, ఆత్మీయుల మరణం తప్పదు, ఇది జీవితంలో ఒక భాగం, వారు ఉన్నా లేకపోయినా, జీవితపయనం కొనసాగించక తప్పదు అని నేర్చుకుంటాము. జీవితం రైలు ప్రయాణంలాంటిది. రైలుపెట్టెలోంచి ఒకరు దిగినా కూడా, రైలు ప్రయాణం ఎవరికోసమూ ఆగదు. అది ముందుకు సాగుతూనే ఉంటుంది. మన జీవితమూ ఎవరితోనూ ఆగిపోదు. ముందుకు సాగుతూనే ఉంటుంది. అందువల్ల ఆత్మీయుల మరణం బాధించినా, అది భరించలేనంత దుఃఖాన్ని కలుగజేయదు. అందువల్ల 'ఓ అర్జునా! నువ్వు కూడా ఈ జ్ఞానాన్ని జీర్ణించుకో,' అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అయం దేహీ నిత్యమ్ అవధ్యః** – అయం దేహీ అంటే ఈ ఆత్మ. ముందు శ్లోకాల్లో ఈ ఆత్మలక్షణాలు కొన్ని చూశాము. ఏమిటవి? ఆత్మ నిత్యం, సత్యం, సర్వవ్యాపకం, అప్రమేయం, అకర్తా, అభోక్తా, నిర్వికారం. అవధ్యః అంటే వధించటానికి వీలుకానిది. ఎప్పటికీ శాశ్వతం. నాశనంకానిది. ఎక్కడ ఉంటుంది ఈ ఆత్మ?

**సర్వస్య దేహే** – ఈ శాశ్వతమైన ఆత్మ, ఈ అవినాశి ఆత్మ, అశాశ్వతమైన, వినాశనం చెందే శరీరంలో ఉంది. దేహి అవధ్యః అయితే, దేహం వధ్యః అవుతుంది. అంటే శరీరం నాశనం చెందుతుంది. అంటే భీష్మ, ద్రోణుల శరీరాలు కూడా మరణిస్తాయి.

మన సమస్య ఏమిటి? పుట్టుట గిట్టుట కొరకే అని తెలుసు; అంటే పుట్టినవారు మరణించక తప్పదు అని తెలుసు; నిజానికి ఎవ్వరైనా మరణిస్తే మనమే ఉదారంగా ఈ సూత్రాన్ని వల్లెవేస్తాము; కాని మనవారు మరణించాల్సి వచ్చినప్పుడు ఈ నగ్నసత్యాన్ని మర్చిపోతాము.

**త్వం సర్వాణి భూతాని శోచితుం న అర్హసి** – ఎవరు మరణించినా బాధపడకూడదు; ఎవరికి వృద్ధాప్యం వచ్చినా దుఃఖించకూడదు. కాని ఇక్కడ ఒక విషయం సరిగ్గా అర్థం చేసుకోవాలి. అనారోగ్యం రాకతప్పదు అని అంతకు ముందు చూశాము. అందువల్ల మనవారికి అనారోగ్యం వస్తే, అనారోగ్యం రాకతప్పదు అన్నారని, డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళటం మానకూడదు; మందులు ఇప్పించటం మానకూడదు. మనం ఏం చేయాలో ముందు శ్లోకాల్లో చెబుతాడు కృష్ణపరమాత్మ. ఎవరికైనా అనారోగ్యం వస్తే వారికి మనం చేతనైన సహాయం చేసి, మందులు ఇప్పించి, వారిని సంతోషంగా, శాంతిగా ఉండే పరిస్థితులు ఏర్పరచి, వారి మృత్యువును వీలున్నంత వెనక్కి పారద్రోలటానికి మన శాయశక్తులా ప్రయత్నించటం మన ధర్మం. ఇంత చేసినా, మృత్యువు తప్పలేదూ అంటే, దాన్ని జీవితసత్యంగా స్వీకరించక తప్పదు. అందువల్ల ఎన్నడూ శోకించవద్దు. దుఃఖించి నంతమాత్రాన సత్యాన్ని మార్చలేము.

శ్లో. 31 **స్వధర్మమపి చావేక్ష్య న వికంపితుమర్హసి ।**
**ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే ॥**
స్వధర్మమ్, అపి, చ, అవేక్ష్య, న, వికంపితుమ్, అర్హసి,
ధర్మ్యాత్, హి, యుద్ధాత్, శ్రేయః, అన్యత్, క్షత్రియస్య, న, విద్యతే ॥

| | | | |
|---|---|---|---|
| చ | = ఇంకను | క్షత్రియస్య | = క్షత్రియునకు |
| స్వధర్మం | = (నీ) స్వధర్మమును | ధర్మ్యాత్ | = ధర్మయుక్తమైన |
| అవేక్ష్య | = చూచి | యుద్ధాత్ | = యుద్ధముకన్నా |
| అపి | = అయినను | అన్యత్ | = మరియొకటి |
| వికంపితుమ్ | = చలించుటకు (భయపడుటకు) | శ్రేయః | = శ్రేయస్కరమైన కర్తవ్యము |
| న, అర్హసి | = అర్హుడవు కావు (భయపడదగదు) | న, విద్యతే | = ఉండదు. |
| హి | = ఎందుకంటే | | |

**స్వధర్మం చ అపి అవేక్ష్య వికంపితుం న అర్హసి ।**
**హి క్షత్రియస్య ధర్మ్యాత్ యుద్ధాత్ శ్రేయః అన్యత్ న విద్యతే ॥**

తా: స్వధర్మమునైననూ పరిగణనలోనికి తీసుకొన్నచో నీవు చలించుట (కర్తవ్యమునుంచి) జారిపోవుట తగదు. ఎందుకంటే, క్షత్రియునకు ధర్మయుక్తమైన యుద్ధముకన్నా హితకరము మరియొకటి లేదు.

ఇంతకుముందు శ్లోకంతో ఆత్మజ్ఞానబోధ ముగిసింది. ఈ బోధను కృష్ణపరమాత్మ అర్జునుని దుఃఖం పోగొట్టటానికే కాదు, మోహాన్ని తొలగించటానికి కూడా చేశాడు. అర్జునుని మోహం ఏమిటి? యుద్ధం చేయాలా, వద్దా? అతను ఈ ధర్మయుద్ధం చేసితీరాలి. హింస చేయకూడని చోట హింస చేయటం ఎంత తప్పో, హింస చేయాల్సిన చోట అహింస చూపటం కూడా అంతే తప్పు. అందువల్ల, అహింస పాటిస్తానని అర్జునుడు యుద్ధభూమినుంచి తప్పుకోకూడదు. క్షత్రియుని ధర్మం, ధర్మాన్ని రక్షించటం. దానికి అవసరమైతే దండన విధించాలి. ఆ విధంగా హింసాత్మక యుద్ధం ధార్మికపద్ధతి కిందకే వస్తుంది.

అందువల్ల, ఓ అర్జునా, యుద్ధం చేయి అంటున్నాడు. పైగా ఈ విషయాన్ని మూడు కోణాల్లోంచి చెబుతున్నాడు. అవి ఆధ్యాత్మికదృష్టి, ధార్మికదృష్టి, లౌకికదృష్టి అని చూశాము. ఇంతవరకు ఆధ్యాత్మికదృష్టి అయింది. అర్జునునికి ఈ బోధ అర్థమయితే, ఇంక వేరే పరిష్కారం అవసరం లేదు. కాని దురదృష్టవశాత్తు చాలామందికి ఈ బోధ అర్థం కాదు. అది అర్థం అవ్వాలంటే కొంత మానసిక పరిపక్వత అవసరం. ఆ మానసిక పరిపక్వత గనుక లేకపోతే, వేదాంతం సరిగ్గా అర్థమవటం మాట దేవుడెరుగు, దాన్ని అపార్థం చేసుకునే ప్రమాదముంది. ఉదాహరణకు ఆత్మను అకర్తా, అభోక్తా అనీ, అది ఏమీ కర్మ చేయదు కాబట్టి దానికి పుణ్యం, పాపం అంటదు అనీ ముందు శ్లోకాల్లో చూశాము. దీన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోతే, అక్రమాలు చేసేవి చేసేసి, నేను ఆత్మగా అకర్తా, అభోక్తా, కాబట్టి నేను ఏమీ చేయలేదు అని వాదించవచ్చు. అంతేకాదు దేహం అశాశ్వతం, అందువల్ల యుద్ధం చేయి అర్జునా అన్నాడు కృష్ణపరమాత్మ.

**దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత** – ఇది ఉటంకిస్తారు కూడా. శరీరం ఎలాగూ అశాశ్వతం. శరీరాన్ని చంపితే నష్టం ఏమిటి? అసలు వ్యక్తి ఎలాగూ ఆత్మగా శాశ్వతం అంటారు. అలా ఎవరైనా వాదిస్తే అతను వేదాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదని అర్థం. వేదాంతం ధర్మంతోనే మనగలదు, అందువల్ల ఇప్పుడు కృష్ణపరమాత్మ ధార్మికదృష్టి పరంగా చెప్పబోతున్నాడు.

**బి). ధార్మికదృష్టి పరంగా శ్లోకాలు 31-33 –** ధార్మికదృష్టితో చూసినా కూడా, అర్జునుడు ఈ యుద్ధం చేయటం సబబే అని అర్థమవుతుంది. భీష్మద్రోణాదులను సంహరించమంటున్నది, వారి శరీరాలు అనిత్యమని కాదు. వారి శరీరాలు అనిత్యమైనంత మాత్రాన ఎవరికీ వారిని సంహరించే అధికారం లేదు. మరి ఎందుకు చంపమంటున్నాడు కృష్ణపరమాత్మ? ఎందుకంటే భీష్మద్రోణులు వారు స్వతహాగా ధర్మపురుషులే అయినా, అధార్మిక పురుషునితో, అంటే దుర్యోధనునితో చేతులు కలిపారు.

**స్వధర్మమపి చావేక్ష్య న వికంపితుమర్హసి –** అర్జునా, నీకు ఆత్మ గురించి అర్థం కాకపోయినా, ఫర్వాలేదు. కాని నీ స్వధర్మపరంగా చూస్తే, నువ్వు సంకోచించనవసరం లేదు. వారు నీ గురువులు, పితామహులు అని నువ్వు సందేహించవద్దు. ఎందుకంటే ధర్మం ఇంకా ముఖ్యం. ధర్మం శాశ్వతం. ఇక్కడ కృష్ణపరమాత్మ స్వధర్మం పదం వేశాడు. దీని గురించి కొంచెం చూద్దాము.

ధర్మం రెండు రకాలు – సామాన్యధర్మం, విశేషధర్మం.

**సామాన్యధర్మం –** ఈ సామాన్యధర్మం సర్వజనీనధర్మం. అంటే అది అందరికీ వర్తిస్తుంది. వర్ణంతో సంబంధం లేదు; జాతితో సంబంధం లేదు; ఆశ్రమంతో సంబంధం లేదు. అందరూ సమానంగా పాటించాల్సిన ధర్మాలను యమనియమాలు అంటారు. యమనియమాలు కలిపి పది ధర్మాలున్నాయి. అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం – ఇవి ఐదు యమలు. అస్తేయం అంటే దొంగతనం చేయకపోవటం; **'ప్రకృతి మానవ అవసరానికి సరిపోయేటంత అమర్చింది కాని మానవ దురాశకు సరిపోయేటంత అమర్చలేదు,'** అన్నారెవరో. అందువల్ల మనకు అదనంగా సొమ్ము ఉంటే దాన్ని ఇతరులతో పంచుకోవటానికి సిద్ధపడాలి. ఈ పంచుకునే తత్త్వాన్ని అపరిగ్రహం అంటారు.

ఇక ఐదు నియమాలు – శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వరప్రణిధానం.

**శౌచం –** మనం వేసుకునే దుస్తులు, మనం ఉండే ఇల్లు, మన ఆఫీసు, మన ఇంటిముందు ఉన్న వీధి – అన్నింటినీ శుభ్రంగా ఉంచుకోవాలి. చాలామంది ఇంటిముందు చెత్త పడేస్తూంటారు. వీధితో వారికి సంబంధం లేదు అనుకుంటారు.

**సంతోషం –** ఉన్నవాటితో తృప్తి చెందటం. తోటివారిని చూసి ఈర్ష్య పడకపోవటం.

**తపస్సు –** ఆత్మసంయమనం. మనను మనం అదుపులో పెట్టుకోవాలి. సమయపాలన చేయాలి. ఐదు గంటలకు ఎవరన్నా రమ్మంటే ఐదుగంటలకు వెళ్ళాలి. అలా మనం వెళ్ళకపోతే, రెండవసారి సరిగ్గా ఐదు గంటలకు రమ్మని ప్రత్యేకంగా చెపుతారు. అప్పుడూ వెళ్ళకపోతే సరిగ్గా ఐదంటే ఐదింటికే రావాలి అని చెపుతారు. దానికి ఇంక అంతెక్కడ? ఎవరైనా రెండు నెలల ముందు ఫలానా కార్యక్రమం ఉంది అని చెప్పి ఊరుకుంటే, ఎవరూ వెళ్ళరు. పైగా చెప్పినవారినే తప్పుపడతారు. అక్రమం చూడండి. మీరు మళ్ళీ చెప్పలేదు కదా, ఉందో లేదో అని అనుమానం వచ్చింది అంటారు పైపెచ్చు. అలా అలవాటయిపోయింది మన జీవితం. కొంతమంది తామే మళ్ళీ గడియారాన్ని పది నిముషాలు ముందు పెట్టుకుంటారు. అంటే వారిమీద వారికి నమ్మకం లేదన్నమాట. అందువల్ల మనమీద మనకు అధికారం ఉండాలి – ఆలోచనలో, కర్మలో, మాట్లాడటంలో.

**స్వాధ్యాయం** – శాస్త్ర అధ్యయనం అందరూ చేయాలి. అది సామాన్యధర్మంలోకే వస్తుంది. శాస్త్రం బోధించే ఆచార్యులు ఇంకా ఎక్కువగా అధ్యయనం చేయాలి, కాని అందరూ ప్రాథమికంగా కొన్ని అధ్యయనం చేయాలి. ఎందుకంటే శాస్త్రం మన జీవితవిధానం ఎలా ఉండాలో నిర్దేశిస్తుంది. ఎలా డబ్బు సంపాదించాలో చెబుతుంది. చాలామందికి భార్యా, పిల్లలతో ఎలా వ్యవహరించాలో తెలియదు. అందువల్ల శాస్త్ర అధ్యయనం చేసి తీరాలి.

**ఈశ్వరప్రణిధానం** – ఏ పని చేసినా ఈశ్వరార్పణబుద్ధితో చేయాలి; ఆ కర్మకు వచ్చే ఫలాన్ని ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించాలి. ఇవీ ఐదు నియమాలు.

ఈ యమనియమాలను కలిపి సామాన్యధర్మం అంటారు. విశేషధర్మాన్ని స్వధర్మం అంటారు. ఈ స్వధర్మం వర్ణాశ్రమధర్మాలమీద ఆధారపడివుంటుంది. బ్రాహ్మణుడు ఎక్కడన్నా అన్యాయాన్ని చూస్తే, అతను క్షత్రియునికి చెప్పాలి. ఇప్పటి పరిస్థితుల ప్రకారం కూడా అంతేకదా! ఒక దొంగ దొంగతనం చేస్తూ పట్టుబడితే, అతను చేస్తున్నది తప్పే అయినా, అతన్ని దండించే అధికారం మనకు లేదు. మనం పోలీసుకు అప్పచెప్పాలి. పోలీసుకు అతన్ని దండించే అధికారం ఉంది. అలాగే క్షత్రియుని ధర్మం యుద్ధం చేయటం.

అందువల్ల అర్జునుడు యుద్ధం చేయవచ్చు, చేసితీరాలి కూడా. ధర్మశాస్త్రం, అహింస మన గొప్ప ధర్మం అంటుంది. కాని ధర్మశాస్త్రం, అహింస సామాన్యధర్మమనీ, కాని కొన్ని అసామాన్యపరిస్థితుల్లో రాజు ఎవరినైనా శిక్షించవచ్చు అనీ అంటుంది. అలాగే సత్యం పలకటం సామాన్యధర్మం, కాని కొన్ని విపత్కరపరిస్థితుల్లో అంటే ఆపద్ధర్మపరిస్థితుల్లో అసత్యమాడవచ్చు. అందువల్ల కొన్ని ధర్మాలను నిర్దేశించినా, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో వాటిని ఉల్లంఘించవచ్చు. సంస్కృతంలో సామాన్యధర్మాలను ఉత్సర్గ అనీ, ఉల్లంఘించగలిగిన పరిస్థితులను అపవాదం అనీ అంటారు. అందువల్ల ప్రతి ఉత్సర్గకూ ఒక అపవాదం ఉంటుంది. ఇంగ్లీషులో కూడా ఎవ్విరి రూల్ హేజ్ ఏన్ ఎక్సెప్షన్ అంటారు.

ఉత్సర్గ ధర్మం ప్రకారం ఎవరినీ చంపకూడదు కాని అపవాద సూత్రం ప్రకారం, చట్టప్రకారం వారిని శిక్షించవచ్చు. సామదానభేదమార్గాలు కుదరనప్పుడు, యుద్ధం తథ్యం. అందువల్లనే దాన్ని ధర్మయుద్ధం అంటారు.

**క్షతాత్ అధర్మాత్ త్రాయతే ఇతి క్షత్రియః.** క్షతాత్ అంటే అధర్మం. సమాజంలో అధర్మం ఉంటే దాన్నించి సమాజాన్ని రక్షించేవాణ్ణి క్షత్రియుడు అంటారు.

అధర్మంనుంచి సమాజాన్ని ఎలా రక్షిస్తాడు? ముందు అధర్మంగా ప్రవర్తించే వ్యక్తులను మార్చటానికి ప్రయత్నిస్తాడు. వారు మారితే ఫర్వాలేదు, లేకపోతే వారిని ఏరివేయాలి. ఉదాహరణకు డయాబెటిక్ ఫుట్ విషయం తీసుకోండి. పాదం దెబ్బ తిన్నప్పుడు, కుదిరితే దాన్ని మందులతో నయం చేస్తాడు డాక్టరు. రోగం ముదిరిపోయి, ఆ దెబ్బతిన్న పాదంవల్ల తక్కిన అంగాలు కూడా పాడయ్యేటట్టు ఉంటే, రోగతీవ్రతనుబట్టి కాలివేళ్ళనో, పాదాన్నో తొలగిస్తాడు డాక్టరు.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్** – 4.8

సత్పురుషులను రక్షించటంకోసం, దుష్టులను శిక్షించాలి. అర్జునుడు క్షత్రియుడు కాబట్టి దుష్టులను శిక్షించాలి. ముందే చూసినట్టుగా దుష్టులను శిక్షించే హక్కు క్షత్రియునికి ఉంది కాని, బ్రాహ్మణులకు కాని, తక్కిన వర్ణాలవారికి కాని లేదు.

స్వధర్మమపి చావేక్ష్య – నీ వర్ణధర్మం ప్రకారం;

న వికంపితుమర్హసి – నీకు భయపడే అర్హత లేదు.

ద్రోణాచార్యుడు జాతిబ్రాహ్మణుడు; అతను యుద్ధం చేయకూడదు. అందువల్ల మహాభారతయుద్ధం మధ్యలో, భీమాదులు ద్రోణాచార్యుని నువ్వు నీ స్వధర్మాన్ని ఉల్లంఘించావు అని దెప్పుతారు. దానికి ద్రోణాచార్యుని దగ్గర జవాబు లేదు. ద్రోణాచార్యుడు గొప్పవిలుకాడు; ఆయనకు విలువిద్య నేర్పే అధికారం ఉందే కాని, యుద్ధం చేసే అధికారం లేదు. అందువల్ల ఆయన యుద్ధం చేస్తే తప్పు. కాని అర్జునుడు క్షత్రియుడు, అందువల్ల అర్జునుడు యుద్ధం చేయకపోతే అది తప్పు. అతను భయపడకూడదు.

అంతేకాదు, ఇటువంటి ధర్మయుద్ధాన్ని గొప్పవరంగా భావించాలి. యుద్ధాన్ని ఒక శాపంగా తీసుకోవద్దు; ధర్మంకోసం నీ జీవితాన్ని అర్పించటానికి యిచ్చిన అవకాశంగా తీసుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ. పూర్వం స్వాతంత్ర్యసమరంలో ఎందరో నాయకులు కారాగారానికి సంతోషంగా వెళ్ళివచ్చారు. వారి జీవితాలని ధర్మంకోసం త్యాగం చేసారు.

**ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ న విద్యతే** – ధర్మయుద్ధానికి మించిన శ్రేయస్కరమైన కర్తవ్యం ఇంకొకటి లేదు. ఎవరికి?

**క్షత్రియస్య** – క్షత్రియునికి. తక్కిన వర్ణాల వారికి కాదు.

శ్లో. 32 **యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్ ।**
**సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీదృశమ్ ॥**
యదృచ్ఛయా, చ, ఉపపన్నమ్, స్వర్గద్వారమ్, అపావృతమ్,
సుఖినః, క్షత్రియాః, పార్థ, లభంతే, యుద్ధమ్, ఈదృశమ్ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ | = ఓ పార్థా! | స్వర్గద్వారమ్ | = స్వర్గద్వార(రూప)మైనట్టిది |
| యదృచ్ఛయా | = అనుకోకుండా (సంకల్పము లేకుండ) | ఈదృశమ్ యుద్ధమ్ | = ఇటువంటి యుద్ధము |
| ఉపపన్నమ్ | = ప్రాప్తించినట్టిది | సుఖినః | = అదృష్టవంతులైన |
| చ | = ఇంకా | క్షత్రియాః | = క్షత్రియులకు మాత్రమే |
| అపావృతమ్ | = తెరవబడిన | లభంతే | = లభించును. |

**హే పార్థ! యదృచ్ఛయా చ ఉపపన్నమ్ ఈదృశమ్ ।**
**అపావృతం స్వర్గ-ద్వారం యుద్ధం సుఖినః క్షత్రియాః లభంతే ॥**

తా: ఓ కుంతీపుత్రా! కోరుకోకుండానే వచ్చిన ఇటువంటి యుద్ధము తెరవబడిన స్వర్గద్వారము. అదృష్టవంతులగు క్షత్రియులకు ఇటువంటి యుద్ధము లభించును.

ఓ అర్జునా, నీకిది గొప్ప అవకాశం అంటున్నాడు కృష్ణపరమాత్మ. రాజులు యుద్ధంలో మరణించే అవకాశమున్నా యుద్ధానికి వెనుకాడరు. రాణులు కూడా వారిని వెనక్కు లాగరు. వీరతిలకం దిద్ది సంతోషంగా యుద్ధానికి సాగనంపుతారు.

**యదృచ్ఛయా చ ఉపపన్నం** – ఓ పార్థా! యాదృచ్ఛికంగా – అంటే అనుకోకుండా నీకీ అవకాశం దక్కింది. యుద్ధం చేసేటప్పుడు **విజయమో, వీరస్వర్గమో** అంటారు. అందువల్ల ఒకవేళ యుద్ధంలో మరణించినా, లౌకికంగా విజయం పొందకపోయినా, శాస్త్రం ప్రకారం అతను స్వర్గలోకానికి వెళతాడు. ధర్మశాస్త్రం ప్రకారం, ధర్మరక్షణకోసం తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి స్వర్గలోకానికి చేరతాడు. దాన్ని వీరస్వర్గం అంటారు.

**స్వర్గద్వారం** – ఈ ధర్మయుద్ధం స్వర్గానికి ద్వారంలాంటిది. అది కూడా ఎలాంటి ద్వారం?

**అపావృతమ్** – ఆ ద్వారం తెరిచి ఉంటుంది. అటువంటి అవకాశం ఎవరికి వస్తుంది?

**సుఖినః క్షత్రియాః ఈదృశం యుద్ధం లభంతే** – అదృష్టవంతులైన క్షత్రియులకు మాత్రమే లభిస్తుంది. అందువల్ల అర్జునా, ఇటువంటి అవకాశాన్ని వదులుకోవద్దు.

శ్లో. 33 **అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।**
**తతస్స్వధర్మం కీర్తిం చ హిత్వా పాపమవాప్స్యసి ॥**

అథ, చేత్, త్వమ్, ఇమమ్, ధర్మ్యమ్, సంగ్రామమ్, న, కరిష్యసి,
తతః, స్వధర్మమ్, కీర్తిమ్, చ, హిత్వా, పాపమ్, అవాప్స్యసి ॥

| | | | |
|---|---|---|---|
| అథ, చేత్ | = అయినా కూడా | తతః | = తరువాత |
| త్వమ్ | = నీవు | స్వధర్మమ్, చ | = స్వధర్మమునూ |
| ఇమమ్ | = ఈ | కీర్తిమ్ | = కీర్తినీ |
| ధర్మ్యమ్ | = ధర్మయుక్తమైన | హిత్వా | = పోగొట్టుకొని |
| సంగ్రామమ్ | = యుద్ధమును | పాపమ్ | = పాపమును |
| న, కరిష్యసి | = చేయకపోతే | అవాప్స్యసి | = పొందెదవు. |

**అథ (త్వమ్) ఇమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి చేత్,**
**తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాపమ్ అవాప్స్యసి॥**

తా: ఇప్పుడు నీవు ఈ ధర్మబద్ధమైన యుద్ధమును చేయకపోతే దానివల్ల స్వధర్మమును, కీర్తిని కూడా పోగొట్టుకొని పాపమును పొందెదవు.

ముందు శ్లోకంలో కృష్ణపరమాత్మ ఏమన్నాడు? నువ్వు యుద్ధం చేసి, యుద్ధంలో మరణిస్తే వీరస్వర్గం పొందుతావు అన్నాడు. ఒకవేళ అర్జునుడు, నాకు వీరస్వర్గంమీద మోజులేదు, నేను యుద్ధం చేయను, నావారిని చంపి స్వర్గానికి వెళ్ళాలన్న కోరిక నాకేం లేదు. వారితో ఇక్కడే ఉంటాను అని అనేటట్టయితే, దానికి జవాబు ఈ శ్లోకంలో చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. యుద్ధం చేస్తే వీరస్వర్గం పొందుతావు, కాని యుద్ధం చేయకపోతే నరకానికి పోతావు అంటున్నాడు. ఎందుకు? తన కర్తవ్యాన్ని నెరవేర్చనందుకు!

శాస్త్రం కర్మను రెండు రకాలుగా విభజించింది. వాటిని విహితకర్మలు, నిషిద్ధకర్మలు అంటారు. విహితకర్మలు అంటే చేసి తీరాల్సిన కర్మలు. నిషిద్ధకర్మలు అంటే చేయకూడని కర్మలు. పాపం కూడా రెండు రకాలు. చేసి తీరాల్సిన కర్మలను చేయకపోతే ప్రత్యవాయపాపం కలుగుతుంది. చేయకూడని కర్మలను చేసినా కూడా పాపం కలుగుతుంది.

నిషిద్ధకర్మలు ఏమిటి? ఉదాహరణకు **సురాం న పిబేత్** – సురాపానం చేయకూడదు. నిజానికి వాసన కూడా చూడకూడదు. వాసన చూస్తే తక్కువ స్థాయి పాపం, తాగితే ఎక్కువ స్థాయి పాపం కలుగుతుంది. దీన్ని ఇంగ్లీషులో కమిషన్ అంటారు. అంటే పాపకర్మను చేయటం. దీన్ని నిషిద్ధకరణం అంటారు.

విహితకర్మలు అంటే ఏమిటి? ఉదాహరణకు మనం ఆదాయపన్ను కట్టాలి. అది కట్టకపోతే దానికి శిక్ష ఉంటుంది. నేను చేయని పనికి శిక్ష ఏమిటి అనకూడదు. దీన్ని ఇంగ్లీషులో ఒమిషన్ అంటారు. అంటే చేయాల్సిన కర్మను చేయకపోవటం. దీన్ని విహిత అకరణం అంటారు.

**కరచరణకృతం వా కాయజం కర్మజం వా**
**శ్రవణ నయనజం వా మానసం వా అపరాధమ్**
**విహితమ్ అవిహితం వా సర్వమ్ ఏతత్ క్షమస్వ**

ఇక్కడ అర్జునుడు యుద్ధం చేయకపోతే అది విహిత అకరణం కిందకు వస్తుంది. దాన్ని ప్రత్యవాయపాపం అంటారు.

**అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి** – సంగ్రామం అంటే మంచి గ్రామం కాదు; యుద్ధం, ధర్మయుద్ధం. ఒకవేళ నువ్వు ఈ ధర్మయుద్ధం చేయకపోతే ఏమవుతుంది?

**పాపమ్ అవాప్స్యసి** – పాపం చేసినవాడివవుతావు. పాపఫలితం ఏమిటి? **నరకప్రాప్తి ఏవ ఫలం భవతి.** నరకం పొందుతావు. అందువల్ల, అర్జునా! నీకు స్వర్గలోకంమీద మోహం లేకపోయినా, నరకలోకానికి వెళ్ళకుండా ఉండటానికైనా యుద్ధం చేసి తీరాలి. నరకానికి వెళ్ళటమే కాదు,

**తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా** – నీ స్వధర్మాన్ని, కీర్తిని కూడా కోల్పోతావు. దీన్ని కృష్ణపరమాత్మే తరువాత వివరిస్తాడు. ఇక్కడితో ధార్మికదృష్టి కూడా అయిపోయింది. 31వ శ్లోకంలో మొదలయింది ఇది. ఇది ధర్మయుద్ధం కాబట్టి, అర్జునుడు తన క్షత్రియధర్మం నిలబెట్టుకోవటానికి యుద్ధం చేసి తీరాలన్నాడు.

శ్లో. 34 **అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్ ।**
**సంభావితస్య చాకీర్తిః మరణాదతిరిచ్యతే ॥**
అకీర్తిమ్, చ, అపి, భూతాని, కథయిష్యంతి, తే, అవ్యయామ్,
సంభావితస్య, చ, అకీర్తిః, మరణాత్ అతిరిచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| చ | = ఇంకా | చ | = ఇంకా |
| భూతాని | = సమస్తజనులు | సంభావితస్య | = మంచి పేరుగలవానికి |
| తే | = నీయొక్క | అకీర్తిః | = అపకీర్తి |
| అవ్యయామ్ | = కలకాలము నిలిచియుండు | మరణాత్ | = మృత్యువుకన్నా |
| అకీర్తిమ్, అపి | = అపకీర్తిని గూర్చి | అతిరిచ్యతే | = అధికమగు దుఃఖము నిచ్చును |
| కథయిష్యంతి | = చెప్పుకొంటారు | | |

**అపి చ భూతాని తే అవ్యయామ్ అకీర్తిం కథయిష్యంతి।**
**సంభావితస్య చ అకీర్తిః మరణాత్ అతిరిచ్యతే ॥**

తా: ఇంతేగాక, జనులు శాశ్వతమైన నీ అపకీర్తిని చెప్పుకొంటారు. పైగా, మంచి పేరుగలవానికి అపకీర్తి మృత్యువుకన్నా అధికమగు దుఃఖమునిచ్చును.

**సి). లౌకిక దృష్టి పరంగా శ్లోకాలు 34-38 –** ఆధ్యాత్మిక దృష్టి, ధార్మిక దృష్టి పరంగా పరిస్థితిని వివరించాక, ఇక్కడనుంచి కృష్ణపరమాత్మ లౌకిక దృష్టి పరంగా వివరిస్తున్నాడు. అంటే ఇంకా ఒక మెట్టు దిగి వివరిస్తున్నాడు. ఇప్పటి కాలం వారు నేను పుణ్యపాపాలను నమ్మను అనవచ్చు. ఎందుకంటే అవి అదృష్టం. అదృష్టం అంటే ఇంద్రియ అగోచరం. వాటిని టెలిస్కోప్, మైక్రోస్కోప్‌లలో చూడలేము. పుణ్యపాపాలను నమ్మకపోతే స్వర్గనరకాలను కూడా నమ్మరు. ఆత్మ అంటే ఏమిటో అర్థం కాకపోయినా, స్వర్గనరకాలను నమ్మకపోయినా, అర్జునుడు యుద్ధం చేసితీరక తప్పదు. ఎందుకు? అతను యుద్ధం చేయకపోతే అపకీర్తి పాలవుతాడు.

ఈ రోజుల్లో అందరూ విలువనిచ్చేది కీర్తికే! నలుగురూ ఏమనుకుంటారోననే భయం ఎక్కువ రాజ్యమేలుతోంది. అబ్బాయి ప్రేమించి పెళ్ళి చేసుకుంటానంటే, అతని యిష్టాయిష్టాల గురించి ఆలోచించరు, నలుగురూ దుమ్మెత్తి పోస్తారేమోనని భయపడతారు. మాది నిప్పులు కడిగే వంశం, ఇప్పుడు పుత్రుడు వర్ణసంకరం చేస్తే అందరూ ఆడిపోసుకుంటారని భయపడతారు. కొందరైతే ఇంక బయటకు రావటం కూడా మానేస్తారు. పెళ్ళిళ్ళకు, శుభకార్యాలకు వెళ్ళటం మానేస్తారు. అర్జునుడు క్షత్రియుడు; రాజసికగర్వం ఉంటుంది. అతను కూడా కీర్తి గురించి తాపత్రయపడే అవకాశం ఉంటుంది.

అర్జునుడు గొప్ప విలుకాడు అనే కీర్తి ఉంది. భూలోకంలోనే కాదు, స్వర్గలోకానికి కూడా వెళ్ళి ఇంద్రదేవునికి యుద్ధాల్లో సహాయం చేసి, ఎన్నో విజయాలు పొందాడు. అతనికి విజయంలో తిరుగులేదనే పేరు ప్రఖ్యాతులు పొందాడు. అసలు అతను యుద్ధభూమికి రాకపోయుంటే అది వేరే విషయం. యుద్ధానికి వచ్చి, తీరా అందరినీ చూసి, యుద్ధం చేయకపోతే, అపనిందలు వేస్తారు. అర్జునుడు భీష్మద్రోణులమీద జాలికొద్దీ యుద్ధం చేయనంటున్నాడు

కాని దాన్ని ఎవరూ సరిగ్గా అర్థం చేసుకోరు. అందరూ అన్ని రకాల పుకార్లు పుట్టిస్తారు. 20 శతాబ్దాల తరువాత కూడా అతను యుద్ధంనుంచి పారిపోయాడని నిందలు వేస్తారు. దానిమీద పుంఖానుపుంఖాలుగా కవితలు కూడా రాస్తారు. ఓ అర్జునా, అలాంటి చెడ్డపేరు రావాలని నీకుందా?

**ప్రాణం వాపి పరిత్యజ్య మానమేవాభి రక్షతు ।**
**అనిత్యో భవతి ప్రాణః మానస్తు ఆచంద్రతారకమ్ ॥**

ప్రాణంకన్నా మానం ముఖ్యమని చాలామంది అనుకుంటారు. ఎన్ని వార్తలు చదవటం లేదు. పరీక్షలో ఫస్ట్ర్యాంక్ రాలేదని, సెకండ్ ర్యాంక్ వచ్చిందని ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల గురించి చూస్తాము. హఠాత్తుగా వ్యాపారం దెబ్బతిని, ఆస్తి అంతా పోయిన, ఐశ్వర్యవంతుని ఆత్మహత్య ఇంకో వార్త. ఎందుకు? వీరికి మానం ముఖ్యం; అవమానం తట్టుకోలేకపోయారు. మామూలు మనుష్యులకే మానం ఇంత ముఖ్యమయితే, క్షత్రియుడైన అర్జునునికి ఇంకెంత ముఖ్యమై ఉండాలి అది? అవమానమా? వీరస్వర్గమా?

**భూతాని కథయిష్యంతి** – లోకులందరూ నీ గురించి చిలవలు పలువలుగా చెప్పుకుంటారు.

**అకీర్తిం చాపి (కథయిష్యంతి)** – నీ అపకీర్తి గురించి చెప్పుకుంటారు. అది కూడా ఎలా?

**అవ్యయామ్** – తరతరాలుగా చెప్పుకుంటారు. నువ్వు ఎవరికీ తెలియని అనామకుడవయితే నీ గురించి ఎవరూ పట్టించుకోరు. కాని నీకు కీర్తిప్రతిష్ఠలు చాలా ఉన్నాయి. అలాంటి నీమీద వారు అపనిందలు వేస్తే అది నీకు చాలా అవమానంగా ఉంటుంది.

**సంభావితస్య** – విలువిద్యలో ఆరితేరి, సవ్యసాచిగా పేరు పొంది, ఎన్నో విజయాలను చవిచూసిన క్షత్రియునిగా నీకు గొప్ప పేరుప్రతిష్ఠలు ఉన్నాయి. అలాంటి నిన్ను హఠాత్తుగా అకీర్తిపాలు చేస్తే;

**మరణాత్ అతిరిచ్యతే** – అది మరణంకన్నా చాలా బాధాకరమైనది.

శ్లో. 35 **భయాద్రణాదుపరతం మంస్యంతే త్వాం మహారథాః ।**
**యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥**
భయాత్, రణాత్, ఉపరతమ్, మంస్యంతే, త్వామ్, మహారథాః,
యేషామ్, చ, త్వమ్, బహుమతః, భూత్వా, యాస్యసి, లాఘవమ్ ॥

| | | | |
|---|---|---|---|
| చ | = ఇంకా | మహారథాః | = ఆ మహారథులు |
| యేషామ్ | = ఎవరి దృష్టిలో | త్వామ్ | = నిన్ను |
| త్వమ్ | = నీవు | భయాత్ | = భయకారణముగా |
| బహుమతః | = మిక్కిలి మాన్యుడవు | రణాత్ | = యుద్ధమునుంచి |
| భూత్వా | = అయి (ఉన్నావో) | ఉపరతమ్ | = పారిపోయినవానినిగా |
| లాఘవమ్ | = (వారి దృష్టిలో) చులకన | మంస్యంతే | = భావిస్తారు |
| యాస్యసి | = అవుతావు | | |

**మహారథాః త్వాం భయాత్ రణాత్ ఉపరతం మంస్యంతే ।**
**యేషాం చ త్వం బహుమతః భూత్వా, లాఘవం యాస్యసి॥**

తా: గొప్ప రథికులు నిన్ను భయకారణముగా యుద్ధమునుంచి వెనుతిరిగి పారిపోయావని భావిస్తారు. పైగా, ఎవరైతే నిన్ను గొప్పవానిగా భావించారో, వారికి నీవు లోకువ కాగలవు.

ఇదే విషయాన్ని కృష్ణపరమాత్మ ఇంకా వివరిస్తున్నాడు. అర్జునుడు యుద్ధభూమినుంచి విరమిస్తే, ఎలా ఉంటుంది? అర్జునుడు విరమించడు, కాని ఒకవేళ విరమిస్తే, అందరూ ఏమనుకుంటారు? అర్జునుడు భీష్మద్రోణాదులమీద జాలి, గౌరవం కొద్దీ వెన్ను చూపుదామనుకుంటున్నాడు. కాని ఆ విషయం ప్రపంచానికి పట్టదు. దుర్యోధనాదులు లేనిపోని పుకార్లు పుట్టించవచ్చు.

**భయాత్ రణాత్ ఉపరతమ్** – వారు చెప్పే మొట్టమొదటి కారణం, అర్జునుడు భయంవల్ల యుద్ధంనుంచి పారిపోయాడు అంటారు.

**మంస్యంతే త్వాం మహారథాః** – కౌరవుల పక్షంలో ఉన్న మహారథులందరూ నువ్వు యుద్ధంనుంచి భయంవల్ల పారిపోయావని నిందలు వేస్తారు.

మహాభారతంలో ఎప్పుడూ అవమానంపాలు చెందింది ఎవరంటే కర్ణుడు. పాండవులందరూ, ద్రౌపదితో సహా అతనిలో క్షత్రియరక్తం ఉన్నా కూడా సూతపుత్రుడని అవమానించారు. అవకాశంకోసం పొంచివుంటాడు కర్ణుడు. ఇప్పుడు యుద్ధభూమినుంచి అర్జునుడు వెనుతిరిగితే, ఇంక కర్ణుడికి పట్టపగ్గాలు ఉండవు. అదుగో యుద్ధభూమిలో నన్ను చూశాడు. నేను అతన్ని ఉరిమి చూశాను, దానితో భయపడిపోయాడు. అందువల్లనే వెనుతిరిగాడు అనే ప్రమాదం ఉంది. మహారథులు అంటే కర్ణుడిలాంటి యోధులు అతనిని చులకనగా చూస్తారు.

**యేషాం చ త్వం బహుమతో భూత్వా** – ఇంతవరకు వారి దృష్టిలో నువ్వు మాన్యుడివి. నీమీద చాలా గౌరవం ఉంది.

**లాఘవం యాస్యసి** – ఇప్పటినుంచి వారి దృష్టిలో ఎంతో చులకన అవుతావు. అంతేకాదు –

శ్లో. 36 **అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః ।**
**నిందంతస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥**
అవాచ్యవాదాన్, చ, బహూన్, వదిష్యంతి, తవ, అహితాః,
నిందంతః, తవ, సామర్థ్యమ్, తతః, దుఃఖతరమ్, ను, కిమ్ ॥

| | | | |
|---|---|---|---|
| తవ | = నీయొక్క | అవాచ్యవాదాన్ | = అనరాని మాటలను |
| అహితాః | = శత్రువులు | చ | = గూడ |
| తవ | = నీ | వదిష్యంతి | = పలికెదరు |
| సామర్థ్యమ్ | = సామర్థ్యమును | తతః | = అంతకన్నా |
| నిందంతః | = నిందించుచు | దుఃఖతరమ్ | = అధికమైన దుఃఖము |
| బహూన్ | = అనేకములైన | కిమ్, ను | = ఇంక యేమి ఉంటుంది? |

**తవ సామర్థ్యం నిందంతః, తవ అహితాః చ బహూన్ అవాచ్య–వాదాన్ వదిష్యంతి।**
**తతః కిం ను దుఃఖతరమ్॥**

తా: ఇంతేగాక, నీ శత్రువులు నీ సామర్థ్యమును (నీవు అసమర్థుడవని) నిందిస్తున్నవారై, అనేకములైన అనరాని మాటలను పలికెదరు. అంతకంటే పెద్ద దుఃఖము యేమి ఉంటుంది?

అర్జునుణ్ణి రెచ్చగొట్టటానికి ఇదే విషయం ఇంకా ఇంకా మాట్లాడుతున్నాడు కృష్ణపరమాత్మ. కృష్ణపరమాత్మ లక్ష్యం ఏదోవిధంగా అర్జునుడు యుద్ధం చేసేలా చేయటం. అందువల్ల అతనికి చురుక్కుమనే పదాలు వేస్తున్నాడు.

**తవ అహితాః బహూన్ వదిష్యంతి** – తవ అహితాః అంటే నీ శత్రువులు. అతని శత్రువులు అంటే కౌరవులు. వారు నీ గురించి చాలా మాట్లాడతారు. ఏమని?

**అవాచ్య వాదాంశ్చ** – వారు నీ గురించి అనరాని మాటలను అంటారు. దుర్యోధనుడు రాజు. ప్రజలు అతని చెప్పుచేతల్లో ఉంటారు. అర్జునుడు ఇన్నాళ్ళూ అరణ్యవాసం చేసివచ్చాడు. అందువల్ల దుర్యోధనుడికి ఇతనిమీద దుష్ప్రచారం చేయటం చాలా తేలిక. ఏ విషయంలో చేస్తాడు?

**తవ సామర్థ్యం నిందంతః** – విలువిద్యలో నీ సామర్థ్యాని నిందిస్తూ నానామాటలు అంటాడు.

**తతః దుఃఖతరం ను కిమ్** – అపకీర్తి కంటే బాధాకరమైన విషయం ఏముంటుంది?

అక్షరాలా ఈ వాదన పురాణాల్లో తరచు వింటుంటాము. కైకేయి కోరికను దశరథుడు వెంటనే ఒప్పుకోడు. కైకేయి శతవిధాల ప్రయత్నించినా రాముణ్ణి అరణ్యాలకు పంపించను అంటాడు దశరథుడు. అప్పుడు కైకేయి ఈ బాణం వేస్తుంది. రఘువంశం సత్యవాక్యపరిపాలనకు పెట్టింది పేరు. ఇంతవరకూ ఈ వంశానికి మచ్చలేదు. ఇప్పుడు దశరథుడు ఇచ్చినమాట తప్పితే, రఘువంశానికి అపకీర్తి తెచ్చినవాడవుతాడు అంటుంది. అపకీర్తి కంటే బాధాకరమైన విషయం ఏముంటుంది? దశరథుడు లొంగక తప్పలేదు.

అదే పరిస్థితి కంస మామది కూడా. అశరీరవాణి దేవకికి పుట్టిన అష్టమపుత్రుడు తనను చంపుతాడని వినగానే కంసుడు దేవకిమీద కత్తి దూస్తాడు. అప్పుడు కూడా వసుదేవుడు శతవిధాల కంసునికి నచ్చచెప్పటానికి ప్రయత్నించి విఫలమవుతాడు. ఇంక చివరగా అపకీర్తి కంటే బాధాకరమైన విషయం ఏముంటుంది అంటాడు. నీ వంశానికి ఇన్నాళ్ళూ మంచి పేరు ప్రఖ్యాతులున్నాయి; ఇప్పుడు నువ్వు నీ చెల్లెలిని చంపితే, స్వంత చెల్లెలిని

చంపిన హంతకుడిగా నీ పేరు చరిత్రలో నిలిచిపోతుంది. అలాంటి అపకీర్తి తెచ్చుకుంటావా అంటాడు. దానితో కత్తి లోపల పెడతాడు.

అందువల్ల క్షత్రియునికి మానం చాలా ముఖ్యం. తనకు ఏ కొంచెం అవమానం జరిగినా, ఎక్కడ అహంకారం దెబ్బతిన్నా, యుద్ధంలోకి దిగిపోతాడు. ఆ కారణం పెద్ద కారణం కూడా అవనవసరం లేదు. అందువల్ల క్షత్రియులకు ఉన్న ఈ బలహీనతను వాడుకుంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్లనే **తతః దుఃఖతరం ను కిమ్** అన్నాడు. అపకీర్తికన్నా దుఃఖతరమైనది ఏం ఉంది అంటాడు. అందువల్ల అర్జునుడు ఏం చేయాలి?

శ్లో. 37 **హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।**
**తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥**
హతః, వా, ప్రాప్స్యసి, స్వర్గమ్, జిత్వా, వా, భోక్ష్యసే, మహీమ్,
తస్మాత్, ఉత్తిష్ఠ, కౌంతేయ, యుద్ధాయ, కృతనిశ్చయః ॥

| | | | |
|---|---|---|---|
| వా | = ఒకవేళ | భోక్ష్యసే | = అనుభవించెదవు |
| హతః | = (నీవు) చంపబడినచో | తస్మాత్ | = అందువలన |
| స్వర్గమ్ | = స్వర్గమును | కౌంతేయ | = కుంతీకుమారా! (అర్జునా!) |
| ప్రాప్స్యసి | = పొందగలవు | యుద్ధాయ | = యుద్ధము చేయుటకై |
| వా | = లేదా | కృతనిశ్చయః | = తిరుగులేని నిశ్చయము గలవాడవై |
| జిత్వా | = (నీవు యుద్ధమున) జయించినచో | ఉత్తిష్ఠ | = లెమ్ము. |
| మహీమ్ | = భూమండల రాజ్యమును (భోగములను) | | |

**(త్వం) హతః వా స్వర్గం ప్రాప్స్యసి, జిత్వా వా మహీం భోక్ష్యసే।**
**హే కౌంతేయ! తస్మాత్ యుద్ధాయ కృత–నిశ్చయః ఉత్తిష్ఠ।**

తా: ఒకవేళ యుద్ధమునందు నీవు చంపబడినచో స్వర్గమును పొందగలవు. లేదా యుద్ధమునందు నీవు విజయము సాధించినచో భూమండల రాజ్యభోగాలను అనుభవించగలవు. ఓ కుంతీపుత్రా! కావున, యుద్ధము చేయాలనే తిరుగులేని నిశ్చయముగలవాడవై లేచి నిలబడుము.

అందువల్ల ఓ అర్జునా, నీకు అపకీర్తి రాకూడదంటే, నరకానికి వెళ్ళకూడదనుకుంటే, యుద్ధం చెయ్యి. విజయమో, వీరస్వర్గమో పొందుతావు.

**హతః వా(సన్) స్వర్గం ప్రాప్స్యసి** – ఒకవేళ యుద్ధభూమిలో మరణిస్తే, నీకు వీరస్వర్గము లభిస్తుంది.

**జిత్వా వా మహీం భోక్ష్యసే** – ఒకవేళ మరణించకుండా, యుద్ధంలో గెలిచావనుకో, రాజ్యభోగాలను అనుభవించగలవు. నిజానికి 13 సంవత్సరాలుగా అతను తపన పడింది దానికోసమే కదా! అడవిలో అష్టకష్టాలు పడి, ఈరోజుకోసం ఎదురుచూశారు. ఆ విధంగా, ఎలా చూసినా నీకు లాభమే. నువ్వు విజయమో, వీరస్వర్గమో

పొందుతావు. విజయం పొందితే, నీ రాజ్యం నీకు తిరిగివస్తుంది. ఒకవేళ ఓడిపోయినా వీరస్వర్గం పొందుతావు. అందువల్ల నువ్వు ఏం చేయాలి?

**తస్మాత్ కౌంతేయ ఉత్తిష్ఠ** – అందువల్ల అర్జునా, ముందు నువ్వు లేచి నిలబడు. ఈ మాట ఎందుకు చెబుతున్నాడు కృష్ణపరమాత్మ? సమస్య ఎక్కడ ఉందో అక్కడనుంచి మొదలు పెడుతున్నాడు.

**ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।**
**విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః** – 1.47

యుద్ధభూమిలో ధనుర్బాణాలను త్యజించి, రథంలో చతికిలబడ్డాడు. అర్జునుడు లేచి, వెళ్ళిపోతే కష్టం. అందువల్ల కృష్ణపరమాత్మ ప్రత్యేకించి చెబుతున్నాడు –

**యుద్ధాయ కృతనిశ్చయః** – యుద్ధం చేయాలనే దృఢనిశ్చయం తీసుకుని లేచి నిలబడు. దీనితో మూడవ స్థాయి వాదన కూడా అయిపోయింది. అవి ఆధ్యాత్మిక దృష్టి, ధార్మిక దృష్టి, లౌకిక దృష్టి. ఏ దృష్టిలో చూసినా అర్జునుడు యుద్ధం చేయక తప్పదు.

ఈ వాదనలన్నీ అయ్యాక, కృష్ణపరమాత్మ అర్జునునికి ఒక సలహా ఇస్తున్నాడు. ఏమిటది? యుద్ధం ఎలా చేయాలో సూచిస్తున్నాడు. మనకు కొన్ని కర్తవ్యాలు ఉంటాయి. వాటిని రెండు తెగలుగా విభజిస్తాము – మనస్సుకు నచ్చిన పనులు, మనస్సుకు నచ్చని పనులు. నచ్చిన పనులను ఎలా చేయాలో, ఎవరికీ చెప్పనవసరం లేదు. వచ్చిన సమస్యల్లా నచ్చని పనులు చేయాల్సి రావటంతోనే! అటువంటి పని ఎలా చేయాలో చెప్పబోతున్నాడు కృష్ణపరమాత్మ రాబోయే శ్లోకంలో.

శ్లో. 38 **సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।**
**తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి ॥**
సుఖదుఃఖే, సమే, కృత్వా, లాభాలాభౌ, జయాజయౌ,
తతః, యుద్ధాయ, యుజ్యస్వ, న, ఏవమ్, పాపమ్, అవాప్స్యసి ॥

| | | | |
|---|---|---|---|
| జయాజయౌ | = జయాపజయములను | యుద్ధాయ | = యుద్ధమునకై |
| లాభాలాభౌ | = లాభనష్టములను | యుజ్యస్వ | = సంసిద్ధుడవు కమ్ము |
| సుఖదుఃఖే | = సుఖదుఃఖములను | ఏవమ్ | = ఈ విధముగా (యుద్ధము చేయుటవల్ల) |
| సమే | = సమముగా | పాపమ్ | = పాపమును |
| కృత్వా | = భావించి | న, అవాప్స్యసి | = (నీవు) పొందవు. |
| తతః | = తరువాత | | |

**సుఖ–దుఃఖే లాభ–అలాభౌ జయ–అజయౌ సమే కృత్వా తతః యుద్ధాయ యుజ్యస్వ।**
**ఏవం పాపం న అవాప్స్యసి ॥**

తా: సుఖదుఃఖములను, లాభనష్టములను, జయాపజయములను సమముగా చేసి తరువాత యుద్ధమునకై సంసిద్ధుడవు కమ్ము. ఈ విధముగా చేసినచో నీవు పాపమును పొందబోవు.

ఈ శ్లోకంతో కృష్ణపరమాత్మ తన బోధలోని మొదటి భాగాన్ని ముగిస్తున్నాడు. తరువాత కర్మయోగం గురించి చెప్పబోతున్నాడు. ఈ శ్లోకం రెండు భాగాలకూ మధ్యశ్లోకం. కర్మయోగం భగవద్గీతలో ఇంకో ముఖ్యమైన అంశం. 12 నుంచి 25 వరకూ జ్ఞానయోగం లేదా సాంఖ్యయోగం గురించి చాలా విపులంగా చర్చించాడు. ఇంతవరకూ వేదాంతం గురించి చెప్పాడు; ఇప్పుడు ధర్మం గురించి చెప్పబోతున్నాడు.

మొత్తం వేదం రెండు భాగాలుగా విభజించబడింది – వాటిని వేదపూర్వభాగం, వేద అంతభాగం అంటారు. వేదపూర్వభాగం కర్మ గురించి చెపితే, వేద అంతభాగం వేదాంతం గురించి చెబుతుంది. కర్మ జీవనవిధానాన్ని నిర్దేశిస్తే, వేదాంతం జీవనదృక్పథాన్ని నిర్దేశిస్తుంది. ముందు వేదాంతభాగం అయిపోయింది. ఇప్పుడు కర్మయోగం రాబోతున్నది. అంటే బ్రహ్మశాస్త్రం అయిపోయింది, ధర్మశాస్త్రం రాబోతున్నది.

### సమత్వం యోగ ఉచ్యతే

కర్మయోగాన్ని ఒక్కముక్కలో చెప్పాడు కృష్ణపరమాత్మ. ఒకవ్యక్తి ఈ ప్రపంచంలో సమర్థవంతంగా వ్యవహారం నడపాలంటే దానికి కావాల్సిన ముఖ్యమైన లక్షణం – సమతుల్యత. ఈ విలువను భగవద్గీతలో అనేకచోట్ల నొక్కి వక్కాణిస్తాడు కృష్ణపరమాత్మ. సమత్వం అంటే మనస్సును స్థిరంగా ఉంచుకోవటం. అంటే జీవితంలో ఎటువంటి పరిస్థితులు ఎదురైనా చలించకపోవటం. ఎంత దుఃఖభూయిష్టమైన పరిస్థితి ఎదురైనా ప్రశాంతంగా ఉండగలగటం.

సమత్వం ఎందుకు ఉండాలంటే మనస్సు స్థిరంగా లేకపోతే, విచక్షణా శక్తి పోతుంది. దానివల్ల అతను తీసుకునే నిర్ణయాలు తప్పుడు నిర్ణయాలు అవుతాయి. అంతేకాదు, ప్రతి అనుభవంనుంచీ నేర్చుకునే సామర్థ్యం కూడా కోల్పోతాడు. జీవితం ఒక విశ్వవిద్యాలయం అనీ, ప్రతి అనుభవం కూడా ఒక పాఠం నేర్పిస్తుందనీ, అందులోనూ ఆనందకరమైన అనుభవాలకన్నా దుఃఖకరమైన అనుభవాలు ఇంకా గొప్ప పాఠాలు నేర్పిస్తాయనీ అంటారు. ఒక కత్తిని మెత్తని ఉపరితలంపై రుద్దితే లాభం లేదు; పదునైన అంచుమీద రుద్దితే, కత్తి కూడా పదునెక్కుతుంది. అలాగే బాధాకరమైన పరిస్థితులనుంచి విలువైన జీవితపాఠాలు నేర్చుకోగలము, కాని అలా నేర్చుకోవాలంటే మనస్సు ప్రశాంతంగా ఉండాలి. అంతకుముందు, ఒక వ్యక్తి విజయాన్ని అతని తెలివితేటలతో కొలిచేవారు, కాని ఇప్పుడు అతని విజయాన్ని అతని భావోద్రేకాలతో కొలుస్తున్నారు. తెలివితేటలను ఇంటెలిజెంట్ కోషంట్ (ఐ.క్యూ.) అనీ, భావోద్రేకాలను ఎమోషనల్ కోషంట్ (ఇ.క్యూ.) అనీ అంటారు. ఐ.క్యూ. బాగున్న ఒక విద్యార్థి పరీక్షకు బాగా నేర్చుకుని వెళ్ళినా కూడా, ప్రశ్నాపత్రం చూడగానే, అందులో మొదటిప్రశ్న తనకు తెలియకపోతే ఖంగారు పడిపోతాడు. తక్కిన ప్రశ్నలన్నిటికీ జవాబు తెలిసినా కూడా, ఖంగారు పడిపోయి వచ్చినవన్నీ మర్చిపోయి, పరీక్ష చెడగొట్టి వస్తాడు. అదే ఇ.క్యూ. బాగున్న విద్యార్థి ఇలాంటి పరిస్థితిలో చెక్కు చెదరకుండా ఉండి, తనకు తెలిసిన ప్రశ్నలన్నిటికీ బాగా జవాబులు రాసి వస్తాడు. ఈ ఇ.క్యూ.నే కృష్ణపరమాత్మ **సమత్వం** అంటున్నాడు.

**సుఖదుఃఖే సమే కృత్వా** – అంటే నీ ఇ.క్యూ.ని పెంచుకో. జయాపజయాలను సమానంగా భావించు. మానవ మాత్రుడన్న వాడెవరికీ ఎప్పుడూ విజయమే కలుగదు. ఏ క్రీడాకారుని ప్రశ్నించినా మీకీ విషయం చెబుతారు. నూటికి నూరుశాతం విజయం ఎవరికీ, ఎన్నటికీ రాదు. అందువల్లనే దయానందస్వామీజీ అంటారు: జీవితంలో విజయం సాధించటం అంటే జయాపజయాలను ఎదుర్కొనే సామర్థ్యం తప్ప ఏమీ కాదు. అందువల్ల నీ ధర్మాన్ని నువ్వు నిర్వర్తించు, సమే కృత్వా – నీ మనస్సును సుఖదుఃఖాలలో సమానంగా ఉంచుకో.

**లాభాలాభౌ** – అలాగే లాభనష్టాలలో కూడా సమానంగా ఉండాలి. ఎవరికీ ఎప్పుడూ లాభమే కలగదు.

**జయాజయౌ** – జయం, అపజయాలలో కూడా అంతే.

ఇది చాలా ముఖ్యమైన శ్లోకం. ఎప్పుడు ఎలా విజయం సాధించాలో బోధించటం లేదు కృష్ణపరమాత్మ. జయాపజయాలను ఎలా ఎదుర్కోవాలో బోధిస్తున్నాడు. వీటితోపాటు తక్కిన ద్వంద్వాలను కూడా కలుపుకోవాలి. ఉదాహరణకు – మానావమానాలు, జననమరణాలు, వృద్ధిక్షయాలు, శీతోష్ణాలు – అన్నింటినీ సమానంగా భరించాలి. సమానంగా భరించాలి అంటే ఒకదానికి పొంగిపోకూడదు; మరొకదానికి కృంగిపోకూడదు.

**తతః** – ఈ విధంగా మనస్సును సిద్ధం చేసుకున్నాక;

**యుద్ధాయ యుజ్యస్వ** – అర్జునా, యుద్ధసన్నద్ధుడవు కమ్ము.

**నైవం పాపమవాప్స్యసి** – అప్పుడు నీకు పాపములు అంటనే అంటవు. ప్రాపంచిక విషయాలలో జయాపజయాలు, సుఖదుఃఖాలు కలుగుతూనే ఉంటాయి; వాటికి పొంగిపోకుండా, కృంగిపోకుండా ఉండగలిగితే, ఆధ్యాత్మికంగా ఎన్నటికీ ఓడిపోవటమంటూ ఉండదు.

నేను ఎదుగుతాను. అత్యంత క్లిష్టపరిస్థితిలో కూడా ఒక పాఠం నేర్చుకుంటాను. ఏమిటది? నేనిది ఆశించాను అంటే, ఆ తప్పు ప్రపంచానిది కాదు; ఆశించిన నాది. ఒక వ్యక్తి వచ్చి నాకు సహాయం చేస్తాడని నేను ఆశించి, అతను సహాయం చేయకపోతే, నేను ఆ పరిస్థితిని రెండు విధాలుగా ఎదుర్కోవచ్చు. నన్ను మోసం చేసిన వ్యక్తిగా, ఆ వ్యక్తిని నిందించవచ్చు లేదా అటువంటి వ్యక్తినుంచి సహాయాన్ని ఆశించినందుకు నన్ను నేనే నిందించుకోవచ్చు. నేను అది ఎదురుచూడటంవల్ల నాకు ఈ ఆశాభంగం కలిగింది. అందువల్లనే ఎవరో మహానుభావుడు అన్నారు: విపత్కర పరిస్థితులు ఒక వ్యక్తిని తనకు తాను పరిచయం చేస్తాయి. అందువల్ల విపత్కర పరిస్థితులు నా లోటుపాట్లను నాకు చూపిస్తాయి. అంటే ప్రతి అనుభవమూ ఒక పాఠాన్ని నేర్పిస్తుంది.

శ్లో. 39 **ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు ।**
**బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి ॥**
ఏషా, తే, అభిహితా, సాంఖ్యే, బుద్ధిః, యోగే, తు, ఇమామ్, శృణు,
బుద్ధ్యా, యుక్తః, యయా, పార్థ, కర్మబంధమ్, ప్రహాస్యసి ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ | = ఓ పార్థా! | శృణు | = వినుము |
| ఏషా, బుద్ధిః | = ఈ సమత్వబుద్ధి | యయా | = ఏ (ఆ) |
| తే | = నీకు | బుద్ధ్యా | = బుద్ధితో |
| సాంఖ్యే | = జ్ఞానయోగవిషయమందు | యుక్తః | = కూడినవాడవై |
| అభిహితా | = చెప్పబడినది | కర్మబంధమ్ | = కర్మబంధమును |
| తు, ఇమామ్ | = అయితే దీనిని | ప్రహాస్యసి | = పారద్రోలగలవు |
| యోగే | = కర్మయోగ విషయమునను | | |

**హే పార్థ! ఏషా తే సాంఖ్యే బుద్ధిః అభిహితా। యోగే తు ఇమాం(బుద్ధిం) శృణు।**
**యయా బుద్ధ్యా యుక్తః (త్వమ్) కర్మబంధం ప్రహాస్యసి ॥**

తా: పరమార్థవస్తువివేకమనే విషయమందు ఈ జ్ఞానమును నేను నీకు చెప్పితిని. ఇప్పుడు ఈ కర్మయోగమనే విషయమందలి జ్ఞానమును వినుము. ఓ కుంతీపుత్రా! ఈ జ్ఞానము (సమబుద్ధి)తో కూడినవాడవై నీవు కర్మల బంధమునుంచి విముక్తుడవు కాగలవు.

**3. కర్మయోగం శ్లోకాలు 39-53 -** ఈ శ్లోకం ఒక మధ్యంతర శ్లోకం. ఇక్కడనుంచి కృష్ణపరమాత్మ వేరే విషయంలోకి వెళుతున్నాడు. ఇంతవరకూ జ్ఞానయోగం గురించి చెప్పాడు. దాన్ని ఆత్మానాత్మ వివేకం అని కూడా అంటారు. నా శాంతి, ఆనందం, భద్రతలకోసం బాహ్యప్రపంచంమీద ఆధారపడకుండా, నామీదే ఆధారపడటం నేర్చుకుంటాను ఆత్మజ్ఞానంలో. దీన్ని కృష్ణపరమాత్మ **సాంఖ్యం** అంటున్నాడు.

**ఏషా బుద్ధిః అభిహితా సాంఖ్యే –** సాంఖ్యం అంటే ఉపనిషత్తు. సాంఖ్యే అంటే ఉపనిషత్తులో విశదీకరించిన సత్యం. ఆ సత్యం దేని గురించి? నా గురించి, అంటే ఆత్మ గురించి. సాంఖ్యం అంటే ఆత్మ, బుద్ధిః అంటే జ్ఞానం. అందువల్ల సాంఖ్యబుద్ధిః అంటే ఆత్మజ్ఞానం. మామూలుగా బుద్ధి అంటే తెలివితేటలు, కాని ఇక్కడ జ్ఞానం. అందువల్ల ఓ అర్జునా, ఇంతవరకూ నీకు నేను ఆత్మజ్ఞానం గురించి చెప్పాను. ఇకనుంచి ఇంకొక జ్ఞానం గురించి చెప్పబోతున్నాను.

**యోగే ఇమాం శృణు –** ఇకనుంచి కర్మయోగం గురించి చెప్పబోతున్నాను. ఇక్కడ ప్రయాణం జ్ఞానయోగంనుంచి కర్మయోగానికి. కృష్ణపరమాత్మ ఇప్పుడు కర్మయోగం గురించి ఎందుకు చెబుతున్నాడు?

**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః –** అంతకుముందేమో, జ్ఞానయోగం ఒక్కటే జీవిని దుఃఖంనుంచి విముక్తి చేస్తుంది; అది ఒక్కటే దుఃఖమనే రోగానికి నివృత్తి అని చెప్పాడు.

జ్ఞానయోగమొక్కటే మోక్షమార్గమయినప్పుడు; కృష్ణపరమాత్మ జ్ఞానం గురించి ముందే చెప్పేసినప్పుడు, ఇప్పుడు కర్మయోగం గురించి చెప్పటం ఎందుకు? పోనీ కర్మయోగం, మోక్షానికి ఇంకో మార్గం అందామా అంటే కృష్ణపరమాత్మ తేల్చి చెప్పేశాడు, జ్ఞానం ఒక్కటే మోక్షమార్గమని. మరయితే కర్మయోగం ఎందుకు?

జ్ఞానయోగమొక్కటే మోక్షమార్గమయినా కూడా అందరూ జ్ఞానయోగానికి రాలేరు. ఐఐటీ లేదా ఎం.బి.ఏ.లో చేరాలంటే, వాటికి సంబంధించిన ఎంట్రెన్స్ ఎగ్జాములు పాసవ్వాలి. అలాగే జ్ఞానయోగంలోకి అడుగుపెట్టాలంటే దానికి ఎంట్రెన్స్ ఎగ్జామ్ కర్మయోగం. కర్మయోగం, జ్ఞానయోగానికి తొలిమెట్టు. అందువల్ల ఇప్పుడు చెప్పబోయే బోధయొక్క సారాంశం ఇది: కర్మయోగం పాటించు, చిత్తశుద్ధి పొందు, తరువాత జ్ఞానయోగానికి రా, మోక్షం పొందు.

**జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం**
**కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసంభవం**

కాని ఇప్పుడొక అపప్రథ ఉంది. ఏమిటది? కలియుగంలో జ్ఞానయోగం పొందటం చాలా కష్టం. అది కష్టం కాబట్టి వేరే ఏదైనా యోగాన్ని ప్రయత్నించండి అంటారు కొందరు. జ్ఞానయోగం కష్టం కాబట్టి, జ్ఞానయోగాన్ని తేలిక చేసుకోండి అంటాడు కృష్ణపరమాత్మ. ఎందుకు? ఎందుకంటే **మోక్షానికి జ్ఞానయోగం తప్ప వేరే మార్గం లేదు**. అయితే జ్ఞానయోగాన్ని ఎలా తేలిక చేసుకోవాలి? మనస్సును సంసిద్ధం చేసుకోవటం ద్వారా. మనస్సును సంసిద్ధం ఎలా చేసుకోవాలి? కర్మయోగం పాటించటం ద్వారా.

జ్ఞానయోగం కూడా గణితశాస్త్రంవంటిదే. కొంతమందికి గణితశాస్త్రం అంటే హడలు. మరికొంతమందికి గణితశాస్త్రం హల్వా తిన్నట్టు ఉంటుంది. అంటే, గణితశాస్త్రం దానంతట అది తేలికా కాదు, కష్టమూ కాదు. మనస్సు సంసిద్ధమైతే అది తేలిక, మనస్సు సంసిద్ధంగా లేకపోతే అది కష్టం. అదే సూత్రం జ్ఞానయోగానికి కూడా వర్తిస్తుంది. అసలు మన వాడుకలో ఏదైనా విద్య కష్టంగా ఉంటే, ఇది బ్రహ్మవిద్యలా ఉంది అంటారు. ఎలాంటి పరిస్థితి వచ్చిందో చూడండి! అందువల్ల మనం వేదాంతాన్ని ఇష్టపడటానికి, కృష్ణపరమాత్మ కర్మయోగాన్ని బోధించబోతున్నాడు. అన్నిటికన్నా గొప్ప బోధ వేదాంతం.

యోగే ఇమాం శృణు – దాన్ని నేర్చుకోవటానికి, అంటే ఈ కర్మయోగాన్ని విను. అప్పుడేమవుతుంది?

**బుద్ధ్యాయుక్తః** – ఈ కర్మయోగాన్ని నేర్చుకుని, ఆచరణలో పెడితే ఏమవుతుంది?

**కర్మబంధం ప్రహాస్యసి** – కర్మబంధాలనుంచి విముక్తడవుతావు, అంటే మోక్షం పొందుతావు. మోక్షం అంటే మరణించాక స్వర్గలోకాలకు వెళ్ళటం కాదు; మోక్షం అంటే అన్నిరకాల భావోద్రేకాలనుంచి విముక్తి పొందటం. కామక్రోధాలు, లోభమోహాలనుంచి ముక్తి. ఇవన్నీ మనను సంసారంలో పడవేసి, మనస్సు కలత చెందేలా చేస్తాయి. మోక్షం అంటే మనస్సు శాంతి పొందుతుంది. అటువంటి మోక్షం పొందుతాము. ఇది కర్మయోగానికి ఉపోద్ఘాత శ్లోకం. రాబోయే శ్లోకాల్లో కర్మయోగం గురించి మరింతగా పరిచయం చేయబోతున్నాడు.

శ్లో. 40 **నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।**
**స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥**
న, ఇహ, అభిక్రమనాశః, అస్తి, ప్రత్యవాయః, న, విద్యతే,
స్వల్పమ్, అపి, అస్య, ధర్మస్య, త్రాయతే, మహతః, భయాత్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఇహ | = ఈ కర్మయోగమందు | | ధర్మస్య | = ధర్మముయొక్క |
| అభిక్రమనాశః | = ఆరంభ (బీజ) నాశనము | | స్వల్పమ్, అపి | = ఏ కొంచెము సాధనయైనను |
| న, అస్తి | = ఉండదు | | మహతః భయాత్ | = జన్మమృత్యురూపమైన గొప్ప భయమునుంచి |
| ప్రత్యవాయః | = విపరీతఫలరూపదోషము గూడ | | త్రాయతే | = కాపాడును |
| న, విద్యతే | = (ఏ మాత్రము) ఉండదు | | | |
| అస్య | = ఈ (కర్మయోగరూపమైన) | | | |

**ఇహ అభిక్రమనాశః న అస్తి ప్రత్యవాయః న విద్యతే ।**

**అస్య ధర్మస్య స్వల్పమపి (అనుష్ఠానమ్) మహతః భయాత్ త్రాయతే॥**

తా: ఈ కర్మయోగమందు ప్రారంభించినది చెడిపోవుట గాని, ప్రత్యవాయము (విపరీతఫలము) గాని లేదు. ఈ యోగమనే ధర్మముయొక్క ఫలము అల్పమైననూ పెద్ద సంసారభయమునుంచి కాపాడును.

ఈ శ్లోకాల్లో కర్మయోగాన్ని స్తుతిస్తున్నాడు కృష్ణపరమాత్మ. కర్మయోగమంటే ఏమిటో ఇప్పుడు చెప్పడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే కర్మయోగం అంటే ఆంతర్గత ఎదుగుదల. ప్రాపంచిక విజయంకన్నా ఆంతర్గత ఎదుగుదలకు ప్రాముఖ్యతనిచ్చే జీవన విధానం. ఎందుకంటే భగవద్గీత ప్రాథమికంగా బోధించే సత్యం ఇది: మన మనశ్శాంతి మనకు ఏం ఉంది అన్నదానిమీద ఆధారపడదు; మన మనశ్శాంతి మనమేమిటి అన్నదానిమీద ఆధారపడుతుంది. మనకున్న అత్యంత పెద్ద అపోహ మనకెంత ఎక్కువ ఉంటే, అంత ఎక్కువ శాంతి, భద్రత, ఆనందాలు పొందుతామని. కాని అది తప్పంటుంది గీత. శాంతి భద్రతలు మన స్వభావంమీద ఆధారపడి ఉంటాయి. మనకున్న ఆంతర్గత ఎదుగుదలమీద ఆధారపడి ఉంటాయి.

నిజానికి ఎక్కువ ఉన్నవారికి ఎక్కువ భద్రతా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఏమీ లేకపోయినా అత్యంత ఆనందంగా ఉన్నవారు ఉన్నారు!

**సురమందిరతరుమూల నివాసః, శయ్యా భూతలమజినం వాసః ।**

**సర్వపరిగ్రహభోగత్యాగః, కస్యసుఖం న కరోతి విరాగః** – భజగోవిందమ్ – 18

సన్న్యాసులు, ఋషులకు ప్రాపంచిక సుఖాలు లేవు కాని వారు ఎంతో ఆనందంగా, ఎంతో శాంతిగా ఉన్నారు. అందువల్ల కర్మయోగంలో ఆంతర్గత ఎదుగుదలమీద ఎక్కువగా దృష్టి పెడతాము. ప్రాపంచిక విజయాలకు ఎక్కువ ప్రాముఖ్యతనివ్వము. ప్రాపంచిక విజయాలను పట్టించుకోమని కాదు దాని అర్థం. ఐశ్వర్యానికి, ఆస్తి, అంతస్థులకు గౌరవం ఇస్తాము, కాని అంతర్గత ఎదుగుదలా, బాహ్యవిజయమా అనే మీమాంస వస్తే, కర్మయోగి ఆంతర్గత ఎదుగుదలకే పెద్దపీట వేస్తాడు. కర్మయోగం గురించి వివరంగా తరువాత చూస్తాము; ఇక్కడ కర్మయోగ స్తుతిని చూస్తాము.

**ఇహాభిక్రమనాశః న అస్తి** – ఇహ అంటే కర్మయోగంలో. కర్మయోగంలో నాశనము అనేది లేదు. కర్మయోగి తను జీవితంలో ఓడిపోయానని ఎన్నడూ భావించడు. ప్రాపంచిక దృష్ట్యా అతను ఓటమి పొందివుండవచ్చు; వ్యాపారంలో దెబ్బతిని ఉండవచ్చు; డబ్బు పోగొట్టుకుని ఉండవచ్చు; ఉద్యోగం పోయి ఉండవచ్చు; లోకం అంతా అతను

ఓటమి పొందాడని కోర్టై కూయవచ్చు, కాని అతని దృష్టిలో అతను ఓడిపోలేదు. ఎందుకంటే అతను బాహ్యంగా ఓడిపోయినా అంతర్గతంగా గెలుపొందాడు. అటువంటి క్లిష్టపరిస్థితులనుంచి అతను ఎంతో విలువైన, ముఖ్యమైన జీవితపాఠాలను నేర్చుకున్నాడు. అందువల్ల కర్మయోగి ఓటమి నెరుగడు.

**ప్రత్యవాయో న విద్యతే** – అలాగే వ్యతిరేక ఫలితాలు కూడా ఉండవు. ప్రాపంచిక దృష్ట్యా, చేసిన ఏ కర్మకైనా సానుకూల ఫలితం రావచ్చు లేదా ప్రతికూల ఫలితం రావచ్చు. ఒక వ్యాపారం చేబట్టితే, లాభం వస్తే అది సానుకూల ఫలం; నష్టపోతే ప్రతికూల ఫలం. ఒక రోగం వస్తే మందు తీసుకున్నాక రోగం తగ్గితే సానుకూల ఫలం, అది తగ్గకపోగా ఇంకోరోగం వస్తే అది ప్రతికూలఫలం. తలనెప్పికి మాత్ర తీసుకుంటే కడుపునొప్పి వస్తే ప్రత్యవాయఫలం. ఈ రెండు ఫలాలూ లౌకికదృష్ట్యా ఉంటాయి కాని, ఆధ్యాత్మిక సాధకునికి ఎప్పుడూ సానుకూలఫలమే ఉంటుంది. ఎందుకంటే ఏ అనుభవం కలిగినా, కర్మయోగి దానినుంచి పాఠం నేర్చుకుంటాడని చూశాము. ఒక వ్యక్తి ఏడు సంవత్సరాలు సంగీతం నేర్చుకుని మానేశాడు, 'ఎందుకు మానేశావు?' అని అడిగితే, 'నాకు సంగీతం వంటబట్టదని అర్థం అయింది,' అన్నాడుట. అలా ఒక మంచి పాఠం నేర్చుకున్నాడు. ఇకమీదట ఇరుగుపొరుగుని ఇబ్బంది పెట్టడు. అలాంటి సానుకూల ఆలోచన ఉన్న వ్యక్తి ఎదుటివారు తనమీద విసిరిన రాళ్ళతో రాజసౌధాలు నిర్మిస్తాడు. అంటే అతనికి ప్రతికూలఫలం ఉండదు.

**స్వల్పమప్యస్య ధర్మస్య** – అంతేకాదు, అతను ఏ కొంచెం సాధన చేసినా కూడా, అంతమేరకు మంచి ఫలమే దక్కుతుంది. అదే లౌకికఫలం గురించి చూస్తే, లౌకిక కర్మ పూర్తి అయితేనే అతనికి ఫలితం దక్కుతుంది. ఇది ప్రకృతి నియమం. మనం మంచినీటికోసం పది అడుగుల లోతు తవ్వి, అంతమేరకు నీరు రావాలని ఆశిస్తే, ఫలితం శూన్యం. నీరు ఎంతలోతులో ఉందో, అంతకన్నా లోతుకు వెళ్ళితీరాలి. లేకపోతే ఫలితం దక్కదు. కర్మయోగం విషయంలో అలాకాదు కర్మలో పావువంతు చేసినా, సగం చేసినా కర్మయోగికి ఫలం దక్కుతుంది.

ఉదాహరణకు విష్ణుసహస్రనామపారాయణ విషయమే తీసుకోండి. దాన్ని సకామకర్మగా చేస్తే, అంటే ఒక కోరిక తీరటంకోసం చేస్తే, దానికి పాటించాల్సిన నియమాలన్నీ పాటించి తీరాలి. ఏ సమయంలో, ఎన్నిసార్లు పారాయణం చేయమంటే ఆ సమయంలో అన్నిసార్లు చేసితీరాలి. 11 సార్లు చదవమంటే 10 సార్లు చదివి మానేస్తే ఆశించిన ఫలం రాదు. అంతేకాదు, ఇంత నైవేద్యం పెట్టాలంటే, అందులో ముప్పావువంతు నైవేద్యమే పెడతాను, ముప్పావువంతు ఫలం వస్తే చాలు అనుకుంటే లాభం లేదు. రెండే మార్గాలున్నాయి – కర్మను పూర్తిచేసి, పూర్తి ఫలితం పొందటం, లేదా పూర్తి చేయకుండా అసలేం ఫలితం పొందకపోవటం.

ఇదే విష్ణుసహస్రనామ పారాయణం, ఆంతర ఎదుగుదలకోసం చేస్తున్నారనుకోండి, అది పూర్తి చేయక పోయినా, దానికి తగ్గ ఫలం వస్తుంది (ఈ మాటను పట్టుకుని అరకొరగా చేయకండి). అంటే కర్మ, కర్మ పూర్తి అయితేనే ఫలాన్ని ఇస్తుంది; కర్మయోగం కర్మ పూర్తి అవకపోయినా దానికి తగ్గ ఫలాన్నిస్తుంది.

ఇంకొక సమస్య కూడా ఉంది సకామకర్మ విషయంలో. సకామకర్మ చేసేటప్పుడు, నామాలను సరిగ్గా ఉచ్చరించాలి. ఒక్కోసారి కోరుకున్న ఫలం రాకపోగా, బెడిసికొట్టవచ్చు కూడా. కాని చిత్తశుద్ధికోసం చేస్తున్నప్పుడు, ఇవేవీ లెక్కలోకి రావు.

**మహతః భయాత్ త్రాయతే** – అంతేకాదు, కర్మయోగం జన్మమృత్యురూప మహాభయంనుంచి కాపాడుతుంది. అందువల్ల అర్జునుణ్ణి కర్మయోగి అవమంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 41 **వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన ।**
**బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽ వ్యవసాయినామ్ ॥**
వ్యవసాయాత్మికా, బుద్ధిః, ఏకా, ఇహ, కురునందన,
బహుశాఖాః, హి, అనంతాః, చ, బుద్ధయః, అవ్యవసాయినామ్ ॥

| | | |
|---|---|---|
| కురునందన | = | ఓ అర్జునా! |
| ఇహ | = | ఈ (నిష్కామ) కర్మ యోగమందు |
| వ్యవసాయాత్మికా | = | నిశ్చయాత్మకమైన |
| బుద్ధిః | = | బుద్ధి |
| ఏకా(భవతి) | = | ఒకటిగానే ఉండును |
| అవ్యవసాయినామ్ | = | (కాని) స్థిరబుద్ధిలేని వివేకహీనులైన సకామ మనుష్యులయొక్క |
| బుద్ధయః | = | బుద్ధులు |
| హి | = | నిశ్చయముగా |
| బహుశాఖాః | = | అనేక భేదములుగలిగినవై (చంచలములై) |
| చ | = | ఇంకా |
| అనంతాః | = | అంతులేని (కోరికలుగలవై ఉండును). |

**హే కురునందన! ఇహ వ్యవసాయాత్మికా ఏకా బుద్ధిః।**
**అవ్యవసాయినాం హి బుద్ధయః అనన్తాః బహుశాఖాః చ॥**

తా: కురువంశమును ఆనందింపజేసే ఓ అర్జునా! ఈ మోక్షమార్గమునందు నిశ్చయస్వభావము గల బుద్ధి ఒకటిగానే ఉండును. నిశ్చయబుద్ధి లేనివారల బుద్ధులైతే అనేక భేదములు గలవి ఇంకా అంతం లేనివి.

మన ధర్మంలో మనం ఎదుర్కొనే సమస్యల్లో ఒకటి, మన శాస్త్రాలు అనేక ఆధ్యాత్మిక సాధనలను నిర్దేశిస్తాయి. ఎందుకు? మన శాస్త్రాలే చాలా పెద్దసంఖ్యలో ఉన్నాయి. మనకు వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు, వాటిమీద భాష్యాలు, ఉపభాష్యాలు ఉన్నాయి. వీటన్నిటినీ క్రోడీకరిస్తే అనేక సాధనలు ఉన్నాయి. అవి పూజ, ధ్యానం, భజన, తీర్థయాత్రలు. మోక్షం పొందటానికి అవి అనేక మార్గాలను సూచిస్తాయి. కొందరు సంగీతంతో మోక్షం పొందవచ్చు అంటే, మరికొందరు భక్తితో మోక్షం పొందవచ్చు అంటారు. ఉపాసన చెయ్యమంటారు ఇంకెవరో! ఏదీ వద్దు నీ ధర్మాన్ని నువ్వు నిర్వర్తించు చాలు, దానితో మోక్షం పొందవచ్చు అంటారు. ఇవికాక టీవీ, వార్తా పత్రికలు అనేక సాధనాలను కీర్తిస్తుంటాయి. ఒకరోజు నేనెవరు అని ఆత్మ విచారణ చేయి చాలు అంటే, ఇంకొకరోజు కుండలినీ ధ్యానం చేయమంటారు. ఇవేవీ కావు, రామనామ జపం చేయి చాలు అని చెప్పి ధ్రువుడు, ప్రహ్లాదుల కథలను ఉటంకిస్తారు.

అందువల్ల దిగ్విజయంగా ఆధ్యాత్మిక సాధన చేయాలంటే, ప్రతి ఒక్క సాధన గురించీ, దాని పాత్ర గురించీ స్పష్టమైన అవగాహన ఉండాలి. దాన్ని ఎలా వినియోగించాలో తెలియకపోతే, దాన్ని దుర్వినియోగం చేసే

ప్రమాదం ఉంది. కృష్ణపరమాత్మ కర్మయోగికి సాధన, సాధ్యాల గురించిన సరియైన జ్ఞానం ఉంది అని చెబుతున్నాడు. సాధ్యసాధన విషయ నిశ్చయజ్ఞానం.

ఇప్పుడు సాధ్య, సాధనల విషయం తీసుకుంటే అంతిమ సాధ్యం వేరే ఉంటుంది, మధ్యంతర సాధ్యం వేరే ఉంటుంది. మీరు ఢిల్లీ వెళ్ళాలనుకుంటే, అది అంతిమలక్ష్యం. దానికోసం ముందు మీరు విమానాశ్రయానికి వెళ్ళాలి. అది ఒక మధ్యంతర లక్ష్యం. దానికోసం కారో, టాక్సీనో ఎక్కి విమానాశ్రయానికి వెళ్ళాలి. ఇది మొదటి మధ్యంతర లక్ష్యం. అందువల్ల ఏది మధ్యంతర లక్ష్యమో, ఏది అంతిమ లక్ష్యమో తెలుసుకోవాలి.

**వ్యవసాయాత్మికా బుద్ధిః** – జీవితంలో ఏం కోరుకుంటున్నారో దాని గురించిన స్పష్టత ఉండాలి. చాలామందికి ఆ స్పష్టత ఉండదు. ఏమిటా అంతిమ లక్ష్యం? కృష్ణపరమాత్మ ప్రత్యేకించి చెప్పడు కానీ, ప్రతివ్యక్తీ సహజంగా కోరుకునేది స్వేచ్ఛ. తల్లి చెయ్యి పట్టుకుని నడిచే పిల్లవాడు, కాలిబలం చిక్కగానే చెయ్యి వదిలి పరుగులు తీస్తాడు. జంతువులు కూడా స్వేచ్ఛ కోరుకుంటాయి. కాని మనం చెప్పే స్వేచ్ఛ అది కాదు. ఆంతర్గత స్వేచ్ఛ. ఎవరితో ప్రమేయం లేకుండా నా అంతట నేను ఆనందంగా ఉండాలి.

**సర్వం పరవశం దుఃఖం, సర్వమ్ ఆత్మవశం సుఖమ్**

ఆధారపడితే దుఃఖం, స్వేచ్ఛగా ఉంటే ఆనందం. అందువల్ల నా అంతిమలక్ష్యం స్వేచ్ఛ. స్వేచ్ఛ కావాలి సరే, స్వేచ్ఛ పొందటానికి సాధన ఏమిటి? కర్మయోగికి ఈ విషయంలో కొంత అవగాహన ఉంటుంది; నేను ముందే ముక్తపురుషుణ్ణి, కాని నేను ఆ స్వేచ్ఛను ఇంకా కనుగొనలేదు. అది జ్ఞానం ద్వారానే పొందగలను అని తెలుసుకుంటాడు. అంటే **స్వేచ్ఛ లక్ష్యం, జ్ఞానం మార్గం**. ఇది అంతిమ లక్ష్యం.

జ్ఞానం పొందటానికి ఏం కావాలి? జ్ఞానయోగ్యత కావాలి. మనం ఫిజిక్స్‌లో ఎమ్మెస్సీ చెయ్యాలంటే, బియ్యెస్సీ ఫిజిక్స్ చదివివుండాలి. వేరే ఏదో చదివి, దీనికి రాలేము. అందువల్ల ఎమ్మెస్సీ లక్ష్యం, బియ్యెస్సీ జ్ఞానయోగ్యత. అలాగే **జ్ఞానం లక్ష్యం, జ్ఞానయోగ్యత మార్గం.**

ఇప్పుడు ఇంకొక సాధన ఉంది. జ్ఞానయోగ్యత లక్ష్యం కావాలంటే, దానికి మార్గమేమిటి? కర్మయోగం. కృష్ణపరమాత్మ కర్మయోగాన్ని సూచిస్తున్నాడు. కర్మయోగం అంటే ఏమిటో తరువాత చెబుతాడు కృష్ణపరమాత్మ. అప్పుడే అదేమిటో చూద్దాము. ఇప్పుడు **జ్ఞానయోగ్యత లక్ష్యం, కర్మయోగం మార్గం** అని తెలుసుకుంటే చాలు. అందువల్ల మన ప్రయాణం ఏమిటి? కర్మయోగమార్గంలో వెళ్ళి, జ్ఞానయోగ్యత లక్ష్యం పొంది; జ్ఞానయోగ్యత మార్గంలో వెళ్ళి జ్ఞానం పొందాలి. అప్పుడు జ్ఞానమార్గంలో వెళ్ళి, స్వేచ్ఛ అనే అంతిమ లక్ష్యాన్ని పొందాలి. కర్మయోగికి ఈ మార్గం గురించిన స్పష్టమైన అవగాహన ఉంటుంది. పూజ, జపం, దానం, యజ్ఞం ఏం చేసినా, అవన్నీ కర్మయోగం కింద వస్తాయి కాని, అవి జ్ఞానయోగం కాదు. అంటే జ్ఞానానికి దారితీయవు.

**ఏకా** – నిశ్చయాత్మక బుద్ధి ఉంటుంది. ఎవరొచ్చి ఏం చెప్పినా, చలించరు. కర్మయోగి కాని వారు చాలా అవస్థ పడతారు. నాస్తికుల విషయంలో వారు మతం జోలికి రారు కాబట్టి, వారికి అయోమయం లేదు.

**అవ్యవసాయినామ్** – కాని ఆస్తికులు అయి ఉండి, ఏం చేయాలో తేల్చుకోలేనివారి పరిస్థితి ఏమిటి?

**బహుశాఖాః** – వారి బుద్ధి చంచలంగా ఉండి, అనేక మార్గాల వెంట పరుగులు తీస్తుంది. ఎవరో వచ్చి భజన చేయమంటే, అది కొన్నిరోజులు చేస్తారు! ఇంకెవరో వచ్చి కుండలినీ ధ్యానం చేయమంటే దానివైపు మొగ్గు చూపుతారు. మూడోవారు వచ్చి గీతాబోధకు వెళదామంటే నాలుగురోజులు వస్తారు. అలాంటి వారిని బహుశాఖాః అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈ అయోమయ పరిస్థితిలో ఒక్కోసారి మతంమీద నమ్మకం పోయి, నాస్తికులుగా మారే ప్రమాదం కూడా ఉంది. వచ్చిన చిక్కేమిటంటే, ఎవరికైనా మతం సరిగ్గా అర్థం కాకపోతే, తన మేధస్సుకు అందలేదు అనుకోరు, మతాన్ని తప్పు పడతారు. 'అబ్బో, నేను చాలా చేశాను కాని ఏమీ ఫలితం దక్కలేదు, జలుబు చేయటం తప్ప,' అని ఒక విమర్శ వదులుతారు. అక్కడికేదో తాము మతపరంగా జీవిస్తే జలుబు రాకూడదన్నట్టు ఉంటుంది, అతని వ్యవహారం! అదేం తర్కం? అందులో అర్థం లేదు.

అదే లౌకిక విషయానికి వచ్చేసరికి, ఏ చిన్నపని చేయాలన్నా బోలెడు సాధన చేస్తారు. కంప్యూటరు వాడటం నేర్చుకోమంటేనే 20,000 దాకా ఖర్చుపెట్టి మరీ ఆరునెలలో, తొమ్మిది నెలలో శిక్షణ పొందుతారు. ఆఖరికి టెన్నిస్ ఆట ఆడాలన్నా కూడా శిక్షణ పొందుతారు. కంప్యూటరు విషయంలో శిక్షణ పొందకుండా దాన్ని వాడితే అది చెడికూర్చుంటుంది. కాని ధర్మం విషయంలో మాత్రం శాస్త్రంనుంచి ఏమీ నేర్చుకోకుండానే, ఆశించిన ఫలితాలు వచ్చేయాలి. ఎలా కంప్యూటరు నేర్చుకోకుండా వాడితే అది పాడవుతుందో, అలా శాస్త్రం నేర్చుకోకుండా సాధనలు చేస్తే, ప్రతికూల ఫలితాలు ఏర్పడవచ్చు. పూర్వకాలం బ్రహ్మచర్య ఆశ్రమంలో ధర్మం గురించిన ప్రాథమిక జ్ఞానం నేర్పించేవారు. ఇప్పుడవి లేవు. అందువల్ల కొందరు ధర్మానికి విలువ ఇవ్వరు; ఇచ్చేవారికి కూడా దాని విలువ ఏమిటో తెలియదు. అటువంటివారిని బహుశాఖాః అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అనంతాః చ** – అంతేకాదు, వారికి అనంతమైన భావాలు ఉంటాయి. భగవంతుడు, ప్రపంచం, కర్మ, పూజ, వస్త్రధారణ – వీటన్నిటి గురించి అనంతమైన ప్రశ్నలుంటాయి. ఎందుకు? ప్రాథమిక జ్ఞానం లేకపోవటంవల్ల. **బుద్ధయః (అవ్యవసాయినామ్)–** సత్యం ఒకటే, అయోమయాలు అనేకం. 2+2 కి సరైన జవాబు ఒకటే కాని తప్పుడు జవాబులు ఎన్ని? అనంతం.

శ్లో. 42 **యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్యవిపశ్చితః ।**
**వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః ॥**
యామ్, ఇమామ్, పుష్పితామ్, వాచమ్, ప్రవదంతి, అవిపశ్చితః,
వేదవాదరతాః, పార్థ, న, అన్యత్, అస్తి, ఇతి, వాదినః ॥

శ్లో. 43 **కామాత్మానః స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్ ।**
**క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥**
కామాత్మానః, స్వర్గపరాః, జన్మకర్మఫలప్రదామ్,
క్రియావిశేషబహులామ్, భోగైశ్వర్యగతిమ్, ప్రతి ॥

శ్లో. 44 **భోగైశ్వర్యప్రసక్తానాం తయాఽ పహృతచేతసామ్ ।**
**వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే ॥**
భోగైశ్వర్యప్రసక్తానామ్, తయా, అపహృతచేతసామ్,
వ్యవసాయాత్మికాబుద్ధిః, సమాధౌ, న, విధీయతే ॥

| | |
|---|---|
| పార్థ | = ఓ పార్థా! |
| వేదవాదరతాః | = వేదములలోని ఫలశ్రుతి యందు ప్రీతిగలవారు |
| అన్యత్ | = అందు చెప్పబడిన స్వర్గాది భోగాలకన్నా అధికమైన ఫలము వేరొకటి |
| న, అస్తి, ఇతి వాదినః | = లేదని వాదించు వారును |
| కామాత్మానః | = కోరికలతో నిండిన మనస్సులు గలవారును |
| స్వర్గపరాః | = స్వర్గమే పరమప్రాప్యమను వారును అగు |
| అవిపశ్చితః | = అవివేకులు |
| జన్మకర్మ ఫలప్రదామ్ | = జన్మరూపకర్మఫలమును ఇచ్చునట్టిదియు |
| భోగైశ్వర్యగతిం ప్రతి | = భోగైశ్వర్యములను సంపాదించుటకు |
| క్రియావిశేష బహులామ్ | = వివిధ కార్యకలాపములతో కూడినదియు |
| పుష్పితామ్ | = ఫలప్రదముగాని కేవలము చూచుటకు మాత్రమే రమ్యముగానుండునదియు అగు |
| యామ్, ఇమామ్ | = ఏ ఈ |
| వాచమ్ | = వాక్యమును |
| ప్రవదంతి | = విశేషముగా చెప్పుచున్నారో |
| తయా | = దానిచేత |
| అపహృత | = అపహరింపబడిన |
| చేతసామ్ | = మనస్సులు గలవారును |
| భోగైశ్వర్య | = భోగైశ్వర్యములయందు |
| ప్రసక్తానామ్ | = మిక్కిలి ఆశ గలవారికి |
| వ్యవసాయాత్మికా బుద్ధిః | = నిశ్చయమైన బుద్ధి |
| సమాధౌ | = దైవధ్యానమునందు |
| న విధీయతే | = కలుగదు |

**హే పార్థ! వేద-వాద-రతాః, అన్యత్ అస్తి ఇతి వాదినః, అవిపశ్చితః కామ-ఆత్మానః, స్వర్గ-పరాః భోగ-ఐశ్వర్య-గతిం ప్రతి క్రియా-విశేష-బహులాం జన్మ-కర్మ-ఫలప్రదాం యామ్ ఇమాం పుష్పితాం వాచం ప్రవదంతి,తయా-అపహృత-చేతసాం భోగ-ఐశ్వర్య-ప్రసక్తానాం బుద్ధిః వ్యవసాయ - ఆత్మికా (భూత్వా) సమాధౌ న విధీయతే॥**

తా: ఓ కుంతీపుత్రా! వివేకజ్ఞానములేనివారు, కోరికలే స్వభావముగా గలవారై (వినుటకు సొంపైన) వాక్కును పలికెదరో, ఆ వాక్కు పుట్టుక అనే కర్మఫలమునిచ్చును. వేదములోని అర్థవాదములపై ప్రీతిగల అట్టివారికి స్వర్గమే పురుషార్థము. (స్వర్గమునిచ్చే కర్మకన్నా) వేరొకటి గొప్పది లేదని వారు చెప్పుచుందురు. ఆ వాక్కు భోగములను, ఐశ్వర్యమును పొందటం అనేక క్రియలతో నిండియుండును. వారు భోగములు, ఐశ్వర్యము

అను వాటియందు గట్టి ఆసక్తి గలవారు. వారి బుద్ధి ఆ వాక్కుచే అపహరించబడినది. (మోక్షమందు) నిశ్చయస్వభావముగల బుద్ధి ఏకాగ్రతయందు నిలబడుట వారికి ఉండదు. (లేదా, నిశ్చయస్వభావముగల జ్ఞానము అంతఃకరణమందు ఉదయించదు).

**సరియైన కర్మ –** ఈ మూడు శ్లోకాల్లోనూ వ్యవసాయాత్మికా బుద్ధి లేనివారిని తీవ్రంగా విమర్శిస్తున్నాడు కృష్ణపరమాత్మ. వ్యవసాయాత్మికా బుద్ధి ఉన్నవారు కర్మయోగులు అనీ, అది లేనివారిని కర్మఠులు అనీ అనవచ్చు. ఈ మూడు శ్లోకాలూ అర్థం అవాలంటే, ముందు కొన్ని ప్రాథమిక అంశాలు తెలుసుకోవాలి. వాటిని 17వ అధ్యాయంలో కృష్ణపరమాత్మ వివరంగా చెబుతాడు. కృష్ణపరమాత్మ సరియైన కర్మను వివరిస్తున్నాడు. కర్మలను మూడు రకాలుగా విభజిస్తారు. అవి – సాత్త్వికకర్మలు, రాజసకర్మలు, తామసకర్మలు.

**సాత్త్విక కర్మలు** – సాత్త్వికకర్మలను నిస్వార్థకర్మలు అనవచ్చు. ఎందుకంటే అవి ఎక్కువమందికి పనికివచ్చే కర్మలు. అంటే ఇందులో స్వార్థం ఉండదు, సమాజశ్రేయస్సే ప్రాథమికంగా ఉంటుంది. ఇవి నిష్కామకర్మలు. ఇవి ఉత్తమ కర్మలు.

**రాజస కర్మలు** – రాజసకర్మలు స్వార్థపూరితమైన కర్మలు. ఎంతసేపూ నా నీటు, నా గోటు అనుకుంటాడు కాని ఎదుటివారికోసం పాటుపడడు. వారికి మంచి జరిగినా, చెడు జరిగినా తనకు అనవసరం. తను బాగుపడితే చాలు.

**తామస కర్మలు** – తామసకర్మలు కూడా స్వార్థపూరితకర్మలే కాని ఇవి రాజసకర్మలకన్నా దారుణం. ఎందుకంటే తను బాగుపడటంకోసం, ఎదుటివారికి హాని చేయటానికి కూడా వెనుకాడరు వీరు. ఎవరి గురించీ పట్టించుకోరు. ఇవి హానికర కర్మలు.

ఈ మూడింటి గురించీ ఒక్కముక్కలో చెప్పాలంటే, ఇవి వరుసగా నిస్వార్థకర్మలు, స్వార్థపూరితకర్మలు, హానికరకర్మలు. ఈ కర్మలు ఆంతర ఎదుగుదలకు ఎలా తోడ్పడుతాయి?

**సాత్త్విక కర్మలు** – సాత్త్విక కర్మలు ప్రాథమికంగా ఒక వ్యక్తియొక్క ఆంతర ఎదుగుదలకు తోడ్పడతాయి అంటాయి శాస్త్రాలు. దీనివల్ల ఆంతర ఎదుగుదల అంటే చిత్తశుద్ధి కలుగుతుంది. దీన్నే జ్ఞానయోగ్యత అని కూడా అంటాము. సాత్త్వికకర్మలవల్ల బాహ్య ఉన్నతి కూడా కలగవచ్చు కాని, అవి ముఖ్యం కాదు. ముఖ్యమైన ఫలం ఆంతర ఎదుగుదల, దానితో భాగంగా లౌకిక సుఖాలు.

**రాజస కర్మలు** – రాజసకర్మలు కూడా కొంతమేరకు ఎదుగుదలకు తోడ్పడతాయి కాని వాటి కొలత వేరు. రాజస కర్మలు ప్రాథమికంగా బాహ్య ఉన్నతికి తోడ్పడతాయి కాని ఆంతర ఎదుగుదల చాలా తక్కువ ఉంటుంది.

**తామస కర్మలు** – తామసకర్మలలో ఎదుటి వ్యక్తికి హాని చేయటానికి కూడా వెనుకాడడని చూశాము కదా, అందువల్ల అతనికి బాహ్యంగా ఉన్నతి కలుగుతుందేమో కాని, అతనికి ఆంతర ఎదుగుదల కలుగదు సరికదా, అతన్ని ఉన్నచోటే ఉంచకపోగా, ఆధ్యాత్మికంగా కిందకు తోసేస్తుంది.

ఈ మూడింటి గురించీ ఒక్కముక్కలో చెప్పాలంటే ఇవి వరుసగా ఎక్కువ ఆంతర ఎదుగుదలకు తోడ్పడతాయి, చాలా తక్కువ ఆంతర ఎదుగుదల కలుగుతుంది, ఆంతర ఎదుగుదల కలగకపోగా కిందికి తోసేస్తాయి.

ఒక వ్యక్తి శాంతి, భద్రత, ఆనందాలు ప్రాపంచిక గెలుపుమీద ఆధారపడతాయా, ఆంతర ఎదుగుదలమీద ఆధారపడతాయా అని ప్రశ్న వేస్తే నిస్సందేహంగా ఆంతర ఎదుగుదలమీదే ఆధారపడతాయి. బాహ్య ఉన్నతి కొంత ఆనందాన్ని, శాంతిని ఇస్తుంది నిజమే కాని శాంతి, ఆనందాలకు ప్రాథమిక కారణం మాత్రం ఆంతర ఎదుగుదలే. ఎందుకు? ఒకవేళ ఒక వ్యక్తికి అన్ని సుఖాలు ఉన్నా, ఆంతర ఎదుగుదల లేకపోతే, అతను వాటిని నిశ్చింతగా అనుభవించలేడు. ఎందుకంటే అతను కొన్ని సందర్భాలలో మనస్సాక్షి నోరు నొక్కి మరీ, విజయాలు సాధించి ఉండవచ్చు. అప్పుడు అతన్ని అపరాధభావన తొలిచేస్తుంది. దీనికి విరుద్ధంగా, బాహ్య ఉన్నతి లేదు కాని, ఆంతర ఎదుగుదల ఉందనుకోండి, అప్పుడా వ్యక్తి నిశ్చింతగా శాంతి, ఆనందాలను పొందుతాడు. కర్మయోగం గురించి నేర్చుకునేటప్పుడు, ఈ విషయాలను గుర్తు పెట్టుకోవాలి.

టూకీగా మళ్ళీ చూస్తే, ఆంతర ఎదుగుదలకు మూడు రకాల కర్మల గురించి తెలుసుకోవాలి; శాంతి, ఆనందాలకు ఆంతర ఎదుగుదలే ప్రాథమికంగా తోడ్పడుతుందని తెలుసుకోవాలి. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకునే కృష్ణపరమాత్మ రాజసకర్మలు చేసేవారిని తీవ్రంగా విమర్శిస్తున్నాడు. రాజసకర్మలు అంటే స్వార్థపూరిత కర్మలు చేసేవారు, ఇతరుల గురించి పట్టించుకోనివారని చూశాము. కృష్ణపరమాత్మ తామస కర్మలు చేసేవారిని విమర్శించటం లేదని గమనించాలి. ఎందుకు?

రాజస కర్మలనే విమర్శిస్తున్నప్పుడు, ఇంక తామస కర్మల గురించి వేరే చెప్పాలా? రాజస కర్మల కన్నా తక్కువ స్థాయికి చెందినవి తామసకర్మలు. తామసకర్మలు ఒక వ్యక్తిని కిందకు లాగితే, రాజసకర్మ ఆధ్యాత్మిక ఎదుగుదల లేకుండా చేస్తుంది. అందువల్ల రాజసకర్మలను విమర్శిస్తున్నాడు. ఈ మూడు శ్లోకాలూ కలిపి ఒకటే పెద్ద సంస్కృతవాక్యం. అందువల్ల మనం అర్థం చేసుకోవటానికి వీలుగా అక్కడక్కడనుండి ఏరటం జరుగుతుంది.

**ఎ). అవిపశ్చితః** – ముందుగా స్వార్థపరులమీద విమర్శ. వీరు స్వార్థపరులు, ప్రాపంచిక భోగాలమీద మక్కువ ఉన్నవారు. వీరు వివేకహీనులు. ఎందుకు? ప్రాపంచిక భోగాలు మాత్రమే జీవితాన్ని విజయవంతం చేస్తాయనీ, డబ్బుతో దేన్నైనా సాధించగలమనీ అనుకుంటారు. ఈ భావాన్ని **అవిపశ్చితః** అన్న పదంలో చూస్తాము. కాని గీత ప్రాపంచిక విజయం మాత్రమే చాలదు అంటుంది.

డబ్బుతో మంచాన్ని కొనగలము కాని, నిద్రను కొనలేము
డబ్బుతో మనుష్యులను కొనగలము కాని, ప్రేమను కొనలేము
డబ్బుతో ఎన్నో కొనగలము కాని మరెన్నో కొనలేము.

ఈ విషయం అర్థం కాకపోతే అవివేకులు. వీరు అర్థకామాలే ముఖ్యమైన పురుషార్థాలు అనుకుంటారు. అందువల్ల అవివేకిః, అర్థకామ ప్రధానః, ప్రేయర్థినః,**అవిపశ్చితః. ఇది మొదటి విమర్శ.**

**బి). వేదవాదరతాః –** వేదాల్లోని కర్మకాండ భాగాల్లో, ప్రాపంచిక భోగాలు పొందటానికి అనేక యజ్ఞయాగాదులు వస్తాయి. వాటిలో ముఖ్యమైనది ఆవహంతీ హోమం.

**ఆవహంతీ వితన్వానా కుర్వాణాచీర మాత్మనః –** తైత్తిరీయమ్

ఐశ్వర్యం, అన్నపానాదులు, వస్త్రాలు పొందటానికి ఒక యజ్ఞం ఉంది. వేదమే చెప్పింది కాబట్టి, ప్రాపంచిక భోగాలను పొందాలని నిర్దేశిస్తున్నది. వేదం ఐశ్వర్యం వద్దు, ఇల్లు, వస్త్రాలు, ఆహారం వద్దు అని చెప్పదు. వేదం వీటిని నిషేధించదు. కాని వేదం చెప్పేదేమిటంటే, కేవలం వీటితోనే ఆగిపోవద్దు, మనస్సుపరంగా, బుద్ధిపరంగా ఎదగండి అంటుంది. కాని ఈ స్వార్థపూరితమైన, ప్రాపంచిక మనుష్యులు, వేదంలోని ఈ భాగాన్ని చూడరు. **సత్యం వద** చూడరు; ఒకవేళ చూసినా సత్యం వధ చేస్తారు. **ధర్మం చర** చూడరు; ధర్మాన్ని చెరబడతారు. చాలామంది నేను గీత చదువుతున్నాను అదే గొప్ప విషయం అంటారు. కాని గీత చదవటం ప్రాథమిక అవసరం. స్కూలుకు వెళ్ళి చదువుకుంటే మంచి ఉద్యోగం వస్తుంది. గీత నేర్చుకుని వంటబట్టించుకుంటే, మీ గీత బాగుండకపోయినా నిలదొక్కుకునే ఆత్మస్థైర్యం ఇస్తుంది. ఉద్యోగం వచ్చినా, రాకపోయినా; వచ్చిన ఉద్యోగం పోయినా దాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఇస్తుంది.

స్కూలు మీ మేధస్సుకు పదును పెడితే, గీత మీ భావోద్రేకాలను తీర్చిదిద్దుతుంది. అంతకుముందు చూసినట్లుగా ఇప్పుడు ఐక్యూకన్నా ఇక్యూ చాలా ముఖ్యం. స్వాధ్యాయం చేయాలి. గీతాబోధ చాలా ముఖ్యం. అందువల్ల గీతాబోధలకు వెళ్ళితీరాలి. కాని ఈ అవివేకులు ఇటువంటి మాటలు చదవరు; కేవలం ఆవహంతీ హోమం గురించి చదువుతారు. **వేదవాదరతాః** అంటే రాజసకర్మరతాః, సకామకర్మరతాః. **ఇది రెండవ విమర్శ.**

**సి). నాన్యదస్తీతి వాదినః –** జీవితంలో ఉన్నతమైన విషయాలు అంటే నీతిసూత్రాలు, భగవంతుడు, ధర్మం, సేవాతత్పరత గురించి మాట్లాడితే వారికి నచ్చవు. వారి సిద్ధాంతం – తిను, తాగు, సుఖాలలో తేలు. ధర్మం లేదు, మోక్షం లేదు, పురుషార్థం లేదు – **న అన్యత్ అస్తి ఇతి వాదినః**. ఇలాంటి వారి గురించి చెప్పటానికి ఉపనిషత్తు కఠినమైన పదం వేస్తుంది. ప్రమూఢ అంటుంది. మూఢ అంటేనే వెర్రివాడు; ప్రమూఢ అంటే వెర్రివాళ్ళలో వెర్రివాడు. **నాన్యదస్తీతి వాదినః ఇది మూడవ విమర్శ.**

**డి). కామాత్మానః –** వారు ప్రాపంచిక కోరికలకు మారుపేరు; వారు శారీరక సుఖాలకు మారుపేరు. కృష్ణపరమాత్మ సుఖాలను విమర్శించటం లేదు. ఒక విషయం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. వేదాంతమే ఐహికసుఖాల గురించి చెబుతుంది. మరి దేన్ని విమర్శిస్తుంది? ఈ ఐహికసుఖాలకు అవసరానికి మించి ప్రాముఖ్యతనిస్తే, అది కూడా అంతర్గత, ఆధ్యాత్మిక ఎదుగుదలను పట్టించుకోనంతగా ప్రాముఖ్యతనిస్తే విమర్శిస్తుంది. అందువల్లనే కృష్ణపరమాత్మ కామాత్మానః అన్నాడు. అంటే ప్రపంచంలో ఉన్న భోగాలన్నింటినీ తీసుకుని, వాటికే కాళ్ళు, చేతులు వేస్తే, వీరు వాటికి ప్రతీకలుగా నిలుస్తారు. నీ కోరికలు ఏమిటి అని అడిగితే, ఇలాంటివారు ఒక పెద్దపట్టికనే ఇస్తారు. కాని అందులో, పొరపాటున గూడా ధర్మం కాని, మోక్షం కాని ఉండదు. **కామాత్మానః ఇది నాలుగవ విమర్శ.**

**ఇ). స్వర్గపరాః** – ఆ పట్టికలో అన్నిటికన్నా పైన ఉండేది ఏమిటి? స్వర్గం! ఇప్పటి యువతకు ఎలాగైతే ఎదో విధంగా అమెరికాకు వెళ్ళాలనే కోరిక తీవ్రంగా ఉందో, అలా ఆ రోజుల్లో స్వర్గలోకానికి వెళ్ళాలనే కోరిక తీవ్రంగా ఉండేది. అమెరికానే భూతలస్వర్గంగా వర్ణిస్తే, ఇంక అసలు స్వర్గం ఎలా ఉంటుందో వేరే చెప్పాలా? **స్వర్గపరాః ఇది ఐదవ విమర్శ.**

ప్రాపంచిక భోగాలమీద ఇచ్ఛ ఉన్న స్వార్థపరుల గురించిన ఈ ఐదు వర్ణనలూ వారూ ఎన్నడూ కర్మయోగులు కాలేరని సూచిస్తున్నాయి. ఈ స్వార్థపరులు ఏంచేస్తారు?

**ప్రవదంతి** – వారు ప్రాపంచిక భోగాలమీద ఇచ్ఛ కలిగి, స్వార్థపరులయి ఉండటమే కాక, వారి సిద్ధాంతాన్ని చాటి చెబుతారు. ఎప్పుడూ ప్రాపంచిక సిద్ధాంతం ఆకర్షణీయంగా ఉంటుంది. అందువల్ల మనలో అంతోయింతో దైవచింతన ఉండి, వారిని మారుద్దామనుకున్నా కూడా, మనకు తెలియకుండా, వారే మనను మార్చివేస్తారు.

గుర్తుంచుకోండి – మాయకూ, బ్రహ్మకూ మధ్య ఫ్యాషన్ పెరేడ్ పెడితే మాయే గెలుస్తుంది. ఎందుకంటే బ్రహ్మకన్నా మాయ ఎక్కువ ఆకర్షణీయంగా ఉంటుంది. ఆధ్యాత్మికతకన్నా ప్రాపంచికత ఎక్కువ ఆకర్షణీయంగా ఉంటుంది. అందువల్ల ఎవరైనా గీతాబోధకు వెళుతున్నావా, ఇప్పటినుంచీ ఎందుకు, తాతయ్య అయ్యాక వెళ్ళవచ్చులే అని నాలుగుసార్లు చెపితే, ఆ ప్రలోభంలో పడిపోతాము.

ఇటువంటివారు ప్రకటనలు ఎలా నిర్విరామంగా వస్తాయో, అలా వారి వాదనలు నిర్విరామంగా వినిపిస్తూ ఉంటారు. మనను ప్రభావితం చేస్తూ ఉంటారు. అందువల్ల అలాంటి ప్రజల వలలో చేపపిల్లలా పడవద్దని మనను హెచ్చరిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**సత్సఙ్గత్వే నిస్సఙ్గత్వం। నిస్సఙ్గత్వే నిర్మోహత్వమ్।**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం। నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః (భవతి)॥** – భజగోవిందమ్ 9

అందువల్ల ఎప్పుడూ మంచివారితో స్నేహం ఏర్పరచుకోవాలి.

**పుష్పితాం వాచమ్** – వారి మాటలు అందంగా, ఆకట్టుకునేటట్టుగా ఉంటాయి.

**క్రియావిశేషబహులామ్ (వాచం ప్రవదంతి)** – వారు అనేక ప్రణాళికలను గురించి మాట్లాడతారు. ఇందులో డబ్బు వేస్తే ఇంత లాభం వస్తుంది; అందులో వేస్తే అంత లాభం వస్తుంది అంటూ ప్రణాళికలమీద ప్రణాళికల గురించి చెబుతారు. వైదికభాషలో చెప్పాలంటే, అనేక యజ్ఞాల గురించి చెబుతారు; ఆధునిక భాషలో చెప్పాలంటే అనేక ప్రణాళికల గురించి చెబుతారు. దీని సారాంశం ఏమిటి? వీటివల్ల బొత్తిగా తీరికలేదు. అందువల్ల గీతాబోధకు వెళ్ళే ఖాళీ సమయం లేదు. శని, ఆదివారాలు అసలే తీరిక చిక్కదు. పొరపాటున సంధ్యావందనం చేస్తూంటే, అది కూడా గాలికెగిరిపోతుంది. ప్రార్థన చేసే ప్రశ్నే లేదు. 24 గంటల్లో 25 గంటలు పని చేస్తున్నాము, ఇంక దైవచింతనకు చోటేది అంటారు. ఇవన్నీ దేనికి దారితీస్తాయి?

**జన్మకర్మఫలప్రదామ్** – ఒక కర్మ ఇంకో కర్మలోకి, ఇంకో కర్మ మరో కర్మలోకి దారి తీస్తుందని వారికి తెలియదు. ఇదొక విషవలయం, ఒక ఊబి. ఈ కర్మ అనే ఊబిలో చిక్కుకుపోయారా, ఇంక అంతే సంగతులు.

అభిమన్యుడికి పద్మవ్యూహంలోకి వెళ్ళటం తెలుసు కాని, వెనక్కి రావటం తెలియదు. వీరి పరిస్థితీ అంతే. కర్మల్లో కూరుకుపోవటం తెలుసు కాని, వాటినుంచి బయటపడటం చేతకాదు.

వారికి వారు, అలా కర్మల్లో కూరుకుపోయారని తెలుసు. కొంతమంది దీన్నుంచి బయటపడి, రేపటినుంచి గీతాబోధకు వెళ్ళాలని నిర్ణయం తీసుకుంటారు కూడా, కాని ఆ రేపు ఎన్నడూ రాదు. ఆ రేపు వీరికి రాదు కాని, ఎప్పుడో యమధర్మరాజుకు వచ్చేస్తుంది. ఆయన వచ్చి నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుపోతాడు. అక్కడితో విషవలయం ముగిసిందా? లేదు! పునరపి జననం, పునరపి మరణం. మళ్ళీ అదే వృత్తం.

**పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీజఠరే శయనం**
**ఇహ సంసారే బహు దుస్తారే, కృపాయాఽ పారే పాహిమురారే॥** – భజగోవిందమ్ 21

కర్మలు చేయవద్దని గీత చెప్పటం లేదు; కాని గీత చెప్పేది ఒక్కటే – కర్మలు చేయండి, కాని వాటిలోంచి బయటకు ఎలా రావాలో, వచ్చి ఉన్నత సాధనకు ఎలా అంకితమవ్వాలో నేర్చుకోండి. అది నేర్పించటానికే మనకు నాలుగు ఆశ్రమధర్మాలు ఉన్నాయి – బ్రహ్మచర్యం, గార్హస్థం, వానప్రస్థం, సన్న్యాసం. ఈ ఆశ్రమాల ద్వారా ఒక వ్యక్తి క్రమంగా కర్మల్లో అడుగుపెట్టి, అలాగే క్రమంగా బయటకు వస్తాడు. నిజంగా సన్న్యాసం స్వీకరించమని కాదు; సన్న్యసించటం అంటే పరిత్యజించటం. నా అంతట నేను బయటపడితే అది విజయం; యమధర్మరాజు బయటకు లాగితే అది బాధ. కాని ఇటువంటి మనుష్యులకు అది తెలియదు. అందువల్ల జనన, మరణవృత్తంలో పడి కొట్టుమిట్టాడుతుంటారు.

వీరు ఈ కర్మలను ఎందుకు చెబుతారు? చిత్తశుద్ధికోసం చెబితే బాగానే ఉండేది. అవి సాత్త్విక కర్మల కిందకు వస్తాయి. కాని ఈ స్వార్థపరులు అటువంటి మంచివేవీ చెప్పరు. ఒకవేళ ఏదైనా మతపరమైన కర్మను చెప్పినా కూడా, అది కూడా ఏదో ప్రాపంచిక విజయంకోసమే ఉంటుంది.

**భోగైశ్వర్యగతిం ప్రతి** – వారి లక్ష్యాలు రెండే అంటున్నాడు కృష్ణపరమాత్మ. అవి భోగం, ఐశ్వర్యం. భోగం అంటే కామపురుషార్థం; ఐశ్వర్యం అంటే అర్థపురుషార్థం. అంటే నిరంతరం వారి పరుగు అర్థకామాల వెంటే ఉంటుంది. ఈ గుడికి ఏడు శుక్రవారాలు వెళితే ఈ కోరిక తీరుతుంది, ఆ గుడికి మూడు పౌర్ణములు వెళితే మీరనుకున్నవన్నీ నెరవేరతాయి అంటారు. దుర్గగుడికి వెళ్ళండి, ఈ ఫలం పొందండి. శనిగుడికి వెళ్ళండి, ఈ ఫలం పొందండి అంటారే తప్ప ప్రేమ, దయాగుణాలు పెంచుకోండి, భక్తి పెంచుకోండి అననే అనరు. ఇటువంటి వారి పరిస్థితి ఏమిటి?

**భోగైశ్వర్య ప్రసక్తానాం** – తక్కినవారితో అర్థకామాల గురించి చెప్పటమే కాదు, వారు కూడా అర్థకామాల్లో పూర్తిగా కూరుకుపోతారు. ఎంతమేరకు వాటిమీద బంధం పెంచుకుంటారంటే –

**తయాపహృతచేతసామ్** – క్రమేపీ, వారి కోరికలను ధర్మబద్ధంగా తీర్చుకోలేరు. ఎందుకంటే వారి కోరికలు ఒక అడ్డూ ఆపూ లేకుండా పెరిగిపోతాయి. పది కోరికలు వంద, వంద కోరికలు సహస్రం అయిపోతాయి. కోరికలు పెరిగినంత శరవేగంతో కోరికలు తీరవు. ఆ కోరికల తీవ్రత ఎంతగా ఉంటుందంటే, ధర్మపరంగా తీరే మార్గం

లేనప్పుడు, పక్కదారి పట్టించేస్తాయి. అధార్మిక పద్ధతులు అంటే జూదంలాంటి మార్గాలు ఎన్నుకుంటారు. వారి ధార్మికబుద్ధి, విచక్షణా జ్ఞానం, నీతి, నిజాయితి, మంచితనం ఏ గాలికెగిరిపోతాయో తెలియదు. అవినీతి ఎక్కడన్నా రాజ్యమేలుతోందంటే, అది నిరక్షరాస్యులవల్ల కాదు; చదువుకున్న మేధావులవల్ల. వారి ఆత్మసాక్షి వారిని నిలదీసే పరిస్థితిని దాటిపోతారు వారు.

పైగా వారి దగ్గర ఒక తిరుగులేని జవాబుంటుంది. అందరూ చేస్తున్నారు, నేను చేస్తే తప్పేమిటి అంటారు. పెద్దస్థాయిలో పెద్దవారు స్కాములు చేస్తే, చిన్నస్థాయిలో చిన్నవారు డబ్బు దండుకుంటున్నారు. అందువల్ల వివేకశక్తి పోతుంది. పూర్వకాలం పాపభీతి ఉండేది, దానివల్లనైనా అక్రమాలు చేయకుండా ఉండేవారు. ఇప్పుడు ఆ పాపభీతి పూర్తిగా పోయింది. 'పాపమంటే ఏమిటి? పుణ్యమంటే ఏమిటి? దానికి శాస్త్రీయ నిదర్శనం ఏముంది?' అంటారు. పైగా పరమదుర్మార్గుడు అయినా, ఐశ్వర్యంలో ఓలలాడుతున్నవాణ్ణి చూపిస్తారు. 'ఇప్పుడు అనుభవించకపోయినా, నరకానికి పోతావు,' అంటే 'అసలు అలాంటి నరకం ఉందో, లేదో, ఎవరికి తెలుసు? ఒకవేళ నరకానికి వెళ్ళానే అనుకో, ఈ శరీరం ఇక్కడే కాలి బూడిద అవుతుంది కదా, నేను అనుభవించే శిక్షలు నాకెలా తెలుస్తాయి?' అంటాడు. అక్రమాలు చేయటానికి వంద కారణాలు ఉంటాయి, కాని మంచిపని చేయటానికి ఒక్క కారణం ఉండదు వారికి.

**వ్యవసాయాత్మికాబుద్ధిః న విధీయతే** – అటువంటివారికి ఆలోచనలో స్పష్టత ఉండదు. వారి ప్రాథమిక లక్ష్యాలేమిటో వారికి సరిగ్గా తెలియదు.

**సమాధౌ** – ఇక్కడ సమాధౌ అంటే బుద్ధిలో. బుద్ధిలో వారికి స్పష్టమైన అవగాహన ఉండదు. ఎందుకు ఉండదో, ఈ మూడు శ్లోకాల్లోనూ వివరంగా చెప్పాడు. ఈ విధంగా స్వార్థపూరితులైన ప్రాపంచిక చింతన ఉన్నవారు ఎన్నడూ కర్మయోగులు కాలేరు అని విమర్శించాడు కృష్ణపరమాత్మ. అయితే కర్మయోగులు ఎవరు కాగలరు? ఇంతవరకూ మనల్ని సంసిద్ధులను చేశాడు. ఇప్పుడు కర్మయోగి గురించి చెప్పబోతున్నాడు.

శ్లో. 45 **త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।**
**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥**
త్రైగుణ్యవిషయాః, వేదాః, నిస్త్రైగుణ్యః, భవ, అర్జున,
నిర్ద్వంద్వః, నిత్యసత్త్వస్థః, నిర్యోగక్షేమః, ఆత్మవాన్ ॥

| | |
|---|---|
| అర్జున | = ఓ అర్జునా! |
| వేదాః | = వేదములు |
| త్రైగుణ్యవిషయాః | = త్రిగుణకార్యరూపములైన భోగములను, వాటి సాధనలను ప్రతిపాదించును |
| నిస్త్రైగుణ్యః | = ఆ భోగములందును, వాటి సాధనలందును ఆసక్తి లేనివాడవై |
| నిర్ద్వంద్వః | = హర్షశోకాది ద్వంద్వములు లేనివాడవై |
| నిత్యసత్త్వస్థః | = నిత్యుడైన పరమాత్మయందే స్థితుడవై |

| | | | |
|---|---|---|---|
| నిర్యోగక్షేమః | = యోగక్షేమములను ఆశింపక | భవ | = కమ్ము |
| ఆత్మవాన్ | = అంతఃకరణమును స్వాధీనమొనర్చు కొనినవాడవు | | |

**హే అర్జున! వేదాః త్రైగుణ్యవిషయాః।**
**(త్వం) నిస్త్రైగుణ్యః, నిత్యసత్త్వస్థః, నిర్ద్వంద్వః, నిర్యోగక్షేమః ఆత్మవాన్ భవ।।**

తా: (కర్మలను బోధించే) వేదములు త్రిగుణాత్మకమగు సంసారమును ప్రతిపాదించును. ఓ అర్జునా! నీవు త్రిగుణాత్మకమగు సంసారమునకు అతీతుడవు కమ్ము. సర్వదా సత్త్వగుణమందున్నవాడవై ద్వంద్వములనుంచి బయటపడుము. యోగక్షేమములను కోరనివాడవై జాగురూకుడవై ఉండుము.

ఇది చాలా ముఖ్యమైన శ్లోకం. కర్మయోగి ఆలోచనాతీరు ఎలా ఉంటుంది? లక్ష్యం ఎలా ఉంటుంది? దృక్పథం ఎలా ఉంటుందివంటి విషయాలను వివరించే శ్లోకం.

**త్రైగుణ్యవిషయా వేదాః** – వేదాలు అర్థకామాలను తీర్చుకోవటానికి అనేక కర్మలను సూచిస్తాయి. అర్థం అంటే ధనం, కామం అంటే కోరిక. సత్త్వరజస్తమోగుణాల కార్యాలగురించి, సమస్త భోగాల గురించి, వాటిని పొందే సాధనల గురించి వేదాలు సూచిస్తాయి. వేదాలు అర్థకామాలను పూర్తిగా కొట్టిపారేయవు. ఆ లక్ష్యాలను నాలుగు పురుషార్థాలలో పేర్కొన్నాయి కూడా. కాని కర్మయోగి ఏం చేయాలి?

**నిస్త్రైగుణ్యో భవ** – అర్థకామాలు అవసరమే. ఐశ్వర్యం, ఆనందం మనిషికి కావాలి నిజమే. కాని వాటిలో పడి కొట్టుకుపోకూడదు. మనిషిగా పుట్టినందుకు మనం ఇంకా ఉన్నత లక్ష్యాలని పొందాలి. అవి ధర్మ, మోక్షపురుషార్థాలు. అవి ఆంతర ఎదుగుదలకు తోడ్పడతాయి. ఎందుకంటే, వెనుతిరిగి చూసుకుంటే మనిషియొక్క మనశ్శాంతి అతనికి ఏం ఉంది అన్నదానిమీదకన్నా, అతను ఏమిటి అన్నదానిమీద ఆధారపడివుంటుంది. మనశ్శాంతి ఉంటే భోగమూ, ఐశ్వర్యమూ లేకపోయినా హాయిగా ఉంటాడు. మనశ్శాంతి లేకపోతే భోగమూ, ఐశ్వర్యమూ ఉన్నా బాధపడతాడు. అంటే సుఖంగా దుఃఖిస్తాడు.

అర్థకామాలు ప్రాథమిక లక్ష్యం కాకుండా, ధర్మ, మోక్షాలు ప్రాథమికంగా ఉండాలి. ఉదాహరణకు పెరుగన్నంలో ఆవకాయ నంచుకోవాలి కాని, ఆవకాయలో పెరుగు నంచుకోకూడదు. పెరుగన్నం ముఖ్యమైన ఆహారం, ఆవకాయ దానికి రుచి చేకూర్చటానికి నంచుకునే ఊరగాయ. అంతేకాని, ఆవకాయ ముఖ్యమైన ఆహారమై, పెరుగున్నం పక్కకు తోసేయకూడదు. జీవితంలో ఏది ముఖ్యమో తెలియకపోతే కష్టాలపాలు అవుతాము.

అర్థకామాలను నాలుగు పురుషార్థాలలో చేర్చింది శాస్త్రం. నిజమే కాని జీవితమంతా వాటికే ధారపోయకూడదు.

**యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।** – 6.17

ఏంచేసినా మితంగా ఉండాలి. పిల్లలు 24 గంటలూ కార్టూన్లే చూస్తూ ఉంటారని పెద్దలు ఫిర్యాదు చేస్తారు. వారు ఎంతసేపు చూడాలో, ఎంతసేపు చదువుకోవాలో తల్లులకి చక్కటి అవగాహన ఉంటుంది. కాని కృష్ణపరమాత్మ పెద్దలకు వారు ఎంతసేపు ఆనందంలో తేలియాడాలో, ఎంతసేపు ధర్మ, మోక్ష సాధనలు చేయాలో తెలియటం లేదు అంటున్నాడు. గీతాపారాయణం, పూజ, ధ్యానం ఎంతసేపు చేయాలో వారికి తెలియటం లేదు.

**కర్మయోగి లక్షణాలు**

**ఎ). నిస్త్రైగుణ్యో భవ** – నిష్కామో భవ అంటే అర్థకామాలకు అనవసరమైన ప్రాముఖ్యతను ఇవ్వద్దు అని. సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే, కామ్యకర్మలను తగ్గించాలి. రాజస, తామసకర్మలను తగ్గించి సాత్త్విక కర్మలను పెంచుకోవాలి. రాజసకర్మలో నేను మాత్రమే లాభం పొందుతాను; తామసకర్మలో నేను లాభం పొందుతాను, తక్కినవారు అవస్థ పడతారు; కాని సాత్త్వికకర్మలో నేను మాత్రమే కాదు, తక్కిన వారు కూడా లాభం పొందుతారు. అందువల్ల స్వార్థపూరితమైన కర్మ, కామ్యకర్మ; నిస్వార్థపూరితమైన కర్మ సాత్త్వికకర్మ. నిష్కామో భవ అంటే డబ్బుకు సంబంధించిన కర్మలను తగ్గించండి. సరిగ్గా గమనించండి – డబ్బుకు సంబంధించిన కర్మలను పూర్తిగా మానండి అనటం లేదు; కాని కేవలం దానికోసమే మొత్తం సమయాన్ని కేటాయించవద్దు అంటున్నాడు. అర్థకామాలు ప్రాథమిక లక్ష్యాలు కాకుండా మోక్షం ప్రాథమిక లక్ష్యంగా ఉండాలి. ఇది మొదటి సూత్రం. **నిష్కామో భవ.**

**బి). నిర్ద్వంద్వో (భవ)** – ద్వంద్వాలు అంటే భిన్న అనుభవాలు. నిర్ద్వంద్వో భవ అంటే ఇటువంటి ద్వంద్వాలకు అతీతుడు కావాలి. ద్వంద్వాలు అంటే మానావమానాలు, లాభనష్టాలు, జయాపజయాలు, సుఖదుఃఖాలువంటివి. మీరు కామ్యకర్మలు తగ్గించుకున్నా, అర్థకామాల వెంట పరుగులు తీయటం తగ్గించినా, చేసుకున్న ప్రారబ్ధకర్మవల్ల జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు తప్పవు. మీరు వాటిని ఆహ్వానించినా, ఆహ్వానించకపోయినా; వాటికోసం కష్టపడినా కష్టపడకపోయినా ద్వంద్వాలు రాకతప్పవు. అలాంటి ద్వంద్వాలకు అతీతంగా ఎదగాలి. ఎందుకు?

వాటికి అతీతంగా ఎదగకపోతే, అంటే మనస్సును దిటవు పరచుకోకపోతే, ఏ కాస్త కష్టం ఎదురైనా, ఏ చిన్న నొప్పి కలిగినా, వాటికి పరిష్కారమార్గాలు వెతుక్కుంటారు. వాటిని ప్రాయశ్చిత్తకర్మలు లేదా పరిహారకర్మలు అంటారు. అవి కూడా ఒక్కొక్కరు ఒకొక్కలాగా చెబుతారు. వాస్తుశాస్త్రజ్ఞుడు ఒకలా చెపితే, జ్యోతిష్యుడు ఇంకోలా చెబుతాడు. ఒక చిన్నపంటినొప్పితో మీరు వాస్తుశాస్త్రజ్ఞుడి దగ్గరికెళితే, నీ పడకగదిలో అటువైపు కిటికీ ఉంది, దానివల్ల నీకు పంటినొప్పి వస్తోంది, దాన్ని అటునుంచి ఇటు మార్చు అంటాడు. ఒకవేళ వారు చెప్పినట్టు చేస్తే మీ పరిస్థితి మెరుగవుతుందో లేదో చెప్పలేము కాని, వాస్తుసలహాదారులు మాత్రం లబ్ధి పొందుతారు. అలా పరిహార కర్మలు, దోమకాటుకు కూడా, చేసుకుంటూపోతే వాటికి అంతూపొంతూ ఉండదు. ఎందుకంటే మనం చేసిన అక్రమాలకు అంతూపొంతూ లేదు.

అంతేకాదు, ఈ ప్రాయశ్చిత్తకర్మలు చేయటం కూడా కాఫీ తాగటంలాగా వ్యసనం అయిపోతుంది. ముఖ్యమైన వాటికి మాత్రమే చేయటం కాకుండా, జలుబు చేసినా జ్యోతిష్యుడో, వాస్తుశాస్త్రజ్ఞుడి దగ్గరకో పరిగెత్తే అలవాటు ఏర్పడిపోతుంది. అంటే మన జీవితాన్ని తీసుకువెళ్ళి వేరే ఎవరి చేతిలోనో పెట్టినవారము అవుతాము. అందువల్ల అయినదానికీ, కానిదానికీ ప్రాయశ్చిత కర్మలు చేయకూడదు.

**సహనం సర్వదుఃఖానామప్రతీకారపూర్వకం**
**చింతావిలాపరహితం సా తితీక్షా నిగద్యతే** – వివేక చూడామణి – 24

మన జీవితాలను ఏదో ఒక గ్రహం ప్రభావితం చేస్తూనేవుంటుంది. కొన్ని మంచి చేస్తాయి, కొన్ని చెడు చేస్తాయి. మనం వాటిని తప్పు పట్టటం లేదు, జ్యోతిశ్శాస్త్రాన్ని నిందించటం లేదు. ప్రతి చిన్నదానికీ పరుగెత్త వద్దంటున్నాము అంతే.

అనారోగ్య విషయంలో కూడా అదే అంటారు. డాక్టర్లు ప్రతి చిన్నదానికీ మందులు వేసుకోవద్దు అంటారు. అలా వేసుకుంటే మనలో ఉన్న రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. రోగనిరోధక శక్తిని పెంచటానికి, ప్రత్యేకించి ఒక రోగాన్ని పంపించి, ప్రయోగం చేస్తారు. రోగం వస్తే, రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మనస్సు పరిస్థితీ అంతే. ఎదురుదెబ్బలు తింటేనే, మానసిక స్థైర్యం పెరుగుతుంది. కాని దానికోసం, 'ఓ దేవా! నాకు సమస్యలను ఇవ్వు,' అని ప్రత్యేకించి ప్రార్థన చేయనవసరం లేదు. సమస్యలకు అంతూపొంతూ లేదు; మనం ఎన్నో అక్రమాలు చేసే ఉంటాము; వాటికి తగ్గ బాధలు వస్తూనే ఉంటాయి. అందువల్ల సమస్యలు వచ్చినప్పుడు కృంగిపోకుండా, తట్టుకునే మానసికస్థైర్యం పెంపొందించుకోవాలి. సమత్వం పెంచుకోవాలి. కామ్యకర్మలు, ప్రాయశ్చిత్త కర్మలు చేయటంలోనే శక్తినంతా హరించివేసుకోకూడదు. వాటిని పూర్తిగా మానలేకపోతే వీలున్నంత తగ్గించుకోవాలి. ఇది రెండవ సూత్రం. **నిర్ద్వంద్వో భవ.**

**సి). నిత్యసత్త్వస్థో (భవ)** – నీ సత్త్వగుణాన్ని నిలబెట్టుకో! సత్త్వగుణం వివేకశక్తిని సూచిస్తుంది; వివేకశక్తి విచక్షణా శక్తిని సూచిస్తుంది. ఏమిటా విచక్షణ? అర్థకామాలకన్నా ధర్మమోక్షాలు ముఖ్యమనే విచక్షణ. మనకు శాంతి భద్రతలు ధర్మమోక్షాలు ఇస్తాయి కాని అర్థకామాలు కావు, అందువల్ల వాటికి అవసరానికి మించిన ప్రాముఖ్యతను ఇవ్వకూడదు. దీన్ని **నిత్యానిత్య వస్తువివేకం** అంటారు. ప్రాపంచిక ఎదుగుదలకన్నా, ఆధ్యాత్మిక ఎదుగుదల ముఖ్యం. ఇది సత్త్వగుణంవల్ల కలుగుతుంది. అందువల్ల సత్త్వగుణాన్ని పెంపొందించుకోవాలి. దాన్ని పెంపొందించుకోవటం ఎలా?

ఆధ్యాత్మిక పుస్తకాలు చదవటం, మహాత్ములతో కలిసి తిరగటం, సత్సంగం ఏర్పరచుకోవటం. సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం. కొందరి ఇళ్ళలో గదిగదికీ టీవీలు ఉంటాయి. టీవీ చూడందే ఉండలేని పరిస్థితి వస్తుంది ఆ ఇంట్లో పిల్లలకు. టీవీ లేని జీవితాన్ని ఊహించుకోలేరు వారు. వారిని టీవీ అమ్మేయమనటం లేదు మనం. కాని ఒక్కసారి పాతరోజులను గుర్తు తెచ్చుకోమంటున్నాము. టీవీ కాదు సరికదా, మన చిన్నతనంలో రేడియో, ఫోను, ఫ్యానులు కూడా లేకుండా హాయిగా గడపగలిగాము. అంటే పన్నెండవ శతాబ్దానికి వెళ్ళిపోవాలా అనకండి; ఈ సుఖాలు లేకుండా బ్రతకటం అసాధ్యం కాదు అంటున్నాము అంతే. సత్సంగంతో గడిపితే, ఇవి లేకుండా కూడా ఎలా ఆనందంగా ఉండవచ్చో తెలుస్తుంది. సత్సంగం సత్త్వగుణం పెంపొందించుకోవటానికి గొప్పమార్గం. ఇది మూడవ సూత్రం. **నిత్యసత్త్వస్థో భవ.**

**డి). నిర్యోగక్షేమ (భవ)** – నీ యోగక్షేమాలకోసం ఆరాటపడవద్దు అంటున్నాడు కృష్ణపరమాత్మ. మన జీవితం సాఫీగా సాగటానికి మనకు కొన్ని ప్రాథమిక వస్తువులు కావాలి. వాటిని **యోగం** అంటారు. **అప్రాప్తస్య ప్రాప్తిః యోగః.** మన దగ్గర లేని వస్తువులను పొందటం. ఉదాహరణకు తిండి, బట్ట, గూడు, మందులు. క్షేమం అంటే మనం పొందిన వస్తువులను కాపాడుకోవటం. **ప్రాప్తస్య రక్షణం క్షేమః.**

ఈ యోగక్షేమాల గురించిన బెంగతోనే మన శక్తినంతా హరించివేసుకుంటున్నాము అంటున్నాడు కృష్ణపరమాత్మ. వృద్ధాప్యం ఎలా ఉంటుంది? పిల్లలు మనల్ని చూస్తారా? మన బంగారం మంచిదే అయినా వచ్చే కోడలుపిల్లో, అల్లుడో వీరిని మార్చేయకుండా ఉంటారా? ఇలా రకరకాల భయాలు. ఈ రోజుల్లో అనారోగ్యం చేస్తే లక్షల్లో ఖర్చవుతుంది. వాటికోసం 30 లక్షల పైనే ప్రోగేసుకోవాలి. అన్నీ బాగున్నా, డబ్బున్నా, పిల్లలు మంచివారైనా, ఆఖరిక్షణంలో పక్కనెవరన్నా ఉంటారో ఉండరో? ఇదొక బెంగ. పొద్దున లేచి వార్తా పత్రిక చూస్తే, నీళ్ళలారీ గుద్ది 17 సంవత్సరాల కుర్రవాని ఆకస్మికమృతి అని పెద్ద అక్షరాలతో వార్తలు. డబ్బు లేకపోతే కష్టం అని డబ్బు పోగేస్తే, దానితో వచ్చే సమస్యలు అనంతం. ఆ డబ్బుకోసం వారి పిల్లలను ఎత్తుకుపోవటమో, వారి ప్రాణాలకే ముప్పు కలిగించటమో చూస్తూనే ఉంటాము. రక్షణకోసం గార్డులను పెట్టుకుంటే వారే చంపిన సందర్భాలు ఉన్నాయి. అందువల్ల రక్షణకు చోటేది?

కృష్ణపరమాత్మ రక్షణకోసం ప్రయత్నించకండి; అసలైన రక్షణ మీ మానసిక స్థైర్యంవల్లనే వస్తుంది అంటున్నాడు. ఆ అంతర్గత రక్షణ మీ భక్తివల్ల కాని మీ జ్ఞానంవల్ల కాని వస్తుంది. కాని జ్ఞానం వచ్చేవరకూ, దేవునిమీద అపారమైన భక్తిని పెంచుకోవాలి.

> **అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
> **తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – 9.22

ఎల్.ఐ.సి. లాంటి ప్రాపంచిక యోగక్షేమాలు పెట్టుకోండి, తప్పులేదు కాని అసలు యోగక్షేమం భగవంతుడు మాత్రమే. అందువల్ల కర్మయోగి అవాలంటే మీ యోగక్షేమాల భారాన్ని దేవునిమీద వేసి నిశ్చింతగా ఉండండి. లేకపోతే మీకు ఆధ్యాత్మిక చింతన చేయటానికి తీరిక ఉండదు; జీవితమంతా రేపేమవుతుందోననే చింతతోనే సాగిపోతుంది.

నిర్యోగక్షేమః భవ అంటే యోగక్షేమాలకు అతీతంగా ఎదగండి. మీ యోగక్షేమాలను మీ ఇష్టదేవతకు అప్పచెప్పేయండి. **తక్కువేమి మనకూ రాముండొక్కడుండు వరకూ!** ఇది ఒక పద్ధతి.

ఇష్టదేవత లేకపోతే, మీ అంతర్గతశక్తిని పెంచుకోండి. మిమ్మల్ని మీరు గట్టిపరుచుకోండి. వేదాంతం ప్రకారం దేవుడు ఎక్కడో లేడు, మీలోనే ఉన్నాడు. అంటే బాహ్యంగా ఉన్న దేవుడినో, అంతర్గతంగా ఉన్న దేవుడినో నమ్ముకోండి. అందువల్ల దేవునిమీద భారం వేసి, బెంగలను పారద్రోలండి. ఎప్పుడో వచ్చే సమస్య గురించి ఇప్పుడు ఆలోచించి అలసిపోకండి. ఇది నాలుగవసూత్రం. **నిర్యోగక్షేమః భవ.**

**ఇ). ఆత్మవాన్ (భవ)** – ఆత్మవాన్ భవ అంటే జీవితంలో హుషారుగా ఉండాలి. జీవితాన్ని యాంత్రికంగా గడుప కూడదు. చదవటం, ఉద్యోగం చెయ్యటం, పెళ్ళి చేసుకోవటం, పిల్లలను కనటం అన్నీ యాంత్రికంగా చేసేస్తారు. గొర్రెలమందలో వారు ఒక గొర్రెలా ముందుకు సాగిపోతారు చాలామంది. అలా ఉండకూడదు. మీ జీవితాన్ని మనసారా జీవించండి.

శంకరాచార్యులు **అప్రమత్తః భవ** అంటారు. అంటే అజాగ్రత్తగా ఉండవద్దు, అప్రమత్తంగా ఉండండి అంటారు. మీ అంతిమలక్ష్యాన్ని మర్చిపోకూడదు. మీరు ఒక సుదీర్ఘ రైలుప్రయాణం చేస్తున్నారు. మధ్యలో వచ్చే స్టేషన్లలో దిగుతారు, ఏవో కొనుక్కుంటారు, కాని వ్యవహారం నడుపుతున్నంతసేపూ రైలుమీదే దృష్టి పెడతారు. అలాగే మీ జీవితమనే ప్రయాణంలో మీ అంతిమలక్ష్యం గుర్తు పెట్టుకోవాలి. పెళ్ళి చేసుకోవటం, ఉద్యోగం చేయటం, డబ్బు సంపాదించటం – అన్నీ మధ్యలో వచ్చిపోయే స్టేషన్లు. జీవితంలో మధ్యలో వచ్చి పోయే స్టేషన్లు ఆశ్రమాలు – బ్రహ్మచర్య ఆశ్రమం, గృహస్థాశ్రమం, వానప్రస్థాశ్రమం. ఆశ్రమం అంటే జీవితంలో ఒక దశ. ఏ దశలోనూ మైమరచిపోకూడదు; అప్రమత్తంగా ఉండాలి. వేదాంతశాస్త్రం దీన్ని **చిత్తసమాధానం** అంటుంది. **ఇది ఐదవ సూత్రం – ఆత్మవాన్ భవ.**

**ఇవి కర్మయోగి లక్షణాలు.** అర్జునా నువ్వు కూడా కర్మయోగిలాగా జీవించు.

శ్లో. 46 **యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే ।**
**తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥**
యావాన్, అర్థః, ఉదపానే, సర్వతః, సంప్లుతోదకే,
తావాన్, సర్వేషు, వేదేషు, బ్రాహ్మణస్య, విజానతః ॥

| | | | |
|---|---|---|---|
| సర్వతః | = అంతట | యావాన్, అర్థః | = ఎటువంటి ప్రయోజనము |
| సంప్లుతోదకే | = పరిపూర్ణమైన జలాశయము | (అస్తి) | = ఉందునో |
| (ప్రాప్తే సతి) | = ప్రాప్తించుచుండగా (అందుబాటులో ఉండగా) | విజానతః | = బ్రహ్మతత్త్వము తెలిసిన |
| | | బ్రాహ్మణస్య | = బ్రహ్మజ్ఞానికి |
| ఉదపానే | = చిన్న జలాశయమందు (మనుష్యునకు) | సర్వేషు, వేదేషు | = సమస్త వేదములందు |
| | | తావాన్ | = అంత ప్రయోజనమే (ఉండును) |

**యావాన్ అర్థః ఉదపానే (తావాన్) సర్వతస్సంప్లుతోదకే (భవతి)।**
**(తథా యావాన్ అర్థః) సర్వేషు వేదేషు తావాన్ విజానతః బ్రాహ్మణస్య (భవతి)॥**

తా: నూతియందు ఎంతటి ఫలము (నీరు త్రాగుట ఇత్యాది) గలదో, అంతటా వ్యాపించియున్న నీరు గల జలాశయమునందు ఆ ఫలము అంతర్గతమై యుండును. వేదములు (వేదవిహితకర్మలు) అన్నింటియందు

ఎంతటి కర్మఫలము గలదో, ఆత్మతత్త్వమునెరింగిన బ్రహ్మజ్ఞానియొక్క మహాఫలములో అది అంతర్గతమై యుండును.

**కర్మయోగఫలం –** ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ కర్మయోగఫలం గురించి చెబుతున్నాడు. ఫలం చెప్పకపోతే, హాయిగా కాలం గడిపేయకుండా కర్మయోగం ఎందుకు చేయాలి అనిపించవచ్చు. పైగా కర్మయోగం పాటించాలంటే, అప్రమత్తంగా ఉండాలి. అలా కష్టపడితే కలిగే ఫలం ఆశాజనకంగా ఉంటేనే, దానిమీద మోజు ఉంటుంది. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించటానికి ఎందుకు అంత కష్టపడతారు కొందరు? దాన్ని గెలిస్తే కలిగే ఆనందం ముందు, వారు పడ్డ కష్టం చిన్నదిగా అనిపిస్తుంది కాబట్టి.

కృష్ణపరమాత్మ మోక్షాన్ని ఈ శ్లోకంలో నిర్వచిస్తున్నాడు. ఆధ్యాత్మిక జ్ఞానం పొందిన వ్యక్తికి కలిగే ఆనందం అనంతం. అందులోనే లౌకిక విషయాలవల్ల కలిగే ఆనందం కూడా వస్తుంది. లౌకిక విజయాలు అంటే ధనం, హోదా, అధికారం, భార్య, పిల్లలు – అన్నీ కొంతమేరకు ఆనందాన్ని కలుగజేస్తాయి. ఈ ఆనందాన్ని కొట్టివేయటం లేదు కృష్ణపరమాత్మ. కాకపోతే, ఎప్పుడైతే మోక్షం పొందుతాడో, ఈ లౌకిక విజయాలను పోగొట్టుకోనవసరం లేదు, వాటివల్ల వచ్చే ఆనందం కూడా మోక్షానందంలోనే నిండి నిభిడీకృతమై ఉంది అంటాడు.

కర్మకాండ ప్రాపంచిక ఆనందాలకోసం అనేక కర్మలను సూచిస్తుంది. కాని వీటివల్ల వచ్చే ఒక్కొక్క ఆనందం పరిమితి ఉన్న ఆనందం. ధనంవల్ల కలిగే ఆనందం, భార్యవల్ల కలిగే ఆనందం, పుత్రులవల్ల కలిగే ఆనందం, అధికారంవల్ల కలిగే ఆనందం – అన్నీ పరిచ్ఛిన్న సుఖాలు. జ్ఞానకాండ చెప్పే మోక్షం ఒక్కటే అపరిచ్ఛిన్నసుఖం. అపరిచ్ఛిన్న సుఖంలో పరిచ్ఛిన్న సుఖాలు కూడా వస్తాయి కాబట్టి అతనేమీ కోల్పోడు. ధర్మార్థకామాలు కోరుకుంటే అవి మాత్రమే తీరుతాయి. మోక్షం కలుగదు, కాని మోక్షం కోరుకుంటే ధర్మార్థకామాలు కూడా తీరుతాయి. అపరిచ్ఛిన్నంలో పరిచ్ఛిన్నం వస్తుంది కాని పరిచ్ఛిన్నంలో అపరిచ్ఛిన్నం రాదు. అందువల్ల కర్మయోగం కోరుకుంటే, దాని ఫలం గొప్పగా ఉంటుంది. ఇది సూచించటానికి కృష్ణపరమాత్మ ఒక ఉదాహరణ కూడా ఇస్తున్నాడు.

ఉదపానం – చిన్న జలాశయం. అందులో కొన్ని నీళ్ళే ఉంటాయి.

సర్వతః సంప్లుతోదకే – అన్నివైపులా జలంతో నిండివున్న మహాజలాశయం. అది కూడా ఉప్పునీరు కాదు, స్వచ్ఛమైన నీరు ఉన్న మహాజలాశయం. ఇప్పుడు చిన్న జలాశయంతో ఎక్కువ లాభం పొందలేము. కాని మహాజలాశయంతో, చిన్న జలాశయంతో పొందే ఫలంతో పాటు, అధికఫలం కూడా పొందగలము. అంటే చిన్న తటాకంతో కలిగే లాభం పెద్ద జలాశయంతో కలుగుతుంది కాని, పెద్ద జలాశయంతో కలిగే లాభం చిన్న తటాకంతో పొందలేము. అంటే ముందే చూసినట్టుగా ధర్మార్థ కామాలు మోక్షంలో కూడా తీరుతాయి కాని మోక్షం ధర్మార్థకామాల ద్వారా తీరదు. ఇదీ దీని సారాంశం. ఇప్పుడు ఈ శ్లోకాన్ని చూద్దాము. ఇది చాలా ముఖ్యమైన శ్లోకం.

**ఉదపానే** – చిన్న తటాకంవల్ల కలిగే ప్రయోజనం ఏదైతే ఉందో;

**తావాన్ అర్థః** – ఆ లాభాలన్నీ ఇందులో పొందవచ్చు. ఎందుకు?

**సర్వతః సంప్లుతోదకే** – అంటే పెద్ద జలాశయంతో చిన్న తటాకంతో పొందే ప్రయోజనంతో పాటు అధికఫలం కూడా పొందగలము. అదే విధంగా,

**సర్వేషు వేదేషు యావాన్ అర్థః** – ఇక్కడ వేదాలు అంటే కర్మకాండ భాగం. కామ్యకర్మ గురించి చెప్పేటప్పుడు అనేక ఫలాలను వర్ణిస్తారు.

**ధాన్యం ధనం పశుం బహుపుత్ర లాభమ్**

ఈ కర్మకాండ చేస్తే పొందే ఈ ఫలాలన్నీ కూడా,

**విజానతః** – మోక్షంవల్ల పొందగలడు. మోక్షం పదం మనం కలుపుకోవాలి. ఎవరికి మోక్షం? విజానతః అంటే తెలివైన వ్యక్తికి. అందువల్ల మోక్షాన్ని ఒక పెద్ద జలాశయంతో పోలిస్తే డబ్బు, కుటుంబం, ఉద్యోగం, హోదాలను చిన్న తటాకంతో పోల్చాలి. ఆ తటాకం ఎప్పుడు ఎండిపోతుందో తెలియదు. అందువల్ల వైదికయజ్ఞాలవల్ల పొందగలిగే ఫలాలన్నిటినీ ఒక్క మోక్షజ్ఞానంవల్లనే పొందవచ్చు. అందువల్ల ఓ అర్జునా, నువ్వు తెలివైనవాడివైతే మోక్షాన్ని ఎన్నుకోవాలి. మోక్షం పొందాలంటే కర్మయోగం పాటించాలి. అందువల్ల ముందు కర్మయోగి అవ్వాలి.

**బ్రాహ్మణస్య** – బ్రాహ్మణుడు అంటే వివేకి. పుట్టుకతో బ్రాహ్మణుడు అయిన వ్యక్తిని జాతి బ్రాహ్మణుడనీ, బ్రాహ్మణకర్మ చేసే వ్యక్తిని కర్మ బ్రాహ్మణుడనీ, సత్త్వగుణం ఉన్న వ్యక్తిని గుణబ్రాహ్మణుడనీ అంటారు. ఇక్కడ బ్రాహ్మణుడంటే గుణబ్రాహ్మణుడు. అందువల్ల వివేకం ఉన్న గుణబ్రాహ్మణుడు, తన విజ్ఞానం ద్వారా తన అంతిమలక్ష్యాన్ని పొందుతాడు.

శ్లో. 47 **కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।**
**మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోఽ స్త్వకర్మణి ॥**
కర్మణి, ఏవ, అధికారః, తే, మా, ఫలేషు, కదాచన,
మా, కర్మఫలహేతుః, భూః, మా, తే, సంగః, అస్తు, అకర్మణి ॥

| | | | |
|---|---|---|---|
| తే | = నీకు | మా, భూః | = హేతువు కావు |
| కర్మణి, ఏవ | = కర్మాచరణమందే | తే | = (అట్లే) నీకు |
| అధికారః | = అధికారము కలదు | అకర్మణి | = కర్మను చేయకపోవుటయందు |
| ఫలేషు | = కర్మ ఫలములందు | సంగః | = ఆసక్తి |
| కదాచన, మా | = ఎన్నడును లేదు | మా, అస్తు | = ఉండరాదు. |
| కర్మఫలహేతుః | = (నీవు) కర్మఫలమునకు | | |

**తే అధికారః కర్మణి ఏవ కదాచన ఫలేషు మా।**
**కర్మ–ఫల–హేతుః మా భూః తే సంగః అకర్మణి మా అస్తు॥**

తా: నీకు కర్మాచరణమందు మాత్రమే అధికారము గలదు. కర్మ ఫలములందు అధికారము ఏనాడైననూ లేదు. నీవు కర్మఫలమునకు కారణము కావు. నీకు కర్మను చేయకపోవుటయందు ఆసక్తి ఉండరాదు!

ఇది చాలా ముఖ్యమైన శ్లోకం. తరచు దీన్ని ఉటంకిస్తుంటారు అందరూ. కర్మయోగసూత్రాలను చూస్తాము ఇందులో. తను చేసే కర్మ గురించీ, ఆ కర్మవల్ల వచ్చే ఫలం గురించీ కర్మయోగికి ఎలాంటి దృక్పథం ఉండాలో నిర్వచిస్తుంది ఇది. కర్మయోగంలో ఈ రెండూ చాలా ముఖ్యం – కర్మ, కర్మఫలం. ఈ రెండింటిమీదా మనకు ఆరోగ్యకరమైన దృక్పథం ఉండాలి. ఆరోగ్యకరమైన దృక్పథం ఉండాలంటే, ముందు దాని గురించిన సరైన జ్ఞానం ఉండాలి. ఒక వ్యక్తిని మనకు ఎవరైనా పరిచయం చేసి, అతనెలాంటివాడో చెప్పమంటే ఏం చెప్పగలం? కొన్నాళ్ళు అతనితో చనువుగా మసలితే, చాలా మంచివాడనో, అనుకున్నంత మంచివాడు కాదనో అర్థమవుతుంది. అంటే అతనిమీద మన దృక్పథం అతన్ని మనం అర్థం చేసుకున్న దాన్నిబట్టి ఉంటుంది.

అందువల్లనే, స్వామీజీ ఎప్పుడూ చెబుతారు – ఒక వస్తువును అర్థం చేసుకోవటంలో మార్పు రాకపోతే, మన దృక్పథంలో మార్పురాదు. అందువల్ల కృష్ణపరమాత్మ ఇక్కడ రెండు ముఖ్యమైన సూత్రాలను ఇస్తున్నాడు.

**కర్మణి అధికారః అస్తి** – ముందుగా, మనిషికి ఫ్రీవిల్ (పురుషబుద్ధి) ఉందని అర్థం చేసుకోవాలి. మనిషికి ఫ్రీవిల్ ఉందని నిరూపించే ముఖ్యమైన శ్లోకాల్లో ఇది ఒకటి. జంతువులకు ఈ ఫ్రీవిల్ లేదు. ఆవుకు కాని కుక్కకు కాని భవిష్యత్తులో ఏమీ లక్ష్యాలు ఉండవు. మనిషి మాత్రమే బుద్ధిజీవి. ఫ్రీవిల్‌వల్ల మనకు ఆలోచించే శక్తి ఉంది; విచక్షణా శక్తి ఉంది; లక్ష్యాన్ని కోరుకునే శక్తి ఉంది; దానికి తగ్గట్టుగా పనిచేసే శక్తి కూడా ఉంది. మనం కోరుకున్నట్టుగా పనిచేసేందుకు కర్మేంద్రియాలను ఇచ్చాడు. కాకపోతే భగవంతునిలాగా మనం సర్వ శక్తిమంతులము కాము. మన శక్తి మేరకు చాలా విషయాలను సాధించగలము; అందువల్ల కోరుకున్న లక్ష్యాన్ని ఎన్నుకునే అధికారం ఉంది.

మనిషిగా మనకు నాలుగు పురుషార్థాలు ఉన్నాయి – ధర్మార్థ కామమోక్షాలు. పురుషార్థాలకు రెండు అర్థాలున్నాయి – ఫ్రీవిల్, మానవ లక్ష్యాలు. ఫ్రీవిల్ ఉంటేనే లక్ష్యాన్ని ఎన్నుకునే అవకాశం ఉంటుంది కదా! ఫ్రీవిల్, లక్ష్యాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉండటంవల్ల రెండింటినీ కలిపి పురుషార్థాలు అంటారు. ఆ లక్ష్యం ఏదైనా అవవచ్చు – లౌకికమైనా, ఆధ్యాత్మికమైనా సరే. అందువల్ల కర్మను ఆచరించటంలోనే నీకు అధికారం ఉంది.

**మా ఫలేషు కదాచన** – కాని కర్మఫలంమీద నీకు ఎన్నటికీ అధికారం లేదు. 'మా' అంటే లేదు. అధికారం లేదు. కర్మఫలంమీద నీకు ఎన్నటికీ అధికారం లేదు అనేసరికి, కొంతమంది దీన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. అంటే భగవానుడు ముందే మన తలరాతను నిర్ణయించేశాడు. మనం ఏం చేసినా లాభం లేదు. కానున్నది కాకమానదు. విధి **బలీయం** అంటారు వీరు. వీరికి ఆధారం ఈ వాక్యం. విధిని నమ్ముతారు వీరు.

కొన్ని కంపెనీల్లో ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టుకోమని పేపర్లో ప్రకటనలు ఇస్తారు కాని అది కేవలం కంటితుడుపే! వారి దృష్టిలో ముందే ఎవరో అభ్యర్థి ఉంటాడు. అతనిని నియమించుకునే ముందు ఇలా ప్రకటన ఇవ్వాలి కాబట్టి ఇస్తారు. అలాంటిదే మన విధి కూడా అంటారు. ముందే ఫలం నిర్ణయించబడి ఉంది. మనం చేసే పనులు యాంత్రికమే అవుతాయి కాని వాటి ప్రయోజనమేమీ ఉండదు అంటారు వారు. కాని అది పొరపాటు.

కర్మ చేయటానికి అధికారం ఉంది, కర్మఫలంలో అధికారం లేదు అని కృష్ణపరమాత్మ చెప్పటంలో అర్థం – కర్మ చేసే చోట బుద్ధిని ఉపయోగించి, తెలివైన మార్గం ఎన్నుకోవాలి. ఫలం వచ్చేచోట కూడా బుద్ధిని ఉపయోగించినా తెలివి ఒక్కటే ఫలాన్నివ్వదు, దానితోపాటు అనేక అంశాలు కలిసివున్నాయి అని గ్రహించాలి. బుద్ధిని ఉపయోగించి ఎన్నుకోగలిగిన పరిస్థితుల్లో, దాన్ని ఉపయోగించుకోవాలి. భగవంతుడిచ్చిన హక్కును ఎందుకు వదులుకోవాలి? హక్కు ఉన్నచోట వాడాలి. హక్కు లేని చోట, బాధ్యతగా ఒప్పుకోవాలి. ఎక్కడ హక్కు ఉందో, ఎక్కడ బాధ్యతగా ఒప్పుకోవాలో తెలుసుకోవాలి.

**కర్మ విషయే అధికారః అస్తి, కర్మఫల విషయే అధికారః నాస్తి.** కర్మచేసే విషయంలో అధికారం ఉంది కాబట్టి, బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి కాని, గుడ్డిగా దూకేయకూడదు. కర్మఫలం స్వీకరించేచోట అధికారం లేదు కాబట్టి, దాన్ని విజ్ఞతతో స్వీకరించాలి. ఇక్కడ కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి.

కర్మఫలం విషయంలో నీకు అధికారం లేదు అంటే **బొత్తిగా అధికారం లేదు అనికాదు అర్థం, నీకు మాత్రమే అధికారం లేదు** అని అర్థం. కర్మఫలంమీద అధికారం లేదు కాబట్టి మనం చేసే కర్మలు వృథా అనుకోవటం పొరపాటు. ప్రతికర్మకూ, అత్యంత స్వల్పమైన కర్మనుంచీ అత్యంత పెద్దకర్మవరకూ కర్మఫల సిద్ధాంతం ప్రకారం ఫలం ఉండి తీరుతుంది. కాకపోతే ఇందాక చెప్పినట్టుగా ఆ ఫలం ఒక్క మన శ్రమమీదే ఆధారపడి ఉండదు. మన శ్రమ కూడా ఒక కారణం, కాని అది మాత్రమే కారణం కాదు; ఆ ఫలం రావటానికి అనేక కారణాలు కలుస్తాయి. కర్మఫలానికి మన కర్మ పూర్తిగా నిరుపయోగం కాదు; మన కర్మ పూర్తిగా కారణమూ కాదు; అనేక కారణాల్లో అది కూడా ఒక కారణం.

ఒకచోట స్వామీజీ బోధ నిరాటంకంగా సాగుతోందంటే దానికి అనేక కారణాల తోరణాలు ఉంటాయి. ముందుగా స్వామీజీ ఆ బోధకు రావటానికి నిర్ణయించుకోవాలి, దానికి రావాలి. అది ఒక ముఖ్యకారణం. కాని దానితో అయిపోదు, తక్కిన అంశాలు కూడా తోడ్పడాలి. శిష్యులు కూడా రావాలి.

**నగ్నః క్షపణాః దేశే రజకః కిం కరిష్యతి**
**కిం వదిష్యంతి కరిష్యంతి వక్తారః శ్రోతా యత్ర న విద్యతే**

వినేవారు లేకపోతే గురువు ఎవరికి బోధ చేస్తారు? అందువల్ల ఒక గురువు తనకు గురుత్వం హోదా ఇచ్చినందుకు శిష్యులకు కృతజ్ఞతలు చెప్పుకుంటారు. ఒక చాకలివాడు, ఒక ఊర్లో వ్యాపారం చేసుకుందామని వెళితే, అక్కడ దిగంబరులు ఉంటారని తెలిసింది. ఇంకేం చేస్తాడు? అక్కడనుంచి వేరే ఊరు వెళ్ళిపోతాడు.

ఆ విధంగా, ఒక గీతాబోధ అవాలంటే, గురువు ఒక్కరు ఉంటే చాలదు, గురువు రావాలి, అలాగే శిష్యులు రావాలి, వాతావరణం సహకరించాలి. వాన వస్తే అందరూ రారు; కాస్త వాన వస్తే చాలు కరెంటు పోతుంది; కరెంటు పోకుండా ఉండాలి. బోధ జరగటానికి అనువైన స్థలం కావాలి. ఈ పరిస్థితిని గురువు పరంగా చూస్తే, తను బోధ చేయాలా వద్దా, అంటే ఆ కర్మ చేయాలా వద్దా అనే నిర్ణయం తీసుకునే హక్కు గురువుకు ఉంది. దానికి గురువు తన ఫ్రీవిల్‌ను ఉపయోగిస్తాడు. కాని శిష్యులు రావటం, వాతావరణం సహకరించటం, కరెంటు ఉండటం, బోధ జరిగే చోటు అనుకూలంగా ఉండటంలాంటి అనేక అంతులేని అంశాలు విధిమీద ఆధారపడి ఉంటాయి. దాన్నే ఈశ్వరేచ్ఛ అంటాము. అంటే ఇప్పుడు ఒక గీతాబోధ నిర్విఘ్నంగా జరిగిందీ అంటే దానికి కారణాలు ఏమిటి? **గురువు ఫ్రీవిల్ + ఈశ్వరేచ్ఛ.**

అందువల్ల కృష్ణపరమాత్మ ఫలితంమీద నీకు అధికారం లేదు అని అంటే దానర్థం ఫలితంమీద నీకు మాత్రమే అధికారం లేదు, దానికి ఈశ్వరేచ్ఛ కూడా తోడవ్వాలి అని. ఈశ్వరేచ్ఛ అంటే అనేక అంశాలు అని చూశాము. అవి ఎన్నో మనం ఊహించలేము. అందువల్లనే వాతావరణశాఖ వారు ఇవాళ వాన కురుస్తుంది అంటే ఫెళ్ళున ఎండ కాస్తుంది. పాపం వారిని తప్పుపట్టటానికి వీలులేదు. వారు 170 అంశాలు పరిగణనలోకి తీసుకున్నా, వారికి అంతుచిక్కని ఇంకేవో కారణాలు ఉంటాయి. వాటిని వారు అదుపులో పెట్టలేరు.

ఇలాంటి ఉదాహరణలు ఎన్నైనా చెప్పవచ్చు. ఒక పంట పండాలంటే విత్తనం ఒక్కటి మంచిది పాతితే చాలదు. దానికి రైతు చాలా అంశాల విషయాల్లో కష్టపడాలి. నేలను దున్నాలి, నీరు పొయ్యాలి, ఎరువులు వెయ్యాలి, చీడపురుగులను పారద్రోలాలి. ఇంతా చేస్తే పండినపంట చేతికి వచ్చేదాకా నమ్మకం లేదు. ఎందుకు? సకాలంలో, తగినంత వాన కురవాలి. ఎక్కువ కురిసినా నష్టమే, అసలు కురకవపోయినా నష్టమే. అలా నష్టం కలుగుతుందని పంట వేయకుండా మానేయడు కదా! పంటవేసి, ఫలితాన్ని దేవునిమీద వేయాలి. పూర్తిగా ఆశావాదిగానూ ఉండకూడదు, పూర్తిగా నిరాశావాదిగానూ ఉండకూడదు.

నిఘంటువులో 'అ' అక్షరం తీసుకుందాము. 'అ' అక్షరం, నావల్లనే ఒక పదం ఏర్పడుతుందా అని అడిగితే దానికి సమాధానం ఏమిటి? కాదు అనే. అ పక్కన ఇంకా కొన్ని అక్షరాలు వచ్చి చేరితేనే దానికి అర్థం. అల, అరటి, అపాయం వగైరా! అ తర్వాత ఏం చేరుతాయో దాన్నిబట్టి 'అ'కు విలువ. ఇది వింటే, పదం ఏర్పడటంలో నా ప్రమేయం లేనప్పుడు నా గొప్పదనం ఏముంది, నేను నిఘంటువులోంచి వెళ్ళిపోతాను అని 'అ' అక్షరం అంటే ఏమిటి పరిస్థితి? అలా అన్ని అక్షరాలూ అలిగి వెళ్ళిపోతే నిఘంటువు అనేదే ఉండదు. అంటే **అక్షరాల విలువ అక్షరాలకు ఉంది, కాని వాటికి విడిగా విలువలేదు**. ఇంకా కొన్ని అక్షరాలతోనో, కనీసం ఇంకొక్క అక్షరంతోనో కలిస్తేనే దానికి విలువ.

మన కర్మఫలాన్ని నిర్ణయించేది ఫ్రీవిల్లా లేక విధి ఆడే వింత నాటకమా? ఈ ప్రశ్న మనుష్యులను తరుచూ వెంటాడుతూ ఉంటుంది. కొంతమంది **శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు**. నా చేతిలో ఏమీలేదు. నా తలరాతను ఆ భగవంతుడే నిర్ణయిస్తాడు అని వాదిస్తారు. అంటే వారు **విధిని** నమ్ముతారు. ఇంకా కొంతమంది **నీ కర్మకు నువ్వే బాధ్యుడవు** అని నమ్ముతారు. అంతా నా చేతిలో ఉంది. నా విజయానికి నేనే కారణం అని విర్రవీగుతారు.

వీరిది **అహంకారభావం**. వీరిద్దరిలో ఎవరిది సరైన వాదన? ఇద్దరిదీ కాదు. ముందే చెప్పినట్టుగా, **కర్మఫలంలో నీకు అధికారం లేదు అంటే నీకు మాత్రమే అధికారం లేదు** అని అర్థం. తక్కిన అంశాలు ఏమిటో తెలిసినా, వాటిమీద మనకు అధికారం లేదు. ఉదాహరణకు వాన రాకుండా మనం ఆపలేము. అందువల్ల ఫలం ఎలా వస్తుందో ఎన్నటికీ మనం ముందే ఊహించలేము.

ఫలాన్ని మనం ఊహించలేము అని తెలిసినప్పుడు, మన ఆనందాన్ని ఆ ఫలంమీద ఆధారపడేలా చేయ కూడదు. కృష్ణపరమాత్మ ఈ చిన్న పాఠాన్ని నేర్పిస్తున్నాడు. ఊహించలేని అంశాలమీద ఆనందం ఆధారపడితే, ఆనందం కూడా వస్తుందో రాదో ఊహించలేము. ఆనందం వస్తుందో రాదో తెలియకపోతే, జీవితం బాగుంటుందో లేదో తెలియదు. అందువల్ల ఫలం ఆశించకుండా అనుభవంమీద, ఎదుగుదలమీద, కర్మ చేయటంలో కలిగే ఆనందంమీదే దృష్టి పెట్టాలి కాని ఫలంమీద కాదు. అప్పుడు ఎటువంటి ఫలం వచ్చినా మన ఆనందానికి అడ్డురాదు.

ఉదాహరణకు శరీరానికి వ్యాయామం కావాలని ఎవరైనా టెన్నిస్ ఆట ఆడుతున్నారనుకోండి. అప్పుడు అతను ఆట ఆడటంలోనే ఆనందం అనుభవిస్తాడు. ఆటలో గెలువు, ఓటములు అతనిని బాధించవు. అతను ఆడటంవల్ల అతను కోరుకున్న వ్యాయామం కలుగుతున్నది కాబట్టి ఆట ఆడటంలోనే ఆనందం పొందుతాడు. అదేవిధంగా మనం చేసే ప్రతిపనినీ టెన్నిస్ ఆడినంత ఇష్టంగా చేస్తే, మనకు కావాల్సిన ఆనందం పనిలోనే పొందుతాము. అప్పుడు ఫలం అనుకోకుండా వచ్చే ఫలితం.

స్వామీజీ ఒకసారి 90 మంది శిష్యులను అమర్‌నాథ్ యాత్రకు తీసుకువెళ్ళారు. అందులో చాలామంది 70 సంవత్సరాల పైబడ్డ వృద్ధులు. స్వామీజీ అక్కడకు వెళ్ళేముందే, ఆ శిష్యులను సంసిద్ధులను చేశారు – ఆ అమర్‌నాథ్ ఆలయంలో ఉండేది హిమలింగం అనీ; ఒకవేళ ఎండ ఎక్కువగా ఉంటే మంచు కరిగిపోతుందనీ, లింగాకారం ఉండకపోవచ్చనీ చెప్పారు. అంటే ఒక్కముక్కలో చెప్పాలంటే వారికి కర్మ చెయ్యటంమీదనే అధికారం ఉంది కాని, ఫలంమీద అధికారం లేదని చెప్పారు.

బోలెడు డబ్బు ఖర్చుపెట్టి, మూడురోజులు అష్టకష్టాలు పడి, 14000 అడుగుల ఎత్తుకు నడిచి వెళ్ళారు. నిజానికి అదంతా హిమాలయాలలో కాబట్టి, కష్టమైనా ప్రయాణమే ఒక మరుపురాని అనుభవం. ఎటుచూసినా మంచుకొండలు, వాటితో పోటీపడుతూ ప్రకృతి అందాలు చిందిస్తుంటే, చూడటానికి రెండుకళ్ళు చాలవు. ప్రకృతి ఆనందాన్ని చూసి మైమరచిపోండి, హిమలింగానికి ప్రాముఖ్యతనివ్వకండి అని చెప్పి మరీ తీసుకెళ్ళారు.

కాని, అదేం దురదృష్టమో, అక్కడ మంచు అంతా కరిగిపోయి, బొత్తిగా లింగమే కనబడలేదు. ఏదో ఒక చిన్న ఆకారంలో ఉంది. స్వామీజీ అంత చెప్పినా, ఆ పరిస్థితి చూసి భోరున ఏడ్చినవాళ్ళే ఎక్కువ. ఇంత ఖర్చుపెట్టి, ఇంత వ్యయప్రయాస కోర్చి, ఆకలిదప్పులు తీర్చుకోలేక, కాలకృత్యాలు తీర్చుకోలేక వచ్చింది ఇందుకా! బాత్రూమ్‌కి ఎక్కడకెళ్ళాలి అని అడిగితే ఆరుబయట చూపించారుట ఎవరికో ఎవరో! **ఆహారం లేదు, భగవానుడు కూడా లేదు** అని ఒకటే వాపోయారు అందరూ. వారు ముందే సంసిద్ధులు కాలేదు కాబట్టి ఆశించని

ఫలాన్ని నవ్వుతూ స్వీకరించలేకపోయారు. స్వామీజీ సంసిద్ధులు అయ్యారు కాబట్టి ప్రయాణాన్ని ఆనందించారు! ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

అందువల్ల ఒకపని చెయ్యాలంటే మీ ప్రయత్నం ఉండాలి; ఒక పదం ఏర్పడటానికి ప్రతి అక్షరమూ ఉండాలి; ఒక వ్యక్తి గెలవాలంటే ప్రతి ఒక్కరూ ఓటు వెయ్యాలి. మీరు ఎవరికి ఓటు వేస్తారో అతను గెలవకపోవచ్చు. అతను గెలుస్తాడో లేదో తెలియదు కాబట్టి నేను ఓటు వెయ్యను అనకూడదు. అందువల్ల కర్మఫలంలో నీకు అధికారం లేదు అంటే నీకు మాత్రమే అధికారం లేదు అని అర్థం. బాహ్య విజయం నీ చేతిలో లేదు, కాని ఆంతర్గత ఎదుగుదల నీ చేతిలోనే ఉంది.

**కర్మఫలే హేతుః మా భూః** – బాహ్యమైన విజయాలమీదే దృష్టి పెట్టకు. ప్రపంచంలో వ్యవహారం నడుపుతున్నప్పుడు నీ దృష్టి డబ్బుమీద, హోదామీద, పేరు ప్రఖ్యాతులమీద ఉండకూడదు. అవన్నీ వస్తాయో రావో తెలియదు. కర్మఫలం అంటే ఇక్కడ ప్రాపంచిక విజయం. హేతువు అంటే ఇక్కడ లక్ష్యం. మన లక్ష్యం ప్రాపంచిక విజయం కారాదు. అదే మన లక్ష్యం అయితే ఏమవుతుంది? ఒకరోజు విజయ శిఖరాలను అధిరోహిస్తాము. ఇంకొకరోజు పాతాళానికి అణగదొక్కబడతాము. వాటిమీద ఆధారపడితే బండ్లు ఓడలు అవుతాయి, ఓడలు బండ్లు అవుతాయి. అయితే దేనిమీద దృష్టి పెట్టాలి? చేసే కర్మమీద, ఆ కర్మ చేస్తున్నప్పుడు కలిగే ఆనందంమీద దృష్టి పెట్టాలి.

**మా తే సంగోఽ స్త్వకర్మణి** – అలాగని కర్మలు చేయటం మానకూడదు. రెండుసార్లు జీవితంలో అపజయాలు చవిచూసేసరికి, విధిరాతను నమ్ముకుని, నిరాశానిస్పృహలకు లోనయి, కర్మ చేయటమే మానేస్తాము. నేను ఏ పని ఆరంభించినా, దారుణంగా నష్టపోతున్నాను, ఇంకెందుకు పని చేయాలి అనే పలాయనవాదం వచ్చేస్తుంది. 'అందువల్ల నేను ఓటములను తప్పించుకోదలుచుకున్నాను,' అంటారు. ఎలాగంటే అసలేపని చేయకుండా! కొంతమంది గొప్పగా 'నేను జీవితంలో ఒక్క ఓటమిని కూడా ఎదుర్కోలేదు తెలుసా?' అంటారు. 'ఏ పని సాధించావు నువ్వు?' అడగండి. ఏమీ చేసివుండరు. ఏదైనా చేస్తే కదా, ఓటమి వచ్చేది. చేయకపోతే, ఓటమి ప్రసక్తే లేదు. అలా పని చేయకపోతే ఓటమిని తప్పించుకోవచ్చేమో కాని, లాభమూ పొందలేరు. అంతర్గత గెలుపు పొందే అవకాశం దొరకదు. ఏదైనా కర్మ చేస్తేనే ప్రాథమిక ఆధ్యాత్మిక ఎదుగుదల కలుగుతుంది.

> **ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే ।**
> **యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే ।।** – 6.3

కర్మ చేస్తే అంతర్గత ఎదుగుదల కలుగుతుంది; సన్న్యసించినా అంతర్గత ఎదుగుదల కలుగుతుంది. అందువల్ల కర్మ చెయ్యటమూ ముఖ్యమే, కర్మను త్యజించటమూ ముఖ్యమే. కర్మ చేయాల్సిన చోట చేయాలి, త్యజించాల్సిన చోట త్యజించాలి. ప్రవృత్తి మార్గమూ ముఖ్యమే, నివృత్తి మార్గమూ ముఖ్యమే. పైన చెప్పిన శ్లోకంలో ఆధ్యాత్మిక ఎదుగుదల ప్రారంభదశలో కర్మ చెయ్యటంవల్లనే కలుగుతుంది అని చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. గృహస్థాశ్రమంలో కర్మ చేసితీరాలి; వానప్రస్థాశ్రమం, సన్న్యాసాశ్రమాల్లో కర్మను త్యజించాలి.

జీవితంలో మొదటిదశ కర్మ; రెండవ దశ సన్యాసం. అర్జునుడు ఇప్పుడు మొదటిదశలో ఉన్నాడు. అందువల్ల అకర్మణి సంగః మా అస్తు. సమాజంనుంచి పారిపోకూడదు. అందువల్ల చిన్మయానందస్వామి తన దగ్గర విద్యనభ్యసించిన శిష్యులను బయట ప్రపంచంలోకి వెళ్ళి సమాజసేవ చేయమని చెప్పేవారు. ఏదీ చేయకపోతే శాస్త్రాన్ని బోధించమని చెప్పేవారు. అందువల్ల ప్రవృత్తి మార్గం చాలా ముఖ్యం. నీ బాధ్యతనుంచి నువ్వు పారిపోకు. బాహ్య ఎదుగుదలమీద కాకుండా, అంతర్గత ఎదుగుదలమీద దృష్టి పెట్టమంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 48 **యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।**
**సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥**
యోగస్థః, కురు, కర్మాణి, సంగం, త్యక్త్వా, ధనంజయ,
సిద్ధ్యసిద్ధ్యోః, సమః, భూత్వా, సమత్వమ్, యోగః, ఉచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| ధనంజయ | = ఓ ధనంజయా! | యోగస్థః | = యోగమునందు స్థితుడవై |
| సంగమ్ | = ఆసక్తిని | కర్మాణి | = కర్మలను |
| త్యక్త్వా | = త్యజించి | కురు | = చేయుము |
| సిద్ధ్యసిద్ధ్యోః | = కార్యసిద్ధి, అసిద్ధిలలోను | సమత్వమ్ | = సమత్వ బుద్ధియే |
| సమః | = సమబుద్ధి | యోగః ఉచ్యతే | = యోగమని చెప్పబడును |
| భూత్వా | = కలిగి | | |

**హే ధనంజయ! సంగం త్యక్త్వా, సిద్ధి– అసిద్ధ్యోః సమః భూత్వా, యోగస్థః కర్మాణి కురు। సమత్వం యోగః ఉచ్యతే ॥**

తా: సంపదను జయించిన ఓ అర్జునా! (కర్మనందు) ఆసక్తిని విడిచిపెట్టి కార్యసిద్ధియందు, కార్యము సిద్ధించకపోవుటయందు కూడా సమానముగా ఉండువాడవై, అటువంటి యోగమునందున్నవాడవై కర్మలను చేయుము. ఇట్టి సమానత్వమే యోగమని చెప్పబడును.

జీవితంలో ప్రాపంచిక విజయంమీద సరైన దృక్పథం ఉండాలి. మనకు సరైన దృక్పథం ఉంటే జయాపజయాలకు చలించము. అంతర్గత ఎదుగుదలకు ప్రాముఖ్యతనిచ్చి, వీటికి ఎంతమేరకు ప్రాముఖ్యత నివ్వాలో అంతమేరకే ఇస్తాము. అందువల్ల నష్టం వాటిల్లినా అంతగా కృంగిపోము.

ఒకే రంగంలో పదిమంది ఓడిపోయినా అందరి ప్రతిస్పందనా ఒకేలా ఉండదు. ఒకరు కృంగిపోయి, ఆత్మహత్య చేసుకునే స్థాయికి వెళ్ళవచ్చు; మరొకరు చాలా రాత్రులు నిద్రపోకుండా కృంగిపోవచ్చు; మరొకరు జీవితమన్నాక ఒకసారి గెలుపు, మరొకసారి ఓటమి రాకతప్పదు అనవచ్చు. అతను ఓటమినుంచి కూడా విలువైన పాఠం నేర్చుకుంటాడు. ఏదైనా ప్రమాదం జరిగిందని వింటే, ముందు అలవాటుగా 'ఏమిటి?' అన్నా, మళ్ళీ వెంటనే తట్టుకుని 'అయితే ఏమిటి?' అనగలుగుతాడు.

ఉన్నత శిఖరాలమీద ఉన్న ఒక వ్యాపారవేత్తకు అతని విజయరహస్యం చెప్పమని అడిగారుట పత్రికా విలేఖరులు. 'ఏముంది, సరైన నిర్ణయం తీసుకోవటం,' అన్నాడు. 'సరైన నిర్ణయం ఎలా తీసుకుంటారు?' 'జీవితం నేర్పిన అనుభవం.' 'జీవితం నేర్పిన అనుభవం ఏమిటి?' 'తప్పుడు నిర్ణయాలు తీసుకోవటం.' అంటే, చూడటానికి అది తప్పుడు నిర్ణయంగా ఉన్నా, జీవితపాఠాలను నేర్పిస్తుంది. ఈ అంతర్గత ఎదుగుదలమీద దృష్టి పెట్టి, మనస్సును దృఢం చేసుకోగలగటమే సమత్వం అంటే.

**సమత్వం యోగ ఉచ్యతే** – ఎవరైతే అంతర్గత ఎదుగుదలకు ప్రాముఖ్యతనిచ్చి, బాహ్యవిజయాలకు ప్రాముఖ్యత నివ్వరో, అతనికి దానివల్ల సమభావం ఏర్పడుతుంది. దాన్నే యోగం అంటారు. వ్యాపారంలో పెద్ద లాభం వచ్చినా పొంగిపోడు, నష్టం వచ్చినా కృంగిపోడు.

**సంపత్తౌ చ విపత్తౌ చ, మహతామేకరూపతా ।**
**ఉదయే సవితా రక్తో, రక్తశ్చాస్తమయే తథా ॥**

చిన్న సుభాషితంలో ఎంతో గొప్ప భావన! సంపద కలిగినా, విపత్తు వాటిల్లినా మహాత్ములు ఒకేలా ఉంటారు. ఆకాశంలో సూర్యుడు ఉదయిస్తున్నా, అస్తమిస్తున్నా కూడా ఆకాశం ఎర్రరంగులో ఒకేలా ప్రకాశిస్తుంది. విడిగా ఫోటో చూస్తే, ఆ అరుణిమను చూసి అది సూర్యోదయమో, సూర్యాస్తమయమో చెప్పలేరు. అలా ఉంటారు మహాత్ములు. అలా ఉండగలగటం; **సమత్వం యోగ ఉచ్యతే.** కర్మయోగికి ఉండాల్సిన ముఖ్యలక్షణం మానసిక సమతుల్యత. అందువల్ల అర్జునా ఆ సమతుల్యతను పెంపొందించుకో!

**యోగస్థః కర్మాణి కురు** – ఆ సమత్వంలో ఉండి, నువ్వు చేయాల్సిన కర్మలను చేయి. ఏ కర్మ చేసినా, అందులో ఎంతో కొంత ప్రమాదం పొంచి ఉండనే ఉంటుంది. దయానందస్వామీజీ రోడ్డు దాటటం కూడా ప్రమాదమే అంటారు. నమ్మకం లేకపోతే ఏ ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డుకి వెళ్ళి చూసినా ఆ నిజం మీ కళ్ళముందు ఉంటుంది. ఒక్కోసారి ఆసుపత్రికే కాదు, సరాసరి ఇంకో లోకానికే తీసుకు వెళుతుంది ఆ కర్మ. అందువల్ల ప్రమాదంలేని జీవితమంటూ లేదు. సాహసం చేయాలి, అదే సమయంలో ఎలా జరిగినా తట్టుకునే సమతుల్యత ఉండాలి. ఎలా?

**సంగం త్యక్త్వా** – బాహ్యవిజయంనుంచి ఆంతర విజయం వైపు దృష్టి మరల్చటం ద్వారా. సంగం అంటే బంధకత్వం. బంధకత్వం దేనిమీదా? ప్రాపంచిక విజయాలమీద బంధకత్వం. మరి ఆధ్యాత్మిక ఎదుగుదల మీద బంధం పెంచుకోవచ్చా? నిక్షేపంగా పెంచుకోవచ్చు అంటున్నది శాస్త్రం. దేనితో బంధమైనా సమస్యలను సృష్టించవచ్చు కాని, బంధాలకు అతీతమైన దానితో బంధం పెంచుకుంటే ఏ సమస్యా ఉండదు. ఆధ్యాత్మిక చింతనమీద బంధం, భగవంతునిమీద బంధం, శాస్త్రంమీద బంధం పెంచుకోండి. అవి ఏమీ ప్రతికూల ఫలితాలనివ్వవు. నిజానికి వాటికి దూరంగా జరిగితేనే సమస్య.

**సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా** – జయాపజయాలమీద సరైన దృక్పథం పెంచుకుని, సమభావం కలిగివుండు. సిద్ధి అంటే జయం; అసిద్ధి అంటే అపజయం. రెండింటినీ సమానంగా స్వీకరించు. కర్మయోగి అంటే సమభావం

కలిగినవాడు. **సమత్వం యోగ ఉచ్యతే.** కర్మయోగం అంటే ఒక ప్రత్యేకమైన కర్మ కాదు; ఒక ప్రత్యేకమైన మనస్థితి. అందువల్ల అర్జునా నువ్వు కర్మయోగిలా ఉండు.

47, 48 శ్లోకాలలో కృష్ణపరమాత్మ కర్మయోగాన్ని టూకీగా ప్రవేశపెట్టాడు. వీటిని బీజశ్లోకాలు అంటారు. కృష్ణపరమాత్మే ఈ కర్మయోగం అనే అంశాన్ని మూడవ అధ్యాయంలో వివరంగా చర్చిస్తాడు. అందువల్ల మూడవ అధ్యాయం మొత్తం 47, 48 శ్లోకాలమీద విశ్లేషణ అని చెప్పవచ్చు.

మూడవ అధ్యాయంలో కర్మయోగానికి రెండు భాగాలు ఉన్నాయనీ – అవి కర్మ అనీ, యోగం అనీ చూస్తాము. కర్మ అంటే సరియైన కర్మ చేయటం; సాంకేతికంగా చెప్పాలంటే సాత్త్వికకర్మ చేయటం. కాని కర్మయోగంలోని ఈ అంశం గురించి కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో చెప్పటం లేదు.

**యోగం –** కర్మయోగంలోని రెండవ పదం యోగం. యోగం అంటే కర్మపట్ల సరియైన దృక్పథం కలిగివుండటం. కర్తగా మనం ఒక పని చేస్తున్నప్పుడు దానిమీద మనకు ఇష్టం ఉండాలి. మనం చేసే ఉద్యోగం మనకు ఇష్టం లేదనుకోండి, ఆ పనిమీద రోజుకి ఎనిమిది గంటలు, వారానికి ఐదురోజులు, నెలకు నాలుగు వారాలు గడపాలి. అలా 25–30 సంవత్సరాలు అందులోనే మునిగితేలాలి. అన్ని సంవత్సరాలు ఒక పనిని ఇష్టం లేకుండా, విసుగ్గా భావించి చేస్తే, అది మన మనస్సును కృంగదీసి, తద్వారా శారీరక ఆరోగ్యాన్ని కూడా దెబ్బ తీస్తుంది. అందువల్ల కర్తగా మనం చేసే పనిమీద ఆరోగ్యకరమైన భావన పెంపొందించుకోవాలి అంటే మనం చేసే పనిని ప్రేమించటం నేర్చుకోవాలి. అప్పుడు ఆ పని విసుగనిపించదు. అలా కర్తగా మన దృక్పథం సరిగ్గా ఉండాలి.

మనం చేసే ప్రతి పనికీ ఫలం కూడా వస్తుంది. మన పనిని మన పై అధికారి గుర్తించి మెచ్చుకోవచ్చు; జీతం కూడా పెంచవచ్చు; లేదా మనను తిట్టటమే కాకుండా, పనిదొంగ అయిన మన జూనియర్‌కు ప్రమోషన్ ఇవ్వవచ్చు. అతనికెలా వచ్చిందనేది వేరే విషయం. భోక్తగా మనం చేసే పనికి ఫలితం మనం ఆశించింది రావచ్చు, ఆశించని ఎదురుదెబ్బ తగలవచ్చు. రెండింటినీ సమానంగా తీసుకోవాలి. అంటే భోక్తగా మనం సమత్వం పాటించాలి. ప్రతిక్షణమూ మనం కర్తగానో, భోక్తగానో ఉంటూనే ఉంటాము, అంటే ఏదైనా కర్మ చేస్తూనో, దానికి వచ్చే ఫలాన్ని అనుభవిస్తూనో ఉంటాము. కర్తా, భోక్తలుగా సమత్వం కలిగివుండటాన్నే యోగం అంటారు. సమత్వం యోగ ఉచ్యతే.

ఈ సమభావన లేకపోతే మనస్సు చాలా ఆందోళన చెందుతుంది. మనస్సును స్థిరపరుచుకోవటంకోసం అనేక సెమినార్లకు వేలకొద్దీ ఖర్చుపెట్టి వెళుతుంటారు చాలామంది. గీత చదివితే ఉచితంగా అద్భుతమైన మార్గం దొరుకుతుంది.

శ్లో. 49 **దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ ।**
**బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥**
దూరేణ, హి, అవరమ్, కర్మ, బుద్ధియోగాత్, ధనంజయ,
బుద్ధౌ, శరణమ్, అన్విచ్ఛ, కృపణాః, ఫలహేతవః ॥

| | | | |
|---|---|---|---|
| బుద్ధియోగాత్ | = సమత్వ బుద్ధియోగము కన్నా | అన్విచ్ఛ | = వెతుకుము (సమత్వ యోగమును ఆశ్రయింపుము) |
| కర్మ | = సకామకర్మ | హి | = ఎందుకంటే |
| దూరేణ, అవరమ్ | = మిక్కిలి తక్కువ స్థాయికి | ఫలహేతవః | = కర్మఫలాసక్తితో కర్మలను ఆచరించువారు |
| (అతః) | = చెందినది కావున | కృపణాః | = దురదృష్టవంతులు |
| ధనంజయ | = ఓ ధనంజయా! | | |
| బుద్ధౌ | = సమత్వబుద్ధియందే | | |
| శరణమ్ | = తరణోపాయమును | | |

**హే ధనంజయ! కర్మ బుద్ధి-యోగాత్ దూరేణ అవరం హి ।**
**బుద్ధౌ శరణమ్ అన్విచ్ఛ। ఫల-హేతవః కృపణాః ॥**

తా: ఓ ధనంజయా! సమత్వ బుద్ధియోగముకన్నా కోరికతో చేసే కర్మ నిశ్చయముగా చాలా తక్కువది. (కర్మయోగరూపమైన) బుద్ధియందు ఆశ్రయమును కోరుకొనుము. కర్మఫలాసక్తితో కర్మలను చేయువారు దురదృష్టవంతులు.

ఇక్కడ కృష్ణపరమాత్మ రెండురకాల వ్యక్తుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఎత్తి చూపుతున్నాడు. వారు కర్మఠులు, కర్మయోగులు. కర్మఠులు ప్రాపంచిక విజయాలకు మాత్రమే ప్రాముఖ్యతనిస్తే కర్మయోగి ఆంతరవిజయానికి ప్రాముఖ్యతనిస్తాడు. కర్మఠుడు విజయం పొందితే గాలిలో తేలిపోతాడు; ఓడిపోతే పాతాళంలోకి కృంగిపోతాడు. ఒక్కోసారి ఆశించని విజయం కలిగితే, దాన్ని తట్టుకోలేక గుండెపోటు వచ్చి మరణించినవారు లేకపోలేదు.

**కర్మ దూరేణ హ్యవరం** – సకామకర్మ చేసే కర్మఠుని కర్మ చాలా తక్కువస్థాయికి చెందినది. దేనికన్నా తక్కువ?

**బుద్ధియోగాత్** – కర్మయోగి చేసే కర్మయోగంకన్నా. ఇక్కడ బుద్ధియోగం అంటే కర్మయోగం. ఎందుకు కర్మయోగాన్ని బుద్ధియోగం అన్నాడు? ఇంతకుముందే చూసినట్టుగా కర్మయోగం అంటే చేసే కర్మకాదు; దాన్ని తీసుకునే మనస్థితి. వీరిద్దరి మధ్య ఉన్న వ్యత్యాసం కర్మలో లేదు, దృక్పథంలో ఉంది. అందువల్ల కర్మఠుడు ఏం చేయాలి?

**బుద్ధౌ శరణమన్విచ్ఛ** – అందువల్ల, ఓ అర్జునా, కర్మయోగాన్ని ఆశ్రయించు. బుద్ధౌ అన్నా కర్మయోగమే. అంటే సరైన దృక్పథాన్ని పెంచుకో! అలా కాకపోతే ఏమవుతుంది?

**ఫలహేతవః** – వారు ఫలాసక్తితో కర్మలు చేస్తారు. పూర్తిగా ప్రాపంచిక విజయాలకే ప్రాముఖ్యతనిస్తారు. అలాంటివారు ఎలా ఉంటారు?

**కృపణాః** – వారు చాలా దురదృష్టవంతులు. వారు అంతులేని విపరీతమైన ఆందోళన, భీకరమైన అలసట పొందుతారు. అందువల్ల అర్జునా, కర్మయోగం పాటించు.

శ్లో. 50 **బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే ।**
**తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥**
బుద్ధియుక్తః, జహాతి, ఇహ, ఉభే, సుకృతదుష్కృతే,
తస్మాత్, యోగాయ, యుజ్యస్వ, యోగః, కర్మసు, కౌశలమ్ ॥

| | | | |
|---|---|---|---|
| బుద్ధియుక్తః | = సమత్వబుద్ధిగల సాధకుడు | యోగాయ | = సమత్వబుద్ధియోగముకోసం |
| సుకృతదుష్కృతే | = పుణ్యపాపములను | యుజ్యస్వ | = (నీవు) ప్రయత్నింపుము (సాధన చేయుము) |
| ఉభే | = రెండింటిని | | |
| ఇహ | = ఈ లోకములో | యోగః | = సమత్వరూపయోగముకోసం |
| జహాతి | = త్యజించును | కర్మసు | = కర్మలందు |
| తస్మాత్ | = కావున | కౌశలమ్ | = నేర్పరితనమే యోగము |

**ఇహ బుద్ధియుక్తః ఉభే సుకృత–దుష్కృతే జహాతి।**
**తస్మాత్ యోగాయ యుజ్యస్వ। యోగః కర్మసు కౌశలమ్ ॥**

తా: ఈ లోకములో సమత్వబుద్ధితో కర్మలు చేయువాడు పుణ్యపాపములను రెండింటినుంచి విముక్తుడగును. కావున, సమత్వబుద్ధియోగముకోసం సాధన చేయుము. కర్మలందు నేర్పరితనమే యోగము.

50వ శ్లోకంనుంచి కర్మయోగఫలం గురించి చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. కర్మయోగంవల్ల కలిగే తక్షణ ప్రయోజనం మనశ్శాంతి కలుగుతుంది. ఆందోళన, ఒత్తిడి, తాకిడులు తగ్గుతాయి కాబట్టి కుటుంబంలో అనుబంధాలు కూడా మెరుగుపడతాయి. ఎందుకంటే ఒక రంగంలో ఒత్తిడి ఉంటే, దాని ప్రభావం ఇంకో రంగంమీద పడుతుంది. ఒకరిమీద చూపాల్సిన కోపం, ఇంకొకరిమీద చూపిస్తాము. కాని కర్మయోగికి కోపం తగ్గుతుంది. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఇది తక్షణ లాభం. కాని గీత తక్షణ లాభం ఇచ్చి ఊరుకోదు. అది శాశ్వతఫలాన్ని కూడా ఇస్తుంది. ఏమిటది? చిత్తశుద్ధిని కలుగజేస్తుంది.

**బుద్ధియుక్తః** – బుద్ధియుక్తః అంటే కర్మయోగి అంటే బుద్ధి సరిగ్గా ఉన్నవ్యక్తి అంటే సరియైన దృక్పథం ఉన్న వ్యక్తి. జీవితంలో దేనికి ప్రాముఖ్యతనివ్వాలో తెలిసిన వ్యక్తి. అటువంటి వ్యక్తికి ఏమవుతుంది?

అతను చివరకి జ్ఞానయోగి అవుతాడు. కర్మయోగం జ్ఞానయోగానికి దారితీస్తుంది. ఎలా? కర్మయోగి ఎప్పుడో ఒకప్పుడు శాశ్వతమైన ఆనందంకోసం ఆరాటపడతాడు. జీవితంలో ఎదురవుతున్న అనుభవాలను బేరీజు వేసుకుని తను అశాశ్వతమైన వస్తువులనుంచి శాశ్వతమైన ఆనందాన్ని కోరుతున్నానని గ్రహిస్తాడు. క్రీడారంగంలో పదిసార్లు బంగారు కప్పును గెలిచినా, పదకొండవసారి గెలుస్తాడనే ఆశలేదు. క్రికెట్ మ్యాచ్‌లో రెండుసార్లు సెంచరీ కొట్టినా, మూడోసారి కొట్టలేకపోతే కృంగిపోతాడు. ఇటువంటివి గమనించి **తను అశాశ్వతమైన వస్తువులనుంచి శాశ్వతమైన ఆనందం కోరుకుంటున్నానని** తన తప్పును గ్రహిస్తాడు. తను వెతుకుతున్న చోటు తప్పని తెలుసుకుని శాశ్వతమైన దాన్ని వెతుక్కుంటూ వస్తాడు.

ఏదో ఒకరోజు ప్రతి కర్మయోగి జ్ఞానయోగానికి వచ్చి తీరతాడు. ఎందుకంటే అతను చిత్తశుద్ధిని పొందుతాడు. ఎప్పుడైతే చిత్తశుద్ధి పొందుతాడో, అప్పుడే ఆత్మజ్ఞానంమీద శ్రద్ధ పెరుగుతుంది. అంతకుముందు ఆత్మజ్ఞానమా అనే వ్యక్తి దానిమీద ఆసక్తి చూపుతాడు.

**యదా హి నేంద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే ।**
**సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢస్తదోచ్యతే ॥** – 6.4

జ్ఞానయోగంమీద శ్రద్ధ కలిగిన వ్యక్తిని కృష్ణపరమాత్మ యోగారూఢః అంటున్నాడు. ఎప్పుడైతే ఆత్మజ్ఞానంమీద అతనికి ఆసక్తి కలుగుతుందో అప్పుడు అతనికి ఎక్కడికి వెళ్ళినా, ఏంచేసినా దానికి సంబంధించినదే కనిపిస్తుంది. అంతకుముందు లౌకికవిషయాలు అతని దృష్టిని ఆకర్షిస్తే ఇప్పుడు ఆత్మకు సంబంధించిన పుస్తకాలు, ప్రసంగాలు ఆకర్షిస్తాయి. త్వరలోనే సరియైన గురువు వద్దకు వెళతాడు.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**

అలాంటి గురువు దగ్గరకు వెళితే కర్మయోగంనుంచి జ్ఞానయోగానికి; ధర్మంనుంచి వేదాంతానికి; వేదపూర్వభాగంనుంచి వేద అంతభాగానికి; కర్మకాండనుంచి జ్ఞానకాండకు వస్తాడు.

**సుకృతదుష్కృతే జహాతి** – జ్ఞానయోగానికి వచ్చి తన స్వస్వరూపాన్ని తెలుసుకుంటే, కర్మఫలాలకు అతీతంగా ఎదుగుతాడు. అతని ఆత్మస్వరూపమేమిటో ఈ అధ్యాయంలోనే 12–25 వరకూ వివరంగా చూశాము. జ్ఞాని తన ఉన్నతస్థాయికి ఎప్పుడైతే ఎదుగుతాడో అప్పుడే అతను పుణ్యపాపాలకు అతీతంగా ఎదుగుతాడు. పుణ్యపాపాలను రెండింటినీ ఈ లోకంలోనే త్యజిస్తాడు. ఎలా? జ్ఞానయోగఫలంవల్ల. జ్ఞానయోగం ఎలా వచ్చింది? కర్మయోగంవల్ల వచ్చింది. అంటే దశలు ఇవి –

కర్మయోగం → జ్ఞానయోగం → జ్ఞానం → సుకృతదుష్కృత త్యాగం

పుణ్యపాపాలకు అతీతంగా ఎదిగితే, అది మోక్షం. కేవలకర్మలో ఉండిపోతే ఎదగలేదు; ఊబిలో చిక్కుకు పోయిన వ్యక్తి అందులోనే తిరుగుతున్నట్టుగా, కర్మ అనే ఊబిలో చిక్కుకుపోయిన వ్యక్తి అందులోనే తిరుగుతుంటాడు. కాని కర్మయోగి ఎప్పుడో అప్పుడు మేలుకుంటాడు. నేనెందుకు పరుగు పందెంలో పాల్గొంటున్నాను, దేనికోసం నా పరుగు అనుకుంటాడు.

**తస్మాద్యోగాయ యుజ్యస్వ** – కాని ఆ జ్ఞానానికి రావాలంటే, ఇప్పుడు నువ్వు కర్మ చేయాలి అర్జునా. ఇప్పుడే అంతా త్యజిస్తాను అనకూడదు. ఎలాగూ కాలేజీనుంచి బయటకు రావాలి కదా, కాలేజీలో జేరటం ఎందుకు అన్నట్టుంటుంది. అది సరైన వాదన కాదు. కాలేజీలో చేరాలి, చదవాలి, బయటకు రావాలి. జీవితం పొడుగూతా ఇదే సూత్రం వర్తిస్తుంది – కర్మ చేయి, కర్మనుంచి బయటకు రా. యోగాయ యుజ్యస్వ. కర్మయోగం చేయి.

**యోగః కర్మసు కౌశలమ్** – కర్మయోగం అంటే కర్మాచరణములో నేర్పరితనం చూపటం.

ఇప్పటివరకూ కర్మయోగానికి రెండు నిర్వచనాలు ఇచ్చాడు కృష్ణపరమాత్మ.

1. సమత్వం యోగ ఉచ్యతే 2. కర్మసు కౌశలం యోగః

కౌశలం అంటే ఏమిటి? ఒక కర్మ చేయటంలో సామర్థ్యం చూపటం కాదు. ఏదైనా పని పదేపదే చేస్తే అందులో సామర్థ్యం పెరుగుతుంది. అదికాదు కౌశలం అంటే.

సరియైన దృక్పథం లేకపోతే, కర్మ మరింత ఒత్తిడిని, ఆందోళనను తీసుకురాగలదు. అవి మరింతగా సంసారంలో కూరుకుపోయేలా చేస్తాయి. కర్మయోగి అదే కర్మను మోక్షం పొందటానికి వినియోగిస్తాడు. తనను బంధించివేసే కర్మను, తనకు మోక్షం కలిగించే కర్మగా మలచుకుంటాడు. ఈ మార్పు, కర్మను మార్చటంవల్ల రాదు, కర్మమీద తన దృక్పథం మార్చటంవల్ల వస్తుంది.

పాము విషం మామూలుగా మనిషి ప్రాణం తీస్తుంది. కాని అదే పాము విషాన్ని మందుగా మారిస్తే, మనిషి ప్రాణాన్ని నిలబెడుతుంది. కర్మ కూడా అంతే. దాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోతే, మనిషి అవస్థ పడవచ్చు, సరిగ్గా అర్థం చేసుకుని కర్మను యోగంగా మలచుకుంటే చిత్తశుద్ధిని కలుగజేసి, తద్వారా జ్ఞాన ఇచ్ఛను కలుగజేసి, తద్వారా మోక్షాన్ని కలుగజేస్తుంది. అందువల్ల కౌశలం అంటే తనను బంధించే కర్మను తనకు స్వేచ్ఛను కలిగించే కర్మగా మార్చుకోవటం. అంతా దృక్పథంలో ఉంది. దృక్పథం మార్చుకుంటే, కర్మయోగి కుశలత ఉన్నవ్యక్తి అవుతాడు.

శ్లో. 51 **కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।**
**జన్మబంధవినిర్ముక్తాః పదం గచ్ఛంత్యనామయమ్ ॥**
కర్మజమ్, బుద్ధియుక్తాః, హి, ఫలమ్, త్యక్త్వా, మనీషిణః,
జన్మబంధవినిర్ముక్తాః, పదమ్, గచ్ఛంతి, అనామయమ్ ॥

| | |
|---|---|
| హి | = ఎందుకంటే |
| బుద్ధియుక్తాః | = సమత్వబుద్ధి గలవారైన |
| మనీషిణః | = జ్ఞానులు |
| కర్మజమ్ | = కర్మలవల్ల ఉత్పన్నమగు |
| ఫలమ్ | = ఫలమును |
| త్యక్త్వా | = విడిచిపెట్టి |
| జన్మబంధ | = జన్మరూప బంధములనుంచి |
| వినిర్ముక్తాః | ముక్తులై |
| అనామయమ్ | = వికారరహితమైన |
| పదమ్ | = మోక్షపదమును |
| గచ్ఛంతి | = పొందుతారు |

**హి బుద్ధి-యుక్తాః మనీషిణః కర్మజం ఫలం త్యక్త్వా ।**
**జన్మ-బంధ-వినిర్ముక్తాః అనామయం పదం గచ్ఛంతి॥**

తా: ఎందుకంటే, సమత్వబుద్ధి గలవారైన జ్ఞానులు కర్మలవల్ల పుట్టే ఫలమును విడిచిపెట్టి, జన్మరూప బంధములనుంచి ముక్తులై, వికారరహితమైన మోక్షపదమును పొందుతారు.

**కర్మయోగం ద్వారా మోక్షం పొందటానికి ఒక వ్యక్తి దాటాల్సిన దశలు –**

**ఎ). బుద్ధియుక్తాః** – ఇక్కడ బుద్ధి అంటే సరియైన భావన. జీవితంమీద, జీవితంలో ఎదురయ్యే అనేక అనుభవాలమీద సరియైన భావన ఉండాలి. ఈ భావన విచక్షణాశక్తివల్ల వస్తుంది. బాహ్యమైన ఎదుగుదలకన్నా, ఆంతర ఎదుగుదల ముఖ్యం అని గ్రహించగలిగే విచక్షణాశక్తి. జీవితంలో అడుగుపెట్టిన తొలి రోజుల్లో అర్థకామాలకు ఎక్కువ విలువనిస్తాము; కాని మనస్సు పరిణతి చెందాక, వివేకం పొందాక, అర్థకామాలను పూర్తిగా తీసివేయము కాని, ధర్మమోక్షాలు వీటికన్నా ముఖ్యమని గ్రహిస్తాము. శాస్త్రం అర్థకామాలు వద్దని చెప్పదు. అర్థకామాలు విషయసుఖాన్నిస్తే, ధర్మమోక్షాలు ఆత్మసుఖాన్నిస్తాయి .

నవరాత్రుల్లో మనం మూడు రోజులు దుర్గాదేవినీ, తరువాత మూడు రోజులు లక్ష్మీదేవినీ, మిగతా మూడు రోజులూ సరస్వతీదేవినీ కొలుస్తాము. ఎందుకు? మన వైదిక సంప్రదాయం ముగ్గురికి సమానంగా ప్రాముఖ్యతను ఇచ్చింది. దుర్గాదేవి శక్తికి సంకేతం. ఆరోగ్యం, శక్తి రెండూ కావాలి. వేదాంతం ఎన్నడూ శరీరాన్ని పట్టించు కోవద్దు అని చెప్పదు. అనారోగ్యం వస్తే, దానికి వైద్యం చేయించుకోవాలి. లక్ష్మీదేవి సంపదల తల్లి. అంటే డబ్బు కూడా ముఖ్యమే అంటున్నది వేదాంతం. డబ్బును లక్ష్మీదేవిగా చూస్తాము. విష్ణుమూర్తి కూడా తన హృదయంలో పెట్టుకున్నాడు. సరస్వతి చదువుల తల్లి. లౌకికజ్ఞానం, ఆధ్యాత్మిక జ్ఞానానికి కూడా దేవత.

ఈ ముగ్గురు దేవతలను కొలవమనటంలోని ఉద్దేశ్యం బాహ్య ఎదుగుదలతో పాటు, ఆంతర ఎదుగుదలకు కూడా ప్రాముఖ్యతనివ్వటానికి. అందువల్ల కర్మయోగి అర్థకామాలకు కూడా ప్రాముఖ్యతనిస్తాడు కాని వాటిలోనే మునిగిపోడు. అవి అశాశ్వత ఫలాలనిస్తాయనీ, ధర్మమోక్షాలు శాశ్వత ఫలాలనిస్తాయనీ తెలుసుకుంటాడు. ఈ నిత్యానిత్యవస్తువివేకంవల్ల అతనికి జీవితమంటే సరైన అవగాహన ఉంటుంది. దీన్ని బుద్ధియుక్తాః అంటారు.

**బి). కర్మజం ఫలం త్యక్త్వా** – కర్మజం ఫలం అంటే కర్మయొక్క లౌకికఫలాలు. త్యక్త్వా అంటే త్యజిస్తాడు. త్యజిస్తాడు అంటే వాటి గురించి అతిగా ఆలోచించడు. ఒకవేళ వాటివల్ల ఫలం వచ్చినా, దాన్ని **అవాంతర ఫలం**గా భావిస్తాడు. అంటే ప్రాథమిక ఫలం కాదు. అతనికి ప్రాథమిక ఫలం ఆంతర విజయం. డబ్బు ఈరోజు వస్తుంది, రేపు పోతుంది; మనుష్యులు ఈరోజు మెచ్చుకుంటారు, రేపు తిడతారు. ఏదైనా అతను పట్టించుకోకుండా, ఆంతర విజయానికే ప్రాముఖ్యతనిస్తాడు.

**సి). మనీషిణః (భూత్వా )**– ఈ పై రెండు దశలూ, అంతిమ లక్ష్యాన్ని పొందటానికి సరిపోవు. చివరికి ఎవరైనా జ్ఞానయోగానికి వచ్చి తీరాలి. మనిషిగా పుట్టినందుకు మనిషి లక్ష్యం ఏమిటి? అందరూ ఈ ప్రశ్న అడుగుతారు. కాని ఎప్పుడు? పుట్టిన 75 సంవత్సరాలకో, ఇంకా మాట్లాడితే 99 సంవత్సరాలకో!

మనిషిగా మన లక్ష్యం ఏమిటి? అది తెలుసుకోవాలంటే, ప్రకృతిని చూడండి. ఏ చెట్టును చూసినా, ఏ జంతువును చూసినా తెలుస్తుంది. అవి ఏం చేస్తాయి? ఎదుగుతాయి. ఒక చెట్టు విత్తనంనుంచి వచ్చి, చిన్న మొలకలా మొలిచి, అలాఅలా పెరుగుతూ, పెద్ద వృక్షం అవుతుంది. ఆ ఎదిగే సమయంలో మనకు ఆకులు, పువ్వులు, పండ్లు, నీడనూ ఇస్తుంది. చివరికి ఎండిపోయి, రాలిపోతుంది. అలాగే జంతువులు కూడా వాటి

ఆయుష్షు ఉన్నంతవరకూ ఎదిగి, ఆయుష్షు తీరగానే మరణిస్తాయి. అందువల్ల మనం కూడా ఆయుష్షు ఉన్నంత వరకూ ఎదగాలి.

కాని జంతువులకూ, మనకూ మధ్య చిన్న భేదం ఉంది. జంతవులూ, చెట్లూ కేవలం శారీరపరంగా అంటే బాహ్యంగా ఎదుగుతాయి. కాని మనిషి బుద్ధిజీవి. మనిషి బుద్ధిపరంగా ఎదగాలి. శారీరకంగా తేలికగా ఎదుగుతాడు మనిషి. కాని దానికి తగ్గట్టుగా మనస్సు పరంగా, భావపరంగా కూడా ఎదగాలి. దీన్ని విశ్వజనీన ప్రేమ అంటారు. వసుధైక కుటుంబం అనే భావన రావాలి. నేనెవరు? ఈ జగత్తు ఏమిటి? ఈశ్వరుడు ఎవరు? ఈ మూడు ప్రాథమిక ప్రశ్నలు ప్రతి ఒక్కరిలో కలుగుతాయి. వాటికి జవాబు తెలియకుండా బుద్ధిపరంగా ఎదగలేము. బుద్ధిపరంగా ఎదగటమంటే ఆధ్యాత్మికంగా ఎదగటం. మనీషిణః భూత్వా అంటే అర్థం అది. మనీషి అంటే జ్ఞాని. మనీష అంటే ఆత్మజ్ఞానం. శంకరులవారు మనీషా పంచకం రచించారు. ఆత్మజ్ఞానంమీద ఐదు శ్లోకాలు.

**డి). జన్మబంధవినిర్ముక్తాః** – ఈ జ్ఞానంవల్ల సంసారబంధంనుంచి విముక్తి పొందుతాడు. సంసారాన్ని అనేక సందర్భాలలో అనేక రకాలుగా వర్ణిస్తారు. గీత మొదటి అధ్యాయంలో బంధాన్ని మూడు పదాలతో వర్ణించాడు. అవి రాగం, శోకం, మోహం. రాగం అంటే బంధం; శోకం అంటే దుఃఖం; మోహం అంటే భ్రాంతి. వీటిని సంసారబంధం అనవచ్చు. లేదా వేదాంతపరంగా చెపితే జన్మ మరణం.

**పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం.** ఈ కర్మయోగి జ్ఞానయోగి అయ్యి, జ్ఞాని అయ్యి, ముక్తి పొందుతాడు. ఎన్నాళ్ళు ముక్తిని అనుభవిస్తాడు అంటే జీవించి ఉన్నన్నాళ్ళు! అటువంటి జీవితం ఎంత ఆనందంగా ఉంటుంది! ఈ జగత్తులోనే తన జీవితం కొనసాగిస్తాడు. ఈ జగత్తు ఏమీ మారిపోదు, కాని అతని జీవితంలో ఏమి జరిగినా చలించడు. రాబోయే శ్లోకాల్లో కృష్ణపరమాత్మే అటువంటి జ్ఞాని పరిస్థితి ఎలా ఉంటుందో వర్ణించబోతున్నాడు. అటువంటి జ్ఞానిని స్థితప్రజ్ఞుడంటారు. అతనికి కలిగే ఆంతర స్వేచ్ఛనే, జీవించి ఉండగానే పొందే శాంతి, ఆనందాలనే జీవన్ముక్తి అంటారు. అతని మనస్సు కూడా తేలికగా అవుతుంది.

అశాంతిగా ఉన్న మనస్సు భారంగా ఉంటుంది. జీవితంలో దేన్నైనా ఎదుర్కొనగలం, ఒక్కదాన్ని తప్ప. ఏమిటది? మన మనోభారాన్ని. మనం ఉన్న ఊరు భారంగా అనిపిస్తే ఆ ఊరునుంచి ఎటైనా వెళ్ళిపోవచ్చు. మనుష్యులు నచ్చకపోతే వారినుంచి పారిపోవచ్చు. కాని మనస్సే సమస్య అయితే ఎక్కడికి వెళతాము? మానస సరోవరం వెళ్ళినా మన మనస్సు మనను శాంతిగా ఉండనివ్వదు. అందువల్ల మన పెద్ద శత్రువు మన మనస్సే, కాని ఆ మనస్సు మనకు భగవంతుడిచ్చిన వరం. దాన్ని తేలికపరిస్తే, ఇక్కడే, ఇప్పుడే ఆనందాన్ని, ప్రేమను, విశ్రాంతిని, దయను అనుభవించగలము. దీన్నే జీవన్ముక్తి అంటారు.

**ఇ). అనామయం పదం గచ్ఛంతి** – ఎప్పుడైతే ప్రారబ్ధకర్మ ముగిసి, ఈ జీవితం చాలిస్తాడో అప్పుడు జ్ఞాని ఈశ్వర ఐక్యం పొందుతాడు. ఇక్కడ పదం అంటే ఈశ్వరుడు. ఈశ్వర ఐక్యం అంటే అతనికి ఇంక పునర్జన్మ ఉండదు. దానిని విదేహముక్తి అంటారు.

ఈ శ్లోకం ఒక పరిపూర్ణ శ్లోకం. కర్మయోగంతో మొదలుపెట్టి, జ్ఞానయోగానికి వచ్చి, జ్ఞానయోగ ఫలమైన జీవన్ముక్తి, విదేహముక్తుల గురించి చెబుతుంది. వీటి వివరాలు కృష్ణపరమాత్మే తర్వాత ఇస్తాడు. రెండవ అధ్యాయం మొత్తం, భగవద్గీతయొక్క సారాంశం అని మర్చిపోకూడదు. అందువల్ల రెండవ అధ్యాయంలో చెప్పిన ప్రతి ఒక్క అంశాన్నీ, కృష్ణపరమాత్మే మూడునుంచి పదిహేడవ అధ్యాయంవరకూ వివరిస్తాడు. 18వ అధ్యాయంలో దాని సారాంశం మళ్ళీ చెబుతాడు.

శ్లో. 52 **యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।**
**తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥**
యదా, తే, మోహకలిలమ్, బుద్ధిః, వ్యతితరిష్యతి,
తదా, గంతాసి, నిర్వేదమ్, శ్రోతవ్యస్య, శ్రుతస్య, చ ॥

| | | | |
|---|---|---|---|
| యదా | = ఎప్పుడైతే | శ్రుతస్య | = వినియున్న |
| తే బుద్ధిః | = నీ బుద్ధి | చ | = ఇంకా |
| మోహకలిలమ్ | = మోహమనెడి ఊబిని (అవివేకము అనే ఊబినుంచి) | శ్రోతవ్యస్య | = వినవలసిన (కర్మ ఫలములందు) |
| వ్యతితరిష్యతి | = పూర్తిగా బయటపడునో | నిర్వేదమ్ | = వైరాగ్యమును |
| తదా | = అప్పుడే | గంతాసి | = పొందెదవు |

**యదా తే బుద్ధిః మోహ-కలిలం వ్యతితరిష్యతి ।**
**తదా శ్రోతవ్యస్య శ్రుతస్య చ నిర్వేదం గంతాసి॥**

తా: ఎప్పుడైతే నీ బుద్ధి అవివేకమనే కాలుష్యమును దాటివేయునో, అప్పుడు వినవలసియున్న ఇంకా వినియున్న కర్మఫలములందు వైరాగ్యమును పొందగలవు.

52, 53 శ్లోకాలు 51వ శ్లోకానికి వివరణలు. కర్మయోగం జ్ఞానయోగానికి ఎలా తీసుకువెళుతుందో 52లో చెపితే, జ్ఞానయోగం మోక్షాన్ని ఎలా ఇస్తుందో 53వ శ్లోకం చెబుతుంది. అంటే రెండు భాగాలుగా వివరిస్తున్నది. కర్మయోగం ఏం చేస్తుంది?

**బుద్ధిః మోహకలిలం వ్యతితరిష్యతి** – బుద్ధి తన అయోమయంనుంచి బయట పడుతుంది. బుద్ధికి విచక్షణ, స్పష్టత ఏర్పడుతుంది. అంతకుముందు మోక్షం అంటే ఏదో సన్న్యాసులు మాత్రమే పొందేది అనుకుంటారు. ఇప్పుడు జీవితంలో అర్థకామాలకు ప్రాముఖ్యతనివ్వాలో, మోక్షానికి ప్రాముఖ్యతనివ్వాలో తెలుసుకుంటారు. మోక్షం అంటే ఎక్కడికో వెళ్ళిపోయి, కాషాయవస్త్రాలు ధరించాలి అనుకుంటారు ముందు. కాని ఇప్పుడు మోక్షం అంటే మానసిక పరిపక్వత అని తెలుసుకుంటారు. అవివేకం మోహంలోకి దారితీస్తుంది. ఈ అవివేకాన్నే కలిలం అంటారు. కలిలం అంటే అశుద్ధం. జీవితం గురించి, జీవితంలోని ముఖ్యమైన విషయాల గురించిన అవివేకం దాటి కర్మయోగి అవుతాడు. అప్పుడేమవుతుంది?

**తదా గంతాసి నిర్వేదమ్‌**– ఎప్పుడైతే ఈ మోహం పోతుందో, ఎప్పుడైతే నిత్యానిత్యవస్తువివేకం ఏర్పడుతుందో, అప్పుడే వైరాగ్యం వస్తుంది. నిర్వేదం అంటే వైరాగ్యం. వివేకంయొక్క సహజ పరిణామం వైరాగ్యం. దేనిమీద వైరాగ్యం?

**శ్రోతవ్యస్య శ్రుతస్య చ** – శ్రోతవ్యస్య అంటే కర్మకాండ భాగంలో విన్న అంశాలమీద. కర్మకాండ బాహ్యంగా బోలెడు భద్రత దొరుకుతుందని హామీ ఇస్తుంది. మంచి ఇల్లు, మంచి ఉద్యోగం, మంచి పిల్లలు, మరణించాక స్వర్గలోకం – అన్నీ దొరుకుతాయంటుంది. కాని కర్మయోగికి పరిపక్వత వచ్చాక, దేనిమీద ఆధారపడినా, అది శాశ్వతం కాదని తెలుస్తుంది. అది పోకముందే పోతుందేమోనని భయం కలుగుతుంది. పూర్వం టెలిగ్రాములు ఉండేవి. టెలిగ్రామ్ వచ్చిందంటే ఎవరైనా పోయారేమోనని భయం. ఎందుకు? బాహ్యవస్తువులు, మనుష్యులు, సంఘటనలు, ప్రదేశాలు అశాశ్వతాలు. అందువల్ల బాహ్యంగా దేనిమీదనన్నా ఆధారపడితే **భయం** వేస్తుంది.

బాహ్యంగా ఆధారపడటం మానేసి, మనమీదే ఆధారపడటం నేర్చుకోవాలి. అలా నామీద ఆధారపడలేను అంటే కనీసం భగవంతునిమీద ఆధారపడటం నేర్చుకోవాలి. అలా మన ప్రయాణం జగత్తుమీద ఆధారపడటంనుంచి భగవంతునిమీద ఆధారపడటం వరకు; భగవంతునిమీద ఆధారపడటంనుంచి మనమీదే ఆధారపడటం వరకూ సాగాలి. శారీరకంగా జగత్తుమీద ఆధారపడక తప్పదు. దాన్ని తప్పించుకోలేము; కాని మానసికంగా ఆధారపడితే ప్రమాదం. అందువల్ల కర్మయోగికి నిర్వేదం వస్తుంది.

వైరాగ్యం అంటే సరిగ్గా అర్థం చేసుకోవాలి. వైరాగ్యం వస్తుంది అంటే మనం జగత్తును ద్వేషించము. జగత్తును ప్రేమిస్తూనే ఉంటాము, తోటివారికి సహాయం చేస్తూనే ఉంటాము; కాకపోతే మనం ఎవరినుంచీ సహాయం కోరము. అందువల్ల నిర్వేదం అంటే ద్వేషం కాదు. నిర్వేదం అంటే స్వేచ్ఛగా ఉండటం నేర్చుకోవటం. శ్రోతవ్యస్య శ్రుతస్య చ అంటే తనకు తెలిసిన, తెలియని బాహ్యవస్తువులు. వాటిమీద వైరాగ్యం పెంచుకుని, వాటిమీద ఆధారపడటం మానేస్తాడు కర్మయోగి. మతపరమైన జీవనం గడిపితే, ఇదీ లాభం. ఇది మొదటిదశ. రెండవ దశ ఏమిటి?

శ్లో. 53 **శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।**
**సమాధావచలా బుద్ధిస్తదా యోగమవాప్స్యసి ॥**
శ్రుతివిప్రతిపన్నా, తే, యదా, స్థాస్యతి, నిశ్చలా,
సమాధౌ, అచలా, బుద్ధిః, తదా, యోగమ్, అవాప్స్యసి ॥

| | | | |
|---|---|---|---|
| శ్రుతివిప్రతిపన్నా | = శ్రుతుల నానావిధ వచనములను వినుటవల్ల | నిశ్చలా | = నిశ్చలముగా |
| తే | = నీయొక్క | అచలా | = స్థిరముగా |
| బుద్ధిః | = బుద్ధి | స్థాస్యతి | = నిలుచునో |
| యదా | = ఎప్పుడయితే | తదా | = అప్పుడే |
| సమాధౌ | = పరమాత్మయందు | యోగమ్ | = యోగమును (మోక్షమును) |
| | | అవాప్స్యసి | = (నీవు) పొందగలవు |

**యదా శ్రుతి-విప్రతిపన్నా తే బుద్ధిః నిశ్చలా(భూత్వా) ।**
**సమాధౌ అచలా స్థాస్యతి, తదా యోగమ్ అవాప్స్యసి ॥**

తా: శ్రుతులచే అనేక వచనములను వినడంవల్ల పరిపరివిధాలు పోతున్న నీ బుద్ధి ఎప్పుడైతే విక్షేపము లేకుండా, వికల్పములు లేకుండా ఆత్మయందు స్థిరమై నిలుచునో, అప్పుడు మోక్షము పొందగలవు.

ఎప్పుడైతే ఒక వ్యక్తి స్వేచ్ఛ కోరుకుంటాడో, శాస్త్రం అతనికి చెబుతుంది, 'నిజం చెప్పాలంటే నువ్వు బాహ్యప్రపంచంమీద దేనికీ ఆధారపడనవసరం లేదు. నీలోనే అంతులేని భద్రత ఉంది, పరిపూర్ణత ఉంది, ఆనందం ఉంది.' నీటి కొరత ఉండి, మనం నీటికోసం అల్లాడిపోతుంటే, ఎవరో వచ్చి, ఎందుకింత కష్టపడతారు, మీ స్థలంలోనే నీరు ఉంది, ఫలానా చోట తవ్వండి అంటే ఎంత ఆనందం వేస్తుంది? అలా మన స్థలంలోనే నీరు పడితే, మనకు నీటి సమస్య తీరటమే కాక, తక్కినవారికి కూడా నీటి సమస్యను తీర్చగలుగుతాము.

అలాగే ఎవరైనా వచ్చి నువ్వు ఆనందంకోసం ఎక్కడో ఎందుకు వెతుకుతావు, నువ్వే ఆనందానికి నెలవు, నువ్వే ప్రేమమూర్తివి అని చెపితే, మనం గుప్పెడు ప్రేమకోసం నలుగురినీ బ్రతిమాలుకోనవసరం లేదు. నాకు కాస్త ప్రేమను పంచు, నాకు భద్రతనివ్వు, నాకు ఆనందాన్నివ్వు, నాకు శాంతినివ్వు అని భిక్షాపాత్ర పుచ్చుకుని వేడుకోనవసరం లేదు. దానికి బదులుగా మనమే ఎదురు చెప్పవచ్చు – 'నువ్వు నన్ను ప్రేమిస్తావో లేదో అది నీ సమస్య; నాలో కరిగిపోని ప్రేమతత్త్వం ఉంది. దానివల్ల నీలో లోపాలున్నా కూడా, నేను నిన్ను భేషరతుగా ప్రేమిస్తున్నాను.'

**శ్రుతివిప్రతిపన్నా** – అందువల్ల ఎప్పుడైతే నాలోనే పూర్ణత్వం, అభయత్వం, ఆనందం ఉన్నాయని తెలుసుకుంటానో అప్పుడే ఒక పెద్ద మార్పు కలుగుతుంది. మూడురోజులుగా జలుబుతో బాధపడుతుంటే, ఎలా ఉన్నావు అని అడిగే నాథుడే లేడు అని వాపోయే పరిస్థితి పోతుంది. శ్రుతి చెప్పిన అనేక వాక్యాలు వినటంవల్ల, వేదాల్లోని కర్మకాండలోని వాక్యాలు వినటంవల్ల బాహ్యంగా ఆనందం వెతుక్కునే వ్యక్తి, కర్మకాండనుంచి జ్ఞానకాండకు వస్తే, ఆనందం బాహ్యవస్తువుల్లో లేదు, తనలోనే ఉందని తెలుసుకుంటాడు.

**యదా సమాధౌ స్థాస్యతి** – ఇక్కడ సమాధి అంటే ఆత్మ. ఎటువంటి ఆత్మ? పూర్ణ ఆత్మ; ప్రేమస్వరూపమైన ఆత్మ.

ఒకవేళ మీరు ఒకరోజు ఏదో గొప్ప విజయం సాధించారనుకోండి! ఆ రోజు మీ హృదయం పూర్తిగా ఆనందంతో నిండిపోయివుంటుంది. ఆ క్షణంలో ఎవరిమీదా కోపం రాదు సరిగదా, వారు తప్పు చేసినా క్షమించే మంచిగుణం కలుగుతుంది. రోజూ ఆటోవాడితో ఐదురూపాయలకోసం గొంతు చించుకుని పోట్లాడే మీరు, ఆరోజు అతను అడక్కుండానే పదిరూపాయలు ఎక్కువ ఇస్తారు. ఆరోజు త్యాగబుద్ధి, క్షమాగుణం, దయాగుణం కలుగుతాయి. అహం పూర్ణః, నేను పూర్ణుణ్ణి అనిపిస్తుంది ఆరోజు. కాని ఇదంతా ఎంతసేపు? ఆ ఒక్కరోజు మాత్రమే. తాత్కాలిక పూర్ణత్వం అది.

అదే ఆత్మయొక్క పూర్ణత్వాన్ని, జ్ఞానం ద్వారా అర్థం చేసుకుంటే, ఆ ఆనందం శాశ్వతంగా ఉంటుంది. ఈ పూర్ణత్వభావన కొత్తదేమీ కాదు. మీరు ఏదో ఒక సందర్భంలో అనుభవించే ఉంటారు. కోరుకున్న ఉద్యోగం దొరికినప్పుడో; మంచిభార్య దొరికినప్పుడో, సుపుత్రుడు కలిగినప్పుడో పూర్ణత్వం పొంగిపొరలి, తెలియకుండానే క్షమాగుణం, జాలి కలుగుతాయి. అటువంటి పూర్ణత్వం ఎప్పుడూ ఉంటుంది. అందువల్ల సమాధౌ స్థాస్యతి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**పూర్ణే అభయే అదృశ్యే అనాత్మే అనిరుద్ధే అనిలయే**
**అభయం ప్రతిష్ఠాం విందతే**

ఆత్మజ్ఞానం కలగాలంటే రెండు ఆటంకాలు తొలగాలి. వీటిని తరువాత వివరంగా చూస్తాము కాని ఇక్కడ అవేమిటో చూద్దాము. వాటిని సంశయం, విపర్యయం అంటారు. సంశయం అంటే నేనేమిటీ, పూర్ణుడను అవటం ఏమిటీ అనే సంశయం. విపర్యయం అంటే వాసనలు. అంటే మనలో సంవత్సరాల తరబడీ కూరుకు పోయిన వాసనలు. నాకు ఆనందం బాహ్యవస్తువుల్లోనే దొరుకుతుంది అనుకోవటం.

సిగరెట్టుకు బానిస అయిన వ్యక్తి, అసలు సిగరెట్టు కాల్చకుండా ఉండలేని జీవితాన్ని ఊహించుకోలేడు. లక్షలాది ప్రజలు సిగరెట్టు కాల్చకుండా హాయిగా జీవిస్తున్నారు. అసలు సిగరెట్టనేది ఒకటి ఉందని కూడా కొంతమందికి తెలియదు. ఎవరిదాకానో ఎందుకు, అతనే సిగరెట్టు జోలికి రాకముందు, హాయిగానే ఉన్నాడు. కాని ఇప్పుడు అటువంటి జీవితాన్ని ఊహించుకోలేక పోతున్నాడు. అతను సాక్షాత్తూ పరబ్రహ్మ. కాని అతని జీవితాన్ని కాసిని పొగాకు గింజలు నియంత్రిస్తున్నాయి. అనంతం అయిన వ్యక్తిని పరిమితమైన వస్తువు శాసిస్తోంది. సిగరెట్టు కాకపోతే కాఫీ. కాఫీగత ప్రాణులు కాఫీ లేకపోతే ఉండలేడు. అందువల్ల ఆత్మజ్ఞానం పొందాక కూడా అతనిలో ఈ విపరీతభావనలు పోవు. సంశయం, విపర్యయం జ్ఞానానికి పెద్ద ఆటంకాలు.

**నిశ్చలాః (తిష్ఠతి), అచలాః (తిష్ఠతి)** – నిశ్చల అంటే సంశయరహితః తిష్ఠతి; అచల అంటే విపర్యయరహితః తిష్ఠతి. అటువంటి వ్యక్తిని స్థితప్రజ్ఞుడు అంటారు. స్థితప్రజ్ఞుడు అంటే తనమీద తాను తప్ప, ఎవరిమీదా ఆధారపడని వ్యక్తి.

**తదా యోగమ్ అవాప్స్యసి** – అప్పుడు మాత్రమే, ఆ వ్యక్తి యోగాన్ని పొందుతాడు. అంటే మోక్షాన్ని పొందుతాడు. బ్యాంకులో లక్షలు మూలుగుతున్నా భావపరంగా మనం బికారులం. కానీ ఇప్పుడు గుప్పెడు ప్రేమకోసం ఎవరినీ బ్రతిమాలనవసరం లేదు.

దీనితో గీతాబోధలో ముఖ్యమైనది ముగిసింది. అర్జునుడు ఏమైనా ప్రశ్న అడుగుతాడేమోనని కాసేపు ఆగుతాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే వేదాంతం గుడ్డిగా నమ్మమని చెప్పదు, అర్థం చేసుకోమంటుంది. అర్థం చేసుకోవాలంటే, శిష్యునికి సందేహాలు మిగిలిపోకూడదు. అందువల్ల ఆచార్యుడు, శిష్యుడు ప్రశ్న అడిగే అవకాశం ఇస్తాడు.

రెండవ అధ్యాయంలో 11–53 శ్లోకాల్లో మొత్తం వేదాంతబోధను సంక్షిప్తంగా చెప్పాడు కృష్ణపరమాత్మ. రెండు అంశాలను చర్చించాడు. 11–38 శ్లోకాల వరకు జ్ఞానయోగం గురించి చెపితే, 39–53 శ్లోకాల వరకు కర్మయోగం గురించి చెప్పాడు. ఈ పునాదిమీద 16 అంతస్థుల భవంతి కడతాడు. అందువల్ల మనలో కూడా ఈ పునాది బాగా పడాలి. గీతలో రాబోయే అధ్యాయాలను బాగా అర్థం చేసుకోవాలంటే 11–53 శ్లోకాలను బాగా గుర్తు పెట్టుకోవాలి.

కర్మయోగం అంటే సరైన కర్మ చేయటం + సరైన దృక్పథం ఉండటం అని చూశాము. కర్మయోగం అంటే ధర్మపరమైన జీవనం గడపటం. కర్మయోగంవల్ల చిత్తశుద్ధి కలిగి, జ్ఞానయోగానికి వస్తాడు. జ్ఞానయోగం అంటే నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు, నేను ఆత్మను అని తెలుసుకోవటం. రెండు అద్దాలతో కళ్ళజోడు ఉన్నట్టుగా ఆత్మ అయిన నేను మనస్సు, శరీరం అనే రెండు అద్దాలతో వ్యవహారం నడుపుతున్నాను. సుషుప్తిలో ఈ రెండూ పడుకుంటాయి, వ్యవహారం నడవదు. వ్యవహారం నడవకపోయినా, సాక్షిచైతన్యం (ఆత్మ) అయిన నేను ఉంటాను. నా స్వరూపం ఈ చైతన్యం, నా ఆగంతుక స్వరూపం మనశ్శరీరాలు. అవి పని చేస్తున్నంతసేపూ నేను ప్రపంచంతో వ్యవహారం నడుపుతాను. అవి పడుకున్నప్పుడు వ్యవహారం నడవదు. అంతమాత్రాన నేను లేనట్టు కాదు. వ్యవహారాలు వస్తాయి, పోతాయి, నేను మాత్రం నిత్యం, శాశ్వతం.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ – 2.20**
**అచ్ఛేద్యోఽ యమదాహ్యోఽ యమ్ అక్లేద్యోఽ శోష్య ఏవ చ – 2–24**

ఈ జ్ఞానాన్ని ఆత్మజ్ఞానం అంటారు. ఆత్మజ్ఞానం సంసారంనుంచి, మరణభయంనుంచి ముక్తిని కలిగిస్తుంది. నేను శరీరం కాదు అని తెలిస్తే, శరీరం రాలిపోతే భయమెందుకు?

**వేదాంతసారం – కర్మయోగం పాటించు, చిత్తశుద్ధి పొందు, జ్ఞానయోగం పాటించు, ఆత్మజ్ఞానం పొందు, మోక్షాన్ని పొందు. ఇదే గీతాసారం కూడా!**

ఈ విషయాలను వివరించేముందు అర్జునునికి ఏవైనా సందేహాలున్నాయా అని ఆగాడు కృష్ణపరమాత్మ. అర్జునుడు మంచి శిష్యుడు. కృష్ణపరమాత్మ ఆగేదాకా, మధ్యలో అడ్డుపడకుండా విన్నాడు. ఇప్పుడు ఒక ప్రశ్నను వేస్తాడు. అది రెండవ అధ్యాయంలో నాలుగవ అంశం. ఆ ప్రశ్నేమిటో చూద్దాము.

**అర్జున ఉవాచ**

శ్లో. 54 **స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।**
**స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ॥**
స్థితప్రజ్ఞస్య, కా, భాషా, సమాధిస్థస్య, కేశవ,
స్థితధీః కిమ్, ప్రభాషేత, కిమ్, ఆసీత, వ్రజేత, కిమ్ ॥

| | | | |
|---|---|---|---|
| కేశవ | = ఓ కేశవా! | స్థితధీః | = స్థిరబుద్ధి గలవాడు |
| సమాధిస్థస్య | = సమాధియందు స్థితుడై | కిమ్ ప్రభాషేత | = ఏ విధముగా మాట్లాడును? |
| స్థితప్రజ్ఞస్య | = పరమాత్మ ప్రాప్తినందిన స్థిరబుద్ధి గల పురుషునియొక్క | కిమ్ ఆసీత | = ఏ విధముగా కూర్చుండును? |
| భాషా, కా | = లక్షణమేమి? | కిమ్ వ్రజేత | = ఎలా నడుచును? |

**అర్జున ఉవాచ ।**
**హే కేశవ! సమాధిస్థస్య స్థితప్రజ్ఞస్య కా భాషా?**
**స్థితధీః కిం ప్రభాషేత? కిమ్ ఆసీత? కిం వ్రజేత?॥**

తా: కేశిని సంహరించిన ఓ శ్రీకృష్ణా! సమాధియందు స్థితుడై దృఢమైన ఆత్మానాత్మవివేకముగల మహాత్ముని గురించి జనులు ఏమని వర్ణించెదరు? అటువంటి స్థితప్రజ్ఞుడు ఏ విధముగా మాటలాడును? ఏ విధముగా కూర్చుండును? ఎలా నడుచును? అతని వ్యవహారమెలా ఉండును?

గీత నేర్చుకోవటంవల్ల నిజజీవితంలో ఏమైనా ప్రయోజనముంటుందా? నేను గీత నేర్చుకున్నాను అని చెపితే చాలదు, అది నాకు ఎలా ఉపయోగపడుతుంది అనుకుంటారు కొంతమంది. ఎందుకంటే ఈరోజుల్లో నానుడి, **'టైమ్ ఈజ్ మనీ'**. మరణం తరువాత స్వర్గలోకానికి వెళతావంటే పెద్దగా శ్రద్ధ ఉండదు. ఇప్పుడు తనకు ఏ విధంగా ఉపయోగపడుతుందన్నది ప్రశ్న. అలాగే అర్జునుడు కూడా అడుగుతున్నాడు.

**4. స్థితప్రజ్ఞ లక్షణాలు శ్లోకాలు 54 –72** కృష్ణపరమాత్మ చెప్పినట్టుగా ఎవరైనా కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది, జ్ఞానయోగానికి వచ్చి, జ్ఞానం పొందారనుకుందాము. జ్ఞానం పొందటమే కాదు, నిశ్చయజ్ఞానం పొందిన వ్యక్తిని జ్ఞాని అంటారని చూశాము. అటువంటి జ్ఞానికి అర్జునుడు ప్రత్యేక బిరుదునిస్తున్నాడు.
**స్థితప్రజ్ఞస్య–** అతనిని స్థితప్రజ్ఞుడు అంటున్నాడు. ప్రాజ్ఞుడు అంటే జ్ఞాని. స్థితప్రజ్ఞుడు అంటే సంశయరహిత జ్ఞానం పొందిన వ్యక్తి. అటువంటి వ్యక్తికి ఇంకో బిరుదు కూడా ఇస్తున్నాడు. ఏమిటది?

**సమాధిస్థస్య –** సమాధి అంటే ఆత్మ అని ఇంతకుముందు కూడా చూశాము. సమాధిస్థస్య అంటే ఆత్మనిష్ఠ. అంటే జ్ఞాననిష్ఠలో ఉన్న వ్యక్తి. తన దైనందిన జీవితంలో కూడా తన స్వస్వరూపాన్ని మర్చిపోని వ్యక్తి. జ్ఞాననిష్ఠలో లేని విద్యార్థి నేర్చుకుంటున్నంతసేపూ తాను సచ్చిదానంద ఆత్మననీ, తను శరీరం కాదు, మనస్సు కాదనీ బాగానే అర్థం చేసుకుని, తల ఊపుతాడు. కాని బయటకు వచ్చి చెప్పులు వేసుకోగానే తన పాత వాసనలు అంటే అహంకారం, చింతలు, పరిమితులు, వ్యావహారిక సమస్యలు అన్నీ అతని మనస్సులో దూరిపోతాయి. అందువల్ల ఆత్మజ్ఞానం పొందగానే సరిపోదు, ఒక క్లిష్టపరిస్థితి ఎదురైనప్పుడు జ్ఞాననిష్ఠలో నిలబడగలగాలి. అలా నిలబడగలిగిన వ్యక్తిని సమాధిస్థితుడు అంటారు.

**స్థితధీః –** ఈ రెండు దశలనూ విజయవంతంగా దాటిన వ్యక్తికి ఇంకొక బిరుదునిస్తున్నాడు. అది స్థితధీః స్థితధీ అన్నా స్థితప్రజ్ఞ అన్నా ఒకటే. ధీః అంటే జ్ఞానం. స్థితధీః అంటే నిస్సంశయ జ్ఞానం కలిగిన వ్యక్తి. అతనికి జ్ఞానం

ఒక సత్యం. అది శాస్త్రం చెప్పే ఒక సమాచారం కాదు. 2+2=4 ఎంత సత్యమో, అహం బ్రహ్మ అస్మి కూడా అంతే సత్యం అతనికి. అటువంటి వ్యక్తిని స్థితధీః అంటారు.

జ్ఞానికి అర్జునుడు మూడు పదాలను వాడాడు – స్థితప్రజ్ఞుడు, సమాధిస్థితుడు, స్థితధీ. ఇప్పుడు అటువంటి జ్ఞాని లక్షణాలేమిటో చెప్పు కృష్ణా అంటున్నాడు.

**కా భాషా** – జ్ఞాని లక్షణాలు ఎలా ఉంటాయి?
**కిం ప్రభాషేత** – ఎదుటివారితో ఎలా మాట్లాడతాడు?
**కిమాసీత** – ఎలా కూర్చుంటాడు?
**వ్రజేత కిమ్** – ఎలా నడుస్తాడు?

ఒక్కముక్కలో చెప్పాలంటే స్థితప్రజ్ఞుని లక్షణాలేమిటి? జ్ఞాని అంటే ఏదో అసాధారణంగా ఉంటాడు అనుకుంటారు కొందరు. అందరిలాగే అతనూ ఉంటే, జ్ఞానెలా అవుతాడు? ఏదో మార్పు ఉండిఉండాలి. అలా అర్జునుడు జ్ఞాని లక్షణాలు అడిగాడు. తరువాత వచ్చే శ్లోకంనుంచీ కృష్ణపరమాత్మ జవాబు వస్తుంది.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 55 **ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥**
ప్రజహాతి, యదా, కామాన్, సర్వాన్, పార్థ, మనోగతాన్,
ఆత్మని, ఏవ, ఆత్మనా, తుష్టః, స్థితప్రజ్ఞః, తదా ఉచ్యతే ॥

పార్థ = ఓ పార్థా!
యదా = ఎప్పుడైతే
మనోగతాన్ = మనస్సునందున్న
సర్వాన్ = సమస్తములైన
కామాన్ = కోరికలను
ప్రజహాతి = (మానవుడు) పూర్తిగా త్యజించునో, (ఇంకా)
ఆత్మనా = ఆత్మ ద్వారా
ఆత్మని ఏవ = ఆత్మయందే
తుష్టః = సంతుష్టుడగునో
తదా = అప్పుడే
స్థితప్రజ్ఞః = (అతడు) స్థితప్రజ్ఞుడు
ఉచ్యతే = అని పిలవబడతాడు

**శ్రీభగవానువాచ।**
**హే పార్థ! యదా (నరః) మనోగతాన్ సర్వాన్ కామాన్ ప్రజహాతి,**
**ఆత్మని ఏవ ఆత్మనా తుష్టః(భవతి), తదా స్థితప్రజ్ఞః ఉచ్యతే ॥**

తా: శ్రీ భగవానుడు పలికెను – ఓ అర్జునా! మనస్సునందలి కోరికలన్నియును పూర్తిగా తొలగిపోయి, ఆత్మ ద్వారా ఆత్మయందు సంతుష్టుడైనవానిని, అనగా పరమాత్మ సంయోగమువల్ల ఆత్మానందమును పొందిన వానిని స్థితప్రజ్ఞుడని అంటారు.

స్థితప్రజ్ఞ లక్షణాలను వివరించే ఈ శ్లోకాలు చాలా ముఖ్యమైన శ్లోకాలు. శంకరాచార్యులు, తక్కిన ఆచార్యులు వీటిని తరచు ఉటంకిస్తుంటారు. ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఈ భాగం ఒక మార్గదర్శిలా పనిచేస్తుంది.

**యాని స్థితప్రజ్ఞస్య లక్షణాని తాని ముముక్షోః సాధనాని**

స్థితప్రజ్ఞుని లక్షణాలు ఏవి ఉన్నాయో, అవి ముముక్షువులకు సాధనాలుగా తోడ్పడతాయి అంటారు శంకరాచార్యులు. ఇది మొదటి ప్రయోజనం.

ఇంకొక ప్రయోజనం కూడా ఉంది. ఈ జ్ఞానమార్గంలోకి వచ్చాక, ఈ జ్ఞానం నాకెంతవరకూ అబ్బింది? నేను జ్ఞానిని అయ్యానా, లేదా? ఈ ప్రశ్న ప్రతిఒక్కరికీ ఉదయిస్తుంది. నేను జ్ఞానిని అయితే, ఇంక నేర్చుకోవటం ఆపేయవచ్చా? నా మొహంలో ఒక తేజస్సు వస్తుందా? శారీరకంగా ఏమైనా మార్పు వస్తుందా? లేదా స్వామీజీలాంటివారు, ఫలానావ్యక్తి జ్ఞాని అయ్యాడు, అతన్ని గౌరవించండి, కుదిరితే పాదపూజ చేయండి అని ఏమైనా సర్టిఫికేట్ ఇస్తారా? ఇలా అనేక ప్రశ్నల పరంపరలు వస్తాయి. ఇప్పుడు ఈ స్థితప్రజ్ఞుని లక్షణాలు చూసి, ఎవరికి వారు ఆత్మపరీక్ష చేసుకోవచ్చు.

**హెచ్చరిక** – కాని ఇక్కడ ఒక హెచ్చరిక చేస్తున్నాము. ఈ భాగాన్ని మిమ్మల్ని మీరు పరీక్ష చేసుకోవటానికి వాడండి తప్పితే ఎదుటివారిని పరీక్షించటానికి వాడకండి. ముఖ్యంగా మీ కుటుంబసభ్యులను పరీక్షించకండి. ఇది మిమ్మల్ని మీరు మార్చుకోవటానికి వాడుకోండి అంతే.

**జ్ఞానసాధనలు –** ఈ భాగంలోనే, కృష్ణపరమాత్మ ఇంకొక అంశాన్ని కూడా చర్చిస్తున్నాడు. దాన్ని స్థితప్రజ్ఞుడు అవటానికి సాధనలు అంటారు. అంటే స్థితప్రజ్ఞుడు అవటానికి చేయాల్సిన సాధనలు. అంటే ఇక్కడ రెండు చూస్తాము – స్థితప్రజ్ఞుని లక్షణాలు, స్థితప్రజుడు అవటానికి సాధనలు. కాని ఈ సాధనలన్నింటినీ కృష్ణపరమాత్మ వివరంగా చర్చించడు. ఒకటి మాత్రం స్పష్టం చేశాడు. కర్మయోగం పాటించి జ్ఞానయోగానికి రావాలి. అందులో ఎన్నుకునే అవకాశం లేదు. ఇప్పుడు జ్ఞానయోగంలో మూడు సాధనలు చేయాలి. వాటిని శ్రవణ, మనన, నిదిధ్యాసనలు అంటారు.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యః మంతవ్యః నిదిధ్యాసితవ్యః – బృహదారణ్యకమ్**

ఆత్మజ్ఞానం పొందటానికి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలని ఉపనిషత్తులు చెబుతాయి.

**ఎ). శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన ఆచార్యుని వద్ద శాస్త్ర అధ్యయనం చేయాలి. శాస్త్రాన్ని, అది కూడా సమర్థవంతమైన గురువు ద్వారా నేర్చుకోవాలి. స్వంతంగా నేర్చుకోవటానికి ప్రయత్నిస్తే సరిగ్గా అర్థం కాకపోగా, తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదముంది. శాస్త్రం, గురువు అద్దంలాంటివారు. మన మొహాన్ని మనం ప్రత్యక్షంగా చూసుకోలేము కాబట్టి, అద్దంలో చూసుకుంటాము. చూడటానికి బాహ్యంగా ఉన్న అద్దంలో చూస్తున్నట్టు కనిపించినా, అద్దంలో మన మొహాన్నే మనం చూస్తున్నాము. అలాగే, మనను మనం తెలుసుకోవాలంటే, మనం ప్రత్యేకమైన దర్పణాన్ని ఉపయోగించాలి. దాన్ని గురుశాస్త్ర ఉపదేశం అంటారు. చూడటానికి శాస్త్రం బాహ్యంగా ఉన్నా, ఆ బాహ్యదర్పణంలో మన

ఆత్మస్వరూపాన్ని తెలుసుకుంటాము. అందువల్ల శ్రవణం ఆత్మజ్ఞానం కలుగజేస్తుంది. మన స్వస్వరూపాన్ని తెలియజేసి, మనకున్న అజ్ఞానాన్ని తొలగిస్తుంది.

**బి). మననం –** శ్రవణం దశలో అనేక సందేహాలు కలుగుతాయి. వేదాంతం తన బోధను మనమీద బలవంతంగా రుద్దదు. గురువు మనను అల్లించో, బెల్లించో చెప్పదు. గురువు నువ్వు బ్రహ్మావు అని చెపితే, దాన్ని గుడ్డిగా నమ్మమనదు. శిష్యుడు అర్థం చేసుకునేదాకా, అతనికి ఎన్ని సందేహాలు కలిగినా ఓపికగా మళ్ళీమళ్ళీ చెబుతాడు. ఆత్మ గురించి అర్థం చేసుకోవాలి అంటే, బుద్ధితో అర్థం చేసుకోవాలి. బుద్ధి ప్రతిదీ తార్కికంగా ఆలోచిస్తుంది. దాన్ని మనం తేలిగ్గా మోసగించలేము. గురువు కర్రను చూపించి, ఇది ఏనుగు అంటే, బుద్ధి మనను ఒప్పుకోనివ్వదు. అయ్యో, గురువుకేమయింది అని బాధపడేలా చేస్తుంది తప్ప గురువు మాటను గుడ్డిగా ఒప్పుకోనివ్వదు. మనం ప్రపంచంలో దేన్నైనా మోసం చేయగలం గాని, బుద్ధిని మాత్రం కాదు. అందువల్ల బుద్ధిలో నిశ్చయజ్ఞానం కలగాలి.

మననం అంటే నిశ్చయజ్ఞానం లేదా నిస్సంశయజ్ఞానం. నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు, నేను వాటి ద్వారా వ్యవహారం నడుపుతున్న ఆత్మను అని బుద్ధి బుద్ధిగా ఒప్పుకుంటే అది మననం. అంటే మననంలో జ్ఞానపరమైన ఆటంకాలు తొలగుతాయి. ఈ జ్ఞానం ఏదో సమాచారమో, ఒక భావనో కాదు, **ఒక సత్యం**.

**సి). నిదిధ్యాసనం –** బుద్ధిలో నిశ్చయజ్ఞానం కలగగానే సరిపోదు. అది మానసికశక్తిగా మారాలి. ఎందుకంటే మన నిజజీవితంలో బుద్ధికన్నా, మనస్సును ఎక్కువగా వాడతాము. బుద్ధిని వాడేది చాలా తక్కువ. చదువుకునే రోజుల్లో కూడా చాలా తక్కువగా వాడతాము బుద్ధిని. కాని మనస్సును మేలుకుని ఉన్నంతసేపూ వాడుతూనే ఉంటాము. పొద్దున లేస్తూనే కాఫీ కావాలి. కాఫీ రాకపోతే కోపం ముంచుకొస్తుంది. ఎవరిమీదో చిందులు వేస్తాము. కారు నడుపుదామంటే, ఒక పట్టాన స్టార్ట్ అవదు. రోడ్డుమీద వెళుతుంటే ఎవరో మన పక్కనుంచీ దూసుకుపోతారు, గీతాబోధకు అందరికన్నా ముందువెళ్ళి, ముందు వరుసల్లో కూర్చుంటే, ఎవరో పొడుగతను ఆలశ్యంగా వచ్చి, మనముందు, మనకు అడ్డంగా కూర్చుంటాడు; ఆఫీసుకు వెళితే అక్కడ ఏవో చికాకులు. అలా రోజంతా చికాకు, కోపం, ఆందోళన, బెంగ, దుఃఖం – ఏదో ఒక భావోద్రేకం రాజ్యమేలుతూనే ఉంటుంది. క్షణక్షణం ఈ భావాలు మనను పట్టి కుదిపేస్తుంటాయి.

అందువల్ల మన భావోద్రేకాలను పారద్రోలి, మనస్సును దిటవుపరచుకోకపోతే, మనం నేర్చుకున్న ఆత్మజ్ఞానం ఒకమూల ఉండిపోయి, మన జీవితం ఎప్పటిలాగే మనను అల్లకల్లోల పరుస్తుంది. అందువల్ల వేదాంతం మనకు ఉపయోగకరంగా ఉండాలంటే, జ్ఞానాన్ని మానసికశక్తిగా మలచుకోవాలి. జ్ఞానాన్ని ప్రజ్ఞ అనీ, మానసిక శక్తిని స్థితప్రజ్ఞత అనీ అంటారు. అంటే ప్రజ్ఞ నుంచీ స్థితప్రజ్ఞతకు రావాలి. అంటే మన అణువుఅణువులోనూ ఈ జ్ఞానం జీర్ణించుకుపోవాలి. ఈ జ్ఞానం ప్రతిక్షణమూ, ముఖ్యంగా క్లిష్టపరిస్థితుల్లో మనకు తోడ్పడేటట్టుగా ఉండాలి. జీవితం ప్రశాంతంగా ఉంటే వేదాంతం ఎవరికి కావాలి? అల్లకల్లోలంగా ఉన్నప్పుడే కావాలి. అలా జ్ఞానాన్ని ప్రజ్ఞగా మార్చుకున్న వ్యక్తిని జ్ఞాననిష్ఠలో లేదా ఆత్మనిష్ఠలో ఉన్నాడనీ, అతన్ని జీవన్ముక్తుడనీ అంటారు.

జీవితంలో గొప్ప హోదాలో ఉన్నవారు, ధనవంతులలో కొందరు ఈ మానసిక స్థైర్యం లేక డీలా పడిపోతారు. అంటే వారికి ఐక్యూ ఉంది కాని ఇక్యూ లేదు. అందువల్ల ఐక్యూ ఉంటే చాలదు, ఇక్యూ కూడా ఉండాలి. బుద్ధిలో కలిగిన ప్రజ్ఞను, మనస్సులో స్థితప్రజ్ఞతగా మలచుకోగలగాలి. ఇది ఒక దేశంనుంచి ఇంకో దేశానికి వెళ్ళటంలాంటిది. మీరు ఇక్కడ కోటీశ్వరులు కావచ్చు, కాని అమెరికా వెళితే చేతిలో డాలర్లు లేకపోతే, అక్కడ వ్యవహారం నడపలేరు. అందువల్ల రూపాయలను డాలర్లుగా మార్చుకుని వెళతారు. ఇక్కడా అంతే. జ్ఞానాన్ని మానసికస్థైర్యంగా మార్చుకుంటారు.

నెగటివ్‌లను చీకటిగదిలోనే ఫోటోగా డెవలప్ చేస్తారు అన్నారు ఎవరో. అలాగే మనలో కూడా నెగటివ్‌లు చీకటిలోనే డెవలప్ అవుతాయి. మనలోని నెగటివ్‌లు కామక్రోధలోభమోహమదమాత్సర్యాలు; చీకటిగది అజ్ఞానంతో నిండిన మనస్సు. మనం జ్ఞానం పొందితే మనస్సులోని చీకటి తొలగిపోతుంది. దానితో నెగటివ్‌లు కూడా పోతాయి. నిదిధ్యాసనం అంటే మానసిక ఆటంకాలను తొలగించుకోవటం.

**శ్రవణ, మననాల ద్వారా ప్రజ్ఞ పొందితే, నిదిధ్యాసనం ద్వారా ప్రజ్ఞను, స్థితప్రజ్ఞగా మలచుకుంటాడు జ్ఞాని.**

ఇక్కడ కృష్ణపరమాత్మ రెండు అంశాలను చర్చించబోతున్నాడని చూశాము. అవి – ప్రజ్ఞను స్థితప్రజ్ఞగా మలచుకోవటం ఎలా? స్థితప్రజ్ఞుని మానసిక స్థితి ఎలా ఉంటుంది?

స్థితప్రజ్ఞుని మనస్సు జీవన్ముక్తిని అనుభవిస్తుంది. జ్ఞాని మనస్సు తేలికగా, దూదిపింజలా ఆనందంగా ఉంటుంది. చాలామంది జ్ఞానికి మనస్సు ఉండదు అనుకుంటారు. అది పొరపాటు. జ్ఞానికి మనస్సు ఉంటుంది; కాకపోతే ఆ మనస్సు బాధించదు; అజ్ఞానంతో నిండి ఉండదు; సమస్యలకు పుట్టినిల్లుగా ఉండదు. మనస్సు ఎంత తేలిగ్గా ఉంటుందంటే, అసలు మనస్సు ఉన్నట్టే అతనికి తెలియదు. మీరే గమనించండి, శరీరంలో ఏ భాగమైనా ఆరోగ్యవంతంగా ఉంటే దాన్ని పట్టించుకోము. కాలు బాగున్నంతసేపూ కాలుని పట్టించుకోము. మోకాలినొప్పి వచ్చి, నా గురించి జాగ్రత్త తీసుకోమని అది పదేపదే చెపితే, అప్పుడు జాగ్రత్త పడతాము. చీనా సామెత – చెప్పు సరిగ్గా సరిపోతే అది ఉన్నట్టే తెలియదు. చెప్పులు లేకుండా నడుస్తున్నట్టుంటుంది. అలాగే మనస్సు చింతలు, బెంగలు, భయాలు కొల్లలుగా కలుగజేస్తున్నప్పుడు దాని ఉనికిని వద్దన్నా తప్పించుకోలేము. ఇప్పుడు మనస్సు ఎంత తేలికవుతుందంటే, అది ఉన్నట్టే తెలియదు. అందువల్ల జ్ఞానికి మనోనాశం అవుతుంది అంటారు. నిజంగా మనోనాశం అవదు. అద్భుతమైన మనస్సును అనుభవిస్తాడు. ఏమిటా అద్భుతమైన మనస్సు? కృష్ణపరమాత్మ వివరించబోతున్నాడు. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**స్థితప్రజ్ఞుని లక్షణాలు – 1. ఆత్మని ఏవ ఆత్మనా తుష్టః** – ఇది జ్ఞానియొక్క మొదటి లక్షణం. జ్ఞాని తనలోనే తాను తృప్తిపడతాడు. అతని ఆనందానికి బాహ్య అంశాలు అవసరం లేదు. శరీరంగా బాహ్యవిషయాలమీద ఆధారపడక తప్పదు. అంటే తిండి, బట్టకోసం బాహ్యవస్తువులమీద ఆధారపడతాడు కాని, భావోద్రేకాల దగ్గరికి వచ్చేసరికి, గుప్పెడు ప్రేమను పంచమని భిక్షాపాత్రను పట్టుకుని ఎవరినీ యాచించడు. జ్ఞాని తనే ప్రేమానురాగాలను పంచుతాడు తప్ప ఎవరినుంచీ ప్రేమానురాగాలను కోరడు. ఎంత అద్భుతమైన దృక్పథం!నన్ను ప్రేమించావా

మంచిది, ప్రేమించలేదా మరీ మంచిది అంటాడు. అంతేకాని ఎవరినుంచీ వరాలు కోరడు! వరాలు కోరితే వారు ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తారు. నేను కోరినట్టు ఉండమంటారు వారు.

జ్ఞాని బాహ్యప్రపంచానికి అతీతంగా ఎదుగుతాడు. బాహ్యవస్తువులూ, పరిస్థితులమీదే కాదు, మనుష్యులమీద కూడా ఆధారపడడు. అంతదాకా ఎందుకు తన శారీరక పరిస్థితిమీదే ఆధారపడడు. వృద్ధాప్యం వచ్చినా, జుట్టు తెల్లబడినా, పూర్తిగా బట్టతల వచ్చినా, మొహంలో ముడతలు ఏర్పడినా చలించడు. అతని ఆనందం అతని శారీరకస్థితిమీద ఆధారపడిలేదు. అందువల్ల జ్ఞానంయొక్క మొట్టమొదటి సంకేతం ఏమిటి? ఆత్మతృప్తి.

**2. సర్వాన్ కామాన్ ప్రజహాతి** – కోరికలను త్యజిస్తాడు. ఎప్పుడైతే తనలోనే పరిపూర్ణత ఉందని జ్ఞాని తెలుసుకుంటాడో, దాని సహజపరిణామం ఏమిటి? కోరికలన్నిటినీ త్యజిస్తాడు. కోరికలు ఎందుకు కలుగుతాయి? వేదాంతం ఈ సమస్యకు కారణం చక్కగా కనుగొన్నది. ఎవరైనా చేతికర్ర ఎందుకు కోరుకుంటారు? తన కాళ్ళలో శక్తి లేనప్పుడు, తన శక్తిని పూర్తి చేసుకోవటానికి చేతికర్రను పట్టుకుంటారు. అలాగే నేను పరిపూర్ణుడను అని తెలియకముందు పూర్ణత్వం పొందటంకోసం దేనివల్ల పూర్ణత్వం వస్తుందనుకుంటానో దానికోసం వెంపర్లాడతాను. ఇల్లు, భార్య, మగపిల్లవాడు, మనవడు – అలా అనేక కారణాలలో పూర్ణత్వాన్ని వెతుక్కుంటాను. అంటే కామం అనారోగ్యం కాదు, అది అపూర్ణత్వభావన లక్షణం.

జ్ఞాని ఆనందం తనలోనే వెతుక్కుంటాడు కాబట్టి, అతను పూర్ణత్వంకోసం ఆరాటపడడు. ఒక వస్తువును మనం వాడతాము కాని అది అవసరం కాకపోవచ్చు. పొద్దున్నే వాకింగ్‌కి వెళ్ళే వ్యక్తి ఒక చిన్న కర్రను పట్టుకుని వెళ్ళవచ్చు కాని అతనికి అది అవసరం కాదు. ఎలా చెప్పగలము? అది పడిపోయినా, అతను మామూలుగా నడవగలడు. కాని చేతికర్రను వాడేవ్యక్తి, అది లేకపోతే కిందపడిపోతాడు.

జ్ఞాని కూడా నలుగురిలో తిరుగుతాడు కాని వారు చిన్న కర్రలాంటి వారు, చేతికర్రలాంటి వారు కాదు. అంటే ఆ మనుష్యులు ఉన్నా లేకపోయినా, అతను చలించడు. అందువల్ల కామం అంటే అపూర్ణత్వభావనవల్ల ఏర్పడిన ఆధారపడే తత్త్వం. అందువల్ల కోరికలన్నిటినీ త్యజిస్తాడు. ఈ కోరికలు ఎక్కడ ఉన్నాయి?

**మనోగతాన్** – ఈ కోరికలన్నీ మనస్సులో ఉన్నాయి. నులిపురుగులలాగా మనస్సును తొలిచేస్తుంటాయి. మానససరోవరం వెళ్ళినా కూడా వదలవు. జ్ఞాని ఈ కోరికలను త్యజించగలడు. అందని ద్రాక్షపళ్ళు పుల్లన సిద్ధాంతం కాదు. కోరికలను రెండు విధాలుగా త్యజిస్తాము. వాటిని అణగద్రొక్కటం ద్వారా, పూర్ణత్వం ద్వారా. అందని ద్రాక్షపళ్ళు పుల్లన విషయంలో ప్రయత్నించి, ద్రాక్ష అందకపోతే ఆ కోరికను అణగద్రొక్కుకుంటాము కాని వేరే ఎవరికో అంది తెచ్చియిస్తే, ఎగిరి గంతేసి తీసుకుంటాము. కాని కోరికలను త్యజించటం పూర్ణత్వాన్ని కనుక్కోవటం ద్వారా రావాలి. అది సహజంగా జరగాలి.

ఇక్కడ కోరికలు లేకపోవటం అనే పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. శాస్త్రం రెండు రకాల కోరికల గురించి చెబుతుంది. కొన్ని కోరికలు శాస్త్రం అంగీకరిస్తుంది, కొన్నిటిని అంగీకరించదు. మూడు షరతులకు లోబడివున్న కోరికలను శాస్త్రం అంగీకరిస్తుంది.

**ఎ) ధార్మిక కోరికలు** – కోరికలు ధర్మబద్ధంగా ఉండాలి. పిల్లలు బాగా చదువుకోవాలి, వృద్ధిలోకి రావాలి అని కోరుకోవటం మన ధర్మం. నిజానికి అలా కోరుకోవాలి కూడా. శాస్త్రం అలాంటి కోరికను అంగీకరిస్తుంది. అలాగే ఇల్లు కట్టుకోవాలి, డబ్బు సంపాదించాలి, వస్తువులు సమకూర్చుకోవాలిలాంటి కోరికలు తప్పులేదు, కాని వాటిని ధర్మబద్ధంగా, న్యాయపరంగా తీర్చుకోవాలి. దొంగతనం చేయకూడదు.

**బి) పరిమితి ఉన్న కోరికలు** – పరిమితి ఉండాలి అంటే, ఆ కోరికలు మరీ ఎక్కువగా ఉంటే, జీవితమంతా వాటిని తీర్చుకోవటంతోనే సరిపోతుంది. ఆధ్యాత్మిక చింతన చేయటానికి తీరిక చిక్కదు. మీరు క్షణం తీరిక లేకుండా ఎంత బిజీగా ఉన్నా కూడా ఆధ్యాత్మిక వ్యక్తిత్వానికి కొంత సమయాన్ని కేటాయించుకోవాలి అంటుంది శాస్త్రం. అది ఏ రూపంలోనైనా ఉండవచ్చు – శాస్త్రాన్ని అధ్యయనం చేయవచ్చు; మీరు అధ్యయనం చేసినదాన్ని మననం చేసుకోవచ్చు; ఆధ్యాత్మిక గ్రంథాన్ని పారాయణం చేయవచ్చు. ప్రతి వ్యక్తి కూడా ఆధ్యాత్మిక, ప్రాపంచిక వ్యక్తిత్వాల మేలుకలయిక. అలాంటప్పుడు కేవలం ప్రాపంచిక చింతనతోనే కాలం గడిపితే, అతని వ్యక్తిత్వం పరిపూర్ణవ్యక్తిత్వం అవదు.

అందువల్ల కోరికలు హద్దులు దాటితే, ఆధ్యాత్మిక దృక్పథం అలవడక, జీవితం ప్రమాదంలో పడుతుంది. ఏ పని చేస్తున్నా, అది అశాశ్వతమనీ, అముఖ్యమనీ, అసలు లక్ష్యం దైవచింతన అనీ గుర్తుంచుకోవాలి. మీరు ప్రపంచ ప్రఖ్యాతి చెందినా, వ్యాపారంలో ఆరితేరినా ఒక విషయం మాత్రం ఎన్నడూ మర్చిపోకూడదు. మీ ఆధ్యాత్మిక వ్యక్తిత్వాన్ని మర్చిపోకూడదు. అందువల్ల మీ కోరికలు ఎన్ని ఉన్నా, కొంత సమయాన్ని జ్ఞానయోగానికి అవసరమైన శ్రవణ, మనన, నిదిధ్యాసనలకు కేటాయించండి. అంత తీరిక లేదంటారా, **కనీసం గీతాబోధకు వెళ్ళండి** (కనీసం గీతాబోధను చదవండి).

**సి) బంధకత్వం లేని కోరికలు** – బంధకత్వం లేకుండా కోరికలు ఉండటం కష్టం కాని చాలా ముఖ్యం. బంధకత్వం ఉన్న కోరికలకూ, బంధకత్వం లేని కోరికలకూ మధ్య ఏమిటి వ్యత్యాసం? బంధకత్వం ఉన్న కోరిక అయితే, ఆ కోరిక తీర్చుకోవటానికి మనం ప్రయత్నం చేస్తాము కాని, అది తీర్చుకోవటం మన చేతిలో లేదు.

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన**

మన పిల్లల గురించి అద్భుతమైన ప్రణాళికలు వేసుకోవచ్చు. డాక్టరవాలనీ, లక్షల్లో డబ్బు సంపాదించాలనీ, మనలను ప్రపంచం అంతా తిప్పి తీసుకురావాలనీ అనుకోవచ్చు. కాని ఆ కలలు తీరతాయనే నమ్మకం లేదు. మనం సర్వజ్ఞులం, సర్వశక్తిమంతులం కాదు. ఆ కల కలలాగా తేలిపోవచ్చు. అంటే బంధకత్వం ఉన్న కోరిక టైమ్‌బాంబ్‌లాంటిది. అది ఎప్పుడు పేలుతుందో అని హడలిపోయినట్టుగా, మన కోరికలు తీరుతాయో లేదోనని హడలిపోతూ ఉంటాము.

బంధకత్వం లేని కోరికలంటే, ఆ టైమ్‌బాంబ్‌ను చెదరగొట్టగలిగే తెలివి ఉండటం. ఇందులో కూడా కోరికలు కోరతాము, దానికోసం చాలా కష్టపడతాము, దానికోసం భగవానుని కృప కూడా కోరతాము, కాని

ఇన్ని చేసినా మనం కోరినట్టుగా, మన కోరికలు తీరకపోవచ్చు. అటువంటి పరిస్థితి ఎదురైనప్పుడు, కృంగిపోకుండా, దాన్ని కూడా స్వీకరించగలగాలి. అదే టైమ్‌బాంబ్‌ను చెదరగొట్టటమంటే.

ఈ మానసిక స్థైర్యం ఒక టీవీ కార్యక్రమాన్ని చూడటానికి కూడా కావాలి. ఫుట్‌బాల్ మ్యాచో, వింబుల్‌డన్ ఫైనలో చూడాలనుకుని దానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ ముందునుంచీ చేసుకున్నారు – బంధువులెవరూ రాకుండా చేసి పాప్‌కార్న్‌లాంటి చిరుతిళ్ళు దగ్గరపెట్టుకుని, టీవీ ముందు కూర్చుంటే కరెంటు పోయింది. ఏం చేస్తారు? దీనికి కూడా సిద్ధమవాలి. ఈ మానసిక స్థైర్యం, జ్ఞానంవల్ల కలుగుతుంది. అది కోరికను, బంధకత్వం లేని కోరికగా మారుస్తుంది.

శాస్త్రంలో ఇలాంటి కోరికను శుద్ధకామం అంటారు. శుద్ధకామం అంటే ఈ మూడు లక్షణాలనూ పూర్తి చేసేది – అంటే ధర్మబద్ధమైన, పరిమితి ఉన్న, బంధకత్వం లేని కోరికలు. ఇటువంటి శుద్ధకామాలు ఎన్నైనా ఉండవచ్చు. జ్ఞానులకు కూడా ఇటువంటి శుద్ధకామాలు ఉంటాయి. అవి లేకపోతే శంకరాచార్యులవారు ఇన్ని భాష్యాలు రాసి ఉండేవారు కాదు. ఆయన లోకసంగ్రహంకోసం రాశారు. అది కూడా కోరికే! శంకరాచార్యులకే కాదు, భగవంతునికి కూడా కోరిక ఉంది. అందువల్లనే సృష్టి చేశాడు.

**సోఽకామయత బహుస్యాం ప్రజాయేయేతి**
**స తపోఽతప్యత స తపస్తప్త్వా ఇదగ్ం సర్వమ్ అసృజత** – తైత్తిరీయమ్

దీనికి శంకరాచార్యులు అద్భుతమైన భాష్యం రాశారు. భగవంతునికి కూడా కోరిక ఉంటే, అది బంధకత్వం కాదా అని ఆయనే ప్రశ్న వేసి, ఆయనే జవాబు వ్రాశారు. భగవంతునియొక్క, జ్ఞానియొక్క కోరికలు శుద్ధకామాలు. జ్ఞానికి కోరికలు ఉండవు అని ఈ అధ్యాయం చెబుతున్నది. కోరికలు ఉండవు అంటే బంధించే కోరికలు ఉండవు. కోరిక తీరిందా సంతోషం, తీరలేదా మరీ సంతోషం. ఐదురోజుల క్రికెట్ సీరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఇండియా గెలిచేసిందనుకోండి; 4, 5 మ్యాచ్‌లు ఇండియా ఏ మాత్రం ఆందోళన లేకుండా ఆడుతుంది. దీన్ని జ్ఞానిలక్షణం అంటారు.

జ్ఞానిని అర్థం చేసుకోవాలంటే, ఆ సీరీస్‌లోని 4, 5 మ్యాచ్‌లు చూడండి. ఇండియా ఆ మ్యాచ్‌లు కూడా శ్రద్ధగా ఆడుతుంది. రికార్డులు బద్దలుకొడుతుంది. ఆత్మన్యేవాఽత్మనా తుష్టః. ఆ గేములు గెలిస్తే బోనస్ వచ్చినట్టు. లేకపోయినా, వరల్డ్‌కప్ గెలవనే గెలుస్తారు. జ్ఞాని కూడా అంతే. ఇంకా మాట్లాడితే, వారికన్నా ఎక్కువ. వారు ఆ ఒక్క సిరీసే అలా నిశ్చింతగా ఆడతారు. జ్ఞాని ప్రతిపనీ అలాగే చేస్తాడు. తను చేసిన కర్మ ఫలించినా, ఫలించకపోయినా చలించడు. అందువల్ల ప్రజహాతి యదా కామాన్ అంటే ప్రజహాతి యదా అశుద్ధ కామాన్. జ్ఞాని అశుద్ధ కోరికలను త్యజించి, శుద్ధమైన కోరికలనే కోరతాడు.

ఈ శ్లోకం చాలా ముఖ్యమైన శ్లోకం. ఎందుకంటే తక్కిన శ్లోకాలన్నీ ఈ శ్లోకానికి వ్యాఖ్యానం. అందువల్ల దీన్ని సూత్రశ్లోకమనీ, తక్కినవాటిని వ్యాఖ్యాన శ్లోకాలనీ అంటారు.

శ్లో. 56 **దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।**
**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥**
దుఃఖేషు, అనుద్విగ్నమనాః, సుఖేషు, విగతస్పృహః,
వీతరాగభయక్రోధః, స్థితధీః, మునిః, ఉచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| దుఃఖేషు | = దుఃఖములు ప్రాప్తించినప్పుడు | వీతరాగభయక్రోధః | = రాగభయ క్రోధములను త్యజించినవాడును అగు |
| అనుద్విగ్నమనాః | = మనస్సునందు ఉద్వేగమునకు లోనుకాని వాడును (క్రుంగిపోని వాడును) | మునిః | = మననశీలుడు |
| | | స్థితధీః | = స్థితప్రజ్ఞుడు |
| సుఖేషు | = సుఖములు కలిగినప్పుడు | ఉచ్యతే | = అనబడును. |
| విగతస్పృహః | = పొంగిపోనివాడును | | |

**దుఃఖేషు అనుద్విగ్నమనాః, సుఖేషు విగత-స్పృహః,**
**వీత-రాగ-భయ-క్రోధః మునిః స్థితధీః ఉచ్యతే ॥**

తా: దుఃఖములందు సంక్షోభము చెందని మనస్సు గలవాడు, సుఖములందు పొంగిపోనివాడును, తొలగిపోయిన ఆసక్తి, భయము, క్రోధముగల మననశీలి స్థితప్రజ్ఞుడనబడుచున్నాడు.

జ్ఞాని పరిస్థితులకు ఎలా స్పందిస్తాడు; అది కూడా ప్రతికూల పరిస్థితులకు ఎలా స్పందిస్తాడు? దీన్నిబట్టి జ్ఞానికి కూడా ప్రతికూలపరిస్థితులు తప్పవని అర్థమవుతున్నది. జ్ఞానియైనా, అజ్ఞానియైనా ప్రారబ్ధకర్మతో పుడతాడు. నిజానికి మనం ప్రారబ్ధకర్మవల్లనే పుట్టాము. మరణించేవరకూ ఆ ప్రారబ్ధకర్మవల్ల కలిగే పుణ్యపాపాలు అనుభవించక తప్పదు. జ్ఞాని అకర్తా, అభోక్తాగా పనిచేస్తాడు కాబట్టి కొత్తగా వచ్చే ఆగామికర్మలు అంటవు. కాని జ్ఞానం పొందకముందు చేసిన కర్మఫలాలు అతనికి అనుకూల పరిస్థితులుగానో, ప్రతికూల పరిస్థితులుగానో వస్తాయి. అలా వచ్చినప్పుడు అతను ఎలా ఉంటాడు?

అనుద్విగ్నమనాః -చలించని మనస్సుకలవాడు. జ్ఞాని మనస్సు ఎంత బలంగా ఉంటుందంటే, అతనికి జ్ఞానమనే షాక్అబ్సార్బర్ ఉంది. అందువల్ల అతను చలించడు. మనస్సు గట్టిగా ఎలా అవుతుంది? ఆ మార్పు రాత్రికి రాత్రి రాదు. అది నెమ్మదిగా జరుగుతుంది. గీతాశాస్త్రం మీకు వంటబట్టిందో లేదో పరీక్షించుకోవాలంటే ఏం చేయాలి? స్వామీజీ దానికొక పరీక్షను సూచిస్తారు. దాన్ని FIR అంటారు. అవి Frequency, Intensity, Recovery time. అంటే వరుసగా ఎంత తరచుగా కోపం వస్తోంది, దాని తీవ్రత ఎంత, ఎంత త్వరగా కోపంనుంచి బయటపడతారు అనేది పరీక్ష చేసుకోవాలి.

మళ్ళీ ఒక హెచ్చరిక. ఈ జ్ఞాననిష్ఠా సూచికను మీమీద ప్రయోగించుకోండి, కాని మీ స్నేహితులు లేదా కుటుంబసభ్యులమీద ప్రయోగించకండి. అది దుర్వినియోగం చేయటమవుతుంది. మీ ఆత్మపరీక్షకు పనికి వస్తుంది.

**ఎ). ఎంత తరచు కోపం వస్తోంది?** కోపం అంటే కోపం ఒక్కటే కాదు, భావోద్రేకాలు. ఎంత తరచు కోపమో, చిరాకో వస్తోంది? ఇది గమనించటానికి ఒక డైరీ కూడా పెట్టుకోవచ్చు. కాకపోతే మొదట్లో ఎంతసేపు మీరు ప్రశాంతంగా ఉన్నారో రాసుకోవటం తేలిక. ఎందుకంటే చాలామందికి చిరాకుపడే సందర్భాలు ఎక్కువ, ప్రశాంతంగా ఉండే సమయం తక్కువగా ఉంటుంది. చిన్న కారణం దొరికితే చాలు విరుచుకుపడిపోతారు. వారు ఏ ధ్యానంలోనో కూర్చున్న కాసేపే తక్కినవారికి ప్రశాంతత. వారు కొడుకుమీద, భార్యమీద, పనివాడిమీద, కొత్తవ్యక్తిమీద – అందరిమీదా విరుచుకుపడుతూనే ఉంటారు. దాన్ని నెమ్మదిగా తగ్గించు కోవాలి.

**బి). దాని తీవ్రత ఎంత?** మనసు చికాకు పడినప్పుడు దాని తీవ్రత ఎంత ఉందో ఎలా తెలుస్తుంది? దాని తీవ్రత తక్కువ ఉంటే, అది మనస్సులో చిన్న అలజడి రేపి, సద్దుమణిగి పోతుంది. కాని దాని తీవ్రత ఎక్కువై నప్పుడు వాగింద్రియానికి పాకి, మాటల తూటాలు వదిలేలా చేస్తుంది. ఇంకా తీవ్రరూపం దాలిస్తే, వాగింద్రియాన్ని కూడా దాటి స్థూలశరీరాన్ని కూడా చలింపజేస్తుంది. శరీరం వణుకుతుంది, కోపంతో రొప్పుతుంది, కొంతమంది పళ్ళు పటపటా కొరుకుతారు, పెదవులు వణుకుతాయి. అర్జునుడు చెప్పాడు కదా!

**సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।**
**వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥** – 1.29

తీవ్రత స్థాయినిబట్టి మనస్సు ఒక్కటే బాధపడుతుంది; లేదా వాగింద్రియానికి కూడా చేరుతుంది; మరీ ఎక్కువ ఉంటే శరీరం కూడా కంపిస్తుంది.

**సి). ఎంత త్వరగా కోపంనుంచి బయటపడతారు?** ఏదైనా ప్రతికూలపరిస్థితి ఏర్పడినప్పుడు, మళ్ళీ మీరు మామూలు మనిషి కావటానికి ఎంత సమయం తీసుకుంటారు? తీవ్రత ఎక్కువ ఉంటే, అది తగ్గటానికి ఎక్కువ సమయమే పడుతుంది. అసలు బలహీనతే బలంగా ఉంటే, అది తగ్గకపోగా, అది చాలా తీవ్రరూపం దాలుస్తుంది. కొంతమందికి ఒక రోజంతా కోపం ఉంటే, కొంతమందికి ఒక ఏడాది, కొంతమందికి పది సంవత్సరాలు ఉంటుంది. కొంతమంది అయితే జీవితాంతం ఆ కోపాన్ని పోషిస్తారు. వారికి అది తగ్గనే తగ్గదు. జ్ఞానం భావోద్రేకాలను బలహీనపరచి, మనస్సును దిటవు పరిస్తే ఈ మూడూ తగ్గుతాయి.

**3. దుఃఖేషు అనుద్విగ్నమనాః** – సమత్వం పాటిస్తాడు. జ్ఞాని దుఃఖం వస్తే కృంగిపోడు. మనస్సు బలంగా ఉంటుంది. మనస్సు ప్రతికూల పరిస్థితులకే కాదు, సానుకూల పరిస్థితులకు కూడా తీవ్రంగా స్పందించవచ్చు. ప్రతికూల పరిస్థితుల్లో మనస్సు పాతాళంలోకి కృంగిపోతే, సానుకూల పరిస్థితుల్లో మనస్సు ఆకాశాన్ని అందుకుంటుంది. రెండూ ప్రమాదమే. ఒకవ్యక్తి ఎన్నికల్లో ఎన్నిసార్లు నిలుచున్నా ఓడిపోతూనే ఉన్నాడు. అలా విసుగుచెందని విక్రమార్కుడిలా ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. 27 సార్లు ఓడిపోతూనే ఉన్నాడు. కాని 28వ సారి గెలిచాడు. అతను ఆ గెలుపు వస్తుందనుకోలేదు. ఆ ఆనందాన్ని తట్టుకోలేక గుండెపోటు వచ్చి మరణించాడు. అందువల్ల గుండెపోటు చెడు సంఘటనలకే వస్తుందనుకోనవసరం లేదు. శరీరం రెండు విపరీత భావనలనూ తట్టుకోలేదు. జ్ఞాని ఎవరు?

**సుఖేషు విగతస్పృహః** – సానుకూల పరిస్థితులు వచ్చినా, పొంగిపోడు. ఎందుకు? సానుకూల పరిస్థితులు వస్తే అనుభవించవచ్చు, తప్పులేదు. కాని దానికి కూడా రాకపోకలు ఉన్నాయనే విషయం మర్చిపోడు. మనం సత్యాన్ని మర్చిపోకూడదు. విచక్షణాశక్తి కోల్పోతే, మోహంలో పడిపోతాము. జీవితంలో ప్రతిపరిస్థితి కూడా రాకపోకలకు గురి అవుతుంది అని విచక్షణాశక్తి చెబుతుంది.

**4. వీతరాగభయక్రోధః** – రాగం, భయం, క్రోధాలనుంచి విడివడతాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే ప్రాథమిక భావోద్రేకాలు లేని వ్యక్తి. మొదటిది రాగం. దీన్ని బంధకత్వం అంటారు. ఇది ప్రాథమిక సమస్య. జ్ఞానికి బంధకత్వం ఉండదు. ప్రేమ మంచిగుణమే దాన్ని వేదాంతం కూడా స్తుతిస్తుంది కాని, ఆ ప్రేమలో బంధకత్వం చూపిస్తే విమర్శిస్తుంది. ప్రేమకు, బంధకత్వానికీ మధ్య రెండు భేదాలు ఉన్నాయి.

**ఎ).** బంధకత్వం బలహీనమైన మనస్సువల్ల ఏర్పడుతుంది. బంధం పెంచుకుంటే ఆ అనుభవంనుంచి ఎప్పుడూ నేను ప్రేమను ఆశిస్తాను. ఎదుటివ్యక్తి నానుంచి ఏం పొందుతాడో నాకనవసరం; నాకేం లాభమో చూస్తాను. అంటే ఎంతసేపూ నావైపే ఆలోచిస్తాను. ఇది బలహీనత బలంగా ఉన్న మనస్సు పరిస్థితి. మనస్సు బలంగా ఉంటే అనుబంధం రెండువైపులా ఆలోచిస్తాను. ఒక్కముక్కలో చెప్పాలంటే ప్రేమలో నేనేం ఇవ్వగలను అని చూస్తే బంధకత్వంలో నేనేం పొందగలను అని ఆశిస్తాను.

**బి).** బంధకత్వంలో నేను ఎదుటి మనిషినుంచి ప్రేమను ఆశిస్తున్నాను కాబట్టి, అతన్ని నా స్వాధీనంలో ఉంచు కోవాలని చూస్తాను. ఈ అతి ప్రేమ అతని స్వేచ్ఛను అణగద్రొక్కుతుంది. ప్రేమలో అలా కాదు, నేనెలా స్వేచ్ఛగా ఉండాలనుకుంటానో, అలా నన్ను ప్రేమించే వ్యక్తికి కూడా తన వ్యక్తిత్వం ఉండాలనీ, తను స్వేచ్ఛగా ఉండాలనీ ఆశిస్తాను. ఒక్కముక్కలో చెప్పాలంటే బంధకత్వంలో ప్రేమ బంధిస్తే, ప్రేమలో ప్రేమ స్వేచ్ఛనిస్తుంది.

రాగం అంటే బంధకత్వం. సంసారంలో ఇది మొట్టమొదటి గుణం. మొదటి అధ్యాయంలో సంసారం అంటే రాగం, శోకం, మోహం అని చూశాము. ఇక్కడ కృష్ణపరమాత్మ సంసారాన్ని రాగం, భయం, క్రోధం అంటున్నాడు. సంసారానికి ఇవి ఇంకో మార్గం.

రాగం అంటే బంధకత్వం అని చూశాము – రాగం భయానికి దారితీస్తుంది. రాగంవల్ల ఒక వ్యక్తి లేదా ఒక వస్తువుమీద ఆధారపడతాము. ఎంత ఎక్కువ ఆధారపడితే అంత ఎక్కువ అభద్రతా భావన పెరుగుతుంది. భగవంతుడు తప్ప, ఈ జగత్తులో ఏదీ భద్రతనివ్వలేదు. మనం చేసే ప్రాథమిక తప్పు భద్రతలేని మనం భద్రతకోసం భద్రతలేని ఇంకోదానిమీద ఆధారపడుతున్నాము. అభద్రత+అభద్రత=ఎక్కువ అభద్రత. అది భద్రతనిస్తుందని ఏ లెక్క ప్రకారం అనుకుంటున్నాము? మన సమస్యలను మనం పరిష్కరించుకోలేక పోవటానికి కారణం, ప్రయత్నలోపం కాదు; దిశానిర్దేశం లేక. మహారాజును కలుసుకోవాలని గంటల తరబడి నడిచి, రాజును చేరుకోలేకపోయానని మనను మనం తిట్టుకుని, భగవంతుణ్ణి నిందిస్తే లాభం లేదు. మనం వెళ్ళింది రాజు ఉన్న మార్గం వైపు కాదు. ఇంకోవైపు వెళ్ళితే, ఎంత ప్రయత్నం చేసినా రాజును చేరుకోలేము సరికదా, గమ్యంనుంచి అంతకంతకు దూరమవుతాము.

ప్రయత్నం పదంలో యత్నం అంటే శ్రమపెట్టటం. ప్ర అంటే సరియైన దారి. అందువల్ల ప్రయత్నం అంటే సరియైన దారిలో సరియైనంత మేరకు యత్నం. భద్రత కావాలంటే చింతచెట్టు కొమ్మను పట్టుకోవాలి కాని, ములగ కొమ్మను కాదు. చింతచెట్టు కొమ్మ భగవంతుడు. ఎప్పటికీ భద్రతనిచ్చే భగవంతునిలో భద్రతను కనుగొనాలి. కాని భగవంతునిలో భద్రతను వెతుక్కోక, భద్రతలేని వస్తువుల్లో వెతుక్కుంటున్నాము. నీళ్ళలో మునిగిపోతున్న వ్యక్తి గడ్డిపోచను పట్టుకున్నట్టు ఉంటుంది అది. దీన్ని రాగం అంటారు. అజ్ఞానంతో ఆధార పడటాన్ని రాగం అంటారు. రాగం, భయానికి దారితీస్తుంది.

**యత్ర యత్ర రాగః తత్ర తత్ర భయః**

ఈ భయం నిరంతరం కొనసాగుతుంది. చిన్న టెలిగ్రాం వస్తే భయంతో గుండెజారిపోతుంది. మంచి ఆలోచనే రాదు.

భయం క్రోధానికి దారితీస్తుంది. రాగం ఎంత తీవ్రంగా ఉంటే క్రోధం అంత తీవ్రంగా ఉంటుంది. దేన్నైనా గట్టిగా పట్టుకోవాలనుకుంటే ఏదో చిన్న ఆటంకం వస్తుంది. దాంతో మనకు కోపం తీవ్రరూపం దాలుస్తుంది. ఒక వ్యక్తి మనతో ఉండాలనుకుంటే అతను మననుంచి పారిపోదామనుకుంటాడు, దాంతో మనకు కోపం వస్తుంది. అలా రాగం భయానికి, భయం క్రోధానికి దారితీస్తుంది. ఈ మూడూ అన్నదమ్ములలాంటివి. జ్ఞాని రాగానికి అతీతుడు అవుతాడు కాబట్టి, అతనికి భయం ఉండదు.

**అభయం ప్రతిష్ఠాం విన్దతే**

మోక్షం అంటే వేరే లోకానికి వెళ్ళటం కాదు. మోక్షాన్ని అభయంగా నిర్వచిస్తుంది శాస్త్రం.

**యదా హ్యేవైష ఏతస్మిన్నదృశ్యేఽనాత్మ్యేఽనిరుక్తే**
**ఽనిలయనేఽభయం ప్రతిష్ఠాం విన్దతే** – తైత్తిరీయమ్ 2.7

ఆత్మ అజ్ఞానం ఉన్నంతవరకూ భయం తప్పదు. ఆత్మజ్ఞానం ఒక్కటే మార్గం అభయం పొందటానికి. జ్ఞాని నాలుగవ లక్షణం – రాగం, భయం, క్రోధాలు లేనివాడు.

రాగం, భయం, క్రోధాలు తొలగిపోతాయి అంటే ఎంత అద్భుతం! గీత నేర్చుకుంటే, ఇంతమంచి లాభం కలుగుతుందంటే, వెంటనే నేర్చుకోవాలనే ఆశ కలగదూ? పైగా ఇవి తొలగిపోయి, నిశ్చింతగా జీవన్ముక్తిని అనుభవిస్తున్న జ్ఞానిని వర్ణిస్తున్నాడు.

**స్థితధీర్మునిరుచ్యతే** – ఇలా రాగం, భయం, క్రోధాలను వీడిన వ్యక్తిని స్థితప్రజ్ఞుడు అంటారు. అటువంటి వ్యక్తిని ముని అంటారు. ముని అంటే అడవిలో ఉండి, జటాఝూటాలు ధరించి, కళ్ళు మూసుకుని తపస్సు చేసే వ్యక్తి మాత్రమే కాదు. బాహ్యంగా మార్పు కాదు, ఆంతర్గత మార్పు రావాలి. అటువంటి మార్పు వస్తే సంసారబంధం నుంచి విముక్తుడవుతాడు. అతను సంసారం మధ్యలో ఉంటాడు; వ్యవహారాలు నడుపుతాడు కాని ముని అవుతాడు. మననాత్ మునిః. సరియైన జ్ఞానం ఉన్న వ్యక్తి ముని.

అతను ముని ఎలా అయ్యాడు? స్థితధీః. తన జ్ఞానంవల్ల. ఎటువంటి జ్ఞానం? అతనికి మానసిక స్థైర్యం ఇచ్చే జ్ఞానం. స్థితధీః, స్థితప్రజ్ఞకు ఇంకొక పదం. అతను బుద్ధిపరంగా జ్ఞాని; మనస్సు పరంగా స్థితప్రజ్ఞుడు. ఆత్మజ్ఞానం కేవలం నమ్మకం కాదు, జ్ఞానంలో స్పష్టత ఉంటుంది. అందువల్ల ఎవరన్నా అతని జ్ఞానాన్ని ప్రశ్నించినా కూడా దాన్ని బుద్ధిపరంగా వివరించగలడు. అలాగే మనస్సుపరంగా భావోద్రేకాలకు అతీతుడు అవుతాడు కాబట్టి మానసిక ప్రశాంతతను పొందుతాడు.

శ్లో. 57 **యః సర్వత్రానభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభమ్ ।**
**నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**
యః, సర్వత్ర, అనభిస్నేహః, తత్, తత్, ప్రాప్య, శుభాశుభమ్,
న, అభినందతి, న, ద్వేష్టి, తస్య, ప్రజ్ఞా, ప్రతిష్ఠితా ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవరైతే | న, అభినందతి | = ప్రసన్నుడు కాడో |
| సర్వత్ర | = అంతటా | న, ద్వేష్టి | = ద్వేషింపడో |
| అనభిస్నేహః | = మమతాసక్తులు లేనివాడై | తస్య | = అతనియొక్క |
| తత్, తత్ | = ఆ యా | ప్రజ్ఞా | = బుద్ధి |
| శుభాశుభమ్ | = శుభాశుభములను | ప్రతిష్ఠితా | = స్థిరమైయుండును |
| ప్రాప్య | = పొంది | | |

**యః సర్వత్ర అనభిస్నేహః, తత్ తత్ శుభ-అశుభం ప్రాప్య।**
**న అభినందతి, న ద్వేష్టి, తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా॥**

తా: ఎవరైతే సర్వమునందు మమతాసక్తులు లేనివాడై ఉండునో, ఆయా శుభ-అశుభములను పొంది అభినందించడో ఇంకా ద్వేషించడో, అటువంటివాని ప్రజ్ఞ ప్రతిష్ఠితమైనది (అతడు స్థితప్రజ్ఞుడు).

ఇంకా స్థితప్రజ్ఞ లక్షణాలను వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**5. సర్వత్ర అనభిస్నేహః** – దేనిమీదా మమతాసక్తులు లేని వ్యక్తి. ఏ వ్యక్తితోనూ, ఏ పరిస్థితిలోనూ, ఏ వస్తువుతోనూ బంధం పెంచుకోడు జ్ఞాని. అజ్ఞానికి శరీరమంతా జిగురు ఉన్నట్టుగా ఉంటుంది. ఎందుకంటే ఎక్కడికి వెళితే అక్కడ అతుక్కుపోతాడు. స్నేహః అంటే సంస్కృతంలో రెండు అర్థాలున్నాయి. ఒకటి జిగురు (గమ్), ఇంకొకటి స్నేహం. మనం వాడుకలో జిడ్డులా అతుక్కుపోయాడు, ఎంతకీ పోవటం లేదు అంటాము.

మనకు వ్యక్తిమీదే కాదు, వస్తువుమీద కూడా మమకారం ఉంటుంది. పదిరోజులు ఒక ప్రసంగానికి వెళితే, రోజూ ఒకేచోటులో కూర్చుంటాము. వేరే ఎవరైనా కూర్చున్నా లేపుతాము. అక్కడ కూర్చుని వింటేనే బాగా అర్థమవుతుంది అంటాము. అలాగే కాఫీ మనస్సుకు ఇష్టమని తాగటం మొదలుపెడితే, అది శారీరక అవసరంగా మారుతుంది నెమ్మదిగా. కాఫీ తాగకపోతే తలనెప్పి వస్తుంది. అదీ మన పరిస్థితి. ప్రతివస్తువుతోనూ, ప్రతివ్యక్తితోనూ జిగురువేసి అంటించినట్టు అతుక్కుపోతాము.

పూర్వం పరమహంస పరివ్రాజకాచార్యులు ఉండేవారు. వారు అందరితోనూ మాట్లాడతారు కాని, ఎవరితోనూ అనుబంధం పెంచుకోరు. ఒకచోటునుంచి ఇంకొకచోటుకి తిరుగుతుంటారు. ఈ మానసిక స్వేచ్ఛనే అనభిస్నేహత్వం అంటారు. కొన్ని యంత్రాలకు స్క్రూలు ఉంటాయి. వాటిలో కొన్నిటిని విడదీయవచ్చు, కొన్నిటిని విడదీయలేము. జ్ఞాని విడదీయగలిగిన స్క్రూలాంటి వ్యక్తి. అతను ఎవరితోనైనా కలవగలడు, ఎవరినుంచైనా విడిపోగలడు. అందరితో కలుపుగోలుగా సంభాషిస్తాడు. ఎవరినీ మిస్సవడు. ఎవరైనా నన్ను మిస్సవుతున్నావా అంటే, అతని మనస్సు కష్టపెట్టకూడదని అవుతున్నాను అంటాడే కాని నిజంగా అవడు. అందువల్ల సర్వత్ర అనభిస్నేహః.

**తత్తత్ ప్రాప్య శుభాశుభమ్** – శుభం వచ్చినా, అశుభం వచ్చినా చలించడు. ఈ అంశం కూడా చాలా ముఖ్యం. జ్ఞానికి కొత్తగా పుణ్యపాపాలు అంటకపోవచ్చు కాని, అతను జ్ఞానం పొందకముందు అజ్ఞాని. ఈ జన్మలోనూ, అంతకుముందు జన్మల్లోనూ సంసారి. అందువల్ల ప్రారబ్ధకర్మ ఇంకా ఉంటుంది. తిరుగుతున్న ఫ్యానును ఆపాక కూడా కొంతసేపు తిరిగి అప్పుడు ఆగుతుంది. అందువల్ల జ్ఞానికి జ్ఞానం పొందాక కూడా ప్రారబ్ధకర్మ ఉంటుంది. అంటే జ్ఞాని కూడా తనకు అనుకూలమైన పరిస్థితులనూ, ప్రతికూలమైన పరిస్థితులనూ అనుభవించక తప్పదు. వీటిని శుభాశుభం ప్రాప్య అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శుభం అంటే అనుకూలపరిస్థితులు; అశుభం అంటే ప్రతికూలపరిస్థితులు. కొంతమంది జ్ఞానిని మెచ్చుకుంటే, మరికొంతమంది జ్ఞానిని విమర్శిస్తారు. సమాజానికి గొప్ప సేవ చేస్తున్నావని కొంతమంది అంటే, వేదాంతం చెప్పి సమాజాన్ని చెడగొడుతున్నావు అంటారు మరికొందరు. అంతేకాదు, ఆరోగ్యం బాగుంటుంది, ఆరోగ్యం కుంటుపడుతుంది. అయినా అతని దృక్పథం ఏమిటి?

**నాభినందతి న ద్వేష్టి** – అనుకూల పరిస్థితులు వస్తే ఆనందం చూపించడు; ప్రతికూలపరిస్థితులు వస్తే ద్వేషం పెంచుకోడు. దీన్ని అంతకుముందు చూసిన **సమత్వం** అనవచ్చు. అందువల్ల ఈ శ్లోకం ఇంచుమించుగా ముందు శ్లోకంలాంటిదే.

కాని ఇక్కడ ఒక విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి. జ్ఞాని ఎటువంటి పరిస్థితులకూ కృంగిపోడు; ఎవరేమన్నా చలించడు అంటే దీన్ని చాలామంది అపార్థం చేసుకుంటారు. ఎటువంటి పరిస్థితి వచ్చినా చలించకూడదు అనేసరికి, ఎదుటివ్యక్తి దీన్ని అవకాశంగా తీసుకుని, మన నెత్తికెక్కి తొక్కుతాడు అంటారు వారు. ఎవరేమన్నా చలించకూడదు అంటే, అది మంచితనంలా కనబడకుండా చవటతనంలా కనబడే అవకాశం ఉంది అంటారు. అంతకుముందు ఎవరేమంటే వారికి ధీటుగా జవాబిచ్చాను కాబట్టి వారు తగ్గేవారు; ఇప్పుడు మీరేమన్నా అనండి నేను బదులుచెప్పను, నవ్వుతూ స్వీకరిస్తాను, మిమ్మల్ని నిందించను అంటే వెర్రివానిగా జమకట్టే అవకాశం ఉంది. అందువల్ల మంచివాడు అనకుండా, వెర్రివాడు అనరా?

వేదాంతం ఎన్నడూ ప్రతికూల పరిస్థితులను, విమర్శలను నోరు మూసుకుని స్వీకరించమని చెప్పదు. ఎక్కడిదాకానో ఎందుకు, భగవద్గీతలోనే కృష్ణపరమాత్మ అర్జునునికి ఏం చెబుతున్నాడు? అధర్మాన్ని సహించకు, యుద్ధం చేయి అర్జునా అంటున్నాడు. వేదాంతం అంటే ఎదుటివారు చేసిన అక్రమాన్ని కాని, అధర్మాన్ని కాని

మారుమాట్లాడకుండా స్వీకరించటం కాదు. అయితే వేదాంతం ఏం చెబుతున్నది? ఏ పరిస్థితి వచ్చినా, దానికి మూడు రకాల స్పందనలు చూపించే అవకాశం ఉంటుంది.

**ఎ). అసంకల్పిత చర్య** – ఏదైనా జరిగితే, అసంకల్పితంగా ప్రతిస్పందించటం. అంటే వెంటనే స్పందించేయటం. ఈ స్పందనలో ఆలోచన ఉండదు; ఆలోచించే తీరికే ఉండదు; బుద్ధిని ఉపయోగించే ప్రసక్తి అసలే లేదు; మంచిచెడులు బేరీజు వేసే తీరిక లేదు. అప్పుడేది తోస్తే అది అనేయటం.

**బి). నిస్సహాయంగా స్వీకరించటం** – ఎదుటివారు ఏమన్నా నిస్సహాయంగా స్వీకరించటం. వారు అన్నమాటను మౌనంగా పడి, ఎదురుతిరిగి ఏమీ చేయకపోవటం. ఇది తెలివితక్కువ పని.

సాధారణంగా ఈ రెండింటిలో ఏదో ఒక స్పందన చూపిస్తాము మనం. రెండూ రెండు విపరీతమైన స్పందనలు. ఒకదానిలో బొత్తిగా మనస్సును ఉపయోగించకపోతే, ఇంకొకదానిలో మనస్సు బలహీనమైపోతుంది. వేదాంతం రెండు రకాల స్పందనలూ మంచివి కావు అంటుంది. ఎందుకు? తీవ్రంగా స్పందించటంవల్ల ఎదుటివ్యక్తి భయపడిపోయి, మనకు కావాల్సిన పనులు చేయవచ్చేమో కాని, అది మన శారీరక ఆరోగ్యానికి పెద్ద ముప్పు తెచ్చిపెడుతుంది. ఈ స్పందన మనం వేసుకునే ఏంటీబయాటిక్స్‌లాంటిది. ఏంటీబయాటిక్స్ వేసుకుంటే, వెంటనే రోగం తగ్గవచ్చేమో కాని, కాలక్రమేణా అనేక సైడ్‌ఎఫెక్ట్స్ వస్తాయి. ఇదీ అంతే. వెంటనే మన పని అవవచ్చేమో కాని, కాలక్రమేణా మన ఆరోగ్యం దెబ్బతింటుంది. మనస్సు దెబ్బతిని, ఒత్తిడికి గురై, అది శారీరక రుగ్మతకు దారితీస్తుంది. అందువల్ల ఇది బలమైన స్పందనగా కనిపించినా, బలహీనత కిందే వస్తుంది. మనకు మనోనిగ్రహం లేనట్టు తెలుస్తుంది. అలాగని ఎదురు తిరగకుండా, రెండవ పద్ధతి ప్రకారం నిస్సహాయంగా స్వీకరిద్దామా అంటే అది కూడా తప్పే అంటున్నది శాస్త్రం. అధర్మాన్ని మౌనంగా స్వీకరించకూడదు. అయితే ఏం చేయాలి?

**సి) తెలివిగా స్పందించటం** – శాస్త్రం అటు అసంకల్పితచర్య చేయవద్దు, ఇటు నిస్సహాయంగాను స్వీకరించ వద్దు; ఆగి, బుద్ధిని ఉపయోగించి, కొంచెం సమయం వెచ్చించి, సరియైన నిర్ణయం తీసుకోవాలి అంటుంది. ముందు పరిస్థితిని బేరీజు వేయాలి – ఆ పరిస్థితికి పరిష్కారమార్గం ఉందా, లేదా? పరిష్కారం లేకపోతే, దాన్ని నవ్వుతూ స్వీకరించేటట్టుగా మనస్సును గట్టి పరచుకోవాలి. అదెలాగన్నది ముందు ముందు చూద్దాము. పరిష్కారం లేని పరిస్థితిని మార్చటానికి ప్రయత్నించకండి; దాన్ని మార్చలేమా అనకండి, దాని నిర్వచనమే మార్చలేని పరిస్థితి అని.

అందువల్ల తెలివిగా స్పందించండి. తెలివైన స్పందన అంటే పరిస్థితిని మార్చటానికి సమయాన్ని దుర్వినియోగం చేయకండి, మనస్సును దిటవుపరుచుకునే ప్రయత్నం చేస్తే, అది మనస్సును కృంగదీయదు. దీన్ని తెలివైన స్పందన అంటారు. పరిష్కారం ఉన్న పరిస్థితి అయితే, బాగా ఆలోచించి సరియైన నిర్ణయం తీసుకోవాలి. సామదానభేదదండోపాయాలు ఉన్నాయి కాని దండోపాయం చివరి పరిష్కారం. దండోపాయం ఉపయోగించాల్సి వచ్చిన పరిస్థితి వస్తే ఉపయోగించక తప్పదు. ముక్కుమీద గుద్దాల్సివస్తే, గురిచూసి గుద్దండి.

గురి తప్పకూడదు. కాని మొదటే దండోపాయం ఉపయోగించవద్దు అంటుంది శాస్త్రం. కోర్టు కూడా ఒక వ్యక్తికి ముందే ఉరిశిక్షను విధించదు. ఇరుపక్షాల వాదప్రతివాదనలు విన్నాక, సాక్ష్యాలను పరిశీలించాక, పరిస్థితిని బేరీజువేసి, అప్పుడు ఉరిశిక్ష వేస్తుంది. ఆ నిర్ణయానికి రావటానికి ఏడు సంవత్సరాలు పట్టవచ్చు, పది సంవత్సరాలు పట్టవచ్చు. అది జ్ఞాని లక్షణం.

కృష్ణపరమాత్మ జ్ఞాని. దుర్యోధనునితో అనేక మార్గాలు ప్రయత్నించి, అవి పనిచేయకపోతేనే ధర్మయుద్ధం తప్పదన్నాడు. అది తప్ప వేరే మార్గం లేదు. భీష్మద్రోణులు చెడువైపు తలవొగ్గితే, వారినీ శిక్షించక తప్పదు. ఇదీ స్పందన. అందువల్ల వేదాంతం మొదటి రెండు పద్ధతులనూ కాకుండా, మూడవ పద్ధతి పాటించమంటుంది. ఈ పద్ధతిలో రెండు దశలున్నాయి. పరిస్థితిని మార్చలేకపోతే, ధైర్యంగా దాన్ని స్వీకరించాలి. మార్చగలిగితే, మార్చటానికి సరైన కర్మ చేయాలి. పరిహారకర్మలు చేయాల్సివస్తే చేయవచ్చు, తప్పులేదు. శాస్త్రమే వాటిని సూచించింది. మార్చలేని పరిస్థితుల గురించి వాపోతూ కూర్చోకూడదు. ఇదీ స్థితప్రజ్ఞుని లక్షణం.

స్థితప్రజ్ఞుడు ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎందుకు చలించడు? ఏదీ శాశ్వతం కాదు అని తెలుసు కాబట్టి. ఆనందం వస్తే పొంగిపోడు ఎందుకంటే అది శాశ్వతం కాదు అని అతనికి తెలుసు. దుఃఖం వస్తే కృంగిపోడు ఎందుకంటే అదీ శాశ్వతం కాదు కాబట్టి. **ఇది కూడా వెళ్ళిపోతుంది.** ఈ సత్యం అతనికి తెలుసు. ఒక వ్యక్తి నానుంచి వెళ్ళిపోతే నా జీవితం నిరర్థకం అనుకుంటే ఆ భావనను **మేఘావృతభావన** అంటారు. అంటే అతని ఆలోచనాశక్తిని మమకారం అనే మేఘం కప్పివేసింది. దానివల్ల అతను సరిగ్గా ఆలోచించలేక పోతున్నాడు.

స్వామీ చిన్మయానంద అద్భుతంగా చెబుతారు: **మనమంతా ఈ భూమ్మీదకు ఒంటరిగా వచ్చాము, ఒంటరిగా ప్రయాణం చేయాలి, చివరకు ఒంటరిగానే ఈ భూమిని వదిలి వెళ్ళిపోవాలి.** వంటరితనంనుంచి వంటరితనానికి మన పయనం. జీవితమంటే ఏకాకిగా బ్రతకటం. నిజానికి మనలో ఒక రహస్యపు కోణం ఉంటుంది. కొన్ని భావాలను ఎంతో చనువుగా ఉన్నవారితో కూడా పంచుకోలేము. అలాంటప్పుడు ఎవరో లేకపోతే, జీవితం శూన్యం అనుకోవటం మేఘావృతభావనే. అన్నీ బాగుంటే దేవుణ్ణి, ధర్మాన్ని, ఆధ్యాత్మికతను కూడా మర్చిపోతాము. ఇది కూడా మేఘావృతభావనే. జ్ఞానిని ఏ మేఘం కప్పదు.

కర్మయోగి వేరు, జ్ఞాని వేరు. కర్మయోగికి కర్మయోగానికి సంబంధించిన జ్ఞానమే ఉంటుంది. అతను ఈశ్వరార్పణభావనతో కర్మ చేస్తాడు కాని తనే బ్రహ్మననే జ్ఞానం పొందడు. అందువల్ల జ్ఞాని అంటే జీవాత్మ-పరమాత్మ ఐక్యజ్ఞానం పొందిన వ్యక్తి. ఈ జ్ఞానాన్ని 12-25 శ్లోకాల్లో చూశాము. 54వశ్లోకంలో అటువంటి జ్ఞాని లక్షణాలేమిటని అర్జునుడు అడిగాడు.

జ్ఞాని పొందే జ్ఞానం ఏమిటి? నేను ఆత్మను, ఆత్మ అకర్తా అభోక్త, ఏకం, సర్వగతం, నిత్యం, సత్యం. నేను అటువంటి ఆత్మను అని తెలుసుకోవటం ప్రజ్ఞ అనీ, బుద్ధిలో పొందిన ఆ జ్ఞానాన్ని, మనస్సులో దింపుకుని ఆ జ్ఞాననిష్ఠలో నిలబడటాన్ని స్థితప్రజ్ఞత అంటారనీ చూశాము. అటువంటి స్థితప్రజ్ఞుని లక్షణాలు ఇంతవరకూ చెప్పుకొచ్చాడు కృష్ణపరమాత్మ. అవి మళ్ళీ టూకీగా చూస్తే -

| | |
|---|---|
| 1. **ఆత్మని ఏవ ఆత్మనా తుష్టః** | – తనలోనే తాను తృప్తి పడతాడు. |
| 2. **సర్వాన్ కామాన్ ప్రజహాతి** | – కోరికలను త్యజిస్తాడు. |
| 3. **దుఃఖేష్వనుద్విగ్నమనాః** | – సమత్వం పాటిస్తాడు. |
| 4. **వీతరాగభయక్రోధః** | – రాగం, భయం, క్రోధాలనుంచి విడివడతాడు. |
| 5. **సర్వత్ర అనభిస్నేహః** | – దేనిమీదా మమతాసక్తులు పెంచుకోడు. |

శ్లో. 58 **యదా సంహరతే చాయం కూర్మోఽంగానీవ సర్వశః ।**
**ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**
యదా, సంహరతే, చ, అయమ్, కూర్మః, అంగాని, ఇవ, సర్వశ,
ఇంద్రియాణి, ఇంద్రియార్థేభ్యః, తస్య, ప్రజ్ఞా, ప్రతిష్ఠితా ॥

| | | | |
|---|---|---|---|
| చ | = ఇంకా | ఇంద్రియార్థేభ్యః | = ఇంద్రియార్థములనుంచి |
| కూర్మః | = తాబేలు | ఇంద్రియాణి | = ఇంద్రియములను |
| సర్వశః | = అన్ని వైపులనుంచి | (సంహరతే) | = అన్ని విధముల ఉపసంహరించుకొనునో |
| అంగాని | = (తన) అంగములను | | |
| సంహరతే, ఇవ | = ముడుచుకొనునట్లు | తస్య | = (అప్పుడు) అతనియొక్క |
| యదా | = ఎప్పుడైతే | ప్రజ్ఞా | = బుద్ధి |
| అయమ్ | = ఈ పురుషుడు | ప్రతిష్ఠితా | = స్థిరమైనది (అని భావింపవలెను) |

**కూర్మ అంగాని ఇవ, యదా అయమ్ ఇంద్రియ–అర్థేభ్యః ఇంద్రియాణి సర్వశః సంహరతే, (తదా) తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా చ ॥**

తా: ఎప్పుడైతే ఇతను,తాబేలు అవయవములు వలె, అన్ని విధములుగా ఇంద్రియములను ఇంద్రియముల విషయములనుంచి ఉపసంహరించునో, వాని ప్రజ్ఞ స్థిరమైనది.

**i). స్థితప్రజ్ఞ సాధనలు–** ఇక్కడనుంచి కృష్ణపరమాత్మ తను చెప్పే అంశాన్ని మారుస్తున్నాడు. అది – బుద్ధిలో కలిగిన జ్ఞానంతో మనస్సులో రేగే భావోద్రేకాలను పారద్రోలి, మనస్థైర్యం ఎలా పెంపొందించుకోవాలి? ఇంతకుముందు శ్లోకంలో జ్ఞానాన్ని పొంది, ఆ జ్ఞాననిష్ఠలో నిలబడ్డ స్థితప్రజ్ఞుని లక్షణాలు చూశాము. ఇప్పుడు అలా జ్ఞాననిష్ఠలో నిలబడాలంటే, ఆ సాధకుడు ఏ సాధన చేయాలో చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ఆత్మజ్ఞానంవల్ల మనస్థైర్యం ఎలా పెంచుకోవాలో చెప్పటానికి మూడు సాధనలు చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. అవి – నిదిధ్యాసనం, ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం.

**1. నిదిధ్యాసనం** – అహమ్ ఆత్మ అస్మి, అహం పూర్ణః అస్మి, అహం శుద్ధః అస్మి, అహం నిత్యః అస్మి – జ్ఞానంలో ఈ విషయాలు నేర్చుకుంటాము. ఇన్నాళ్ళు మనం శాంతిభద్రతలు బాహ్యప్రపంచంలో పొందుతామని, పూర్ణత్వం వాటివల్లే వస్తుందనీ పొరపాటు పడుతూ వస్తున్నాము. అది పొరపాటు అనుకోలేదు ఎప్పుడూ.

ఇంతముందే చెప్పినట్టుగా, సిగరెట్టు కాల్చే అలవాటు ఉన్న వ్యక్తి, దానికి ఎంతగా బానిస అయిపోతాడంటే, సిగరెట్టు కాల్చకుండా ఉండలేని జీవితాన్ని ఊహించుకోలేడు. రెండు అంగుళాల వస్తువు, ఆరడుగుల వ్యక్తిని తనకు బానిస చేసుకుంది. సిగరెట్టు కాల్చకుండా లక్షలాది మనుష్యులు ఉన్నారంటే నమ్మలేడు; ఎవరిదాకానో ఎందుకు అతనే సిగరెట్టుకు బానిస అవకముందు నిక్షేపంగా లేడా? కాని అది ఒప్పుకోడు. ఎందుకు? అతను ఒక వ్యసన జీవనవిధానానికి అలవాటు పడిపోయాడు. ఆ అలవాటును ఎన్నడూ ప్రశ్నించడు. అలాగే మీరు కొన్ని వస్తువులు ఉంటేనో, కొంతమంది ఆప్యాయతలు ఉంటేనో జీవితం పరిపూర్ణంగా ఉంటుందనే అపోహలో ఉంటారు. వారు లేని జీవితం అసాధ్యం అనుకుంటారు. ఆ వాసన అంత బలంగా ఉంది. ఇప్పుడు ఆ వాసనను పారద్రోలాలి. ఎలా? నేను ఆనందంగా ఉండటానికి నాకా వస్తువులు, మనుష్యులు అవసరం లేదని పదేపదే మీ మనస్సుకు చెప్పుకోవాలి.

ఈ విషయం పరీక్షించుకోవటానికి, ఒంటరిగా ఎక్కడికన్నా వెళ్ళి వారం రోజులు ఉండి రండి. నిజానికి జంటగా వెళ్ళినదానికన్నా ఎక్కువ ఆనందం పొందినట్టుగా గ్రహిస్తారు. ఈ మాట వెనక్కి వచ్చాక ఇంట్లో చెప్పనవసరం లేదు. మీకు మీరు తెలుసుకుంటే చాలు. ఈ బూజు పట్టిన భావననుంచి బయటకు రండి. ఎవరూ లేకపోయినా ఆనందంగా ఉండగలరని అర్థం చేసుకోండి. శారీరక ఆరోగ్యంకోసం కూడు, గూడు, గుడ్డ అవసరమే, కాదనటం లేదు. కాని మానసిక ఆరోగ్యానికి ఎవరూ అవసరం లేదు. ఈ మాట పదేపదే వల్లె వేసుకోండి. దీన్ని నిదిధ్యాసనం అంటారు. మీ స్వేచ్ఛను మీరు ఒప్పుకోవటం.

తల్లి చేయి పట్టుకోందే నడవలేను అనుకుంటుంది పసిపాప; సైకిలు ఎవరో పట్టుకోకపోతే నడపలేను అనుకుంటాడు బాలుడు. కాని నెమ్మదిగా ఈ పనులు తమంతట తాము చేయటం నేర్చుకుంటారు పిల్లలు. ఇంకా పెద్దలమయిన మనమే ఆధారపడటం మానటం లేదు. ఆధారపడే అలవాటును చెదరగొట్టటమే నిదిధ్యాసనం. దీనికి వేదాంతం తోడ్పాటు ఉంది. వేదాంతం పదేపదే చెబుతుంది: నువ్వు శరీరానివి కాదు, శరీరానికి సహాయం కావాలి; నువ్వు మనస్సు కాదు; నువ్వు బుద్ధి కాదు; నువ్వు ఆత్మవు. ఆత్మ నిత్యం, పరిపూర్ణం, స్వతంత్రం. ఈ భావనలో నిలబడటమే నిదిధ్యాసనం.

అంటే వేదాంతబోధ వారానికి ఒకసారి విని ఊర్కోకూడదు. ఆ విన్నదాన్ని జీర్ణించుకోవాలి. గురువు బోధ చెయ్యగలడు కాని దాన్ని జీర్ణించుకునేది శిష్యుడే. దానికోసం కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. నిదిధ్యాసనం చేయటంకోసం మన గురువులు రాసిన ఎన్నో శ్లోకాలు ఉన్నాయి.

**మనోబుద్ధ్యహంకార చిత్తాని నాహం**
**న చ శ్రోత్రజిహ్వే న చ ఘ్రాణనేత్రే।**
**న చ వ్యోమ భూమిర్న తేజో న వాయుః,**
**చిదానందరూపః శివోఽహం శివోఽహమ్ ॥** – నిర్వాణషట్కమ్

ఇది ఒక సాధన.

**2. ఇంద్రియనిగ్రహం** – ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి. మనం నేర్చుకున్న ఆత్మజ్ఞానం స్థిరంగా నిలిచి, మనకు ఆత్మస్థైర్యం ఇచ్చేవరకూ, తీవ్రమైన రాగద్వేషాలకు లోనుకాకూడదు. తీవ్రమైన భావోద్రేకాలు వేదాంతాన్ని జీర్ణించుకోనివ్వకుండా అడ్డుపడతాయి. ఒక మొక్కను పాతినప్పుడు, మొదట్లో దాన్ని అపురూపంగా చూసుకోవాలి లేదా మేక వచ్చి దాన్ని తినిపోతుంది. ఆ మొక్క పెరిగి పెద్దవృక్షం అయ్యాక మేక కాదు కదా, పెద్ద ఏనుగును దానికి కట్టినా, అదేమీ చెయ్యలేదు ఆ వృక్షాన్ని. అలాగే జ్ఞానం పొందిన కొత్తలో దాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. కొత్తగా ఫ్లోరింగ్ వేసినప్పుడు, అది గట్టిపడేదాకా, దానిమీద ఎవరూ నడవకూడదు. అది గట్టిపడ్డాక, ఏనుగు నడిచినా ఏమీకాదు. జ్ఞానం గట్టిపడకముందు, మనస్సు ఏ కాస్త కలత చెందినా, అది జ్ఞానాన్నే చెదర గొట్టగలదు. అందువల్ల భావోద్రేకాలను అదుపులో పెట్టుకోవాలి. దానికి ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవాలి. ఎందుకు?

మనస్సుకు జగత్తులో ప్రత్యక్షంగా అనుబంధం లేదు. ఇంద్రియాలు ద్వారాలలాంటివి. వాటి ద్వారా బయట ప్రపంచంలోని విషయాలు మనస్సులోకి చొరబడతాయి. ఆ ద్వారాలు ఐదు – శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు. ఈ ఐదింటిలో ఏదైనా మీ మనస్సును చెదరగొట్టవచ్చు. మీ అబ్బాయి ఎక్కడికో వెళతానంటే, మీరు వద్దన్నారు. అయినా అతను వినకుండా నేను వెళ్ళితీరతానన్నాడు. వేదాంతపరిభాషలో అది కేవలం శబ్దం. కాని ఆ శబ్దం మీ మనస్సును కాలుష్యం చేస్తుంది. అతను అన్న రెండు మాటలను చిలవలు, పలువలు చేసి అతను అనని అర్థాలను ఊహించుకుని, ఎప్పుడెప్పుడో అతను మీమాట వినని సందర్భాలను గుర్తు తెచ్చుకుని అంతలా వాపోతారు. శంకరాచార్యులు కూడా అంత భాష్యం వ్రాయరు అంత చిన్నదానికి. అలా మూడు రోజులు బాధపడీ, పడీ డీలా పడిపోతారు. ఇదంతా దేనివల్ల జరిగింది? మీ అబ్బాయి అన్న రెండు మాటలవల్ల. అలా ఒక్కొక్క ఇంద్రియం మనస్సులో ఏదో దూర్చి, దాన్ని బాధిస్తుంది.

ఎన్నడూ వాదనలోకి దిగకూడదు. వాదనలు చాలా కలత చెందిస్తాయి. రాగద్వేషాలను, కామక్రోధాలను, లోభమోహాలను రెచ్చగొట్టే పని ఏదీ చేయకూడదు. ఎవరైనా వాదిస్తుంటే, మీరు భావోద్రేకానికి గురి అయ్యేటట్టుంటే, వారికి సున్నితంగా చెప్పి, వాదనలోకి దిగకుండా తప్పించుకోండి. చిన్మయానందస్వామి అంటారు, 'వాదనలో కాంతికన్నా వేడి పుడుతుంది'. కాంతి జ్ఞానానికి సంకేతం. వాదనలో ఎవరూ ఏమీ నేర్చుకోరు. మనం వాదిస్తున్నంతసేపూ, ఎదుటివ్యక్తి తనెలా వాదించాలో ఆలోచించుకుంటూ ఉంటాడు, మనమూ అంతే! నాకు వాదించటం ఇష్టంలేదని మీరు చెప్పినా, అతను ఇంకా వాదన కొనసాగిస్తుంటే, అక్కడనుంచి లేచి వెళ్ళిపోండి. దీన్ని ఇంద్రియనిగ్రహం అంటారు. దీన్నే దమం అని కూడా అంటారు.

**3. మనోనిగ్రహం** – మనోనిగ్రహం అంటే ఆలోచనాతీరును క్రమబద్ధం చేసుకోవటం. మీరు ఎవరితోనో మాట్లాడుతున్నారు, మీ ప్రమేయం లేకుండానే మాటలు వాదనలోకి దిగాయి. ఆ వాదనలో భాగంగా ఎదుటి వ్యక్తి నీకు బుద్ధిలేదు అన్నాడు. ఆ మాటతో మీ అహం దెబ్బతింది. మీరు అక్కడనుంచి లేచి వచ్చేశారు. కాని నీకు బుద్ధిలేదు మాట మీ చెవుల్లో పదేపదే గింగుర్లెత్తుతోంది. నాకు బుద్ధిలేదు అంటాడా, నాకు బుద్ధిలేదు అంటాడా! స్వయానా మా అబ్బాయి అలా అంటాడా! దీనికి అంతూ–పొంతూ ఉండదు.

ఆ సంఘటనలో మళ్ళీమళ్ళీ జీవించటంవల్ల కోపం ఇంతెత్తున పేరుకుపోతుంది. కోపమే కాదు, ఏ భావోద్రేకం అయినా సరే మనం పేర్చుకున్నదే.

ఏ సంఘటన కూడా ఏ భావననూ ఒక్కక్షణంలో ఏర్పరచలేదు. ఎంత దారుణమైన సంఘటన అయినా కూడా, మొదటిసారి విన్నప్పుడు, అది సమాచారం మాత్రమే. దానంతట అది ఏ భావననూ కలుగజేయదు. దానిమీద మనం పేర్చుకువస్తున్న ఆలోచనలు ఉద్రేకాన్ని కలుగజేస్తాయి. డబ్బంతా పోయింది, రేపెలా గడుస్తుంది; డబ్బంతా పోయింది, రేపెలా గడుస్తుంది? ఈ ఆలోచనమీద గంటలు, రోజులు, వారాలు నిలవటంతో అది చాలా శక్తివంతమైన భావోద్రేకాలకు దారితీస్తుంది. కోపం, నిరాశానిస్పృహలు, దుఃఖంలాంటి తీవ్రమైన భావనలన్నీ ఈ విధంగా ఏర్పడినవే.

ఒక్క ఆలోచన భావోద్రేకం కాదు. ఆలోచనల పరంపర భావోద్రేకం. ఆలోచనల పరంపర మన చేతుల్లో ఉంది. దాన్ని తలచుకుంటే ఆపగలశక్తి మనకుంది. దీన్నే మనోనిగ్రహం అంటారు. ఒక సంఘటన భావోద్రేకాలను కలుగజేసేటట్టయితే, దాని గురించిన ఆలోచనలను పక్కకు నెట్టేసి, మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు, దాన్ని పైకి తీసి, దాన్నుంచి విలువైన పాఠాన్ని నేర్చుకుని, మళ్ళీ మర్చిపోవాలి. మనస్సును వేధించే ఆలోచనలమీద ఎక్కువ సమయం గడపకూడదు. దీనిని మనోనిగ్రహం అంటారు.

ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం పాటిస్తే, మనస్సు కలత చెందదు; ప్రశాంతంగా ఉన్న సుప్తచేతన మనస్సులోకి ఈ జ్ఞానం ఊరుతుంది. మనం నేర్చుకున్న జ్ఞానం మన అణువు అణువులోనూ ప్రవేశించాలి. అప్పుడే అది మన జీవితాన్ని మార్చివేస్తుంది.

**స్థితప్రజ్ఞకు మూడు సాధనలు – నిదిధ్యాసనం, ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం.**

**ఇంద్రియనిగ్రహం –** ఈ మూడింటిలో కృష్ణపరమాత్మ ముందు ఇంద్రియనిగ్రహం గురించి చెబుతున్నాడు. అది 58–61 శ్లోకాల్లో వస్తుంది. ఈ సాధన ఎవరికి? జ్ఞానం పొంది, ప్రజ్ఞ పొంది కూడా స్థితప్రజ్ఞుడు కాని వ్యక్తికి. స్థితప్రజ్ఞుడు అంటే జ్ఞాననిష్ఠలో ఉన్న వ్యక్తి అని చూశాము. స్థితప్రజ్ఞునికి ఇంద్రియనిగ్రహం అవసరం లేదు. ఎందుకు? అతని జ్ఞానం ఎంత స్థిరంగా ఉందంటే, అతను బలమైన వృక్షంలా మారతాడు.

ఇక్కడ ఇంద్రియనిగ్రహం పాటించటానికి కృష్ణపరమాత్మ తాబేలు ఉదాహరణనిస్తున్నాడు. జంతువులకు కొమ్ములో, గోళ్ళో ఏదో ఒకటి ఉంటుంది, తమను తాము రక్షించుకోవటానికి. కాని తాబేలుకు యుద్ధం చేయటానికి ఏ ఆయుధమూ లేదు. అందువల్ల అది తేలికగా చనిపోయే ప్రమాదముంది. అలా కాకుండా ఉండటానికి, భగవంతుడు దానికి రక్షణ కవచాన్నిచ్చాడు. దాని పైభాగం గట్టిగా ఉంటుంది. అది యథేచ్ఛగా సంచరిస్తూ, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఉంటుంది. కాని ఏ కాస్త ప్రమాదాన్ని ఆమడదూరంలో పసికట్టినా, తక్షణం తన నాలుగుకాళ్ళను, తలను ఆ రక్షణకవచంలోకి లాగేసుకుంటుంది. ఐదు సంఖ్య ముఖ్యం. ఎందుకంటే, ఈ ఐదూ మన ఐదు జ్ఞానేంద్రియాలకు సంకేతం. అలా ప్రమాదం మాయమయ్యేవరకూ తల దాచుకుని, తరువాత బయటకు తెచ్చి, మళ్ళీ ప్రయాణం కొనసాగిస్తుంది.

స్థితప్రజ్ఞతకు రాని జ్ఞాని, అలా తాబేలులాగా, ప్రమాదం పసిగట్టగానే ఆ సన్నివేశంలో ముడుచుకుపోవాలి. రాగద్వేషాలు, కామక్రోధాలు తొంగిచూసే అవకాశం కనిపించగానే, అంటే తనకు సహజంగా వాదనలోకి దిగని మనస్తత్వం ఉన్నా, ఎదుటివ్యక్తి వాదనలోకి లాగుతున్నట్టు తెలియగానే వెనుకంజ వెయ్యాలి. లేకపోతే అతని పరిస్థితి టూత్‌పేస్ట్‌లాగా అయిపోతుంది. టూత్‌పేస్ట్ ఒకసారి బయటకు వస్తే, దాన్ని ఎంత ప్రయత్నించినా లోపలికి తోయలేము. అలాగే ఒకసారి వాదనలోకి దిగితే, దానిలోంచి బయటపడటం చాలా కష్టం. కావాలంటే ఇవాళ సాయంకాలమే ప్రయత్నించి చూడండి. మీ యింట్లోనే ఎవరో ఒకరు మీతో వాదనలోకి దిగుతూనే ఉంటారు. వారితో కయ్యానికి కాలు దువ్వకుండా, ఆగటానికి ప్రయత్నించండి.

**కూర్మః అంగాని సంహరతే** – తాబేలు తన ఐదు అంగాలను లోపలికి లాగుకొంటుంది.

**సర్వశః** – అన్నివైపులనుంచీ. ఎప్పుడు? ఎప్పుడూ కాదు. కళ్ళు మూసుకుని నడవలేము. కళ్ళు తెరచి నడిస్తేనే, రోడ్డు ప్రమాదాలు అనేకం. ఇంక కళ్ళు మూసుకుని నడిస్తే జరిగే ప్రమాదాల గురించి వేరే చెప్పాలా? ఎప్పుడు అంటే, ప్రమాదం ఎదురైనప్పుడు. మనకు ప్రమాదం ఎటునుంచి వస్తుంది? టీవీనుంచి. టీవీలో మంచి కార్యక్రమాలూ ఉన్నాయి; మనస్సును కలుషితం చేసే కార్యక్రమాలూ ఉన్నాయి. అవి చూసి, మనస్సును నియంత్రించుకునే కన్నా, అసలు చూడకుండా ఉంటే మంచిది. ఎందుకు? రోగం వచ్చాక మందు వేసేకన్నా, రోగం రాకుండా జాగ్రత్త పడటం మంచిది. అలాగే సినిమా పత్రికలు ఉన్నాయి, వాటినిండా పుకార్లు, వాటివల్ల మనం పొందే లాభం ఏమీ లేదు.

**ఇంద్రియాణీంద్రియార్థేభ్యః** – అందువల్ల జ్ఞానం పొందిన వ్యక్తి కూడా, ఇంద్రియాలను తెలివిగా, జాగ్రత్తగా వెనక్కు లాక్కోవాలి. ఎందుకంటే, చెడువైపు పోకుండా ఉండటం తేలిక. ఒకసారి వెళ్ళాక, పరిస్థితి మన చేయి జారిపోతుంది. మందు, మత్తుమందు, సిగరెట్టు – ఏదైనా సరే. వద్దని మొదటిసారి చెప్పినప్పుడు మనం బలంగా వ్యతిరేకిస్తాము. కాని రెండవసారి అది బలం పుంజుకుంటుంది, మనం బలహీనులమయి పోతాము. ఇంద్రియలోలత్వం రామాయణంలో వాలి లాంటిది. వాలితో ముఖాముఖి యుద్ధం చేసి ఎవరూ గెలవలేరు. ఎందుకు? ఎదుటి వ్యక్తికున్న బలంలో సగం వాలికి వెళ్ళిపోతుంది. అలాగే ఏదైనా వ్యసనం ముందు మనం నిల్చుంటే, అది మనలో సగం శక్తిని హరించివేస్తుంది. అందువల్ల గట్టిగా దానిని నిరాకరించ లేకపోతున్నాము. అందువల్ల వాటికి ముందే 'నో' చెప్పగలగాలి.

**తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా** – అప్పుడే ప్రజ్ఞ ఉన్న జ్ఞాని, స్థితప్రజ్ఞుడు అవుతాడు.

శ్లో. 59 **విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః ।**
**రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥**
విషయాః, వినివర్తంతే, నిరాహారస్య, దేహినః,
రసవర్జమ్, రసః, అపి, అస్య, పరమ్, దృష్ట్వా, నివర్తతే ॥

| | | | |
|---|---|---|---|
| నిరాహారస్య | = ఇంద్రియముల ద్వారా విషయములను గ్రహింపని | అస్య | = ఈ స్థితప్రజ్ఞునియొక్క |
| దేహినః | = పురుషునియొక్క | రసః అపి | = ఆసక్తి కూడ |
| విషయాః | = శబ్దాది విషయములు | పరమ్ | = పరమాత్మను |
| వినివర్తంతే | = నివృత్తములగును | దృష్ట్వా | = చూచి (తత్త్వపరంగా) |
| రసవర్జమ్ | = (కాని) వాటియందలి ఆసక్తి మాత్రము పోదు | నివర్తతే | = నివృత్తమగును. |

**నిరాహారస్య దేహినః విషయాః రసవర్జం వినివర్తంతే ।**
**అస్య రసః అపి పరం దృష్ట్వా నివర్తతే ॥**

తా: ఇంద్రియములను శబ్దాది విషయములనుంచి నివృత్తము చేసిన మానవునకు విషయములైతే తొలగిపోవును. కాని, విషయములయందలి రాగము తొలగిపోదు. ఈ స్థితప్రజ్ఞునకు పరమాత్మ తత్త్వపరంగా సాక్షాత్కారము కారణముగా రాగము కూడా తొలగిపోవును.

ఇక్కడ కృష్ణపరమాత్మ వ్యసనాన్ని రెండురకాలుగా అభివర్ణిస్తున్నాడు. ఇంద్రియాలు లొంగిపోవటం, మనస్సు లొంగిపోవటం. ఇంద్రియాలను బయటకు లాగినా, మనస్సు త్వరగా ఆ వ్యసనంనుంచి బయటపడదు. అందువల్ల చాలామంది ఏదైనా ఒక వ్యసనాన్ని మానినా, దాన్నించి మనస్సును దిటవు పరచుకోవటం చేతకాక, మళ్ళీ దానికి బానిసలైపోతారు. అందువల్ల, మనస్సు విషయంలో చాలా జాగ్రత్త పడాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**విషయా వినివర్తంతే** – దేనికైతే ఒక వ్యక్తి బానిస అవుతాడో, ఆ వస్తువును అతని ఇంద్రియాలు స్వీకరించకపోతే, అది అతనికి బాహ్యంగా దూరమవుతుంది.

**రసవర్జమ్** – కాని, వాటిపై ఆసక్తి ఇంకా మిగిలివుంటుంది. కొంతమంది తొందరపడి సన్న్యాసం స్వీకరించి ఋషీకేశ్‌కో, ఉత్తరకాశీకో వెళ్ళిపోతారు. కాని అక్కడికొచ్చిన గృహస్థును చూసినప్పుడు అతనిమీద ఈర్ష్యపడి, తను అనవసరంగా త్వరపడ్డానని బాధపడతారు. అటువంటి సన్న్యాసుల గురించి కృష్ణపరమాత్మ నాలుగవ అధ్యాయంలో మాట్లాడబోతున్నాడు. అంటే వారు శారీరకంగా సన్న్యాసి వేషధారణ వేశారే కాని, మానసికంగా సన్న్యసించలేదు. అటువంటివారు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటారు. దానికన్నా ప్రపంచంలోనే ఉండి, పరిణతి చెంది, దాన్నుంచి దానికి అతీతంగా ఎదగాలి. ఇంద్రియ నిగ్రహం వేరు, ఇంద్రియాలను అణగద్రొక్కటం వేరు. అణగద్రొక్కటం చాలా ప్రమాదకరం. వాటిమీద రాగం త్వరగా పోదు. అందువల్ల కోరికలకు అతీతంగా ఎదగాలి. వస్తువులు పోయాక, వాటిమీద రాగం కూడా పోవాలి. అది పోవాలంటే మనస్సులో ఏర్పడిన శూన్యాన్ని ఆధ్యాత్మిక ఆనందంతో నింపాలి. అది శ్రేష్ఠమైన ఆనందం.

నిజానికి చాలామంది సన్న్యాసిని చూసి జాలిపడతారు. అతను టీవీ చూడలేదు, రకరకాల దుస్తులు ధరించలేదు, ఆనందాలను అనుభవించలేదు అని అనుకుంటారు. కాని అతను జ్ఞానంవల్ల పొందిన ఆనందం ఈ చిన్ని,

అశాశ్వతమైన ఆనందాలకన్నా ఎన్నోరెట్లు ఎక్కువ. కాని ఆ అసలు, సిసలు ఆనందాన్ని కనుగొనేటంత వరకూ, ఈ తపన పోదు.

**పరం దృష్ట్వా** – పరదర్శనం అంటే ఆత్మజ్ఞానం దృఢపడితే. అతను పొందే ఆనందం ముందు ఈ లౌకిక ఆనందాలు దిగదుడుపే! కృష్ణపరమాత్మే అంతకుముందు శ్లోకాల్లో చెప్పాడు, మంచినీటి సరస్సును కనుగొన్న వ్యక్తి చిన్న సరస్సుల వెంటబడడు. కుళాయి తిప్పితే, పంచభూతాల్లో ఏదో ఒకటి వస్తుంది. ఒకసారి గాలి వస్తుంది, ఒకసారి నీరు వస్తుంది, ఒకసారి రాళ్ళు, మట్టి వస్తాయి. నీళ్ళు వస్తాయో రావో ఖచ్చితంగా చెప్పలేము.

**నివర్తతే** – ఆత్మజ్ఞానం పొందితే, ఈ ఆసక్తి తొలగిపోతుంది. మంచినీరు దొరికితే, చిన్న సరస్సు జోలికి ఎలా పోడో, ఆత్మజ్ఞానమనే ఆనందం పొందిన వ్యక్తి, చిన్నచిన్న ఆనందాలకోసం వెంపర్లాడడు.

అంతమాత్రాన అతను లౌకిక విషయాలను ఆనందించడు అనుకోకూడదు. అది అపోహ మాత్రమే. పెళ్ళిళ్ళకు, పుట్టినరోజు వేడుకలకు వెళతాడు. ఎవరైనా జోక్ వేస్తే నవ్వుతాడు, మొహం చిటపటలాడించడు. అందువల్ల ఆధ్యాత్మిక ఆనందం కలిగితే, లౌకిక ఆనందాలను అనుభవించకూడదు అనుకోకూడదు. ఇవన్నీ బోనస్ ఆనందాలు. అవి వచ్చినా ఆనందమే, రాకపోయినా ఆనందమే. ముందే చూసినట్టుగా, ఐదు సీరీస్‌లో మూడు వరుసగా గెలిస్తే, ఆట ఆడటం మానరు భారతజట్టు. పైగా అంత ఉత్సాహంతోనూ ఆడతారు. కాకపోతే, అది ఓడితే డీలాపడిపోరు. అందువల్ల జ్ఞాని లౌకిక ఆనందాలను అనుభవిస్తాడు, కాని అదే పరమ ఆనందం అనుకోడు; అవి వచ్చినా పొంగిపోడు, రాకపోయినా కృంగిపోడు.

శ్లో. 60 **యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।**
**ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥**
యతతః, హి, అపి, కౌంతేయ, పురుషస్య, విపశ్చితః,
ఇంద్రియాణి, ప్రమాథీని, హరంతి, ప్రసభమ్, మనః ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ | = ఓ అర్జునా! | విపశ్చితః | = బుద్ధిమంతుడైన |
| హి | = ఆసక్తి నశింపని కారణమున | పురుషస్య | = పురుషునియొక్క |
| ప్రమాథీని | = కవ్వం చిలుకుతున్నట్టుగా | మనః అపి | = మనస్సును గూడ |
| ఇంద్రియాణి | = ఇంద్రియములు | ప్రసభమ్ | = బలవంతముగా |
| యతతః | = ప్రయత్నించునట్టి | హరంతి | = లాగికొనిపోవును. |

**హే కౌన్తేయ! ప్రమాథీని ఇంద్రియాణి యతతః విపశ్చితః అపి,**
**పురుషస్య మనః ప్రసభం హరంతి హి ॥**

తా: ఓ కుంతీపుత్రా! ఆసక్తి నశింపని కారణముచే మానవుడు వివేకజ్ఞానము గలవాడై ప్రయత్నము చేయుచుండ వచ్చును. అయిననూ, కవ్వం చిలుకుతున్నట్టు కలచివేసే స్వభావముగల ఇంద్రియములు వాని మనస్సును బలవంతముగా లాగివేయును.

ఈ శ్లోకంలో ఇంద్రియనిగ్రహం అనుకున్నంత తేలిక కాదని నిరూపిస్తున్నాడు కృష్ణపరమాత్మ. దీన్నుంచి మనం రెండు పాఠాలు నేర్చుకోవాలి. ఒకటి, ఇంద్రియనిగ్రహం చేసే ప్రయత్నంలో మనం మొదట్లో ఓడిపోవచ్చు. మనం ఆ విషయంలో అపరాధభావనతో కృంగిపోనవసరం లేదు. ఇది మొదటి పాఠం. కాని అదే సమయంలో మనం అప్రమత్తతతో ఉండాలి. ఇది రెండవ పాఠం. అంటే కృంగిపోకూడదు, ఏమారిపోకూడదు. చాలా జాగ్రత్తగా ఉండాలి. మనం మాట్లాడేది, చూసేది, వినేది – అన్నీ జాగ్రత్తగా గమనించాలి.

**ఇంద్రియాణి ప్రమాథీని** – ప్రమాథీని అంటే మథించే కవ్వంలాంటివి ఇంద్రియాలు. మజ్జిగ చిలికే కవ్వం, మజ్జిగని చిలికినట్టుగా, మన ఇంద్రియాలు మన మనస్సనే మజ్జిగను తీవ్రంగా చిలుకుతాయి. అది కూడా ఒకటి కాదు, రెండు కాదు, ఐదు ఇంద్రియాలు. ఒక వ్యక్తి ఎప్పుడో ఏదో మాట అంటే, దాన్ని సంవత్సరాల తరబడి గుర్తుంచుకుంటాము. నిజానికి సగం సమస్యలు మాటలు, మాటలు, మాటలే! ఐదు ఇంద్రియాలలో రెండు ఇంద్రియాలు చాలా శక్తివంతమైనవి. అవి కళ్ళు, చెవులు.

**మనః హరంతి** – అవి మనస్సును వేదాంతంనుంచి తీసుకువెళ్ళిపోతాయి. ఒక గంటసేపు వేదాంతాన్ని ఏకాగ్రతతో విన్నా కూడా, మీరు లేచేముందు, ఎవరో ఏదో మాట అంటారు. అంతసేపు విన్న వేదాంతం గాలికెగిరి పోతుంది. ఆ ఒక్కమాట మనస్సును తీవ్రంగా గాయపరుస్తుంది. అందువల్ల ఇంద్రియాలు మనస్సును తీసుకువెళ్ళిపోతాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. దేన్నుంచి? గీతాబోధనుంచి; ఉపనిషత్తుల బోధనుంచి. వారిమీద కస్సుమని లేస్తారు. నువ్వు నేర్చుకున్న పాఠం ఇదేనా, నీ గురువు ఇదే చెప్పాడా అంటే, ఇంకా ముంచుకొస్తుంది కోపం. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వేదాంతం గాలికెగిరిపోతుంది. అందువల్ల, వేదాంతాన్ని జీర్ణించుకోవాలంటే, జాగ్రత్తగా ఉండండి.

**యతతః అపి** – ఇంద్రియ నిగ్రహంమీద శ్రద్ధ ఉన్నా, కాస్త ఏమారితే చాలు, ఇంద్రియాలు ఎటో లాగేస్తాయి. ఆధ్యాత్మ రామాయణంలో ఆ విషయం చూస్తాము. సీతాదేవి ఎప్పుడూ రామునితోనే ఉంటుంది. రాముడు ఆత్మానందానికి సంకేతం. మారీచుడు, బంగారులేడి, ఇంద్రియ లోలత్వానికి సంకేతం. ఇరవైనాలుగ్గంటలూ రామునితోనే ఉండే సీతే, ఒక్క నిముషం బంగారులేడిని చూసి ముచ్చటపడింది. దాని ఫలితం? ఆ వ్యామోహం సీతను చాలాకాలం శ్రీరామునికి దూరం చేసింది; అంటే ఆత్మానందానికి దూరం చేసింది. అందువల్ల ఆత్మ మనతోనే ఎప్పుడూ ఉన్నా, జగత్తనే బంగారులేడి మనను ఆకర్షించగలదు. కృష్ణపరమాత్మ ఇంకొక పదం కూడా వాడుతున్నాడు.

**విపశ్చితః** – విపశ్చిత అంటే జ్ఞాని. గీతను, ఉపనిషత్తులను అధ్యయనం చేసిన జ్ఞాని కూడా, ఒక్క నిముషం బలహీనతకు లోనయితే, దారితప్పే అవకాశం ఉంది. అందువల్ల చాలా అప్రమత్తతతో ఉండాలి.

శ్లో. 61 **తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।**
**వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**

తాని, సర్వాణి, సంయమ్య, యుక్తః, ఆసీత, మత్పరః,
వశే, హి, యస్య, ఇంద్రియాణి, తస్య, ప్రజ్ఞా, ప్రతిష్ఠితా ॥

| | | | |
|---|---|---|---|
| తాని, సర్వాణి | = ఆ సమస్తములైన ఇంద్రియములను | యస్య | = ఎవనియొక్క |
| సంయమ్య | = వశమునందుంచుకొని | ఇంద్రియాణి | = ఇంద్రియములు |
| యుక్తః | = సమాహితచిత్తుడైనవాడు | వశే | = వశమందు (ఉండునో) |
| మత్పరః | = నేనే పరమలక్ష్యముగా | తస్య | = అతనియొక్క |
| ఆసీత | = ధ్యానమునందు కూర్చొనవలెను | ప్రజ్ఞా | = బుద్ధియే |
| హి | = ఎందుకంటే | ప్రతిష్ఠితా | = స్థిరమైయుండును |

**తాని సర్వాణి సంయమ్య యుక్తః మత్పరః ఆసీత।**
**హి యస్య వశే ఇంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా॥**

తా: వాటినన్నింటినీ నియంత్రించి ఏకాగ్రచిత్తుడై నేనే పరమలక్ష్యముగా గలవాడై స్థిరముగా నుండవలెను. ఎందుకంటే, ఎవనికి ఇంద్రియములు వశములో ఉండునో, అటువంటి వాని ప్రజ్ఞ ప్రతిష్ఠితమైనది (అతడు స్థితప్రజ్ఞుడు).

**తాని సర్వాణి సంయమ్య ఆసీత –** ఓ అర్జునా, అన్ని ఇంద్రియాలనూ నీ వశంలో ఉంచుకో. మనం వాటికి బానిస కాకూడదు. మనం ఒక కారు నడుపుతుంటే, కారు చక్రాలు మనం కోరినట్టు వెళ్ళాలి కాని, వాటికి తోచినట్టు వెళ్ళకూడదు. అలాగే కుక్కను వాకింగ్‌కు తీసుకువెళితే, ఒక్కోసారి అది మనను పరుగులు పెట్టిస్తుంది. చూసేవారికి ఎవరు యజమానో తెలియదు.

అలాగే ఇంద్రియాలు అటువంటి కుక్కలు. మనం వాటిని నడిపించాలి. అవి మనను నడిపించకూడదు. వాటిని అదుపులో పెట్టుకోవాలి కాని అణగద్రొక్కకూడదు. అణగద్రొక్కటానికీ, అధీనంలో ఉంచుకోవటానికీ మధ్య చిన్న భేదం ఉంది. అణగద్రొక్కటం అంటే మనం నమ్మినా నమ్మకపోయినా పాటించటం. ఏకాదశిరోజు మనంతట మనం ఉపవాసం ఉంటే అది ఇంద్రియాలను అధీనంలో ఉంచుకోవటం; బలవంతంగా ఉండాల్సి వస్తే అది అణగద్రొక్కటం. అందువల్ల దమం అంటే ఇంద్రియాలను అదుపులో పెట్టటం. ఎందుకు?

**యస్యేంద్రియాణి వశే –** అలా ఎవరైతే ఇంద్రియాలను తన అధీనంలో పెట్టుకుంటాడో, అటువంటి వ్యక్తి,

**ప్రజ్ఞా ప్రతిష్ఠితా (భవతి) –** ఆత్మజ్ఞానం త్వరగా జీర్ణించుకుంటాడు. వేదాంతం బాగా అర్థమవుతుంది. ఇక్కడ ప్రజ్ఞ అంటే ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానంలో నెలకొని ఉంటాడు. దీనితో మొదటి సాధన అయిన దమం అయింది.

ఈ శ్లోకంలోనే రెండవ సాధనను పేర్కొంటాడు.

**నిదిధ్యాసనం – యుక్తః మత్పరః ఆసీత –** నామీదే బుద్ధిని స్థిరంగా ఉంచు అంటాడు కృష్ణపరమాత్మ. నామీద అంటే రెండు అర్థాలు వస్తాయి. సగుణ ఈశ్వరుడు, నిర్గుణబ్రహ్మ. భగవద్గీతలో కృష్ణపరమాత్మ తనను తాను వ్యక్తిగా కాకుండా, అన్ని జీవుల్లోనూ ఉన్న ఆత్మగా వివరించుకున్నాడు. భాగవతంలో గోపికలు కూడా అదే అంటారు.

**అఖిల దేహినాం అంతరాత్మ దృక్**

నువ్వు అందరి దేహాల్లో ఉన్న అంతరాత్మవు అంటారు. ఇక్కడ కృష్ణపరమాత్మ ఆత్మధ్యానాన్ని నిర్దేశిస్తున్నాడు. మత్పరః అంటే నీలో ఉన్న ఆత్మగా నన్ను గుర్తించు

**మనోబుద్ధ్యహంకార చిత్తాని నాహం**
**చిదానందరూపః శివోఽహం శివోఽహమ్** – నిర్వాణషట్కమ్

అందువల్ల ఆత్మధ్యానం చేయి. ఒకవేళ ఆత్మ గురించి తెలియకపోతే, కృష్ణధ్యానం చేయి. ఈ ఆత్మధ్యానం చేయటం తేలిక కాదు. అందువల్ల యుక్త పదం వాడాడు కృష్ణపరమాత్మ. ధ్యానం చేయమని చెబుతున్నాడు. మనస్సు బాహ్యంగా పరుగులు తీస్తుంది. బాహ్యంగా పరుగులు తీసే మనస్సును పట్టి నిలిపి, అంతర్ముఖం చేయాలి. దీని ద్వారా రెండవ సాధన అయిన నిదిధ్యాసనం గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ.

ఇప్పుడు ముఖ్యమైన మూడవ సాధన రాబోతున్నది.

శ్లో. 62 **ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే ।**
**సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోఽభిజాయతే ॥**
ధ్యాయతః, విషయాన్, పుంసః, సంగః, తేషు, ఉపజాయతే,
సంగాత్, సంజాయతే, కామః, కామాత్, క్రోధః, అభిజాయతే ॥

| | | | |
|---|---|---|---|
| విషయాన్ | = శబ్దాది విషయములను | సంగాత్ | = ఆసక్తివల్ల |
| ధ్యాయతః | = చింతన చేయుచుండునట్టి | కామః | = విషయవాంఛ |
| పుంసః | = పురుషునకు | సంజాయతే | = ఉత్పన్నమగును |
| తేషు | = ఆ శబ్దాదివిషయములయందు | కామాత్ | = కోరికవల్ల (ఆ కోరిక తీరనప్పుడు) |
| సంగః | = ఆసక్తి | క్రోధః | = కోపము |
| ఉపజాయతే | = ఏర్పడును | అభిజాయతే | = కలుగును |

**విషయాన్ ధ్యాయతః పుంసః తేషు సంగః ఉపజాయతే।**
**సంగాత్ కామః సంజాయతే కామాత్ క్రోధః అభిజాయతే ॥**

తా: ఇంద్రియభోగములను గురించి ఏకాగ్రంగా చింతన చేసే వ్యక్తికి వాటియందు ఆసక్తి ఉత్పన్నమగును. ఆసక్తినుంచి కోరిక, కోరికనుంచి క్రోధము పుట్టును.

**మనోనిగ్రహం –** ఈ శ్లోకంనుంచీ, మనోనిగ్రహం గురించి చెప్పబోతున్నాడు కృష్ణపరమాత్మ. ఇంద్రియనిగ్రహంతో పోలిస్తే మనోనిగ్రహం ఇంకా కష్టం. ఇంద్రియాలు స్థూల అంగాలు. అందువల్ల వాటిని తేలికగా అదుపులో పెట్టగలరు. మనకు ఏదైనా చూడటం ఇష్టం లేకపోతే కళ్ళు మూసుకోవచ్చు; ఏదైనా వినటం ఇష్టం లేకపోతే చెవులు మూసుకోవచ్చు లేదా అక్కడనుంచి లేచి వెళ్ళిపోవచ్చు. కాని మనస్సు విషయం అలా కాదు. మనం

గీతాబోధ వింటున్నా కూడా, బోధ మధ్యలోంచి మనస్సు ఏ సముద్రం దగ్గరకో వెళ్ళి వస్తుంది. అందువల్ల మనోనిగ్రహం లేదా శమం చాలా కష్టం.

**ఎ). విషయధ్యానం–** మనం జగత్తులో వ్యవహారం నడుపుతున్నప్పుడు ఇంద్రియాల ద్వారా, ఎన్నో విషయాలు మన మనస్సులోకి ప్రవేశిస్తాయి. మనం ఇంద్రియనిగ్రహం పాటించినా కూడా, పక్కవారు దేని గురించో మాట్లాడుతుంటే, అది వద్దనుకున్నా మన చెవిలో పడుతుంది. అలాగే మనం సినిమాలు చూడటం మానినా, రోడ్డుమీద సినిమా పోస్టర్లు వద్దన్నా మన కంట్లో పడతాయి. అంటే మన మనస్సులోకి ప్రపంచం తొంగి చూడకుండా ఆపలేము. వస్తువు మన ఎదురుగుండా లేకపోయినా, మనం దానికి దూరంగా వచ్చినా కూడా, దానిమీద ధ్యాస పోదు. **ధ్యాయతో విషయాన్ పుంసః** తమాషా ఏమిటంటే ఈశ్వరధ్యానం చేయటం కష్టం కాని విషయధ్యానంలో మనమంతా ఆరితేరాము. దీనికి పద్మాసనం వేసుకుని, ప్రత్యేకంగా కూర్చోకుండానే ఆ ఆలోచన దూసుకు వస్తుంది. అంతేకాదు, ఆ ఆలోచనే మనలో నిరంతరం ఉంటుంది. అది డబ్బు ధ్యానం కావచ్చు, ఇంటి ధ్యానం కావచ్చు, మరేదన్నా కావచ్చు. విషయం అంటే ఇంద్రియాలు చూసే వస్తువులు.

వేదాంతం ప్రకారం విషయధ్యానాన్ని మన విచక్షణా శక్తిని ఉపయోగించి మొగ్గతొడకగ ముందే తొలగించి వేయాలి. ఒక వస్తువును చూస్తే, దాని గురించి పదేపదే ధ్యానం చేయాల్సిన అవసరం ఉందా లేదా అని బేరీజు వేయాలి. దాని గురించిన కలలు, ఆరోగ్యకరమైనవో, కావో నిర్ణయించుకోవాలి. ఒక వస్తువు గురించి వచ్చిన మొదటి ఆలోచన చాలా బలహీనంగా ఉంటుంది. అప్పుడు మనస్సును దాన్నుంచి మరలించటం తేలిక కాని, దాన్ని వదిలేశామో, మన పని అయిపోయినట్టే. చిన్న బుడగలాగా మొదలైన ఆలోచన అంతకంతకూ పెరిగి, ఒక మహాశక్తివంతమైన అలగా మారుతుంది. రెండవదశ ఏమిటి?

**తేషు సంగః ఉపజాయతే** – ఆ వస్తువుమీద ఆసక్తి కలుగుతుంది. అది ఉంటే నాకు ఆనందం కలుగుతుంది అనుకుంటాము. కాని ప్రపంచం ఆనందమూ కలుగజేయదు, దుఃఖమూ కలుగజేయదు అంటుంది వేదాంతం. మరి అయితే ప్రపంచం ఏమిటి? ప్రపంచం ప్రపంచమే. అంతే. మనమే దానికి రంగులు పులుముతున్నాము. ఆనందం కలుగజేస్తుంది, దుఃఖంలో ముంచెత్తుతుంది అంటున్నాము. మనకు శాస్త్రీయ సంగీతం ఇష్టం. పిల్లలేమో పాశ్చాత్యసంగీతాన్ని ఇష్టపడతారు. ఆ సంగీతాన్ని భరించలేము మనము. పైగా తలనెప్పి వస్తోంది, ఆపేయండి అని వారిని అరుస్తాము. ఇప్పుడు చెప్పండి, పాశ్చాత్యసంగీతం ఆనందహేతువా, దుఃఖహేతువా? అది మనం చూసే దృష్టినిబట్టి ఉంటుంది.

**బి). విషయసంగం–** మనస్సు చేసే గారడీ చూడండి! దేన్నైనా పదేపదే వింటే, దాన్ని మెచ్చుకునే స్వభావం ఉంటుంది. చివరికి మనకు విసుగు పుట్టించే ప్రకటనకున్న రాగం కూడా పదిసార్లు వినేసరికి మనకు తెలియకుండానే ఆ రాగాన్ని కూనిరాగం తీస్తాము. మనకు అదంటే చచ్చే చిరాకు, కాని మనమేం చేస్తున్నాము? మనమే పాడుతున్నాము. మనస్సుకు ఆ శక్తి ఉంది. అది బాగుంది, ఆకర్షణీయంగా ఉంది అంటాము. ఆ దృక్పథాన్ని **విషయసంగం** అంటారు. అందువల్ల కృష్ణపరమాత్మ **విషయధ్యానాత్ సంగః జాయతే** అంటున్నాడు. దానిమీద రాగం, అది కూడా తప్పులేదు. అది అందంగా ఉంది అంటున్నారంతే. గులాబీ పువ్వు అందంగా ఉంది అంటే

అది ఈశ్వర విభూతి. మనం భగవంతుణ్ణి కీర్తిస్తున్నాము. అక్కడితో ఆగితే బాగానే ఉంటుంది. కాని మనం ఒక అడుగు ముందుకు వెళతాము.

అది బాగుంది, బాగుంది అని పదిసార్లు అనుకుని అది నాచేతిలో ఉంటే ఇంకా బాగుంటుంది అనుకుంటాము. అక్కడితో ఆగుతామా? లేదు. నాకది కావాలి; నాకది కావాలి అని పదేపదే దాని ధ్యానం చేస్తాము. చివరికి ఏ దశకు వెళతామంటే, అది లేకపోతే నేను ఉండలేను అంటాము. ఆ వస్తువు లేకపోతే, ఆ వ్యక్తి లేకపోతే, ఆ పరిస్థితి లేకపోతే నేను జీవించలేను. దానికోసం ఏదైనా చేయటానికి కూడా సిద్ధమే. దీన్నేమంటారు?

**సి). విషయకామం – కామః** – కామం అంటే కోరిక. కామం అంటే ఆ కోరికకు పూర్తిగా బానిస అయిపోవటం. నేను పూర్ణుణ్ణి, నేను అద్వితీయాన్ని, నాకు భిన్నంగా ఏమీలేదు అని నేర్చుకున్న వేదాంతబోధ అంతా గాలికి ఎగిరిపోతుంది. బాహ్యవస్తువు ఏదీ నాకు శాశ్వతమైన ఆనందాన్నివ్వలేదు, నేను ఆనందస్వరూపుణ్ణి అని నేర్చుకున్నదంతా మర్చిపోయి, ఆ వస్తువు లేదా ఆ వ్యక్తి లేకపోతే నేను జీవించలేను అనే నిర్ణయానికి వచ్చేస్తాము. దీన్ని **విషయకామం** అంటారు.

**సంగాత్ కామః సంజాయతే** – అందువల్ల, తీవ్రమైన కోరిక పుడుతుంది. అంటే విషయధ్యానం విషయసంగత్వానికి, విషయసంగత్వం విషయకామానికి దారితీస్తుంది. అప్పుడేమవుతుంది?

**డి). క్రోధం– కామాత్ క్రోధోఽభిజాయతే** – ఆ కోరిక తీరకపోతే కోపం వస్తుంది. దీన్ని **క్రోధం** అంటారు. సమస్య అంతకంతకూ తీవ్రరూపం దాలుస్తుంది. కామంవల్ల కోరిక తీరవచ్చు, తీరకపోవచ్చు, కృష్ణపరమాత్మ కోరిక తీరని మార్గం గురించి చెబుతున్నాడు.

ఈ రోజుల్లో ప్రతిదానికీ చాలా పెద్ద పోటీ ఉంది. ఒక వస్తువు మనం కొనాలని బజారు వెళితే, క్షమించండి, ఇప్పుడే ఎవరో తీసేసుకున్నారు దాన్ని అంటారు. పోనీ, ఇంకొకటి ఇవ్వండి అంటే, అదొక్కటే ఉంది అంటారు. తీరని కోరిక కోపంగా మారుతుంది. నిజానికి, కోపమే కోరికకు ఇంకొక రూపం. అందువల్ల తీరని కోరికవల్ల, కోపం వస్తుంది. వ్యాపారంలో తనకు అడ్డు వచ్చినవారిని అణగద్రొక్కటానికి అనేక మార్గాలను కొందరు ఉపయోగించటం చూస్తూనే ఉంటాము. దీనికి కారణం, వారి తీవ్రమైన కోరిక. తీవ్రమైన కోరిక ఉన్న వ్యక్తి ఎటువంటి పని చేయటానికి కూడా జంకడు. ఇది ఒక పరిస్థితి.

కోరిక తీరిన వాని పరిస్థితి ఏమిటి? కృష్ణపరమాత్మ దానిని ఇక్కడ చర్చించడు కాని అతని పరిస్థితి ఎలా ఉంటుందో జగద్విదితమే. ఒక కోరిక తీరితే, ఇంకో కోరిక పుట్టుకొస్తుంది. వందలు ఉంటే వేలు కావాలని అనిపిస్తుంది; వేలు ఉంటే లక్షలు; లక్షలు ఉంటే కోట్లు కావాలనిపిస్తుంది. ఆశకు అంతెక్కడ? అందువల్లనే జూదగాళ్ళు జూదంలో కొంత ఎక్కువ డబ్బు వచ్చినా, జూదం ఆడటం ఆపరు. ఇంకా ఇంకా వస్తుందనే ఆశతో ఇంకా ఇంకా ఆడతారు. ఎవరిదాకానో ఎందుకు, సాక్షాత్తూ ధర్మరాజే జూదానికి బానిస అయ్యాడు. మహాభారతంనుంచి నేర్చుకోవాల్సిన ముఖ్యమైన పాఠాల్లో ఇది ఒకటి; చెడు వ్యసనాలకు బానిస అయితే, అది ధార్మికుణ్ణి కూడా నాశనం చేస్తుంది. అందువల్ల తీరిన కామం లోభానికి దారితీస్తుంది. కాని కృష్ణపరమాత్మ

దాని గురించి మాట్లాడటం లేదు. తీరని కామం క్రోధానికి దారితీస్తుందని చెబుతున్నాడు. ఇప్పటిదాకా నాలుగు దశలు చూశాము –

**విషయధ్యానం → విషయసంగం → విషయకామం → క్రోధం.**

క్రోధానికి విషయక్రోధం అనకూడదు. క్రోధం వస్తే ఏమవుతుంది?

శ్లో. 63 **క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।**
**స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥**
క్రోధాత్, భవతి, సమ్మోహః, సమ్మోహాత్, స్మృతివిభ్రమః,
స్మృతిభ్రంశాత్, బుద్ధినాశః, బుద్ధినాశాత్, ప్రణశ్యతి ॥

క్రోధాత్ = క్రోధమువల్ల
సమ్మోహః = అత్యంతమైన మోహము
భవతి = ఉత్పన్నమగును
సమ్మోహాత్ = ఆ వ్యామోహమువల్ల
స్మృతివిభ్రమః = స్మృతి (జ్ఞాపకశక్తి) భ్రమ ఏర్పడును
స్మృతిభ్రంశాత్ = స్మృతి భ్రమవల్ల
బుద్ధినాశః = బుద్ధి (జ్ఞానశక్తి) నశించును
బుద్ధినాశాత్ = బుద్ధిబలము నశించుటవల్ల
ప్రణశ్యతి = (ఆ పురుషుడు తన సహజ స్థితినుంచి) పతనమగును

**క్రోధాత్ సమ్మోహః భవతి సమ్మోహాత్ స్మృతి విభ్రమః।**
**స్మృతిభ్రంశాత్ బుద్ధినాశః బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥**

తా: క్రోధమునుంచి సమ్మోహము (మూఢభావము), సమ్మోహమునుంచి స్మృతివిభ్రమము, స్మృతి(జ్ఞాపకశక్తి) భ్రష్టమగుటవల్ల బుద్ధియొక్క వినాశనమగును.బుద్ధినాశమువల్ల వ్యక్తి వినాశము (పతనము)ను పొందును.

**ఇ). సమ్మోహం –క్రోధాత్ సమ్మోహః భవతి** – మనస్సు క్రోధం కోరల్లో చిక్కుకుంటే, వ్యామోహం కలుగుతుంది. దీన్ని **సమ్మోహం** అంటారు. అంటే విచక్షణాశక్తి కోల్పోతాము. మంచీ, మర్యాదా మర్చిపోతాము. మనమెవరమో, మనముందు ఉన్నది ఎవరో మర్చిపోతాము. అది తల్లి, తండ్రి, గురువు, తాత, వయోవృద్ధుడు – ఎవరైనా పట్టించుకోము.

**క్రుద్ధః పురుషః గురుమపి ఆక్షేపతి, మాతరమపి తాడయతి**

శంకరాచార్యులు వేరే సందర్భంలో చెబుతారు, కోపంగా ఉన్న వ్యక్తి గురువును కూడా గట్టిగా అరుస్తాడు. తల్లిని కూడా కొడతాడు. తరువాత వారికి క్షమాపణ చెప్పవచ్చు, అది వేరే విషయం, కాని కోపంలో మాత్రం ముందు, వెనకలు చూడడు. అందువల్ల –

**ఎఫ్). స్మృతివిభ్రమం – సమ్మోహాత్ స్మృతివిభ్రమః** – సమ్మోహంవల్ల మనం నేర్చుకున్నదంతా మర్చిపోతాము. మనం గీత ఎందుకు నేర్చుకుంటున్నాము? నలుగురిలో గొప్ప చెప్పుకోవటానికో, కాలక్షేపం అవటానికో కాదు. మన జీవితంలో ఏదైనా క్లిష్టపరిస్థితి ఎదురైనప్పుడు, ఈ బోధ మనను ఆదుకోవటానికి.

అలా ఉపయోగించుకోలేకపోతే, మనం కర్ణునిలాగా అవుతాము. కర్ణునికి ఎన్నో ప్రత్యేకమైన మంత్రాలు వచ్చు, కాని అతను అవసరమైనప్పుడు వాటిని వినియోగించుకోలేదు. అలా అతనికి శాపం ఉంది. పిల్లలు కూడా చూడండి, ఇంట్లో అన్ని జవాబులూ చెబుతారు, రాస్తారు కాని పరీక్షహాలులో కూర్చునేసరికి మనస్సు మొద్దుబారిపోతుంది, ఏమీ గుర్తురాదు. బయటకు వచ్చాక, మళ్ళీ వాటంతట అవే గుర్తుకొస్తాయి.

అలా మన మనస్సునుంచి మనం గీత ద్వారా పొందిన జ్ఞానమంతా మటుమాయమయిపోతుంది. ఒక్కోసారి కంప్యూటర్‌లో వైరస్ చేరినట్టుగా, మన మనస్సనే కంప్యూటర్‌ను కోపమనే వైరస్ పట్టుకుంటుంది. అందువల్ల నేర్చుకున్న జ్ఞానమంతా తాత్కాలికంగా మర్చిపోతాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. దీన్ని **స్మృతివిభ్రమం** అంటారు. అక్కడ కూడా జాగ్రత్తపడక పోతే ఏమవుతుంది?

**జి). బుద్ధినాశం– స్మృతిభ్రంశాత్ బుద్ధినాశః** – జ్ఞానం ఎప్పుడైతే మర్చిపోతామో, అప్పుడే బుద్ధి శాశ్వతంగా పోతుంది. ఇంతకు ముందు సమ్మోహం పదం వాడాడు. అంటే విచక్షణాశక్తిని తాత్కాలికంగా కోల్పోతాము. దీన్ని **బుద్ధినాశం** అంటారు. అంటే ఈ విచక్షణాశక్తిని శాశ్వతంగా పోగొట్టుకుంటాము. ఎప్పుడైతే, దాన్ని శాశ్వతంగా పోగొట్టుకుంటామో, అప్పుడింక మనం వెనక్కి తిరిగివచ్చే అవకాశం ఉండదు. ఎందుకంటే మనకు ఇంక బుద్ధి పనిచేయదు. దానివల్ల ఏమవుతుంది?

**హెచ్). ప్రణశ్యతి– బుద్ధినాశాత్ ప్రణశ్యతి** – బుద్ధి నాశనమయితే, మనము మన మానవస్థితినుంచి పతనమవుతాము. దీన్ని **ప్రణశ్యతి** అంటున్నాడు. ఎప్పుడైతే బుద్ధి పనిచేయటం మానేస్తుందో, అప్పుడు మనకూ, పశువుకూ భేదం ఉండదు. ఒక గాడిద గాండ్రించాలనుకుంటే పక్కన ఏమవుతుందో పట్టించుకోదు. మనం కూడా అలా పక్కన ఎవరున్నారో చూసుకోకుండా, భార్యమీదో, పిల్లలమీదో అరిస్తే, పశువుకూ, మనకూ భేదం ఉండదు. కోపం రావచ్చు, వద్దనటం లేదు. కాని దాన్ని వెంటనే ప్రకటించకుండా, నిగ్రహించుకోగలగాలి. ఏది తోస్తే అది చేస్తే అది పశుప్రవృత్తి; ఆలోచించి చేస్తే అది మనుష్యప్రవృత్తి. పశుప్రవృత్తి ఉంటే పురుషార్థాల జోలికి పోము. పురుషార్థాలు సాధించకపోతే, మనిషిగా పుట్టినా, మన జీవితం వృథా.

అందువల్ల కృష్ణపరమాత్మ గట్టిగా చెబుతున్నాడు – క్షణికావేశంతో ఏపనీ చేయవద్దు. ఆలోచించి చేయండి. ఈ రెండు శ్లోకాల్లో మనిషి పతనానికి ఎనిమిది జారుడు మెట్లను వర్ణిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**విషయ ధ్యానం → విషయ సంగం → విషయ కామం → క్రోధం →**
**సమ్మోహం → స్మృతి విభ్రమం → బుద్ధినాశం → ప్రణశ్యతి**

దీనకంతటికీ మూలకారణం ఏమిటి? విషయధ్యానం. అందువల్ల మనోనిగ్రహం పెంపొందించుకోవాలి.

శ్లో. 64 **రాగద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్ ।**
**ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి ॥**
రాగద్వేషవియుక్తైః, తు, విషయాన్, ఇంద్రియైః, చరన్,
ఆత్మవశ్యైః, విధేయాత్మా, ప్రసాదమ్, అధిగచ్ఛతి ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | విషయాన్ | = విషయములను |
| విధేయాత్మా | = అంతఃకరణము అదుపులోగల సాధకుడు | చరన్ | = సేవించుచున్ననూ |
| ఆత్మవశ్యైః | = తన వశములోనున్న | ప్రసాదమ్ | = అంతఃకరణ ప్రసన్నతను (అధీనమును) |
| రాగద్వేషవియుక్తైః | = రాగద్వేషరహితములైన | అధిగచ్ఛతి | = పొందును |
| ఇంద్రియైః | = ఇంద్రియముల ద్వారా | | |

**విధేయ ఆత్మా తు రాగ-ద్వేష-వియుక్తైః ఆత్మ-వశ్యైః**
**ఇంద్రియైః విషయాన్ చరన్ ప్రసాదమ్ అధిగచ్ఛతి॥**

తా: దీనికి భిన్నముగా రాగద్వేషములు లేకుండా తనకు వశములై ఉండే ఇంద్రియములతో శబ్దాది విషయములను సేవిస్తున్న సాధకుని మనస్సు అతని అధీనములో ఉండును. అతడు మనః ప్రసన్నతను పొందును.

ఇప్పుడు కృష్ణపరమాత్మ మళ్ళీ ఇంద్రియనిగ్రహం అంశానికి వస్తున్నాడు. ఎందుకంటే, మూడూ ముఖ్యమే అయినా ఇంద్రియనిగ్రహం వాటిలో ఇంకా చాలా ముఖ్యం. ఇంద్రియనిగ్రహం లేకపోతే ప్రపంచం మొత్తం మన మనస్సులోకి దూరిపోతుంది.

**ఇంద్రియైః విషయాన్ చరన్** - ఇంద్రియాల ద్వారా విషయవస్తువులు చూడకుండా ఉండలేము. మనం కళ్ళు, చెవులు మూసుకుని నడవలేము కాబట్టి, ఏదో ఒకటి ఏదో ఒక ఇంద్రియం ద్వారా మనస్సులోకి దూరకుండా ఉండదు. వాటిని లోపలికి రానివ్వచ్చు. కాని ఒక జాగ్రత్త తీసుకోవాలి. ఏమిటది?

**రాగద్వేషవియుక్తైః** - కాని వాటిమీద రాగద్వేషాలను పెంచుకోకూడదు. ఇంద్రియాలకు ఆ గుణం ఉంటుంది. అందువల్ల మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. ఒక వస్తువు మనకు ఆనందం ఇస్తుందనుకోవటం రాగం, ఒక వస్తువు మనకు దుఃఖం ఇస్తుందనుకోవటం ద్వేషం. రెండూ తప్పే. అటువంటి తప్పుడు అవగాహన కలగకుండా మనం జాగ్రత్తపడాలి. గులాబీపువ్వు అందాన్ని ఆస్వాదించాలి, కాని అది నా స్వంతం అవాలని ఆశించకూడదు. రాగద్వేషాలను పెరగనివ్వకూడదు.

గీతాబోధకు వెళితే, నాలుగురోజులు ఒకచోట కూర్చుంటే, దానిమీద రాగం ఏర్పడుతుంది. రోజూ అక్కడే కూర్చోవాలనిపిస్తుంది. ఎవరైనా అక్కడ కూర్చుంటే వారితో పోట్లాడతాము కూడా. అలా దేనికీ బానిస కాకూడదు. మధ్యమధ్యలో వేరేచోట కూర్చోవాలి.

**ఆత్మవశ్యైః** - ఇంద్రియాలను మన వశంలో ఉంచుకోవాలి అంటే ఇంద్రియాలు, మనస్సు మాట వినేలాగా చేసుకోవాలి. ఇక్కడ ఆత్మ అంటే బుద్ధి, విచక్షణాశక్తి. మద్యపానం సేవించకూడదని శాస్త్రం చెబుతున్నది. వైద్యులు కూడా ఆరోగ్యానికి మంచిదికాదు అంటున్నారు. అలాంటప్పుడు, దాన్ని ఎన్నడూ ముట్టుకోకుండా ఉండగలిగే శక్తిని పెంపొందించుకోవాలి.

మొదటిసారే మనం 'నో' గట్టిగా చెప్పగలగాలి. అప్పుడు మనం చెప్పలేకపోతే, అది వాలిలాగా మనశక్తిని సగం హరించివేస్తుంది. ఇంక దానికి బానిస అయిపోతాము. మనను సమర్థించుకోవటానికి ఇది నా ప్రారబ్ధం అంటాము. ఇది అక్రమం. చేజేతులా చేసుకుని ప్రారబ్ధాన్ని నిందించటం ఎందుకు? ఇదే సూత్రం సిగరెట్టుకు, మాంసాహారానికీ కూడా వర్తిస్తుంది. అన్నిటికీ 'నో' చెప్పగలగాలి, ఆ మాటమీద నిలబడగలగాలి.

**విధేయాత్మా** – ఆత్మనిగ్రహం ఉన్న వ్యక్తి అని అర్థం. ఇక్కడ కూడా ఆత్మ అంటే సచ్చిదానంద ఆత్మకాదు; ఆత్మ అంటే మనస్సు. తన ఇంద్రియాలను తన చెప్పుచేతలో ఉంచుకున్న వ్యక్తి. అటువంటి వ్యక్తి ఎలా ఉంటాడు?

**ప్రసాదమధిగచ్ఛతి** – ఇక్కడ ప్రసాదం అంటే తినే ప్రసాదం కాదు, ప్రసాదం అంటే శాంతి. నిజానికి దేవుని ప్రసాదం తింటే మనశ్శాంతి కలుగుతుంది కాబట్టి పరోక్షంగా ప్రసాదం పదం కూడా సరిపోతుంది అనవచ్చు. అందువల్ల ఇంద్రియనిగ్రహం ఉన్న వ్యక్తి మనశ్శాంతిని పొందుతాడు. అతని మనస్సులో కల్లోలాలు చెలరేగవు.

ఏదైనా వాదనలో వేడి పెరిగితే, అతను ఆ విషయం గ్రహించి, వాదన ఆపేస్తాడు. ఒక్కోసారి వాదనల్లో జ్ఞానం కలగదు, వేడి మాత్రమే పుడుతుంది. ఆవేశంలో ఉన్న వ్యక్తి, ఎదుటివ్యక్తి మంచి చెప్పినా గ్రహించే స్థితిలో ఉండడు. వేదాంతి ఇది గ్రహిస్తాడు. వెంటనే వాదనను ఆపేస్తాడు. కావాలంటే మీరూ ప్రయత్నించి చూడండి. మీకో, ఎదుటివ్యక్తికో కోపం తీవ్రరూపం దాలుస్తోందని మీరు గ్రహించగానే వాదన ఆపేయండి. అలా ఆపిన ఐదు నిముషాలకే, మీకు కోపం తగ్గి ప్రశాంతత కలుగుతుంది. వాదన తీవ్రతనుబట్టి కూడా కోపం తగ్గే సమయం ఉంటుంది.

మన వాదన మధ్యలో ఆపితే, ఓడిపోయామనే అపోహ ఎదుటివ్యక్తికి కలగవచ్చు. అది సరికాదు. మనదే నూటికి నూరుశాతం నిజమని తెలిసినా, ఎదుటివ్యక్తి విననప్పుడు ఆగటం విజ్ఞత. అతను నువ్వు ఓడిపోతున్నావు కాబట్టి ఆపుతున్నావని గేలి చేసినా మనమేమీ బాధపడనవసరం లేదు. ఎదుటివ్యక్తి సందేశం తీసుకోవటంలో ఓడిపోయాడు. అందువల్ల మనస్సు కల్లోలపడకుండా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత మనకు చాలా ఉంది. అందువల్లనే ప్రసాదమధిగచ్ఛతి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఇంద్రియాలను బాహ్యప్రపంచంలోకి వదిలినప్పుడు, జాగరూకతతో ఉండాలి. కఠోపనిషత్తులో రథకల్పన వస్తుంది. శరీరాన్ని రథంతోనూ, ఇంద్రియాలను గుర్రాలతోనూ, మనస్సును పగ్గాలతోనూ, బుద్ధిని రథసారథితోనూ పోలుస్తుంది ఉపనిషత్తు అందులో. ఇప్పటి కాలమాన పరిస్థితుల ప్రకారం, శరీరాన్ని కారుతోనూ, ఇంద్రియాలను కారు చక్రాలతోనూ, మనస్సును స్టీరింగుతోనూ, కారు నడిపే డ్రైవరును బుద్ధితోనూ పోల్చవచ్చు. కారును ఎంత వేగంగా నడిపినా, అవసరమైనప్పుడు వేగం తగ్గించగలిగే నైపుణ్యం ఉండాలి డ్రైవరుకు. అలా శరీరాన్ని, ఇంద్రియాలను, మనస్సును అదుపులో ఉంచుకోగలిగిన వ్యక్తి మనస్సును సమతుల్యంగా ఉంచుకోగలడు. అతనికి భావోద్రేకాలు అంత వేగంగా కలగవు. ఒకవేళ కోపం వచ్చినా త్వరగా బయట పడగలడు.

శ్లో. 65 **ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే ।**
**ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే ॥**
ప్రసాదే, సర్వదుఃఖానామ్, హానిః, అస్య, ఉపజాయతే,
ప్రసన్నచేతసః, హి, ఆశు, బుద్ధిః, పర్యవతిష్ఠతే ॥

| | | | |
|---|---|---|---|
| ప్రసాదే | = అంతఃకరణ ప్రసన్నత ప్రాప్తించినంతనే | ప్రసన్నచేతసః | = ప్రసన్న మనస్కుడైన కర్మయోగియొక్క |
| అస్య | = ఇతనియొక్క | బుద్ధిః | = బుద్ధి |
| సర్వదుఃఖానామ్ | = సమస్త దుఃఖములకును | ఆశు, హి | = శీఘ్రముగానే (వెంటనే) |
| హానిః ఉపజాయతే | = అభావము కలుగును, సమస్త దుఃఖములును తొలగిపోవును | పర్యవతిష్ఠతే | = పరమాత్మయందే పూర్తిగా స్థిరమగును |

**ప్రసాదే అస్య సర్వ-దుఃఖానాం హానిః ఉపజాయతే ।**
**ప్రసన్న-చేతసః హి బుద్ధిః ఆశు పర్యవతిష్ఠతే ॥**

తా: వీనికి ప్రసాదము లభించగా సకల దుఃఖములు దూరమగును. ఏలయనగా, ప్రసన్నమైన మనస్సు గలవానికి బుద్ధి శీఘ్రముగా అంతటా ఆత్మస్వరూపముగా నిశ్చలమగును.

సమత్వబుద్ధి ఉంటే కలిగే ప్రయోజనమేమిటో వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ ఈ శ్లోకంలో. ముందే చూసినట్లుగా ప్రసాదం అంటే మనం తినే ప్రసాదం కాదు, సమత్వం. దీన్నే ప్రసన్నచిత్తం అనీ, శాంతి అనీ కూడా అనవచ్చు. ప్రసాదం రెండురకాల లాభాలను కలుగజేస్తుంది. ఏమిటవి?

**ఎ). సర్వదుఃఖానాం హానిః అస్య ఉపజాయతే-** అన్ని దుఃఖాలు నశిస్తాయి. సమత్వం అన్ని దుఃఖాలను నశింపజేస్తుంది అంటే, సమత్వం ఆనందాన్ని తీసుకువస్తుంది అని అర్థం.

వేదాంతం ప్రకారం ఆనందం బాహ్యప్రపంచంలో లేదు. బాహ్యప్రపంచం మనకు ఇసుమంతైనా ఆనందాన్ని ఇవ్వలేదు. ఇది ఒక సూత్రం. రెండవసూత్రం, బాహ్యప్రపంచం మనకు ఆనందాన్ని ఇవ్వనవసరం లేదుకూడా! ఎందుకు? మనమే ఆనందస్వరూపులం కాబట్టి. ఒక కుక్క ఎండిన ఎముకను కొరుకుతుంటే, దాని పళ్ళలోంచి రక్తం కారుతుంది. అది ఆ రక్తం ఎముకనుంచి వస్తోందనుకుంటుంది. ఎందుకు? ఆ ఎముక కొరకక ముందు రక్తం లేదు, కొరికాకే వచ్చింది కాబట్టి. దీన్ని కుక్క తర్కం అంటారు.

వేదాంతం, మనమేమీ తక్కువ తినలేదు అంటున్నది. మనం కూడా ఒక వస్తువును పొందితే ఆనందం కలుగుతుంది అనుకుంటున్నాము. ఎందుకు? ఆ వస్తువును పొందకముందు ఆనందం లేదు, పొందాక ఆనందం కలిగింది కాబట్టి, ఆ వస్తువులోనే ఆనందం ఉంది అనుకుంటున్నాము. వేదాంతం, ఆ వస్తువు కూడా ఆ ఎముక లాంటిదే అంటున్నది. ఎముకలో ఇసుమంతైనా రక్తం లేనట్టే, వస్తువులో ఇసుమంతైనా ఆనందం లేదు. ఎముక,

తనలో లేని అంటే కుక్కలోనే ఉన్న రక్తాన్ని బయటకు తెచ్చినట్టుగా, వస్తువు మనలోనే ఉన్న ఆనందాన్ని బయటకు తెస్తుంది. ఎలా? తాత్కాలికంగా, మన మానసిక చికాకులను పక్కన పెట్టటం ద్వారా!

మానసిక చికాకులు మన ఆనందానికి అడ్డుపడుతున్నాయి. ఇంద్రియాలను, మనస్సును అదుపులో పెట్టుకుంటే, మానసిక చికాకులు తొలగిపోయి, మన ఆత్మానందం వెలికివస్తుంది. అందువల్ల ప్రసాదచిత్తం ఉంటే అన్ని దుఃఖాలూ సమసిపోతాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎప్పుడైతే చికాకులు పోతాయో, అప్పుడే శాంతి పొందుతాము అని ముందు శ్లోకంలో చెప్పాడు. అందువల్ల **శాంతి బాహ్యంగా లేదు, మనలోంచే వస్తుంది**. ఇది లాభం!

**బి). ప్రసన్నచేతసః బుద్ధిః పర్యవతిష్ఠతే –** బుద్ధి ప్రసన్నంగా ఉంటే, ఆత్మజ్ఞానం బలంగా నెలకొని ఉంటుంది. మనం ఎంత ఆహారం తీసుకున్నామన్నది కాదు లెక్క, ఎంత ఆహారం జీర్ణించుకున్నామన్నది లెక్క. అలాగే ఎంత నేర్చుకున్నామన్నది కాదు ముఖ్యం, ఎంత జీర్ణించుకున్నామన్నది ముఖ్యం. మనస్సు స్థిరంగా ఉంటే, జ్ఞానం బాగా జీర్ణించుకోబడుతుంది. బుద్ధిః అంటే జ్ఞానం, ప్రజ్ఞ. పర్యవతిష్ఠతే అంటే ప్రజ్ఞ, స్థితప్రజ్ఞగా మారుతుంది. ప్రజ్ఞకు స్థితప్రజ్ఞకు మధ్య వ్యత్యాసం ఏమిటి? స్థితప్రజ్ఞ ఉంటే మన దైనందిన జీవితంలో క్లిష్టపరిస్థితిని ఎదుర్కొనేటందుకు అందుబాటులో ఉంటుంది.

శ్లో. 66 **నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా ।**
**న చాభావయతః శాంతిః అశాంతస్య కుతః సుఖమ్ ॥**
న, అస్తి, బుద్ధిః, అయుక్తస్య, న, చ, అయుక్తస్య భావనా,
న, చ, అభావయతః, శాంతిః, అశాంతస్య, కుతః, సుఖమ్ ॥

| | | | |
|---|---|---|---|
| అయుక్తస్య | = ఇంద్రియములను, మనస్సును వశమునందుంచుకొననివాని యందు | న | = కలుగదు |
| బుద్ధిః | = నిశ్చయాత్మక బుద్ధి | చ | = ఇంకా |
| న, అస్తి | = ఉండదు | అభావయతః | = పరమాత్మ భావన లేనివానికి |
| చ | = ఇంకా | శాంతిః | = శాంతి |
| అయుక్తస్య | = అయుక్తుడైన వానియొక్క (అంతఃకరణమందు) | న | = లభింపదు |
| భావనా | = పరమాత్మ భావనయును | అశాంతస్య | = శాంతి లేనివానికి |
| | | సుఖమ్ | = సుఖము |
| | | కుతః | = ఏ విధముగా లభించును? |

**అయుక్తస్య బుద్ధిః న అస్తి, అయుక్తస్య చ భావనా న (అస్తి),**
**అభావయతః చ శాన్తిః న (అస్తి), అశాన్తస్య సుఖం కుతః ॥**

తా: చిత్తసమాధానము లేనివానికి ఆత్మస్వరూపమునకు చెందిన జ్ఞానము ఉండదు. చిత్తసమాధానము లేనివానికి ఆత్మజ్ఞానమునందు భావన (తీవ్రమగు ఇచ్ఛ) ఉండదు. ఆత్మజ్ఞానమునందు తీవ్రమైన ఇచ్ఛ లేనివానికి మనశ్శాంతి ఉండదు. మనశ్శాంతి లేనివానికి సుఖమెక్కడిది? (సుఖము లేదు).

ఈ శ్లోకంలో శమము, దమములను పాటించాలని వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. జ్ఞానం పొందాలంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలని చూశాము. శమదమాలు అంటే ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహాలు. అవి లేకపోతే వాటిని సరిగ్గా పాటించలేము.

శ్రవణం అంటే గురువు దగ్గర శాస్త్రపఠనం చేయటం. ఒక గురువు బోధిస్తుంటే, వెళ్ళి గీత వినాలనుకుంటేనే మీ బుద్ధి మంచి నిర్ణయం తీసుకున్నట్టే. మీ బుద్ధి గీతాశ్రవణం మీకు మంచిది అనే మంచి నిర్ణయం చెప్పింది. అంతవరకూ బాగుంది కాని అదొక్కటే చాలదు. అక్కడికి వెళ్ళి కూర్చున్నాక, మనస్సు ఊరంతా తిరిగి వస్తే, అంతదూరం మీరు వెళ్ళి కూడా లాభం లేదు.

ఒకసారి స్వామీజీ బోధ అంతా అయ్యాక, ఒకావిడ స్వామీజీ దగ్గరకి వెళ్ళి ఆయనకు ఒక పిన్ను ఇచ్చారుట. అది ఎందుకో అర్థం కాక, స్వామీజీ బిత్తరపోయారట. స్వామీజీ అంగవస్త్రాన్ని పదేపదే సర్దుకుంటున్నారనీ, దానికి పిన్ను పెట్టుకుంటే, ఆయన ఇబ్బంది పడకుండా, తన బోధను నిరాటంకంగా కొనసాగించవచ్చనీ సూచించారుట. అంటే దానర్థం ఏమిటి? ఆమె స్వామీజీ చెప్పినదేమీ వినలేదు, ఆయన అంగవస్త్రాన్ని గమనించటంతోనే సరిపోయిందామెకు.

గీతను పురాణం విన్నట్టుగా వినలేరు. గీత కష్టమైన అంశం కాబట్టి, దాన్ని పూర్తి ఏకాగ్రతతో వినాలి. ఉపనిషత్తు ఎలా ఒక్కొక్క దశ దాటుకుంటూ వచ్చి ఆత్మజ్ఞానం కలుగజేస్తుందో, అలాగే ఉపనిషత్తుల సారం అయిన గీత కూడా దశలవారీగా ఆత్మజ్ఞానాన్ని కలుగజేస్తుంది. మధ్యలో ఏ ఒక్కదశ మిస్సయినా, తరువాత దశ అర్థం కాదు. అంటే మనస్సును దానిమీదే నిలపాలి.

ఒకసారి చిన్మయానందస్వామిజీ ఉత్తరకాశీలో వారికి క్యాంపు ఏర్పాటుచేశారు. అక్కడకి మిలటరీ ఆఫీసర్లు వచ్చారు. చిన్మయానంద స్వామివారి బోధ వినాలని వచ్చారు. కాని వారు వారి బూట్లు టకటక లాడించుకుంటూ, హాలులోకి వచ్చేసరికి వారందరి దృష్టి స్వామినుంచి ఆఫీసర్లమీదకు మళ్ళింది. అప్పుడు చిన్మయానందస్వామి వేదాంత విద్యార్థులు ఎలా ఉండాలో వివరించారు –

**కాకదృష్టి బకధ్యానం శ్వాననిద్రా తథైవ చ ।**
**అల్పాహారం జీర్ణవస్త్రమ్ ఏవం విద్యార్థిలక్షణమ్॥**

విద్యార్థి ఎవరు? **కాకదృష్టి** – కాకికున్న ఏకాగ్రత ఉండాలి; **బకధ్యానం** – కొంగ నది ఒడ్డున తపస్సు చేస్తున్నట్టు నిలుచుని చేప రాగానే, వంగి టక్కున పట్టుకుంటుంది. అలాటి ధ్యానం చేయాలి; **శ్వాననిద్రా** – చిన్న అలికిడి అయినా లేస్తుంది కుక్క. అలాంటి నిద్ర పోవాలి; **అల్పాహారం** – చాలా తక్కువ తినాలి; **జీర్ణవస్త్రమ్** – సామాన్యమైన దుస్తులు ధరించాలి; **ఏవం విద్యార్థిలక్షణమ్** – ఇవి విద్యార్థి లక్షణాలు.

మీ ముందు ఎవరైనా నడుస్తున్నా, గురువు బోధ చేస్తున్నంతసేపూ మీ దృష్టిని మరల్చకూడదని చెబుతుండేవారు చిన్మయానందస్వామి. అలా దృష్టిని మరల్చకపోతే, మీకు ఏకాగ్రత ఉన్నట్టు అర్థం. అందువల్ల అలా ఏకాగ్రతతో వినాలంటే శమ, దమాలు ఉండాలి. విన్నది మననం చేసుకోవాలంటే శమము, దమము ఉండాలి. నిదిధ్యాసనంలో ప్రజ్ఞను, స్థితప్రజ్ఞగా మలుచుకోవాలంటే శమము, దమము కావాలి. శమ, దమాలు ఉన్న వ్యక్తిని యుక్తపురుషుడు అంటారు. అయుక్తపురుషుడు అంటే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేని వ్యక్తి.

**అయుక్తస్య బుద్ధిః న అస్తి** – ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేని వ్యక్తికి శ్రవణ, మననాలు సాధ్యం కావు. గీతా పరిభాషలో చెప్పాలంటే ప్రజ్ఞ సాధ్యం కాదు. బుద్ధిః నాస్తి అంటే ప్రజ్ఞ నాస్తి.

**శ్రవణ మనన జన్య ప్రజ్ఞా న సంభవతి**

**అయుక్తస్య భావనా (అపి న అస్తి)** – భావన అంటే నిదిధ్యాసనం. నిదిధ్యాసనం అంటే ఏమిటో మనం చూడలేదు. దీన్ని వివరంగా కృష్ణపరమాత్మే ఆరవ అధ్యాయంలో చర్చిస్తాడు. అప్పుడు దాని గురించి చూద్దాము. శమ, దమాలు లేకపోతే శ్రవణ, మననాలే కాదు, నిదిధ్యాసనం కూడా సాధ్యం కాదు. ఈ మూడు సాధ్యం కాకపోతే, దాని పర్యవసానం ఏమిటి?

**అభావయతః శాంతిః న (అస్తి)** – ఈ మూడూ చేయని వ్యక్తికి శాంతి కూడా ఉండదు. గుర్తుంచుకోండి, గీతాబోధ కాలేజీ విద్యలాగా, నేర్చుకుని వదిలేసేది కాదు. అందువల్లనే స్వామీజీ ప్రవచనం, ఉపన్యాసం, ప్రసంగం పదాలను ఉపయోగించటానికి ఇష్టపడరు. ప్రవచనం వేరు, బోధ వేరు. బోధ క్లాస్‌రూమ్ టీచింగ్‌లాగా ఉంటుంది. ఎక్కడ బోధ ఉంటుందో, అక్కడ ఏకాగ్రత అవసరం. కాలేజీ విద్యలాగా ఒక క్రమపద్ధతిలో సాగుతుంది. కాని కాలేజీ చదువులకు ఒక డిగ్రీ వస్తుంది. ఇక్కడ గీతాబోధయొక్క ఉద్దేశ్యం కేవలం డిగ్రీ ఇచ్చి పంపించేయటం కాదు, నేర్చుకున్న విషయం జీవితపాఠం. అది మనలో ఒక పూర్తి మార్పును తీసుకువస్తుంది. మన దృక్పథంలో మార్పు తెస్తుంది; మన ఆలోచనా తీరులో మార్పు తెస్తుంది; మనను మనం అర్థం చేసుకునే తీరులో మార్పు తెస్తుంది; మనం జగత్తును అర్థం చేసుకునే తీరులో మార్పు తెస్తుంది. అటువంటి మార్పు మనశ్శాంతిని తెస్తుంది. గీతాధ్యయనంవల్ల ఆచరణలో మార్పు వస్తుంది. దాని ఫలంగా శాశ్వతమైన శాంతి కలుగుతుంది. అందువల్ల గీతాధ్యయనం చేసి, శాశ్వతమైన శాంతిని పొందాలి. అది చేయని వారికి శాంతి లేదు.

**అశాంతస్య కుతః సుఖమ్** – మనశ్శాంతి లేనివానికి సుఖం ఎలా కలుగుతుంది? మనశ్శాంతి లేని వ్యక్తికి ఆత్మానందం కలగదు. ఎందుకంటే ఆత్మానందం ప్రశాంతమైన మనస్సులోనే ప్రతిబింబిస్తుంది. అద్దం కదులుతుంటే, ఎలా మన ప్రతిబింబం సరిగ్గా ఏర్పడదో, అలాగే మనస్సనే అద్దం కలత చెందుతూ, స్థిరంగా లేకపోతే ఆత్మానందం అందులో ప్రతిబింబించదు.

ఎలాగైతే మీ ముఖాన్ని పరిశుద్ధమైన అద్దంలో చూడగలరో, అలాగే ఆత్మానందాన్ని ప్రసన్నమైన మనస్సులో చూడగలరు.

ప్రశాంతతను వేరే విధంగా పొందినా కూడా, అది శాశ్వతమైన శాంతి కాదు. 'నేను ఫలానా ఆశ్రమానికి వెళ్ళి, అక్కడ శాంతి పొందాను,' అని మీరు చెప్పినా అది భూతకాలం అవుతుంది. పొందాను అంటే అక్కడ ఉండగా పొందారు, ఇప్పుడు లేదు ఆ శాంతి. అలా దేనిద్వారా శాంతి పొందినా అది పోయేదే కాని నిలిచేది కాదు.

ఆత్మజ్ఞానం ఒక్కటే శాశ్వతమైన శాంతినివ్వగలదు.

**తేషాం శాంతిః శాశ్వతీ న ఇతరేషామ్** – కఠ 2.2.13

ఆత్మజ్ఞానం లేకపోతే, ఎలా శాంతి, ఆనందం పొందగలవు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 67 **ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽను విధీయతే ।**
**తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంభసి ॥**
ఇంద్రియాణామ్, హి, చరతామ్, యత్, మనః, అను, విధీయతే,
తత్, అస్య, హరతి, ప్రజ్ఞామ్, వాయుః, నావమ్, ఇవ, అంభసి ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఎందుకంటే | ఇంద్రియాణామ్ | = ఇంద్రియములలో |
| అంభసి | = నీటియందు (సంచరించు) | మనః | = మనస్సు |
| నావమ్ | = నావను | యత్, అను | = ఏ ఇంద్రియముతో |
| వాయుః హరతి, | = వాయువు ఎలా హరించునో | విధీయతే | కూడియుండునో |
| ఇవ | (నెట్టివేయునో) | తత్ | = ఆ ఒక్క ఇంద్రియమే |
| చరతామ్ | = (అలాగే) శబ్దాది | అస్య | = ఈ అయుక్తుడైన పురుషునియొక్క |
| | విషయములందు | ప్రజ్ఞామ్ (హరతి) | = బుద్ధిని హరించును |
| | చరించుచున్నట్టి | | |

**చరతామ్ ఇంద్రియాణాం హి యత్ మనః అనువిధీయతే,**
**తత్ అస్య ప్రజ్ఞామ్ అంభసి హరతి వాయుః నావమ్ ఇవ॥**

తా: ఎందుకంటే ఇంద్రియములు తమ తమ విషయములయందు ప్రవర్తిల్లుచుండగా, వాటి వెనుక ఏ మనస్సు ప్రవర్తిల్లునో, ఆ మనస్సు వీని వివేకప్రజ్ఞను, నీటియందలి నావను గాలి వలె, నశింపజేయును.

ఈ శ్లోకంలోనూ, తర్వాత వచ్చే శ్లోకంలోనూ కృష్ణపరమాత్మ ఇంద్రియనిగ్రహం గురించి నొక్కి వక్కాణిస్తున్నాడు. ఇంద్రియ నిగ్రహం లేకపోతే, అది మనస్సులో ఆత్మజ్ఞానం కలగనివ్వదు. మనం పనిగట్టుకుని వెళ్ళి, ఒక బోధలో కూర్చున్నా కూడా కళ్ళు, చెవులు ఎటో వెళ్ళిపోతే, జ్ఞానం కలుగదు. అరిగిపోయిన గ్రామఫోను రికార్డులో పాట సరిగ్గా రాదు. మధ్యమధ్యలో ఆగిపోతుంది. అలా మనస్సు అర్థం చేసుకున్న విషయాలలో మధ్యలో ఖాళీలు ఏర్పడతాయి. ఒక విషయం వివరించటానికి గురువు ఒక జోక్ చెపితే, జోక్ గుర్తుండిపోతుంది కాని, ఆ జోక్ ఏ సందర్భంలో చెప్పారో గుర్తుండదు. జోక్‌ని ఊరగాయలా వాడుకోవాలి. ఊరగాయను

పెరుగన్నంలో నంచుకు తినాలి తప్ప, ఊరగాయలో పెరుగు నంచుకోకూడదు. అలాగే జోక్‌ను గీతలోని కాన్సెప్టును అర్థం చేసుకోవటానికి గుర్తుంచుకోవాలే తప్ప, అదే ముఖ్యమనుకోకూడదు. ఇంద్రియాలను అదుపులో పెట్టుకోకపోతే, జ్ఞానం పొందలేము. ఒకవేళ పొందినా, అదుపుతప్పిన ఇంద్రియాలు ఆ జ్ఞానాన్ని దొంగలించివేస్తాయి. సరిగ్గా మనకు ఆ జ్ఞానం అవసరమైన క్లిష్టపరిస్థితుల్లో మనకు అందుబాటులో లేకుండా చేస్తాయి.

**ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽను విధీయతే** – చరతాం అంటే గడ్డి మేస్తున్న ఆవు అంతటా కదులు తున్నట్టు; ఇంద్రియాలు కనుక అంతటా తిరుగుతుంటే, మనః అనువిధీయతే – మనస్సు కూడా వాటి వెనుక వెళితే, ఏమవుతుంది?

**కన్ను వెళ్ళిన వైపు మనస్సు వెళ్ళవచ్చా? మనస్సు వెళ్ళిన వైపు మనిషి వెళ్ళవచ్చా?**

అలా కన్ను వెంట మనస్సు, మనస్సు వెంట మనిషీ వెళితే ఏమవుతుంది?

**తత్ అస్య ప్రజ్ఞాం హరతి** – జ్ఞానం కలగదు. కలిగినా అది దొంగలించబడుతుంది. అంటే ఇంద్రియాలు ఆత్మజ్ఞానాన్ని దొంగిలించివేస్తాయి. అంటే శ్రవణం దశలో జ్ఞానాన్ని పొంది కూడా, దైనందిన జీవితంలో ఆ జ్ఞానం క్లిష్టపరిస్థితిలో ఉపయోగ పడకపోతే, దాన్ని ఇంద్రియాలనే దొంగలు అపహరించినట్లే!

ఇది వివరించటానికి కృష్ణపరమాత్మ ఒక ఉదాహరణను ఇస్తున్నాడు. ఒక పడవలో ప్రయాణించే వ్యక్తి, ఎటు వెళ్ళాలో నిశ్చయించుకోవాలి. తన గమ్యానికి తన పడవను చేర్చేందుకు అతనికి తెప్పలు కావాలి. అతని దగ్గర తెప్పలు లేకపోతే ఏమవుతుంది? గాలి తనకు ఇష్టమొచ్చినట్టు ఆ నావను తీసుకుపోతుంది. ఇటు తీసుకువెళ్ళనా అని నావికుణ్ణి అడగదు. అది అడ్డదిడ్డంగా తీసుకువెళ్ళి, ఏ బండరాయికో పడవను ఢీకొట్టేలా చేసి, పడవతో సహా పడవలో ఉన్న వ్యక్తిని కూడా ముంచేయగలదు. అలాగే అదుపులో లేని ఇంద్రియాలు, మనస్సు కూడా ఒక వ్యక్తిని ఎటుపడితే అటు అతన్ని లాక్కువెళ్ళి, అతన్ని ముంచివేయవచ్చు!

**బుద్ధినాశాత్ ప్రణశ్యతి**

**వాయుర్నావమివాంభసి** – అదుపులో లేని మనస్సును వాయువుతోనూ, జ్ఞానాన్ని నావతోనూ పోలుస్తున్నాడు కృష్ణపరమాత్మ. జ్ఞానాన్ని నావతో ఎందుకంటే, జ్ఞానమనే నావ, సంసారమనే సాగరానికి ఆవలి ఒడ్డుకు తీసుకు వెళుతుంది. కాని గాలిలాంటి మనస్సు, జ్ఞానమనే నావను నాశనం చేస్తుంది. నావను నాశనం చేస్తే, నావలో ప్రయాణం చేసే ప్రయాణీకుడు కూడా నాశనమవుతాడు. ఇదంతా ఎందువల్ల జరుగుతున్నది? ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేకపోవటంవల్ల. దీన్ని తరువాత వచ్చే శ్లోకంలో ముగిస్తున్నాడు.

శ్లో. 68 **తస్మాద్యస్య మహాబాహో! నిగృహీతాని సర్వశః ।**
**ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**
తస్మాత్, యస్య, మహాబాహో, నిగృహీతాని, సర్వశః,
ఇంద్రియాణి, ఇంద్రియార్థేభ్యః, తస్య, ప్రజ్ఞా, ప్రతిష్ఠితా ॥

| | | | |
|---|---|---|---|
| తస్మాత్ | = అందువల్ల | సర్వశః | = అన్ని విధముల |
| మహాబాహో | = ఓ అర్జునా! | నిగృహీతాని | = నిగ్రహింపబడునో |
| యస్య | = ఎవరియొక్క | తస్య | = అతనియొక్క |
| ఇంద్రియాణి | = ఇంద్రియములు | ప్రజ్ఞా | = బుద్ధి |
| ఇంద్రియార్థేభ్యః | = ఇంద్రియ విషయములనుంచి | ప్రతిష్ఠితా | = సుస్థిరమగును |

**తస్మాత్ హే మహాబాహో! యస్య ఇంద్రియాణి ఇంద్రియ–అర్థేభ్యః సర్వశః నిగృహీతాని।**

**తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా॥**

తా: గొప్ప బాహువులు గల ఓ అర్జునా! కావున, ఎవరి ఇంద్రియములైతే ఇంద్రియముల విషయములైన శబ్దాదులనుంచి అన్ని ప్రకారములుగా నిగ్రహించబడినవో, అతనియొక్క బుద్ధి సుస్థిరమగును.

ఈ శ్లోకంతో స్థితప్రజ్ఞ సాధనల అంశాన్ని ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**తస్మాత్** – అందువల్ల. ఎందువల్ల? ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఇంద్రియనిగ్రహం ప్రముఖపాత్ర వహిస్తుంది కాబట్టి.

**యస్య ఇంద్రియాణి నిగృహీతాని సర్వశః**– సాధకుడు ఇంద్రియాలను అన్నివిధాలా నిగ్రహించుకోవాలి.

**ఇంద్రియార్థేభ్యః** – ఇంద్రియ విషయవస్తువులనుంచి మనం పదేపదే ఒక విషయం గుర్తుంచుకోవాలి ఇక్కడ. కృష్ణపరమాత్మ ఇంద్రియాలను అదుపులో పెట్టుకో మంటున్నాడు కాని, అణగద్రొక్కమనటం లేదు. అదుపులో పెట్టటం వేరు, అణగద్రొక్కటం వేరు. మనదేశం మనను ఇంద్రియాలను అణగద్రొక్కమంటోందని అపోహ పడతారు పాశ్చాత్యులు. అందువల్ల అణగద్రొక్కవద్దంటారు వారు.

రెండూ ప్రమాదమే! అణగద్రొక్కటం ఎంత ప్రమాదమో, వాటిని గాలికి వదిలేయటమూ ప్రమాదమే. గీత అణగద్రొక్కమనటం లేదు; బుద్ధిని ఉపయోగించి అదుపులో పెట్టుకోమంటున్నది. గలగలా ప్రవహించే నదిని ఆపితే, వరదలు వస్తాయి; ఆపకపోతే వృథాపోతుంది. అందువల్ల నదిని ఆపకూడదు, సముద్రంలో వృథాగా కలవనివ్వకూడదు. దానికి ఆనకట్ట కట్టి, మనకు కావాల్సిన మార్గంలోకి తిప్పాలి. ఇంద్రియాలను కూడా అంతే. వాటిని అణగద్రొక్కకూడదు; గాలికీ వదిలేయకూడదు; వాటిని బుద్ధితో నియంత్రించి, మనకు కావాల్సిన వైపుకు నిర్దేశించుకోవాలి. అంటే ఇంద్రియాలకు, మనస్సుకు దిశానిర్దేశం చేయాలి. దాన్ని నిగ్రహం అంటారు.

ఏకాగ్రత చూపటం కష్టమేమీ కాదు. పిల్లలకు అది అమోఘంగా ఉంటుంది. ఒక చీమ పాకుతుంటే, దాన్ని తదేకంగా చూస్తారు. మధ్యలో తల్లి గావుకేకలు వేసినా వినిపించదు అంటే చీమ సమాధిలో ఉంటారు వారు. అంతేకాదు వారి జ్ఞాపకశక్తి కూడా అమోఘం. ఫోటో తీసినట్టుగా, ఒక విషయం వారి మనస్సులో నిలిచిపోతుంది. ఏదైనా ఒక్కసారి వింటే చాలు, ఇట్టే పట్టేస్తారు వారు. ఒక పాట ఒక్కసారి వింటే చాలు, పాడేస్తారు. అలాంటి వారికి గీత నేర్పిస్తే, దాన్ని కూడా ఇట్టే నేర్చేసుకుంటారు. కాని మనం ఎదిగే తతంగంలో ఈ రెండింటినీ

కోల్పోయాము. ఏకాగ్రత లేదు, అఖండమైన జ్ఞాపకశక్తీ లేదు. మనకు లేక కాదు, మనం వినియోగించుకోవటం లేదు. అందువల్ల సాధకుడు ఇంద్రియనిగ్రహం పాటించాలి.

**తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా** – అప్పుడు అతను జ్ఞానాన్ని పొందగలడు; పొందిన జ్ఞానాన్ని జీర్ణించుకోగలడు కూడా!

ఇక్కడిదాకా అంటే స్థితప్రజ్ఞ భాగంలో కృష్ణపరమాత్మ రెండు అంశాలను చర్చించాడు. అవి స్థితప్రజ్ఞ లక్షణాలు (55–57), స్థితప్రజ్ఞ సాధనలు (58–68). ఇప్పుడు, అంటే 69వ శ్లోకంనుంచి మళ్ళీ స్థితప్రజ్ఞ లక్షణాలకు వస్తున్నాడు కృష్ణపరమాత్మ. స్థితప్రజ్ఞుడు అంటే సాధనలు అయిపోయి, సిద్ధ పురుషుడు అయిన వ్యక్తి. సాధకుడు అంటే ప్రజ్ఞను స్థితప్రజ్ఞగా మలచుకునే దశలో ఉన్న వ్యక్తి; సిద్ధపురుషుడు అంటే పూర్తిగా మారిన వ్యక్తి.

శ్లో. 69 **యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥**
యా, నిశా, సర్వభూతానామ్, తస్యామ్, జాగర్తి, సంయమీ,
యస్యామ్, జాగ్రతి, భూతాని, సా, నిశా, పశ్యతః, మునేః ॥

| | | | |
|---|---|---|---|
| సర్వభూతానామ్ | = సమస్త ప్రాణులకును | యస్యామ్ | = నశ్వరమైన ఏ సాంసారిక సుఖప్రాప్తియందు |
| యా | = ఏదైతే | | |
| నిశా | = రాత్రియో (రాత్రితో సమానమో) | భూతాని | = సకల ప్రాణులును |
| తస్యామ్ | = దానియందు (ఆ నిత్య జ్ఞానరూపపరమానంద ప్రాప్తియందు) | జాగ్రతి | = మేల్కొనియుండునో |
| | | పశ్యతః | = పరమాత్మతత్త్వము తెలిసిన |
| | | మునేః | = జ్ఞానికి |
| సంయమీ | = స్థిత ప్రజ్ఞుడైన యోగి | సా | = అది |
| జాగర్తి | = మేల్కొనియుండును | నిశా | = రాత్రి (రాత్రితో సమానము) |

**యా సర్వభూతానాం నిశా, తస్యాం సంయమీ జాగర్తి।**
**యస్యాం భూతాని జాగ్రతి, సా పశ్యతః మునేః నిశా॥**

తా: ఏదైతే సకలప్రాణులకు రాత్రియో, జితేంద్రియుడగు యోగి దానియందు తెలివిగానుండును. దేనియందైతే ప్రాణులు తెలివిగానుండునో, పరమార్థదర్శియగు జ్ఞానికి అది రాత్రి.

**ii). స్థితప్రజ్ఞ లక్షణాలు –** 69 నుంచి 72 వరకు ఈ సిద్ధపురుషుని గురించి చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

69, 70 శ్లోకాలు చాలా ముఖ్యమైన శ్లోకాలు. ముందు చూసినట్టుగా, ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ స్థితప్రజ్ఞుని లక్షణాలను కీర్తిస్తున్నాడు. జ్ఞానిని స్తుతించటానికి, అజ్ఞానితో పోలుస్తున్నాడు అతనిని. ఆ విధంగా జ్ఞానికి–అజ్ఞానికి, ముక్తపురుషునికి–సంసారికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఎత్తి చూపుతున్నాడు.

కృష్ణపరమాత్మ చెప్పాలనుకుంటున్న అంశం ఇది – జ్ఞాని, అజ్ఞాని – ఇద్దరూ కూడా ఒకే జగత్తును చూస్తారు. జ్ఞానికి హఠాత్తుగా ప్రపంచం మారిపోదు. జగత్తు ముందెలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంటుంది; మనుష్యులు

కూడా ముందెలా ఉంటారో ఇప్పుడూ అలాగే ఉంటారు. వేదాంతం జగత్తును మార్చటానికి ప్రయత్నించదు; వేదాంతం మనుష్యులను మార్చటానికి ప్రయత్నించదు. ఎందుకంటే అవి సాధ్యమయ్యే పనులు కావు. అయితే వేదాంతం ఏం చేస్తుంది? మనను మారుస్తుంది. మనం ప్రపంచాన్నీ, మనుష్యులనూ, పరిస్థితులనూ చూసే తీరును మారుస్తుంది. అంటే మన దృక్పథాన్ని మారుస్తుంది.

జ్ఞానికి జ్ఞానం పొందాక కూడా ప్రపంచం అలాగే ఉంటుంది; సమస్యలు అలాగే ఉంటాయి; మనుష్యులు అలాగే ఉంటారు. మోసగాళ్ళు, అబద్ధాలకోరులు, లంచగొండులు, దొంగలు, అవమానపరిచేవారు – అందరూ అలాగే ఉంటారు. ఇవి కాక, జ్ఞానికి ఉండే ప్రారబ్ధకర్మ అలాగే ఉంటుంది.

మనకు మూడు రకాల కర్మలుంటాయి. సంచితకర్మలు, ప్రారబ్ధకర్మలు, ఆగామికర్మలు. సంచితకర్మలు అంటే జన్మజన్మలలో మనం ప్రోగుచేసుకున్న పుణ్య, పాపకర్మల ఫలాలన్నీ (ఒక సంచీలో) మోసుకువస్తాయి ఈ జన్మలోకి. వాటిలో కొన్ని ప్రారబ్ధకర్మలుగా మారి ఈ జన్మ ఏర్పడటానికి దోహదం చేస్తాయి. ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ ఈ భూమ్మీద నిలిచి ఉంటాము. అది రాలిపోయిన మరుక్షణం మనం కూడా రాలిపోతాము. ఆగామికర్మలు అంటే ఈ జన్మలో మనం చేసుకున్న పుణ్య, పాపాల ఫలం. జ్ఞాని విషయానికి వస్తే అతను జ్ఞానం పొందేసరికి, అతని జ్ఞానాగ్ని సంచితకర్మలను దహించివేస్తుంది; జ్ఞానం పొందాక తను అకర్తా, అభోక్తా అని అర్థం చేసుకుంటాడు కాబట్టి, కొత్తగా వచ్చే ఆగామికర్మలు రావు. ప్రారబ్ధకర్మలు ఉంటాయి. అవి అయ్యేదాకా ఈ భూమ్మీద ఉంటాడు, కాకపోతే అవి కూడా అతన్ని బాధించవు. ఎందుకంటే అతను తన జ్ఞానాన్ని ఉపయోగించి, నేను శరీరం కాదు, మనస్సు కాదు అని అర్థం చేసుకుంటాడు. అందువల్ల మనశ్శరీరాలకు కలిగే బాధలు అతన్ని బాధించవు.

**జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణమ్** – 4.19

జ్ఞాని, అజ్ఞాని ఇద్దరూ ఒకే జగత్తులో జీవిస్తున్నప్పుడు, వారి స్పందనలో ఏమిటి వ్యత్యాసం? ఈ ప్రశ్నకు జవాబునిస్తున్నాడు కృష్ణపరమాత్మ. జ్ఞాని, అజ్ఞానుల స్పందన ఒకదానికొకటి పూర్తి భిన్నంగా ఉంటుంది. దానికి కృష్ణపరమాత్మ ఒక ఉదాహరణనిస్తున్నాడు కాని, దాన్ని చూసే ముందు మరోరెండు, తేలికగా అర్థమయ్యే, ఉదాహరణలు చూద్దాము.

**ఉదాహరణ 1 – సముద్రపుటొడ్డున కూర్చున్న జ్ఞాని, అజ్ఞాని**

ఇద్దరు వ్యక్తులు సముద్రపుటొడ్డున కూర్చుని తదేకంగా సముద్రాన్ని చూస్తున్నారనుకుందాం. సముద్రంలో అలలు ఎగసిపడుతున్నాయి; ఒకదాన్ని మించి ఇంకొకటి పైకి లేచి, ఒడ్డుకు పోటీపడి వస్తున్నాయి. ఒడ్డుకు వచ్చేసరికి అలలు తమ రూపాన్ని కోల్పోతున్నాయి. ఇదీ పరిస్థితి. ఇద్దరూ ఎగసిపడుతున్న అలలనే చూస్తున్నారు. కాని వారి దృక్పథంలో పెద్ద వ్యత్యాసం ఉంది.

జ్ఞానికి అల జ్ఞానం ఉంది. అంటే అల అంటే నామరూపమే కాని, దానికి అధిష్ఠానం నీరు. ఎన్ని అలలు వచ్చి, మాయమయిపోయినా, వాటి నామరూపాలు పోతాయే కాని, వాటికి అధిష్ఠానమైన నీరుకు మరణం

లేదు, అది శాశ్వతం. ఒక్కముక్కలో చెప్పాలంటే జ్ఞాని చూసేది **నామరూపాత్మకమైన అలను కాదు, అద్వైత నిత్య జలాన్ని.**

అల సత్యజ్ఞానం లేని అజ్ఞాని ఏంచేస్తాడు? అలల నామరూపాలే చూస్తాడు. తల్లి అల, తండ్రి అల, తాత అల, భార్య అల, పిల్లవాడి అల – ఇలా అనేకపేర్లు పెట్టుకుని, అనేక బంధాలను పెంచుకుంటాడు. నానాత్వాన్ని చూస్తాడు. ఒక అల పుడితే ఎంత బాగా ఎగసిపడుతోంది అని మురిసిపోయి కేరింతలు కొడతాడు. అది తీరానికి వచ్చి, అల రూపం పోతే బాధపడిపోతాడు. అంటే అతని మనస్సు ఒకసారి అంబరాన్ని అంటితే, ఇంకొకసారి తను కూర్చున్న ఇసుకలోకి జారిపోతుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే అజ్ఞాని చూసేది **నామరూపాత్మకమైన అలను, ద్వైత అనిత్య తరంగాన్ని.**

ఇద్దరూ చూస్తున్నది ఒకటే, కాని భావనలో ఆకాశమంత వ్యత్యాసం ఉంది. చిన్న 'అ' అటూ, ఇటూ మారిస్తే పెద్ద వ్యత్యాసం.

**జ్ఞాని చూసేది – అద్వైత నిత్య జలం**
**అజ్ఞాని చూసేది – ద్వైత అనిత్య తరంగం**
**అద్వైతం నిత్యం, ద్వైతమ్ అనిత్యం.**

**ఉదాహరణ 2 – సినిమా చూస్తున్న జ్ఞాని, అజ్ఞాని**

ఇద్దరు వ్యక్తులు ఒక సినిమా చూడటానికి వెళ్ళారు. సినిమా మొదలవక ముందు ఖాళీగా ఉన్న తెరను చూశారు. సినిమా మొదలయ్యాక తెరమీద ఆడుతున్న సినిమాను చూశారు. అనేక పాత్రధారులు వచ్చి పోతున్నారు, అనేక సంఘటనలు జరిగిపోతున్నాయి; యుద్ధాలు జరిగి రక్తం ఏరులై ప్రవహిస్తోంది, వాన హెూరున కురుస్తోంది; ఇళ్ళను కాల్చి వేస్తున్నారు, చివరికి కథానాయిక మరణిస్తుంది. ఇదీ సినిమా. ఇద్దరూ ఒకే సినిమాని చూశారు. కాని వారి దృక్పథంలో పెద్ద వ్యత్యాసం ఉంది.

జ్ఞానికి తెర జ్ఞానం ఉంది. అంటే సినిమా తాత్కాలికంగా తెరమీద ఆడే బొమ్మలే కాని, వాటికి అధిష్ఠానంగా కదలని, శాశ్వతమైన తెర ఉందని తెలుసు. సినిమాలో రక్తం ఏరులై ప్రవహించినా, వాన హెూరున కురిసినా, అగ్ని ఇళ్ళను దహించివేసినా, తెరకేమీ కాదని తెలుసు. కథానాయిక మరణించినా అది నిజం కాదని తెలుసు. ఆమె బాగా మరణించింది అంటాడు. అంటే మరణించినట్టుగా బాగా నటించింది అంటాడు. అంటే అతను కూడా సినిమాను ఆనందిస్తాడు, కాని బయటకు రాగానే, అందులోని సన్నివేశాలను మర్చిపోతాడు. అంటే జ్ఞానికి **అద్వైత దృష్టి** ఉంది. అంటే అతనికి తెర జ్ఞానం పోలేదు.

అజ్ఞాని సినిమా చూసే ముందు కనబడ్డ ఖాళీ తెరని మర్చిపోతాడు. సినిమాలో మమేకం చెందుతాడు. నవ్వుతాడు, ఏడుస్తాడు, భయపడతాడు, నాయకుణ్ణి ఎవరో చంపటానికి వెనకనుంచి వస్తుంటే 'అయ్యో, వెనక్కి తిరిగి చూడు, వాడు నిన్ను పొడుస్తాడు,' అని అరిచినా అరుస్తాడు. ఇవన్నీ నిజం కాదు, నీడ అని మర్చిపోతాడు.

సినిమాకు అధిష్ఠానమైన తెరను మర్చిపోయి, పైపై నీడలతో మమేకం చెందుతాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే అజ్ఞానికి అద్వైత దృష్టి లేదు, **ద్వైత దృష్టి** ఉంది.

అద్వైత దృష్టి అంటే ఏమిటి? ఆభరణాలు అనేకం, కాని వాటి అధిష్ఠానం బంగారం; అలలు అనేకం, కాని వాటి అధిష్ఠానం నీరు; వస్తువులు అనేకం, కాని వాటి అధిష్ఠానం చెక్క. ఎవరైతే నామరూపాత్మక వస్తువులను దాటి, వాటి అధిష్ఠానాన్ని చూస్తారో, వారు జ్ఞాని. నామరూపాత్మక జగత్తును చూసి, అందులో మమేకం చెందే వ్యక్తి అజ్ఞాని. అతను సంసారి. అందువల్ల **అజ్ఞానికి ద్వైత దృష్టి, జ్ఞానికి అద్వైత దృష్టి** ఉన్నాయి. ఎక్కడ? ఒకటే నామరూపాత్మక జగత్తులో!

ఇప్పుడు శ్లోకంలోకి వెళ్ళేముందు, కృష్ణపరమాత్మ ఇచ్చిన ఉదాహరణను విశ్లేషిద్దాము. ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ అజ్ఞానిని గుడ్లగూబతోనూ, జ్ఞానిని మనిషితోనూ పోలుస్తున్నాడు. జాగ్రత్తగా చూడండి! ఇక్కడ రెండు పోలికలు ఉన్నాయి. అజ్ఞానిని గుడ్లగూబతోనూ, జ్ఞానిని మనిషితోనూ పోలుస్తున్నాడు. కాకపోతే ఇది ప్రత్యక్షంగా చెప్పలేదు. ఇంకో రెండు పోలికలు కూడా ఉన్నాయి ఇందులోనే. పగలును అద్వైతంతోనూ, రాత్రిని ద్వైతంతోనూ పోలుస్తున్నాడు. అంటే ఇప్పుడు మనకు నాలుగు పోలికలు ఉన్నాయి.

**అజ్ఞాని గుడ్లగూబలాంటివాడు; జ్ఞాని మనిషిలాంటివాడు.**
**పగలు అద్వైతంలాంటిది; రాత్రి ద్వైతంలాంటిది.**

ఇప్పుడు వీటి ఆధారంగా నాలుగు వాక్యాలను చూద్దాము.

**1. మనిషి పగలు మేలుకుని ఉండి, మనిషి రాత్రి పడుకుంటాడు.**
**2. గుడ్లగూబ పగలు నిద్రపోయి, గుడ్లగూబ రాత్రి మేలుకుని ఉంటుంది.**

ఇప్పుడు వీటిని వాటి పోలికలతో చూస్తే, విషయం తేలికగా అర్థమవుతుంది. మనిషి=జ్ఞాని; పగలు=అద్వైతం.
మనిషి పగలు మేలుకుని ఉంటాడు = జ్ఞాని అద్వైతానికి మేలుకుని ఉంటాడు.
మనిషి = జ్ఞాని; రాత్రి = ద్వైతం.
మనిషి రాత్రి పడుకుంటాడు = జ్ఞాని ద్వైతానికి పడుకుంటాడు.

ఈ రెండూ కలిపితే, మన మూడవ వాక్యం వస్తుంది.

**3. జ్ఞాని అద్వైతానికి మేలుకుని ఉంటాడు, జ్ఞాని ద్వైతానికి పడుకుంటాడు.**

అంటే జ్ఞాని అద్వైతంలో నెలకొని ఉంటాడు అంటే మొదటి ఉదాహరణలో చూసినట్టుగా జ్ఞాని అలలతో మమేకం చెందక, అలలకు అధిష్ఠానమైన నీరును చూస్తాడు. అందువల్ల ద్వైతంతో జ్ఞాని మమేకం చెందదు.

ఇప్పుడు రెండవ వాక్యాన్ని చూద్దాము. గుడ్లగూబ= అజ్ఞాని; పగలు=అద్వైతం.
గుడ్లగూబ పగలు నిద్రపోతుంది = అజ్ఞాని అద్వైతానికి నిద్రపోతాడు.
గుడ్లగూబ రాత్రి మేలుకుని ఉంటుంది = అజ్ఞాని ద్వైతానికి మేలుకుని ఉంటాడు.

ఈ రెండూ కలిపితే, మన నాలుగవ వాక్యం వస్తుంది.

**4. అజ్ఞాని అద్వైతానికి నిద్రపోతాడు, అజ్ఞాని ద్వైతానికి మేలుకుని ఉంటాడు.**

అంటే అజ్ఞాని ద్వైతభావనలోనే నెలకొని ఉంటాడు; జగత్తులోని నానాత్వంతో మమేకం చెందుతాడు కాని, జగత్తుకు అధిష్ఠానమైన బ్రహ్మను తెలుసుకోడు.

**అజ్ఞాని ద్వైతజగత్తును చూస్తే, జ్ఞాని అద్వైతబ్రహ్మను తెలుసుకుంటాడు.**

దీనికి చెక్కతో చేసిన ఏనుగు ఉదాహరణనిస్తారు మామూలుగా. ఒక గుడిలో చెక్క ఏనుగుని చూసి, అది నిజమని భ్రమించి ఒక చిన్నపిల్లవాడు భయంతో వెనుకకి పారిపోబోయాడు. అతని తండ్రి నచ్చచెప్పి, దగ్గరకు తీసుకువెళ్ళి, తను పక్కన ఉన్నానని, భయం లేదని బుజ్జగించి, ఏనుగును ముట్టుకునేలాగా చేస్తాడు. పిల్లవాడికి ఏనుగును ముట్టుకోగానే అది నిజం ఏనుగు కాదని, చెక్కబొమ్మ అనీ తెలిసింది. చూడండి, ముందు ఏనుగు అని భయపడ్డ పిల్లవాడు, దాన్ని ముట్టుకున్నాక, ఒక బొమ్మగా దాన్ని తేల్చిపారేశాడు. అంటే మొదట భ్రమలో ఉన్నాడు, తరువాత భ్రమను కొట్టిపారేశాడు.

మనమూ అంతే. జగత్తు గురించిన భ్రమలో ఉన్నాము. జగత్తు యొక్క అధిష్ఠానమైన బ్రహ్మను తెలుసుకుంటే భ్రమనుంచి బ్రహ్మదృష్టి పొందుతాము.

**బ్రహ్మను సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది జగత్తు**
**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ**

ఎప్పుడైతే బ్రహ్మను అర్థం చేసుకుంటామో అప్పుడే సర్వం బ్రహ్మమయం జగత్తు అంటాము. బ్రహ్మను చూస్తే, జగత్తు కనబడదు; జగత్తును చూస్తే బ్రహ్మ తెలియదు. జగత్తు నామరూపాత్మక మిథ్యా జగత్తు అని అర్థం చేసుకోవాలి. ఇప్పుడు ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**సర్వభూతానాం యా నిశా** – సర్వభూతానాం అంటే అజ్ఞానులు, యా అంటే అద్వైతం; నిశా అంటే రాత్రి. అంటే అజ్ఞానులకు అద్వైతం రాత్రిలాగా ఉంటుంది. అద్వైతం పగలులాంటిది, కాని దానికి వారు నిద్రపోతున్నారు. నిశా అంటే నిద్రపోతున్నారు. అజ్ఞానులు అద్వైతసత్యానికి నిద్రపోతున్నారు అంటే అద్వైతసత్యాన్ని తెలుసుకోలేక పోతున్నారు. ఇది **4ఎ. అజ్ఞాని అద్వైతానికి నిద్రపోతాడు.**

**తస్యాం సంయమీ జాగర్తి** – సంయమీ అంటే జ్ఞాని. తస్యాం అంటే అద్వైతం; జాగర్తి అంటే మేలుకుని ఉండటం. జ్ఞాని అద్వైతానికి మేలుకుని ఉంటాడు. జ్ఞాని అద్వైతానికి మేలుకుని ఉంటే, ఆ అద్వైతమనే పగలుకు, గుడ్లగూబలాంటి అజ్ఞానులు నిద్రపోతున్నారు. ఇది **3ఎ. జ్ఞాని అద్వైతానికి మేలుకుని ఉంటాడు.**

**యస్యాం జాగ్రతి భూతాని** – యస్యాం అంటే ద్వైతం; భూతాని అంటే అజ్ఞానులు; జాగ్రతి అంటే మేలుకుని ఉంటారు. అంటే అజ్ఞానులందరూ ద్వైతభావనకు మేలుకుని ఉంటారు; మిథ్యనామరూపాలతో మమేకం చెందుతారు. ఇది **4బి. అజ్ఞాని ద్వైతానికి మేలుకుని ఉంటాడు.**

**సా పశ్యతో మునేః నిశా** – నిశా అంటే పడుకుని ఉంటాడు. అంటే జ్ఞాని ద్వైతభావనకు పడుకుంటాడు. ముని అంటే జ్ఞాని. ఇది **3బి.జ్ఞాని ద్వైతానికి పడుకుంటాడు.**

అంటే ఈ శ్లోకం సారాంశం – జ్ఞాని అద్వైతభావనతో నెలకొని ఉంటే, అజ్ఞాని ద్వైతభావనలో మునిగిపోయి ఉంటాడు. జ్ఞాని అంతటా నిత్యాన్ని, శాశ్వతత్వాన్ని చూస్తే, అజ్ఞాని అంతటా అనిత్యాన్ని, అశాశ్వతత్వాన్ని చూస్తాడు. జనన, మరణాలకు చలించిపోతాడు. ఇది ఒక ఉదాహరణ – రాత్రి–పగలు; గుడ్లగూబ–మనిషి.

దీన్ని **గ్రంథగ్రంథి శ్లోకం** అంటారు. అందువల్ల చాలా ముఖ్యమైన శ్లోకం. అర్థం చేసుకోవటానికి చాలా కష్టమైన శ్లోకం కూడా!

వ్యాసాచార్యులు మహాభారతం రచించాలనుకున్నప్పుడు, రాసిపెట్టటానికి ఎవరైనా కావాల్సివచ్చారు. ఆయన ఆ బృహత్కార్యానికి గణపతిని ఎన్నుకున్నారు. వ్యాసాచార్యులు గణపతితో చెప్పారుట 'నేను చెబుతూ పోతుంటే, నువ్వు రాస్తూ పోతుండాలి.' గణపతి దానికి అంగీకారం తెలియజేస్తూనే, ఒక షరతుని విధించారుట 'సరే నేను వ్రాస్తాను, కాని నేను చాలా వేగంగా రాస్తాను, నా వేగానికి తగ్గట్టుగా మీరు కూడా చెప్పాలి. మీరు ఎక్కడన్నా ఆగిపోతే, నేను వెళ్ళిపోతాను!' వ్యాసాచార్యులు కూడా దానికి అంగీకరిస్తూనే ఒక షరతును విధించారుట. 'నీ వేగానికి తగ్గట్టే చెబుతాను కాని నువ్వు రాసేది గుడ్డిగా రాసుకుపోకూడదు. ఆ శ్లోకాన్ని అర్థం చేసుకుని రాయాలి.' ఒప్పందం కుదిరింది. ఆ శ్లోకాలు సిద్ధంగా లేవు. శరవేగంగా వ్యాసాచార్యుల మేధస్సులోంచి, గణపతి ధాటికి తట్టుకుంటూ రావాలి. అందువల్ల ఎక్కడైనా వ్యాసాచార్యులు ఆలోచించాల్సి వచ్చినప్పుడు, ఒక క్లిష్టమైన శ్లోకాన్ని వదిలేవారుట! గణపతి దాన్ని అర్థం చేసుకుని రాయాలిగా! ఆయన తన మేధస్సుకు పదునుపెట్టి అర్థం చేసుకునేలోపు, వ్యాసాచార్యులు దాదాపు 100 శ్లోకాలతో సిద్ధంగా ఉండేవారు. అటువంటి శ్లోకాలను గ్రంథిశ్లోకాలు అంటారు.

గ్రంథి అంటే ముడి. గణపతి తన మేధస్సును ఉపయోగించి చిక్కుముడిని విప్పాలి. ఆయన్నలా చిక్కుల్లో పెట్టి, తను చిక్కకుండా తప్పించుకున్నారు వ్యాసాచార్యులు. అటువంటి గ్రంథిశ్లోకాలు భగవద్గీతలో అక్కడక్కడా ఉన్నాయి. అవి –

**1. నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః।** –2.16
**2. యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ।** –2.69
**3. కర్మణ్యకర్మ యః పశ్యేత్ అకర్మణి చ కర్మ యః।** –4.18
**4. మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా।** –9.4

శ్లో. 70 **ఆపూర్యమాణమచలప్రతిష్ఠం సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।**
**తద్వత్ కామా యం ప్రవిశంతి సర్వే స శాంతిమాప్నోతి న కామకామీ ॥**
ఆపూర్యమాణమ్, అచలప్రతిష్ఠమ్, సముద్రమ్, ఆపః, ప్రవిశంతి, యద్వత్,
తద్వత్, కామాః, యమ్, ప్రవిశంతి, సర్వే, సః, శాంతిమ్, ఆప్నోతి, న, కామకామీ ॥

| | | | |
|---|---|---|---|
| యద్వత్ | = ఎలాగయితే | సర్వే, కామాః | = సకలకోరికలు |
| ఆపః | = (వేర్వేరు నదులయొక్క) జలములు | యమ్ | = ఏ స్థితప్రజ్ఞునియందు |
| ఆపూర్యమాణమ్ | = అన్నివైపుల పరిపూర్ణమైన | ప్రవిశంతి | = (ఎటువంటి మార్పులులేక) లీనమగునో |
| అచలప్రతిష్ఠమ్ | = నిశ్చలముగానున్న | సః | = ఆ పురుషుడు |
| సముద్రమ్ | = సముద్రమును | శాంతిమ్ | = పరమశాంతిని |
| ప్రవిశంతి | = (ఏ మాత్రము చలించజేయు కుండగనే) ప్రవేశించునో | ఆప్నోతి | = పొందును |
| | | కామకామీ | = భోగేచ్ఛగలవాడు |
| తద్వత్ | = అదే విధంగా, | న | = శాంతిని పొందజాలడు |

**ఆపూర్యమాణమ్ అచల-ప్రతిష్ఠం సముద్రం యద్వత్ ఆపః ప్రవిశంతి,**
**తద్వత్ యం సర్వే కామా ప్రవిశంతి, సః శాంతిమ్ ఆప్నోతి, కామ-కామీ న॥**

తా: అన్ని వైపులనుంచి నీరు ప్రవహించి నింపుతూ ఉన్నా సముద్రముయొక్క స్థితిలో మార్పు ఉండదు. అదే విధంగా, ఎవరి అభిముఖముగా కోరికలు అన్నీ (వికారమును కలిగించకుండా) ప్రవేశిస్తూ ఉంటాయో, అతడు శాంతి (మోక్షము)ను పొందును. భోగములను కోరువాడు మోక్షమును పొందడు.

ముందు శ్లోకం గ్రంథిశ్లోకం కాబట్టి, ఈ శ్లోకం తేలిగ్గా అర్థమయ్యేలా చెప్పాడు. ఇక్కడ జ్ఞానిని సముద్రంతో పోలుస్తాడు కృష్ణపరమాత్మ. సముద్రం గొప్పతనం ఏమిటి? అది **పూర్ణమ్, స్వతంత్రమ్, అసంగమ్**.

**పూర్ణమ్–** సముద్రంలో నీళ్ళు ఇంకిపోవటమంటూ ఉండదు. నదులు ఒక్కోసారి ఎంతగా ఎండిపోతాయంటే అక్కడ పిల్లలు క్రికెట్టు ఆడుకుంటారు; లేదా ఎవరో గుడిసెలు వేసేసుకుంటారు అక్కడ. అలా నదులు, వాగులు, బావులు ఎండిపోతాయి కాని, సముద్రం ఎప్పుడూ **పూర్ణంగా**, నీరుతో నిండి ఉంటుంది.

**స్వతంత్రమ్** – సముద్రాన్ని నదులు నింపలేవు; వానలు నింపలేవు. ఒకవేళ నది సముద్రం ముందు గొప్పలు పోయిందనుకోండి – నావల్లనే నీకు పూర్ణత్వం వచ్చింది అని, సముద్రం దానితో వాదనకు దిగదు, దాని అమాయకత్వానికి చిరునవ్వు నవ్వి ఊరుకుంటుంది. ఎందుకు? సముద్రానికి తెలుసు, అంతలా మిడిసి పడుతున్న నదికి తనే సృష్టి, స్థితి, లయ కారణమని. తననుంచి మేఘాలు నీరు తీసుకుని, వర్షంగా కురిస్తే నది పుడుతుంది. తనలోనే చివరికి నది లయమవుతుంది. నదిమీద సముద్రం ఆధారపడిలేదు, నదే సముద్రంమీద ఆధారపడి ఉంది. అందువల్ల నదులు వచ్చినా ఆనందమే, నదులు రాకపోయినా ఆనందమే.

**అసంగమ్** – పవిత్రమైన గంగానదీ సముద్రంలోనే కలుస్తుంది; అశుద్ధమైన నదులూ సముద్రంలోనే కలుస్తాయి. కాని సముద్రం సముద్రమే. దాని స్వచ్ఛతకేమీ భంగం వాటిల్లదు.

అదేవిధంగా జ్ఞాని **పూర్ణత్వం**తో ఉంటాడు. తనను ఎవరో మెచ్చుకుంటున్నారనో, తనను ఎవరో గౌరవిస్తున్నారనో, తనను ఎవరో ఆరాధిస్తున్నారనో పొంగిపోడు. అది సముద్రం మనస్తత్వం. కొంతమంది మా పిల్లలు మేము

గీచిన గీత దాటరు అని మురిసిపోతారు. ఆ మురిపెం ఎన్నాళ్ళో ఉండదు! అజ్ఞానులకు నది మనస్తత్వం ఉంటుంది కాబట్టి వారికి ఎన్నడూ పూర్ణత్వభావన కలుగదు. ఒకవేళ పూర్ణత్వం కలిగినా కూడా అది బాహ్యావస్తువుల మీద ఆధారపడి ఉంటుంది. అందువల్ల అజ్ఞానులందరూ సంసారులే. జ్ఞాని పరిస్థితి అలా కాదు. అతని మనస్సు ఎన్నడూ పూర్ణమే. అద్భుతమైన అనుభవాలు కలిగాయా సంతోషం; కలగలేదా దుఃఖం లేదు.

**యః సర్వత్రానభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభమ్ ।**
**నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥** – 2.57

మంగళకరమైన అనుభవాలు కలిగినా, అమంగళకరమైన అనుభవాలు కలిగినా; మానావమానాలు జరిగినా, జయాపజయాలు కలిగినా సమభావనతో ఉంటాడు జ్ఞాని. ఇప్పుడు ఈ శ్లోకాన్ని చూద్దాము. ముందు ఉదాహరణను వివరిస్తున్నాడు.

**ఆపూర్యమాణమ్** – ఎప్పటికీ పరిపూర్ణం, స్వతంత్రం.

**అచలప్రతిష్ఠమ్** – నదులు వచ్చిపోయినా, చలించదు. నీరు ఆవిరైనా, నదులు కలిసినా చెక్కు చెదరదు.

**ఆపః ప్రవిశంతి** – అనేక నదులు వచ్చి కలుస్తాయి సముద్రంలో. ఏం జరిగినా సముద్రం ఎప్పుడూ పూర్ణమే.

ఇప్పుడు దీన్ని జ్ఞానితో కలపాలి.

**యం కామాః ప్రవిశంతి** – జ్ఞానియొక్క సముద్రంలాంటి మనస్సులో అనేక అనుభవాలు ప్రవేశిస్తాయి. ఇక్కడ కామం అంటే విషయవస్తువులు. కొంతమంది మెచ్చుకుంటారు, కొంతమంది తిడతారు; జ్ఞాని దేనికీ పొంగిపోడు, దేనికీ కృంగిపోడు. అతని మనస్సెలా ఉంటుంది?

**స శాంతిమాప్నోతి** – అతని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఎప్పుడూ పరమశాంతిని పొందుతాడు.

**న కామకామీ** – అజ్ఞాని అలాకాదు. కామకామీ అంటే బాహ్యవస్తువులమీద ఆధారపడ్డ వ్యక్తి. ఒక చిన్న వస్తువు కొన్నా, ఎదుటివారినుంచి మెప్పును ఆశిస్తారు కొంతమంది. ఎక్కడ కొన్నావు, ఎంతకు కొన్నావు అనే ప్రశ్నలు అడిగితే మురిసిపోతారు. అంతేకాదు, అడక్కపోతే డీలా పడిపోతారు. అదే జ్ఞాని అయితే సమత్వం చూపిస్తాడు.

సముద్ర ఉదాహరణ రెండవ ఉదాహరణ. ఈ శ్లోకం గుర్తుంచుకుంటే మంచిది. మీకు జ్ఞానం వచ్చిందో లేదో పరీక్షించుకోవటానికి, బాగా ఉపయోగపడుతుంది ఇది. లిట్మస్ టెస్ట్‌లాంటిది. ఎవరైనా పొగిడితే పొంగిపోయి, తిడితే కృంగిపోతున్నారా? చెక్కు చెదరకుండా ఉన్నారా?

శ్లో. 71 **విహాయ కామాన్ యః సర్వాన్ పుమాంశ్చరతి నిఃస్పృహః ।**
**నిర్మమో నిరహంకారః స శాంతిమధిగచ్ఛతి ॥**
విహాయ, కామాన్, యః, సర్వాన్, పుమాన్, చరతి, నిఃస్పృహః,
నిర్మమః, నిరహంకారః, సః, శాంతిమ్, అధిగచ్ఛతి ॥

| | | | |
|---|---|---|---|
| యః, పుమాన్ | = ఏ పురుషుడు | నిఃస్పృహః | = స్పృహారహితుడై |
| సర్వాన్, కామాన్ | = సమస్తమైన కోరికలను | చరతి | = చరించునో |
| విహాయ | = త్యజించి | సః | = అతడే |
| నిర్మమః | = మమతారహితుడై | శాంతిమ్ | = శాంతిని |
| నిరహంకారః | = అహంకారరహితుడై | అధిగచ్ఛతి | = పొందును |

**యః పుమాన్ సర్వాన్ కామాన్ విహాయ, నిస్పృహః**
**నిర్మమః నిరహంకారః (భూత్వా) చరతి, సః శాంతిమ్ అధిగచ్ఛతి ॥**

తా: ఏ మానవుడైతే సకలములైన కామనలను విడిచిపెట్టి తృష్ణలేనివాడు, మమకారములేనివాడు, అహంకారము లేనివాడుగా సంచరించునో, అటువంటివాడు శాంతిని పొందును.

**సమత్వం–** ఇంకా జ్ఞానియొక్క మనస్థితి గురించే వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. దీన్నిబట్టి మనకొక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. మోక్షం అంటే ఏవో సిద్ధులు పొందటం కాదు, మోక్షం అంటే సమతుల్యభావన ఉండటం. సమతుల్యభావన మనకేమీ కొత్తకాదు. కాకపోతే అది మన పొరుగువారి విషయంలో పాటిస్తాము.

జీవన్ముక్తి అంటే ఏమిటి? పొరుగువారి విషయంలో చూపే సమతుల్యతను మన విషయంలో చూపగలగటం. దీన్ని <u>**నైబరైజేషన్**</u> అంటారు. ఇప్పుడు, మన పొరుగువారికి ఒక సమస్య వస్తే, మనమేం చేస్తాం? వెళ్ళి ఓదారుస్తాము, వారి కష్టంలో పాలుపంచుకుంటాము, మంచి సలహా కూడా ఇస్తాము కాని మనం కృంగిపోము, బెంబేలు పడిపోము. వారి సమస్యను సాక్షీభూతంగా చూస్తాము. నిజానికి అలా సాక్షీభూతంగా చూడటంవల్లనే, మన మనస్సు స్థిరంగా ఉండి, ఆ సమస్యకు చక్కని పరిష్కారం చూపగలుగుతున్నది. మన సమస్యకు కూడా చెక్కు చెదరకుండా, అలాగే సాక్షీభూతంగా చూడగలిగితే, మనం జీవన్ముక్తులం. అందువల్ల జీవన్ముక్తి అంటే మనస్సుయొక్క ప్రశాంత స్థితి. అజ్ఞానికి ఇలాంటి ప్రశాంతత అరుదుగా వచ్చిపోతే, జ్ఞాని ఎప్పుడూ అలాంటి ప్రశాంతతలోనే నెలకొని ఉంటాడు.

**యః పుమాన్ సర్వాన్ నిఃస్పృహః** – పుమాన్ అంటే జ్ఞాని. నిఃస్పృహః అంటే ఆనందంకోసం బాహ్యవస్తువులమీద ఆధారపడడు. ఆధారపడడు అంటే బాహ్యవస్తువులను త్రోసిపుచ్చడు, వాటిని అనుభవిస్తాడు; అనుబంధాలను చవిచూస్తాడు; కాని వాటితో మమేకం చెందడు. అనుబంధాలు ఉంటే ఆనందిస్తాడు; తెగిపోయినా దుఃఖించడు. అనుబంధం అంటేనే ఇద్దరు వ్యక్తుల మధ్య బంధం. ఒకరికి ఆ అనుబంధంమీద మక్కువ ఉన్నా ఇంకొకరికి ఉండకపోవచ్చు.

ఈ రోజుల్లో ఈ అనుబంధాలు శాశ్వతంగా నిలవటం గగనమై పోతున్నది. భార్యాభర్తల్లో ఎవరోఒకరు విడాకులు కోరుకుంటున్నారు. అలా అనుబంధం వీగిపోతే, మనస్సు చెదిరిపోతుందని మనస్తత్త్వ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అది కూడా చిన్న కారణాలకే వీగిపోతున్నాయి. ముక్కు బాగాలేదనో, పొడుగుజుట్టు లేదనో గొడవ పడుతున్నారు. కాని జ్ఞానికి ఆ బాధ లేదు. అతను నిఃస్పృహః – ఎవరినుంచీ ఏమీ ఆశించడు.

**(కామాన్ సర్వాన్) విహాయ** – కామం అంటే విషయవస్తువులని చూశాము. విషయవస్తువులు, వ్యక్తులమీద ఆధారపడటం మానేసి తిరుగుతాడు జ్ఞాని ఈ ప్రపంచంలో.

**నిర్మమో నిరహంకారః** – అహంకారం అంటే శరీరంతో మమేకం చెందటం. 'నేను' శరీరం అనుకోవటం. జ్ఞాని శరీరంతో మమేకం చెందడు. ఎందుకంటే ఈ శరీరం పంచభూతాలతో తయారుచేయబడిందనీ, ఎప్పటికన్నా మళ్ళీ ఈ పంచభూతాలలో కలిసిపోవాల్సిందేననీ తెలుసు అతనికి. నిరహంకారః అంటే శరీర అభిమానం లేదు. నిర్మమ అంటే నాది అనే భావన లేదు. జ్ఞాని ఏదీ తనది అని మమకారం పెంచుకోడు. ఈ ప్రపంచంలో ఉన్న వస్తువులన్నీ, ఈ శరీరంతో సహా, తనకు తాత్కాలికంగా ఇవ్వబడ్డాయనీ, ప్రకృతి ఎప్పుడు కోరుకుంటే అప్పుడు వెనక్కి ఇచ్చివేయాలనీ, అతనికి తెలుసు. తను కోరుకున్నప్పుడు కాదు, ప్రకృతి కోరుకున్నప్పుడు అని అతనికి తెలుసు. తన శరీరమే తనది కానప్పుడు, తక్కిన వస్తువులు తనవెలా అవుతాయి?

సంసార నిర్వచనం రెండు ముక్కల్లో చెప్పవచ్చు. **అహంకారం, మమకారం**. అంటే అహం, మమ లేదా నేను, నాది. ఈ శరీరం నేను అనే అహంకారం, వీరంతా నావారు, ఈ ఆస్తి నాది, ఈ వస్తువులు నావి అనే మమకారం. జ్ఞానికి ఈ రెండూ పోతాయి కాబట్టి నిర్మమో నిరహంకారః అవుతాడు. నేను శరీరాన్ని కాను అని తెలుసు. ఏదీ నాదికాదు అని తెలుసు. ఈ దృక్పథంతో వస్తువులను అనుభవిస్తాడు.

**స శాంతిమధిగచ్ఛతి** – అతను శాంతిని పొందుతాడు. అంటే బాగా ఆనందిస్తాడు. ఇప్పుడు ఆఖరి శ్లోకానికి వస్తున్నాము.

శ్లో. 72 **ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి ।**
**స్థిత్వాస్యామంతకాలేఽపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి ॥**
ఏషా, బ్రాహ్మీ, స్థితిః, పార్థ, న, ఏనామ్, ప్రాప్య, విముహ్యతి,
స్థిత్వా, అస్యామ్, అంతకాలే, అపి, బ్రహ్మనిర్వాణమ్, ఋచ్ఛతి ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ | = ఓ పార్థా! | న, విముహ్యతి | = (యోగి ఎన్నడును) మోహితుడు కాడు |
| ఏషా | = ఇదియే | అంతకాలే, అపి | = అంత్యకాలమునందును |
| బ్రాహ్మీ | = బ్రహ్మప్రాప్తిని పొందిన | అస్యామ్ | = ఈ బ్రాహ్మీస్థితియందు |
| స్థితిః | = పురుషునియొక్క స్థితి | స్థిత్వా | = స్థితుడై |
| ఏనామ్ | = దీనిని | బ్రహ్మనిర్వాణమ్ | = బ్రహ్మానందమును |
| ప్రాప్య | = పొందిన పిదప | ఋచ్ఛతి | = పొందును |

**హే పార్థ! ఏషా బ్రాహ్మీ స్థితిః, ఏనాం ప్రాప్య న విముహ్యతి,**
**అంతకాలే అపి అస్యాం స్థిత్వా బ్రహ్మ-నిర్వాణమ్ ఋచ్ఛతి ॥**

తా: ఓ కుంతీపుత్రా! ఇది బ్రాహ్మీస్థితి, అంటే బ్రహ్మనిష్ఠ. దీనిని పొందినవాడు వ్యామోహమును (అనాత్మను ఆత్మయని భ్రమించుట) పొందడు. మరణసమయమునందైననూ బ్రహ్మనిష్ఠయందు నిలిచి బ్రహ్మానందమును పొందును.

ఇటువంటి స్థితప్రజ్ఞత ఎలా ఏర్పడుతుంది? ఆత్మజ్ఞానం పొందటంవల్ల. ఆత్మజ్ఞానాన్ని, ఈ అధ్యాయంలోనే 12–25 శ్లోకాల్లో వివరించాడు కృష్ణపరమాత్మ. ఈ శ్లోకాలు, వీటి సారాంశం మన మనస్సులో స్థిరపడిపోవాలి. అప్పుడు మనం కూడా స్థితప్రజ్ఞులమవుతాము.

**బ్రాహ్మీస్థితి** – ఈ శ్లోకాల్లోని సారాంశాన్ని అర్థం చేసుకుని, జీర్ణించుకున్న జ్ఞాని, స్థితప్రజ్ఞతను పొందుతాడు. బ్రాహ్మీస్థితి అంటే స్థితప్రజ్ఞత లేదా జీవన్ముక్తి. దీని గొప్పదనం ఏమిటి?

**ఏనాం ప్రాప్య న విముహ్యతి** – నైనాం ని, న + ఏనాం గా విడదీయాలి. ఎప్పుడైతే జ్ఞాని ఇటువంటి బ్రాహ్మీస్థితిని పొందుతాడో, అప్పుడే అతను ఇంక తిరిగి సంసారంలో పడే ప్రశ్నే లేదు. అతనిలో ఇంక ఎటువంటి ఘర్షణ ఉండదు. జ్ఞానం కలిగేదాకా, ఈ ఘర్షణ తప్పదు.

**టు బి ఆర్ నాట్ టు బీ, దట్ ఈజ్ ది క్వశ్చన్ – షేక్స్‌పియర్**

చేయాలా, వద్దా, పెళ్ళి చేసుకోవాలా, వద్దా – అన్నీ సమస్యలే.

**అస్యాం స్థిత్వా** – అంతేకాదు, అతను జీవన్ముక్తిని అనుభవిస్తాడు. ఎంతకాలం? ఈ భూమ్మీద జీవించి ఉన్నంత కాలం. ప్రారబ్ధకర్మ ముగిసి, అతను మరణించినప్పుడు ఏమవుతుంది?

**అంతకాలేఽపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి** – మరణించాక విదేహముక్తి పొందుతాడు. అంటే పరబ్రహ్మలో ఐక్యమవుతాడు అంటే అతనికి పునరపి జననం, పునరపి మరణం ఉండదు. అతని స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు – స్థూల, సూక్ష్మ, కారణ ప్రపంచాలలో కలసిపోతాయి. అదే అజ్ఞాని విషయంలో స్థూలశరీరం మాత్రమే కలుస్తుంది, లేదా అగ్నిలో దహనమవుతుంది. సూక్ష్మ, కారణ శరీరాలు ప్రయాణం చేస్తాయి, ఇంకొక జన్మను ఎత్తటానికి. జ్ఞాని జీవించి ఉండగా జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి పొందుతాడు.

ఈ ఆత్మజ్ఞానాన్ని ఏ వయస్సులోనైనా పొందవచ్చు. బాల్యం, యవ్వనం, వృద్ధాప్యంలో ఎప్పుడైనా పొందవచ్చు. ఎప్పుడు పొందినా మోక్షం తథ్యం. ఈ విధంగా ఆత్మజ్ఞానఫలమైన జీవన్ముక్తి, విదేహముక్తులతో స్థితప్రజ్ఞ అంశాన్ని, రెండవ అధ్యాయాన్ని ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే సాంఖ్యయోగోనామ ద్వితీయోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీమద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమునందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు సాంఖ్యయోగము అనే రెండవ అధ్యాయము.

# అధ్యాయము 2 – సాంఖ్యయోగము సారాంశము

రెండవ అధ్యాయాన్ని ప్రధానంగా నాలుగు భాగాలుగా విభజించవచ్చు. అవి –

1. **అర్జునుని శరణాగతి – శ్లోకాలు 1–10**
2. **జ్ఞానయోగం – శ్లోకాలు 11–38**
3. **కర్మయోగం – శ్లోకాలు 39–53**
4. **స్థితప్రజ్ఞుని లక్షణాలు – శ్లోకాలు 54–72**

1. **అర్జునుని శరణాగతి శ్లోకాలు 1–10**– అర్జునుని శరణాగతిని అర్థం చేసుకోవాలంటే మొదటి అధ్యాయంలో జరిగిన విషయం గుర్తు తెచ్చుకోవాలి. ఎందుకంటే అదే అంశం కొనసాగుతున్నది ఇందులో కూడా. రణరంగంలో తన సమస్యను కనుగొన్నాడు అర్జునుడు. అతని సమస్య సంసారం. సంసారాన్ని అనేక విధాలుగా వర్ణిస్తారు. ఇక్కడ మూడు పదాలతో వర్ణించవచ్చు. అవి రాగం, శోకం, మోహం.

i) **రాగం** – రాగం అంటే బంధకత్వం. ఇది ఒక్క అర్జునుని సమస్య మాత్రమే కాదు, మానవాళినంతటినీ పట్టిపీడించే సమస్య. దేనిమీద బంధం పెంచుకుంటారో ఆ వస్తువు మారుతుంది కాని, బంధం అనే సమస్య మాత్రం అందరికీ ఉంటుంది. ఇది ప్రాథమిక సమస్య. అర్జునునికి కూడా ఎప్పుడూ ఉంది కాని, దాని తీవ్రతను అతను మొదటి అధ్యాయంలో గుర్తించాడు. **కృపయా పరయాఽఽవిష్టః** – ఇక్కడ రాగానికి కృప అనే పదం వేశారు వ్యాసాచార్యులు.

ii) **శోకం** – ఎప్పుడైతే రాగం ఉంటుందో, అప్పుడు దాని సహజపర్యవసానం శోకం అవుతుంది. అంటే విషాదం ఏర్పడుతుంది. ఆ విషాదం రెండు కారణాలవల్ల ఏర్పడవచ్చు. మనకు దేనిమీదైతే అనుబంధం ఏర్పడుతుందో, దాన్ని పోగొట్టుకోవటానికి ఎన్నటికీ ఇష్టపడము. సృష్టి నియమం ప్రకారం ఏదీ శాశ్వతంగా ఉండదనే నగ్నసత్యం మన బుద్ధికి తెలుసు, కాని మనస్సు మాట వినదు. రాగం చూపించే మనస్సు అది అనునిత్యం మనతోనే ఉండాలనే ఆశాపాశాన్ని చూపిస్తుంది. అందువల్ల ఆ వస్తువు మననుంచి నిజంగా దూరమయినా, అవుతుందన్న భయం వేసినా కూడా శోకం ఏర్పడుతుంది.

అర్జునుడు భీష్మద్రోణులతో అనుబంధం పెంచుకున్నాడు. వారిని పోగొట్టుకోలేదు. కాని యుద్ధభూమిలో తను చేయబోయే యుద్ధాన్ని, అందులో వీరిద్దరి మరణాన్ని ఊహించుకునే కలత చెందుతాడు. వారు లేకుండా తను జీవించి ఉంటానన్న ఊహనే భరించలేకపోతాడు. భీష్మద్రోణులు తననుంచి దూరమవుతారనే ఆలోచనే అతన్ని దుఃఖంలో ముంచెత్తింది.

iii) **మోహం** – ఎప్పుడైతే రాగం, శోకాల కోరల్లో చిక్కుకుంటాడో, అప్పుడే మంచిచెడులను విశ్లేషించే శక్తిని కోల్పోతాడు. ధర్మాధర్మాల అవివేకంలో పడిపోతాడు. మనస్సు ఘర్షణకు లోనవుతుంది. రాగ, శోక, మోహాలనే ఈ మూడింటినీ కలిపి సంసారం అంటారని చూశాము.

తను ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్టు గ్రహించటమేకాక, తానే పరిష్కరించుకుందామనుకున్నాడు అర్జునుడు. అందువల్ల కృష్ణపరమాత్మకు దానిమీద సుదీర్ఘంగా ప్రసంగించాడు. మొదటి అధ్యాయంలో వీరిద్దరి పాత్రలు తారుమారవుతాయి. అర్జునుడు వక్త, కృష్ణపరమాత్మ శ్రోత అయ్యాడు. పాపం కృష్ణపరమాత్మ అదంతా ఓపిగ్గా విన్నాడు.

అర్జునుడు ఆ యుద్ధం చేయటం భావ్యం కాదనీ, అది అధర్మం కిందికి వస్తుందనీ, అందువల్ల యుద్ధం చేయకుండా మానేయటమే గొప్ప పరిష్కారమనీ, తనకు తానే నిశ్చయించేసుకున్నాడు. అతనే అన్నీ నిర్ణయించుకుంటున్నప్పుడు, తనెందుకు మధ్యలో తలదూర్చటమని, కృష్ణపరమాత్మ మౌనంగా ఉండిపోయాడు. ఈ పరిస్థితిలో మొదటి అధ్యాయం ముగిసింది.

రెండవ అధ్యాయంలో అర్జునుని దుఃఖం కొనసాగుతుంది. రెండవ అధ్యాయం ప్రారంభంలోనే అర్జునుడు తన నిస్సహాయతను గుర్తిస్తాడు. దాన్ని **కార్పణ్యదోషం** అంటారు. మన నిస్సహాయతను గుర్తించకపోతే, మనం దేవుణ్ణి పూర్తిగా శరణు వేడము.

అలా అర్జునుడు మొదటి అధ్యాయంలో తన సమస్యను గుర్తించాడు, రెండవ అధ్యాయంలో దానికి తను చూపే పరిష్కారం సరికాదు అని తెలుసుకుని నిస్సహాయస్థితికి చేరుకున్నాడు. నిస్సహాయస్థితిలో ఏం చేస్తాము? ఎవరినైనా శరణు వేడతాము. నీటిలో మునిగిపోతున్న వ్యక్తి దేన్నైనా పట్టుకుందామని చూస్తే, తన చుట్టూ ఉన్నవారు కూడా తనతోపాటే మునిగిపోతున్నారు. అలాంటివారు గడ్డిపోచతో సమానం. ఇద్దరూ మునిగిపోతారు. ఆ విషయంలో అర్జునుడు అదృష్టవంతుడు.

**పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయమ్**. అతనికి అందుబాటులో సాక్షాత్తూ ఆ నారాయణుడే ఉన్నాడు. అతనిని శరణు వేడుతాడు అర్జునుడు.

> **కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।**
> **యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥** – 2.7

ఈ అధ్యాయంలో ఇది ముఖ్యమైన శ్లోకం.

**శిష్యస్తేఽహం** – నేను నీ పాదాలను శరణు వేడుతున్నాను. అంటే దీని అర్థం ఏమిటి? నేనేమీ పరిష్కారాలను చూపను. నా మనస్సును శూన్యం చేసి, నీ ముందు ఉంచుతున్నాను. నీ బోధతో దాన్ని నింపు అని అర్థం. అందువల్ల ఒక శిష్యునికి ఉండాల్సిన ప్రాథమిక అర్హత – మనస్సును ఖాళీగా ఉంచి గురువుకు అర్పణ చేయాలి. ముందే ఖాళీగా ఉంటే సమస్య లేదు, కాని కొంతమంది అనేక సిద్ధాంతాలను విని, అనేక తప్పుడు అభిప్రాయాలతో మనస్సును నింపేసుకుంటారు.

మనస్సు ఖాళీగా ఉంచుకోవాలనే సూచనగా సన్న్యాసికి శిరోముండనం చేస్తారు. ఒక్కొక్క వెంట్రుక, ఒక్కొక్క తప్పుడు సిద్ధాంతానికి ప్రతీక. అంటే మనం ఎంతగా తప్పుడు సిద్ధాంతాలలో కూరుకుపోయామో ఒకసారి

ఊహించుకోండి. అంతేకాదు, మన తప్పుడు సిద్ధాంతాలతో గురువును కూడా బేరీజు వేస్తాము. మన భావాలకు తగ్గట్టుగా, బోధను స్వీకరిస్తాము. అలా లాభం లేదు. వాటన్నిటినీ పక్కకు పెట్టాలి.

ఇక్కడ అర్జునుడు శిష్యుడుగా మారాడు. యజమానిగా రథం ఎక్కిన అర్జునుడు శిష్యుడు అయ్యాడు. రథసారథిగా వచ్చిన కృష్ణుడు గీతోపదేశ కర్తగా మారాడు. **కృష్ణం వందే జగద్గురుమ్.** పార్థసారథి జగద్గురువవుతాడు. దీనివల్ల ఒక విషయం తెలుస్తున్నది. జ్ఞాని తనంతట తాను గురువు అవడు, ఒక శిష్యుడు జ్ఞానం బోధించమని కోరితే గురువు అవుతాడు. శిష్యుడు ఎలా కోరాలి? సాష్టాంగనమస్కారం చేయాలి. అది అతని అణకువను సూచిస్తుంది. **తద్విద్ధి ప్రణిపాతేన.** అర్జునుడు క్షత్రియుడు, ధనంజయుడు, ఎన్నో బిరుదులు పొందినవాడు కాని శ్రీకృష్ణుణ్ణి శరణు వేడాడు.

శ్రీకృష్ణుడు అర్జునునికి ఎందుకు బోధించాడు? ధర్మరాజు, భీముడు, నకులుడు, సహదేవుడు, భీష్ముడు, ద్రోణుడు, దుర్యోధనుడు – వీరికెవరికీ ఎందుకు బోధించలేదు అని సందేహం వస్తుంది మనకు. దానికి జవాబు ఒక్కటే. వీరెవరూ **శిష్యస్తేఽహం** అనలేదు. ఒకవేళ దుర్యోధనుడు శిష్యస్తేఽహం అని ఉంటే, కృష్ణపరమాత్మ అతనికి కూడా బోధించి ఉండేవాడు.

మొదటి అధ్యాయం అంతా, రెండవ అధ్యాయం 10వ శ్లోకం వరకూ, ఉపోద్ఘాత ప్రకరణం. గీతాబోధ అంతవరకూ ప్రారంభమవలేదు. అసలు గీతాశాస్త్రం 11వ శ్లోకం నుంచి మొదలవుతుంది.

2. **జ్ఞానయోగం శ్లోకాలు 11–38** – దీన్ని సాంఖ్యయోగం అని కూడా అంటారు. జ్ఞానయోగం, సాంఖ్యయోగం పర్యాయపదాలు. ఈ భాగం చాలా ముఖ్యమైనది. ఇది చాలా ముఖ్యమైనది కాబట్టే ఈ అధ్యాయానికి **సాంఖ్యయోగం** అనే పేరు వచ్చింది. ఈ జ్ఞానయోగం సారాంశాన్ని ఇక్కడే కాదు, భగవద్గీత మొత్తంలో గుర్తు పెట్టుకోవాలి. ఈ భాగాన్ని పదేపదే నెమరువేసుకోవాలి. ఎందుకంటే తక్కిన అధ్యాయాలనే భవంతి, జ్ఞానయోగమనే పునాది నుంచే లేచింది. 11 నుంచి 38 శ్లోకాలు, ముఖ్యంగా 11 నుంచి 25 శ్లోకాలు ఉపనిషత్తుల సారం.

ఈ భాగంలో కృష్ణపరమాత్మ జీవియొక్క స్వరూపాన్ని నిర్వచిస్తాడు. జీవస్వరూపం గురించి కృష్ణపరమాత్మ ఎందుకు మాట్లాడాడంటే, దురదృష్టవశాత్తూ మనకు మన స్వస్వరూపం తెలియదు. మనం భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, సంగీతం, నృత్యం నేర్చుకోవటంలోనే జీవితమంతా గడిపేస్తాము, ఆయా రంగాల్లో పరిశోధనలు చేస్తాము కాని, మన గురించి మనకు తెలియదు, తెలుసుకోవటానికి ప్రయత్నించము కూడా.

మనకు కొన్ని అపోహలు ఉన్నాయి. నేను శరీరాన్ని, నేను మనస్సును అని పొరపాటు పడతాము. కాని వాటిని అపోహలుగా విశదీకరించాడు కృష్ణపరమాత్మ.

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।**

**తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ ॥** – 2.22

ఈ శరీరం మనం ధరించే తాత్కాలిక దుస్తులలాంటిది. మనం మరణించినప్పుడు ఈ శరీరాన్ని వదిలి, ఇంకొక శరీరాన్ని ధరిస్తాము. మీకేమైనా సందేహం ఉంటే, మీ నిద్రావస్థను, అందులోనూ సుషుప్తిని గమనించండి.

సుషుప్తిలో శరీరాన్ని, మనస్సును పక్కన పెట్టి, గాఢనిద్ర పోతారు. అంటే మనశ్శరీరాలతో వ్యవహారం నడవటం లేదు. కాని చైతన్యపరంగా మీరు జీవించే ఉన్నారు. అంటే ఈ మనశ్శరీరాలు కళ్ళద్దాలలాంటివి. వాటిని వాడి మీరు ప్రపంచాన్ని చూస్తారు. తర్వాత, పడుకునే ముందు వాటిని తీసి పక్కన పెట్టేస్తారు. అలాగే మనశ్శరీరాలనే కళ్ళద్దాలతో ఈ ప్రపంచంలో వ్యవహారం నడుపుతారు. పడుకున్నప్పుడు వీటిని తీసి పక్కన పెట్టేస్తారు, అంటే వ్యవహారం నడపరు. అంటే వీటిని వాడుతున్నారు, తీస్తున్నారు. అవి మీరు వ్యవహారం నడపటానికి పనికివస్తాయి కాని, అవి మీరు కాదు.

నేను మనశ్శరీరాలను కాకపోతే నేనెవరిని? **నేను చైతన్య స్వరూపాన్ని.** త్వం చిత్ రూపః, త్వం చైతన్య స్వరూపః, త్వం జ్ఞాన స్వరూపః, త్వం విజ్ఞాన స్వరూపః, త్వం ప్రజ్ఞానస్వరూపః. అన్నీ పర్యాయపదాలు. చిత్, చైతన్యం, జ్ఞానం, విజ్ఞానం, ప్రజ్ఞానం – అన్నీ **చైతన్యం**. చైతన్యస్వరూపమేమిటి?

ఈ చైతన్యం లేదా దేహి, లేదా శరీరీ నా అసలు స్వరూపం. చైతన్యంయొక్క ఆరు ముఖ్య అంశాలను చర్చించాడు కృష్ణపరమాత్మ. అవి **ఆత్మ నిత్యం, సత్యం, సర్వవ్యాపకం, అప్రమేయం, అకర్తా అభోక్తా, నిర్వికారం.**

i) **ఆత్మనిత్యం** – ఆత్మ నిత్యం. మనశ్శరీరాలు నిత్యం కాదు, ఆత్మ నిత్యం.

ii) **ఆత్మ సత్యం** – ఆత్మ సత్యం, అనాత్మ మిథ్య. అనాత్మకు, ఆత్మ లేకుండా విడిగా ఉనికి లేదు. మట్టి–కుండ ఉదాహరణ తీసుకుంటే, కుండకు స్వతంత్రంగా ఉనికి లేదు. మట్టినుంచి అరువు తెచ్చుకుంది. మట్టి, కుండ ఉన్నా లేకపోయినా, మూడు కాలాల్లోనూ ఉంటుంది.

**నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।**
**ఉభయోరపి దృష్టోఽన్తః త్వనయోస్తత్త్వదర్శిభిః ॥** – 2.16

చాలా ముఖ్యమైన శ్లోకం ఇది.

iii) **ఆత్మ సర్వవ్యాపకం –** ఆత్మ సర్వగతం – చేయి తీసుకుంటే, దానికి సరిహద్దులు ఉన్నాయి. కాని దాన్ని ప్రకాశింపజేసే కాంతికి సరిహద్దులు లేవు. అది చేయి సరిహద్దులని దాటి ఉంది. కాని కాంతి చేతిమీద వ్యక్తం అవుతుంది, చేతి బయట అవ్యక్తంగా ఉంటుంది.

iv) **ఆత్మ అప్రమేయం** – ఆత్మ ఎన్నటికీ అనుభవించబడే వస్తువు కాదు. కెమెరా లేకుండా ఫోటో రాలేదు. అలా అన్ని అనుభవాలలోనూ నేను ఉన్నాను. అంటే ఆత్మ ఎప్పటికీ చూసే నేను, ఎన్నటికీ చూడబడే వస్తువు కాదు.

v) **ఆత్మ అకర్తా అభోక్తా** – ఈ రెండింటినీ కలిపి చూస్తాము. ఆత్మ పని చేయదు కాబట్టి అకర్తా, పని చేయకపోతే అనుభవించే ఫలం ఉండదు కాబట్టి అభోక్తా. ఆత్మ కర్మ, కర్మఫలాలకు అతీతం.

**న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖం, న మంత్రో న తీర్థో న వేదా న యజ్ఞాః**
**అహం భోజనం నైవ భోజ్యం న భోక్తా, చిదానందరూపః శివోఽహం శివోఽహమ్** – నిర్వాణషట్కమ్ 4

vi) **ఆత్మ నిర్వికారం** – ఆత్మకు మార్పులేదు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥** – 2.20

ఇది చాలా ముఖ్యమైన నిర్వచనం. కృష్ణపరమాత్మ దీనిని నొక్కి వక్కాణించాలనుకున్నాడు. అందువల్ల దీని ఛందస్సు మార్చాడు. శరీరానికి కలిగే షడ్వికారాలు ఆత్మకు లేవు. **అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి.** కృష్ణపరమాత్మ వీటిని నాలుగు దశలుగా వర్ణించాడు. అవి కౌమారం, యౌవనం, వృద్ధాప్యం, దేహాంతర ప్రాప్తి. ఆత్మకు ఈ మార్పులు లేవు. అది నిర్వికారం. ఆత్మకు ఈ మార్పులు లేవని తెలిస్తే దేహాభిమానం పోతుంది, మృత్యుభయం ఉండదు.

ఆత్మస్వరూపాన్ని తెలుసుకుని, నేను ఆ ఆత్మను అని తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం.

3) **కర్మయోగం శ్లోకాలు 39-53** – జ్ఞానయోగం శాశ్వత పరిష్కారాన్ని చూపించినా, దాన్ని అర్థం చేసుకోవటానికి సూక్ష్మబుద్ధి ఉండాలి. అందువల్ల అందరూ తేలిగ్గా అర్థం చేసుకోలేరు. కృష్ణపరమాత్మే చెప్పాడు ఆ విషయాన్ని

**ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్ ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః ।**
**ఆశ్చర్య వచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥** – 2.29

ఆత్మజ్ఞానం పొందటం చాలా కష్టం. ఎన్నో సంవత్సరాలు దాని గురించి అధ్యయనం చేసినా, మనస్సును సంసిద్ధం చేసుకోకపోతే, అర్థం కాదు. అలా జ్ఞానయోగం కష్టం అనో, అర్థం కావటం లేదనో, తమకు అవసరం లేదనో అనుకునేవారికి, కృష్ణపరమాత్మ ధైర్యం చెప్పాడు ఈ అధ్యాయంలో. జ్ఞానప్రాప్తి పొందటం కష్టమయితే, జ్ఞానయోగ్యతా ప్రాప్తిని పొందండి అన్నాడు. జ్ఞానయోగ్యతా ప్రాప్తిని ఎలా పొందాలి? కర్మ యోగాన్ని పాటించటం ద్వారా.

**జ్ఞానం-లక్ష్యం, జ్ఞానయోగ్యత-మార్గం**
**జ్ఞానయోగ్యత-లక్ష్యం, కర్మయోగం-మార్గం**

అందువల్ల కర్మయోగం మార్గంలో వెళ్ళి, జ్ఞానయోగ్యత లక్ష్యం పొంది, జ్ఞానయోగ్యత మార్గంలో వెళ్ళి జ్ఞానం లక్ష్యం పొందాలి.

కర్మయోగం = సరియైన కర్మ + సరియైన దృక్పథం

i) **సరియైన కర్మ** – కృష్ణపరమాత్మ మనిషి చేసే కర్మలను మూడు రకాలుగా విభజించాడు.

**సాత్త్వికకర్మలు** – సాత్త్విక కర్మలను నిస్వార్థ కర్మలు అనవచ్చు. ఎందుకంటే అవి ఎక్కువమందికి పనికివచ్చే కర్మలు. అంటే ఇందులో స్వార్థం ఉండదు, సమాజశ్రేయస్సే ప్రాథమికంగా ఉంటుంది. ఇవి నిష్కామకర్మలు. ఇవి ఉత్తమకర్మలు.

**రాజసకర్మలు** – రాజస కర్మలు స్వార్థపూరితమైన కర్మలు. వీరు నా నీటు, నా గోటు అనుకుంటారు, కాని ఎదుటివారికోసం పాటుపడరు. ఎదుటివారికి మంచి జరిగినా, చెడు జరిగినా వీరికి అనవసరం. తాము బాగుపడితే చాలు. ఎవరో అన్నారట, ఎదుటివారికి సహాయం చేయకు అని. ఎందుకు అంటే,'అతను కష్టపడాలని భగవంతుడు నిర్దేశించాడు, అటువంటి వ్యక్తికి మనం సహాయం చేస్తే అది భగవంతుని ఇచ్ఛకు భిన్నంగా వ్యవహరించినట్టు ఉంటుంది.' కాబట్టి, స్వార్థపూరితకర్మను రాజసికకర్మ అంటారు. ఇది మధ్యమకర్మలు.

**తామసకర్మలు** – తామసకర్మలు కూడా స్వార్థపూరిత కర్మలే కాని ఇవి రాజసకర్మలకన్నా దారుణం. ఎందుకంటే తను బాగుపడటంకోసం, ఎదుటివారికి హాని చెయ్యటానికి కూడా వెనుకాడరు వీరు. ఎవరి గురించీ పట్టించుకోరు. ఇవి హానికర కర్మలు.

ఈ మూడింటి గురించీ ఒక్కముక్కలో చెప్పాలంటే, ఇవి వరుసగా నిస్వార్థ కర్మలు, స్వార్థపూరిత కర్మలు, హానికర కర్మలు.

కర్మయోగి సాత్త్వికకర్మకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి, రాజసకర్మలు తక్కువగా చేసి, తామసకర్మలను అస్సలు చేయడు. ఇది సరియైన కర్మ.

ii) **సరియైన దృక్పథం** – ఈశ్వరార్పణబుద్ధితో కర్మ చేయటం, ఈశ్వరప్రసాదబుద్ధితో కర్మఫలాన్ని స్వీకరించటం.

**ఎ). ఈశ్వరార్పణ బుద్ధి** – ఏ పని చేసినా ప్రేమగా, శ్రద్ధగా చేయాలి. లేకపోతే, అది మనం చేసే పనిని అవమానపరచినట్టు అవుతుంది. భగవంతుణ్ణి అవమానపరచినట్టు అవుతుంది. కృష్ణపరమాత్మే తర్వాత చెబుతాడు ఆ విషయాన్ని –

> **ముక్తసంగోఽనహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః ।**
> **సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే ॥** – 18.26

చేస్తున్న పనిని ప్రేమించటం నేర్చుకోవాలి. మనం ప్రేమించిన పని దొరకకపోతే, మనం చేస్తున్న పనిని ప్రేమించాలి. ఎంత చిన్నపని అయినా, దాన్ని శ్రద్ధగా, ప్రేమగా చేయాలి. అది ఎప్పుడు సాధ్యం? ఈశ్వరార్పణబుద్ధితో చేస్తే సాధ్యం. అది ఎంత యాంత్రికంగా చేసేపని అయినా, ఈశ్వరునికి అర్పిస్తామంటే, దాన్ని నిర్లక్ష్యం చేయలేము. కర్తగా ఇదీ మన కర్తవ్యం.

**బి). ఈశ్వరప్రసాదబుద్ధి** – మనం ఏ పని చేసినా, దానికి ఒక ఫలం వస్తుంది. మనం ఎంత శ్రద్ధగా ఒక పనిని చేసినా, దాన్ని విమర్శించేవారే ఎక్కువ ఉంటారు. పిల్లలను ఎంత ఆప్యాయంగా పెంచినా, తమను తల్లిదండ్రులు సరిగ్గా పెంచలేదనే వారు అనుకుంటారు.

ఒక పిల్లవాడు, 'పిల్లలను పెంచటం ఎలా?' పుస్తకాన్ని చదువుతున్నాడుట. తండ్రి అడిగాడుట, 'నువ్వింకా చిన్నపిల్లవాడివే కదా, అప్పుడే ఎందుకు ఈ పుస్తకం చదువుతున్నావు?' 'మీరు నన్ను సరిగ్గా పెంచుతున్నారో లేదో తెలుసుకోవటానికి చదువుతున్నాను,' అన్నాడట ఆ గడుగ్గాయి. అందువల్ల ఎంత బాగా చూసినా ఒక్కోసారి

దానికి గుర్తింపు ఉండదు. అందువల్ల ఎటువంటి ఫలం వచ్చినా దాన్ని ఈశ్వరప్రసాదంగా తీసుకోవాలి. భోక్తగా ఈ దృక్పథం ఉండాలి.

**సరియైన దృక్పథం = ఈశ్వరార్పణ బుద్ధి + ఈశ్వరప్రసాద బుద్ధి**

**కర్మయోగ ఫలం** – కర్మయోగ ఫలం గురించి కూడా చెప్పాడు కృష్ణపరమాత్మ. కర్మయోగం మోక్షాన్నివ్వదు. ఈ విషయం చాలా స్పష్టంగా అర్థం చేసుకోవాలి. కృష్ణపరమాత్మ గాని, శాస్త్రం గాని కర్మయోగం మోక్షమార్గం అని ఎన్నడూ చెప్పదు. మరి అయితే కర్మయోగం ఎందుకు? **జ్ఞానయోగ యోగ్యతాప్రాప్తి** ఇవ్వటానికి. ఈ యోగ్యత పొందాకే, జ్ఞానయోగంలోకి అడుగుపెట్టగలము.

**యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।**
**తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥** – 2.52

తత్త్వబోధ పరిభాషలో చెప్పాలంటే కర్మయోగం పాటించటంవల్ల సాధన చతుష్టయ సంపత్తిని పొందుతాము.

**4. స్థితప్రజ్ఞుని లక్షణాలు – శ్లోకాలు 54-72** – స్థితప్రజ్ఞుడంటే కర్మయోగం పాటించి, జ్ఞానయోగ్యత పొంది, జ్ఞానయోగం పాటించి జ్ఞానం పొంది, ఆ జ్ఞాననిష్ఠలో నెలకొని ఉన్న వ్యక్తి. జ్ఞానాన్ని పొందితే ప్రజ్ఞ వస్తుంది. ఏమిటా జ్ఞానం? నేను ఆత్మను, మనశ్శరీరాలు అనాత్మ. స్థితప్రజ్ఞ అంటే బుద్ధిలో పొందిన ఈ జ్ఞానాన్ని మనస్సులో స్థిరపరుచుని, క్లిష్టపరిస్థితిని ఎదుర్కొనే గుండె ధైర్యం కలిగి ఉండటం. ప్రజ్ఞ అంటే జ్ఞానం; స్థితప్రజ్ఞ అంటే మానసిక స్థైర్యం. ఈ స్థితప్రజ్ఞ భాగంలో రెండు ఉపభాగాలున్నాయి – స్థితప్రజ్ఞుడు అవటం ఎలా, స్థితప్రజ్ఞ లక్షణాలు ఏమిటి? అంటే స్థితప్రజ్ఞ సాధనలు, స్థితప్రజ్ఞ లక్షణాలు.

**i) స్థితప్రజ్ఞ సాధనలు** – వేదాంతం నేర్చుకున్నాక, దాన్ని మానసిక స్థైర్యంగా ఎలా మలుచుకోవాలి? గీతాబోధ వింటున్నంతసేపూ బాగా అర్థమయినట్టే ఉంటుంది, కాని బయటకు వచ్చాక, మన శోకం మనను వదలటం లేదు అనుకుంటాము. అంటే శ్రవణంవల్ల ప్రజ్ఞ వస్తుంది కాని స్థితప్రజ్ఞత రాదు. దీనికి గురువేమీ చేయలేడు. మనమే పాటుపడాలి. గురువు అజ్ఞాః ను ప్రజ్ఞాః గా మార్చగలడు అంటే అజ్ఞానిని ప్రాజ్ఞుడిగా చేయగలడు. కాని శిష్యుడు కృషి చేయకపోతే, అది ఒక మూల ఉండిపోతుంది; రాగద్వేషాలు, కామక్రోధాలు వాటి పాటున అవి రాజ్యమేలుతూనే ఉంటాయి. అలా అయ్యేసరికి గీత నేర్చుకుని కూడా ఏమీ ప్రయోజనం పొందలేదు అని అపోహ పడతారు. స్థితప్రజ్ఞత పొందటానికి కృష్ణపరమాత్మ మూడు సాధనలను చెప్పాడు. అవి – ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం, నిదిధ్యాసనం.

**ఎ). ఇంద్రియ నిగ్రహం** – గీత నేర్చుకునే ముందే ఈ ఇంద్రియ నిగ్రహం ఉండాలి, కాని మనం వెనుక ద్వారం నుంచి వచ్చేస్తాము. అందువల్ల కృష్ణపరమాత్మ హెచ్చరించాడు ఈ అధ్యాయంలో. ఇంద్రియ నిగ్రహం ఎందుకు ఉండాలి? ఇంద్రియ నిగ్రహం లేకపోతే ఇంద్రియాల ద్వారా మనస్సులోకి ఏది చొరబడినా, మనకు దానిమీద అధికారం ఉండదు. అనవసరమైన అంశాలు బోలెడు చోటు చేసుకుంటే, వేదాంతాన్ని అర్థం చేసుకోలేము. ఇంద్రియనిగ్రహం అంటే ఇంద్రియాలను బలవంతంగా అణగద్రొక్కటం కాదు, వాటిని అదుపులో పెట్టుకోవటం.

ఇంద్రియాలను వాటి ఇష్టారాజ్యానికి వదిలివేయటం ఎంత తప్పో, వాటిని బలవంతంగా అణగద్రొక్కటం కూడా అంతే తప్పు.

**బి). మనోనిగ్రహం** – మనస్సులో కలిగే ఆలోచనలను అదుపులో పెట్టుకోవటం. కొన్ని ఆలోచనలను మనం ప్రయత్నపూర్వకంగా చేస్తాము కాని, చాలా ఆలోచనలు మన ప్రమేయం లేకుండా మనస్సులోకి దూసుకు వచ్చేస్తాయి – మనం గీత వింటున్నా సరే, ధ్యానం చేస్తున్నా సరే! ఎందుకంటే ఆలోచనలను మన సుప్తచేతన మనస్సే కాదు, మన పూర్వజన్మ కూడా నిర్ణయిస్తుంది. అందువల్ల ఒక్కోసారి మనకొచ్చిన భీకరమైన, చెత్త ఆలోచనకు మనమే ఆశ్చర్యపోతాము. నేనేనా ఇలా ఆలోచిస్తున్నది అని విస్తుపోతాము. అదృష్టం బాగుండి, మనస్సులో ఉన్న ఆలోచనలు ఎవరికీ తెలియవు అని తృప్తి పడతాము కూడా.

కృష్ణపరమాత్మ ఆలోచనలను రానివ్వండి, ఫర్వాలేదు అన్నాడు. ఎందుకంటే ఆలోచన రావటం మన చేతిలో లేదు. కాని ఒకటి మాత్రం మన చేతిలో ఉంది. ఏమిటది? వచ్చిన ఆలోచనను తరిమికొట్టాలా, దాన్ని పెంచి పోషించాలా అన్నది మన అదుపులో ఉంది.

**అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తే౽వ్యయామ్ ।**
**సంభావితస్య చాకీర్తిః మరణాదతిరిచ్యతే ॥** – 2.34

చెడు ఆలోచన వచ్చిందని అపరాధభావనతో కృంగిపోనవసరం లేదు. కాని ఆ చెడు ఆలోచన వచ్చిందే తడవుగా, దాన్ని త్రుంచిపారేయాలి. అదీ మనోనిగ్రహమంటే!

**సి). నిదిధ్యాసనం** – మనం నేర్చుకున్న బోధను పదేపదే తలుచుకోవాలి. దాని గురించిన పుస్తకం చదవవచ్చు, ఎవరితోనైనా చర్చించవచ్చు, నేర్చుకున్నదాన్ని పదేపదే వినవచ్చు, కళ్ళు తెరుచుకునో, కళ్ళు మూసుకునో ఆ జ్ఞాననిష్ఠలో ఉండాలి. ఇది ఎలా చేయాలో వివరంగా ఆరవ అధ్యాయంలో చూస్తాము. రెండవ అధ్యాయం ఉపోద్ఘాత అధ్యాయం అని చూశాము.

**ii) స్థితప్రజ్ఞ లక్షణాలు** – కృష్ణపరమాత్మ చాలా లక్షణాలను చెప్పాడు కాని మనం ఉదాహరణకు రెండు లక్షణాలను చూద్దాము –

**ఎ). పూర్ణత్వం** – ఈ జ్ఞానం పొందటంవల్ల మనకు పూర్ణత్వభావన ఏర్పడుతుంది. అందువల్ల, మనను బంధించే కోరికలేమీ కలుగవు. కర్మ చేయటం మానము కాని కర్మ చేశాక విజయం పొందినా మంచిదే, పొందక పోయినా మంచిదే. జయాపజయాలకు పొంగిపోము, కృంగిపోము. ఇటువంటి కర్మలను బంధించని కర్మలు అంటారు. పూర్ణత్వభావనవల్ల, జీవితంలో ఏమీ లోటు ఉండదు.

**బి). సమత్వం** – రాగద్వేషాలకు, కామక్రోధాలకు అతీతంగా ఎదుగుతాము. భయం, కోపం అలలు మన మనస్సును కల్లోలపరచవు. దీనికి ఉదాహరణగా సముద్రం గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ. నదులు వచ్చి కలిసినా సముద్రం పొంగిపోదు, వేడికి నీరు ఆవిరయిపోయినా సముద్రం కృంగిపోదు.

స్థితప్రజ్ఞుడు పూర్ణత్వం, సమత్వం అనుభవిస్తాడు. అటువంటి స్థితప్రజ్ఞుడు యథేచ్ఛగా సంచరిస్తాడు, అతన్ని ఏదీ బంధించదు. జీవించి ఉండగా జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి పొంది, జనన మరణాల చక్రాల నుంచి విముక్తి పొందుతాడు.

ఆ విధంగా రెండవ అధ్యాయంలో నాలుగు అంశాలు చెప్పాడు కృష్ణపరమాత్మ. అవి – అర్జునుని శరణాగతి, జ్ఞానయోగం, కర్మయోగం, స్థితప్రజ్ఞుని లక్షణాలు.

## – గమనించవలసిన ముఖ్య విషయం –

భగవద్గీత మోక్షశాస్త్రం, ఉపనిషత్తుల సారం. ఇది పరమ గోప్యమైనది. దీనిలోని అర్థం గురుముఖతః గ్రహించాలి. చాలా సందర్భాలలో నిఘంటువులోని అర్థాలు కాక లక్ష్యార్థాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు శ్లోకం 2– 20 చూడండి.

శ్లో. 20 **న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥**

**న జాయతే** – ఆత్మకు పుట్టుక లేదు. పుట్టుక శరీరానికి ఉంది కాని ఆత్మకు లేదు. (వాచ్యార్థం)

**న మ్రియతే** – ఆత్మకు మరణం లేదు. (వాచ్యార్థం)
ఇదే మళ్ళీ అజః, నిత్యః పదాలలో వస్తోంది.

**అజః** – ఆత్మకు పుట్టుక లేదు **(న జాయతే** వాచ్యార్థం); **నిత్యః** – ఆత్మకు మరణం లేదు. **(న వినశ్యతి** లక్ష్యార్థం)

**నిత్యః** అన్నా, **శాశ్వతః** అన్నా, **పురాణః** అన్నా ఇంచుమించుగా ఒకే అర్థం వస్తుంది. అలా ఒకే అర్థం తీసుకుంటే పునరుక్తి దోషం వస్తుంది. అటువంటి సందర్భాలలో శంకర భగవత్పాదులు లక్ష్యార్థాలతో భాష్యం చెబుతారు.

**శాశ్వతః – (న అపక్షీయతే)** క్షీణించదు; (లక్ష్యార్థం) **పురాణః – (న వర్ధతే)** ఎదగదు. వృద్ధి రహితః.(లక్ష్యార్థం).

**న హన్యతే – (న విపరిణమతే)** అంటే ఆత్మకు విపరిణామం కూడా లేదు. దానికి పరిణామాలు లేవు. అందువల్ల ఆత్మను నిర్వికారం అంటారు. (లక్ష్యార్థం)

శరీరానికి షడ్వికారాలు, అంటే ఆరు మార్పులు, ఉన్నాయి, **అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి.** ఆత్మకు ఈ షడ్వికారాలు ఉండవు అని పునరుక్తి దోషం లేకుండా భాష్యం చెప్పారు. ఆత్మ జన్మరహితం, మరణరహితం, వృద్ధిరహితం, అపక్షీయరహితం వినాశరహితం.

ఈవిధంగా కొన్ని శ్లోకాలలో, ప్రతిపదార్థంలో వాచ్యార్థం చెప్పినా, వివరణలో శంకరభాష్యంలోని లక్ష్యార్థాలు ఇవ్వబడ్డాయి.